# శ్రీవేంకటేశ్వర వైభవం - జాతీయసదస్సు

## పరిశోధన పత్ర సంకలనం



ప్రచురణ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

# శ్రీవేంకటేశ్వర వైభవము - జాతీయసదస్సు
# పరిశోధన పత్ర సంకలనం


సంపాదకులు

**బి.యస్. రెడ్డి (భూమన్)**

సంచాలకులు

"శ్వేత", శ్రీవేంకటేశ్వర కేంద్ర గ్రంథాలయం మరియు పరిశోధన సంస్థ

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



ప్రచురణ

**కార్యనిర్వహణాధికారి**

**తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి**

**2007**

SRI VENKATESWARA VAIBHAVAM - JATIYA SADASSU

Parishodhana patra Sankalanam

TTD "SVETA" Religious Publications Series No : 9

© All Rights Reserved

First Edition: 2007

Copies : 2000

Price :

SRI VENKATE...
CENTRAL LIBRA...
RESEARCH CENTRE
Acc No 21983
Date
TIRUPATI

Published by

**K.V. RAMANACHARI,** I.A.S.,

Executive Officer,

Tirumala Tirupati Devasthanams,

TIRUPATI - 517 507

Printed at

**Sri Parasarya Press**

Sri Vyasasramam

Ph: 08578-287528

# ముందుమాట

విశ్వానికి విభుడగు విశిష్టమయిన అర్చామూర్తి వేంకటేశ్వరుడు. ఆ స్వయంవ్యక్తస్వరూపుని వైభవం (మహిమతో కూడిన గొప్పతనం) తరతరాలుగా భారతీయుల విశ్వాసాలను ప్రకృష్టంగా ప్రభావితం చేస్తూవస్తున్నది. ఆ స్వామి యందలి భక్తి, ప్రపత్తులు అన్ని ప్రాంతాలలోని ఆబాలగోపాలాన్ని పునీతులను కావించడంలో అద్వితీయంగా చరితార్థమవుతున్నాయి.

ఉత్తరదేశీయులు 'బాలాజీ'– అని, దాక్షిణాత్యులు 'వేంకటేశ్వరుడని', 'శ్రీనివాసుడని', తిరువేంకటనాథుడని– ఇలాగ అతిశయమైన ఆప్యాయతతో సంబోధించే ఆ 'గోవిందుడు' నిజంగా అందరికీ ఆరాధ్యుడే!

వేదాలు మొదలుకొని వీధినాటకాలదాకా విస్తరిల్లిన వివిధ భారతీయ భాషాసారస్వతాలలో ప్రతిబింబించి యున్న ఆ శేషగిరీశుని అపూర్వ వైభవ విశేషాలను లోకానికి వెల్లడించాలనే పూనికతో తిరుమల తిరుపతి దేవస్థానముల "శ్వేత" సంస్థ 2005, మార్చి 30, 31 తేదీలలో సుప్రసిద్ధ విద్వాంసుల సహకారంతో ఒక జాతీయ సదస్సును అత్యంత వైభవోపేతంగా నిర్వహించడం జరిగింది.

ఆ సదస్సులో తెలుగులోనూ, ఆంగ్లంలోనూ సమర్పించబడిన ప్రసంగవ్యాసాల సమాహారమే ఈ "వేంకటేశ్వర వైభవ"మనే గ్రంథం. రాశిలోనూ, వాసిలోనూ ఎన్నదగిన ఈ వ్యాససంపుటి శ్రీనివాసుని సమగ్ర వైభవానికి సంబంధించిన వేరు వేరు అంశాలను విభిన్నకోణాల్లో విపులంగా, అక్షరంగా ఆవిష్కరిస్తూవున్నది.

తిరుమల తిరుపతి దేవస్థానముల "శ్వేత" సంస్థ ధార్మిక ప్రచురణగా వెలువరిస్తున్న ఈ విశిష్ట వ్యాస సంకలనం శ్రీవేంకటేశ్వర స్వామివారి వైభవమూర్తిని దర్శింపజేసే కరదీపిక కాగలదని ఆశిస్తున్నాను; ఆకాంక్షిస్తున్నాను

తిరుపతి
7-8-2007

**భూమన కరుణాకరరెడ్డి**
తిరుమల తిరుపతి దేవస్థాన పాలకమండలి అధ్యక్షులు
తిరుమల తిరుపతి దేవస్థానములు

# నామాట

అలమేల్మంగాపతికి ఉనికిపట్టయిన తిరుమలకు గల నామధేయాలు అనేకం. వాటిల్లో 'వేంకటం'- అనేది విశిష్టమయింది; విచిత్రమయింది.

వేంకటాచల మాహాత్మ్యం (వరాహపురాణం) ప్రకారం 'వేంకట' శబ్దంలోని 'వేం'- అమృతబీజాక్షరం, 'కట'- అనే అక్షరాలు రెండూ ఐశ్వర్యాన్ని సూచించేవి.

ఆ విధంగా ఐశ్వర్యాన్ని, అమృతాన్ని (ఇహ, పరాలను) రెండిటినీ ప్రసాదించే మహిమ, అనాదిగా ఆ పర్వతంమీద శ్రీనివాసుడు స్వయంగా నెలకొనడంవల్లనే ఆవిర్భవించి అతిశయించింది అలా ఆశ్రితులకు అవ్యాజకృపతో ఇహ, పరాలను (ఉభయ విభూతులను) అనుగ్రహించే స్వామి కాబట్టే ఆయన 'వేంకటేశ్వరు' డయ్యాడు. ఆ దేవదేవుని వైభవం యుగయుగాలనుండీ "నిత్యకల్యాణం పచ్చ తోరణం"గా దినదిన ప్రవర్ధమాన మవుతూ వుంది

తరతరాలుగా పెంపొందుతూవున్న సంస్కృతం, తెలుగు, తమిళం, కన్నడం- మొదలైన భాషా వాఙ్మయాలలోనూ, చారిత్రకంగానూ, విస్తారంగా ప్రతిఫలించియున్న శ్రీవేంకటేశ్వరుని వైభవ, ప్రాభవాలను గూర్చి సమీకరించే పూనికతో తి.తి.దే. "శ్వేత" సంస్థ ప్రప్రథమంగా 2005 మార్చి నెలలో ప్రముఖ విద్యావేత్తలతో ఒక జాతీయ సదస్సును అత్యంత వైభవంగా నిర్వహించింది

ఆ రెండు రోజుల సదస్సులో ప్రముఖులు తెలుగులోనూ, ఆంగ్లంలోనూ సమర్పించిన ప్రసంగ పత్రాల సముచిత సంకలనం ఈ "వేంకటేశ్వర వైభవం" వేంకటేశ్వర తత్త్వాన్నీ, మహత్త్వాన్నీ తెలిసికోదలచిన జిజ్ఞాసువులే గాక, ఆసక్తిగల పాఠకావళి యావన్మందీ ఈ వ్యాసావళిని అభినివేశంతో పఠించి చక్కని స్ఫూర్తిని పొందగలరని మా ఆకాంక్ష.

తిరుపతి
8-8-2007

**కె.వి. రమణాచారి, ఐ.ఎ.యస్.,**
కార్యనిర్వహణాధికారి
తిరుమల తిరుపతి దేవస్థానములు

# తొలిమాట

శ్రీవేంకటేశ్వర కేంద్ర గ్రంధాలయం మరియు పరిశోధనసంస్థ ఆధ్వర్యంలో 2005 మార్చి 30, 31, తేదీలలో శ్వేత సభాభవనంలో "శ్రీవేంకటేశ్వర వైభవం" మీద రెండురోజుల సదస్సు అత్యంత ఘనంగా జరిగింది. వివిధ అంశాల మీద పత్రాలను సమర్పించినారు మంచి చర్చకూడా జరిగింది. తెలియని ఎన్నో విషయాలు వెలుగులోకి వచ్చినాయి. కొత్తకోణాల్లో సాగిన ప్రసంగాలు శ్రోతలను బాగా అలరించినాయి మనకు తెలిసిన "శ్రీవేంకటేశ్వర వైభవం" గురించి ఆ రెండురోజులు మరిన్ని వెలుగులు ప్రసరించినాయి.

ఆ సదస్సు నిర్వహణలో నాటి తిరుమల తిరుపతి దేవస్థానముల పాలక మండలి అధ్యక్షులు శ్రీ టి సుబ్బరామిరెడ్డిగారు, పాలకమండలి సభ్యులు శ్రీభూమన కరుణాకరరెడ్డిగారు, నాటి కార్యనిర్వహణాధికారి శ్రీ ఏ పి వి యన్ శర్మ, ఐ.ఏ.యస్. గారు ఎంతగానో సహకరించినారు వారికి ధన్యవాదాలు

ఈ పత్రాలను పుస్తకరూపంలో తీసుకురావటానికి ప్రస్తుత పాలకమండలి అధ్యక్షులు శ్రీభూమన కరుణాకరరెడ్డిగారు, కార్యనిర్వహణాధికారి శ్రీకె.వి రమణాచారి గారు ఎంతో చొరవను, ప్రోత్సాహాన్ని సమకూర్చినారు, వారికి కృతజ్ఞతలు.

తిరుపతి

11-8-2007

**బి.యస్. రెడ్డి**

సంచాలకులు

# కృతజ్ఞతా విన్నపం

ఆయన కలియుగ వైకుంఠనాథుడు. అర్చావతారముగా వెలసిన పరబ్రహ్మస్వరూపము. స్వయంవ్యక్త సాలగ్రామ శిలారూపుడు. సమస్త ప్రపంచాన్ని శాసించే విరాట్ స్వరూపం. అలమేలుమంగ పోకనవ్వుల ఆదిదైవం. అలాంటి దివ్యస్వరూపుని వైభవం అంతా ఇంతా అని చెప్పగలమా?

అయినా ప్రయత్నించాం. ఆ వైభవాన్ని అక్షరబద్ధం చేయాలని ఆంధ్రప్రదేశ్‌లోని అన్నిమూలలు గాలించి ఆ యా విషయాలలో నిష్ణాతులైన వారిని, చిరునామాలు లభ్యమైనంత వరకు, ఆహ్వానించి 2005 సం॥ మార్చి నెల 30, 31 తారీఖుల్లో 'శ్వేత'లో జాతీయ సదస్సు నిర్వహించాం. ఇతర రాష్ట్రాలనుంచి కూడా వీలయినంత మందిని రప్పించడం జరిగింది.

డెబ్బైమందికి పైగా కవిపండిత చారిత్రక నిపుణులు ఆ సదస్సుకు హాజరయి తమ తమ పరిశోధన పత్రాలు సమర్పించారు. వారందరికీ పేరు పేరునా కృతజ్ఞతలు. ఆ జాతీయ సదస్సులో ఎన్నో వైభవాలు, వెలికి వచ్చాయి. శ్రీవేంకటేశ్వరుని పురాణవైభవం, ఆళ్వారుల నాలాయిర దివ్యప్రబంధములోని శ్రీవేంకటేశ్వర వైభవం, వైష్ణవాచార్యులు, కన్నడ దాసులు కీర్తించిన గాన వైభవం, తాళ్లపాక అన్నమాచార్యులు, తరిగొండ వెంగమాంబ కృతులలోని శ్రీనివాస వైభోగం, సంస్కృత, తెలుగు కవులు, ముఖ్యంగా కృష్ణదేవరాయలు తమ ప్రబంధాలలో వెలిగించిన దివ్య వైభవజ్యోతులు యిలా ఎన్నో వెలుగుజూశాయి ఇక శిల్పకళ, చారిత్రక విశేషవైభవాల గురించి ప్రత్యేకంగా చెప్పబనిలేదు.

ఒక్కమాటలో చెప్పాలంటే ఆ వేదాంతవేద్యుని, భక్తభోగ్యుని నిజవైభవమంతా కన్నులకు కట్టినట్టు కనిపించింది. ఆ యా విషయాలు యిక్కడ సమీకరించి, తెలుగులోనూ, ఆంగ్లంలోనూ ప్రచురించడం జరిగింది. ఇది చదివిన వారు ఎన్నో క్రొత్త క్రొత్త విషయాలు గ్రహించి ఆత్మతృప్తి పొందగలరు.

నిజానికి 'శ్వేతలో' "శ్రీవేంకటేశ్వర వైభవం" సదస్సు జరిగిన తరువాతనే "శ్వేత వైభవం" కూడ పెరిగి నలుదిశలా దాని పేరుప్రఖ్యాతులు వ్యాపించి ప్రసిద్ధి గాంచింది. అంతకు మునుపు దానిని గురించి పెద్దగా తెలియదు. శ్రీభూమన్ గారి దక్షత కూడ అప్పుడే అందరికీ తెలిసింది. ఈ అవకాశాన్ని అయాచితంగా కలిగించిన అప్పటి కార్యనిర్వహణాధికారి శ్రీ ఎ.పి వి.యన్.శర్మ, ఐ.ఏ.యస్., గారికి, ఈ పుస్తకప్రచురణకు ప్రోత్సహించిన ప్రస్తుత తిరుమల తిరుపతి దేవస్థానముల బోర్డు అధ్యక్షులు శ్రీభూమన కరుణాకరరెడ్డి గారికి, కార్యనిర్వహణాధికారి శ్రీ కె.వి. రమణాచారి, ఐ.ఎ యస్., గారికి, సంయుక్త కార్యనిర్వహణాధికారులు

శ్రీజి.బలరామయ్య, శ్రీ కె. శ్రీకాంత్ గార్లకు, పి.ఆర్.ఓ. శ్రీరాంపుల్లారెడ్డి గారికి, తి.తి.దే. కేంద్ర గ్రంథాలయాధికారిణి శ్రీమతి యన్. లీలావతి గారికి, ఈ పత్రాలన్నిటిని తి.తి.దే. సప్తగిరి ఎడిటోరియల్ స్టాఫ్ ఎడిట్ చేసి యిచ్చినందుకు వారికి మా కృతజ్ఞతలు ఇంకా యీ ప్రచురణను చేపట్టి సకాలంలో ముద్రించియిచ్చిన ఏర్పేడు శ్రీవ్యాసాశ్రమము పారాశర్య ముద్రణాలయం వారికి, 'శ్వేత' కోఆర్డినేటర్లు శ్రీయన్ యస్ బాలాజీరావు గారికి, శ్రీ పి. రమణారెడ్డి గారికి, ఆఫీసు సూపరింటెండెంట్ శ్రీదామోదరం, యు.డి సిలు, శ్రీసురేష్‌కుమార్, శ్రీ దీనదయాళ్ యింకా తక్కిన సిబ్బందికి మా కృతజ్ఞతలు. తరిగొండ వెంగమాంబ వాఙ్మయ ప్రాజెక్టు పరిష్కర్త శ్రీ కె జె కృష్ణమూర్తి గారు మాకు చేదోడు వాదోడుగా నిలిచారు. వారికి కూడ మా కృతజ్ఞతలు.

ఈ పుస్తక ప్రచురణ విషయంలో అన్ని విధాలా నా సేవలు గ్రహించి ఈ అమూల్య అవకాశాన్ని నాకు కలిగించినందులకు శ్రీభూమన్ గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు

తిరుపతి
7-8-2007

**గోపీకృష్ణ**
సంపుట ప్రచురణ సహాయకుడు

**గమనిక**

**ఈ వ్యాసాలలో రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. వాటికి తి.తి.దేవస్థానంవారు కాని, "శ్వేత" కాని బాధ్యత వహించజాలదు.**

# వైభవసూచిక


| | | | |
|---|---|---|---|
| 1 | ఆగమోక్త శ్రీవేంకటేశ్వర వైభవం | డా॥ కె రాజగోపాలన్ | 1 |
| 2 | యజ్ఞభుక్కు శ్రీవేంకటేశ్వరుడే | డా॥ మైలవరపు శ్రీనివాసరావు | 7 |
| 3 | శ్రీవేంకటేశ్వరస్వామి వారిపై కులశేఖరఆళ్వార్ విలక్షణ భక్తితో పాడిన పాశురాలు | డా॥ ముదివేడు ప్రభాకరరావు | 11 |
| 4 | శ్రీవేంకటేశ్వరుడు - తిరుమంగైఆళ్వారు | డా॥ ఈ ఏ శింగరాచార్యులు | 16 |
| 5 | విష్ణుచిత్తుని పాశురములలో శ్రీనివాసస్తుతి | పి ఆర్ రంగరాజన్ | 20 |
| 6. | ఆళ్వార్ల పాశురములలో ఆనందనిలయుడు | డా॥ వి.జి. చొక్కలింగం | 24 |
| 7 | ఆళ్వారులు - వేంకటాచలపతి | జి సుహాసిని | 29 |
| 8 | శ్రీవేంకటేశ్వర ఆవిర్భావము | గోపీకృష్ణ | 32 |
| 9 | శ్రీవేదాంతదేశికులు దర్శించిన శ్రీవేంకటేశ్వర వైభవం | డా॥ ఇ. చంద్రమౌళి | 38 |
| 10 | శాసనాలలో వేంకటేశ్వరుడు | డా॥ కోరాడ రామకృష్ణ | 42 |
| 11 | వామన పురాణములోని శ్రీవేంకటాచలమాహాత్మ్యము | టి సావిత్రి | 51 |
| 12 | శ్రీవేంకటాచలమాహాత్మ్యగ్రంథము - పరిశీలన | డా॥ కె వి రాఘవాచార్య | 58 |
| 13 | వరాహపురాణము - శ్రీవేంకటాచలమాహాత్మ్యము | డి భారతి | 66 |
| 14 | శ్రీవేంకటాచలమాహాత్మ్యం-శ్రీవేంకటేశ్వర వైభవం | గల్లా చలపతి | 73 |
| 15 | స్కాందపురాణంలో శ్రీవేంకటేశ్వర వైభవం | డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి | 78 |
| 16 | స్కాందపురాణం-శ్రీవేంకటాచలమాహాత్మ్యం | డా॥ దావులూరి కృష్ణకుమారి | 87 |
| 17 | అన్నమయ్య దర్శించిన వేంకటేశ్వరుడు | కామిశెట్టి శ్రీనివాసులు | 97 |
| 18 | అపరాధక్షమాపణస్తోత్రం శ్రీశేషశైలవిహార శతకం | డా॥ పాలకోడేటి జగన్నాథరావు | 101 |
| 19 | తిరుమల తొలిగడప దేవుని కడప | డా॥ కట్టా నరసింహులు | 111 |
| 20 | అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలలో వేంకటేశ్వర భక్తితత్త్వం | డా॥ కె మోహన్‌మణి | 115 |
| 21 | తాళ్లపాకవారి సంకీర్తనలలో స్త్రీ స్వభావచిత్రణ | డా॥ యమ్ లలితకుమారి | 120 |
| 22 | శ్రీనివాస విలాససేవధి-శ్రీనివాసుని వైభవం | డి వి లక్ష్మి | 124 |
| 23 | తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనల్లో శ్రీవేంకటేశ్వర వైభవం | డా॥ కె వాణి | 130 |
| 24 | అన్నమాచార్య సంకీర్తనలు-ఆగమ సంప్రదాయ విశేషాలు | డా॥ వి రాజగోపాల చక్రవర్తి | 136 |
| 25 | అన్నమయ్య దృష్టిలో 'వెంకన్న తత్త్వం' | ప్రొఫెసర్ హెచ్ ఎస్ బ్రహ్మానంద | 144 |
| 26 | దయాశతకము-శ్రీవేంకటేశ్వరుడు | డా॥ సముద్రాల లక్ష్మణయ్య | 148 |
| 27. | ప్రసన్న వెంకటదాసుల సంకీర్తనలలో శ్రీనివాస వైభవం | ఆచార్య కె. సర్వోత్తమరావు | 151 |

| | | |
|---|---|---|
| 28 శ్రీవేంకటేశ్వర వైభవం-పురందరదాసులు | డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి | 154 |
| 29 ఆముక్తమాల్యద శ్రీవేంకటేశ్వరుని వైభవము-ఒక పరిశీలన | ఆచార్య భమిడిపాటి విశ్వనాథ్ | 161 |
| 30 తరిగొండ వేంకమాంబ కవిత్వంలో శ్రీవేంకటేశ్వర వైభవం | డా॥ మన్నవ భాస్కరనాయుడు | 166 |
| 31. శ్రీవేంకటేశ్వరుని దేవాలయంలోని ఉత్సవాలు - ప్రాముఖ్యత | డా॥ వై విజయలక్ష్మి | 172 |
| 32 శ్రీవేంకటేశ్వరుడు - తీర్థములు | డా॥ సి లలితారాణి | 176 |
| 33 తిరుమల శ్రీవారి ఉత్సవాలు | డా॥ చిట్రాజు గోవిందరాజు | 184 |
| 34 తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ప్రదర్శించే కళారూపాలు | డా॥ గెంజి అరుణ | 188 |
| 35 శ్రీవేంకటేశ్వర ఉత్సవ వైభవమ్ | డా॥ పూర్ణవల్లి | 191 |
| 36 రాయలసీమ జానపదగేయాలలో వెంకన్న | డా॥ వి ఆర్ రాసాని | 198 |
| 37 జానపదగేయాల్లో వెంకన్న భక్తవైభవం | డా॥ ఎర్ల బాలకృష్ణారెడ్డి | 208 |
| 38 జానపదసాహిత్యంలో శ్రీవేంకటేశ్వరుని ఆరాధన | అమళ్ళదిన్నె గోపీనాథ్ | 217 |
| 39 జానపద సాహిత్యంలో వెంకన్న వైభవం | డా॥ పేట శ్రీనివాసులురెడ్డి | 222 |
| 40 శ్రీవేంకటేశ్వర వైభవం-జానపదుల దృష్టి | తమటం రామచంద్రారెడ్డి | 234 |
| 41 శ్రీవేంకటేశ్వర నామవైభవం | ఎన్ నాగేంద్రసాయి | 237 |
| 42 దాసరి కథ-వైష్ణవతత్త్వం | డా॥ జి దామోదరనాయుడు | 241 |
| 43 శ్రీవేంకటేశ్వర వైభవము | దూబగుంట రామకృష్ణ | 247 |
| 44 శ్రీవేంకటేశ్వర సంస్కృత కవితావైభవము- శ్రీవేంకటేశ్వర కావ్య కలాపము | డా॥ గుళ్ళపల్లి శ్రీరామకృష్ణమూర్తి | 250 |
| 45 శ్రీవేంకటేశ్వర వైభవం | ఉదయగిరి శ్రీనివాసాచార్యులు | 258 |
| 46 ఏడుకొండలవానికి తెనుగుకవుల సాహిత్య కైంకర్యము | ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ | 267 |
| 47 స్వామివారి న్యాయ ధర్మసమాచరణం | కనమలూరి వెంకట శివయ్య, ఐ ఎ యస్, (రిటైర్డు) | 272 |
| 48 శ్రీవేంకటాచల ఇతిహాసమాల-తిరుమలై ఒళుగు గ్రంధాలలోని శ్రీవేంకటేశ్వర వైభవము | డా॥ యస్ వేంకటరంగరామానుజాచార్యులు | 277 |
| 49 ఆలయ దర్శనం | ఈతమాకుల గురవయ్య | 289 |
| 50. శ్రీవేంకటాచల క్షేత్ర విశేషములు | పాకాల రామారావు | 294 |
| 51 శ్రీనివాసుని వైశిష్ట్యం | భూమన గిరిజాపతిరెడ్డి | 298 |
| 52. శ్రీకృష్ణదేవరాయలు-గొప్ప దేవునికి గొప్ప భక్తుడు | డా॥ సుబ్రమణ్యంరెడ్డి | 302 |
| 53 శ్రీవేంకటేశ్వర లీలావైభవమ్ | బి రమాదేవి | 306 |

| | | |
|---|---|---|
| 54. మొక్కుబళ్ళ దేవుడు తిరుమల వెంకన్న | జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 312 |
| 55 కొండలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుడు | డా॥ ఆకెళ్ల విభీషణశర్మ | 317 |
| 56. అన్నమయ్య-ఆనందనిలయశోభ | డా॥ ఎన్ సత్యబాలాజీరావు | 324 |
| 57 భగవద్రామానుజులు - శ్రీవేంకటాచలము | డా॥ టి విజయరాఘవాచార్యులు | 335 |
| 58. తిరుమల గిరుల్లోని పవిత్ర తీర్థాలు-వాటి ప్రాముఖ్యత | ఎన్ భీమన్న | 340 |
| 59 శ్రీనివాస చక్రవర్తి-వైభోగం-వితరణలు | గుళ్ళపల్లి శివకుమార్ | 344 |


## English Section


| | | |
|---|---|---|
| 1 EFFICACY OF DHUPANAM | N Knshnaiah | 348 |
| 2 LORD VENKATESWARA OF TIRUMALA TIRUPATI THROUGH THE AGES | Prof P Kusumakumari | 351 |
| 3 JEWELLED SPLENDOURS OF SRINIVASA | V Sreesan | 357 |
| 4 LORD VENKATESWARA-THE UNIVERSAL GODHEAD | Prof C Vijaya Raghavacharyulu | 362 |
| 5 TWO INTERESTING FORMS OF VISHNU - A STUDY | Dr D Kiran Kranth Choudary | 368 |
| 6 A BRIEF NOTE ON THE PORTUGUESE'S ATTEMPT TO PLUNDER TIRUMALA TEMPLE AND MEASURES TAKEN TO ITS PROTECTION | Mallam Veerender | 370 |
| 7 THE ROLE OF TIRUPPANI PILLAI AND TIRUVENGADAM TEMPLE | Pemmasani Parandam | 374 |
| 8 TIRUMALA COINS FROM EPIGRAPHY AND EXCAVATIONS-A STUDY | Dr V Sakunthala | 379 |
| 9 LORD VENKATESWARA's VAIBHAVAM AS REVEALED IN ANNAMACHARYA's SANKIRTANAS | P M D Rajendra | 381 |
| 10 SRINIVASA IN THE TEMPLE ART OF TIRUMALA AND TIRUPATI TEMPLES - AN ICONOGRAPHICAL STUDY | Prof P Neerajakshulu Naidu | 384 |
| 11 TIRUMALA- AN IDEAL HEALTH RESORT | E Karunakaran | 388 |
| 12 SRIVENKATESWARA VIBHAVAM | U Venkataramana | 390 |

# ఆగమోక్త శ్రీవేంకటేశ్వర వైభవం

*డా॥ 3. రాజగోపాలన్*

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, కలియుగ ప్రత్యక్షదైవము అయిన శ్రీవేంకటేశ్వరుని వైభవం వాచామగోచరం. ఎంత సేవించినా ఎన్నిసార్లు కీర్తించినా తనివితీరని మరులుగొలిపే ముగ్ధమనోహరరూపం. వేదములు శిలలై వెలయగా, మునులందరు తరులై నిలువగా, పుణ్యరాశులు ఏరులై ప్రవహింపగా, ధగద్ధగాయమానంగ జగజ్జేగీయమానంగ తిరుమల కొండలపై వెలసిన అర్చామూర్తి శ్రీవేంకటేశ్వరుడు. ఒక్కసారి 'వేంకటేశ' నామస్మరణవలన మనకున్న పాపాలన్నీ తొలగిపోవుననడానికి క్రింద ఉదహరింపబడిన శ్లోకమే ప్రమాణము.

**సర్వపాపాని 'వేం' ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే ।** భవిష్యోత్తర పురాణం 1.220-221

**వేంకారో అమృత బీజంతు కటమైశ్వర్యముచ్యతే**
**అమృతైశ్వర్య సంఘత్వాత్ వేంకటాద్రిరితి స్మృతః ॥** పా.పు. 1.31-32

అటువంటి శ్రీవేంకటేశ్వరుని వైభవం శ్రుతి, స్మృతి, ఇతిహాస, పురాణాదులలో చక్కగా అభివర్ణింపబడి ఉన్నది. "సంసారసాగర సముత్తరణైకసేతో" అన్న రీతిగా రీవిగా, మనోజ్ఞంగా మైమరపించే మాధవుని రూపం "అదె చూడరె మోహన రూపం పది కోట్లు గల భావజరూపం" అన్న పదకవితా పితామహుని కీర్తనను గుర్తుచేస్తుంది. "ఎంతమాత్రమున ఎవ్వరు తలచగా అంతమాత్రమే అన్నట్లు" చూపరులను సమ్మోహనపరిచే ఆనందనిలయుని నెలవులో అనంత దేవతలు కొలువైయున్నారు.

సప్తాద్రినాధుని వైభవాన్ని కీర్తిస్తూ ఆయన నెలవులో వైఖానసాగమోక్తంగా కొలువైయున్న అనంత దేవతల ప్రస్తుతిని చూద్దాం.

**కృతే వరదరాజస్తు త్రేతాయాం రంగనాయకః ।**
**ద్వాపరే జగన్నాథస్తు కలౌ వేంకటనాయకః ॥**

అన్న శ్లోకము కలియుగములో శ్రీవేంకటేశ్వరుడే ప్రధానదైవమనగా మరియొక శ్లోకము తిరుమల గిరులు కలియుగంలో శ్రీవేంకటాచలంగా ప్రసిద్ధిని పొందుతుందని విశదపరిచింది.

**కృతే వృషాద్రిం వక్ష్యంతి త్రేతాయాం అంజనాచలమ్ ।**
**ద్వాపరే శేషశైలేతి కలౌ శ్రీవేంకటాచలమ్ ॥** భ.పు.1.36-37

అటువంటి శ్రీవేంకటాచలంలో వెలసిన స్వామి భావింప సకల సంపదలకు రూపము, పావనములకెల్ల పావనమయమైన పరమాత్మ స్వరూపము. పద్మావతీ ప్రాణనాథుడైన శ్రీనివాసుడు ఆనందనిలయ విమానంలో స్వయంవ్యక్తమూర్తిగా బంగారు పద్మపీఠంపై శంఖచక్రాలతో చతుర్భుజాలతో

**ప్రాయః స్వ చరణౌ పుంసాం శరణ్యత్వేన పాణినా ।**
**కృపయాదిశతే శ్రీమద్వేంకటేశాయ మంగళమ్ ॥**

అన్నట్లు కటిహస్తంతో, అభయహస్తంతో, చిరుమందహాసంతో, మందస్మిత వదనుడు ఎంతో వైభవంగా మరెంతో సోయగంగా మురిపిస్తూ, మైమరిపిస్తూ ఉన్న స్వామిని దర్శించగనే పరమపదనాథుని పాదపద్మాలకు తన పద కవితలతో పదేపదే నీరాజనాలందించిన పరమభక్త శిరోమణి అన్నమయ్య అంతరంగంలో మెదిలిన కీర్తన స్మరణకు వస్తుంది.

**కంటి అఖిలాండ కర్తనధిపునిగంటి**
**కంటినఘములు వీడుకొంటి నిజమూర్తిగంటి.**

సితకమలాక్షుడై ఇతడొకడే సర్వేశ్వరుడై విరాజిల్లుతున్న శ్రీవేంకటేశ్వరుని మూలమూర్తిలోని ఒక విశేషాన్ని వీక్షిద్దాం.

**వక్షఃస్థల లక్ష్మి**

**ఈశానాం జగతోఽస్య వేంకటపతిర్విష్ణోః పరాంప్రేయసీం**
**తద్వక్షస్థల నిత్యవాసరసికాం తత్క్షాంతి సంవర్ధినీమ్ ।**

అన్నట్లు శ్రీనివాసుని యొక్క నిత్యవక్షస్థలవాసిని ఆ మహాలక్ష్మి. లక్ష్మీదేవికి నివాసస్థానముగా కలిగినవారు కాబట్టి ఆ స్వామి శ్రీనివాసుడని సార్ధకనామధేయుడయ్యారు.

ఆ తల్లి రూపం వక్షస్థలంలో ఎలా ఉంటుందనడానికి క్రింది శ్లోకమే ప్రమాణము.

**ద్విభుజా వ్యూహలక్ష్మీస్స్యాత్ బద్ధపద్మాసనప్రియా ।**
**శ్రీనివాసాంగమధ్యస్థా సుతరాం కేశవప్రియా ॥**

ఈ లక్ష్మీదేవిరూపు కూడా స్వామివక్షస్థలం కుడివైపున మాత్రమే ఉంటుంది. ఎడమవైపున ఏవిధమైన ప్రతిమ ఉండదు స్వామి విగ్రహం లక్ష్మీదేవితో కూడి ఉంటుంది కాబట్టి అటువంటి స్వయంవ్యక్తమూర్తికి విశేషంగా శుక్రవారాభిషేకం జరిపిస్తే ఆ దేవాలయం రోజురోజుకు అభివృద్ధి చెందుతుందన్న క్రింది ఆగమ శాస్త్ర శ్లోకమే ప్రమాణం-

**సహ లక్ష్మ్యాఽభిషేకస్తు వాసరే భార్గవే హరేః ।**
**సాన్నిధ్యకారీ సతతం సర్వసంపత్ప్రదాయకః ॥**

శుక్రవారాభిషేకంలో అనేక రకాలైన స్నపనద్రవ్యాలను స్వామి ముందుంచి అర్చకస్వాములు వైఖానసాగమోక్త రీత్యా అనేకమంత్రాలను పఠిస్తూ షోడశోపచారములను జరిపిస్తారు. ఆ సందర్భంలో దర్భను ఒక్కొక్క ద్రవ్యంపై ఉంచి ఒక్కొక్క వేదాన్ని ఆ ద్రవ్యంలో ఆవహింపచేస్తారు.

పాలు-ఋగ్వేదానికి ప్రతీక; పెరుగు-యజుర్వేదానికి ప్రతీక; తేనె-అధర్వవేదానికి ప్రతీక; కొబ్బరినీళ్లు-సోమదేవతకు ప్రతీక; ఇలా వేదపురుషుని, అనేక దేవతలను స్నపన ద్రవ్యాలలో ఆవహింపచేసి అభిషేకాన్ని జరిపిస్తారు. ఇది ఆగమోక్తస్వామివారి అభిషేక వైభవం.

**భోగశ్రీనివాసమూర్తి**

తిరుమలలో భగవంతునికి షట్కాలపూజ జరుగుతుంది.

**ప్రత్యూషః ప్రాతః కాలశ్చ మధ్యాహ్నశ్చాపరాహ్ణకః ।**
**సాయంకాలోఽర్ధరాత్రశ్చ పూజాకాలస్తు షడ్విధః ॥**

ఇవికాక షడాసన పూజావిధానము కూడా జరుపబడుతుంది. ఈ షడాసనాలు ఏవంటే- మంత్రాసన, స్నానాసన, అలంకారాసన, భోజ్యాసన, యాత్రాసన, శయనాసన అనునవి.

ఇందులో కొన్ని సాక్షాత్తు మూలమూర్తికి జరిపించడం కష్టసాధ్యం కాబట్టి మూలమూర్తికి ప్రతిగా అలాగే ఉన్న మరొక బింబాన్ని తయారు చేసుకొని "బ్రహ్మస్థానే కౌతుకం ప్రతిష్ఠాప్య" అన్నట్లు మూల విగ్రహానికి ఆనుకొని యున్నట్లు స్థాన మేర్పరచి ఆ కౌతుక మూర్తికి శయనపూజ, నిత్యాభిషేకం ఇత్యాదులు జరిపించ వలయును. ఆ విధముగనే భోగశ్రీనివాసుని విగ్రహాన్ని క్రీ.శ. 966 సం॥లో ప్రతిష్ఠించడం జరిగినది. ఈ విగ్రహం వెండిలో దాదాపు 1 $^1/_2$ అడుగుల ఎత్తులో ఉన్నది. ప్రతి బుధవారం సహస్రకలశాభిషేకం కూడా భోగశ్రీనివాసునికే అన్న విషయం పేర్కొనతగినది.

**కొలువుమూర్తి**

ప్రపంచాధిపతి దర్బారుకి రీవికి నిలువెత్తు దర్పణంగా నిర్వహించబడే సేవ కొలువు. ఆ నాటి తిథి, వార, నక్షత్రాదులను నివేదించి అంతవరకు హుండీ రాబడినికూడా స్వామికి విన్నవించడం ఈ కొలువులోని ప్రధానాంగం. విశేషంగా నువ్వులుకలిపిన బెల్లపుపిండిని నైవేద్యంగా సమర్పింపబడే కొలువు సేవ ఏకాంతంగా జరుపుతారు.

**ఉగ్రశ్రీనివాసమూర్తి**

క్రీ.శ 1339 వరకు దేవాలయంలో ఎలాంటి ఉత్సవ ఊరేగింపైనా ఉగ్రశ్రీనివాసునికే జరిగేవి. క్రీ.శ. 1339లో ఒకసారి ఊరేగింపు జరుగుతుండగా భీతావహసంఘటనలు, విపరీతపరిణామాలు సంభవించాయి. తిరుమలలో ఒక పెద్ద అగ్నిప్రమాదమే జరిగింది. అప్పుడు స్వామివారిచ్చిన ఆదేశం ప్రకారం ఆ బ్రహ్మోత్సవాలను అక్కడితో ఆపివేసి అర్చకస్వాములు మలయప్పకోన అనే ప్రాంతానికి వెళ్ళి అన్వేషిస్తే అక్కడ మరొక విగ్రహము ఇప్పుడు మనందరం తిలకిస్తున్న ఉత్సవమూర్తి శ్రీదేవి భూదేవి సమేతంగా దొరికారు. ఆ విగ్రహాలను తీసుకొని వచ్చి ఆగిపోయిన ఉత్సవాలను మరల జరిపించారు.

ఈనాడు ఉగ్రశ్రీనివాసునికి సంవత్సరంలో ఒకే ఒక్కసారి మాత్రమే ఊరేగింపు. అది కూడా కైశిక ద్వాదశినాడు. సూర్యోదయానికి ముందే ఊరేగింపు పరిసమాప్తమగునట్లు అన్ని చర్యలు తీసుకుంటారు.

**మలయప్ప**

క్రీ.శ. 1339లో మలయప్పకోనలో అన్వేషించగా లభించిన విగ్రహమే మలయప్పస్వామి. ఈనాడు ఊరేగింపులలో, ఆస్థానాలలో వేడుకలలో పాల్గొంటూ పరమానందాన్ని పంచిపెడుతున్న పరమాత్మ శ్రీనివాసుని ఉత్సవమూర్తి. నవరత్నఖచిత స్వర్ణాభరణాలు, వివిధ కిరీటాలు ఏ విగ్రహానికీ లేని వజ్రకవచం, ముత్యాల కవచంతో మిరుమిట్లు గొలుపుతూ భక్తప్రియత్వాన్ని చాటుతున్నాడు.

ఇలా ఐదు విగ్రహాలు స్వామి సన్నిధిలో ఉండటానికి విమానార్చనకల్పమే ప్రమాణం.

**తస్మాదాకాశాది మహాభూతానాం పరమాత్మని భేద ఏవ । సభ్యాఽఽహవ**
**నీయాన్వాహార్య గార్హపత్యాఽఽవ సధ్యా ఇతి పంచాగివత్**
**ప్రాణాది పంచవాయుభేదైరివ పంచమూర్తి భేదైః భిద్యతే ॥**

-విమానార్చన కల్పః పటలం 95.

**సుదర్శన చక్రం**

దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు, ధర్మసంస్థాపనకు, అధర్మనాశనమునకు ప్రతీకగా నిలిచే చక్రం సుదర్శన చక్రం.

స్ఫురత్ సహస్రార శిఖాతి తీవ్రం సుదర్శనం భాస్కరకోటితుల్యం ॥ అన్న శ్లోక తాత్పర్యాన్ని తీసుకొని స్వామి గర్భాలయంలో ఉన్న చక్రాన్ని అన్నమయ్య కీర్తించిన విధం కడురమణీయం.

**"కోటి సూర్యులొక కూటువ గూడ క**
**చాటున మెరిసేటి చక్రము"**

భక్తరక్షణే ధ్యేయంగా ఉన్న చక్రానికి వరాహపుష్కరిణి వద్ద సంవత్సరంలో బ్రహ్మోత్సవం, రథసప్తమి, అనంతపద్మ నాభచతుర్దశి, వైకుంఠ ద్వాదశిలలో 4 పర్యాయాలు చక్రస్నానం జరుగుతుంది. కాని, ఒక్క బ్రహ్మోత్సవం రోజున మాత్రం స్వామితోపాటు సమమైన ఆసనాన్ని అలంకరించి మంగళ నీరాజనాలందుకుంటారు. మిగిలిన రోజులలో కేవలం చక్రానికి మాత్రమే స్నానం.

**సీతారామలక్ష్మణులు**

శ్రీవేంకటాద్రి విభుడుగా తిరుమల క్షేత్రంపై వెలసియున్న సీతారాముల గురించి ఒక ఆసక్తికర కథనం ప్రముఖంగా వినిపిస్తుంది.

పూర్వం 'విశ్వంభర' మహర్షి తనకు కలలో కనిపించిన విభీషణుని అభయప్రదాన ఘట్టాన్ని అలాగే

విగ్రహరూపంలో మలుచుకొని ఆరాధిస్తుండేవారు. ఆ మహర్షి తదనంతరం అనేక సంవత్సరాలకు ఆ విగ్రహాలు పూజాదికాలకు నోచుకోకుంటే వాటిని ఒక భక్తుడు తిరుమల కొండకు చేర్చాలని అలిపిరి వద్దకు తీసుకొని వస్తాడు. ఆ సమయంలో అక్కడ తిరుమల నంబి అనువారివద్ద రామానుజాచార్యులు శ్రీరామాయణాన్ని కాలక్షేపం చేస్తున్నారు. వారు ఈ విగ్రహాలను చూసి సీత విగ్రహం లేనందున కొత్తగా తయారుచేసి సీతారాములకు వివాహం జరిపించి తిరుమలలో ప్రతిష్ఠించారని అంటారు. ఈ విగ్రహాలు అనేక సంవత్సరాలు రాముల వారి మేడ అనే ప్రాంతంలో ఉండేవి. ఈ విగ్రహాలకు కూడా ఒక ప్రత్యేకత ఉంది.

**రుక్మిణీ కృష్ణులు**

శ్రీవారి గర్భాలయంలో రుక్మిణీ కృష్ణుల విగ్రహంకూడాఉంది. ధనుర్మాసంలో కృష్ణునికే ఏకాంతసేవ, సుప్రభాతసేవ జరగడం తిరుమల క్షేత్రంలో విశేషం.

**వకుళమాలికాదేవి**

ఆగమశాస్త్రప్రకారం ఈ తల్లిని పచనలక్ష్మి పాకలక్షి అని వ్యవహరిస్తారు.

**పాకలక్ష్మీస్సమాఖ్యాతా పచనాలయసంగతా ।**
**అష్టతాలేన మానేన కుర్యాత్తాం పచనాలయే ॥**
**పద్మద్వయాంచితకరాం వరదాభయధారిణీమ్**
**ఆసీనాం వాఽథ తిష్ఠంతీం కుర్యా ద్భూషణ భూషితామ్ ॥**

ఇలా వైఖానసాగమంలో పాకలక్ష్మి పేరొందిన ఆ తల్లిని మరికొందరు ద్వాపరయుగంలోని 'యశోద'గా కూడా అభివర్ణిస్తారు

**విష్వక్సేనులు**

స్వామివారి సర్వసైన్యాధిపతి విష్వక్సేనులు. దేవాలయంలో ఆయన స్థానము సోమసూత్ర స్థానమంటారు.

**ఉత్తర కుబేరుడు.**

**విష్వ శాంత స్సోమే శయోర్మధ్యే హ్యాసీనో దక్షిణాముఖః ।**
**శ్రీవత్సం బ్రహ్మసూత్రం చ వినా సర్వం హరేరివ ॥**

క్రియాధికార : 5-155

శ్రీవత్సం, బ్రహ్మసూత్రం అనునవి లేకుండా సాక్షాత్తు శంఖ చక్రాలతో శ్రీమహావిష్ణువువలె ఉండాలని క్రియాధి కారమనే గ్రంధం వివరిస్తూ ఉంది.

**అర్చన**

సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు ఉన్న కాలాన్ని ఐదుగా విభజించి

**ప్రత్యూషః ప్రాతః కాలశ్చ మధ్యాహ్నాశ్చాపరాహ్ణకః ।**
**సాయంకాలోఽర్ధరాత్రిశ్చ పూజాకాలస్తు షడ్విధః ॥**

శామ్యంతు ఘోరాణి, శామ్యంతు పాపాని, శామ్యన్తుర్మతయః అని విశ్వశ్రేయస్సుకోసం జరిపేటివంటిది అర్చన అని ఆగమనిర్దేశం.

**ప్రాతః కాలే అర్చనం కుర్యాత్ జపహోమాభివృద్ధయే ।**
**రాజా రాష్ట్రాభివృద్ధ్యర్థం మధ్యాహ్నేర్చన మిష్యతే ॥**
**సాయంకాలేఽర్చనం చైవ సర్వసస్యాభివృద్ధయే ॥**

అర్చన ఏయేకాలాలలో జరగాలి, ఏ కాలంలో అర్చన జరిగితే ఏమి ఫలమన్న విషయం కూడా పై శ్లోకాలలో స్పష్టంగా చెప్పబడింది.

**నివేదన**

నివేదన సమయంలో ఘంటానాదానికి కూడా ఆగమప్రమాణం క్రింది విధంగా ఉన్నది.

**ఆగమార్థం తు దేవానాం గమనార్థంతు రక్షసామ్ ।**
**తస్మాత్ సర్వ ప్రయత్నేన ఘంటాం సమ్యక్ నినాదయేత్ ॥**

దేవతలందరి ఆగమనం కొరకు, రాక్షసులను రాకుండా చేసేందుకు ఘంటను వాయించవలసినదిగా చెప్ప బడినది. ఇలా అనేకరకాల ప్రక్రియలలో, ఉత్సవాలలో పాలుపంచుకొంటే కలిగే ఫలముకూడా ఇలా నిర్దేశింప బడినది.

**సహో యజ్ఞ : సమాఖ్యాత : సర్వయజ్ఞ విశేషత :**
**ఉత్కృష్టోయం యతః తస్మాత్ ఉత్సవస్త్వితి కీర్త్యతే**

ఉపసంహారంలో అన్నమయ్య చెప్పినట్లు "ఆగమోక్తమీహరి కైంకర్యం" అన్నట్లు శ్రీవారి ప్రతి వైభవంలోను వైఖానసాగమం ప్రమాణమవుతుంది.

# యజ్ఞభుక్కు శ్రీవేంకటేశ్వరుడే

*డాక్టర్. మైలవరపు శ్రీనివాసరావు*

శ్రీవిష్ణుసహస్రనామాల్లో ఒక నామం 'యజ్ఞభుక్' అనేది. (యజ్ఞకృ ద్యజ్ఞభు గ్యజ్ఞీ .) అసలు ఓ విధంగా పరిశీలిస్తే శ్రీవేంకటాచలమాహాత్మ్యం మొత్తాన్ని శ్రీవిష్ణుసహస్రనామాలకి అన్వయించవచ్చు. దానిలో భాగంగా ఒక నామం, అంతరార్థం గురించి యధాకాలం అనుకుందాం!

'పురాణ' మనగానే ఓ కథంటూ అలా సాగిపోతూవెళ్తుంది. ఆ కథని కొద్దిగా విశ్లేషించుకుంటే కొన్ని అసందర్భాలూ అనౌచిత్యాలు కన్పిస్తాయి. 'మహర్షులు చెప్పిన-మహర్షులు విన్న కథలో ఇలాంటి అనౌచిత్యా లుంటాయా?' అని ఆ దిశగా ఆలోచిస్తే, ఆ చెప్పుకున్న కథలోని అంతరార్థం మనకి తెలిసి, చెప్పలేని ఆనందం కల్గుతుంది ఈ నేపథ్యంతో శ్రీవేంకటాచలమాహాత్మ్యంలోని' యజ్ఞప్రారంభం-నారదునిరాక- భృగుమహర్షి పెట్టిన పరీక్ష- శ్రీహరి మాత్రమే యాగఫల భోక్త' అనే అంశానికి సంబంధించిన పైకథ- అసందర్భత- లోకథ లని అనుకుని, మనం అనుకున్న 'యజ్ఞభుక్' అనే నామానికి ఈ కథని సమన్వయించుకుందాం!

**పై కథ**

శౌనకాది మహర్షులంతా సూతమహర్షిని 'శ్రీవేంకటేశ్వరవైభవం' గూర్చి చెప్పవలసిందిగా అడిగారు. ఆయన కథని ప్రారంభించారు. 'గంగ ఒడ్డున కశ్యపాది మహర్షులంతా యజ్ఞం చెయ్యడానికి ఉపక్రమించారు. అంతలో నారదుడు వచ్చి' ఈ యజ్ఞఫలం ఎవరికి చెందుతుంది? ఎవరు అర్హు?'లని వాళ్లనడిగాడు. వాళ్లకి సమాధానం దొరక్క సందేహనివృత్తికి భృగుమహర్షిని ప్రార్థించారు. 'దేవతలందర్నీ పరిశీలిస్తేనే గాని సమాధానం చెప్పలేల్లేని ప్రశ్న ఇది. అందుకని వెళ్లి పరీక్షించివచ్చిచెప్తా'నని అప్పటికి ఓ సమాధానాన్ని చెప్పి బయల్దేరాడు భృగువు.

బ్రహ్మలోకానికి ఆయన వెళ్లగానే- బ్రహ్మ సరస్వతితో కూడి అసలు ఈయన రాకనే పట్టించుకోలేదు దాన్నొక అవమానంగా భావించిన భృగుమహర్షి కైలాసానికి వెళ్లాడు అక్కడ కూడా బ్రహ్మలాగానే శంకరుడూ తన భార్య పార్వతితో విహరిస్తూ కన్పించాడు. ఈయనిని కనీసం కన్నెత్తిచూడనైనా చూడలేదు. దాంతో భృగుమహర్షి మరింత అసహనానికి గురి అయి వైకుంఠానికి వెళ్తే- ఈ పై యిద్దరిలాగానే శ్రీహరి కూడ లక్ష్మితో వినోదిస్తూ కన్పించాడు. వచ్చిన భృగువు జాడని కూడ గమనించలేని పరిస్థితిలో ఉన్నా డాయన దాంతో కోపించిన భృగువు శ్రీహరి వక్షఃస్థలాన్ని తన్నాడు అంతే! శ్రీహరి శేషశయ్యని దిగి భృగుమహర్షికి నమస్కరించి ఆయన పాదాల్ని కడిగి ఆ నీటిని తన తలపై చల్లుకున్నాడు.

భృగువు కశ్యపాది మహర్షులు యాగం చేస్తున్నచోటికి వచ్చి 'శ్రీహరికి మాత్రమే యజ్ఞభోక్తగా ఉండే అర్హత ఉం'దని చెప్పాడు.

ఈ సంఘటనతో లక్ష్మి శ్రీహరిని విడిచి కొల్హాపురానికి వెళ్లి పోయింది ఇదీ పైకథ.

**ఈ కథలోని అంతరార్థం**

ఓ విషయాన్ని తెలుసుకోవాలనే తపన (జిజ్ఞాస) ఉన్నవాళ్లు 'శౌనకుడూ మొదలైన మహర్షులు'. 'శునక స్యాపత్యం పుమాన్ శౌనకః' మామూలుగా చూస్తే 'కుక్క కొడు'కని అర్థం తేలుతుంది. కాని అది సరికాదు పూర్వజన్మసంస్కారవాసన ఈ జన్మలో కూడ ఉండి, పూర్వజన్మకి మించిన ఉత్తమ సంస్కారంతో ఈ జన్మని గడిపి- ఇక మీది జన్మంటూ లేకుండా చేసుకోవాలని శ్రమించే అందరూ శౌనకులే. అందుకే శౌనకాదు లెప్పుడూ అడిగేవాళ్లుగానే కన్పిస్తారు పురాణాల్లో. ఏదైనా ధర్మబుద్ధితో వినయంగా ప్రశ్నించి తెలుసుకునే అందరం శౌనకులమే.

ఇక 'సూతమహర్షి చెప్పడం ప్రారంభించా' రంటుంది పురాణం. 'సూతం:' అంటే 'పుట్టినవాడు' అని అర్థం. 'ఎవరు పుట్టలేదు గనుక?' అందరం పుట్టినవాళ్లమే కదా! అయితే మనందరం సూతులం కానేకాం. 'ఎలా పుట్టా'లని చెప్పారో అలా పుట్టినవాళ్లని మాత్రమే 'పుట్టినవా'ళ్లంది (సూతః) శాస్త్రం. ఇంతకీ ఎలా పుడితే సూతుడౌతాడుట?

**"జంతునాం నరజన్మ దుర్లభ-మతః పుంస్త్వం- తతో విప్రతా- తస్మా ద్వైదిక ధర్మమార్గపరతా- విద్వత్త్వమస్మాత్పరమ్"**

వేటకి దొరికిపోయి వధింపబడే పశుపక్ష్యాది జన్మకాక, బుద్ధితో ఆలోచించగల- అర్థంచేసుకుని ప్రవర్తించగల మనుష్యజన్మ ఉత్తమం. దాంట్లోకూడ నెలకి ముప్పైరోజులూ శుచిగా ఉండగల- తన జన్మ కారణంగానే తండ్రికి 'పుత్' అనే పేరున్న నరకాన్ని తప్పించగల పురుషునిగా జన్మించడం మరింత ఉత్తమం. దాంట్లోనూ పదిమందికి జ్ఞానబోధ చేయగల శక్తి ఉండే విప్రునిగా జన్మించడం ఇంకా ఉత్తమం వట్టి- జన్మకి మాత్రమే బ్రాహ్మణునిగా కాకుండా వేద ధర్మమార్గాన్ని అవలంబిస్తూ ఉండే వానిగా ఉండడం అత్యుత్తమం- వీటితోపాటు పాండిత్యం ఉండడమున్నదే అది అత్యుత్తమోత్తమం. పాండిత్యం కారణంగా తాను చదివినదీ విన్నదీ కన్నదీ అయిన విషయాన్ని పదిమందికి పంచిపెట్టే విధంగా ఎవరుంటారో, ఉండాలో ఆయన్ని 'సూతః' (పుట్టవలసిన తీరులో పుట్టినవాడు) అంది శాస్త్రం. అలా చెప్పగల వాళ్లందరూ సూతులే. అందుకే ఎప్పుడూ కథకుడు సూతమహర్షే ఔతుంటాడు.

ఈ సూతుడు ఆ శౌనకాదులకి చెప్పడం ప్రారంభించాడు. 'కశ్యపాదులంతా గంగ ఒడ్డున యజ్ఞాన్ని ప్రారంభించా' రనేది మొదటి మాట. 'కశ్యప' శబ్దానికి 'పశ్యకః' (దేనినైనా నిశితంగా పరిశీలించి చూడగల వాడు అంతర్బహిర్దృష్టి కలవాడు) అని అర్థం. అలాంటి పరిశీలనబుద్ధికల మహర్షితో కూడిన ఎందరో, జ్ఞానానికి ప్రతీక అయిన- ప్రవాహం తన లక్షణంగా కల గంగలా నిరాఘాటంగా యుగయుగాలకీ విస్తరించి పోయే జ్ఞానానికి సంకేతమైన గంగ ఒడ్డున యజ్ఞప్రారంభం చేసారు.

కర్మనైతే స(క్రమంగా చేస్తున్నారు, గాని కర్మకి మించినది సమాధీ- దానికి మించినది జ్ఞానమూ కాబట్టీ, ఆ విధమైన జ్ఞానం వల్లనే కైవల్యసిద్ధి కలుగుతుంది కాబట్టి (జ్ఞానా దేవ హి కైవల్యమ్)' ఈ యాగఫలం ఎవరికి చెందుతుందో ఆ విషయాన్ని మీకు మీరుగా జ్ఞానం ద్వారా గ్రహించవలసిం'దని చెప్పాడు నారదుడు. (జ్ఞా అవబోధనే)

'కశ్యపః' అనే దానికి 'పశ్యకః' అన్నట్లే,' 'భృగుః' అనేది కూడ 'గు-భృః' అవుతుంది. 'గు-అజ్ఞానాంధకారాన్ని, భృః- భరించిన'వాడని అర్థం వస్తుంది ఈ పదానికి. దీనిప్రకారం ఈయన పరమ అజ్ఞాని అయిపోతాడు. అందుకే ఈయనకి 'అరికాలిలో కన్నుం'దనే ఓ చరిత్రని చెప్పారు. కన్నుని జ్ఞానానికి సంకేతంగా చెప్తారు. 'కళ్లులేవా?' అంటే 'జ్ఞానంలేదా?'అని గదా అర్థం! అలాంటి జ్ఞానాన్ని ధిక్కరించిన (కాలిలో ధరించడం అంటే ఇదే) శక్తి ఉన్న మహాజ్ఞాని భృగువన్నమాట. ఈయన్ని దేవతలు ప్రార్థించారు 'మహాజ్ఞానివి గనుక పరిశీలించి రా!' అని.

బ్రహ్మ సరస్వతితో వినోదిస్తూ కన్పించాడంటే అర్థం లౌకికంగా తీసుకోకూడదు బ్రహ్మ నిరంతరం తన నాల్గుముఖాలతో-బ్రాహ్మిని- అంటే వేదాన్ని వల్లెవేస్తూంటాడు. దాన్నే 'సరస్వతీ తాండవ' మంటారు. ఆ వేదనాదం జరుగుతున్న వేళ భృగువు వెళ్లాడు. అసలు ఎప్పుడు వెళ్లినా అదే జరుగుతూ ఉంటుంది. వేదపారం జరుగుతూన్న వేళ ఆపడం, ఆపమని అనడం మహాదోషప్రదం. అందుకే బ్రహ్మ ఆపనూలేదు- ఈయన ఆపమననూ లేదు.

అక్కణ్ణించి వచ్చి కైలాసపరిస్థితిని చూస్తే అక్కడా అంతే తల ఆలోచనకి సంకేతం. కాలు ఆచరణకి సంకేతం. ఆలోచననుంచి ఆచరణవరకూ అర్ధనారీశ్వరరూపంలో ఒక్కరుగా ఉంటారు ఆ శివపార్వతులు అంటే ఆలోచననీ ఆచరణనీ భిన్నభిన్నంగా చేయరు- ఒకే తీరుగా చేసే లక్షణమున్నవాళ్లు ఆ దంపతి ఆ శంకరుడు తీవ్రాలోచనలో ఉండగా పార్వతి కూడ ఆచరణమెలాగా! అని ఆ దృష్టిలోనే ఉంది ఆమె కూడ. మనం కూడ ఆలోచన ఆచరణని గూర్చి ఆలోచిస్తున్న దశలో ఎవరొచ్చినా పట్టించుకోం- ఒక్కోసారి ఎవరో వచ్చిన గమనిక కూడ మనకి ఉండదు. అదే స్థితి ఆ పార్వతీపరమేశ్వరులది. దాంతో అక్కణ్ణించి కూడ కదలి వెళ్లిపోయాడు భృగుమహర్షి.

'సృష్టి' విభాగానికి అధిపతి అయిన బ్రహ్మగాని, 'లయ' విభాగానికి అధికారి అయిన శంకరుడుగాని తనని పట్టించుకోకపోతే తప్పులేదుగాని 'స్థితి' విభాగానికి యజమాని అయిన 'శ్రీహరి తనకి సమాధాన మీయ వలసిందే' అనుకుంటూ వైకుంఠానికి వెడితే, అక్కడ ఆయన కూడ త్రిమూర్తుల్లో మిగిలిన ఇద్దరిలానే ఉండడంతో, ఆ యిద్దరి మీద వచ్చిన కోపరోషాలన్నీ ఇక్కడ చూపిస్తూ విష్ణు వక్షః స్థలమ్మీద లక్ష్మి ఉండేచోటుని తన్నాడు భృగువు.

విష్ణువు ఆయన పాదాల్ని పట్టడానిక్కారణం ఒకటే. జగన్నాటకాన్ని ఆడించే శ్రీహరి-యజ్ఞం చేయాలనే

ఆలోచనని మహర్షులకి కల్గించాడు- నారదుణ్ణి తానే పంపాడు- ప్రశ్న వేయించాడు- భృగువుని పంపేలా చేసాడు- ఆ భృగువు ఏ బ్రహ్మనో శంకరుణ్నో తన్న కుండా జగన్నాటకంలో ఉన్న విధానం ప్రకారం తననే సక్రమంగా తన్నాడు. అదే తనకి కావలసిందికూడ. భృగువుని ఓ తీరుగా- చక్కగా నటించా-వని ప్రశంసించడమనుకోవచ్చు.

విష్ణు వక్షః స్థలమ్మీద లక్ష్మి ఉంటుంది. ఆమె శ్రీహరి అయిన తనని విడిచి కొంతకాలం పాటు వెళ్తే తప్ప 'శ్రీవేంకటాచల కథ' జరగదు. ఆమె 'నిత్యానపాయిని' (ఎప్పుడూ విడువనిది). ఆమె తనని విడిచివెళ్లాలంటే ఆమె ఉండే చోటుని అవమానించాలి. అదే భృగువు ద్వారా చేయించాడు శ్రీహరి. ఎవరో తన్నిన తన ప్రదేశంలో ఐశ్వర్యాధిష్ఠాత్రి లక్ష్మి ఉండగలదా? ఈ వంకతో ఆమె శ్రీహరిని విడిచి వెళ్తున్నట్లుగా- కొల్హాపురానికి వెళ్లి పోయింది.

శ్రీహరి హృదయమ్మీద లక్ష్మి ఉంటుందంటే, గుండెలమీద కూచుంటుందనేది అర్థం కాదు. హృదయ మనేది ఆలోచనలకి నివాసస్థలం- రహస్యాల నిలయమున్నూ. శ్రీహరి ఆ భృగువు పాదాన్ని ఎందుకు పట్టుకుని జలంతో కడిగి తలమీద ఆ నీటిని చల్లుకున్నాడో, ఆ విషయాన్ని ఆమె, హృదయస్థానీయురాలైన కారణంగా గ్రహించగలిగింది. 'తన భర్త అయిన శ్రీహరి నించి దూరంగా వెళ్లాల్సి ఉం'దనే జగన్నాటక కథావృత్తాంతాన్ని గమనించి 'వెళ్లిపోయింది', ఇది భర్తకి సహకారాన్నందించడంలో భాగస్వామ్యాన్ని వహించడమే తప్ప, విరోధించి 'లోకంలో వెళ్లిపోయే తీరులో పారిపోవడం కానే కా' దని గ్రహించాలి. ఇంత అర్థం ఉంది కాబట్టే శిలలమీద చెక్కించి శాశ్వతీకరించారు పెద్దలు.

ఎక్కడైనా సరే నారదుని రాక కన్పిస్తుంది ప్రారంభంలో. వాల్మీకి వద్దకి నారదుడొచ్చి శ్రీమద్రామా యణాన్ని లోకానికి వాల్మీకి ద్వారా అందించాడాయన. అలాగే 'భారతాన్ని లోకానికి ఎలా అందించాలా?' అని తపనపడుతున్న వ్యాసునికి బ్రహ్మని గూర్చి తపస్సుచేసి 'లేఖకుణ్ణి సంపాదించుకొనవలసిం'దని చెప్పా డాయన. శ్రీమద్రామాయణంలో సీతమ్మ రావణవధకోసం, 'ఎలా కా'వాలని తనంత తానుగా గభీరాలోచనతో దూరదృష్టితో శ్రీహరిని విడిచివెళ్లిపోయిందో ఇక్కడా లక్ష్మి అలానే వెళ్లిందని అర్థం చేసుకోవాలి.

కాబట్టి యజ్ఞాన్ని ప్రారంభింపచేసినవాడూ, యజ్ఞానికి సాధకుడూ, యజ్ఞఫలభోక్తా, యజ్ఞమే తానైన వాడూ, అన్నీ శ్రీవేంకటేశ్వరుడే ఔతున్నాడు. ఈ తీరులో శ్రీవిష్ణుసహస్రనామాలని పరిశీలిస్తే శ్రీవేంకటాచలమాహాత్మ్యం మొత్తం శ్రీవిష్ణుసహస్రనామాలకి 'ఉదాహరణకావ్యం'గా అయిపోతుంది.

11

# శ్రీవేంకటేశ్వరస్వామి వారిపై
# కులశేఖర ఆళ్వార్ విలక్షణ భక్తితో పాడిన పాశురాలు

డా॥ ముదివేడు ప్రభాకరరావు

ప్రపంచంలో ఏ మతానికైనా సంప్రదాయం, సిద్ధాంతం అని రెండు విభాగాలుంటాయి 'సంప్రదాయం' పుట్టిన తర్వాతనే 'సిద్ధాంతం' పుడుతుంది. విష్ణుసంబంధమైన వైష్ణవమతంలో 'శ్రీవైష్ణవం' సంప్రదాయం 'విశిష్టాద్వైతం' సిద్ధాంతం. సంప్రదాయం ఎప్పుడూ భక్తులపరంపరచే ఏర్పడే భక్తిమార్గం. సిద్ధాంతం, శాస్త్రాన్ని, సంప్రదాయాన్ని సమన్వయించి, వైరుధ్యాలను తొలగించి, ప్రామాణికత్వాన్ని సమకూర్చేది.

శ్రీవైష్ణవంలో పన్నెండుమంది ఆళ్వారులు సమకూర్చి పెట్టినది సంప్రదాయం. ఆరుగురు ఆచార్య పురుషులలో మూడవవారైన శ్రీమద్రామానుజాచార్యులవారు స్థాపించినది సిద్ధాంతం. దీనికి విశిష్టాద్వైతమనే పేరును రామానుజుల శ్రీభాష్యంపై వ్యాఖ్య వ్రాసిన సుదర్శనసూరి, 'శ్రుతప్రకాశిక' లో చెప్పారు.

దీన్ని బట్టి మనకు తెలిసేదేమంటే, ఏమతమైనా తొలినాళ్లలో అందరికీ అందుబాటులో ఉండి, ఆ భావాలు అర్థమవుతూ ఉంటాయి. శాస్త్రజ్ఞానం పెరిగే కొద్దీ అది జటిలమై, ప్రజలకు అందుబాటులో లేకుండా, అర్థంకాని పరిస్థితి ఏర్పడుతుంది. అందుకని రామానుజల తర్వాత వచ్చిన ఆచార్యపురుషులు ముగ్గురు విరివిగా సంస్కృత, తమిళభాషల్లో స్తోత్రాలు వ్రాసి జనసామాన్యాన్ని తిరిగి భక్తిమార్గం వైపు మళ్లించడానికి కృషిచేశారు. శాస్త్రం పండితుల కోసం ఉద్దేశింపబడింది. 'భక్తి' సామాన్యజనుల ముక్తికోసం ఏర్పడింది. 'ముక్తి' కోరేవాడు ముముక్షువు. 'ఆళ్వారు' అంటే నిరంతరం భగవంతుని భక్తిలో నిమగ్నమైనవాడని అర్థం!

పన్నెండుమంది ఆళ్వారులు తమిళనాడులో క్రీ.శ. 5వ శతాబ్దినుండి క్రి.శ. 8వ శతాబ్ది మధ్యభాగంలో విభిన్న కాలాలలో జన్మించినవారు. 300 సంవత్సరాల కాలంలో వీరందరూ జీవించి, రచించిన పాటలే నాలాయిర దివ్యప్రబంధం. ఆరుగురు ఆచార్యపురుషులు తమిళనాడులో క్రీ.శ.9వ శతాబ్దినుండి 15వ శతాబ్ది ఉత్తరార్ధం వరకు జీవించియుండినవారు. అంటే దాదాపు 600 సంవత్సరాల కాలంలో ఆరుమంది ఆచార్యులు పుట్టి శ్రీవైష్ణవాన్ని సిద్ధాంతీకరించారు.

పన్నిద్దరు ఆళ్వారులలో చారిత్రక కాలానుసారం చూస్తే, ఏడవ ఆళ్వారు కులశేఖర ఆళ్వారు (క్రీ.శ. 700-750) కాగా, పదకొండవ ఆళ్వారుగా నమ్మాళ్వారు (క్రీ.శ 785-820) వస్తారు. పన్నెండుమంది ఆళ్వారులు దక్షిణభారతదేశమే గాక, ఉత్తరభారతంలోని వడమదురై వంటి అనేక క్షేత్రాలను, దివ్యదేశాలను సందర్శించి పాశురాలు పాడారు. శ్రీవేంకటేశ్వరస్వామిపై తొండరడిప్పొడి ఆళ్వార్ (భక్తాంఘ్రిరేణువు- విప్రనారాయణుడు), మధురకవి ఆళ్వార్ తప్ప, తక్కిన పదిమంది ఆళ్వారులు కలిసి 192 పాశురాలను పాడివున్నారు.

ప్రస్తుత వ్యాసంలో కులశేఖర ఆళ్వార్, 'పెరుమాళ్ తిరుమొళి'లో 'తిరువేంగడ ముడైయాన్' (శ్రీవేంకటేశ్వరస్వామి) పై చెప్పిన పదకొండు పాశురాల సారాంశాన్ని మాత్రమే ప్రస్తావించి వివరించడం జరిగింది.

## కులశేఖర ఆళ్వార్

కులశేఖర పెరుమాళ్ అని పిలువబడే ఈ ఆళ్వారు కేరళదేశంలోని చోళపట్టణమనే పేరుగల కొల్లి నగరంలో 28వ కలియుగంలో పరాభవనామసంవత్సరం, కుంభరాశి, మాసిమాసం, శుక్లపక్షం, ద్వాదశి శుక్రవారం పునర్వసు నక్షత్రంలో శ్రీమహావిష్ణువుయొక్క కౌస్తుభాంశలో చంద్రవంశపురాజకుటుంబంలో జన్మించారు.

**శ్లో॥ ఘుష్యతే యస్యనగరే రంగయాత్రా దినేదినే ।**
**త మహం శిరసా వందే రాజానం కులశేఖరమ్ ॥**

ఎవరి రాజధానీనగరమైన కొల్లం అనే పట్టణంలో ప్రతిరోజు ఉదయం 'శ్రీరంగయాత్రకు వచ్చేవారు రాజుగారితో వెళ్లవచ్చుననే' (ఘోషణ) చాటింపు వినబడుతూ ఉంటుందో, అటువంటి శ్రీరంగనాధుని భక్తుడైన కులశేఖర మహారాజుకు శిరసువంచి అంజలి ఘటిస్తున్నాను.

భగవత్సేవ కంటే భగవంతుని భక్తులైన భాగవతులను సేవించుకోవడం చాల గొప్పదనే గాఢ నమ్మకం గలవాడు కులశేఖర ఆళ్వారు. ఈ విషయాన్నే శ్రీమద్రామానుజులవారొక తనియన్‌లో ఇలా ప్రశంసించారు. "కులశేఖర ఆళ్వార్‌కు శ్రీవైష్ణవుల యందుండే గౌరవాదరాలను తుంచివేయాలని ఆయన మంత్రులు ఒక పన్నాగం పన్నారు. కులశేఖరుడు శ్రీరాముని భక్తుడు. ఆ స్వామికి ఆయన నవరత్నహారాన్ని చేయించాడు. మంత్రులు ఆ రత్నాలహారాన్ని తీసి దాచిపెట్టి, దాన్ని అర్చకులైన భాగవతులు దొంగలించారని అభియోగం మోపారు. దీనికి, కులశేఖరులు భక్తులైన శ్రీవైష్ణవులెప్పుడూ దొంగలుకారని నిరూపించడానికై నాగుపాము ఉంచబడిన ఒక కుండలో చేతిని పెట్టి, ఆ పాము కాటువేయక పోవడం చేత మంత్రులకు 'కనువిప్పు' కల్గించారు. అటువంటి విలక్షణ భాగవతసేవకుడైన మలయాళదేశ ప్రభువు, కులశేఖర ఆళ్వారులను సేవిస్తున్నాను". కులశేఖర ఆళ్వారు విలక్షణ భక్తుడు ఈయన మరో రచన 'ముకుందమాల' భక్తులకు నిత్యపారాయణ గ్రంథం.

## కులశేఖరుల భక్తిభావనలో క్రమికవికాసం

ఆళ్వారులు ఎవ్వరూ ఎవరికీ తీసిపోరు. ప్రతి ఒక్కరిదీ ఒక విశిష్ట, విలక్షణభక్తి! అధ్యాత్మరామాయణంలో అహల్యాకృత రామస్తవంతో సమానమైంది కులశేఖరులు శ్రీవేంకటేశ్వరునిపై చెప్పిన పదిపాశురాలు. కులశేఖరుల భక్తిసూక్తం పదిపాశురాలే! పదకొండవ పాశురం ఫలశ్రుతి. ఆయన భక్తి సూత్రం ఒక్కటే! తిరుమల శ్రీవారి

సన్నిధిలో తను ఏదో ఒక రూపంలో శాశ్వతంగా ఉండి, భాగవతులకుపయోగపడుతూ స్వామిని సేవించు కోవడం! అది అహంకార, మమకార రహితమైన సాలోక్య, సామీప్యముక్తి! అదే తిరుమల గర్భ గృహద్వారం వద్దగల 'కులశేఖరప్పడి' రహస్యం!

అనేక జన్మలను ఎత్తితే చిట్టచివరకు మానవజన్మవస్తూ ఉంది. కాని, మానవుడు తన స్వసుఖాలకోసం జీవితమంతా వ్యర్థంగా గడిపివేసి, భగవచ్చింతనకోసం, మోక్షప్రాప్తికోసం పాటుపడవలసిన సమయంలో ఆ మార్గమేమిటో "తెలియక జీవితాన్ని ముగించేస్తున్నాడు. అప్పుడు, చేసిన కర్మలను బట్టి నికృష్టజన్మమో, నీచ జన్మమో ఎత్తకతప్పదు. "తెలియలేదు రామ! భక్తిమార్గము" అని త్యాగరాజస్వామి వారన్నట్లు, 'భక్తిమార్గం' తెలియడం అంతసులభంకాదు. "మోక్షము గలదా భువిలో జీవన్ముక్తులు కానివారలకు" అంటాడు త్యాగరాజు ఆయన కంటే ముందే అన్నమయ్య, "ఊరకే దొరకునా ఉన్నతమగుమోక్షము?" అని ప్రశ్నిస్తున్నాడు! శ్రీవైష్ణవుల మోక్షం సాయుజ్యంకాదు, నిత్యకైంకర్యంచేస్తూ గడిపే సామీప్య, సాలోక్యముక్తి! శ్రీకులశేఖరులు యిటువంటి ముక్తినే కోరుకొన్నాడు! ఆ ముక్తిని సాధించేమార్గంలో ఎటువంటి అల్పమైన రూపాలనైనా ధరించడానికి కూడ ఆయన సంసిద్ధుడైనాడు!

కులశేఖరులది ఒక్కటే నిశ్చితాభిప్రాయం! తను ఏదో ఒక రూపంలో శాశ్వతంగా తిరుమలగిరిపై స్వామిని చూస్తూ, భక్తులను సేవిస్తూ ఉండిపోవాలి! దానికి అడ్డువచ్చే రాజసాహంకారాన్ని తను వదలుకోవడానికి సిద్ధమే! అహంకార రహితుడైనవాడే నిజమైన వైష్ణవుడు! భగవద్వియోగంలో నిత్యవిరహుడైన భక్తుడు తాను ఏమైనా ఫరవాలేదనే స్థితికి చేరుకుంటాడు! ఇది నిత్యవిరహిణులైన గోపికలస్థితి! వారు కూడ సామీప్య, సాలోక్యముక్తులనే కోరుకొన్నారు!

మొదటిపాశురంలో- కులశేఖరులు, ఈ జీవుడు పవిత్రుడెలా అవుతాడని ప్రశ్నించుకొన్నాడు. స్వామి పుష్కరిణి అత్యంత పవిత్రమైంది! తాను ఆ నీటిలోనే నివసించే 'ఒక నీటికోడి'గా మారిపోతే! ఎలావుంటుందని భావించాడు! రోజూ జ్ఞానస్నానమే! అయినా ఆ నీటికోడి ఎంతకాలం జీవిస్తుంది? దానికి జ్ఞానోదయం సంపూర్ణంగా కలిగేదెప్పుడు? పోనీ చేపగా జన్మిస్తేనో? అది నీటిలోనే సదాసర్వకాలం ఉంటుంది! ఆ విధంగా స్వామికి మరింత చేరువైనట్లు? కాని, ఆ చేపల్ని మానవులు బ్రతకనిస్తారా? అవీ అల్పజీవులే!

"ఆఁ మంచి ఆలోచనవచ్చింది! స్వామి వారి సన్నిధిలో వారి బంగారపు తాంబూల కరండవాహకుడుగా ఉండిపోతేనో- త్యాగరాజస్వామి వారన్నట్లు, "బంటురీతి కొలువు యియ్యవయ్య రామ!" ఈ 'బంటురీతి కొలువే' సామీప్య, సాలోక్యముక్తి! ఆ స్థితి లభించడం తన కంత సులభమా! అంత అదృష్టమా!

అవును అన్నట్టు ఈ తిరుమల 'పుష్పమంటపం'గా ప్రసిద్ధికెక్కింది. స్వామి అలంకారప్రియుడు! తాను ఆయన నిత్యాలంకరణకు పనికివచ్చే మంచి సువాసనగల సంపంగి చెట్టుగామారిపోతేనో! తిరుమల దివ్యదేశంలో

'సంపంగి' చెట్టు స్థలవృక్షం! తాను ఆ వృక్షంగామారిపోవాలి! అప్పుడు తనకూ స్వామికి ఎడబాటు ఉండదు! స్వామి ఆలయం చుట్టూ సువాసనలను వెదజల్లుతూ తాను చిరస్థాయిగా నిలిచిపోగలడు! అవునా! వృక్షం మాత్రం శాశ్వతమా? దాన్ని ఎవరైనా నరికివేయవచ్చు! ఎక్కడికో దూరంగా తరలించవచ్చు! అప్పుడు తన ముక్తిమాట ఏమౌతుంది?

పరిమళం కలిసిన వృక్షమే ఎందుకు! ఎవరికీ ఎందుకూ పనికిరాని వట్టి ఆకులచెట్టు తంబక వృక్షంగా కొండలో ఏదో ఒక మూల పడివుండి మౌనంగా తపస్సుచేస్తున్న మునిలా స్థిరంగా ఉండిపోదామా? ఎలా వుంటుంది? అయితే నిన్ను ఎవరు గుర్తించుతారు? ఎవరికీ ఉపయోగపడకుండా, ఉపయోగానికి పనికిరాని ఆ జన్మ ఎందుకు? నీ వరకు నీవు ముక్తిని సాధిస్తే సరిపోతుందా? ఇది సార్థంకాదా! మధురమైన పదార్థాన్ని నీవొక్కడవే తినరాదు, పదిమందితో కలిసి పంచుకొని తినాలని ఉపనిషత్తు చెప్పడం లేదా! 'అహంబ్రహ్మాస్మి' అనుకొనే అద్వైతుల 'బ్రహ్మానందం' కంటే, శ్రీవైష్ణవుల ప్రేమానందం గొప్పదా! అది అందరినీ కలుపుకొనిపోయే సేవామార్గం! ఆ ప్రేమమార్గం కోసం ప్రయత్నించు! అయితే భక్తులందరూ కాలినడకన ఎక్కే ఒక కొండగా నేను మారిపోతే! వారి ఉన్నతమైన, ఊర్ధ్వగతికి తను సహాయపడినవాడనౌతాను! నా మీద కాలుపెట్టి ఆ భాగవతులు నడవడం అనేది అందరికీ లభించేది కాదు. ఆ విధంగా నేను ఒక శాశ్వత తపస్సుచేస్తున్న కొండగా నిలిచిపోతాను. ఈ కొండ సామాన్యమనుకున్నావా! ఇది సాలగ్రామమయమైన కొండ! 'యధాసాల గ్రామో హరిః' అని శ్రీఆదిశంకరులు చెప్పినట్లు ఇది విష్ణుసాలగ్రామం! వట్టి బండరాయి లాంటి నీవు సాలగ్రామమెలా అవుతావు? ప్రజలు సాలగ్రామ శిలకే మొక్కుతారు! వట్టి రాళ్లను నిరాదరిస్తారు. అప్పుడేం చేయాలి?

వాల్మీకి సామాన్యుడుకాడు! రామాయణాన్ని గురించి ఆయన ఒక గొప్పమాట చెప్పాడు! "ఈ నదులూ, కొండలూ ఉన్నంతకాలం రామకథ ఈ లోకంలో నిత్యంగా, శాశ్వతంగా ఉండిపోతుంది" అని. ఎంత గొప్ప బంగారుకొండగా మారినా విష్ణసాలగ్రామం ముందు పనికిరాదని తేలిపోయింది కదా! యిక మిగిలింది నది! ఆ కొండల నుండి పాటేసెలయేరుగా మారిపోతేనో! నేను స్వామి కీర్తిని గానంచేస్తూ, ప్రవహిస్తూ జ్ఞానపిపాసువులు, భక్తిపిపాసువులైన భక్తుల దప్పిక తీరుస్తూ, ఆ విధంగా మానవసేవ, మాధవసేవ చేసుకుంటూ శాశ్వతంగా ఉండిపోవాలి! అన్నట్లు నది, నేలపై ప్రవహించేటప్పుడు తన తొలినాటి స్వచ్ఛతను, పవిత్రతను పోగొట్టుకొని కశ్మలంగా మారుతుంది. చివరికి ఉప్పు నీళ్లయిన సముద్రంలో చేరుతుంది. దానివల్ల ఏం ప్రయోజనం! నేను నా స్వామిని వదలి దూరంగ ఎక్కడో వెళ్లిపోకూడదు! ఇక్కడే ఈ తిరుమలగిరిపై స్థిరంగా ఉండిపోవాలి! ఆ మార్గమేమిటో యింక తెలియడం లేదే! అయ్యో! ఏం చేసేది? ఏది దారి?

ఆఁ 'దారి' అంటే జ్ఞాపకం వచ్చింది! భక్తులునడిచే దారి! భక్తులు బాటసారులై నడిచే కాలిబాట! అది నిరంతరం శ్రీవైష్ణవుల పాదధూళిచే పరమపవిత్రమైన మోక్షమార్గం! నేను ఆ భక్తులునడిచే 'కాలిబాట'గా

మారిపోతేచాలు! అంతకంటే నాకు కావలసినదేముంది? మరి నా స్వామిని నే నెప్పుడు చూచేది? భక్తులందరూ స్వామిని చూచివచ్చిన సంతోషంతో నా దారిలోనే తిరిగి వెళ్లుతూ గొప్పగా స్వామిని వర్ణిస్తూవుంటే నాకు మాత్రం స్వామిని చూడాలని వుండదా? నా స్వామిని నేను చూస్తూ, భక్తుల సేవిస్తూ ఉండిపోవాలి! ఆ మార్గమేమిటో! వెతకాలి! అన్వేషించాలి!

ఇలా వెతగ్గా, వెతగ్గా చిట్టచివరికి ఎట్టకేలకు కులశేఖర ఆళ్వారు అన్వేషణ ఫలించింది! అదే 'కులశేఖరప్పడి!' స్వామి! గర్భాలయద్వారం వద్దగల రాతిమెట్టు! అధ్యాత్మ రామాయణంలో అహల్య 'రాయి'గా మారింది. దానికంటే, విలక్షణంగా, కులశేఖరులు తానొక ద్వార బంధపు రాతిమెట్టుగా భగవంతుని గుడివాకిట పడివుంటే చాలునను కున్నాడు! అప్పుడు ఆ స్వామిని ఎప్పుడూ చూస్తూండవచ్చు, అహల్యవలె చైతన్యం గల ఆ రాయిలో మనస్సు ఆడుతున్నది కాబట్టి అహంకారం పెరిగే అవకాశముంది. జయవిజయులకే అహంకారం పెరిగి స్వామికి దూరంకాలేదా! చివరికి వైరభక్తితో స్వామినే ఎదిరించి త్వరగా మోక్షాన్ని పొందలేదా? తనలో పుట్టే అహంకారాన్ని భగవంతుని భక్తులే నశింపచేస్తారు. ఆ రాతిమెట్టుపై భక్తులు పాదాలు పెట్టినప్పుడు వారి పాదధూళిచే అహంకారాన్ని పోగొట్టుకొని క్షణ క్షణ పవిత్ర మవుతూ ఆ విధంగా, అహంకార మమకార రహితమైన సాలోక్య, సామీప్యముక్తిని చూరగొనాలని ఆ విధంగా అయ్యాడు చివరికి! ఇదే తిరుమల దేవాలయ గర్భగుడి ద్వారంలోగల కులశేఖరప్పడి రహస్యం. కులశేఖరుల ముక్తిరహస్యం.

అప్పటికి కులశేఖరుల అన్వేషణ కొక నవసాధనం లభించింది. ఇది చిట్టచివరి పదవ పాశురంలో ఏదో ఒకరూపంలో తాను కొండపై ఉండిపోవాలనే తపనలో వ్యక్తమౌతుంది.

అంటే ఆయనవంటి జీవులు ఆ అన్వేషణ యింకాచేస్తున్నారని. ఆ వెతకడాన్ని కొనసాగిస్తున్నారని అర్థం! జీవులకు అన్వేషణ తప్పదు. భక్తికోసం, ముక్తికోసం అన్వేషించడమే జీవుల సహజగుణం! భక్తి దొరికిన క్షణం నుండి ముక్తి కోసం అన్వేషణ ఆరాటం! జీవునికీ దేవునికీ గల అనుబంధం! ఇదే ప్రేమానుబంధం!

ఈ ముక్తిని చూరగొన్న శ్రీకులశేఖరుల మార్గమేమనకు శరణ్యం.

# శ్రీవేంకటేశ్వరుడు - తిరుమంగై ఆళ్వారు

డా॥ టి.ప. శింగరాచార్యులు

**"కలౌ వేంకటనాయకః"** కలియుగములో మిక్కిలి ప్రాధాన్యమును, ప్రాచుర్యమును పొందిన అర్చామూర్తి తిరుమలగిరులపై వేంచేసియున్న శ్రీవేంకటేశ్వరుడు. ప్రస్తుతము మనము దర్శించు స్వామిరూపము కలియుగాదిలో ఆవిర్భవించినట్లు పురాణ కధనము. కాని, అంతకుముందే ఈ పర్వతములందు స్వామి కృత, త్రేతా, ద్వాపరయుగములందు పలువురు ఋషులకు, దేవతలకు, భక్తులకు పలుమార్లు దర్శనమిచ్చినట్లు పలు పురాణములందు చెప్పబడినది. కావున భగవానుడు ఈ పర్వతప్రాంతమును తన నివాసముగా అనాదిగా కల్గియుండెనని స్పష్టమగుచున్నది. సంస్కృత వాఙ్మయమునందేకాక, దక్షిణభారతీయ సాహిత్యములలో మిక్కిలి ప్రాచీనమైనదిగా భావింపబడు తమిళసాహిత్యమునందు శిలప్పదికారము, అకనానూఱు, పుఱనానూఱు మొదలగు సంఘకాలమునకు చెందిన గ్రంథములలో ఈ క్షేత్రమహిమ, ఇచట వేంచేసియున్న వేంకటేశ్వరుని వైభవమును ఉగ్గడింపబడినవి.

తొల్కాప్పియమ్ గ్రంధరచనా కాలమునకు చెందిన **"పనమ్ పరనార్"** అను పండితుడు **"శిఱప్పాయిరమ్"** అను వ్యాఖ్యను రచించుచు, ద్రావిడ దేశమునకు ఉత్తరదిక్కు ఎల్లగా "వడవేఙ్గడమ్ తెన్ కుమరి" అనుచు వేంకటాచలమును పేర్కొనెను. సంఘసాహిత్యము మధ్యమకాలమునకు చెందిన అకనానూఱులో **"విళవుడైవిళుచ్చీర్ వేఙ్గడమ్"** అని వేంకటాద్రిపై నిత్యము జరిగే పలుఉత్సవములు, **"వేఙ్గడనెడువరై"** అనుచు ఆ పర్వతముయొక్క ఔన్నత్యము, ఆ పర్వతముపై ప్రవహించు కొండ సెలయేళ్ళ అందము వర్ణింపబడుట, గమనింపవచ్చును. ఈ విధముగా ఇంకను పలు సందర్భములలో వేంకటాచల వైభవప్రసక్తి అందు కానవచ్చుటయు గమనింపతగినది. తదనంతర కాలమునకు చెందినదిగా భావింపబడు నాలాయిరదివ్యప్రబంధ సాహిత్యములో ఈ పర్వతముపై నెలకొనియున్న మూర్తి విష్ణుస్వరూపుడే ననుట సుస్పష్టముగా, నిర్ద్వందముగా చెప్పబడినది. అందుచే తిరుమల కొండపైనున్న స్వామి విష్ణుస్వరూపుడేననుట ప్రాచీన తమిళ వాఙ్మయములో ప్రతిపాదింపబడిన, స్పష్టమైన సత్యము.

ఆళ్వార్లుగా పిలువబడు పదిమంది భక్తశిఖామణులు ద్రావిడభాషలో నాలాయిరదివ్యప్రబంధమనబడు భక్తిసాహిత్యమును మధురభక్తిప్రక్రియలో లోకమునకు అందించిరి. భక్తాంఘ్రిరేణువు అనబడు తొండరడిప్పొడి ఆళ్వారు తప్ప మిగిలిన తొమ్మిదిమంది ఆళ్వార్లు వేంకటాచలమును, అచట స్వామిని కీర్తించినవారే. వారిలో కాలక్రమమునుబట్టి చివరివారుగా చెప్పబడు తిరుమంగై ఆళ్వారు వెలయించిన ఆఱు కృతులలో **"తిరువెళుక్కూత్తిరుక్కై"** అను లఘుప్రబంధములో తప్ప, మిగిలిన అయిదు ప్రబంధములలో మొత్తము 63 మార్లు వేంకటాచలమునుగాని, అచటి స్వామినిగాని సాక్షాత్తుగానో, పరోక్షముగానో పేర్కొనిరి. ఈ అంశము ప్రస్తుత వ్యాసమున దిఙ్మాత్రముగా ప్రస్తావింపబడుచున్నది.

## వేంకటాచల వైభవము

తిరుమల గిరుల ఔన్నత్యము, అందము మనకు ప్రత్యక్షానుభవములోనున్నదే. మేఘమండల పర్యంతము వ్యాపించిన ఈ పర్వతశ్రేణులసొబగు **"శెప్పార్ తిణ్ వరైశూళ్"** (ముక్తాదామమువలెనున్న, ఉన్నతము లైన, విశాలములైన పర్వతపంక్తులచే చుట్టబడిన) (1-9-5) అని, **"విణ్ఆర్‌వేళ్ శికర"** (1-9-6) (ఆకాశమువరకు వ్యాపించిన ఉన్నతములైన శిఖరములు కల) అని, **"విలజ్గల్‌కుడుమి"** (1-10-5) (పైన సంచరించు సూర్య చంద్రులు తొలగిపోవునట్లు ఉన్నతములైయున్న శిఖరములు కల) ఇత్యాదిగాకల సూక్తులద్వారా, ఆ కొండల యందు ప్రవహించు సెలయేళ్ల అందము, **"శెజ్కయల్ తిళైక్కుమ్ శునై"** (1-8-10) (చిన్న వయస్సులోనున్నవి అగుటచే ఎర్రగానున్న చేపలు తుళ్లిపడునట్టి కొండ సెలయేళ్లు) అని, **"కమలమ్‌శునై"** (1-9-9) (వికసించిన తామరలు కల కొండవాగులు) అని మొదలుగాగల ప్రయోగములద్వారా వ్యక్తమగుచున్నది. అచటి తోటల భవ్యత **"వాశమామలర్ నాఱువార్ పొళిల్"** (1-8-9) (మిక్కిలి సువాసననుకల దివ్యపుష్పములతో పరిమళించు విశాలములైన పూదోటలు) అని, **"తేనేయ్ పూమ్ పొళిల్ శూళ్"** (1-9-2) (తుమ్మెదలతో నిండిన పూలతోటలచే పరివేష్టితమైన) అని, **"పొళిల్ శూల్"** (1-8-7) (తోటలచే చుట్టబడిన) అని మొదలైన ప్రయోగము లందు, అచటి వెదురుపొదల పొష్కల్యము **"వేయేయ్ పూమ్బొళిల్"** (1-9-1) అని, **"కామ్బినార్"** (వెదుళ్ళతో నిండిన) అనిగల సూక్తులయందు, ఆ వెదుళ్ళు పగిలి వానినుండి ముత్యములు రాలుట **"మణివాళొళి వెణ్ తరళ్గళ్ వేయ్‌విణ్డు ఉదిర్"** (1-10-8) అను మొదలగు సూక్తులయందును వర్ణింపబడినది. ఇట్లు వేంకటాచల ప్రాంతములోని ప్రకృతి సౌందర్యమును తెలుపు సూక్తులు ఇంకను పలు కలవు.

ఈ పర్వతముపై అపూర్వమృగసంచారము పూర్వము ఉండెడిది అనుటను- **"కవరిమాక్కణమ్ శేరుమ్ వేజ్గడమ్"** (2-1-6) (చమరీమృగములు గుంపులుగా వచ్చి చేరు వేంకటాద్రి)అని తెలుపగా, అచటి తోటలలో మధురముగా శబ్దించు భృంగములను గూర్చి **"వణ్డుకురిఞ్జి మరుళిశైపాడుమ్"** (2-1-2) (తుమ్మెదలు కురుంజి, మరుళ్ మొదలగు దివ్యగానములను పాడుచున్న) అని, **"మరుట్కాళ్ వణ్డుకళ్ పాడుమ్"** (2-1-7) (తుమ్మెదలు మరుళ్ అను రాగములను పాడుచున్న) అనియు గల పలు సూక్తులు వర్ణించుచున్నవి. అట్లే, కొండపై నివసించు బోయలనుగూర్చి, **"విల్లార్‌మలి"** (1-10-10) **"వేడార్"** (4-7-5) (బోయలు కుటుంబములతో నివసించుచున్న) అను సూక్తులు పలుకగా, వారి భగవద్భక్తినిగూర్చి **"కానవరిడు కారగిల్ పుకై ఓఙ్గువేజ్గడమ్"** (2-1-1) (బోయవాండ్రు సమర్పించు పరిమళభరితమైన నల్లని అగురుకాష్ఠముల పొగ అంతట వ్యాపించు వేంకటాద్రి) అని, **"కుఱవర్ మాదర్‌కళోడు వణ్డుకురుఞ్జి ఇశైపాడుమ్"** (2-1-2) (భిల్లస్త్రీలతో పాటు తుమ్మెదలు, కురుంజి, మరుళ్ అను రాగములను పాడుచున్న) అను మొదలుగాగల ప్రయోగములు చాటుచున్నవి. ఈ విధముగా తిరుమంగై ఆళ్వార్లు పలు ప్రయోగములు తిరుమలగిరుల ప్రకృతి సౌందర్యమును అభివర్ణించుచున్నవి.

## వేంకటేశ్వరుని వైభవము

వేంకటాచలముపై వెలసియున్న స్వామి పరమాత్మయే అని ఆళ్వారు అనేక సందర్భములలో పేర్కొన్నారు. ఇచటి స్వామి శ్రియఃపతిత్వము **"మాదవనే"** (1-9-9) అనుటద్వారా, పుండరీకాక్షత్వము **"తామరైక్కణ్ణినన్"** (1-8-1) అనుట ద్వారా, ఆదిత్యమండలాంతర్వర్తిత్వము **"అరుక్కన్ మేవి నాఱ్ఱార్క్కు"** (2-1-7) అనుటవలన, సర్వసంహర్తృత్వము **"నీరార్ కడలుమ్ నిలనుమ్ ముళుదుణ్డ"** (1-10-3) అనుటద్వారా, బ్రహ్మేంద్ర పరమేశ్వర నిర్వాహకత్వము **"అడుతామరైయోనుమ్ ఈశనుమ్ అమరర్కోనుమ్ నిన్ఱేత్తుమ్"** (2-1-9) అనుట ద్వారా స్పష్టము చేసిరి. వేదము పరమాత్మను **"దివీవ చక్షు రాతతమ్"** అని, **"చక్షుర్దేవానా ముత మర్త్యానామ్"** అను సమస్తలోకములకు నేత్ర సదృశునిగా కీర్తించిన రీతిలోనే ఆళ్వారు- **"కణ్ణావిళులకుక్కు"** (1-9-10) (సప్తలోకములకు నేత్రమువంటివాడు) అనుచు వేంకటేశ్వరుని గూర్చి పల్కి వేద ప్రతిపాద్యుడైన దైవమే వేంకటాద్రిపై వెలసెనని నిర్ధారించారు.

ఇచటి స్వామియే ఆయా యుగములలో పలు అవతారములను ధరించినాడని పేర్కొన్నారు. **"తిణ్ తిఱలరియాయవన్ తిరువేఙ్గడమ్"** (1-8-6) అని, **"శెన్ఱుకున్ఱమెడుత్తవన్"** (1-8-3) అని, **"కొణ్డాయ్ కుఱళాయ్ నిలమ్ ఈరడియాలే"** (1-10-4) అని వరుసగా నృసింహ, శ్రీకృష్ణ, వామనావతారములను ఎత్తినది వేంకటేశ్వరుడేననిరి. ఈ విధముగానే శ్రీరామాది అవతార స్వరూపుడు అని తెలియజేశారు.

## శరణాగతి తత్త్వనిరూపణము

శ్రీవైష్ణవసిద్ధాంతములో శరణాగతి సిద్ధాంతమునకు మిక్కిలి ప్రాధాన్యమీయబడింది. "త్వమేవోపాయ భూతో మే భవేతి ప్రార్థనామతిః శరణాగతిః" అను ఒకానొక శరణాగతి నిరుక్తి ప్రకారము భగవానుడే మోక్షోపాయము అని నిశ్చయించుకొని, ప్రార్థించుటయే శరణాగతి. జీవుడుకాని, వేరొకరుకాని నిజమైన ఉపాయము కాజాలరని, సర్వేశ్వరుడగు శ్రీమన్నారాయణుడే ఉపాయమని, ఆ స్వామి సేవయే పరమ పురుషార్థమని శరణాగతి సిద్ధాంతసారము. దీనిని అందరు ఆళ్వార్లు తమ ప్రబంధములలో నిరూపించిరి. నమ్మాళ్వారు పలుమార్లు పలుదివ్యక్షేత్రములలోని అర్చామూర్తుల విషయమున శరణాగతి చేసినను, ప్రధానంగా శ్రీవేంకటేశ్వరునే శరణాగతి చేశారు. ఆ క్రమమును అనుసరించుచు తిరుమంగై ఆళ్వార్లు కూడ వేంకటేశ్వరుని కీర్తిస్తూ శరణాగతిని చేశారు. కావున ఆ దశకము శరణాగతి తత్త్వప్రతిపాదకమగు ద్వయం మంత్రముయొక్క వివరణమేనని వ్యాఖ్యాతలు వివరించారు.

ద్వయములోని "శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే" అను పూర్వవాక్యమునందు లక్ష్మీసహితుడైన శ్రీమన్నారాయణుని చరణద్వంద్వమును శరణముగా పొందుచున్నారనుటద్వారా శరణాగతి, "శ్రీమతే నారాయణాయ నమః" అను ఉత్తరవాక్యమునందు ఆ స్వామి పాదారవిందములందే సర్వవిధ- సర్వకాల కైంకర్యమును చేయవలెనను కైంకర్యప్రార్థనయు తెలుపబడినవి. ఈ అంశములే ఆళ్వారుల పై దశకములో ప్రతిపాదింపబడినవనుట ఇచట సంగ్రహముగా తెలుపబడుచున్నది.

ఈ దశకములోని మొదటి పద్యభావమిట్లున్నది- "వెదురుపొదలతో చుట్టబడియున్న, దివ్యపరిమళ యుక్తమైన వేంకటాచాలముపై వేంచేసియున్న స్వామీ! తల్లి అని, తండ్రి అని, భార్య అని, బంధువులని, సంతానము అని- ఇట్లు అభాస బంధువులనే నేను ఎల్లప్పుడు తలచుచు అనర్థమును కొనితెచ్చుకొంటిని, నశించితిని. మిక్కిలి నీచుడనగు నేను నిన్ను సేవింపవలెనను ఆశతో నీదరికి చేరి, శరణుజొచ్చితిని. శరణాగతుడనగు నాపట్ల నీ కృపను చూపి, నన్ను దాసునిగా గైకొనుము".

ఈ పాశురములో ఆళ్వారు "ఉన్నైక్కాణ్బదోర్ ఆశైయినాల్ తిరువేజ్గడవా! నాయేన్ వన్దడైన్దేన్" అనుచు ద్వయములోని పూర్వవాక్యముయొక్క అర్థమును అనుసంధించిరి. సంగ్రహముగా తెలుపవలెనన్న "తిరువేజ్గడవా" అనుటచే "శ్రీమన్నారాయణచరణౌ" అను పదముయొక్క అర్థము, "వన్దడైన్దేన్" అనుటచే "శరణం ప్రపద్యే" అను రెండు పదముల అర్థమును తెలుపబడినది. "ఉన్నైక్కాణ్బదోర్ ఆశైయినాల్" అను ప్రయోగము శరణాగతునకు ఉండదగిన భగవద్విషయకమైన అభినివేశమును తెల్పుచున్నది. ఇక, "నల్కి ఆళెన్నైక్కొణ్డరుళ్" అనునది "శ్రీమతే నారాయణాయ నమః" అను ఉత్తర వాక్యములోని అర్థమును ప్రతిపాదించు చున్నది. దాసునిగా చేసికొనుమని ప్రార్థించుట అనగా తాను చేయు కైంకర్యము అంగీకరింపుమని వేడుటయే కదా!

ఇట్లు సంగ్రహముగా మొదటి పాశురములో తెలుపబడిన ద్వయార్థమునకు సంబంధించిన పలు అంశములు మిగిలిన పాశురములలో ప్రతిపాదింపబడినవి. "మాదవనే" (1-9-9) అనుటచే శ్రీమచ్ఛబ్దార్థము, "అప్పా" అణ్ణా" ఇత్యాది సంబోధనలు నారాయణ శబ్దముచే తెలుపబడిన సర్వవిధ బంధుత్వమును తెలుపబడినవి. ఆకించన్యము అనగా- తాను తన రక్షణ కొరకు చేసినదేమియు కొంచెము కూడ లేదనుట- "పత్తేల్ ఒన్ఱుమిలేన్" అను (1-9-9) సూక్తిచే, అనన్యగతిత్వము "వన్దు అడైన్దేన్" అను సూక్తిచే సూచింపబడినవి. "కొల్లేన్ పల్లుయిరై" అనుటచే అకృత్యకరణము, "నలదోరఱమ్ శెయ్‌దుమిలేన్" అనుటచే కృత్యాకరణమును చెప్పబడినవి. "తిరువేజ్గడవా" అనుటచే స్వామిత్వము, సౌశీల్యము, సౌలభ్యమును వ్యక్తీకరింపబడినవి. 'తుప్పా' అను సంబోధన సర్వేశ్వరత్వమును చాటుచున్నది. పరత్వముతో కూడుకొన్న సౌలభ్యమే కదా శరణ్యునియందు అపేక్షితము. ఈ విధముగానే ఇంకను పలు శరణాగతికి చెందిన అంశములు ఇచట దశకములోనున్నను, విస్తరభయముచే ప్రస్తావించుట లేదు.

ఆళ్వారు వేంకటేశ్వరుని కీర్తించు ఒకానొక పాశురములో భాగవత పారమ్యమును ప్రస్తావించుట విశేషము. తిరుక్కుఱున్దాణ్డకము అను ప్రబంధములోని 7వ పాశురములో " తిరుమలై యొరుమెయ్యానై తన్నైయేనినైవార్ ఎన్ తలమిశై మన్నువారే" (వేంకటాచలమున నెలకొండియుండి, భూలోకవాసులకును ఒకేవిధమైన భోగ్యతను కల్గించు సర్వేశ్వరుని స్వభావమును తలచువారు నా తలపై అమరియుందురు) అనుచు భగవద్భక్తులను తాను శిరసావహింతుననుట ద్వారా భాగవత పారమ్యమును ప్రతిపాదించిరి.

ఈ విధముగా తిరుమంగై ఆళ్వారు శ్రీవేంకటాద్రిని, అందు నెలకొనియున్న స్వామిని కీర్తించు సూక్తులలో పలు సాహిత్య, సంప్రదాయ విశేషములు భాసించుచున్నవి.

# విష్ణుచిత్తుని పాశురములలో శ్రీనివాసస్తుతి

*పి.ఆర్. రంగరాజన్*

భగవంతుడైన శ్రీమహావిష్ణువు ఐదువిధములుగా ఉన్నట్టు పాంచరాత్రాగమము పేర్కొంటుంది. పరం-వ్యూహం-విభవం-అంతర్యామి-అర్చ-అని దానిని ఆగమశాస్త్రం వివరిస్తుంది.

**పరం :** పరవాసుదేవుడుగా శ్రీ-భూ-నీలాదేవి సమేతుడుగా శ్రీవైకుంఠంలో వెయ్యికాళ్ళ మండపంలో ధర్మం, అధర్మం, జ్ఞానం. అజ్ఞానం, వైరాగ్యం-అవైరాగ్యం, ఐశ్వర్యం-అనైశ్వర్యం అనే ఎనిమిది తత్త్వాలు పాదములుగా ఉండే, ధర్మాధిపీఠమనే సింహాసనం మీద ఆసీనుడుగా ఉన్నట్లు ఆగమశాస్త్రం వర్ణిస్తూంది.

**వ్యూహం :** క్షీరాబ్ధిలో శ్రీ-భూ-సమేతుడుగా శ్రీహరి, అనంతుడు అనగా ఆదిశేషుని పైన శయనించి యోగనిద్రలో ఉన్నట్లు పురాణం పేర్కొంటుంది.

**విభవం :** మత్స్య, కూర్మ, వరాహ, నరసింహ, వామన, పరశురామ, శ్రీరామ, బలరామ, కృష్ణ, కల్కి అని పది అవతారాలు విభవావతారాలు అని పరిగణింపబడినవి ఆగమశాస్త్రంలో.

**అంతర్యామి :** మనుష్యుల హృదయంలో భగవంతుడు నివసిస్తున్నారు. సూక్ష్మముగా అణుపరిమాణంతో జీవాత్మతో పరమాత్మ ఉన్నారు. మన హృదయంలో ఉంటూ అన్నిటినీ నియమిస్తున్నారు. ఆదేశిస్తున్నారు. దీనిని అంతర్యామి అని ఆగమశాస్త్రం వర్ణిస్తుంది.

**అర్చావతారం :** ఐదవ భగవంతుని స్థితిని అర్చావతారం అని ఆగమశాస్త్రం వివరిస్తుంది. మనమంతా అర్చించే విధముగా మనకంటికి దర్శనమిస్తూ ఆలయాల్లో భగవంతుడు విగ్రహరూపంతో సేవ ఇస్తున్నారు. దీనిని అర్చావతారం అంటారు.

మన భారతదేశంలో ఉండే ఆలయాలను నాలుగు రకాలుగా విభజించి చెప్పవచ్చు.

1. స్వయం వ్యక్త క్షేత్రం : ఎక్కడైతే భగవంతుడు స్వయంగా ఆవిర్భవించాడో దానిని స్వయంవ్యక్త క్షేత్రం అంటారు. శ్రీరంగం-తిరుమల-శ్రీముష్ణం-బదరీకాశ్రమం-సాలగ్రామం-నైమిశారణ్యం-పుష్కరం-వానమామలై. ఈ దివ్యదేశాలలో భగవంతుడు స్వయముగా ఆవిర్భవించాడు.

2. దేవప్రతిష్ఠాక్షేత్రములు 3. సిద్ధపురుషప్రతిష్ఠాక్షేత్రాలు. 4. మనుష్యప్రతిష్ఠాక్షేత్రాలు.

వీటిలో స్వయంవ్యక్త క్షేత్రముగా మహిమగల తిరుమల క్షేత్రంలో "అష్టావింశే కలవ్యుగే" అని పురాణం పేర్కొన్నట్లు 28వ కలియుగంలో భగవంతుడు శ్రీనివాసావతారం ఎత్తారు.

శ్రీనివాసుని మహిమను కీర్తించే విధముగా అతనిచేత దివ్యజ్ఞానం పొందిన ఆళ్వార్‌లు ద్విశతాధిక పాశురములతో శ్రీనివాసస్వామికి తమిళ పాశురాల ద్వారా పద్యమాలాలంకారాన్ని చేసారు.

SRI VENKATESWARA ... TIRUPA ... 7.19.33

శ్రీవిష్ణుచిత్తుడు - పెరియాళ్వార్ తమ ప్రబంధములో సప్తపాశురములతో సప్తగిరీశ్వరుని స్తుతించారు. పెరియాళ్వార్ తల్లిగామారి తమతనయుడు బాలశ్రీనివాసుని ఎత్తుకుని క్షీరాన్నాన్ని ఆ బాలకుని నోట్లో పెట్టినప్పుడు ఆ బాలశ్రీనివాసుడు అన్నాన్ని తినలేదు. అప్పుడు ఆకాశంలో దేదీప్యమానంగా ఉన్నటువంటి చంద్రుని చూస్తూ ఇలా అంటుంది ఆ "ఆళ్వార్‌తల్లి".

**సుట్రుం ఒలివట్టం సూలుందుసోది పరదెంగుం**
**ఎత్తనై శయ్యిలుం ఎన్ మగన్ ముగం నేరావ్వాయ్ ।**
**విత్తగన్ వేంకటవాణన్ ఉన్నై విలిక్కిన్ర**
**కైత్తలం నోవామె అంబులీ కడితోడివా** (1. 4. 3)

ఓ చంద్రమా! నీ చుట్టూ ప్రకాశం ఉన్నప్పటికీ నా తనయుడు శ్రీనివాసుని ముఖకాంతికి నువ్వు సమానం ఎలాగవతావు? నా తనయుడు శ్రీనివాసమూర్తి నిన్ను చందమామరావే అని పిలుస్తున్నాడు. అతని శ్రీహస్తానికి నొప్పి కలగడానికి ముందుగానే తొందరగా పరిగెత్తిరా.

ఈ పాశురంలో "విత్తగన్" అని ఒక పదం ఉన్నది. ఆశ్చర్యంతో చూడవలసినవారు అని దానికి తాత్పర్యం. తమ రూప సౌందర్యం చేత కళ్యాణగుణముల చేత ఆశ్చర్యపడే విధముగా ఉండే ఆ సర్వేశ్వరుడు నీలాంటి దురభిమానముతో కూడిన వారిని ధిక్కరించి అడవి- వానర సమూహం అని వీటిని ఆదరిస్తూ తిరుమలలో నిత్యవాసం చేస్తున్న **"విత్తగన్"** అని ఇక్కడ వ్యాఖ్యానం.

"ఎన్నిదు మాయం" అనే పాశురంలో "వేంకటవాననే అచ్చో అచ్చో" అని ఆళ్వార్ చెప్తున్నారు. అనగా తల్లిగా మారిన ఆళ్వార్ తమ తనయుడు శ్రీనివాసుడు తమ దగ్గరకు వచ్చి కౌగిలించుకోవాలని ప్రార్థిస్తున్నారు.

యశోదమ్మగా మారిన శ్రీవిష్ణుచిత్తుడు, శ్రీకృష్ణుడే శ్రీనివాసుడనే విషయాన్ని తెలియజేసేస్తున్నాడు. శ్రీకృష్ణుడు ఆవులను మేపుటకు అడవికి వెళ్ళడానికి సిద్ధమయ్యే సమయంలో అతని చేతిలో ఉండే కర్రను అతనికి తెలియకుండా యశోదమ్మ దాచేసి, వాడు కర్రను అడిగినప్పుడు చిన్నపిల్లలకు చెప్పునట్లు ఒక పాశురాన్ని పాడుతున్నారు. "వేంకటవానర్‌కేర్ కోల్‌కొండువా" అని. తిరుమలలో నిత్యవాసం చేస్తున్న శ్రీనివాసస్వామికి ఓకాకీ! కర్రని తీసుకుని రా అని.

శ్రీకృష్ణుడు అడవికి వెళ్ళేముందుగా తల్లి యశోదమ్మ అతనికి అలంకారం చేసినది. పుష్పాలంకారం చేసుకోవడానికి కృష్ణా! ఇటురా అని పిలిచే సమయంలో కృష్ణా అని పిలవకుండా శ్రీనివాసా అని పిలుస్తున్నారు.

**"పోదర్ కండాయ్ ఇంగే పోదర్ కండాయ్**
**పోదరేన్ ఎన్నాదే పోదర్ కండాయ్**

**ఏదేమం పొల్లి అపలగత్తార్ ఏదేమం పేసవాన్**
**కేడ్కమాట్టేన్**
**కోదుకల ముడయ్యా! కుట్టనేయో**
**కుంద్రుఎడుత్తాయ్ కుడమాడుకూత్తా**
**వేదప్పొరులే ఎన్ వేంకటవా**
**విత్తగనే ఇంగే పోదరాయే!** (2. 9. 6)

అందరిచేత కీర్తింపబడుతున్న స్వామి! నాకు శిశువుగా ఉండే స్వామి! గోవర్ధన పర్వతాన్ని గొడుగుగా ఎత్తిన స్వామి! రాసక్రీడ చేసిన కృష్ణా! సకలవేద ప్రతిపాద్యుడుగా తిరుమలలో నిత్యవాసం చేస్తున్న శ్రీనివాసా! ఆశ్చర్యశక్తులతో కూడిన శ్రీనివాసా! ఇటురా. రాను అని చెప్పకుండా ఇక్కడికి రా. వేరే ఇంటివాళ్ళు నీ విషయంలో దోషం చెప్తే నేను దానిని వింటూ సహించను. అందువలన తొందరగా ఇక్కడకు రా. అని శ్రీకృష్ణుని పిలిచే సమయంలో శ్రీనివాసుని సంబోధించి చెప్పటం విశేషార్థములతో కూడినది.

శ్రీకృష్ణుడు ఒకరోజు అడవికి వెళ్ళినప్పుడు చెప్పులు వేసుకోకుండా, గొడుగు తీసుకోకుండా వెళ్ళాడు. దీనిని తెలుసుకుని యశోదమ్మ- అయ్యో! నా తనయుడు చెప్పులు వేసుకోకుండా వెళ్ళాడు. పాదములుకు నొప్పి కలుగుతుంది. ఎండాకాలమైన ఇప్పుడు ఛత్రధారిగా వెళ్ళకుండా పోయినాడు. ఎంతబాధను అనుభవిస్తున్నాడో అని చెప్పే ఒక పాశురంలో శ్రీకృష్ణుడు అని చెప్పకుండా శ్రీనివాసుడు అని సంబోధించి పాడటం విశేషం.

**కడియార్ పాలిల్ అని వేంకటవా! కరుం**
**పోరేరే నీవుగక్కుం**
**కుడయుం సెప్పుం కులలుం తురువిక్క**
**కొళ్ళాదే పోణాయ్‌మాలే**
**కదియ వెంకానిడై కంద్రిన్‌పిన్ పోన**
**సిరుక్కుట్ట సెంకమల అడియుం వెదుంబి**
**ఉంకంగళ్ సివందాయ్**
**అసైందిట్టాయ్ నీ యెంబిరాన్!** (3. 3. 4)

మరో పాశురాన్ని చూద్దాం.

**సెణ్ణియోంగు తన్ తిరువేంకటముడయాయ్**
**ఒలగుతన్నై వాలనెంద్ర నంబీ! దామోదరా! సదిరా!**

ఎన్నయుం ఎన్ ఉడమయ్యేయ్యుం ఉన్ సక్కరప్పొరి ఒట్రిక్కోండు
విన్నరుళే పురిందిరుందేన్ ఇనియెన్ తిరుక్కురిప్పే (5. 4. 1)

తిరుమలలో శిఖరాలు ఆకాశమంత గంభీరంగా నిలచి ఉన్నాయి. భగవంతుడు ఉండే శ్రీవైకుంఠానికి "నిత్యవిభూతి" అని పేరు. అతనిచేత సృష్టింపబడిన లోకాలు "లీలావిభూతి" అని పిలవబడు చున్నవి. ఉభయవిభూతిలో ఉండేవారికి దర్శనం ఇవ్వడానికి నిలిచాడు శ్రీనివాసుడు. ఉదయగిరిలో ఆదిత్యుడు ఉదయిస్తే అన్నిచోట్ల ప్రకాశం ఏర్పడినట్లు తిరుమలలో స్వామి నిలిచి ఉండటం ఉభయవిభూతి వాస్తవ్యులు దర్శించి జీవించటానికే. వాస్తవమైన మాట ఇది. "నావేవయాంతం ఉభయే హవంతే" అని వేదం ఘోషిస్తోంది. నౌకలో పోయేవాణ్ణి ఇరువైపుల తీరాలలో ఉండేవారు పిలిచినట్లు శ్రీనివాసస్వామియొక్క వైభవాన్ని గుర్తించిన ఉభయవిభూతి వాస్తవ్యులు సేవిస్తున్నారు.

శైత్యముతో కూడిన వేంకటం అని ఈ పాశురంలో ఒక పదం ఉన్నది. "ఇరువర్ విడాయెయ్యుం తీర్కుం. రక్షగనుక్కు రక్ష్యత్తై పెరాద విడాయుం రక్ష్యత్తుక్కు రక్షగనై పెరాద విడాయుం అని ఇక్కడ వ్యాఖ్యానం. ఇద్దరి దాహాన్నీ తీర్చే విధంగా తిరుమలలో శైత్యముతో కూడిన జలపాతములు ఉన్నాయి. వారిద్దరూ ఎవరు? మనం-దేవుడు. దేవునికి మనని పొందాలి అనే దాహం ఉందట. మనకు భగవంతుణ్ణి ఆశ్రయించాలని దాహం. ఇద్దరి దాహాన్ని ఈ తిరుమల క్షేత్రం లేకుండా చేస్తుంది.

ఈ పాశురంలో "నంబీ" అనే ఒక పదం ఉన్నది. కళ్యాణగుణ పూర్తితో కూడిన శ్రీనివాసా అని దీనికి భావం. వాత్సల్యం - స్వామిత్వం - సౌశీల్యం - సౌలభ్యం మొదలైన కళ్యాణగుణ పరిపూర్తితో కూడిన శ్రీనివాసా! అని పెరియాళ్వార్ కీర్తిస్తున్నారు. "నిగరిల్ పుగళాయ్ (వాత్సల్యం) ఉలగం యున్రుడయాయ్ (స్వామిత్వం) ఎన్నై ఆళ్వాన్నే (సౌశీల్యం) తిరువేంగడత్తానే (సౌలభ్యం) అని స్వామి నమ్మాళ్వార్ చెప్పినట్లు పెరియాళ్వార్ "నంబీ" అనే పదంచేత ఇన్ని అర్థాలని తెలియజేస్తున్నారని పూర్వాచార్యులు వ్యాఖ్యానం చేశారు. "సదిరా" అనగా ఆశ్రితదోషాన్ని చూడకుండా ఉండే శ్రీనివాసా! నా ఆత్మని శరణాగతిచేత, శరీరాన్ని పంచసంస్కారంచేత (చక్రముద్ర ధరించడం) సంస్కరించి నీ కృపని ప్రతీక్షిస్తున్నాను. నీ అభిప్రాయం ఏమిటో? అనన్యార్హ శేషత్వజ్ఞానంతో పెరియాళ్వార్ శ్రీనివాసస్తుతిని ఈ విధముగా చేశారు.

# ఆళ్వార్ల పాశురములలో ఆనందనిలయుడు

డా॥ వి.టి. చొక్కలింగం

శ్రియఃపతియైన సర్వేశ్వరుడి దయాసాగరంలో మునిగినవారు ఆళ్వారులు. ఆ ఆళ్వారులచే కీర్తించ బడిన ప్రబంధమే 'నాలాయిర దివ్యప్రబంధంగా' పేరు గాంచిందిం. శ్రీమహావిష్ణువు పరత్వం, వ్యూహం, విభవం, అంతర్యామి, అర్చా అనే ఐదు రూపాల్లో ఆరాధింపబడుతున్నారని వైష్ణవం పేర్కొంటున్నది. సర్వేశ్వరుడు ఈ కలియుగంలో నూట ఎనిమిది దివ్యదేశాలలో అర్చారూపంలో కొలువై ప్రత్యక్ష దైవంగా పూజలందుకుంటున్నాడు. ఈ అర్చామూర్తి యొక్క ప్రాముఖ్యతను ఎరిగిన ఆళ్వారులు ఆ దివ్యదేశాల్లో ఆయా మూర్తులను గూర్చి మంగళాశాసనం చేశారు.

ఆళ్వారులు దర్శించిన కీర్తించిన దివ్యదేశాలలో శ్రీరంగం, తిరుమల, కంచి ప్రధానమైనవి. ఇందులో రెండవ దివ్యదేశంగా పేర్కొనబడిన తిరుమల గురించి పొయ్‌గైఆళ్వార్, భూదత్తాళ్వార్, పేయాళ్వార్, తిరుమళిశైయాళ్వార్, నమ్మాళ్వార్, కులశేఖరాళ్వార్, పెరియాళ్వార్, అండాళ్, తిరుప్పాణాళ్వార్, తిరుమంగైయళ్వార్ మొదలైన పదిమంది ఆళ్వార్లు 206 పాశురాలను గానం చేశారు. ఆ పాశురాలలో ఉన్న వేంకటేశ్వరుని యొక్క తత్త్వార్థములగూర్చి తెలియజేయడమే ఈ వ్యాస ముఖ్యోద్దేశం.

## ముదలాళ్వారుల పాశురాలలో తిరుమల

పరభక్తిలో ప్రసిద్ధులైన పొయ్‌గై ఆళ్వారులు, పరజ్ఞానములో అనుభూతి కల్గిన భూదత్త్వాళ్వారులు, పరమభక్తిలో మునిగిన పేయాళ్వారులను ముదలాళ్వారులని అంటారు. వీరు తిరుమలను, తిరుమలేశుని గూర్చి క్రమంగా 10,11,19 పాశురాలలో గానం చేశారు.

## పొయ్‌గై ఆళ్వారుల పరభక్తి

పరంధాముని యొక్క పరభక్తి తత్త్వాన్ని అందించిన యోగి పొయ్‌గైఆళ్వారులవారు. వీరు తిరుమల గురించి **'ఎళువార్ విడైకొళ్వార్'** అనే పాశురములో **తొళువార్, వినైచ్చుడరై నందు విక్కుంవేంగడమే వానోర్ మనచ్చుడరై తూన్‌డుంమలై** యని కీర్తించారు. పాపాగ్నిని హరించి నిత్యసూరుల యొక్క మనస్సు అనే ప్రదీపాన్ని ప్రజ్వలింపజేసే పరమభోగ్యమే తిరుమలగా వీరు భావించారు.

## భూదత్తాళ్వారులవారి పరజ్ఞానం

సంకల్ప మాత్రముతోనే సర్వాన్ని నిర్వహించగల సర్వశక్తియుక్తుడు, సర్వేశ్వరుడు అవతరించినది దుష్ట నిగ్రహమునకు, ధర్మ సంస్థాపనకు అన్న పరిజ్ఞానం కల్గిన భూదత్తాళ్వారు భాగవతుల సంకల్పమున కొరకు కంటికి కనబడుతూ వారు చేసే కైంకర్యము స్వీకరించి వాళ్లని సంతోష పరచడానికి గాను భగవంతుడు ఈ భూలోకంలో విభవవతారమెత్తి అర్చారూపిగా తిరుమలలో సేవనందిస్తున్నారు అనే తత్త్వాన్ని వివరంగా తెలుపుతూ

( రెండవ తిరువందాది పా. 25) దేవతల విన్నపం మేరకు కోపంతో లంకాపురిని చేరి రావణుని సంహరించి సాధుజన పరిత్రాణము కొరకు దివ్యమంగళ విగ్రహమూర్తిగా పరమ సులభుడుగా తిరుమలలో కొలువైయున్నాడని ప్రస్తావించబడినది.

**పేయాళ్వారుల వారి పరమభక్తి**

పరమభక్తిగాంచిన పేయాళ్వారులు ఇంద్రియాలను జయించి భగవంతున్ని చూడటం అనేది కఠినమని పరమభోగ్యమైన తిరుమలలో పరమ సులభుడుగా నిలిచివున్న వేంకటేశుని పాదాలను ఆశ్రయిస్తే, ఈ లోకంలో అల్ప సంతోషాలైన విషయాంతరాలలో కోరిక నశించి భగవంతుని చేరే మార్గాలను చూపించే శాస్త్రాలలో కోరిక కలుగునని అంటున్నారు, **'మార్పాల్ మనంజులిప్ప'** అనే పాశురంలో.

**తిరుమళిశై ఆళ్వారుల తిరుమలానుభవము**

తిరుమల గురించి 16 పాశురములను గానం చేసిన తిరుమళిశై ఆళ్వారులు తిరుమల పై పాదాలు పెట్టి తిరుమలకు చేరడం పాపమని తిరుమలకు వెళ్ళకుండ క్రింద నుంచే ఆ తిరుమలని చూసి ఆనందించినట్లు పెద్దలు తెలుపుదురు. దాన్ని నిరూపించు విధంగా తిరుమళిశై ఆళ్వారు- నాన్ముగన్ తిరువందాదిలో

తిరుమలలో ధ్వనించు సెలయేరు మూలంగా ముత్యాలు రాలుతున్నవి. స్వామి అవతరించిన శ్రవణ నక్షత్ర మహోత్సవమైన బ్రహ్మోత్సవాలలో శ్రీవైష్ణవులు చేసే మంగళాశాసన ధ్వని ప్రతిచోట వ్యాపించి యున్నది. భక్త బృందాలు పలుచోట్ల వేచి వున్నారు. తిరుమలలో పరమభోగ్యుడుగా నిలిచియున్న దైవమే తిరుమలను వదలి నా హృదయంలో నిలిచినాడు. నేను ఆ తిరుమలకు వెళ్లి దర్శించాలని కోరుకుంటున్నాను అని చెబుతున్నారు. దీని వల్ల దైవం పట్ల వారికున్న మనోగతం వ్యక్తమగుచున్నది.

**నమ్మాళ్వార్ పాశురాలలో ప్రపత్తి శరణాగతి**

తిరుమల గురించి 48 పాశురాలు మంగళాశాసనం చేసిన నమ్మాళ్వారు ఎన్నో దివ్యదేశాలలో ఉన్న అర్చామూర్తులను అర్చించి చివరిలో శ్రీవేంకటేశ్వరుని దగ్గరే ప్రపత్తితో శరణాగతి చేసినారు. ప్రపత్తి అనునది ద్వయంమంత్రమైన, మంత్రరత్నమైన **'శ్రీమన్నారాయణ చరణౌ శరణం ప్రపద్యే శ్రీమతే నారాయణాయ నమః'** అనే మంత్రముతో అమ్మవారితో గూడిన నారాయణుని శరణాగతి వేడుటనే ఇచ్చట ఆళ్వారు-

**'అగల గిల్లేన్నిఱైయూ మెన్ఱు అలర్మేల్ మజ్గైయుఱైమార్బ**
**నిగరిల్ పుకళాయులగమూన్ఱుడైయా యన్నై యాళ్వానే,**
**నిగరి లమరర్ మునిక్కణజ్గల్ విరుమ్బుమ్ తిరువేఙ్గడత్తానే**
**పుగల్ ఒన్ఱు ఇల్లా అడియేన్ ఉన్నడిక్కీళమర్న్దు పుకున్దేనే.**

నిరతిశయ సర్వగుణ సంపన్నమగు లక్ష్మీదేవి క్షణకాలము సైతము నీ వక్షస్థలము నెడబాయజాలదు గదా! నిరుపమ వాత్సల్యాది గుణసాగరుడవై, జగద్రక్షకుడవై, వేంకటాద్రి యందు వేంచేసి యున్న శ్రీమన్నారాయణస్వామి! నేను సర్వము వదలి నీ పాదములనే నమ్మినాను అని ఆళ్వారు శరణాగతి వేడినారు. ఇందులో **"నిగరిల్ పుకళాయ్"** అనుటవల్ల వాత్సల్య గుణము **'ఉలగం మూన్డుడయాయ్'** అనుట వల్ల స్వామిత్వ గుణము, **'ఎన్నై యాళ్వానే'** అనుట వల్ల సౌశీల్య గుణము, **'తిరువేంగడత్తాన్నే'** అనుట వల్ల సౌలభ్య మనే గుణములు చెప్పబడినవి.

## తిరుమల మీద కులశేఖరాళ్వారుల ఆకాంక్ష

శ్రీనివాసుని స్తుతిస్తూ 11 పాశురములను గానం చేసిన కులశేఖరాళ్వారు ఈ విధంగా తెలిపారు. మరలా మరల జన్మించడం కోరని వీరు **"కోనేరి వాయుం కురుగాయ్ పిరప్పేనే"** అని కోనేటిలో నివసించే కొంగగా పుట్టడానికి ఆశించెను. దీనిక్కారణం ఆ విధంగా పుట్టడం వల్ల విరజా నదిలో మునిగి వైకుంఠము చేరుటకు సమానమని ఆశించినారు. ఆ తరువాత ఆ కొంగకున్న రెక్కలు గుర్తొచ్చి వాటితో అది ఎగిరిపోయే ఆస్కారముందని ఆలోచించి అక్కడే పుట్టి పెరిగి మరణించే చేపనై పుట్టుట చాలునని భావించి **'తిరువేంగడ చునయిల్ మీనాయ్ పిరక్కుం విదియుడయేన్ ఆవేనే'** అని అన్నారు. అది నిరంతరం కాదని ఆ విధంగా పుట్టుటకంటే భగవంతునికి అంతరంగ కైంకర్యము చేయుటకు ఆశపడ్డారు. దానికి మార్గం **'వేంగడకోన్ తాన్ ఉమిలుమ్ పొన్ వట్టిల్ పిడిత్తుడనే పుగప్పెరువేన్ ఆవేనే'** అని స్వామికి స్వర్ణపళ్ళెం పట్టుటకు ఆశించినారు. అయితే ఆ స్వర్ణపళ్ళెంపై కోరికేర్పడి దానిని దోచే గుణం రావచ్చని భగవంతునికి సంపంగి పువ్వు తగినదని **'పన్‌పగరుం వన్డినజ్గల్ పన్‌పాడుంవేంగడత్తు శెన్బగమాయ్ నిర్కుమ్ తిరువుడయేన్ ఆవేనే'** అని కోరినారు. అయితే తిరుమల కొచ్చే యాత్రికులు దానిని పెకళించి తీసుకెళ్ళే ప్రమాద ముందని భయపడి గడ్డి మొక్కలుగా పుట్టుటకు ఆశపడి **'తంబగమాయ్ నిర్కుమ్ తవముడయేన్ ఆవేనే'** అని అన్నారు. అది కూడా కొద్ది కాలం తర్వాత అడవి విభాగం వారు నరికి వేయవచ్చని కొండలో ఒక భాగమై ఉండుట మంచిదని ఆళ్వారులు ఆలోచించి **'తెన్నేన వన్డినజ్గల్ పన్‌పాడుం వేంగడతుల్ అన్ననయ పొర్కువడాం అరుందవత్తన్ ఆవేనే'** అని అన్నారు. కొద్ది క్షణంలో ఈ చింతన కూడా తొలగిపోవుచున్నది. కొత్త ఆలయ నిర్మాణానికి కొండ భాగం వాడొచ్చని, ఎవరు పెకళించలేని 'కానారై' అంటే సెలయేరుగా పారుటకు ఆశించి **'తేనార్ పూంచోలై తిరువేంగడ మలైమేల్ కానారాయ్ పాయుం కరుత్తుడైయేన్ ఆవేనే'** అన్నారు. ఈ సెలయేరు కూడా ఎడతెగక పారదని, దానివల్ల తిరుమల నివాసం దక్కదని శ్రీవేంకటేశ్వరుడిని దర్శించుటకు వచ్చు భక్తుల పాద ధూళి తగిలే విధంగా మార్గమై యుండు స్థితి తనకు కలిగితే బాగుంటుందని అనుకొని **'తిరువేంగడ మలైమేల్ నెరియాయ్ కిడక్కుం నిలైయుడయేన్ ఆవేనే'** అని కోరికను వ్యక్తపరిచారు. ఇందులో కూడా అసంతృప్తి కలిగి ఆ మార్గం కూడా కాలక్రమేణ మారవచ్చని శ్రీవారు ఆలయ గర్భగృహంలో ఉన్న గడపనై యుండి స్వామి యొక్క

అదరాన్ని తిలకిస్తూ ఉండటానికి ఆశపడి 'పడియాయ్ కిడన్దు ఉన్ పవళ వాయ్ కాన్బేనే' అని విన్నపించారు. ఈ పాశురాని కనుగుణంగా శ్రీవారి గర్భగృహ గడప కులశేఖర పడియని పిలవబడుచున్నది. దానికి కూడా స్వర్ణరేకు వేయవచ్చని **'ఎంపెరుమాన్ పొన్‌మలైమేల్ ఏదేనుం ఆవేనే'**[16] అనగా ఆ కొండపై చివరిగా ఏదో ఒక వస్తువుగా వుండటానికి ఆశించారు.

## పెరియాళ్వార్ పాశురాలలో వేంకటకృష్ణానుభవము

మంగళాశాసన పరులైన ఆళ్వారులలో గొప్పవారు పెరియాళ్వార్. వీరు స్వామి యొక్క మిగతా అవతారాలు కంటే కృష్ణావతారంతోనే చాలా ప్రఖ్యాతిగాంచినారు. తనదైన స్వభావాన్ని మరచి శ్రీకృష్ణ గుణ చేష్టలను అనుభవించు భాగ్యము పొందిన శ్రీయశోదా దేవి యొక్క స్వభావాన్ని పొంది కృష్ణుని యొక్క బాల్యక్రీడా రసానుభవాలను తన పాశురాలలో ప్రతిబింబింప చేసారు. ఇతను తిరుమల గురించి 7 పాశురాలు కీర్తించారు. ఆ పాశురాలలో వేంకట కృష్ణానుభవాలను రూపొందించారు. **'సుట్రుం ఒళి వట్టం'** అనే పాశురంలో **"విత్తగన్ వేంగడ వాణన్ ఉన్నై విళిక్కిన్ఱ కైత్తలం నోవామే, అంబులి కడి దోడివా"** అనే చోట శ్రీయశోదాదేవి తన బిడ్డ కృష్ణుని కోసం చంద్రుణ్ణి చూసి రా! రా! అని పిలిచే విధంగా ఆళ్వారు తిరుమలేశున్ని కృష్ణుడిగా భావించి చందమామ! వేంకటకృష్ణుడు పిలుస్తున్నాడు రా! అని పిలవడం ఇక్కడ మనం గమనించవచ్చు.

## వేంకటేశునిపై ఆండాళ్ యొక్క విరహ తాపం

తిరుమల శ్రీహరిని 16 పాశురములతో కీర్తించిన ఆండాల్ కృష్ణుని మీద ఉన్న విరహతాపాన్ని వేంకటేశునిపై కూడా చూపారు. **"విణ్ణీల మేలాప్పు విరిత్తార్ పోల్ మేఘంకాల్"** అనే పాశురములో ఆకాశంలోని నీలిమేఘాలను రాయబారంగా పంపి ఆ మేఘాలతో తన విరహతాపాన్ని తెలిపే విధంగా తిరుమలలో నిత్యవాసం చేస్తున్న ఆ శ్రీనివాసుడు తన కన్నీరు స్థనాలపై పడి రాలే విధంగా తనకు విరహవేదన కలిగించడం న్యాయమా అని మీరే అడగండి అని పల్కెను.

## తిరుప్పాణాళ్వారు పాశురాలలో ప్రకృతి సౌందర్యం

నాలాయిర దివ్యప్రబంధాలలో తిరుప్పాణాళ్వారు యొక్క 'అమలనాదిపిరాన్' అనే ప్రబంధము "ఓం" అనే ప్రణవ మంత్రమును ఉచ్చరించే ప్రబంధమగును. ఈ ప్రబంధములో మొదటి మూడు పాశురాలలో మొదటి అక్షరాలు 'అ, ఉ, మ' అనే అక్షరాలతో ప్రారంభమగును. ఈ ఆళ్వారు తిరుమల సౌందర్యాల గురించి రెండు పాశురాలలో పాడారు. అమలనాది పిరాన్ అనే పాశురములో **"విరయార్ పొళిల్ వేంగడవన్"** అనేచోట తిరుమల పరిమళమైన నందనవనాలను కలిగినదని పేర్కొన్నారు. మందిపాయ్ అనే పాశురములో **"మందిపాయ్ వడవేంగడ మామలై వావవర్‌గళ్ పంది పెయ్యు విన్హాన్"** అనేచోట విచిత్రమైన చేష్టలను చేస్తూ ఒక కొమ్మ నుంచి వేరొక కొమ్మకు దూకుతూ ఉన్న కోతులను కల్గిన కొండని పేర్కొన్నారు.

## తిరుమంగై ఆళ్వార్ తన పాపములను హరించమని తిరుమలేశుని వేడుట

తిరుమంగై ఆళ్వారు 66 పాశురములలో తిరుమల శ్రీనివాసుని గురించి గానం చేశారు. తిరుమలలో సర్వస్వామిగా, సర్వవిధ బంధువుగా స్వామి నిలిచియున్నాడని ఆ స్వామిని తన పాపాలను హరించమని ఆళ్వారు కోరుతున్నారు. 'తాయే తందైయెన్రుం' పాశురములో **"నాయేన్ వన్దడైన్దేన్ నల్గిఆళ ఎన్దై కొండరుళే"** అనేచోట వేంకటగిరి దివ్య భోగ్య రసానుభవాన్ని పొందుతూ, కొలువైయున్న వేంకటేశ్వరా! నేను తల్లి, తండ్రి, భార్య, బంధువు, బిడ్డలు అనే సంసార వ్యాధులకు గురై కుక్కగా తిరిగిన నేను నీ యొక్క కటాక్షం వల్ల అవి వదలి సర్వవిధ బంధువువైన నీ దగ్గరకు చేరి శరణు కోరుతున్నాను. నా పాపాన్ని తొలగించి నన్ను కాపాడుము.

ఈ విధంగా ఆళ్వారులు తిరుమల దివ్యదేశంలో కొలువై వున్న శ్రీవారి దివ్యమంగళ విగ్రహ సౌందర్యములను, దివ్యగుణాలను అనుభవించి దివ్యప్రబంధాలుగా కీర్తించి పరమానందం పొందారు.

# ఆళ్వారులు - వేంకటాచలపతి

డి. సుహాసిని

## ఆళ్వారులు

శ్రీమన్నారాయణుడు దుష్టశిక్షణార్థం శిష్టరక్షణార్థం మూడు యుగాలలో శస్త్రపాణిగా అవతరించారు కానీ కలియుగంలో భగవంతుడు తాను అవతరించకుండా తనయొక్క దివ్య ఆయుధ ఆభరణాలను భూలోకమునందు అవతరింపచేశాడు. ఆ విధంగా అవతరించినవారే ఆళ్వారులుగా ప్రసిద్ధిచెందారు. ఆళ్వారులు అనేది తమిళ పదం. దానికి తెలుగు అర్థం అగాధ భగవద్భక్తి సింధువులు అని. వీళ్ళు పన్నిద్దరు. వీరు రచించినటువంటి భగవత్ స్తుతిపరములయినటువంటి 4000 పాశురాలు దివ్యప్రబంధంగా ప్రసిద్ధికెక్కింది. శ్రీవైష్ణవ దివ్యదేశములను అనగా 108 దివ్యదేశములలో ఉన్నటువంటి స్వామివారిని కీర్తించటం జరిగినది. అందులో ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శ్రీవేంకటేశ్వరస్వామివారిని గురించి ఆళ్వారులు చక్కగా గానంచేసి యున్నారు. తిరుమలక్షేత్రానికి విశేషప్రాచుర్యాన్ని కల్పించి భగవంతుని యొక్క కళ్యాణగుణాల్ని కీర్తించిన మహనీయులుగా కొనియాడబడ్డారు. ఆళ్వార్లు రచించిన పాశురాలలో శ్రీవేంకటేశ్వరుని కీర్తించిన పాశురాల సంఖ్య - 200

శ్రీవేంకటాచలపతికి మంగళాశాసనము చేసిన ఆళ్వార్ల పాశురముల వివరములు

| | | | |
|---|---|---|---|
| 1. పోయ్గై ఆళ్వారు | - | ముదల్ తిరువన్దాది | 10 |
| 2. పూదత్తాళ్వారు | - | ఇరణ్డామ్ తిరువన్దాది | 9 |
| 3. పేయాళ్వారు | - | మూన్ఱామ్ తిరువన్దాది | 19 |
| 4. తిరుమళిశైఆళ్వారు | - | (i) నాన్ముగమ్ తిరువన్దాది | 12 |
| | | (ii) తిరుచ్చన్ద విరుత్తమ్ | 2 |
| 5. నమ్మాళ్వారు | - | (i) తిరువిరుత్తమ్ | 8 |
| | | (ii) పెరియతిరువన్దాది | 1 |
| | | (iii) తిరువాయ్‌మొళి | 35 |
| 6. కులశేఖరాళ్వారు | - | పెరుమాళ్ తిరుమొళి | 11 |
| 7. పెరియాళ్వారు | - | (i) తిరుప్పల్లాణ్డు | 1 |
| | | (ii) పెరియాళ్వార్ తిరుమొళి | 7 |
| 8. ఆండాళ్ | | (i) తిరుప్పావై | 1 |
| | | (ii) నాచ్చియార్ తిరుమొళి | 16 |
| 9. తిరుప్పాణాళ్వార్ | - | అమలనాదిపిరాన్ | 2 |

| | | |
|---|---|---|
| 10. తిరుమంగైఆళ్వార్ | (i) పెరియతిరుమొళి | 55 |
| | (ii) తిరుక్కుఱునాణ్ణకమ్ | 1 |
| | (iii) తిరునెడున్దాణ్డకమ్ | 4 |
| | (iv) శిరియ తిరుమడల్ | 1 |
| | (v) పెరియ తిరుమడల్ | 2 |

ఆళ్వారుల దివ్యప్రబంధ పాశురాలలో ఒక్కొక్క పాశురాన్ని గురించి వివరిస్తాను.

1. పొయ్గై ఆళ్వార్లు రచించిన ముదల్ తిరువందాదిలోని "వగైయఱునుణ్కేళ్వి" అనే పాశురంలో శ్రీవేంకటేశ్వర స్వామి వారిని గురించి ఈ విధముగా వర్ణించియున్నాడు.

పాంచజన్యమను శ్వేతశంఖమును పూరించి, వైరుల హృదయముల భేదించి, సమాశ్రితులుగా పాడిన శ్రీగీతాచార్యుడగు శ్రీకృష్ణస్వామియే, ఈ భూలోకమన శ్రీవేంకటాచలమునందు నిఖిలప్రాణులకును తన దివ్యదర్శనమును ప్రసాదించుటకై వేంచేసియున్నాడు.

2. పూదత్తాళ్వార్లు ప్రసాదించిన ఇరణ్డామ్ తిరువన్దాదిలోని పయిన్దదు అన్నపాశురమున- ఇంద్ర నీలములవలె ప్రకాశించు దివ్యమంగళ విగ్రహమును, ఔదార్యసూచకమగు విశాలములైన శ్రీహస్తములను కలిగియుండు సర్వేశ్వరుడు శ్రీరంగమునను, తిరుక్కోష్టియూరునందును చిరకాలముగ పవ్వళించి యున్నవాడు, తిరువేంగడమున అనాదికాలము నుండియు నిలిచియున్నాడు అని వివరించాడు.

3. పేయాళ్వార్లు ప్రసాదించిన మూడవ తిరువందాదిలోని "తాళ్శడైయుమ్" అనుపాశురమున- సుభగ శీతలములగు కొండకాలువలతో పరమ రమణీయమైయుండు శ్రీవేంకటాచలమున వేంచేసియుండు శ్రీస్వామి వారికి తలపై- జడలు, సువర్ణకిరీటము, చేతిలో-గొడ్డలి, చక్రము, మొలలో నాగాభరణము, బంగారు మొలనూలు ఇవన్నియు ఉండుటచే హరి హర స్వరూపములు రెండును అమరియున్నవి! ఆహా ఏమి ఆశ్చర్యము!

4. తిరుమళిశై ఆళ్వార్లు ప్రసాదించిన నాన్ముగన్ తిరువన్దాదిలోని "వేఙ్గడమ్విణ్ణోర్" అనే పాశురంలో- ఎల్లప్పుడును పరమపదవాసుని దివ్యమంగళ విగ్రహమును సందర్శించి, దివ్యానందము అనుభవించు పరమ పదవాసులగు నిత్యసూరులును, పరమప్రీతితో ఆశ్రయమిచ్చునది ఈ వేంకటాచలమని చెప్పియున్నారు.

5. నమ్మాళ్వార్లు ప్రసాదించిన తిరువాయ్మొళిలోని 'కణ్ణావాన్ ఎన్ఱుమ్' అనే పాశురంలో- ఈ భూలోకమునందలి సంసారులకును వైకుంఠమునందున్న నిత్యసూరులకును ఒకే విధముగ నేత్రపానీయుడై యుండు సర్వేశ్వరుడు, మిక్కిలి ఆశతోడ వచ్చిన నిత్యసూరులచేత సేవింపబడుచు శ్రీ వేంకటాచలమున వేంచేసియున్నాడు అని వివరించాడు.

6. కులశేఖరాళ్వార్లు రచించిన పెరుమాళ్ తిరుమొళిలో **ఊనేశెల్వత్తు** అనేపాశురంలో శ్రీవేంకటాచలమునందలి స్వామి పుష్కరిణిలో నివసించుభాగ్యముగల పక్షిగానైనను జన్మింప ఆశపడెదను అని తెలిపియున్నాడు.

7. పెరియాళ్వార్లు ప్రసాదించిన పెరియాళ్వార్ తిరుమొళినందు **మచ్చొడు మాళిగై** అనుపాశురమున యశోదాదేవి శ్రీకృష్ణుని ఏడ్పునుమాన్పి మల్లె మొదలగు మంచి మంచి సుగంధములు, రమ్యములునగు పుష్పములను తెచ్చి మాలగగట్టి నీకురులలో ముడిచెదను. మహోన్నతములగు దివ్యశిఖరములతో గూడి విరాజిల్లు శ్రీవేంకటాచలమున వేంచేసియున్న స్వామీ! వేవేగ దయచేసి రమ్ము అని.

8. ఆండాళ్ తల్లి ప్రసాదించిన నాచ్చియార్ తిరుమొళిలో **విణీలమేలాప్పు** అన్నపాశురమున-ఆకాసమంతయును నీలివితానమువలె వ్యాపించియుండు ఓమేఘములారా ఎచ్చట జూచినను స్వచ్ఛములగు పుణ్యతీర్థములతో నిండియుండు శ్రీవేంకటాచలమున నెలకొనియుండు మాస్వామి యగు శ్రియఃపతి, సమాన వర్ణులగు మీతోడ విచ్చేసిరా! అని ఆ వేంకటేశ్వరుని గూర్చి తపించుచున్నారు.

9. తిరుప్పాణాళ్వారు ప్రసాదించిన అమలనాదిపిరాన్‌లోని **అమలనాదిపిరాన్** అన్నపాశురమున- మిక్కిలి మనోజ్ఞములగు శ్రీమత్పాదారవిందములు స్వయముగనే విచ్చేసి, దర్శనమిత్తుమనుచున్నవనెను.

10. తిరుమంగై ఆళ్వారు ప్రసాదించిన **తాయేతందైయెన్ఱుం** అను పాశురంలో పాపాలు హరించి భవబంధాలు తొలగించి దరిజేర్చమని వేంకటగిరి దివ్యభోగమూర్తిని శరణుజొచ్చి ప్రార్థిస్తున్నాడు.

ఈ విధముగా భగవత్‌తత్త్వ అన్వేషణలో అగ్రస్థానాన్ని సాధించి భగవత్ కళ్యాణ గుణాల్ని దర్శించి ముక్తినిపొంది భారతీయ సంస్కృతికి ప్రధాన ఆరాధ్యదైవములై సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలచిన ఆళ్వారులను వారి ఆరాధ్యదైవమయిన శ్రీవేంకటేశ్వరస్వామిని మనసా, వాచా, కర్మణా ప్రార్థిస్తూ ఈ అవకాశం ఇచ్చిన తిరుమల తిరుపతి దేవస్థానం వారికి కృతజ్ఞతాసుమాంజలి అందిస్తూ సెలవు.

# శ్రీవేంకటేశ్వర ఆవిర్భావము

## -ఒక పురాణేతిహాస యాత్రాచరిత్ర

గోపీకృష్ణ

ఆదిశేషుడు తన సహస్రఫణులతో పరిసరాలన్నీ పరికించాడు. అన్నివైపుల నీరే కనుపడుతోంది. అతనికి ఏమీ అర్థం కాలేదు. తల భారమై దిమ్మెక్కిపోయింది. ఏం జరిగిందా? అని ఆలోచించగా జరిగిన సంగతులు ఒక్కొక్కటిగా గుర్తుకు రాసాగాయి. శ్రీహరి సాక్షిగా తానూ, వాయుదేవుడు తమలో ఎవరు బలవంతులమో యని పోటిపడి పందెం కాశారు. మహామేరు పుత్రుడయిన ఆనందుడు శ్రీహరి క్రీడాచలము. అతనిని చుట్టు కొన్నాడు ఆదిశేషుడు. ఉఫ్‌మని వూదాడు వాయువు. అంతే! క్రీడాచలముతో బాటు తాను ఆ సుడిగాలిలో ఎగిరినట్లు గుర్తు. ఆ తరువాత యిక్కడ యీ అనంత జలధిలో తేలియాడుతున్నాడు. మరి ఆనందుడెక్కడ? అవలోకించగా తన వేయిపడగల మీదే వున్నట్టు స్ఫురించింది. ఆ విధంగా అనంతుడు అతని మీద ఆనందా చలము యిద్దరూ కలిసి అనుకున్న లేదా అభిలషించిన చోటుకు రాగానే ముందుకు సాగనీయకుండా శివుడు, శ్రీకాళహస్తీశ్వరుడై ముక్కుల వద్ద కూర్చున్నాడు. ఆదిశేషుని ఉచ్ఛ్వాస నిశ్వాసములు శివునికి వీవనలై వీచసాగాయి. తదనంతర కాలములో అవి దీపకలికలై దేవాలయంలో నేటికీ జ్వలిస్తున్నాయి. శేషుని తోక వెనుకకు రానీయకుండా ఆ శివుడే శ్రీశైల మల్లిఖార్జునుడై అడ్డుకొన్నాడు. అటు-ఇటు కదలనీయకుండా నడుముపై నరసింహుడు అహోబల నవనారసింహులై కూర్చున్నారు. తలమీద భారము యిదివరకే క్రీడాచల రూపంలో వుంది. శేషుడైనా మాత్రం యికనేమి చేయగలడు? చివరకు అతడు కుండలినిగా రూపొందాడు. శ్రీశైలము మూలధారమై, త్రిపురాంతకం స్వాధిష్టానమై, మహానంది మణిపూరకమై, అహోబిలము అనాహతమై, పుష్పగిరి విశుద్ధమై, తిరుమల ఆజ్ఞా చక్రమై, నల్లమలకుండలిని భాసిల్లుతున్నది. ఇక శ్రీకాళహస్తి సహస్రారం. ఆ విధంగా శేషాచలం కొండలు రూపొందాయి.

మహాభారత యుద్ధం ముగిసినది. ద్వారకలో యాదవకులం వినాశనాన్ని కొని తెచ్చుకొంది. అందరూ మట్టిపాలయ్యారు. అనంతుని అంశయైన బలరాముడు సింధు సాగరముజొచ్చి తపస్సుచేస్తూ శేషశైలంలో కలిసిపోయాడు. యోగేశ్వరుడయిన శ్రీకృష్ణుడు అవతార సమాప్తికి సమాయత్తమయినాడు. కిరీటముతో సహా ఆభరణము లన్నియు తొలగించినాడు. సంస్కార హీనమయిన కేశములు అలాగే వదిలివేశాడు. పీతాంబరము, యజ్ఞోపవీతము తప్ప ఒంటిమీద ఏమీలేదు. సమీపారణ్యములోని బండమీద వెల్లకిలా పడుకొన్నాడు. అలవాటు కొద్దీ వామహస్తము ఊరువున చేర్చినాడు. లలితంగా పాదములు వూగిస్తున్నాడు. జర అను కిరాతుడు లేళ్లవేటకు బయలుదేరి కదులుతున్న కాలివ్రేళ్లను చూసి జింకచెవులుగా భ్రమించాడు. పూర్వ అవతారములో అనగా శ్రీరామావతారములో ఆయనచే చంపబడిన వాలియే తన కసిదీర్చుకోవడానికి యీ అవతారములో కిరాతుడై జన్మించాడని ఐతిహ్యం. వాని చేతిలో యాదవకుల వినాశనానికి కారణభూత మయిన ముసలవశేషము బాణ రూపం దాల్చి వున్నది. దానిని ప్రయోగించాడు. అది కృష్ణునికాలినిదాకి అవతార సమాప్తి గావించినది.

అవతల కృష్ణుని చూసి ఏమయిందిస్వామి! అని విలపించాడు. ఆయన చిరునవ్వుతో దక్షిణ హస్తముతో పాదాలు చూపిస్తూ తనువు చాలించాడు. ఉప్పెన వచ్చింది. ద్వారకానగరము దానిలో మునిగి పోయింది. ఉధృతమయిన ఆ ప్రవాహంలో బిగుసుకుపోయిన ఆ శరీరం తేలియాడే కళేబరమై దక్షిణయానం గావించింది. భీతిల్లిన ఎన్నో జలచరాలు ముఖ్యంగా సర్పాలు ఆ కళేబరాన్ని చుట్టుకొని అలాగే ప్రయాణించాయి. క్రమంగా కొన్ని వదలి పారిపోయాయి. చేతులకు చుట్టుకొన్న పాములు మృతి చెంది అలాగే వుండిపోయాయి. చేరవలసిన స్థానం చేర్చాక ప్రవాహం ఆగిపోయింది. ఉప్పెన వెనక్కు తగ్గింది. ఆ దివ్యశరీరం శేషాచలంలోని ఆదిశేషుని శిరస్సుమీద ఆనందనిలయంలో క్రమంగా శిలాతోరణం నుంచి జారుతూవచ్చి, కూరుకుపోయి కాలక్రమేణా శిలాజంగా మారిపోయింది. చేతులమీద పాములు కూడ అలాగే రూపాంతరం చెందాయి. క్రిములు దానిని సాలగ్రామ శిలగా మార్చివేశాయి.

ద్వాపరయుగం అంతమై కలియుగం ప్రారంభం అయిననాటి సంగతులవి. ఆ యుగాంత ఉప్పెన వచ్చినప్పుడు ఏర్పడిన శిలాతోరణాలు గోగర్భంలో చిన్నవి కనబడతాయి. 100 కోట్ల సంవత్సరాలనాటి పెద్ద శిలాతోరణం నారాయణగిరి దారిలోవుంది. శ్రీవేంకటేశ్వరుడుగా పిలువబడే ఆ స్వయంభువు మొదట అక్కడే వుండేవాడని అనేక మంది అంటూవుంటారు. నీరు తగ్గేసరికి బురదమట్టితో కూడిన ఆ శిలకూడ క్రమంగా జారి అన్నిటికంటే పల్లమయిన ఆనంద నిలయంచేరి పాదాలవద్ద పల్లం తగలడంతో అలాగే నిలబడి పోయింది. అయినా అది విగ్రహమని ఎవరికీ తెలియదు. ఏదో నిలువెత్తురాయి అనుకోవడం తప్ప. దానికి ఆచ్ఛాదనగా ఒక చింతచెట్టు, దాని ప్రక్కన కొన్ని సంపంగి చెట్లు మొలిచాయి.

నీరు పూర్తిగా యింకి పోయి ఏడు కొండలు బయటపడ్డాయి. కొండలు క్రింద నీరు ప్రవాహంగా మారి సువర్ణముఖీనది ఏర్పడినది. అంజనామాత నివాసం వల్ల అంజనాద్రి, వృషభాసురుని సంహారం వల్ల వృషాద్రి లేక వృషభాద్రి, నీలుడను వానర నివాసం వల్ల నీలాద్రి, శేషుని పోలికతో ఏర్పడడం వల్ల శేషాద్రి, గరుడ నివాసం వల్ల గరుడాద్రి, నారాయణుని పాదముద్రలవల్ల నారాయణాద్రి, వేంకటేశస్థానం వల్ల వేంకటాద్రి యిలా సహజ సిద్ధంగానే పేర్లు ఏర్పడినాయి.

జరుగవలసినదంతా ముందుగానే నిర్దేశింప బడినట్లు, విష్ణు పరివారమంతా క్రమంగా తిరుమల కొండలకు రాసాగారు. అంజనాద్రిలో తల్లివున్నా ఆంజనేయస్వామి జాబాలితీర్థంలో స్వయంభువుగా వెలిశాడు. గరుడాద్రివున్నా గరుడుడు సహజశిలాకృతితో తిరుపతి పట్టణాన్ని వీక్షిస్తున్నాడు. తొలి కనుమ రహదారిలో శ్రీ విఘ్నేశ్వర విగ్రహ సమీపంలో నుంచి పడమరవైపు చూస్తే శిఖరాగ్రం మీద యీ శిలాకృతి కనిపిస్తుంది. ఆ సంగతి తెలియజేసే సూచిక కూడా అక్కడ వ్రాయబడివుంది. ఇంతకూ గరుడుడు తిరుపతినే చూడటానికి కారణం? వేయి సంవత్సరాల క్రితము శ్రీవైష్ణవాచార్యుడయిన రామానుజుడు తిరుపతి పట్టణాన్ని సర్పభయంచే గరుడాకృతిలో నిర్మించడమే. తిరుపతి పట్టణంలో తన ఆకృతి ఎలా కనిపిస్తుందోనని చూసుకొంటున్నాడో ఏమోమరి? ఆ గరుత్మంతుడు.

క్షేత్రం-దర్శనం మాత్రము చేత పుణ్యము కలిగించునది కాగా తీర్థము స్నానమాచరించడం ద్వారా పుణ్యలోకములు, పవిత్రత, అభివృద్ధి కలిగించునది. ఈ శేషాచలము కొండలు క్షేత్ర మహిమ, తీర్థమహిమ, రెంటినీ కలిగివున్నవి. ఉప్పెన అంతరించి పోయిన తరువాత ప్రకృతి తన సహజస్థితికి తిరిగి కోలుకొనింది.. తొలుత వర్షాలు వచ్చి వుప్పుతో నిండిన ప్ర రితలమంతా శుభ్రపడగా మలివానలతో మంచినీటి మడుగులు, సెలయేర్లు, జలపాతాలు ఏర్పడి తీర్థరాజములయినవి. ఆంజనేయునికి ఆవాసమయిన జాపాలి అటువంటిదే. పైన ధృవకుండము, దాని క్రింద సీతాకుండము, దానిక్రింద రామకుండము. ఈ మూడు మూడంతస్తులుగా ఒకే లోయలో ఏర్పడినవి. ఒకటి నిండిన తరువాత మరొకటి నిండి సెలయేరుగా మారి కొంత దూరములో అంతర్గతమై ఆకాశగంగవైపు సాగిపోతుంది. ప్రకృతి రామణీయకతకు ప్రసిద్ధిగాంచిన యీ ప్రదేశాలు విష్ణు పరివారానికే గాక, తదితర దేవతలకు, మునులకు ఆవాసయోగ్యములై అలరారినవి. అన్నిటికంటే అగ్రభాగాన అనగా తలవైపు ఏర్పడిన జలపాతం తలకోన, దిగువన విడిపోయినట్టు వేరువేరుగా ఏర్పడినవి- వేయిలింగాల కోన, సదాశివకోన, కైలాసనాథకోన, ఈ మధ్యలో ఎన్నో 365 తీర్థాలంటారు. తిరుమల కొండల్లో యేర్పడిన ప్రతి నీటిమడుగు ఒక తీర్థమే.

కపిలతీర్థం ఆళ్వారుతీర్థంగా కూడపేరు గాంచినది. ఆ జలపాతం క్రిందికి దూకడానికి ముందు మూడు కుండాలు నిండి పొంగిపొర్లుతాయి. అందులో మొదటిది శక్రతీర్థము. ఆహల్యాసంగమ పాపం యిందులో మునిగిపోగొట్టుకున్నాడట ఇంద్రుడు. దానికి పైనున్నది విష్వక్సేన తీర్థము. వరుణుని కుమారుడయిన విష్వ క్సేనుడిక్కడ తపస్సుచేసి సేనాధిపతి పదవిపొందినాడు. ప్రస్తుతము ఆయన తలకోన దగ్గరలోని యుద్ధగళ్ల తీర్థం చేరినాడు. దానికి పైన పంచాయుధతీర్థం వుంది. సుదర్శనము, పాంచజన్యం, శార్ఙ్గము, కౌమోదకం, నందకం యిక్కడ చేరినవి. తదుపరి సుదర్శనుడు ఆలయమునకు వాయువ్యంగా నాగులబావికి సమీపంలోని చక్రతీర్థం చేరినాడు. పంచాయుధ తీర్థమునకు పైన అగ్ని తీర్థముంది. దానికి పైన బ్రహ్మతీర్థంవుంది. ఇది బ్రహ్మహత్యాది మహా పాతకములు తొలగించుటచేగాక బ్రహ్మకు ఆవాసమయినది. దీనికి పైన సప్తముని తీర్థములని యేడు తీర్థములున్నవి. ఈ విధంగా ఒక్క కపిలతీర్థప్రవాహమార్గములోనే సప్తదశ తీర్థములున్నవి.

సీతమ్మ సీతమ్మగానే వుండిపోయి, యిటు సీతా కుండములోను, అటు సీతమ్మధార తీర్థములోనూ వుంటోంది. విష్ణుపాదజనిత పావనగంగ ఆకాశగంగయై పేటిలోనుంచి చొచ్చుక వచ్చి భవిష్యత్తులో స్వామి అవసరాలు తీర్చడానికి సిద్ధంగావుంది. వీరందరి పసుపు కుంకుమలు పసుపు ధారలో చారలపేటిలో పదిలంగా వున్నాయి. శివుని ఆజ్ఞమేరకు కుమారస్వామి కుమారధార జలపాతంలో తపస్సుకు వుపక్రమించాడు. ఆయన పేర వెలిసిన స్వామి పుష్కరిణి వరాహపుష్కరిణితో కలిసి విశాల మవడానికి వుద్యుక్తమవుతోంది. వైతరణి స్వామి పాదాల క్రిందికి వచ్చింది.

శ్వేత వరాహ కల్పం నుంచి భూదేవిని పొదివి పట్టుకొని తన అదుపులో వుంచుకొని కాపాడు తున్నాడు

ఆది వరాహమూర్తి. ఇప్పుడు కూడ ఆ పనిలోవుండి సర్వం పర్యవేక్షిస్తున్నాడు. ఆయన స్థావరం అక్కడే ఆ పుష్కరిణి గట్టుమీదే వుంది. గోవులు గోపాలురు గోగర్భం చేరినారు. సనక సనందనాదులు పాపవినాశ తీర్థ సమీపంలోని సనకసనంద తీర్థం చేరినారు. తులసీమాత గజేంద్రమోక్షం ప్రాంతం (ప్రస్తుతం వైకుంఠము క్యూ కాంప్లెక్స్) చేరినది. తుంబురు నారదులు తమ ఈర్ష్యా ద్వేషాలు కట్టిపెట్టి తుంబురు తీర్థం చేరినారు. రామకృష్ణతీర్థం తపోభూమిగా మునిజనుల నాకర్షింపసాగినది. వైకుంఠ తీర్థం వైకుంఠగుహ సమీపంలో పాచికాల్వ చివరలో వుంది. అస్థితీర్థం అనగా తొండమానుని నిర్లక్షంతో చనిపోయిన బ్రాహ్మణస్త్రీ ఆమె కుమారుని బ్రతికించిన తీర్థం ఎగువన, దేవస్థాన ఉద్యోగుల క్వార్టర్స్‌దగ్గర వుంది. ఫల్గుణీతీర్థం పాపవినాశం, సనక సనందాది తీర్థముల సమీపములోనే ఉన్నది. గోగర్భమునకు పాండవతీర్థమని మరోపేరు. దేవతీర్థం నారాయణగిరి దారిలో ప్రస్తుత గంగమ్మగుడి సమీపమున ఆలయానికి పశ్చిమ వాయువ్యంగా గిరిగుహలో వుంది. కాయరసాయనతీర్థం అని మరోతీర్థం కూడా పురణాలలో ప్రస్తావించబడినది. ఈ అన్ని తీర్థాలు అన్నీ ఒకేలా అతిసాధారణంగా వుంటాయనుకోవడానికి, అన్ని జలపాతాలు ఒకటే ననుకోవడానికి వీలులేదు. అన్నిటికంటే అద్భుతమయినది, అసలుదారి లేనిది, కూర్చుని, గుండురాళ్లమీద, అవిదొర్లకుండా లోయలోకి దిగవలసినది శేషతీర్థం. లోయలో దిగిన తరువాత అభిముఖంగా నడుస్తూ మధ్య మధ్యలో నున్న నీటిగుండాలు యీదుకుంటూ గుహలోకి ప్రవేశిస్తే గుండెనిబ్బరం కోల్పోయే దృశ్యం కనబడి శరీరం గగుర్పాటు చెందుతుంది. మననెత్తిన విశాలమయిన పడగ, పాముగుండ్రంగా చుట్టుకుని పడగ పైకెత్తినట్టు ప్రకృతి సిద్ధంగా ఏర్పడిన శిలాకృతి. పాము చుట్ట మధ్యలో నీటిగుండం చిన్నదేననిపిస్తుంది. కానీ ఈదితే తెలుస్తుంది దాని పొడవు, అవతలకి చేరడానికి అలసి పోతాం కానీ చేరి అవతలనున్న నాగబింబం తాకితేగాని తీర్థయాత్ర పూర్తిగాదు. యాత్రలో ఎక్కడో ఒకచోట పాము కనబడాలట. సామాన్యంగా ఆ లోయలో ఎరుపు పసుపు పట్టీలుగల చిన్న పాములు కనబడుతూ వుంటాయి.

మరొక అద్భుతం సీతమ్మ ధార. పేటిలో ఒక రంధ్రం వుంటుంది. అక్కడొక వెదురుబొంగు, కొసన ఈతాకు కట్టినది, వుంటుంది. దానిని రంధ్రంలో వేసి కొట్టితే అది కొద్దిపాటి నీటిని లాక్కొస్తుంది. దానిని చల్లుకోవాలి. దాదాపు పది అడుగుల బొంగు దూర్చితే అందులో నీరుంటుందని ఎవరు కనిపెట్టారో ఏమో? కొట్టినవారికి నీరు రాకపోతే పాపాత్ముల క్రింద జమ.

రామకృష్ణ తీర్థం ప్రయాణం కర్రలమీద దోగుతూ గూటాలు పట్టుకొని లోయలోకి దిగాలి. కుమారధార తీర్థంలోకి నిట్ట నిలువు నిచ్చెనమీద గొలుసులు పట్టుకొని దిగాలి. తీరా యింత కష్టపడ్డాక జలపాతం వుంటే అద్భుతం, అదృష్టం. కొద్ది చుక్కల నీరు లభ్యమయితే ఆనందం. అవికూడా లేకపోతే మన దురదృష్టం. ఒక సుందర అద్భుత దృశ్యం మిగులుతుంది. తిరిగిపై కెక్కాలిగదా అని ఆలోచనవస్తే విషాదం. పసుపుధార ఆ ప్రక్కనే, అదీ అంతే.

ఇవన్నీ ఒక ఎత్తు. యుద్ధగళ్ళ తీర్థం ఒకటే ఒక ఎత్తు. తిరుమల మైక్రోవేవ్ స్టేషన్ మీదుగా లోయలను

దిగుతూ ఎక్కుతూ, ఒకరిద్దరు దారితెలిసిన గిరిజనులను తీసికొని, మనమొక గుంపుగా చేరి ఇరవైమైళ్ళకు పైగా ట్రెక్కింగ్ చేస్తే విశాలమయిన బండలమీద ఎప్పుడో యుద్ధం జరిగినట్లు సూచించే జంతువుల అడుగులు, చిందరవందరగా ఒకదాని మీద ఒకటి శిలాజాలైనాయి. అన్ని జంతువులు ఒకేచోట ఎలాచేరాయా అని ఆశ్చర్యంలో మునిగిపోతామని చూచివచ్చినవారు చెప్పారు. అక్కడ ప్రాచీన శిలాయుగంనాటి చిత్రలేఖనం- జంతువులు, వాటివేట దృశ్యాలు అబ్బుర పరుస్తాయట. వేటకుపయోగించిన శిలాయుధాలు కూడ కొన్ని దొరికాయట. మొజాయిక్ అడ్వంచర్ కమ్యూన్‌వారు శ్రీబి.వి. రమణ నాయకత్వంలో యీ పుణ్యం కట్టు కొన్నారు. దానిని ఆంధ్రజ్యోతి ఫోటోలతో సహా ముద్రించి ఆ తీర్థరాజాన్ని వెలుగులోకి తెచ్చింది. లేకపోతే దానిని గురించి అనుకోవడమేగాని చూసి చెప్పినవారులేరు.

మరొక విచిత్రతీర్థం నామాలగవి. ముఖద్వారం చంద్రగిరి లోయను చూస్తుంది. లోపల ప్రవేశిస్తే ఐస్‌కూల్, క్రింద అడుగు బెట్టడానికి భయమేస్తుంది. నీటి కుండాలు అక్కడక్కడ వున్నాయి. పైకి చూస్తే స్ఫటికం సున్నం కలిసి స్తంభాలుగా జారి తెల్లగా మిలమిలలాడి పోతుంది. ఆ సహజసిద్ధ ఊడలు లాంటి విన్యాసాలు గుహంతా వ్యాపించి వుంటాయి. బెల్లం గుహలు గుర్తుకొస్తాయి. తిరుమల కొండల్లో యింతటి అద్భుతం ఎవరూ వూహించి వుండరు. పేరుకు తగ్గట్టుగా నామాలు పెట్టుకోవడానికి వివిధ రకాల శ్రీచూర్ణాలు యిక్కడి గోడలలో గోకుకోవచ్చు. వైష్ణవులు పెట్టుకొనే ఎఱ్ఱని శ్రీచూర్ణం. తెల్లని నాముకొమ్ము పొడి. వైఖానసులు పెట్టుకొనే పసుపు చూర్ణం, మాధ్వులు పెట్టుకొనే నల్లని చూర్ణం అన్నీ యీ నామాలగవిలో స్వతస్సిద్ధంగా లభ్యమవుతాయి. ఆకాలంలో రసాయనాల తయారీ లేదుగాన భగవంతుని సేవించాడానికి యీ తిరునామ సామాగ్రి తనంతట తానుగ తిరుమల చేరినట్టయింది.

విష్ణుపరివారం, దేవతలు, పంచాయుధాలు అందరూ శేషాచలం కొండలు చేరారుకానీ, అవ్యక్తంగానే వుండి పోయారు. ఏదో ఆవిష్కారముకాబోతున్న శుభగడియ కోసం నింపాదిగ నిరీక్షిస్తూ అజ్ఞాతంగానే వుండి పోయారు. చెట్టులో చెట్టుగా, పుట్టలో పుట్టగా, ఆకులో ఆకుగా, పూవులో పూవుగా మారి చివరికి రాయిరప్పగా యీదివ్య శక్తులు రూపొందడంతో యీ శేషాచల అరణ్యాలు పవిత్రంగా పరిణమించి, పునీత భావాలు వెదజల్లడంతో ఆ సంగతి గ్రహించిన దివ్యజ్ఞానులు ఆ కొండలమీద అడుగు మోపడానికి సందేహించి మోకాళ్ల మీద నడిచారు. అట్టివారిలో ఆళ్వారులు,రామానుజాచార్యులు, హత్తీరాంబావాజీ ముఖ్యులు. మొదటి ఘాట్‌రోడ్డు చంద్రగిరి దృశ్యం దగ్గర మోకాలినెట్టు అనబడు కొండమీద అలా నడిచారువారు.

తింత్రిణీ వృక్షఛాయ క్రింద, మాను సంపంగి వృక్షాల సరసన నిలువెత్తుగా నిలబడివున్న స్వామి అర్చావ తారమూర్తి అవ్యక్తంగానే వుండగా, ఆ పట్టిన బురద మట్టికి తోడు మరింత మట్టి పైకెగబడి వల్మీకంగా మారి గంభీరంగా కనపడసాగింది. పదిహేనుడుగుల పైబడిన యీ పుట్టను చూసి పరిసరంలోని ఆటవికులు అద్భుతంతో కూడిన భక్తిభావంతో అర్చింపసాగారు. నామాలగవిలోని నానావిధ చూర్ణాలు పసుపు కుంకుమలై, కీకారణ్యం లోని ఆకులలుములు, వివిధ రకాల పుష్పాలు, పుట్టకు అలంకారాలయి, అనేక జంతుమాంసాలు నైవేద్యాలయి,

వారు జరిపిన జాతరలే బ్రహ్మోత్సవాలయి, కులపెద్దలే ప్రధాన అర్చకులై జరుగుతూ వచ్చిన యీ పూజా విధానము కొన్ని వందల సంవత్సరాల పాటు కొనసాగింది. ఆ కాలగమనంలో చింతచెట్టు ఎండి పోయింది. సంపెంగ చెట్లు మోడువారాయి. ఆ వల్మీకం ఎండావానలకు ప్రకృతి భీభత్సాలకు ఆచ్ఛాదనలేని దయి క్రమంగా తరిగిపోసాగింది. అయినాగానీ పూజలు కొనసాగుతూనే వున్నాయి- పుట్టలో ఏముందో తెలియకుండానే. అందులో సాలగ్రామ శిలాజ శ్రీకృష్ణుడు శ్రీవేంకటేశ్వర నామధేయంతో అర్చావతారంగా అవతరించివున్నాడని అప్పటికి ఎవరికీ తెలియదు.

ఈ పుట్టలోని స్వామి శ్రీకృష్ణభక్తుడైన వైఖానస గోపీనాథుడికి ఒకసారి కలలో కనబడి తానిప్పుడు శేషాచల పర్వతము మీద వున్నానని తనను కనిపెట్టి పూజ చేయమని, పూజ చేయుటలో రంగదాసుడను శూద్రుడు కూడా సహకరిస్తాడని చెప్పాడు. ఆ విధంగా గోపీనాథుడు రంగదాసుడు యిద్దరూ కలిసి పుట్టలోని స్వామిని కనిపెట్టి శుభ్రపరచి పూజచేయసాగారు. రంగదాసుడొకనాడు పూజలో నిర్లక్ష్యం చూపగా, విగ్రహం నుంచి శ్రీనివాసుడుగా వెలికి వచ్చిన స్వామి రంగదాసుని శపించి, ఆగ్రహం తగ్గాక మరుసటి జన్మలో చక్రవర్తిగా పుట్టులాగున శాపాన్ని సవరించాడు.

స్వామి పుష్కరిణి గట్టుమీద భౌతిక శరీరాన్ని విసర్జించిన రంగదాసుడు, మరుసటి జన్మలో ఆకాశరాజుకు తమ్ముడిగాపుట్టి తొండమాను చక్రవర్తిగా ప్రసిద్ధిగాంచాడు. పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం తరువాత ఆయనే తిరుమలలో శ్రీవేంకటేశ్వరునికి తొలి ఆలయం నిర్మించాడు. ఈ ఐతిహ్యం క్రీ.పూ. 3000 సం॥ నాడు జరిగినదిగా భావించవచ్చు.

తొలుత స్వామిని ప్రచారంలోకి తెచ్చినవారు ఆళ్వారులు. పన్నిద్దరు ఆళ్వారులలో పదిమంది ఆళ్వారుల స్వామిని ఆయన ప్రశస్తిని పాశురాలలో శ్లాఘించారు. అవన్నీ నాలాయిర దివ్యప్రబంధంలో వున్నాయి. వాటిని విని పల్లవ సామంతరాణి సమావై యాత్ర చేసి క్రీ.శ. ఏడవ శతాబ్దంలో భోగశ్రీనివాసమూర్తివెండి విగ్రహాన్ని వెలయింపజేసింది.

స్వామికి కైంకర్యం చేసిన రాజ వంశాలలో పల్లవులు, బాణులు, చోళులు, పాండ్యులు, యాదవులు ముఖ్యులు, వీరందరికి మించిన సేవలు విజయనగర చక్రవర్తులు అందించారు. క్రైస్తవులు, ముస్లిములు మత భేదం లేకుండా స్వామికి ధనకనకవస్తు వాహనాదులు దానం చేశారు. మరాఠావీరుడు రాఘోజీభాంస్లే స్వామికి చేయించిన నగలు ఒక పెట్టెనిండా వున్నాయి.

ఎందరో మహానుభావులు- గుడులుకట్టినవారు. మరమ్మతులు చేసినవారు, సేవలందించినవారు, పూలు పండించినవారు, పాటలు రాసినవారు, పాడినవారు, కావ్యాలు రాసినవారు- అందరికీ వందనాలు.

# శ్రీవేదాంతదేశికులు దర్శించిన శ్రీవేంకటేశ్వర వైభవం

-డా॥ ఇ. చంద్రమౌళి

భక్తులద్వారానే భగవంతుని వైశిష్ట్యం ప్రబలమౌతుంది. ఆ భక్తికి భాషాభేదం లేదు. భక్తి భావప్రధాన మైంది. కానీ మహాభక్తులు అనుభవించిన దివ్యానుభూతుల్ని తరువాతి తరాలవారికి అందివ్వవలసిన అవసరం ఉంది. అందుకు భాష అవసరం ఎంతైనా ఉంది. ఈ సందర్భంలోనే వస్తాయి ఆళ్వార్లు, ఆచార్యులవంటి వారి రచనలు.

శ్రీవైష్ణవ సంప్రదాయంలో ఎందరో ఆచార్యులున్నాకూడా శ్రీరామానుజాచార్యులు మధ్యమణిలాగా అగ్రగణ్యులుగా వెలుగొందారు. ఆయన ప్రవచించిన విశిష్టాద్వైత శ్రీవైష్ణవ సంప్రదాయాన్ని అన్ని విధాలా రక్షించి, పోషించిన కీర్తి శ్రీవేదాంతదేశికులకే దక్కుతుంది.

వేదాంతదేశికుల అసలు పేరు "వేంకటనాథుడు". నామధేయంకన్నా బిరుదునామమే ప్రసిద్ధివహించింది. శ్రీ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలలో చివరిరోజు, అంటే బాధ్రపదమాసం శ్రవణనక్షత్రంనాడు చక్రస్నానం జరుగుతుంది. క్రీ.శ. 1268-69లో అదేరోజు వేదాంతదేశికులు జన్మించారు. ఆ కారణంగానే ఆయనకు వేంకట నాథుడని నామకరణం చేయడం జరిగింది. "దయాశతకం" 104వ శ్లోకంలో శ్రీశ్రీనివాసుడే తనకు వేదాంత దేశికుడన్న బిరుదు ప్రసాదించినట్లు పేర్కొబడింది. శ్రీనివాసుని దయచేతనే తాను రచనలు సాగించినట్లు దేశికులు పేర్కొన్నారు. స్వామి చేతిలో తాను వీణవంటివాడనని ఆయనే చెప్పారు.

**వేదాంతదేశికపదే వినివేశ్య బాలమ్ । దేవో దయాశతకమేతదవాదయన్ మామ్ ।**
**వైహారికేన విధినా సమయే గృహీతమ్ । వీణావిశేషమివ వేంకటశైలనాథః ॥**

శ్రీదేశికులు చిన్నవి, పెద్దవి వందకుపైగా రచనలు చేశారు. ఆయన రచనల్ని శాస్త్ర, స్తోత్ర, కావ్య, సంప్రదాయ సంబంధమైనవిగా వర్గీకరించవచ్చు. అందులో సంప్రదాయసంబంధ రచనలుమాత్రం మణి ప్రవాళరీతిలో రచింపబడినాయి. మిగిలినవన్నీ సంస్కృతంలో రచింపబడినాయి.

శ్రీదేశికులు ఎన్నో తీర్థయాత్రలు చేశారు. అందులో తిరుమలయాత్ర ముఖ్యమైనది. ఆ యాత్ర వివరాలు "వేదాంతదేశిక వైభవప్రకాశిక" అన్న గ్రంథంలో పేర్కొబడినాయి. ఆ గ్రంథాన్ని దేశికులకు దాదాపు 300 సంవత్సరాల తరువాతికాలానికి చెందిన మహాచార్యులు అనే దొడ్డయాచార్యులు రచించారు. ఈ గ్రంథం సంస్కృతంలోనూ, మణిప్రవాళంలోనూ ఉంది. దొడ్డయాచార్యులు క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందినవారు. వీరు అప్పయ్యదీక్షితులకు సమకాలికులు.

శ్రీవారి ఆలయనిర్మాణంలో కాలక్రమంలో ఎన్నోమార్పులు చోటుచేసుకున్నాయి. ఆయాకాలంలోని

రాజులు ఎన్నో మండపాలు, ప్రాకారాలు నిర్మింపజేసి తమ భక్తిని చాటుకున్నారు. ముఖ్యంగా చెప్పాలంటే వేదాంతదేశికుల అనంతరం విజయనగరపాలకులు తిరుమలమందిరంలో ఎన్నో నిర్మాణాలు చేపట్టారు. ఎంతగానో అభివృద్ధిచేశారు. ఈ కారణాలవల్ల ఆలయస్వరూపంలో మార్పులురావడం సహజం. కాని స్వామి వారి వైభవంలోను, దివ్యమంగళ విగ్రహస్వరూపంలోనూ, ఆయనశక్తిలోనూ ఎలాంటిమార్పు లేదు. పైగా దినదినప్రవర్ధమానమౌతూనే ఉంది.

వేదాంతదేశికుల తిరుమలయాత్రను వర్ణించడంవల్ల దైవదర్శనానికున్న సంప్రదాయమైన ఒక పద్ధతి స్పష్టమౌతుంది. అంతేకాకుండ ఒక మహానుభావుని యాత్రగురించి చదివినా, విన్నాకూడా సాక్షాత్తు భగవంతుని దర్శించుకొన్న ఫలితంగాకూడా భావించడం సహజం. దేశికులు వేంకటేశ్వర దర్శనసమయంలో పొందిన అనుభూతి మనకూ అనుభవానికి వస్తుంది. ఆ పద్ధతిని పరిశీలిద్దాం.

తిరుమల శ్రీనివాసుని దర్శనార్థం విచ్చేసిన వేదాంతదేశికులు ముందుగా స్వర్ణముఖీనదిలో స్నానం ఆచరించారు. తిరుమలకొండ ఆదిశేషుని అవతారం కాబట్టి కొండకు ప్రణామాలు సమర్పించారు. గోవింద రాజస్వామివారిని దర్శించుకొని తరించారు. కపిలతీర్థాన్ని వైష్ణవులు ఆళ్వారుతీర్థం అంటారు. ఆ తీర్థంలో స్నానంచేసి అక్కడి ఆళ్వారును దర్శించుకున్నారు. అక్కడనుండి కొండకింద (అలిపిరిదగ్గర) ఉన్న నరసింహ స్వామికి నమస్కరించారు. కాలిదారిలో ఉన్న మరో నరసింహస్వామిని దర్శించుకొని తిరుమల శిఖరం చేరుకున్నారు.

ఆనందనిలయ దివ్యవిమానాన్ని చూడగానే తన్మయంచెంది భక్తిపూర్వకంగా ప్రణామాలాచరించారు. వైకుంఠద్వారం చేరుకొని సాష్టాంగనమస్కారంచేశారు. ఆలయం వెలుపలే ప్రదక్షిణగా స్వామివారి పుష్కరిణి చేరుకున్నారు. పుష్కరిణిలో స్నానమాచరించారు. పుష్కరిణి వాయవ్యమూలలోని వరాహస్వామివారికి చేతులు మోడ్చి నమస్కరించారు.

అక్కడనుండి ఆలయప్రవేశంచేసి భగవదంశయైన స్థలవృక్షానికి మ్రొక్కుకున్నారు. తిరుమల స్థల వృక్షం చింతచెట్టు. ప్రస్తుతం కనిపించదు. 13వ శతాబ్దిలో ఉన్నట్లుంది. ఆ వృక్షం ధ్వజస్తంభానికి ఉత్తరం వైపు ఉంది. స్థలవృక్షందగ్గరనుండి బలిపీఠం సమీపించి ప్రణామంచేశారు. అక్కడనుండి చంపకప్రాకారాన్ని (సంపంగి ప్రదక్షిణం) ప్రదక్షిణగావచ్చి లక్ష్మీ అంశ అయిన చంపకవృక్షాన్ని దర్శించుకున్నారు. ధ్వజస్తంభానికి దక్షిణంగా చంపకవృక్షం ఉండినట్లుంది. రెండువైపులా రెండు చంపకవృక్షాలుండినట్లు సంప్రదాయజ్ఞులు చెబుతారు.

అక్కడనుండి వరుసగా ఆస్థానమండపం, చందనశాల, ఉపదంశశాల, వాహనశాల, తండులశాల, ముద్గ, ఘృత, తైల, గుడ, చర్కర, మరీచి, ఇంగువ మొదలైన సంబరశాలలను దర్శించుకుంటూ ఉత్తర దిక్కులోని వంటశాల (వడక్కుతిరుమడై పళ్లి)లోని అమ్మవారిని (పోటుతాయార్) దర్శించుకున్నారు. స్వామి

వారి ప్రసాదాలకు వినియోగించే వస్తువుల శాలలు కాబట్టి అవి కూడా పూజనీయాలే. ఆ వంటశాలకు ఆను కొని ఉన్న శ్రీకృష్ణుని (యమునైత్తురైవన్) దర్శించుకున్నారు. ఈ స్థలానికాపేరు రామానూజాచార్యుల పరమ గురువు యామునాచార్యుల పేరుమీద వచ్చింది. ఆ మండపంలోనే పుష్ప మాలలు సిద్ధంచేస్తారు. ఇదే "పూల అర." పూల అర నుండి మరలా పుష్కరిణికి చేరుకొని అక్కడ నుండి ప్రదక్షిణగా స్వర్ణమండపాన్ని పక్కనున్న రంగనాయకమండపాన్ని దర్శించుకున్నారు. ముందు దర్శించుకున్న చంపకవృక్ష సమీపంలోని ద్వారానికి నమస్కరించి లోనికిప్రవేశించారు. అక్కడ నుండి ప్రదక్షిణగావచ్చి పెద్దవంటశాల (పెరియతిరుమడై పల్లి) చేరుకొని, అక్కడున్న అమ్మవారికి ప్రణామాలు చేశారు. ఆమే వకుళాదేవి. అక్కడనుండి యాగశాలను దర్శించు కొని, దివ్యవిమాన శ్రీనివాసునికి దండాలుపెట్టి, ఆనందనిలయ విమానాన్ని కళ్లారాదర్శించి తన్మయులైనారు.

అక్కడనుండి సేనానాధుని సన్నిధికి (విష్వక్సేనుడు) చేరి నమస్కరించారు. అక్కడ నుండి చాలా ముఖ్యమైన స్థలం చేరుకున్నారు. అదేభాష్యకారుల సన్నిధి. అజ్ఞానంలోనుంచి జ్ఞానమార్గం చూపేవాడు గురువు. ఆ గురువుచూపిన మార్గంలో అడుగుపెట్టేముందు ఆయన అనుమతి తీసుకోవడం శిష్యుని కర్తవ్యం. ఇది ఏ విషయానికి సంబంధించిందైనా సరే. వైష్ణవసంప్రదాయానికే పరమాచార్యుడైన రామానుజాచార్యుల సన్నిధి అది. ఆయనకు మరీ మరీ నమస్కరించి ఆయన అనుమతితో వేదాంత దేశికులు ముందుకు నడిచారు. అక్కడనుండి సమీపంలోని నరసింహస్వామికి నమస్కరించారు. అదే యోగనరసింహస్వామి మందిరం. అక్కడనుండి "జయించి మాలవేసినమండపం" (వెన్టుమాలయిట్టన్ మండపం) లోనికి ప్రవేశించి గరుత్మంతుని; జయ, విజయులను దర్శించి, ప్రణుతించి, వారి అనుమతితో లోనికి ప్రవేశించి, శ్రీరామచంద్రుని (చక్రవర్తి త్తిరుమగన్) దర్శించుకొన్నారు. దానినే "రాములవారిమేడ" అంటారు. అక్కడినుండి "కులశేఖరపడి" (గడప) దగ్గర నిలబడి గర్భాలయంలో భగవంతుని దర్శించుకొన్నారు.

. శ్రీవేంకటేశ్వరస్వామి దివ్యమూర్తిని శ్రీవేదాంతదేశికులు పాదాదికేశం, కేశాదిపాదం దర్శించుకొన్నారు. ఆ క్రమం ఇలా ఉంది. మొదట పాదం (తిరువడి), పాదాలకు అలంకరింపబడిన గజ్జలు, అందెలు; మోకాళ్లు, ఊరుప్రదేశం,' కటిప్రదేశం, పీతాంబరం, దానిమీద వేలాడుతున్న మనోహరమైన మాలలు, ఉదరబంధం, తులసిమాల, నాభిప్రదేశం, సౌందర్యం తొణికిసలాడే పతకాలు, మణిమాలతో కూడిన విశాలవక్షస్థలం, యజ్ఞోప వీతం, కౌస్తుభమణి, శ్రీవత్సం, వక్షస్థలంలో నెలకొన్నమహాలక్ష్మి (అలిమేలు మంగమ్మ), పులిగోర్లు, కంఠసరి, కల్పవృక్షశాఖలను పోలిన నాలుగుభుజాలు, తన పాదద్వయాన్ని చేరడమే ఉపాయం (శరణాగతి) అన్నట్లు పాదాలవైపు చూపుతున్న కుడిహస్తం (వైకుంఠహస్తం), ఆ హస్తానికున్న స్వర్ణకంకణం, దానిలో పొదిగించి ఉన్న మణుల సౌందర్యం, భుజకీర్తులు, భుజసౌందర్యం, తన చరణాల నాశ్రయిస్తే సంసారసాగరం నడుంలోతే అన్నట్లు నడుంవైపు చూపుతున్న ఎడమచేయి (కటిహస్తం), ఆ హస్తానికున్న దివ్యాభరణాలు, మిగిలిన రెండు

చేతుల్లో శంఖ చక్రాలు, ఆ చేతుల ఆభరణాలు, మందస్మిత వదనారవిందం, పగడంవంటి పెదాలు, దీర్ఘనాసిక, సుదీర్ఘ కరుణాకటాక్షాలు, దానికి తగ్గట్లున్న చెక్కిళ్ళు, పవిత్రమైన నొసటిప్రదేశం (తిరునెత్రి), అక్కడున్న నామం (తిరునామం), మకర కుండలాలు, చెవి ఆభరణాలు, చెవిలోని పుష్పాలు, ఆధిరాజ్య సూచకమైన నవరత్నఖచిత మకుటం (తిరుఅభిషేకం), ఇది పాదాదికేశం. అదేవిధంగా కేశాదిపాదంగా దర్శించి భక్తిపార వశ్యంలో మునిగిపోయారు. నేడు అన్ని సౌకర్యాలతో తిరుమలచేరి స్వామి దర్శనం చేసుకుంటే సామాన్యునికే తృప్తితో హృదయం ద్రవించిపోతుంది. అలాంటిది ఒక మహాభక్తుడు పరమభాగవతుడు అయిన వేదాంత దేశికుడు, దాదాపు 700 సంవత్సరాలకు పూర్వం, ఏ సౌకర్యమూ లేని రోజుల్లో స్వామిని దర్శించుకున్న ఆయన అనుభూతి వర్ణింపనలవికానిది. ఆ స్థితిలోనుండి ఉద్భవించిందే "దయాశతకం".

వేదాంత దేశికులు పరమప్రామాణికులు. ఆయన దివ్యచరిత్ర అంతకన్నా పవిత్రమైంది. ఆయన శ్రీవారిని దర్శించుకొన్న విధానాన్ని, దొడ్డయాచార్యులు భక్తిప్రపత్తులతో వర్ణించారు.

# శాసనాలలో వేంకటేశ్వరుడు

- డా॥ కోరాడ రామకృష్ణ

తిరుమలక్షేత్రం జగత్ప్రసిద్ధం. ఇచట నెలకొన్న అర్చామూర్తి శ్రీవేంకటేశ్వరుడు. ఇచట వెలసిన వేంకటేశ్వరుడు స్వయంభువు. కలియుగంలో మానవాళి సముద్ధరణకోసం వేంకటేశ్వరునిగా అవతరించాడని పురాణాలు ఉద్ఘాటిస్తున్నాయి. భారతదేశంలో అత్యంత ఎక్కువ భక్తులువచ్చి స్వామివారిని దర్శించుకొని పునీతులౌతున్న పుణ్యక్షేత్రాలలో ఇది మొదటిది. ఆలయ ప్రాచీనత ఊహకందని విషయం.

మనకు తెలిసినంతవరకు వేంకటేశ్వరుని గురించిన ప్రశంస మొదట తమిళ సంఘం వాఙ్మయంలో అకనానూరులో కనిపిస్తుంది. ఆ తరువాత శిలప్పదికారంలోకూడా ఉన్నది. మాంగాడు నివాసి అయిన ఒక యాత్రికుడు దారిలో కోవలన్ అనే యాత్రికునితో సంభాషణ సందర్భంలో అతను వైష్ణవ దేవాలయాలను దర్శిస్తూ వేంగడాన్ని గురించి ఈ విధంగా వర్ణిస్తాడు- గలగలధ్వనులతో జలజల జాలువారే సెలయేళ్ళు ప్రవహిస్తున్నట్టి వేంగడపర్వతంమీది ఎత్తైనకొండశిఖరంపై వేంచేసిన నీలమేఘశ్యాముడు కాంతులతో శోభలీనుతూ భక్తులకు సంతోషాన్ని కలగజేస్తున్నాడు. పుష్పమాలాంకృతుడు, పీతాంబరధారియైన స్వామి ఒక హస్తంలో శంఖం, మరొకహస్తంలో సుదర్శన చక్రాన్ని ధరించి ఉన్నట్లు వర్ణించాడు. ఈ కథనం ప్రకారం, ప్రాచీనకాలంలోనే తిరుమల దేవాలయం వైష్ణవులకు అత్యంత పవిత్రమైన వైష్ణవపుణ్యక్షేత్రంగా, దర్శనీయ స్థలంగా పరిగణింప బడినట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ పుణ్యక్షేత్ర ప్రఖ్యాతి దూరతీరాలకు వ్యాపించింది. క్రీ.శ. ఒకటి, రెండు శతాబ్దాల కాలంనాటికే ఈ క్షేత్రం ప్రసిద్ధిచెందిందని తెలుస్తోంది. పురాణాలలో వేంకటేశ్వరుని గురించి వివరాలు ఉన్నప్పటికీ వాటిలో ఏకవాక్యత లేదు. ఈ విషయాన్ని క్రీ.శ. 17 వ శతాబ్ది కాలపువాడైన శ్రేష్ఠలూరి వేంకటార్యుడు తాను రాసిన శ్రీనివాసవిలాస సేవధి అనే ద్విపదకావ్యంలో-

**"శేషాచలోరు వైభవము**

**ప్రకటితాలంకృతాలంక్రియాస్పద వర్ణనలను**

**..................................................**

**వారాహ వామన బ్రహ్మాండ పాద్మ**

**గారుడ స్కంద మార్కండేయ ముఖ్య**

**బహుపురాణోక్తి సంబంధంబు వలన**

**గాహనమై పెనుగొన్న కథ చిక్కుదీర్చి"**

శ్రీనివాసుని కథను వేంకటాద్రిమాహాత్మ్య మింపొందునట్లుగా 'శ్రీనివాసవిలాస సేవధి' రచించినట్లు చెప్పుకున్నాడు. కాబట్టి పురాణాలలో ఏకవాక్యత కనిపించదు, ఇతివృత్తంలో పొంతన కనబడదు. కాని శాసనాలలో

ఇతివృత్తాన్ని ప్రశ్నించే అవకాశమేలేదు. కార్యకారణసంబంధం ఉంటుంది. ఇక్కడ శాసనం గురించి కొంచెం చెప్పాలి. శాసనశబ్దం ప్రాచీనకాలంనుండి వ్యవహారంలో ఉంది. శాసనం అంటే ఆజ్ఞ, పాలన లేదా రాజు చేసిన దానంపై రాసిచ్చిన కవులుచట్టం అనే అర్థాలున్నాయి. ఆక్స్‌ఫర్డ్ నిఘంటువులో దీనికి Words inscribed especially on a monument, coin, stone or in a book etc., అనే అర్థం ఉంది. రాజ్యాన్ని నడిపేందుకు అవసరమయ్యే కార్యవ్యవహారాలకై చేసిన ఆజ్ఞలు నిరూపణలో, రాతలో పొందుపరచ బడినాయి. ఆ విషయాలు జన బహుళ్యానికి తెలపడంకోసం లేదా ప్రాచుర్యంకోసం వాటిని రాతిపైన, తామ్రరేకులపైన రాయడం జరిగింది. బాబిలోన్‌లో హమ్మురాబి శాసనం సంఘం ఎలా నడుచుకోవాలో తెలుపుతూ న్యాయశాస్త్ర విషయాలను శాసనం చేయడం వలన అతడు First Law giver of the World అని పేరుపొందాడు. ధర్మాన్ని ప్రచారం చేయడానికి అశోకుడు శాసనాలను ఆశ్రయించాడు. వాటిని ధర్మశాసనాలన్నారు. ధర్మశాసనాల్లో మానవీయ మౌల్యాలు కనబడతాయి. తామ్ర, శిలా శాసనాలు ఎక్కువకాలం నిలిచేవి కావడం వల్ల చేస్తున్నటువంటి దానధర్మాలు శాశ్వతంగా నిలవాలనే ఉద్దేశంతోకూడా వీటిని ఆశ్రయించారు. దానశాసనాల్లో దేవునికి మానవుడు చేసినసేవ, దాని వివరాలు తెలుస్తాయి. మనిషి తానుచేసిన మంచిపని తానుపోయిన తరువాతకూడ నిలుస్తుందని దానధర్మాలు చేశాడు. అందుచేత తనకంటే ఎక్కువకాలం నిలిచే రాయి, లోహం (తామ్రం) పైన తన దానాల్ని చొప్పించాడు. శాసనాలు విషయ వైవిధ్యాన్ని బట్టి పలురకాలుగ ఉన్నాయి. అలా ఉన్నప్పటికీ రాజాజ్ఞ అనే అర్థంలో వాడబడిన శాసనపదం క్రమేణ అనేక అర్థాల్లో సందర్భానుసారంగా మార్పు చెందుతూ వచ్చింది. ఇక్కడమాత్రం ఒక సంఘటన లేదా ముఖ్యవిషయం దాఖలాచేయడం అనే అర్థంలో తీసుకోవడం జరుగుతోంది.

దానం చేయడం ఒక పవిత్ర కార్యం. అందునా ఆలయాలకు స్వామికొరకై దానం చేయటం మరింత పుణ్యం. చేసినదానం ఆచంద్రార్కం ఉండాలని భావించి దాత శాసనం వేయిస్తాడు. ఆ దానాన్ని పరిరక్షించడంకోసం, దానకర్త గ్రహీతల మధ్య జరిగినదానాన్ని రక్షించే వారికి పుణ్యం, నాశనం చేసేవారికి ప్రాప్తించే పాపాల్ని చక్కగా శాసనంలోనే పేర్కోవడం జరిగింది.

**దానపాలనయోర్మధ్యే దానాత్ శ్రేయః అనుపాలనం,**
**దానాత్ ఇంద్రత్వమవాప్నోతి పాలనాదచ్యుత పదం.**

దానానికి మించిన పుణ్యం దాన్ని రక్షించడంవలన కలుగుతుంది. దానంచేయడం వలన ఇంద్రపదవి లభిస్తుందనీ, ఆ దానాన్ని పరిరక్షించడంవలన అచ్యుతపదవే లభిస్తుందనీ నమ్మకం. ఇతర మతాల వారివల్ల కీడు కలుగకుండా ఉండడానికి మతపరమైన శాపోక్తులు కూడా శాసనాలలో పేర్కొనడం జరిగింది. అంతేకాదు, శ్రీరామచంద్రు డంతటివాడే "భూయో భూయో యాచతే రామచంద్రః" అని భావితరాలవారిని తానుచేసిన దానాన్ని పరిరక్షించమని అడుక్కున్నట్లు భవిష్యపురాణం తెలుపుతోంది.

అయితే తిరుమల తిరుపతి దేవస్థాన శాసనాల సంగతి దీనికి తగ్గట్టు లేదు. ఒక్క సామవైరాణి శాసనం తప్పితే- ("దీన్ని రక్షించిన శ్రీ వైష్ణవుల పాదాలు నా తలపై ఉండనీ" అని ఆమె వినయంతో అంటుంది.) మిగతాశాసనాలన్నీ సామాన్య శ్రీవైష్ణవరక్ష అనే మాటతో అంతమౌతాయి. తిరుమల తిరుపతి దేవస్థాన ఆలయ శాసనాలన్నీ స్థనత్తారులు అంటే ధర్మకర్తలు దానకర్త చేసిన దానాన్ని ఒప్పుకొని దానికి ప్రతిగా దీపం వెలిగించడమో, నైవేద్యం సమర్పించడమో లేక ఉత్సవం చేయడమో జరుగుతుందని ఒప్పుకొని వ్రాసి ఇచ్చిన ప్రామిసరి నోటులాగ వేయించినవి. రాజకీయ, సామాజిక, ధార్మిక పరిస్థితులు ఎలా ఉన్నా వేంకటేశ్వరుని వైభవంమాత్రం మూడుపువ్వులు ఆరుకాయలలాగ వికసించడానికి అవకాశమైంది.

ఇక శాసనాల నేపథ్యంలో వేంకటేశ్వరవైభవాన్ని దర్శించవచ్చు. స్వామిని గురించిగాని, ఆయన వైభవం గాని గుర్తించాలంటే తిరుమల తిరుపతి దేవస్థానాల శాసనసంపుటాలలోని శాసనాలను పరిశీలించాల్సి ఉంటుంది. తి.తి.దేవస్థాన శాసనాలు అన్నీ దానశాసనాలే.

తిరుమల తిరుపతి దేవస్థాన శాసనాలు తిరుమల, తిరుపతి గోవిందారాజాది తదితర ఆలయాల గోడలపై నున్న శాసనాలను సాధుసుబ్రహ్మణ్యశాస్త్రి అధ్వర్యంలో సేకరించి ఆరు సంపుటాలుగా ముద్రించటం జరిగింది. మొత్తంపై 1252 శాసనాలను ప్రకటించారు. దొరికిన మొదటి శాసనం తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయంలో(No. 210-G.T) క్రీ.శ.830 సం.లో వేయబడింది. తిరుమల శ్రీనివాసుని ప్రతిరూపమైన గుడి తిరుఇళంకోయిల్ అని తిరుచానూరులో ఉండేది. స్వామివారి పేరు తిరువెంకట ముడయాన్. ఈస్వామికి ఒక దీపదానం ఉలగప్పెరుమానార్ అనే అతడు చేసాడు. ఆళ్వారుల పాశురాలలో ఈ పేరుననే స్వామివారిని కీర్తించారు. ఇదేపేరు శాసనాలలో కూడా నమోదయ్యింది.

స్వామివారికి మొదట్లో భక్తులు దీపంకోసం దానాలు చేశారు. ఆ తరువాత దీపానికి అవసరమయ్యే నేతికోసం బంగారు, వెండినాణేలుగాని దానం ఇచ్చేవారు. ఆ తరువాత గోవులను దానం చేయడం కనిపిస్తోంది. ఆ పై స్వామికి నైవేద్య సమర్పణకై దానాలు చేసారు. ఆ పై ఉత్సవాల ఏర్పాటుకు భూదానం లేదా గ్రామ దానం చేసేవారు.

పూర్వకాలంలో తిరుమలకువెళ్ళే బాటలు మూడు లేక నాలుగు ఉండేవని తెలుస్తోంది. విజయనగర రాజుల కాలంనాటికి అలిపిరిమెట్లదారిలో తిరుమల వేంకటేశ్వరస్వామిని దర్శించుకోవాలని వెళ్ళే భక్తజనం ఎక్కువయింది. ఈ దారి మాత్రమే శాసనాలలో నమోదయ్యింది. జనసందోహం క్షేత్రానికి ఎక్కువగా వస్తుండడంతో నడకదారిలోను, తిరుమలలోను చలివేంద్రాలు, అన్నదానసత్రాలు కూడా ఏర్పాటు గావించబడినాయి. వేంకటేశ్వరుని దర్శించు కోవడానికివచ్చే యాత్రికులకోసం 10వ శతాబ్దంలోనే భోజనసదుపాయం చేసినట్లు తెలుస్తోంది (220–G.T.). ఆ తరువాత భోజనసదుపాయం శా.శ. 1378 నుండి 1444 సంవత్సరం మధ్య తిరుపతిలోను, తిరుమలలోను రామానుజకూటాల పేరున కందాడై

రామానుజయ్యంగార్ అధ్వర్యంలో జరిగేదని తెలుస్తోంది. ఈ రామానుజ కూటాలకు దాతలు దానకర్త భాగానికి వచ్చే ప్రసాదభాగాన్ని ఇవ్వటంకూడా కనిపిస్తోంది. ఈ రామానుజకూట వ్యవస్థను సాళువనరసింహుడు స్థాపించాడు. కృష్ణదేవరాయలుకూడా తిరుమలలో ఒక సత్రాన్ని ఏర్పాటు చేశాడు. తిరుమల తిరుపతి దేవస్థాన శాసనాలని పరిశీలించి నట్లయితే విజయనగరరాజుల పాలనాకాలం నుండీ తిరుమలలో స్వామికిజరిగే ఉత్సవ పూజాకార్యక్రమం ఎక్కువ అవడం, వచ్చినజనానికి సదుపాయాలు చేయడం, దానాలు విరివిగా జరగడం గుర్తించవచ్చును. ఉత్సవాల సంఖ్య పెరగడంతో యాత్రికుల సంఖ్యకూడా పెరిగేందుకు దోహదమైంది. దూరతీరాలనుండి శ్రమకోర్చి పసిబిడ్డలతో, దైవదర్శనాభిలాషతో వచ్చే తైర్థికులకు ఉండటానికి వసతి, తినడానికి తిండి, దాహం తీర్చడానికి మంచినీరు లభ్య మయ్యేట్లు చేయడం క్రమేపి విజయనగర రాజులకాలం నుండీ ఎక్కువయినట్లు విశదమౌతోంది.

పల్లవరాణి సామవై 10 శతాబ్దంలో మొట్టమొదటిమారుగా శ్రీనివాసుని వైభవాన్ని చాటేపని చేసింది. అంటే స్వామిని పోలిన రజతవిగ్రహాన్ని తిరువిళన్కోయిల్ (తిరుమల ఆలయం స్నపన మండపం)లో మణవాళప్పెరుమాళ్ అనేపేరుతో స్థాపనచేసింది. ఇందుకోసమే ఆ మండపాన్ని కట్టిఉంటారని అంటారు. 47 కళంజుల బంగారంతో విలువైన మణిమాణిక్యాలతో అనేక ఆభరణాలు ఇచ్చింది. పురట్టాశిమాసంలో తొమ్మిది రోజుల ఉత్సవాన్ని ఏర్పాటుచేసింది. ఈ విధంగా 10వ శతాబ్ద కాలంనాటికే సాంవత్సరికోత్సవం అనే పేరుతో పురట్టాసి (భాద్రపదం) లో బ్రహ్మోత్సవం జరుపబడుతూ వచ్చింది.వేంకటాచలమాహాత్మ్యంలో చెప్పినప్రకారం ఆదిలో బ్రహ్మనిర్వహించినందు వలన ఈ ఉత్సవానికి బ్రహ్మోత్సవం అనేపేరు వచ్చింది. అత్యంతవైభవంగా జరిపే ఈ ఉత్సవ నిర్వహణ అధికవ్యయోపేతమవడం వలన పల్లవరాణి స్వయంగా ఈ ఉత్సవాన్ని నిర్వహించింది. ఈ విధంగా శాసనాలద్వారా తెలిసినటువంటి ఆధారాలను పరిశీలించినట్లయితే స్వామివారికి జరిగే ఉత్సవ వైభవాల గురించి తెలుస్తుంది. తిరుమలలో వేంకటేశ్వరునికి క్రీ.శ. 1300 ప్రాంతంనాటికి సంవత్సరానికి 3 బ్రహ్మోత్సవాలు (189-టి.టి.) జరిగేవి. పెదతిరుమలాచార్యులు క్రీ.శ. 1539 (అచ్యుతరాయలు కాలంనాటికి)లో 2,000 వరహాల మూలధనంతో ఆణిమాసంలో(జ్యేష్ఠమాసం) 13 రోజులపాటు బ్రహ్మోత్సవం ఏర్పాటుచేసాడు. మొత్తంమీద విజయనగర పరిపాలకుల కాలంనాటికి చైత్రం, జ్యేష్టం, ఆషాడం, శ్రావణం, భాద్రపదం, ఆశ్వయుజం, కార్తీకం, పుష్యం, మాఘం, ఫాల్గుణం, (వైశాఖం, మార్గశిర మాసాలలోతప్ప) మాసాలలో 10 బ్రహ్మోత్సవాలు జరిగేవని తెలుస్తోంది.

బ్రహ్మోత్సవం తరువాత చెప్పుకోదగ్గ మరో ఉత్సవం **పవిత్రోత్సవం.** ఆగమోక్త నిత్యపూజోపచారాల విధులను విధివిధానకృత్యాల నాచరించడంలో తెలిసో తెలియకో దొరలిన మంత్రలోప, క్రియాలోప, భక్తిహీనము లైన అపచారాలను మన్నింపమని దైవాన్ని ప్రార్థించే క్రియాకలాపం పవిత్రోత్సవం. ఇది సాంవత్సరికోత్సవం. ప్రప్రథమంగా వేంకటేశ్వరస్వామివారి ఆలయంలో సాళువ మల్లయదేవ మహారాజు క్రీ.శ. 1463 సం.లో (నెం. 157-టి.టి.) ఐదురోజుల మహోత్సవంగా ఏర్పాటు చేసాడు. తదనంతరకాలంలో ఈ ఉత్సవాన్ని గురించిన ఆధారాలు ఉన్నశాసనాలు లభ్యం కాలేదు.

ఇక **అధ్యయనోత్సవం** గురించితెలిపే ఆకరం ఉన్న మొదటిశాసనం సుమారు క్రీ.శ. 1400 ప్రాంతంలో వేయబడింది. వైకుంఠ ఏకాదశికి పదిరోజుల ముందుగా ఈ ఉత్సవం ప్రారంభించి ఇరవైరోజులు జరిగే ఉత్సవం. ప్రతిదినం నాలాయిర దివ్యప్రబంధం పారాయణ చేస్తారు.

క్రీ.శ. 1473 లో **డోలోత్సవం** ఐదురోజులపాటు జరిగేటట్లు ఏర్పాటు చేశాడు సాళువనరసింహుడు. (నెం. 197-టి.టి.) ఉత్సవప్రారంభ దినం ముందురోజు అంకురార్పణతో చైత్రమాసంలో శుక్లపక్ష షష్ఠినాడు ప్రారంభమౌతుంది. తిరుమంజనం, పూజ, హోమం, పుణ్యాహం, అంత్య హోమం, నివేదనలు, ఊరేగింపు మొదలైన ఉత్సవకార్యక్రమాలకు కావలసిన వస్తు సంభారాలకు ఏర్పాటు చేసాడు. ఐదురోజులు పెద్దయెత్తున వైభవోపేతంగా పగలు, రాత్రికూడా స్వామికి ప్రత్యేకనివేదనలు ఏర్పాటు చేసాడు. ఈ ఉత్సవనిర్వహణకి సాళువనరసింహుడు పడైవీడు రాజ్యంలోని దొమ్మరపట్టి గ్రామాన్ని స్వామి వారికి ధారాదత్తం చేసాడు.

శ్రీనివాసునకు ఆలమేలుమంగకు క్రీ.శ. 1535 (554-టి.టి.)లో అచ్యుతదేవరాయులు 5 రోజులపాటు **లక్ష్మీదేవిమహోత్సవం** జరిపించేందుకు కొండవీడు ప్రాంతం నుండి 300 రేఖైపొన్నుల సాంవత్సరిక ఆదాయం అందేట్లు ఏర్పాటు చేశాడు.

నేడు ఆర్జిత సేవగా జరుపబడుతున్న **కల్యాణోత్సవం** మొదట్లో బ్రహ్మోత్సవంలో ఒక రోజు జరిగేదని ఆపై ప్రత్యేక ఉత్సవంగా ఐదురోజులు జరుపబడేదని తెలుస్తోంది. క్రీ.శ. 1536లో (5-71, 5-47 టి.టి.) తాళ్ళపాక పెదతిరుమలయ్య కుమారుడు తిరువెంగళనాథుడు (చిన్నన్న) ఫాల్గుణమాసంలో శ్రీనివాసునికి ఐదురోజులు ఉత్సవంగా ఏర్పాటు చేశాడు. ఆనాడు కల్యాణోత్సవం తిరుమామణి మండపంలో కడురమణీయంగా జరిగేది. ఇందులకై శేందూరు, మల్లవరం గ్రామాలను స్వామివారికి సమర్పించాడు.

సామాజికోత్సవంగా పేర్కొనదగ్గ ఉత్సవం **వనభోజనోత్సవం** క్రీ.శ. 1537లో తాళ్ళపాక పెద్దతిరుమలాచార్యుడు ఏర్పాటు చేశాడు. కార్తీకమాసంలో శ్రవణానక్షత్రయుక్తదినాన సమాజంలో నలుగురితో కలసి స్వామి వారిని దూరప్రాంతాల్లో ఉన్న తోటల్లోకి తీసుకెళ్ళి అక్కడే భోజనం చేసుకొని తిరిగి రావడంతోటి ఈ ఉత్సవం ముగుస్తుంది. తిరిగి వచ్చేటప్పుడు ప్రసాద వినియోగం జరిగేది.

ఇవే కాకుండా ప్రతినెలాజరిగే ఉత్సవాలు కూడా తిరుమలలో శ్రీనివాసునికి వైభవంగా జరిగేవి. పన్నెండు మాసాల మొదటిరోజులు, సంవత్సరంలో ప్రతిమాసంలో వచ్చే 13 అమావాస్యలు, 13 పౌర్ణమిలు, 25 దశములు, 25 ఏకాదశులు, 25 ద్వాదశులు, 13 శ్రవణాది కొన్ని ముఖ్యమైన నక్షత్రయుక్త దినాలలో ప్రత్యేక పూజలు స్వామివారికి జరిగేట్లు భక్తులు ఏర్పాట్లు గావించారు.

ఇక ఒకరోజు జరిగే ఉత్సవాలు ఉన్నాయి. వాటిలో కొన్నింటిని ఉదహరిస్తాను. శ్రీజయంతి, ఉట్ల ఉత్సవం, ఉత్థానద్వాదశి, దీపావళి, మకరసంక్రమణం, ఉగాది, శ్రీరామనవమి మొదలైన ఉత్సవాలు ఒక్క రోజు మాత్రం వైభవోపేతంగా జరుపబడుతాయి.

ఇంతేకాకుండా భక్తులు పై చెప్పిన సాంవత్సరికోత్సవాలలోకాని, మాసోత్సవాలలో గాని, మరి ఇతర రోజులలోగాని ప్రత్యేకపూజలు, నైవేద్యసమర్పణలు వారి పుట్టినరోజును పురస్కరించుకొని ఏర్పాటు చేసుకోవడం కూడా స్వామి వైభవాన్ని అతిశయింపజేసాయి.

క్రీ.శ. 1562లో వేసిన శాసనం పరిశీలించినట్లయితే బ్రహ్మోత్సవాది సాంవత్సరిక ఉత్సవాలు దాదాపు 204 దినాలు జరిగేవి. మాసోత్సవాలు 217 దినాలు, ఒక్కరోజు జరిగే విశేష ఉత్సవాలు 12 రోజులు జరిగేవి. మొత్తంపైన సంవత్సరం పొడవునా తిరుమలలో శ్రీనివాసునికి అన్నీ పండుగ రోజులే. అంటే ఉత్సవాలు overlappings జరిగేవన్నమాట ! ఈనాడు జరిగే ఉత్సవ దినాలతో పోలిస్తే విజయనగర రాజులకాలంనాటి వైభవం ఉచ్ఛస్థితిలో ఉండేదని చెప్పక తప్పదు. అందుకే మరి సంవత్సరంలో 365 రోజులు తిరుమల శ్రీనివాసుని ఆలయం పచ్చటి తోరణాలతో అలరారడంవలన నిత్యకల్యాణం పచ్చతోరణం అనే నానుడికి ఆలవాల మైందనిపిస్తోంది.

నిత్యదైవార్చన సమయంలో పూజార్థం, ఉత్సవసమయాల్లో అలంకరణార్థం, దేవాలయ ప్రాంగణంలో అలంకరణకోసం అధికమొత్తంలో పుష్పాల ఆవశ్యకత ఏర్పడ్డంతో తిరుమలలోనే, దేవాలయ పరిసర ప్రాంతంలోనే పూదోటలను పెంచి దేవాలయానికి సమర్పించేవారు. తిరుమల దట్టమైన అడవులతో నిండి ఉండడం కారణంగా ఆ నాడు కావలసినమొత్తంలో పుష్పాల సేకరణ కష్టమైన కార్యమే. తిరుమలలో పుష్ప ఉద్యానవనకృషి ప్రస్తావన క్రీ.శ. 1300 (శాసనం నెం. 125-జి.టి.)లో లభ్యమైంది. ఆ తరువాతి కాలంలో అనేకపూదోటలు వెలిసాయి. క్రీ.శ. 1458లో తిరువెంకటనాథన్ పూదోటకు పెరియపెరుమాళ్ జీయరు నిర్వాహకుడుగా ఉంటూ పూదోటను పెంచేవాడు. క్రీ.శ. 1493లో పేరారుళాలన్ పూదోటకు కోయిల్‌కెళ్వి ఎంపెరుమానార్ జీయర్, మలైకినియనిన్రాన్ పూదోటకు యతిరాజ జీయర్ నిర్వాహకులుగా పూదోటలను పెంచేవారు. క్రీ.శ. 1494లో పిన్‌శెన్నవిల్లి అనేతోటను పెరియ పెరుమాళ్ దాసర్ అనునతడు నిర్వాహకులుగా పూదోటను పెంచేవాడు. క్రీ.శ. 14-15 శతాబ్దాల మధ్యకాలంలో లభించిన శాసనాలను పరిశీలించినట్లయితే అనేక పూదోటలు ఉన్నట్లుగా తెలుస్తున్నప్పటికీ ఆ కాలానికి సరి పోయేంతటి పువ్వులు లభించటం లేదని తెలుస్తోంది. ఈ శతాబ్దకాలంలో ఉత్సవాలసంఖ్య అనేకరెట్లు పెరగడంతో ఆ నిష్పత్తిలోనే అలంకరణార్థం ఒక్కమారుగా కొన్నిరెట్లమొత్తంలో పూలు కావలసిన పరిస్థితి ఏర్పడింది. పూదోటల పెంపకం ఒక క్రమ పద్ధతిలో సక్రమంగా నిర్వహింపబడుతూ వచ్చాయి. సాధారణంగా పూదోటల పెంపకానికి ఒక నిర్వాహకుడు ఉంటాడు. అతడు గౌరవంగా వేతనమేది లేకుండా పనిచేసేవాడు. కూలీలకు నెలకు 3 నుండి 6 పణాల వరకు వేతనం ఇవ్వబడేది. సాధారణంగా పూదోటలలో మండపాలను కట్టి, స్వామివారికి కొంతధనాన్ని సమర్పించి ఆ మండపంతో ఉన్న పూదోటలను దానం చేయడం కూడా ఉన్నది. చెరువులు, నీటిపట్టులు, ఉన్న పూదోటలనుండి ఎఱ్ఱతామర సాగుచేసి స్వామికి సమర్పించటం కూడా (నెం.125-జి.టి.; 53, 153-టి.టి.) శాసనాలలో కనిపిస్తోంది. పూదోటలలో వివిధరకాల పుష్పాలతోబాటు దవనం, మరువం, తులసి, సుగంధ మూలికలు కూడ పెంచేవారని తెలుస్తోంది.

తిరుమలలో నెలకొన్నస్వామి శ్రీవేంకటేశ్వరుడు, స్వయంభువుగా విశ్వసిస్తారు. గర్భాలయంలో ఉన్న **ధ్రువమూర్తి**పేరు తిరువేంకట ముడయాన్. అంతేకాకుండా గర్భాలయంలోని శ్రీనివాసుని ప్రతినిధులుగా, ఆలయ అర్చన పద్ధతులలో పూజకు అనుకూలంగా నాలుగు మూర్తులు ఆలయంలో ఉన్నాయి.

ఆలయంలో ఉన్న మరోమూర్తి **భోగశ్రీనివాసుడు**. ఆగమ పరిభాషలో కౌతుకబేరం అని అంటారు. వెండితోచేసిన మూర్తి. మూలవిగ్రహానికి అచ్చంగ ప్రతిరూపంగా ఉంటుంది. నాలుగుచేతులతో నిలుచున్న మూర్తి. ఈ విగ్రహాన్ని క్రీ.శ. పదవశతాబ్దంలో పల్లవరాణి సామవై స్థాపనచేసినట్లు శాసనాధారం. ప్రతిరోజు ప్రాతఃకాలంలో ఈమూర్తికి అభిషేకం జరుగుతుంది. కాని ధృవమూర్తికి ఒక్క శుక్రవారం మాత్రమే జరుగుతుంది. ఏకాంతసేవలో రాత్రి పవళింపు ఈ భోగమూర్తికే. సంవత్సరంలో ఒక్క ధనుర్మాసంలో మాత్రం కృష్ణమూర్తికి జరుగుతుంది.

ఆలయంలో ఉన్న మరోమూర్తి **కొలువు శ్రీనివాసుడు**. ఆగమ పరిభాషలో బలిబేరం అని అంటారు. ప్రతిదినం తోమాలసేవానంతరం తిరుమామణిమండపంలో స్వామి కొలువు జరుగుతుంది. కొలువు శ్రీనివాసుని సింహాసనంపై ఆసీనుని చేసి పంచాంగశ్రవణం జరిపిస్తారు. స్వామికి ముందుటిరోజు ఆదాయ వ్యయాల లెక్కలుచెప్పి పూజకొలకు అనుమతి తీసుకోవడం జరుగుతుంది. ఈ స్వామిని బలిబేరం అని అన్నప్పటికీ బలిసమర్పణకు ఈయనను బయటికి తేవడంలేదు.

ఆలయంలో ఉన్న ఇంకోమూర్తి **ఉగ్ర శ్రీనివాసుడు**. ఒకటిన్నర అడుగుల పొడువు ఉంటుంది. వేంకటత్తు రైవర్ అని పేరు. ఈ మూర్తి మొదట్లో ఉత్సవమూర్తిగా చెలామణి అయ్యేది. కాని ఒకానొకప్పుడు ఆలయంలో అగ్ని ప్రమాదానికి గురి అవడం కారణంగా గుర్భగుడిలోకి ఈ మూర్తి చేరింది. కైశికద్వాదశినాడు మాత్రమే ఉదయాత్పూర్వం ఊరేగింపుకు తీస్తారు. ద్వాదశ ఆరాధన, ముక్కోటిద్వాదశి పూజలందుకుంటాడు.

ధ్రువమూర్తి అంటే మూలవిగ్రహానికి అచ్చంగ ప్రతిరూపం ఉండే మరోమూర్తి **మలయప్ప** లేక **ఉత్సవ మూర్తి**. ఈ స్వామిని మలైకినియనిన్ల పెరుమాళ్ అని శాసనాలు పేర్కొంటున్నాయి. రెండు చేతులలో ఒక దానిలో శంఖం, మరోదానిలో చక్రం ఉండి నాలుగుచేతులు కలిగి, నిలుచున్నటువంటి మూర్తి. క్రింది రెండుచేతులతో ఒకచేయి వదరహస్తం, మరోచేయి కటిహస్తం. శ్రీదేవి, భూదేవి విగ్రహాలు పక్కనే ఉంటాయి. మలయప్ప ప్రస్తావన క్రీ.శ. 1339 సం.లో మొదటి మారుగా కనిపిస్తుంది. కల్యాణోత్సవం మొదలైన ఉత్సవాలకు, ఊరేగింపులకు ఈ స్వామిని తీసుకు వస్తారు. ఈ విగ్రహాలేకాకుండా తిరుమల ఆలయంలో శ్రీనివాసుని ప్రకటించే శ్రీకృష్ణ, శ్రీరామ, సీతా లక్ష్మణ, సుగ్రీవ మొదలైన విగ్రహాలు ఉన్నాయి.

ఇంతటి వైభవోపేతుడైన వేంకటేశ్వరస్వామివారి ఆలయ పరిపాలన ఎలా ఉండేదో ఒక మారు గమనిద్దాం. **తిరుమల తిరుపతి ఆలయ శాసనాలను** చూసినట్లయితే క్రీ.శ. 10వ శతాబ్దం నుంచి ఇరవైయవ శతాబ్దంవరకు ఉన్నట్లుగా తెలుస్తోంది. **ఈ శాసనాలను** పరిశీలిస్తే తిరుమల ఆలయం పరిపాలనా విషయాలు తిరుచానూరు

సభవారు మొదట్లో చూసేవారని ఆ తరువాత తిరుమలలోనే స్థానత్తారులు చూసేవారని తెలుస్తోంది. రాజులు, భక్తులు ఇచ్చిన గ్రామాలనుండి రావలసిన ఆదాయం సక్రమంగా వచ్చేటట్లు చూసుకోవడం జరిగేది. దాదాపు తమిళనాడు, ఆంధ్రదేశంలో వ్యాప్తిచెందిన ఈ గ్రామాల ఆదాయాన్ని సకాలంలో రాబట్టడం కొంచెం కష్టమైన పనే. అయినా సక్రమంగా దాతల దాన ఉద్దేశం నెరవేరేట్లు గమనించడం జరిగేది. స్వామివారికి బంగారు రూపేణా భక్తులు ఇచ్చినది సక్రమంగా ఖర్చు చేయడం వీరి విధి. వీరు స్వామివారి ఆదాయాన్ని దేవదానగ్రామాలలో నీటివనరులకోసం ఖర్చుచేయడం, వాటినుండి వచ్చే అధికరాబడితో మరిన్ని కైంకర్యాలు చేయడం జరిగేది. అవసరమైనపుడు దేవదానగ్రామాల్లోని కాలువలకు పూడిక తీయించడంవంటి కార్యక్రమాలు జరుగుతూ ఉండేవి. తద్వారా వ్యవసాయం మీద వచ్చే రాబడికి లోటు ఉండేదికాదు. అందుచేత స్వామివారికి జరిగే కైంకర్యాలు సక్రమంగా జరిగేవి. రాజులకు ప్రతినిధిగా ఆలయాలే ఇలాంటి నీటిపారుదల వ్యవస్థను ప్రజలకు కలిగిస్తుండేవి. వీరు ఆ నాడు స్వలాభాపేక్షలేకుండా నిస్వార్థంతో పనిచేసేవారని తెలుస్తోంది. తిరుమలలో పూజాపునస్కారాలు ఉత్సవాది కార్యక్రమాలు ఇంతవైభవంగా జరుగుతున్నందున భక్తులరాక కూడా ఎక్కువ కావడం జరిగింది. ఈ శాసనాలను గమనించి నపుడు తిరుపతిలో నీటివనరులగురించి, కాలువల గురించి ప్రత్యేకంగా ఒక వ్యాసంలో తెలుపవలసి ఉంటుంది. తిరుమల శ్రీనివాసునికి చేసే దానధర్మాలకు సంబంధించిన శాసనాలు తిరుమల ఆలయానికే పరిమితంకాక తిరుపతి గోవిందరాజస్వామివారి ఆలయకైంకర్యాలకు కూడా దానమివ్వడం, తిరుపతి గోవిందరాజస్వామివారికి సంబంధించిన శాసనాలలో తిరుమల శ్రీనివాసుని కైంకర్యాలకు కూడా దానమివ్వడం గమనించవచ్చు. అలాగే మిగతా ఆలయాలవిషయంలో ఉండడం కారణంగా తిరుమల తిరుపతి క్షేత్రాలు ఒకేసంస్థగా ఆనాడే పరిగణింపబడ్డట్లు ఊహించవచ్చును. కాని విడివిడిగా ఆర్థికపద్దులు ప్రతీ ఆలయానికి ప్రత్యేకంగా నిర్వహింపబడేవి. తిరుపతిలో గోవిందరాజస్వామివారి ఆలయానికి ఒక భండారం, తిరుమల ఆలయానికి ఒక భండారం ఉండేది. మొదట్లో తిరుమల ఆలయ వంటశాలకు కావలసిన సరకులు ఏ రోజుకారోజు వచ్చేవి ఆ తరువాతకాలంలో అక్కడే ఒక వస్తుగది (ఉగ్రాణం) కూడా ఏర్పాటు అయింది. అదేవిధంగా స్వామివారి ఆభరణాలు జాగ్రత్త చేయడంకోసం తిరుపతి, తిరుమల ఆలయాలల్లో గట్టి బందోబస్తయిన రూములు ఉండిఉండాలి. రాఘోజీభోంస్లే ఇచ్చిన కానుకలను ఒకేదాంట్లో ఉంచడంకోసం ఇచ్చినపెట్టె ఉన్నది. శాసనాలను గమనిస్తే రాజులు, రాజకుటుంబీకులు దానం చేసిన ఆభరణాలు బండ్లకు ఎత్తవచ్చు.

విజయనగర రాజులు కళలను పోషించారు. అందులో సంగీత, సాహిత్య, నృత్య, నాటక కళలకు ఎనలేని సేవచేశారు. అచ్యుతరాయలు క్రీ.శ. 1531 (నెం1-జి.టి.)లో తిరుమల ఆలయంలో నృత్యసేవ చేసు కొంటూ జీవించమని ముద్దుకుప్పాయిని నియోగించాడు. అంతేకాదు వంశ పారంపర్యంగా నృత్యసేవ చేసుకొని జీవించడానికి జీవనభృతికి స్వామిప్రసాదాన్ని ఏర్పాటు చేసాడు. అలాగే అచ్యుతరాయలు హనుమత్సాని అనే ఆమెను కూడా స్వామిసేవకై పంపాడు. తిరుమల స్వామివారు తిరువీథులలో ఊరేగేటపుడు ఆనైమాది అనే

నాట్యకత్తె క్రీ.శ. 1486లో స్వామిసేవచేసుకొనేదని తెలుస్తోంది. వీరు నృత్యసేవచేసుకుంటూ తమభక్తితో కొన్నికైంకర్యాలు కూడా చేసినట్టు శాసనాలు తెల్పుతాయి. విజయనగర రాజులకాలంలో తాళ్ళపాక వారు స్వామివారికి సంగీత సేవచేసుకొన్నారు. అన్నమయ్య శ్రీనివాసునిపై రోజుకు ఒక్క సంకీర్తనను రచించి, వాటిని స్వామివారికి నివేదించేవాడు. ఆయన తరువాత పెదతిరుమలాచార్యుడు ఆభాగ్యం దక్కించుకున్నాడు. తాళ్ళపాకవారి సంకీర్తనలను రాగిరేకులపై రాయించి తిరుమల ఆలయంలోనే జాగ్రత్తచేయటం జరిగింది. భాష్యకారుల సన్నిధిపక్కనే తాళ్ళపాక అరలో ఈ సంగీత తామ్రపత్రాలు చోటు సంపాదించు కున్నాయి. రోజా తాళ్ళపాకవారు ఆ కీర్తనలను ఆలపించడమేకాదు ప్రత్యేకపర్వదినాల్లో, ఉత్సవదినాల్లో సంకీర్తనలను పాడేగాయకులనుకూడా ఏర్పాటు చేసారు. (తి.తి.దే. శాసన సంపుటి. 4-55). గ్రీష్మోత్సవం 20 రోజులు, తిరుమంజనవేళలోను, ఆ నాళ్ళలో జరిగే బ్రహ్మోత్సవాలలోను ఇద్దరు విద్వాంసులు సంకీర్తనలు పాడేవారని వారికి జీతభత్యాలు కూడా తాళ్ళపాకవారు ఏర్పాటుచేసారని తెలుస్తోంది. తిరుమలలో ఇప్పుడు జరిగే కల్యాణోత్సవ ప్రదేశమును చంపకప్రదక్షిణం అని అంటారు. ఆ ప్రదక్షిణంలో స్వరసహితంగా సంగీత లేఖనం ఉన్న రెండు రాతిబండలు లభ్యమయ్యాయి. ఇవి 15-16 శతాబ్దాల కాలంనాటివని తెలుస్తోంది. క్రీ.శ. 1491లో వేంకటేశ్వర మాహాత్మ్యాన్ని పసిండి వేంకటత్తురైవర్ రచించి, చదివి వినిపించే వాడని తెలుస్తున్నది.

తిరుమల వేంకటేశ్వరుని దర్శించుకుని తమమొక్కుబళ్ళు సమర్పించుకోవడానికి క్రీ.శ. 9వ శతాబ్దం నుండీ రాజులు, చక్రవర్తులు, రాజపరివారం, ప్రధానమంత్రులు, దండనాధులు, సామంతులు, రాజమహలు లోని పరివారం, జీయరులు, ఆచార్యపురుషులు, సభైయారులు, వైదిక బ్రాహ్మణులు, అర్చకులు, ఏకాంగులు, ఆలయగణకులు, వ్యాపారస్తులు, ఆలయనర్తకీమణులు, ఆలయసేవకులు, సంకీర్తనాచార్యులు వచ్చి తమ శక్తిమేరకు ధన, కనక, వస్తువాహనాదులను ఇచ్చి స్వామివారి నిత్య నైవేద్యానికై ఏర్పాటుచేసి శాసనాలు వేయించారు. వారు ధన్యులు.

# వామనపురాణములోని శ్రీవేంకటాచలమాహాత్మ్యము

టి. సావిత్రి

వామనపురాణములోని 25 అధ్యాయములలో శ్రీనివాసునివైభవము, తీర్థవిశేషములు, ఉపాఖ్యానములు వివరించబడినాయి. ఇందులో వరాహస్వామి ప్రశస్తి, శ్రీనివాసావిర్భావము, భగవద్దివ్యమంగళ విగ్రహవర్ణనం, బ్రహ్మాదులు భగవద్విశ్వరూపమును దర్శించడం, బ్రహ్మచేత ప్రారంభించబడిన బ్రహ్మోత్సవమును ప్రశంసించడం, మొదలైన విషయములున్నవి. తీర్థముల ప్రసక్తిలో కపిలతీర్థప్రశస్తి, పంచతీర్థాల ప్రసిద్ధి, ముఖ్యముగా స్వామిపుష్కరిణీ ప్రాశస్త్యం గురించి వివరంగా వివరించడం జరిగినది. ఉపాఖ్యానముల సందర్భములో స్కందుని చరితము, వాయువుయొక్క తపస్సు, స్తుతి, వరదానం, విష్వక్సేనుడి చరితము, ఉపరిచరవసు వృత్తాంతము మొదలైన విషయములు విస్తారముగా వర్ణించడం జరిగింది.

## వరాహస్వామి ప్రశస్తి

ప్రళయకాలములో జగత్తంతా జలమయమవడంలో భూమి మునిగిపోయింది. అప్పుడు శ్రీమహావిష్ణువు బ్రహ్మతో సృష్టిజరిపించుటకుగాను స్వయంగా శ్వేతవరాహరూపాన్ని ధరించి, హిరణ్యాక్షునితో యుద్ధం చేసి వధించి భూమ్యుద్ధరణ చేశాడు. ఈ శ్వేతవరాహస్వామి వృషాచలంలో తానుద్ధరించిన భూదేవిని అంకసీమలో కూర్చోబెట్టుకొని విరాజిల్లుతున్నాడు. అప్పటినుంచి ఇది వరాహక్షేత్రమని పిలువబడింది. పుణ్యప్రదమైన వరాహక్షేత్రమైన వేంకటాద్రిలో భూదేవీసహిత వరాహస్వామిసన్నిధిలో యథావిధిగా ఉత్తమమైన వరాహమంత్రాన్ని మాసపర్యంతం ప్రశాంతచిత్తులై జపించినవారికి అభీష్టములు, గృహక్షేత్రాదులు సిద్ధిస్తాయనడంలో సందేహము లేదు. ఇటువంటి స్వామిని తిరస్కరించి రాజ్యపాలన చేసే రాజుయొక్క రాజ్యము అతివృష్టి, అనావృష్టి దోషములతోను, దొంగలతోను, శత్రువులతోను, గొప్ప రోగములతోను పీడింపబడుతుంది.

**తస్మాత్తత్రస్థితం దేవం వరాహం ధరణీయుతమ్ ।**
**సమ్యగారాధయేద్రాజా భక్తిశ్రద్ధాసమన్వితః ॥** **(21.34)**

అందువల్ల భూదేవీసహితుడైన వరాహస్వామిని భక్తిశ్రద్ధాదులతో ఆరాధించాలి. శ్వేతవరాహరూపియైన విష్ణువు స్వామిపుష్కరిణికి పశ్చిమంలోని దేవాలయంలో స్థిరపడి మహర్షులచేత మూడు కాలములలో పూజలందు కుంటున్నాడు.

## శ్రీనివాసావిర్భావము

స్వామి పుష్కరిణికి దక్షిణభాగంలో శంఖచక్రగదాధరుడైన శ్రీనివాసుడు కొలువై ఉన్నాడు. జగద్రక్షణకై తాను ప్రళయాంతంవరకు ఇక్కడే ఉండాలని నిశ్చయించుకున్న స్వామి గరుడుని వైకుంఠంవెళ్ళి క్రీడాపర్వతాన్ని తెమ్మని ఆజ్ఞాపించాడు. ఆ క్రీడాపర్వతమే 'నారాయణగిరి' నామక పర్వతము.

...NKATESWARA CENTRAL LIBRARY & RESEARC...
TIRUPATI.
71933

'శిఖరం యస్య దృష్ట్వైవ సద్యః పాపైః ప్రముచ్యతే

ఈ పర్వతశిఖరాన్ని దర్శిస్తేనే పాపాలన్నీ నశిస్తాయి. శ్రీభూదేవులతో కూడిన శ్రీనివాసుడు తన ఆలయం, తానుకూడా కన్పించకుండా షోడశవర్షప్రాయుడై నారాయణగిరిలో విహరిస్తూంటాడు. ఈ పర్వతానికి యుగభేదంతో అనేక నామాలున్నాయి. కృతయుగంలో వృషాద్రియని, త్రేతాయుగంలో గరుడాచలమని, ద్వాపరయుగంలో శేషశైలమని, కలియుగంలో వేంకటాచలమని నామాలున్నాయి.

శ్రీనివాసుని శాశ్వతస్థానమే నారాయణగిరి. ఈ పర్వతం బంగారుమయము, రత్నచరియలు కలిగి అందంగా ఉంటుంది. ఆదిశేష వాయువుల సంవాదముతో ఈ పర్వతము దక్షిణదిక్కుకు ఎగురుగొట్టబడింది. 'అంజనాద్రి' అయిన ఈ పర్వతం సకలతీర్థసమన్వితము, పవిత్రము, పుణ్యప్రదము, అందువలననే సిద్ధులు, మునులు ఈ పర్వతంపై తపస్సు చేస్తుంటారు. పుణ్యపురుషులైన ప్రహ్లాదాదులు, అంబరీషాది రాజేంద్రులు దీనిని విష్ణువుయొక్క దేహంగా భావిస్తారు.

అగస్త్యాది మహర్షులు, సిద్ధులు, బృహస్పతి, శుక్రాచార్యుడు, భగవద్భక్తుడైన ఉపరిచరవసువు, శంఖనృపతి మొదలైన సచ్చరిత్రులందరూ స్వామిపుష్కరిణీ తీరంలో శ్రీనివాసుని దర్శించాలని ఉత్సుకతతో ఎదురుచూస్తూ, శ్రియఃపతినే ధ్యానిస్తూ స్వామి పుష్కరిణీలో స్నానపానాదులొనరిస్తూ మూడహోరాత్రాలు ఘోరమైన తపస్సునాచరించిన తరువాత నాలుగవ దినమున ఆకాశము నిర్మలమైయుండగా సాక్షాత్ శ్రీమన్నారాయణుడైన శ్రీనివాసుడు ప్రత్యక్షమయ్యాడు. భక్తాదులంతా ప్రత్యక్షమైన శ్రీనివాసుని విరాట్‌రూపంలో వర్ణించినారు-

శ్రీమన్నారాయణుని రూపము ఉదయించుచున్న సూర్యునివంటి కాంతిగల మంగళప్రదములైన నేత్రములతో కూడినది. అనేక రత్నఖచితములై చిత్రములైన కిరీటములతో నొప్పునది. పగడములతోను, మణులతోను, బంగారముతో చెక్కబడిన బంగారు కుండలములతోను, శంఖమువంటి మెడయు, విశాల వక్షఃస్థలము, మహాబాహువులు కలిగి గొప్పకాంతి గలదియు, రత్నాభరణములచే నలంకరింపబడి దీర్ఘములై గుండ్రముగా నున్నవియు, అనేకాయుధములను ధరించినవియు, శుభరేఖలు కలిగి, చక్కని అరుణవర్ణము కలిగి హెచ్చుతగ్గులు లేక మిక్కిలి మృదువుగానుండి ఏనుగు తొండములను పోలియుండి, సకల చరాచరములతో నిండినదియునగు బ్రహ్మాండమును పరిరక్షించునవియు, విష్ణుభక్తుల దుఃఖమును పోగొట్టునవియు, యే భుజబలము నాశ్రయించుకొని దేవతలు రాక్షసభయము లేకయున్నారో అటువంటి శ్రీమన్నారాయణుని బాహువులు ఉదయాచలము నుండి ఉదయించు సూర్యకిరణమువలె ప్రకాశించుచు కనిపించెను. రత్నసమూహములచే ప్రకాశించుచున్న హారముచే విరాజిల్లుచు, నీలమేఘమును పోలిన సుందరమగు శరీరమును, సుందరమైన అధరోష్ఠమును, సుందరమైన నేత్రములును, కుండలములచే ప్రకాశించు సుందరములైన గండస్థలములును, మనోహరమైన ఫాలపట్టికలతోను, ధనస్సువంటి ప్రకాశించు

కనుబొమలును, మణులతోను, రత్నములతోను ధ్వనించు అందెలతోను, మేలిమి బంగారముతో చేయబడిన యజ్ఞోపవీతమును, వేయి సూర్యులవంటి కాంతిగలిగి మహాశ్చర్యకరమై మేరుపర్వతమునుపోలి, నల్లని కొండవలె ఉన్నత వక్షస్థలము కలిగి, విశాలనేత్రములతో పీతాంబరమును ధరించి, భుజస్కంధములనుండి వ్రేలాడు వైజయంతీమాల కలిగి మెరుపులతో ప్రకాశించు మేఘపంక్తివలె శ్రీమన్నారాయణుని శరీరము విరాజిల్లునది. ఇటువంటి రూపమును రెప్పపాటులేక సంతోషముతో చూస్తూ భక్తివినమ్రులై శిరములతో సాష్టాంగముగా నమస్కరించిరి. గొప్పశంఖనాదముతోను, వాయిద్యముల ధ్వనులతోను జగత్తంతా మారుమ్రోగినది.

ఈ విధంగా ప్రత్యక్షమయిన శ్రీనివాసునికి బ్రహ్మదేవుడు బ్రహ్మోత్సవములను జరిపించినాడు.

**మాసి భాద్రపదే పుణ్యే శుక్లపక్షే తు చైత్రభే,**
**స్వామిపుష్కరిణీతీరే దేవస్య పరమాత్మనః,**
**ఉత్సవః కారితః పూర్వం మయైవ ప్రీతయే హరేః ।** **(43.33)**

భాద్రపదమాస శుక్లపక్షంలో స్వామిపుష్కరిణీతీరంలో శ్రీమన్నారాయణుని సంతృప్తిపరచుటకు బ్రహ్మయే ఉత్సవం ఏర్పాటు చేసినట్లు చెప్పబడినది. భాద్రపదమాసములో ఆచరించు ఉత్సవములో ఏకొంచెమైనా విష్ణువునారాధిస్తే జనులందరికి పొందశక్యముగాని వరముల నిస్తాడని చెప్పడం జరిగింది.

**యాని త్వాదధతే పదానిచ మునే నారాయణాద్రిం ప్రతి ।**
**స్తోకం స్తోకమపి ద్విజా అపి జనాస్తేషాం ఫలం యచ్ఛృణు ॥**
**యావద్వేంకటశైలమాత్మగృహతస్తావత్పదానాం క్రమాత్ ।**
**ప్రాయశ్చైవ పదేపదే క్రతుఫలం భూయాద్భువి ప్రాణినామ్ ॥** **(43.37)**

ఈ ఉత్సవరోజులలో నారాయణాద్రికెళ్ళిన మనుజులకు తమ యింటినుండి వేసిన అడుగులన్నింటికి ఒక్కొక్క క్రతువు చేసిన ఫలితము దక్కుతుంది. అంతేకాక ఈ ఉత్సవదర్శనార్థం వచ్చిన భక్తులను యధాశక్తిగా ఆదరించేవారికి శ్రీనివాసుడు తమ అభీష్టములను తీరుస్తాడు. లోభాది గుణములతో ఆ యాత్రీకులకేమాత్రం అపకారంచేసినా, వారు ప్రళయాంతంవరకు భయంకరమైన రౌరవనరకంలో పడతారని స్పష్టపరచబడినది.

**కపిలతీర్థము**

పాతాళలోకములో కపిలమహర్షిచే పూజింపబడే కపిలలింగము కామధేనువుపాలచే నభిషేకింపబడి భూమిని ఛేదించుకొని బయటకు రాగా కామధేనువు కోపించి, తన డెక్కను ఆ లింగంపైనుంచి 'పెరుగవలద'ని ఆజ్ఞాపించగా పెరుగలేదు. ఆ లింగం అడుగు పైభాగమున వెండిరంగును, మధ్యలో బంగారుకాంతియు,

అగ్రభాగాన ఎరుపురంగును కలిగి అయిదు ముఖాలు, అయిదురంగులు కలిగి, మహాభయంకరమై పాతాళమునుండి కృతయుగంలో కపిలమహర్షిచేత పూజింపబడుటవలన 'కపిలేశ్వర'మని, త్రేతాయుగములో అగ్నిచే పూజింపబడుటచే 'అగ్నేయ'మని, ద్వాపరయుగములో చక్రముచేత పూజింపబడుటవలన 'చక్రతీర్థ' మని పిలువబడింది. ఈ కపిలతీర్థాన్ని సేవించిన మాత్రాననే సకలపాపాలను పోగొడుతుంది. తీర్థపానంద్వారా ముసలితనం నశిస్తుంది. స్త్రీ పురుషులు దర్శనమాత్రాననే స్వర్గసౌఖ్యాలను పొందుతారు. ఒకసారి స్నానంచేస్తే వాజపేయ, అశ్వమేధయాగ పూర్ణఫలం లభిస్తుంది. వాజపేయయాగం చేసినవాడికి పునర్జన్మ ఉందికాని ఈ తీర్థంలో స్నానంచేసిన వాడికి పునర్జన్మ ఉండదు.

**వర్షే వర్షే తు కార్తిక్యాం పౌర్ణమాస్యాం మహాతిథౌ ।**
**ఆయాన్తి సర్వతీర్థాని మధ్యాహ్నేకాపిలం సరః ॥** **(23.55)**

కార్తీకమాసంలో మధ్యాహ్న సమయమున ముల్లోకాలలోని సకల తీర్థములు పౌర్ణమి తిథియందు కపిలతీర్థములో సంగమిస్తున్నాయి. ఇందులో స్నానంచేసిన స్త్రీ పురుషులు సకలపాపదూరులై బ్రహ్మలోకాన్ని పొందుతారు. ఈ తీర్థసమయంలో నువ్వుగింజంత బంగారుదానం చేస్తే మేరు పర్వతసమాన మవుతుంది. పిడికెడన్నాన్ని దానంచేస్తే చంద్రలోకాన్ని పొందుతారు. గోదానం, భూదానం, విద్యాదానం, మంత్రోపదేశం చేసేవారికి స్వర్గ కైలాసవైకుంఠ బ్రహ్మలోకాలు సిద్ధిస్తాయి.

### స్వామి పుష్కరిణి

'వరిష్ఠా సర్వతీర్థేభ్యః స్వామిపుష్కరిణీ నృప । (30.44)

తీర్థాలన్నిటిలోను స్వామిపుష్కరిణి శ్రేష్ఠమైనది. ఇది మహాపుణ్యప్రదమైనది. సకల పాపహరమైనది. ఈ తీరంలోనే శ్రీనివాసుడు లక్ష్మీదేవితో విహరిస్తుంటాడు. పుష్కరిణి కీర్తి ముల్లోకాలలో ప్రసిద్ధిచెందినది. నారాయణపర్వతం లోని స్వామిపుష్కరిణి సర్వలోక విమోహిని, సకలదోషనాశిని, పరమేశ్వరి, తీర్థాలన్నిటిలో శ్రేష్ఠమైనది. ఉదయాన్నే 'స్వామిపుష్కరిణి' ఎవరైతే స్తుతిస్తారో వారికి ఉత్తమగతులు లభిస్తాయి. ఈ పుష్కరిణిలో స్నానంచేసినా, చూసినా జనులు సకలపాపవిదూరులు. సర్వదుఃఖ విముక్తులు అయి దివ్యవిమానాన్ని అధిరోహించి స్వర్గాన్ని చేరుకుంటారు. పుష్కరిణిపానంవల్ల సర్వపాపాలనుండి విముక్తులవుతారు. రోగులు రోగాలనుండి, దుఃఖితులు దుఃఖాలనుండి, మోహితులు మోహంనుండి విముక్తులవుతారు. సంసారదుఃఖపరితప్తులైన వికలమనస్కులైన మనుజులు స్వామిపుష్కరిణిని ఆశ్రయించి శుద్ధానందరూపమైన పరబ్రహ్మను పొందుతారు.

పూర్వకాలంలో దేవాదిదేవుడైన శ్రీమన్నారాయణుడే స్వామిపుష్కరిణి పాపపరిహారంలో గంగాది సకల తీర్థాలతో సమానమైనదని పేర్కొన్నాడు. ఋషులు, వాలఖిల్యులు, సిద్ధులు, స్వామిపుష్కరిణిలో స్నానమాచరించి ప్రతిదినం శ్రీనివాసుని సేవిస్తుంటారు. నారాయణాద్రిలో ఉండటం వల్ల శ్రీమన్నారాయణునికి అత్యంత

ప్రియతమమైన దనటంలో ఆశ్చర్యంలేదు. ఈ పుష్కరిణీ తీరంలో దానాలలోకెల్లా ఉత్తమమైన దానం అన్నదానం. వేంకటాద్రిలో నివసించే జనులకు అన్నపానాదులను ఎవరైతే సమకూరుస్తారో వారు సర్వరోగాల నుండి విముక్తు లవుతారు. ఎవరైతే ప్రత్యుపకారం ఆశించకుండా స్వామిపుష్కరిణీతీరంలో అన్నదానం చేస్తారో వారికి శ్రీనివాసుడు హరిభక్తిని ప్రసాదిస్తాడు. తమ శక్త్యానుసారం బంగారునుకాని, భూమినికాని, వస్త్రాలనుగాని, నువ్వులనుగాని, సుగంధద్రవ్యాలనుగాని దానం చేస్తే దీర్ఘాయువును, ఆరోగ్యాన్ని పొందుతారు.

బ్రహ్మదేవుడు కూడా స్వామి పుష్కరిణి మాహాత్మ్యాన్ని ఇలా వివరించాడు- స్వామి పుష్కరిణీతీరంలో సువర్ణాభరణాన్ని దానం చేసి చంద్రుడు లావణ్యాన్ని పొందాడు. పూర్వం మన్మధుడు కన్యాదానం చేసి సౌందర్య వంతుడయ్యాడు. కుబేరుడు బంగారును దానంచేసి ధనాధిపతయ్యాడు. ఇంద్రుడు షోడశదానాలు చేసి దుర్జయులైన, బలవంతులైన రాక్షసులను జయించాడు. భూలోకంలో నివసిస్తూ అందులోను వేంకటాచలంలో నిత్యనివాసంచేసే భక్తులు స్వామిపుష్కరిణితీరంలో ఎంతోకొంత దానం చేస్తే పుణ్యాత్ములు చేరే ఉత్తమలోకాలను పొందుతారు. ఒకానొకప్పుడు మార్కండేయ మహర్షి బ్రహ్మగురించి తపస్సుచేసి ముల్లోకాలలో ఉండే తీర్థాలను సేవించే శక్తినిమ్మని కోరతాడు. అందుకు బ్రహ్మ

**లోకే సర్వేషు తీర్థేషు స్నానం వర్షశతైరపి ।**
**కర్తుం న శక్యతే బ్రహ్మన్! న మయా న చ శంభునా ॥** (37.9)

ముల్లోకాలలో ఉన్న తీర్థాలలో స్నానంచేయడం నాచేత శివునిచేత కూడా వీలుకాదు. వేంకటాచలంలో ఉండే స్వామిపుష్కరిణీతీర్థం సకల శ్రేష్ఠమైనది. ముల్లోకాలలోని తీర్థాలలో సర్వశ్రేష్ఠమైనది.

**ధనుర్మాసేసితే పక్షే ద్వాదశ్యామరుణోదయే ।**
**ఆయాన్తి సర్వతీర్థాని స్వామిపుష్కరిణీ జలే ॥** (37.27)

మార్గశిరమాసం శుక్లపక్షంలో ద్వాదశినాడు అరుణోదయ సమయంలో ముల్లోకాలలో శ్రేష్ఠమైన తీర్థాలు స్వామి పుష్కరిణిలో కలుస్తాయి. పాపాత్ములైన జనులు తమ పాపాలను యిటువంటి తీర్థస్నానాలలో పోగొట్టు కుంటారు. 'సకల తీర్థాలకు అధీశ్వరి' అయినందువల్ల స్వామిపుష్కరిణీ అనే పేరు సార్థకమయింది.

**శాస్త్రాణాం పరమోవేదః దేవానాం పరమో హరిః ।**
**తీర్థానాం పరమం తీర్థం స్వామి పుష్కరిణీ నృప ॥** (44.38)

నారాయణాద్రిలోని స్వామిపుష్కరిణిస్నానం చేసి శ్రీమన్నారాయణుడైన శ్రీనివాసుని అర్చించి సకలాభీష్టాలను పొందవచ్చుననుటలో సందేహం లేదు.

## స్కందచరితం

దక్షునిచే అవమానింపబడిన సతీదేవి యోగాగ్నిలో దేహత్యాగం చేసిన తరువాత ఈశ్వరుడు సతీవిరహితుడై ఘోరతపస్సు చేశాడు. ఆ సమయంలో తారకాసురుడు శివునికొరకు తపస్సు చేసి, శివపుత్రునితో తప్ప ఎవరిచేత కూడా చంపబడకుండునట్లు వరాన్ని పొందుతాడు. సతీదేవి పర్వతరాజపుత్రి రూపంలో జన్మించి పార్వతిగా శివుని కల్యాణమాడుతుంది. ఇంద్రాదులు తారకాసురుని బాధలు భరించలేక శివపార్వతులను శరణువేడుతారు. శివునిచే వదలబడిన తేజస్సును భూదేవి భరించలేక అగ్నిదేవుని శరణు వేడుతుంది. అగ్నిదేవుడు భరిస్తాడు. అగ్నిదేవునిద్వారా గంగాదేవి శివతేజస్సును స్వీకరిస్తుంది. కాని భరించలేక పార్వతి ఆశ్రమసమీపంలో వదలివేస్తుంది. ఆరుగురు కృత్తికలు అక్కడకు వచ్చి ఆ తేజస్సును సంరక్షిస్తారు. అతడే కుమారస్వామి. తారకాసుర సంహారానంతరం ప్రాప్తించిన బ్రహ్మహత్యాదోషాన్ని పోగొట్టుకోవడానికి వేంకటాచలక్షేత్రాన్ని చేరి అక్కడి కుమారధారికా తీర్థంలో తపస్సుచేస్తూ శ్రీనివాసుని సేవిస్తూ కాలంగడిపాడు.

## విష్వక్సేనుడు

శ్రీనివాసుని సేనానాయకుడైన విష్వక్సేనుని గురించి వామనపురాణంలో వివరంగా చెప్పబడింది. పూర్వం 'కుంతలా' అనే అప్సరస ఇంద్రప్రేరణతో దుర్వాసాశ్రమాన్ని చేరి తపోభంగం కలిగిస్తుంది. తత్ఫలితంగా 'కిరాతి'గా జన్మించాలని శాపం పొందుతుంది. కాని దుర్వాసుని అనుగ్రహంతో పరాక్రమంలో విష్ణుసమానుడైన, దీర్ఘాయుష్మంతుని పుత్రునిగా పొందుటకు వరం కోరుతుంది. తత్ఫలితంగా 'సువర్చల' అనే పేరుతో కిరాతునికి పుత్రికగా జన్మించి వరుణదేవుని అనుగ్రహంవల్ల 'విష్వక్సేనుడనే' పుత్రుని పొందుతుంది. కుమారుడికి పది సంవత్సరములు రాగానే సువర్చల దేహత్యాగంచేసి అప్సరసగా దేవలోకం వెడుతుంది. తండ్రిచేత వదలిపెట్టబడినవాడై విష్వక్సేనుడు కశ్యపాశ్రమం చేరుకుంటాడు. ఈ విష్వక్సేనుని జన్మ కర్మవశంతో ప్రాప్తించినదికాదు. పూర్వం దేవతలచేత ప్రార్థింపబడినవాడై శ్రీమన్నారాయణుని ఆజ్ఞతో అసురసంహారార్థం అవతరించాడు. బ్రహ్మదేవుడు రాక్షససంహారార్థం శ్రీమన్నారాయణుని శరణు వేడడంతో, సేనానియైన విష్వక్సేనుడు దేవజిదాద్యసుర సంహారం చేశాడు.

## వాయుదేవోదంతం

వాయుదేవుడు ఘోరతపస్సుచేసి, షట్చత్వారింశత్ శ్లోకాలతో స్తుతిచేసి, శ్రీనివాసునినుండి అనవరత భగవత్సాన్నిధ్యాన్ని వరంగా పొందాడు. గ్రీష్మకాలంలో పంచాగ్నులమధ్య, వర్షాకాలంలో భూతలంపై నిలబడి, హేమంతశిశిరర్తువులలో స్వామిపుష్కరిణిలో శయనిస్తూ ఘోరతపంచేయడంతో శ్రీనివాసుడు సంతుష్టుడై అనవరత భగవత్సాన్నిధ్యాన్ని వరంగా ప్రసాదించాడు.

## ఉపరిచరవసువు

భక్తాగ్రేసరుడైన ఉపరిచరవసు వృత్తాంతం. ఒకానొక సమయంలో దేవతలు, మహర్షులు 'యజ్ఞం పశువుతో నిర్వహించాలా? ఔషధంతో నిర్వహించాలా?' అన్న సందేహం కలిగి భక్తుడైన ఉపరిచర వసుమహారాజును సంశయనివృత్తికి సమీపించారు. అయితే వసురాజు దేవతలు శ్రేష్ఠులనే మిషతో దేవతల అభిప్రాయమైన పశువునుపయోగించడమే శ్రేష్ఠమని సెలవిచ్చాడు. దీనికి మహర్షులు కోపగించి, రాజు చెప్పినది అధర్మమయితే అతడు పాతాళానికి చేరుతాడని, తమ అభిప్రాయం అధర్మమయితే తామే పాతాళాన్ని చేరతామని పేర్కొన్నారు. కాని చివరికి రాజే అధఃపాతాళాన్ని చేరుకోవలసివచ్చింది. అయితే ఆ సమయంలో కూడా భక్తాగ్రగణ్యుడైన మహారాజు శ్రీమన్నారాయణుని ధ్యానిస్తూ అధోలోకాన్ని చేరుతూంటే వాయువుకూడా 'ఇతడు విష్ణుభక్తు'డని జాగ్రత్తగా అధోలోకానికి చేర్చాడు. అసురులంతా యితడు తమ శత్రువని భావించి చంప ప్రయత్నించారు. కాని శ్రీమన్నారాయణుడు 'తన భక్తుడు యిటువంటి శిక్షకు అనర్హుడ'ని గరుత్మంతుణ్ణి వసురాజును రక్షించి, అతని రాజ్యానికి సురక్షితంగా చేర్చిరమ్మని ఆదేశించాడు. స్వామి ఆజ్ఞను శిరసావహించిన గరుడుడు పాతాళలోకంలో ఉన్న వసురాజును తన భుజాలపై అధిష్ఠించమనికోరగా 'భగవంతుడు ఆసీనమయ్యే ప్రాంతాన్ని తానధిష్ఠించడం తగదని' పలికి తన భక్తిని చాటుకున్నాడు. గరుత్మంతుడు వసువును సురక్షితంగా తీసుకొనివచ్చి స్వరాజ్యానికి చేర్చాడు. అంతట ఉపరిచరవసువు శ్రీమన్నారాయణుని అర్చిస్తూ చాలాకాలం సుపరిపాలనగావించాడు.

శ్రీమన్నారాయణుడైన శ్రీనివాసుని చరితమును శ్రద్ధతో పఠించువారు, వినువారు, వినిపించువారు సర్వదురితములనుండి విముక్తులై ఉపరిచరవసువు పాతాళమునుండి ఉద్ధరించబడినట్లు సంసారమునుండి శ్రీమన్నారాయణునిచే ఉద్ధరించబడుతారని వామనపురాణంలో స్పష్టంగా చెప్పడం జరిగింది.

# శ్రీవేంకటాచలమాహాత్మ్య గ్రంథము - పరిశీలన

డా॥ కె.వి. రాఘవాచార్య

**నమః శ్రీ వేంకటేశాయ శుద్ధజ్ఞాన స్వరూపిణే**
**వాసుదేవాయ శాంతాయ శ్రీనివాసాయ మంగళమ్ ॥**

శ్రీమహావిష్ణువు దుష్టశిక్షణార్థం, శిష్టరక్షణార్థం కృతయుగంలో నరసింహస్వామిగా, త్రేతాయుగంలో శ్రీరామచంద్రునిగా, ద్వాపరయుగంలో వాసుదేవునిగా, కలియుగంలో వేంకటేశ్వరునిగా అవతరించినాడు.

**కృతేతు నరసింహో౽భూత్ త్రేతాయాం రఘునందనః**
**ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయకః ॥**

విష్ణు భగవానుడు కలియుగంలో భక్తుల అనిష్టములను దొలగించి, అభీష్టములను ప్రసాదించుట కొరకు స్వయంవ్యక్త అర్చామూర్తి స్వరూపంలో శ్రీనివాసునిగా శేషాద్రిపై అవతరించాడు.

**శేషాచలే యన్మాహాత్మ్య మన్యక్షేత్రే నవత్ క్వచిత్**
**తద్గత శ్రీనివాసస్య మహిమా నాన్యగః శుభః ॥** **ఆదిత్య 1-8**

శ్రీమన్నారాయణుడు నిత్యవిభూతి యందు వైకుంఠమున శేషశాయి. లీలా విభూతి యందు శేషాద్రిపై స్థానకమూర్తి. శ్రీవారిసాన్నిధ్యం చేత శేషాద్రి యందున్న మహిమ ఏ ఇతర క్షేత్రమునకు లేదు. శేషాద్రిపై నెలకొనియున్న శ్రీనివాసుని/ వేంకటేశ్వరుని మహిమలు ఇతర పుణ్యక్షేత్రములందున్న అర్చామూర్తులందు కనిపించదు.

**వేదేషు చ పురాణేషు వేంకటేశ కథామృతం**
**వర్ణితం చేతి హాసేషు భారతాద్యాగమేషుచ ॥** **ఆదిత్య 1-9**

వేదములందు, పురాణములందు ఇతిహాసములందు, భారతాద్యాగమములందు అమృతంవంటి శ్రీనివాసుని మహిమలను తెలిపేకథలు వర్ణింపబడియున్నవి.

శ్రీమహావిష్ణువు శ్వేతవరాహకల్పాదిలో పాతాళమున నీటమునిగిఉన్న భూమండలమును ఉద్ధరింపదలచి, వరాహావతారమును ధరించి, హిరణ్యాక్షుని సంహరించి, భూమిని యథాస్థితిలో నిలిపినాడు. ఆ వరాహ విష్ణుమూర్తి లోకహితముకోరి, భూమిపై నివసింపదలంచి, వైకుంఠములో ఉన్న తనక్రీడాద్రిని వేంకటమనే పర్వతాన్ని గరుడునిచే తెప్పించి సువర్ణముఖినదీ సమీపంలో నెలకొల్పించినాడు. ఈ విషయాన్ని

**వైకుంఠలోకాద్గరుడేన విష్ణోః క్రీడాచలో వేంకటనామధేయః ।**
**ఆనీయచ స్వర్ణముఖీసమీపే, సంస్థాపితో విష్ణు నివాసహేతోః ॥**

అని మార్కండేయ పురాణం (2-69) వర్ణించింది. శ్రీనివాసుడు నెలకొన్న పర్వతం పేరు వేంకటం. దానికి అధిపతియైన శ్రీనివాసుడు వేంకటేశుడయినాడు. ఆ పేరు జనవ్యవహారంలో వేంకటేశ్వరుడుగా మారి ప్రసిద్ధమైంది.

శ్రీవేంకటేశ కథామృతం, వేంకటాచలక్షేత్రతీర్థముల మహిమలు 12 పురాణములలో వర్ణింపబడియున్నవి. ఆపురాణములు 1. వరాహ 2. పద్మ 3. గరుడ 4. హరివంశగత శేషధర్మం 5. బ్రహ్మాండ 6. మార్కండేయ 7. వామన 8. బ్రహ్మ 9. భవిష్యోత్తర 10. స్కంద 11. ఆదిత్య 12. భాగవత పురాణములు.

క్రీ.శ. 1491లో పసిండి వేంకటత్తురైవర్ (జీయర్ రామానుజయ్యన్) అను శ్రీవారి అర్చకులు "ఘనుడగు ప్రౌఢమాలకరి కమ్మని పువ్వులు గూర్చి దండగట్టినక్రియ" ఆ 12 పురాణములలోనున్న శ్రీ వేంకటాచలక్షేత్ర, తీర్థ, దైవతమాహాత్మ్యములను వర్ణించే భాగములను (అధ్యాయాలను) సంగ్రహించి, తిరు వేంకట మాహాత్మ్యమను పేరున సంకలనం చేసినాడు. స్వయంవ్యక్తమైన శ్రీనివాస అర్చావతారమునకు పౌరాణిక మూలమును, ప్రశస్తిని నిరూపించుటయే పసిండి వేంకటత్తురైవర్ ఉద్దేశ్యంగా ఉన్నది. అతడే శ్రీవారి సన్నిధిలో దేవతాప్రీతి కొరకు తిరువేంకట మాహాత్మ్యమును పారాయణము చేయుటకు ఏర్పాటుచేసి క్రీ.శ. 27-6-1491 తేదీ న శాసనం వేయించినాడు (తి.తి.దే. శాసన సంపుటి Vol.2-95) వేంకటత్తురైవర్ ఈ పారాయణసేవ జరిపించుటకు శ్రీవారి బండారమునకు 2000 నర్పణములు మూలధనంగా సమర్పించినాడు. దీనిపై వచ్చు ఆదాయముతో శ్రీవేంకటాచలమాహాత్మ్యపారాయణసేవ, ప్రసాద వినియోగము ఏర్పాటుచేయబడినవి.

పసిండి వేంకటత్తురైవర్ వేయించిన తమిళ శాసనములో చివరి వాక్యమిట్లున్నది- "తిరువేంగడముడై యాన్ ఇంద తిరువోలక్కం కండరుళ కిఅపోదు ఇవర్ విణ్ణప్పంశెయ్‌ద తిరువేంకట మాహాత్మ్యత్తుక్కు అరుళప్పాడిట్టు కేట్టరుళక్కడ వరాహవుం" ఈ తమిళ వాక్యమునకు ఆంగ్లానువాద మిట్లున్నది- "God Tiruvenkata mudaiyan will, while presiding at the said Tiruvalokkam, be graciously pleased to hear, after honourable announcement made there for, the TIRUVENKATA MAHATMYAM compiled and humbly presented by him" (the Donor). vol.II No. 95 T T.D Inscriptions, 1998, P : 198). తిరువోలక్కం అనగా అస్థానము. ఆనాడు శ్రీవారి కొలువు జరుగుచున్నప్పుడు ఈ తిరువేంకట మాహాత్మ్యగ్రంధమును పారాయణము చేసెడినారు.

తిరుమల-తిరుపతి దేవస్థానంలో శాసన పరిశోధకుడుగా పనిచేసిన సాధుసుబ్రహ్మణ్యశాస్త్రి, (1889-1981)పై తమిళ శాసనమందలి 'ఇవర్ విణ్ణప్పం శెయ్‌ద' (వీరు విన్నపంచేసిన) అను విశేషణం ఆధారంగా గైకొని శ్రీవేంకటాచల మాహాత్మ్యగ్రంధమును మొట్టమొదట సంకలనం చేసినవారు పసిండి వేంకటత్తురైవర్ అని నిరూపించినారు.

ఇట్లు వేంకటాచల క్షేత్ర, తీర్థ, దైవతముల మహిమలను వర్ణించే పురాణభాగములతో కూర్చిన తిరు వేంకటమాహాత్మ్యమను సంకలనగ్రంథం క్రీ.శ. 1491 నాటికి రూపొందియుండినట్లు స్పష్టమగుచున్నది.

క్రీ.శ. 16 శతాబ్దంలో పెక్కురు శ్రీవారిభక్తులు శ్రీవేంకటాచల మాహాత్మ్య పారాయణసేవకు ఏర్పాటు చేసినట్లుగా వరుసగా క్రీ.శ. 19-1-1545, 5-7-1545, 15-7-1545, 17-7-1546, 3-6-1547, నాటి శాసనములు (తి.తి.దేవస్థానశాసన సంపుటి 5-29, 5-51, 5-53,5-71, 5-92) తెలియజేయుచున్నవి. తిరుపతి నివాసి పెన్‌గొండశెట్టి కుమారుడు కాళత్తిశెట్టి తిరుమల శ్రీవేంకటేశ్వరాలయంలో తైమాసి నెలల్లో నిత్యోత్సవములను ఏర్పాటు చేసినాడు. ఇందులో భాగంగా శ్రీనివాసపురాణ పారాయణమును ఏర్పాటు చేసినట్లు క్రీ.శ. 31-12-1543 నాటి శాసనం (తి.తి.దే. శాసనసంపుటి 5-10, పేజి. 30) వలన తెలియుచున్నది. దీని వలన శ్రీవేంకటాచలమాహాత్మ్య గ్రంథమునకు తిరువేంకట మాహాత్మ్యము, శ్రీనివాస పురాణము అను నామాంతరము లున్నట్లు తెలియుచున్నది.

క్రీ.శ. 1491కి పూర్వము దేవస్థాన శాసనములలో తిరువేంకట మాహాత్మ్యం ప్రస్తావన కనిపించకున్నను శ్రీవారిసన్నిధిలో పురాణములు పారాయణం చేసే 'పురాణభట్టరు' అను ఉద్యోగస్థులు ఉండెడివారు అనుటకు శాసనాధారములు గలవు. 2-18 (క్రీ.శ. 18-1-1464) 5-100 (క్రీ.శ. 14-11-1547) శాసనములు పురాణభట్టరు (పురాణ పాఠకుడు) సేవలను గురించి, వారి వేతనముల గురించి తెలియజేయుచున్నవి. ఈ పురాణభట్టరులు కౌశిక పురాణం, రామాయణం, భాగవతములతో పాటు శ్రీవేంకటేశ్వరుని మహిమలను వర్ణించిన ఆయా పురాణభాగములను కూడా పారాయణము చేయుచుండెడివారని భావించవచ్చును.

తాళ్ళపాక అన్నమాచార్యులు (క్రీ.శ.1408-1503) "దివ్యభాష నా వేంకటాద్రి మాహాత్మ్య మంతయు"ను రచించినట్లు అన్నమయ్య మనుమడు చిన్నన్న అన్నమాచార్య చరిత్ర (ద్విపదకావ్యం) పుట:46లో తెలిపియున్నాడు (తి.తి.దే. ప్రచురణ, 1978) తాళ్ళపాక అన్నమాచార్యులు రచించిన సంస్కృత వేంకటాచల మాహాత్మ్యము లభించలేదు. అయినను అన్నమాచార్యులు తన సంకీర్తనలలో వివిధ పురాణములలో నున్న వేంకటేశ్వర మాహాత్మ్య కథాంశములను తెలియజేసినాడు-

**శ్రీవేంకటేశుడు శ్రీపతియునితడె**
**పావనపు వైకుంఠ పతియును నితడె**

**భాగవతములో జెప్పె బలరాము తీర్థయాత్ర**
**నాగమోక్తమైన దైవత మాతడితడె**
**బాగుగా బ్రహ్మాండ పురాణపద్ధతియాతడితడె**
**యోగమై వామన పురాణోక్త దైవమితడె.**

**వెలయ సప్తఋషులు వెదకి ప్రదక్షిణము**
**లలర జేసిన దేవుడాత డితడె**

నెలవై కోనేటిపొంత నిత్యము గుమారస్వామి
కలిమి దపముసేసి కన్నదేవుడితడె.

యెక్కువై బ్రహ్మాదులు నెప్పుడు నింద్రాదులు
తక్కక కొలిచియున్న తత్త్వమీతడు
చక్కనారదాదుల సంకీర్తనకు జొక్కి
నిక్కిన శ్రీవేంకటాద్రి నిలయుడు నితడె. ఆధ్యాత్మ సంకీర్తనలు - 1-425

అన్నమయ్య భాగవతము, బ్రహ్మాండ, వామన, వరాహ, మార్కండేయ పురాణములలోనున్న వేంకటాచల మాహాత్మ్యకథాంశములను పేర్కొన్నాడు. సంస్కృత భాగవతము దశమస్కంధము 79 అధ్యాయములో బలరాముని తీర్థయాత్రా సందర్భములో వేంకటాచల ప్రశంస కలదు. దశమ స్కంధములో 89 అధ్యాయములో భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించిన కథాంశముగలదు. ప్రస్తుతము ముద్రణ పొంది, ప్రచారములోనున్న శ్రీవేంకటాచలమాహాత్మ్య గ్రంధములో భాగవతంలోని అధ్యాయాలు (79,89) చేర్చబడలేదు.

అన్నమాచార్యుల సంకీర్తనములలో వేంకటాచల మాహాత్మ్యగ్రంథములో చేర్చబడియున్న కొన్ని స్థానిక దేశిగాధలు కనిపించుచున్నవి.

"ఎటువంటి వాడవో నీమహిమ లెట్టు దెలియ వచ్చును
నిటలలోచనుడు అజుడు తెలియలేరు నిన్నెట్లు దెలిసేరు మానవులు

తిరుమల నంబి తాతాత యన్నవాడె తెలిసెబో మీ పెద్దతనములు
కురువనంబి గారి చేతి బంకమట్టి పువ్వులు కొన్నవాడె తెలిసె మీ భోగము
మరియు ననంతాళువారి చెరువుగట్ట మన్నుమోయగా దెలిసె మీనటనలు
గరుడ గంభముకాడ కాసు కొక్క వరమిచ్చి గడియించ దెలిసె మీ సంపద

తొండమాం చక్రవర్తికి సంపద తొలుత నియ్యగా దెలిసె మీయావులు
అండ యెరుకు వారి కొఱ్ఱ చేని యెన్ను లారగించగా దెలిసె మీ రుచులు
వుండి గొల్లల కావిళ్ల పాలెల్ల వుట్టుకోగ దెలిసె మీ వేమములు
దండిగ పంపంగి మాకుల వడిపించ దైవరాయ తెలిసె మీ విద్యలు

ముమదాసు తిమ్మన్న తుంబురు కొండకు మోక్షమియ్యగా దెలిసె మీ బుద్ధులు
పవివడితాళ్ళపాక అన్నమయ్యగారి పదములలో దెలిసె మీ హోజలు

**యెవయ శ్రీవేంకటనాథ యలుమేల్మంగ నెదనుంచగా దెలిపె మీ గోప్యము**
**వెనుకొని పరుషవారి కెదురువోయి వెంటరాగా దెలిపె మీరాజసము**

శేషాచార్యుల వ్రాత ప్రతి, అన్నమాచార్య చరిత్ర పీఠిక, 1978, పుట : 25, 26

"శ్రీనివాస జగదేకనాయక ఆశ్రితకల్పతరువ" ఇత్యాది కీర్తనలోని-

**"తొండమాం చక్రవర్తిపై సేసిన దయ సేయుమయ్య**
**కురువనంబిగారి మీదనుంచిన కూర్మి నాపై నుంచుమయ్య**

తాళ్ళపాక సంకీర్తనలు. సంఖ్య: 6609 ఎ పేజి: 42 కాగితపు వ్రాతప్రతి. యస్.వి.యు.ఒ.ఆర్.ఐ. గ్రంథాలయం

పంక్తులు వేంకటాచలమాహాత్మ్యములోని కథాంశములను పేర్కొనుచున్నవి. ఆ వ్రాతప్రతిలోనే 134, 135 పుటలలో కురువనంబి యొక్క భక్తిని ప్రశంసించుచున్న కీర్తన గలదు.

పై ఉదాహరణములను బట్టి తాళ్ళపాక అన్నమాచార్యులు బ్రహ్మాండ, భాగవత, వరాహ, వామన, మార్కండేయాది పురాణములలోని, వేంకటాచల ఇతిహాసమాలలోని వేంకటాచలక్షేత్ర, తీర్థ, దైవత మాహాత్మ్య సంబంధి కథాంశములను సంగ్రహించి, సమన్వయించి సంస్కృతమున ఒక క్షేత్రమాహాత్మ్యమును రచించి యున్నట్లు నిశ్చయింపవచ్చును. ప్రకృతము ప్రచారములో నున్న శ్రీవేంకటాచల మాహాత్మ్యగ్రంథము (సంకలనము) అన్నమాచార్యుని రచనయేనని నిరూపించుటకు తగిన ఆధారములు లేవు. ఈ సంకలన గ్రంథకర్త పసిండి వేంకటత్తురైవర్ అని నిశ్చయింపవచ్చును. సంస్కృత వేంకటాద్రి మాహాత్మ్య గ్రంథకర్త అన్నమాచార్యులు, వేంకటాచలమాహాత్మ్య సంకలన గ్రంథకర్త వెంకటత్తురైవరు సమకాలికులుగా తిరుమలలో నివసించి, శ్రీవారికి సేవచేసియుండుట గుర్తుంచుకోవలసిన వాస్తవాంశములు. సంకలన గ్రంథము పురాణముల మూలముండుటచే, పారాయణార్హత గల్గియుండుటచే నేటికీ నిలిచినది. అన్నమయ్యగ్రంథము స్వతంత్ర గ్రంథమగుటచే పారాయణ యోగ్యతకోల్పోయి నష్టమైయుండును.

ఈ వేంకటాచల మాహాత్మ్య సంబంధి పౌరాణిక కథాంశములు వేంకటేశ సుప్రభాత రచయిత ప్రతివాది భయంకర అణ్ణన్ (క్రీ.శ. 1361-1453) కాలము నాటికే దేశంలో ప్రచారములో యున్నట్లు సుప్రభాతములోని కొన్ని శ్లోకములు సాక్ష్యమిచ్చుచున్నవి.

**బ్రహ్మాదయ స్సురవరా స్సమహర్షయస్తే**
**సంతస్సనందన ముఖాస్త్వథ యోగివర్యాః**
**ధామాంతికే తవహి మంగళ వస్తు హస్తాః**
**శ్రీవేంకటాచలపతే తవ సుప్రభాతమ్ ॥** 27 శ్లో॥

ఈ శ్లోకభావము వేంకటాచల మాహాత్మ్య గ్రంథములోని వరాహపురాణం ప్రథమభాగంలోని 47 అధ్యాయము లోని 'బ్రహ్మాది దేవతల భగవన్మందిర ప్రవేశము' అనుకథాంశమును సూచించు చున్నది.

**శ్రీవైకుంఠ విరక్తాయ స్వామి పుష్కరిణీ తటే**
**రమయా రమమాణాయ వేంకటేశాయ మంగళమ్ ॥** శ్రీవేంకటేశ్వర మంగళాశాసనం, 12 శ్లో॥

శ్రీవేంకటేశుడు వైకుంఠముపై విరక్తితో స్వామిపుష్కరిణీతీరమున లక్ష్మీసహితుడై విహరించుచున్నాడు అను ఈ శ్లోకభావము శ్రీవేంకటాచల మాహాత్మ్య గ్రంథమున పలుచోట్ల వర్ణింపబడియున్నది.

**మాయానీ పరమానంద: త్యక్త్వా వైకుంఠ ముత్తమం**
**స్వామి పుష్కరిణీ తీరే రమయా సహమోదతే ॥** హరివంశాంతర్గత శేషధర్మ: 48-15 శ్లో॥

**వైకుంఠా త్పరమోహ్యేష వేంకటాఖ్య నగోత్తమ:**
**అత్రైవ నివసా మ్యేవ శ్రీభూసహితోహ్యహమ్ ॥** వరాహ ప్రథమభాగం, 35-12 శ్లో॥

-ఈ వేంకటాచలము వైకుంఠము కంటె ఉత్తమమైనది. నేను శ్రీభూదేవులతో నిచ్చటనే యుందును అని. పై శ్లోక భావము. ఇంకను వేంకటాచల మాహాత్మ్య గ్రంథము (1896)లో (పుటలు: 129, 140, 161, 162, 521) ప్రకటింపబడియున్నది. ఇంకను సుప్రభాతమున 6,9,14,15 శ్లోకములందు, స్తోత్రములోని రెండవ శ్లోకము నందు శ్రీవేంకటాచలమాహాత్మ్యసంబంధి కథాంశములు వర్ణింపబడియున్నవి.

శ్రీ వేంకటేశ స్తోత్రములోని చివరి మూడు శ్లోకములు-

**"వినావేంకటేశం ననాథో ననాథ:, సదా వేంకటేశం స్మరామి స్మరామి ।**
**హరే వేంకటేశ ప్రసీద ప్రసీద, ప్రియం వేంకటేశ ప్రయచ్ఛ ప్రయచ్ఛ ॥**

**అహం దూరతస్తే పదాంభోజయుగ్మ ప్రణామేచ్ఛయాఽఽగత్యసేవాంకరోమి ।**
**సకృత్సేవయా నిత్య సేవాఫలం త్వం, ప్రయచ్ఛప్రయచ్ఛ ప్రభో వేంకటేశ ॥**

**అజ్ఞానినా మయా దోషాన్ అశేషాన్ విహితాన్ హరే ।**
**క్షమస్వత్వం క్షమస్వత్వం శేషశైల శిఖామణే: ॥** (9,10,11 శ్లో॥)

శ్రీ వేంకటాచల మాహాత్మ్య గ్రంథములోని మార్కండేయ పురాణభాగములో మార్కండేయ మహర్షి శ్రీనివాసుని స్తుతించు సందర్భమున గలవు. (20,21,22 శ్లో॥ 1896 ప్రతి, పుట: 199) ఈ పరిశీలన వలన క్రీ.శ. 14 శతాబ్దమునకు ముందే- సుప్రభాతరచనకు ముందే వేంకటాచలక్షేత్ర మహిమలను ప్రకటించు పురాణకథలు ప్రచారములో ఉండెనని స్పష్టమగుచున్నది. వీటితో పాటు తొండమాను వృత్తాంతము, వసువను నిషాదుని

కథ, కుమ్మరి కురువనంబి కథ వంటి స్థానిక దేశీయగాథలు సంస్కృతీకరింపబడి ఆయా పురాణములలో చేర్చబడినట్లు నిశ్చయింపవచ్చును. పద్మావతి శ్రీనివాస కల్యాణ కథలో సోదికత్తె ప్రవేశము చిలుక రాయబారము మొదలగు ఘట్టములు దేశినాటక లక్షణముల ప్రభావమును ప్రకటించుచున్నవి.

శ్రీనివాస మంగాపురములో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి దేవాలయమును పునర్నిర్మాణము చేయించి, తాళ్ళపాక చిన తిరుమలాచార్యులు (అన్నమాచార్యుల మనుమడు, పెదతిరుమలాచార్యుల కుమారుడు) వేయించిన క్రీ.శ. 22-3-1540 నాటి తెలుగు శాసనములో 'స్కాందపురాణోక్తమైన శ్రీవేంకటేశ మాహాత్మ్య' ప్రస్తావన గలదు. (తి.తి.దేవస్థాన శాసన సంపుటం: 4, సంఖ్య 144, 1998) ఇట్లు వేంకటేశమాహాత్మ్య సంబంధికథలు వివిధ పురాణములలో ఉన్నట్లు నిరూపించే సాహిత్య, శాసనాధారములు ఉన్నవి.

క్రీ.శ. 1491 నుండి తిరుమల శ్రీవారి ఆలయంలో పారాయణ గ్రంథంగా గౌరవింపబడిన శ్రీవేంకటాచలమాహాత్మ్య గ్రంధము తాళపత్ర గ్రంధరూపంలో క్రీ.శ. 1884 వరకు దేశమంతటా ప్రచారములో నుండెను. ఈ సంస్కృత గ్రంథమునకు క్రీ.శ. 16 శతాబ్దం ఉత్తరార్థంలోనే తెలుగు అనువాదములు వెలువడినవి. అనువాదకులలో తెనాలి రామకృష్ణుని అల్లుడు బహుకావ్యకర్త లింగమకుంట రామకవి (క్రీ.శ. 1520-1580) ప్రథముడుగా ఉన్నాడు. రామకవి రచించిన శ్రీవేంకట మాహాత్మ్యము లభించలేదు. విజయనగర రాజవంశీయుడు పూసపాటి కొండరాజు (క్రీ.శ. 17 శతాబ్దం పూర్వభాగము) రచించిన వేంకటాచలమాహాత్మ్యము రెండవది. ఇదియు లభించలేదు. శ్రేష్ఠలూరి వేంకటార్యుడు (క్రీ.శ. 17 శతాబ్దం పూర్వభాగం) శ్రీనివాసుని పురాణకథలలో గల పూర్వోత్తర విరోధములను సవరించి, సమన్వయించి 'శ్రీనివాస విలాస సేవధి' అను ఆరు ఆశ్వాసముల ద్విపదకావ్యమును రచించినాడు. వేంకటార్యుడు వరాహ, వామన, బ్రహ్మాండ, పద్మ, గరుడ, స్కంద, మార్కండేయపురాణముల లోని కధలను శోధించి, కసటుదేర్చి, ప్రసిద్ధకధ సంగ్రహించి, సర్వసమాధాన సరణి దీపింప శ్రీనివాస విలాస సేవధిని రచించినాడు (ఆ॥ 137-144 పంక్తులు). తరిగొండ వేంగమాంబ (క్రీ.శ. 1730-1817) వరాహ, భవిష్యోత్తర, పద్మ పురాణములనుండి కథను గ్రహించి శ్రీవేంకటాచల మాహాత్మ్యమను పద్యకావ్యమును రచించినది. ఇందులో ఆరు ఆశ్వాసములు గలవు. ఈ గ్రంథం తొలుత క్రీ.శ. 21-11-1866 న ప్రచురించబడింది. వద్దిపర్తి కోనం రాజు (క్రీ.శ. 1754-1834) వేంకటేశ్వరోపాఖ్యానము అను నాలుగు ఆశ్వాసముల పద్యకావ్యమును రచించినాడు. సి.పి. బ్రౌను పండితులలో ఒకడైన ములపాక బుచ్చన్నశాస్త్రి (క్రీ.శ. 19 శతాబ్దం) వేంకటేశ్వర మాహాత్మ్యము అను పద్యకావ్యమును రచించినాడు. దామెర చిన వేంకటరాయకవి (క్రీ.శ. 19 శతాబ్దం) వరాహ పురాణమందలి ప్రథమభాగమును వేంకటాచలమాహాత్మ్యమను పేర పద్యకావ్యముగా అనువదించినాడు. ఇందులో మూడు ఆశ్వాసములు గలవు. శిష్టు కృష్ణమూర్తి శాస్త్రి (క్రీ.శ. 1790-1870) వరాహ పురాణమందలి ద్వితీయభాగమును వేంకటాచలమాహాత్మ్యమను పేర పద్యకావ్యముగా అనువదించినాడు. ఇందులో మూడు ఆశ్వాసములు గలవు ఈ గ్రంథము క్రీ.శ. 4-3-1858 తేదీ ప్రకటించబడింది.

ఇట్లు దేశమున వేంకటాచలమాహాత్మ్యము తెలుగు అనువాదగ్రంథములు ప్రచురించబడి, ప్రచారములో యుండగా సంస్కృత వేంకటాచల మాహాత్మ్య (సంకలన) గ్రంథము తెలుగు లిపిలో తి.తి.దేవస్థానముల విచారణ కర్త అయిన మహంతు భగవాన్ దాసు (క్రీ.శ. 1880-1890) చేత మొట్ట మొదటగా శక సం॥ 1806 శ్రీ తారణ శ్రావణ శుద్ధ ద్వితీయ దినమున (క్రీ.శ. 24-7-1884) ప్రకటించబడింది. ఈ ప్రతి ప్రస్తుతం కనిపించుటలేదు. ఈ సంకలన గ్రంథములో చేర్చబడిన ఆళ్వారుల మంగళాశాసన పాశురములందలి భావములు, ఇతిహాసమాలలోని వృత్తాంతములు మొదలగు అధికాంశములు సర్వజన సమ్మతముగాలేదు. పెక్కు ఆక్షేపణలు, విమర్శలు వచ్చినవి. అందుచేత ఆరునెలల్లోనే ఈ వేంకటాచల మాహాత్మ్యమందలి ఆక్షేపణకరమైన అధికాంశములను తొలగించి, సవరించి, సర్వజన సమ్మతమగునట్లు పొదుపయిన పురాణాంశములను నిలిపి, తెక్కుళూరు శ్రీనివాసరంగాచార్యులు చేత పరిష్కరింపజేసిన శుద్ధ ప్రతిని శక సం॥ 1806 తారణ మకర శుద్ధ ద్వాదశినాడు (క్రీ.శ. 27-1-1885) మహంతు భగవాన్‌దాసు ప్రకటించినాడు. ఈ శుద్ధప్రతి నానాదేశ సమానీత ప్రాచీనానేక శ్రీకోశముల నవలోకించి, పరిష్కరించినట్లు ముఖపత్రమున తెలుపబడింది. ఈ గ్రంథ ప్రకటన కార్యక్రమమంతా శ్రీవేంకటనాథభగవద్దివ్య భాండాగారోద్ధృత ముద్రణా సముచిత ద్రవిణ ప్రదాన రూపసహాయముచేత నిర్వహించబడింది. క్రీ.శ. 1884 ప్రతియొక్క ఆచూకి తెలియ కున్నను ఈ శుద్ధప్రతి (1885) మాత్రము మద్రాసు, అడయారు గ్రంథాలయంలో లభిస్తున్నది.

ఈ 1885 నాటి శుద్ధప్రతి శ్రీవేంకటాచల మాహాత్మ్యగ్రంథము రెండవసారి మహంతు రామకిశోర్ దాసు (క్రీ.శ. 1894-1900) చేత క్రీ.శ. 29-7-1896 న ప్రకటించబడింది. దీనిలో పరిష్కర్త పేరుకలదు. తర్వాత ప్రచురణలలో పరిష్కర్త పేరు కనిపించుటలేదు. తి.తి.దేవస్థానం శ్రీవేంకటాచలమాహాత్మ్య గ్రంథమును తెలుగు లిపిలో రెండుభాగములుగా 1959, 1961 లో ప్రచురించారు.

# వరాహపురాణము - శ్రీ వేంకటాచలమాహాత్మ్యము

*డి. భారతి*

శ్రీ వేంకటాచలం వేదకాలంనుంచి పరమపావన క్షేత్రంగా ప్రఖ్యాతిగాంచిన దివ్యస్థలం. కలియుగం ప్రారంభంకాక ముందే పరమాత్ముడు జీవకోటినుద్ధరించడానికై ఈ కొండమీద నెలకొన్నట్లు పురాణాలు ఘోషిస్తున్నాయి. కలియుగంలో వేంకటాచలం పరమ ప్రశస్తమైన పుణ్యక్షేత్రం. దాని మహిమ వింటే చాలు సకల శుభాలు సమకూరుతాయి. అసలు వేంకటాద్రి అనే పదానికి అర్థం 'వేం' అంటే పాపములను 'కటము' దహింపచేయునది అని అర్థం.

శ్రీవేంకటాచల మాహాత్మ్యము అనేక పురాణముల నుండి సంగ్రహింబడినప్పటికి వరాహపురాణము దానిని విస్తరముగ అభివర్ణించినట్లు తెలియుచున్నది. వరాహపురాణము వేంకటాచల మాహాత్మ్యమును పేర్కొన్న తీరు అనన్యసాధారణముగ కనపడుచున్నది.

వరాహపురాణము మహాపురాణములలోనిది. ఈ పురాణములో నలుబది అధ్యాయములలో శ్రీవేంకటా చలమాహాత్మ్యము ఎంతో చక్కగా వర్ణించబడినది. ఈ పురాణమునందు 218 అధ్యాయములు, 24,000 శ్లోకము లున్నట్లు తెలియుచున్నది. వేంకటాచలమాహాత్మ్యమును ఎక్కువ అధ్యాయములలో వర్ణించిన పురాణము వరాహపురాణము మాత్రమే.

## శ్వేతవరాహ వృత్తాంతము

సృష్టి, స్థితి, లయకారకుడైన శ్రీమన్నారాయణుడు భూమినుద్ధరింపగోరి శ్వేతవరాహరూపముతో పాతాళమున ప్రవేశించి హిరణ్యాక్షునితో యుద్ధం చేసి అతనిని సంహరించెను. కొంతకాలము భూమిపై నివసింపగోరినవాడై వైకుంఠమునుండి గరుడునిద్వారా క్రీడాద్రిని భూమికి తెప్పించెను. ఈ క్రీడాద్రికే "వేంకటాద్రి" అను పేరు వచ్చింది. ఈ క్రీడాద్రియందలి "క్రీడావాపి" యే స్వామిపుష్కరిణిగా ప్రసిద్ధి చెందినది. వేంకటాద్రిపైన భగవంతుడు నివసించుటచే దానికి అనల్పమగు మహిమ కలిగినది.

1. శ్రీశైలము 2. శేషశైలము 3. గరుడాచలము 4. వేంకటాద్రి 5. నారాయణాద్రి 6. వృషభాద్రి 7. వృషాద్రి అను ఈ ఏడుకొండలను కలిపి సప్తగిరినాథుడని, ఏడుకొండలవాడని స్వామిని వ్యవహరించుట సంప్రదాయ మైనది.

వేంకటాచలము గోమతీనదికి దక్షిణమున అరువది యోజనముల దూరమున, తూర్పుసముద్రమునకు పశ్చిమమున ఐదుయోజనముల దూరమున, సువర్ణముఖీ నదికి ఉత్తరభాగమున గరుడునిచే స్థాపించబడినట్లు వరాహపురాణము పేర్కొనుచున్నది.

వరాహపురాణమునందు ఈ పర్వతము ఇట్లు ప్రసిద్ధమైనట్లు చెప్పబడినది.

కృతయుగమున అంజనాద్రి అని, త్రేతాయుగమున నారాయణాద్రి అని, ద్వాపరయుగమున సింహాద్రి అని, కలియుగమున శ్రీవేంకటాచలమని ప్రసిద్ధినొందినది.

## వరాహపురాణము నందలి వేంకటాద్రిపై ఉన్న తీర్థములు

1. కుమారధారా తీర్థము, 2. కపిలతీర్థము, 3. పాండవతీర్థము, 4. జరాహర తీర్థము, 5. ఫల్గుణీ తీర్థము, 6. జాబాలి తీర్థము, 7. సనకసనందన తీర్థము, 8. కాయరసాయన తీర్థము, 9. తుంబురు తీర్థము, 10. ఆకాశగంగా తీర్థము. 11. పాపనాశన తీర్థము, 12. దేవ తీర్థము, 13. పద్మ సరోవర తీర్థము, 14. అస్థి సరోవర తీర్థము.

పరమ పవిత్రమైన వేంకటాచలమున అనేక తీర్థములు ఏర్పడినవి. అవి ఎంతో ప్రభావ సంపన్నములై మానవులయొక్క అనేక జన్మల పాపములను పోగొట్ట సమర్థమైనవిగా కీర్తింపబడినవి. ప్రతి తీర్థమునకు ఏదో ఒక ఇతిహాస సంబంధము కూడ ఉన్నట్లు అనేక పురాణములనుండి సంగ్రహింపబడిన వేంకటాచల మాహాత్మ్యము వివరించుచున్నది.

తీర్థము అంటే పుణ్యము అని అర్థము. పవిత్ర జలము అని అర్థముగూడ. తీర్థశబ్దము కాలక్రమమున ప్రయోగింపబడినది. వేంకటాచలమహాత్మ్యము పదకొండు పురాణములనుండి సంగ్రహించి తిరుమల-తిరుపతి దేవస్థానమువారు శ్రీవేంకటాచలమాహాత్మ్యమును రెండు భాగములుగా ప్రచురించియున్నారు.

శ్రీవేంకటాచలమాహాత్మ్యము, వరాహ, పద్మ, గరుడ, హరివంశ, బ్రహ్మాండ, మార్కండేయ, వామన, బ్రహ్మ, స్కాంద, ఆదిత్య, భవిష్యోత్తరపురాణములలో దొరకుచున్నది.

వరాహపురాణమునందలి ప్రథమభాగములోని ముప్పది మూడవ అధ్యాయమునుండి ఆరువదిమూడవ అధ్యాయము వరకు గల ముప్పది అధ్యాయములు వేంకటాచలమును, దాని వైభవమును, శ్రీనివాసుని వృత్తాంతమును వివరించుచున్నవి. వరాహపురాణములోని ద్వితీయభాగములో మొదటి అధ్యాయమునుండి పదవ అధ్యాయము వరకుగల పది అధ్యాయములలోకూడా వేంకటాచల మాహాత్మ్యము వర్ణింపబడినది.

## స్వామిపుష్కరిణి

వేంకటాచలము నందున్న స్వామి పుష్కరిణి మానవ నిర్మితము కాదు. అది స్వయంవ్యక్త క్షేత్రము గనుక అచ్చటి పుష్కరిణి కూడా స్వయంవ్యక్తమయినది.

స్వామి పుష్కరిణి అను ప్రసిద్ధి ఈ ఒక్క పుష్కరిణికే ఏర్పడినది. ఈ పుష్కరిణిని వరాహ-పద్మ-మార్కండేయ-వామన-స్కాంద-బ్రహ్మ-భవిష్యోత్తర పురాణములు అభివర్ణించుచున్నవి. వేంకటాద్రియందున్న మూడుకోట్ల తీర్థములకు స్వామిపుష్కరిణి అవతారస్థానమని ప్రసిద్ధికలదు. స్వామిపుష్కరిణి ఆవిర్భావము గూర్చి వరాహపురాణము ఇట్లు చెప్పుచున్నది.

శ్వేతవరాహరూపమున భూమిని ఉద్ధరించిన విష్ణువు ఆదేశానుసారము వైకుంఠమునుండి క్రీడావాపిని గరుడుడు భూలోకమునకు తీసికొనివచ్చెను. ఇది గంగాది సర్వతీర్థములకు ఉత్పత్తి స్థానమని శ్రీనివాసుడు వేంకటాద్రిపై అవతరించకముందే స్వామి పుష్కరిణి అచ్చట ఆవిర్భవించినదని వరాహపురాణము ప్రతిపాదించుచున్నది. ఇతర పురాణములందు స్వామిపుష్కరిణి మాహాత్మ్యము వర్ణింపబడినదేకాని వేంకటాచలమున పుష్కరిణి ఎట్లు ఎప్పుడావిర్భవించినది చెప్పలేదు.

స్వామిపుష్కరిణి అద్వితీయమైన ప్రభావము కలది. స్వామిపుష్కరిణీ స్నానము, సద్గురు పాదసేవనము, ఏకాదశీ వ్రతము ఈ మూడును చాలా దుర్లభమైనవి. మానవజన్మ లభించుటయే దుర్లభము. అందు సత్క్రమముగా జీవించుటకూడా దుర్లభము. అందును స్వామి పుష్కరిణీస్నానమత్యంత దుర్లభమని వరాహ పురాణము ఇట్లు బోధించుచున్నది.

**స్వామిపుష్కరిణీ స్నానం సద్గురోః పాదసేవనమ్ ।**
**ఏకాదశీవ్రతం చాపి త్రయమత్యన్త దుర్లభమ్ ॥**

**దుర్లభం మానుషం జన్మ దుర్లభం తత్ర జీవనమ్ ।**
**స్వామి పుష్కరిణీ స్నానం త్రయ మత్యన్త దుర్లభమ్ ॥**

గంగాది సర్వతీర్థములకు నిలయమైన స్వామిపుష్కరిణిలో స్నానం చేయుటవలన శంఖణుడు అనే రాజు పోయిన రాజ్యాన్ని తిరిగిపొందునట్లు, దశరధుడు వసిష్ఠుని ఆజ్ఞానుసారము వేంకటాచలమున స్వామి పుష్కరిణిలో స్నానమొనర్చి శ్రీరామాదులను పుత్రులుగా పొందినట్లును శ్రీరామచంద్రుడు రావణుడు ఎత్తుకు పోయిన సీతను స్వామి పుష్కరిణిలో స్నానమొనర్చి తిరిగిపొందినట్లును, వరాహపురాణము నిరూపించుచున్నది.

## శ్రీవేంకటేశ్వర బ్రహ్మోత్సవ వైభవము

ఒకానొకప్పుడు వేంకటాచలమునందు అర్చామూర్తి శ్రీనివాసుని దర్శించుటకు బ్రహ్మదేవుడు సపరివారముగా వచ్చెను. ఆయన కొంతకాలము భగవంతుని సేవించుచు అచ్చటనే ఉండెను. తరువాత శ్రీనివాసుని అనుజ్ఞను తీసికొని బ్రహ్మ వేంకటాద్రియందు బ్రహ్మోత్సవము చేయనారంభించెను.

సౌరమానముననుసరించి సూర్యుడు కన్యారాశిలో ప్రవేశించినకాలము కన్యామాసమందురు. ఆ కన్యామాసమున ధ్వజారోహణము చేస్తారు.

ఈ బ్రహ్మోత్సవమునకు దేవలోకమునుండి దేవతలను, కాశ్మీరాది దేశాధీశులను ఆహ్వానించి, బ్రహ్మోత్సవమును చాలా విశిష్టముగా నిర్వహించెను. శ్రీవేంకటేశ్వరుని సన్నిధికి పోవుమార్గమంతయు అలంకరించ బడినది. బ్రహ్మ ఆజ్ఞననుసరించి విశ్వకర్మ వేంకటాచలమున అన్నశాలలను, నివాసభవనములను, వేంకటాచలమునకు చుట్టుప్రక్కల మనోజ్ఞములైన పురములను, ఆ పురములందు పుణ్యవీథులను ఏర్పాటుచేసెను.

భక్తులందరకు అన్న వస్త్రపానీయాదులను ఎందరో ధార్మికులు ఇచ్చారు. గంధర్వ, అప్సరస గణములు భేరి మృదంగాది వాద్యములు మ్రోగగా, సంగీతము నిర్వహించిరి. శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవము "నభూతో న భవిష్యతి"గా బ్రహ్మదేవుడు నిర్వహించాడు. ఉత్సవసమయములందు అన్నప్రసాదములు, పూలు, వివిధ ఫలములు భగవంతునికి నివేదించిరి.

ఉత్సవ సమయమునందు శ్రీ, భూదేవులు వెంటరాగా వేంకటేశ్వరుడు సమస్త వాద్యఘోషములతో, ఛత్రచామరములు, నృత్యగీతవాద్యములు, కవులు, గాయకులు, వేదపండితులు వెంటరాగా గుఱ్ఱములను, ఏనుగులను అధిష్ఠించి రాజవీథులయందు ఊరేగింపుగా వెళ్ళెను. ప్రతిదినము వైఖానస, ఆగమశాస్త్రవిధి ననుసరించి యాగశాలలో, హోమము, బలిహరణము మొదలగు వైదికక్రియలన్నియు జరిగెను.. బ్రహ్మోత్సవము అయిన తరువాత వేంకటేశ్వరుడు బ్రహ్మను పిలిచి "నీవు భక్తితో నిర్వహించిన ఈ బ్రహ్మోత్సవము నాకెంతో తృప్తిని కల్గించినది. ప్రతిసంవత్సరము కన్యామాసమున బ్రహ్మోత్సవమును ఇట్లు నిర్వహించినవారు బ్రహ్మలోకమును పొందుదురు" అని శ్రీనివాసుడు వరము ఇచ్చెను.

బ్రహ్మోత్సవము మొట్టమొదట కల్పారంభమున బ్రహ్మదేవునిచే ఆచరింపబడి ఇప్పటికిని ప్రతి సంవత్సరము జరుగుచున్నది.

### వరాహపురాణమునందలి స్తోత్రములు

వరాహపురాణమునందలి ప్రథమ, ద్వితీయ భాగములలో ప్రధానమైన స్తోత్రములు పది కనపడుచున్నవి. అందు ముఖ్యముగా బ్రహ్మదులు, అగస్త్యాదిమహర్షులు, ఇంద్రాదులు సనకాదిమహర్షులు, అనేక సందర్భము లలో భగవంతునిగూర్చి చేసిన స్తోత్రములు దొరుకుచున్నవి. అలాగే ఈనాటికి శ్రీవేంకటేశ్వరుని ఆరాధన యందు భక్తులచే ఉపయోగింపబడు అష్టోత్తరశతనామస్తోత్రము, ధరణీకృత వరాహస్తుతి, లక్ష్మీస్తుతి ఉన్నవి. వరాహపురాణములో ద్వితీయ భాగమున ధరణీదేవి చేసిన వరాహస్తుతి ఇలా ఉంది:

"కల్పాదిలో సాగరజలము నుండి వేయిబాహువులతో నీవు నన్నుద్ధరించితివి. హిరణ్యాక్షుని వధించితివి. నీవు సర్వవిద్యామయుడవు. శబ్దాతీతడవు, ఆనందస్వరూపివి. నీకు నమస్కరించుచున్నాను."

### పద్మావతీ జననము

ఆకాశరాజు నారాయణపురమును రాజధానిగా చేసికొని రాజ్యమును బాగుగా విస్తరింపజేసి సార్వభౌముడను ప్రసిద్ధిగాంచెను. ఒకప్పుడు ఆకాశరాజు యజ్ఞమునాచరింపదలచి ఆరణీనదీ తీరమున బంగారు నాగలితో కర్షణము చేయించుచు తాను నవధాన్యములు చల్లుచుండెను. ఇంతలో ఆశ్చర్యముగ పద్మశయ్యపై పరుండి బంగారు బొమ్మవలెనున్న బాలిక ఆ భూమిపై కనపడెను. అంతలో అశరీరవాణి ఇలా పలికింది. ఈ

బిడ్డ నీది, ఈమెను నీవు పెంచుము. ఆకాశరాజు సంతోషపడి తన భార్య అయిన ధరణీదేవికిచ్చి ఆకాశవాణి మాటలు చెప్పి జాగ్రత్తగా పెంచమని చెప్పెను.

ఆకాశరాజు పుత్రికయగు పద్మావతి పెరిగిపెద్దదై పున్నమినాటి చంద్రునివలె ప్రకాశించుచుండెను. పద్మావతి చెలికత్తెలతో కలసి ఉద్యానవనమునకు పూలుకోయుటకు వెళ్ళినది. అంతలో అచ్చటికి ఒక మదపుటేనుగు వచ్చింది. దానిని చూచి భయముతో అందరు ఒక చెట్టుచాటున దాగిరి. ఆ సమయంలో స్వచ్ఛమైన అశ్వమునధిరోహించి పద్మదళములవంటి కన్నులు కలిగి పట్టువస్త్రమును ధరించి బంగారు బాణమును ధరించి దివ్యసుందర విగ్రహుడు శ్రీనివాసుడు అచ్చటికి వచ్చెను. ఆ మదపుటేనుగు శ్రీనివాసునికి నమస్కరించి అడవిలోనికి వెళ్ళిపోయెను.

తరువాత శ్రీనివాసుడు "ఇటువైపు ఈహామృగము ఏదైనా వచ్చినదా?" అని చెలికత్తెలను అడిగెను. దానికి వారు సమాధానముగా "అలాంటి మృగమేదియు ఇటు రాలేదు. ఈ వనములందు మృగములను చంపరాదు. ఇచ్చటనుండి త్వరగా వెళ్ళుము" అనిరి. అప్పుడు శ్రీనివాసుడు పద్మావతిని చూచి "ఈమె ఎవరు? సమాధానము చెప్పినచో నేను వెళ్ళుదును" అనెను. అంతట చెలికత్తెలు "ఈమె ఆకాశరాజు, ధరణీదేవీల పుత్రిక అని చెప్పుదురు. నిన్ను ఆకాశరాజు చూచినచో కారాగారమున బంధించును. కనుక ఇచ్చట నుండి త్వరగా వెళ్ళుము" అనిరి. శ్రీనివాసుడు వేంకటాద్రికి వెళ్ళిపోయెను.

వేంకటగిరికి వెళ్ళిన శ్రీనివాసుడు ముక్తాగృహమును చేరి నవరత్నములతో చేసిన ఊయలయందు శయనించి పద్మావతిని స్మరించుచు మోహమునందెను. శ్రీనివాసుని అవస్థకు కారణం తెలియని వకుళమాలిక మధ్యాహ్నసమయమున రుచికరములయిన వివిధాన్నములను, మధురములగు భక్ష్యములను తీసికొని ఆయన మందిరమునకు వెళ్ళెను. అప్పుడు వకుళమాలిక శ్రీనివాసుని "నీఅవస్థకు కారణమేమి?" అని అడిగెను. శ్రీనివాసుడు పద్మావతిని చూచి మోహపడిన విషయము వకుళమాలికతో చెప్పి, పద్మావతితో వివాహము జరిపించమని కోరినాడు. అప్పుడు వకుళమాలిక శ్రీనివాసునిద్వారా నారాయణపురమునకు మార్గము తెలిసికొని ఆకాశరాజు రాజధానియగు నారాయణపురమునకు వెళ్లి. పద్మావతి చెలికత్తెలతో అంతఃపురణమునగల ధరణీదేవిని దర్శించెను. ధరణీదేవి వకుళమాలికను "మీరెచ్చటనుండి ఏపనిమీద వచ్చితిరి?" అని అడిగెను. వకుళమాలిక తనను పరిచయము చేసుకొని ఉద్యానవనములో మృగయావిహారమున జరిగిన పద్మావతీ శ్రీనివాసుల కలయిక గూర్చి వివరంగా చెప్పింది.

## పద్మావతీ-శ్రీనివాసుల వివాహం

వకుళమాలిక పరిస్థితిని వివరించిన తరువాత ఆకాశరాజు తాను "ధన్యుడనైతి"నని భావించి బృహస్పతిని రప్పించి వధువు, వరుల జన్మనక్షత్రములు చెప్పి తగిన వివాహ ముహూర్తము నిర్ణయించుమని కోరెను. బృహస్పతి-ఇద్దరికి ఉత్తరఫల్గునీ నక్షత్రము మంచిదని, వైశాఖమాసమున వివాహము జరిపించమని చెప్పెను.

తరువాత బృహస్పతిని దేవలోకమునకుపంపి వైశాఖమాసమున ఉత్తరఫల్గునీ నక్షత్రమున వివాహమని పద్మావతి పెంపుడు చిలుకను వకుళమాలికతో కూడా శ్రీనివాసుని దగ్గరకు పంపెను.

వకుళమాలిక నారాయణపురమును చేరకముందే అచ్చటికి ఒక పుళిన్దని వచ్చెను. ఆమె ధరణీదేవితో నీ కూతురునకు ఒక దివ్యపురుషునితో వివాహం జరుగుతుందని చెప్పెను. శ్రీనివాసుడు తన అంగీకారమును పుష్పమాలను శుకునిద్వారా పద్మావతికి పంపెను. ఆ శుభవార్తను పద్మావతికి చెప్పి ఆ పూలమాలను ఆమెకు సమర్పించెను. ఆకాశరాజు విశ్వకర్మను ఆహ్వానించి పురముయొక్క అలంకారము అప్పగించెను. ఇంద్రుడు పుష్పవృష్టిని గురిపించెను. అప్సరసలు నృత్యములు చేసిరి. కుబేరుడు కోశాగారము నింపెను. ఆకాశరాజు సపరివారముగవచ్చి శ్రీనివాసునకు స్వాగతమొనర్చి వివాహమండపమునకు, తీసికొనిపోయి కన్యాదానము, మాంగల్యధారణ, హోమాదులను చేయించి మంగళవాద్యములతో చతురంగబలముతో వృషభాద్రికి తన కూతురిని అల్లునితో పంపెను. ఆకాశరాజు ప్రేమాదరములకు మెచ్చిన శ్రీనివాసుడు ఒక వరము కోరుకొమ్మని చెప్పెను. అంతట ఆకాశరాజు "నీయందు భక్తిని, ఎల్లప్పుడు నీ సేవచేసుకొను అదృష్టము నాకనుగ్రహించు"మని కోరుకొనెను. శ్రీనివాసుడు అట్లే ఆకాశరాజుననుగ్రహించెను.

## తొండమాను చక్రవర్తి వృత్తాంతం

శ్రీవేంకటేశ్వరుని ఆజ్ఞచే నూరు సంవత్సరములు అనన్య భక్తితో ఆయనను సేవించిన రంగదాసు తిరిగి చంద్రవంశములో సువీరుడను మహారాజునకు నందినికి తొండమానుడగ జన్మించెను. ఇతడు విష్ణు భక్తి పరాయణుడు. పాండ్యరాజపుత్రికఅగు పద్మను వివాహము చేసికొనెను. ఒకనాడు తొండమానుడు తండ్రి అనుమతి తీసికొని వేంకటాద్రికి దగ్గర ప్రదేశమునకు వేటకు వెళ్ళెను. ఆ అడవియందు ఒక మదపు టేనుగునుచూచి దానిని పట్టుకొనుటకు ప్రయత్నముచేయుచు సువర్ణముఖరీనదిని దాటి చాలా దూరము వెళ్ళెను. అచ్చట వల్మీకాకారముననున్న రేణుకాదేవిని దర్శించెను. తిరిగి వెళ్ళేటప్పుడు పంచవర్ణముగల చిలుకను చూచి దాని వెంటపడగా ఆ చిలుక 'శ్రీనివాసా' అంటూ వేగముగా వేంకటాద్రిని చేరెను. దాని వెనుకే తొండమానుడు కూడా వేంకటాద్రికి వెళ్ళెను. ఆ చిలుక కనపడలేదు. అచ్చటనున్న వనపాలుని ఆ చిలుక గూర్చి అడిగెను. అంతట అతను "అది శ్రీనివాసునకు ఇష్టమైనది అని, అది స్వామి పుష్కరిణీ తీరమున ఉండునని, దానిని ఎవ్వరూ పట్టుకొనలేరని" చెప్పి "నేను స్వామి దర్శనముకోసం వెళ్ళుచున్నాను" అని చెప్పెను.

తొండమానుడు ఆ బోయవానితో స్వామి పుష్కరిణీ సమీపమునందున్న శ్రీనివాసుని సేవించుటకు వెళ్ళెను. తరువాత కొంతకాలమునకు రేణుకాదేవిని పూజింపగా ఆమె "నీరాజ్యము స్థిరముగా నుండగలదు. నీపేరుతో ఒక రాజధాని ఏర్పడును, నీకు దేవుని అనుగ్రహము లభించగలదు" అని అతనికి వరమునిచ్చెను.

శ్రీనివాసుడు తొండమాను చక్రవర్తికి కలలో దర్శనమిచ్చి ద్వారగోపుర ప్రాకారములను నీవు కట్టించుము. నీ వంశములో పుట్టబోవు నారాయణుడు అనువాడు విమానము నిర్మించగలడు. దానిని స్వర్ణముతో అలంకరించగలడు అని చెప్పెను. శ్రీనివాసుని ఆజ్ఞప్రకారము తొండమానుడట్లే ప్రాకారమును నిర్మించి వైఖానస ఆగమశాస్త్ర ప్రకారము పూజలు చేయించుచుండెను.

## భీమవృత్తాంతము

తొండమానుడు శ్రీనివాసునకు స్వర్ణపద్మములతో పూజలు చేయుచుండగా ఒకనాడు ఆ స్వర్ణపద్మములపై మట్టితోచేసిన పుష్పములుండుట చూచి ఇది ఏమిటి అని శ్రీనివాసుని అడిగెను. అప్పుడు స్వామి తన భక్తునిగూర్చి ఇట్లు చెప్పెను. "కుర్వగ్రామములో భీముడు అను కులాలుడు కలడు. అతడు నాకు పరమభక్తుడు. తన ఇంటనే నన్ను నిత్యము పూజచేయుచుండును. అతని భక్తికిమెచ్చి ఆ ఆరాధనను నేనంగీకరింతును" శ్రీనివాసుని మాటలు విన్న తొండమానుడు ఆ భక్తుని చూచుటకు కుర్వగ్రామమునకు వెళ్ళెను. భీముడు తొండమానుని చూచి భక్తితోలేచి నిలబడెను. అప్పుడు రాజు భీముని ప్రశ్నించెను. నీవు స్వామిని ఎలా పూజిస్తావు? భీముడు దానిని సమాధానముగా నేను పూజ చేస్తున్నట్లు ఎవరు చెప్పారు అని అడుగగా శ్రీనివాసుడే నీవు పూజ చేస్తున్నట్లు చెప్పెననగా, అతనికి వెనుకటి వరము గుర్తుకు వచ్చెను. నీ పూజ అందరికి ఎప్పుడో తెలియునో, తొండమానుడు నీ దగ్గఱకు వచ్చి ఎప్పుడు సంభాషించునో అప్పుడు నీకు మోక్షము కల్గును అని ఇంతకు పూర్వమే అతనికి స్వామి వరమొసంగెను. దీనిని బట్టి స్వామికి భక్తిప్రధానమైనదిగాని స్వర్ణపుష్పాలకి, మట్టితో చేసిన పుష్పాలకి భేదంలేదు స్వామి దృష్టిలో. భగవంతునికి భక్తుని హృదయమే ముఖ్యముకాని అతడిచ్చు పదార్థములు ముఖ్యముకానేకాదను నిజము ఈ భీముని వృత్తాంతము తెలియజేయుచున్నది.

ఇలా వరాహపురాణం శ్రీవేంకటేశ్వరుని అవతారతత్త్వాన్ని, శ్రీవేంకటాచలంలోని అనేక తీర్థాల ప్రాముఖ్యాన్ని, వేంకటేశ్వరుని వైభవాన్ని, వరాహావిర్భావము, పద్మావతీ శ్రీనివాసుల వివాహం, బ్రహ్మోత్సవం ఇంకా ఎన్నో విషయాలను మనకందిస్తోంది.

క్షేత్రం యొక్క గొప్పదనం వల్లకాని, క్షేత్రనాధునియొక్క అవతారమువల్లకాని ఈ తిరుమల క్షేత్రానికి ఇంత వైభవం కలిగినది.

# శ్రీవేంకటాచలమాహాత్మ్యం - శ్రీవేంకటేశ్వర వైభవం

గల్లా చలపతి

**మంగళం వేంకటేశాయ వాంఛితార్థ ప్రదాయినే**

**వేంకటాద్రి నివాసాయ విశ్వరూపాయ మంగళమ్ ॥**

అర్థుల కోరికలు తీర్చే శ్రీ వేంకటేశునికి మంగళమగుగాక! విశ్వరూపునికి, వేంకటాచల నివాసికి మంగళమగుగాక! అని పై శ్లోకం చెపుతున్నది. 'కలౌ వేంకటనాయకః' అని ప్రసిద్ధి ఉంది. వేంకటనాయకుడు విశ్వరూపుడు. సమస్తవిశ్వం- అంటే చరాచర ప్రకృతి స్వామివారి శరీరమని శ్రీవైష్ణవసిద్ధాంతం. అతి ప్రాచీనకాలం నుండి వేంకటనగంమీద కొలువై ఉన్న స్వామి పాపులను ఉద్ధరిస్తూ, భక్తులకు 'ముంగొంగు పసిడి' గా ఉన్నాడు. చరిత్ర కాలంలో సామాన్యుల నుండి సంపన్నులవరకు, బంటునుండి రాజావరకు ఎందరో స్వామి కృపకు పాత్రులై ధన కనక వస్తువాహనాది భూరి కానుకలిచ్చి తరించారు.

## వేంకటాచలం - ప్రాచీనత

ఋగ్వేదంలోని 'అరాయికాణే వికటే గిరిం గచ్ఛ, సదాన్వేశిరిమ్బిరస్య సత్త్వభిః, తేభిష్ట్వాచాతయామపి' అనే మంత్రంలో వేంకటపతి ప్రసక్తి ఉండడంవల్ల తిరుమలకొండ వేదకాలం నాటిదని తెలుస్తున్నది. కలియుగంలో ధర్మాన్ని నిలబెట్టడానికి వేంకటనగాన్ని అధివసించిన స్వామి వృత్తాంతం అనేక పురాణాల్లో ఉంది. తిరుమలగిరిమీద స్వామిపుష్కరిణికి ఒక వైపున వరాహస్వామిదేవాలయం మరోవైపు వేంకటనాయకుని మందిరం ఉన్నాయి. పురాణకథనాలనుబట్టి వేంకటాచలంమీద మొదట వరాహస్వామే వెలసినట్లు కనిపిస్తుంది. ఈ విషయాన్ని వరాహపురాణం వివరంగా చెపుతుంది. పాతాళంలో మునిగిపోయిన భూమిని శ్రీమహావిష్ణువు ఆదివరాహరూపంలో ఉద్ధరించి యథాస్థానంలో నిలిపాడు. సృష్టిని ప్రారంభించమని బ్రహ్మను ఆదేశించాడు. కొంతకాలం భూలోకంలోనే ఉండి భక్తులను రక్షించాలనుకొన్నాడు. వైకుంఠంలోని క్రీడాపర్వతాన్ని తీసుకొని రమ్మని గరుత్మంతుని ఆదేశించాడు. సహజమైన కొండలతో, ఎత్తైన శిఖరాలతో అందంగా వెలుగొందే క్రీడాశైలాన్ని గరుడుడు తెచ్చాడు. అప్పటికే తనకు నివాసయోగ్యమైన ప్రదేశాన్ని స్వామి ఎంపికచేసి క్రీడాశైలాన్ని ఆ ప్రదేశంలో ఉంచమన్నాడు. ఇది తొండమండలంలోని రుక్మానదికి (సువర్ణముఖరీనది) ఉత్తరదిశలో ఉంది. ఇదే శ్రీ వేంకటనగం.

**"వైకుంఠాత్ పరమోహ్యేష వేంకటాఖ్యో నగోత్తమః**

**అత్రైవ నివసామ్యేవ శ్రీభూమి సహితోహ్యహమ్**

**దదామి ప్రార్థితావర్థాన్ మమజేభ్యః సదాసురాన్"**

అని వరాహస్వామి ప్రకటించినట్లు వరాహపురాణం పేర్కొంటున్నది. వైకుంఠం కంటే వేంకటనగమే తనకెంతో ఇష్టమైనదని చెప్పి శ్రీభూదేవులతో కలసి భక్తులను రక్షిస్తున్నాడు.

## వేంకటాచలానికి గలపేర్లు

వైకుంఠంనుండి గరుడుడు తెచ్చిన క్రీడాశైలానికి యుగయుగాల్లో అనేక పేర్లేర్పడినాయి. ఈశైలం కృత యుగంలో వృషభాచలమని, త్రేతాయుగంలో అంజనాచలమని, ద్వాపరయుగంలో శేషాచలమని, కలియుగంలో వేంకటాచలమని పేరుపొందింది. ఇలా పేర్లు ఏర్పడడానికి కొన్ని కథలు కూడా ప్రచారంలో ఉన్నాయి. శేషశైలమని, శేషాచలమని, శేషాద్రి అని పేర్లు రావడానికి భవిష్యోత్తర పురాణం ఒక కథ చెపుతున్నది. ద్వాపర యుగంలో ఒకరోజు వాయుదేవుడు వైకుంఠానికి వెళ్లి శ్రీమన్నారాయణుని పూజించాలనుకొన్నాడు. శ్రీవారు లక్ష్మితో లోపల ఉన్నారు. ఆదిశేషుడు ద్వారం దగ్గర కావలి ఉన్నాడు. వాయుదేవుని లోపలికి వెళ్లనివ్వలేదు. ఇద్దరిమధ్య కలహం మొదలై భీకరంగా మారింది. వెంటనే స్వామి కల్పించుకొని శాంతింపజేయడానికి ప్రయత్నించగా నేనుగొప్పంటే నేనుగొప్పని వాదులాడుకోవడం మొదలుపెట్టారు. ఎవరు బలవంతులో తేల్చడానికి స్వామి ఒక పందెం పెట్టాడు. మేరు పర్వత సంబంధమైన ఆనంద శిఖరాన్ని ఆదిశేషుడు చుట్టుకొని కదలనీయకుండా చేస్తే వాయుదేవుడు తన ప్రచండమైన గాలితో దానిని కదిలించి ఆదిశేషుని నుండి విడదీయాలి. ఇదీ పందెం. ఇద్దరూ తలపడ్డారు. బ్రహ్మాదులు వచ్చారు. ఆదిశేషుని బలం స్వామికేగాక శివాదులందరికి తెలుసునని మళ్లీ తెలుసుకోనక్కరలేదని పట్టువిడువమని ఆదిశేషునికి నచ్చ జెప్పారు. ఆయన తనబలం సడలించాడు. పర్వతం విడిపోయింది. దీనికి మారుగా ఆదిశేషుడు వేంకటాద్రిలో కలసిపోయి స్వామికి ఆవాసయోగ్యంగా మారే అవకాశం కల్పించారు. ఆదిశేషుడు ముప్పైయోజనాల పొడవు పది యోజనాల వెడల్పుగల శేషాద్రిగా విస్తరించాడు. శేషుని పడగ స్వామికి నివాసమైన వేంకటాద్రిగా పుచ్ఛం నృసింహస్వామికి ఆవాసమైన అహోబిలంగా మారింది. వేంకటాచలానికి చింతామణి, జ్ఞానాద్రి, తీర్థాద్రి, పుష్కరాద్రి, ధర్మాద్రి, కనకాద్రి, నారాయణాద్రి, వరాహాద్రి, ఆనందాద్రి, అంజనాద్రి, వృషభాద్రి అని కూడా పేర్లున్నాయి.

## శ్రీమహావిష్ణువు వేంకటాచలానికి రావడం

శ్రీమహావిష్ణువు శ్రీనివాసుడుగా వచ్చి వేంకటాచలంపైన కొలువుంటూ వేంకటాచలపతిగా భక్తులను ఉద్ధరిస్తున్న విషయం భవిష్యోత్తరపురాణం వివరిస్తున్నది. కృత త్రేతా ద్వాపరయుగాలలో స్వామి వేంకటాద్రిపైన కొలువుండి భక్తులను ఉద్ధరించాడు. కలియుగ ప్రారంభంలో స్వామి నిత్యులు, ముక్తులు, శ్రీదేవి భూదేవులతో పాటు వైకుంఠం వెళ్లిపోయాడు. వెళుతూ వేంకటాచలాన్ని వరాహస్వామికి అప్పగించాడు. ఈ విషయం నారదుని ద్వారా విన్న బ్రహ్మ ఎలాగైనా మళ్లీ మహావిష్ణువు వేంకటాచలానికి వెళ్లేటట్లుచేయమని నారదునికే చెప్పాడు. ఈ సందర్భంలో భృగుమహర్షి త్రిమూర్తులను పరీక్షించే కథ ఉంది. భృగువు విష్ణువును వక్షస్థలం మీద

తన్నడం, దానికి కోపించిన లక్ష్మి వైకుంఠంవీడి వెళ్లిపోయింది. ఆమెను వెదుక్కొంటూ స్వామి వేంకటాచలం వైపు వెళ్లడం, స్వామి పుష్కరిణికి దక్షిణంవైపున చింతచెట్టు కిందగల పుట్టలోకి చేరడం, అక్కడ పదివేల సంవత్సరాలు ఉండడం కథాంశాలు. ఎనిమిదవ ద్వాపరయుగం వెళ్లి కలియుగం రావడం, చోళరాజు ఆ ప్రాంతాన్ని పరిపాలించడం, కొల్హాపురంలో ఉండిన లక్ష్మి విష్ణువు విషయం తెలుసుకొని వేంకటాచలానికి రావడం మొదలైన విషయాలన్నీ ఈ పురాణంలో వివరంగా ఉన్నాయి. ఈ కథలో స్వామి శ్రీనివాసుడు గావడం, సాత్త్విక ప్రవృత్తికి చెందిన శ్రీమహావిష్ణువే యజ్ఞ భోక్త, మోక్షప్రదాత కావడం ముఖ్యమైన అంశాలు.

## శ్రీనివాసుని రూపం

ఆదిత్య పురాణం రెండవ అధ్యాయంలో సుమారు నూరు శ్లోకాలలో శ్రీనివాసుని దివ్యమంగళ విగ్రహ సౌందర్యాది వర్ణన విపులంగా ఉంది. త్రైలోక్యసుందరి లక్ష్మి శ్రీనివాసుని వక్షః పీఠంపైన అధివసించిఉంది. ఆమె స్వామి సౌందర్యాన్ని ఏకాగ్రచిత్తంతో అనుభవిస్తున్నది. ఆమె లోకానికంతటికి· యజమానురాలు. వేంకటపతికి ప్రియురాలు. ఆయన వక్షస్థలం మీద ఉండి ఆయన క్షమాగుణాన్ని వృద్ధిచేస్తున్నదని శ్రీ వేంకటేశ ప్రపత్తి తెలుపుతుంది. స్వామి నాభియందు జన్మించిన బ్రహ్మ శ్రీవారి పాదకమల సౌందర్య మగ్నమానసుడై తన ఎనిమిది నేత్రాలు చాలక బహురూపి అవుతున్నాడని పురాణం వివరిస్తూఉంది. ఈ వివరణలో సృష్టిరహస్య ముంది. స్వామి సౌందర్యం సృష్టి అంతటా ప్రపంచితమై ఉండడం, ప్రపన్నులు సృష్టిలో స్వామిని దర్శించడం ఇందులోని విశేషం. ఆదిశేషుడు సహస్రనేత్రాలతో స్వామిని అనవరతం దర్శిస్తున్నా తనివి తీరలేదని భావిస్తున్నాడు. తనకు వైకుంఠం వద్దని, వేంకటాచలపతి పాదాలనే సేవిస్తూ ఉంటానని, పాదసేవలోగల ఆనందం కైవల్యసుఖంలో కూడా లేదని భావిస్తున్నాడు. ప్రభుని పాదమూలం పాతాళంలో ఉందని, పాదదర్శనానందం అనుభవించడానికి పాతాళానికే వెళ్లాలని నిర్ణయించుకొని పాతాళానికే వెళ్లి ఆనందాన్ననుభవిస్తున్నాడు అని పురాణ కథనం. స్వామి త్రిలోకవ్యాపి అనే అంశాన్ని ఈ కథ ప్రతిపాదిస్తున్నది. రాక్షసాది దుష్టులను నశింప జేస్తానన్న దీక్షను తెలియజేయడానికన్నట్లు పాదాలయందు గదారేఖలు కనిపిస్తున్నాయి. పాదమాహాత్మ్యాన్ని కీర్తించేవారి ఇండ్లలో పద్మావతితో పద్మసంభవునితో సకుటుంబముగా నివసింతునని చెప్పడానికన్నట్లు స్వామి పాదములందు పద్మరేఖలు కనిపిస్తాయి. పద్మ తన కరపద్మములతో పాదసంవాహనం చేస్తున్నదని సూచించడానికి పాదాలు పద్మరేఖలతో కనిపిస్తున్నాయి. ఇలా స్వామి పాదాలను ఈ పురాణం వర్ణించింది. స్వామి పాదం అధర్మాన్ని అణచడానికి సంకేతం. అందుకే తన పాదాలను శరణు పొందమని చెప్పడాని కన్నట్లు వేంకటేశ్వరస్వామి చేతితో పాదాలను చూపిస్తున్నట్లు కనిపిస్తుంది. వక్షస్థలం మీద నిత్య నివాసం చేస్తున్నా తనివి తీరని లక్ష్మి తన విభూతులతో స్వామి అధివసించే పీఠంగా మారింది. ఆ దివ్య పీఠమున ఉన్న స్వామిని లక్ష్మిషోడశోపచారాలతో పూజిస్తున్నది. ఇది లక్ష్మీనారాయణుల పవిత్ర దాంపత్యంలో పర్యవశించేవిషయం. వీరిరువురి దివ్య శృంగారం నుండి సృష్టి ఆవిర్భవిస్తున్నది.

ఈ పురాణం స్వామి దివ్యమంగళ విగ్రహాన్ని వర్ణించడమే గాక ఆయన కారుణ్య దృష్టిని గురించికూడా విపులంగా తెలియజేసింది.

**"జాత్యన్ధానాం చ చక్షూంసి దాసి త్వన్మూర్తిదర్శనమ్**
**బధిరాణాం చ శ్రోత్రాణి త్వత్కథాశ్రవణం తథా**
**ఏడమూకంచ వాచాలం కరోష్యత్యధ్యయనాన్వితమ్**
**మంద బుద్ధిం ప్రాజ్ఞతమం సాంఖ్యయోగ సమాధిగమ్"**

ఇలా పది శ్లోకాలలో స్వామి దయా మూర్తిత్వం వివరింపబడింది. గుడ్డివాళ్లకు నేత్ర దృష్టినిచ్చి తన దివ్యమంగళ విగ్రహదర్శనం కలిగిస్తాడు. చెవిటివాళ్లకు చెవులనిచ్చి తన దివ్యచరిత్రను వినేటట్లు చేస్తాడు. చెవుడు మూగవాళ్ళకు వాచాలత్వాన్ని అనుగ్రహించి స్వాధ్యాయపరులుగా మారుస్తాడు. భక్తుల అనిష్టాలను తొలగించి వాళ్లకు సకలాభీష్టాలను ప్రసాదిస్తాడు. ఇలాంటి స్వామి దయను కీర్తిస్తూ వేదాంతదేశికులవారు దయాశతకం రచించారు. స్వామిచరణాలను శరణుపొందితే ఆయన సర్వలోకాలకు దయాసముద్రుడౌతాడని శ్రీవేంకటేశ్వరప్రపత్తి నిరూపిస్తున్నది. స్వామిచరణాలను ఋగ్వేదం "విష్ణోః పదేపరమ" అని "మధ్వ ఉత్స"అని (విష్ణుమూర్తి యొక్క ఉత్కృష్టస్థానమందలి తేనె ఊట) కీర్తించింది.

**జితంతే స్తోత్రం**

పద్మపురాణ క్షేత్రకాండంలో గల వేంకటాచలమాహాత్మ్యంలో శ్రీ శ్రీనివాసావిర్భావ కథ ఉంది. ఈ కథలో బ్రహ్మాదులు శ్రీనివాస దర్శనం కోసం యత్నించారు. ఆ సందర్భంలో బ్రహ్మాదులు చేసిన 'జితంతే' స్తోత్రముంది. ఈ స్తోత్రం "జితంతే పుండరీకాక్ష నమస్తే విశ్వభావన" అని మొదలై

**'విశ్వస్రష్టే విశ్వభర్తే విశ్వత్రాతే విచక్షణ**
**విశ్వాన్తర్యామిణే తుభ్యం విశ్వోత్తీర్ణవిభోనమః'** అని ముగుస్తుంది.

ఈ స్తోత్రంలో స్వామి భౌతిక ఆంతరిక స్వరూపం వర్ణింపబడింది. విశ్వసృష్టి కర్తృత్వం, విశ్వాంతర్యామిత్వం, విశ్వపాలకత్వం ఇందులో ప్రధాన విషయాలు. నాలుగు శ్లోకాలుగా ఉన్న ఈ 'జితంతే' స్తోత్రం శ్రీవేంకటేశ్వరుని వైభవాన్ని భక్తుల కండ్లముందు పెడుతున్నది. శ్రీనివాసావిర్భావం జరిగినతరువాత శుకుడు శ్రీనివాసుని స్తుతించిన స్తోత్రంకూడా 'జితంతే' స్తోత్రంగా చెప్పబడుతున్నది. ఏడు శ్లోకాలుగల ఈ స్తోత్రం "జితంతే పుండరీకాక్ష" అని మొదలై "ప్రసీద పుండరీకాక్ష పాసాదాదాత్మసాత్కురు" అని ముగుస్తుంది. ఈ స్తోత్రం కూడా పద్మపురాణ క్షేత్రకాండంలోని వేంకటాచల మాహాత్మ్యంలో ఉంది. శుకుడీ స్తోత్రంలో స్వామి వాసుదేవ తత్త్వాన్ని, అనంత గుణతత్త్వాన్ని కొనియాడాడు.

## స్వామి పుష్కరిణి

పద్మపురాణం స్వామి పుష్కరిణి మహత్తును వర్ణించింది. వైష్ణవమంత్రాన్ని జపిస్తూ పుష్కరిణిలో స్నానం చేస్తే సమస్తపాపాలు తొలిగిపోతాయి. భ్రూణహత్యాపాపం నశిస్తుంది. గత ఏడు జన్మలలో చేసిన పాపం పోతుంది. నరకం నుండి విముక్తి లభించి బ్రహ్మసాయుజ్యం కలుగుతుంది. పుష్కరిణిలోని నీళ్ల తాగితే ఐశ్వర్యం కలుగుతుంది. ఇలా చెప్పడమేగాక వేంకటనగం మీద గల ఏ తీర్థంలో స్నానం చేసినా సద్గతి కలుగుతుందని కూడా చెప్పబడింది. పుష్కరిణిని గురించి ఆలోచించినా, పుష్కరిణీ తటంపై కొంతసేపు ఉండినా, మనసు నిర్మలమై స్వామిమీద భక్తి కుదురుతుంది. ఇతర తీర్థాలలో స్నానంచేస్తున్నా ఆ సమయంలో స్వామి పుష్కరిణిని ధ్యానిస్తే మహాపాపాలు తొలగిపోతాయి.

ఇలా అనేకపురాణాలు వేంకటాచలక్షేత్రాన్ని గురించి ప్రస్తావించిన విషయాలన్నీ శ్రీవేంకటాచల మాహాత్మ్యంగా కీర్తించబడింది. ఈ పురాణవిషయాలనన్నిటిని సంపూర్ణంగా పరిశీలిస్తే శ్రీ వేంకటనగ ఆవిర్భావ వికాస వైభవాలు మనకర్థమవుతాయి. ఈ విషయాలన్నీ భక్తులలో ఆస్తిక్యబుద్ధిని కలిగించడానికి, స్వామి వైభవాన్ని స్తుతిస్తే జన్మరాహిత్యం కలుగుతుందని చెప్పడానికి, జగత్తులో ధర్మాన్ని ప్రతిష్ఠించేది శ్రీవేంకటా చలపతి ఒక్కడేనని దృఢపరచడానికి ఉద్దేశింపబడినాయి. ఈ పురాణోక్తవిషయాలే తరువాత సాహిత్యంలోని అనేకప్రక్రియలలో కనిపించాయి.

# స్కాందపురాణంలో శ్రీవేంకటేశ్వర వైభవం

డా॥ విష్ణుభట్ల గోపాలకృష్ణమూర్తి

వ్యాసమహర్షి రచించిన గ్రంథాలలో మహాభారతం తరువాతి స్థానం స్కాందపురాణానికి ఉంది. కుమారస్వామి దీనిని మహేశ్వరుని నుండి ఉపదేశముగా పొంది తరువాత మునుల కుపదేశించడం వలన దీనికి స్కాందపురాణమని పేరొచ్చింది. ఇది ఖండాత్మకము, సంహితాత్మకమని రెండువిధాలుగా ఉంది.

## స్కాందం - మహాపురాణం

**యత్ర స్కందః స్వయం శ్రోతా వక్తా సాక్షాన్మహేశ్వరః ।**
**తత్తు స్కాందం సమాఖ్యాతం ఏకాశతి సహస్రకమ్ ॥** (శివపురాణం ఉ.సం. 44-133)

అని శివపురాణం పేర్కొన్నది. ఇది 81,000 శ్లోకముల గ్రంథం. దీనిలో ఏడు ఖండములు, 1671 అధ్యాయములు కలవు.

## స్కాందపురాణంలో ఏడుఖండాలు

1. మాహేశ్వర ఖండము 2. వైష్ణవఖండము 3. బ్రహ్మఖండము. 4 కాశీఖండము 5. అవన్తీఖండము (రేవా ఖండము) 6. తాపీఖండము (నాగరఖండము) 7. ప్రభాసఖండము. వీటిలో రెండవదైన వైష్ణవఖండంలో తొమ్మిది మాహాత్మ్యములు వర్ణించబడినవి. అందులో శ్రీవేంకటాచలమాహాత్మ్యము ఒకటిగా తెలుపబడింది.

## స్కాందం - ఉపపురాణం

స్కాందం మహాపురాణంగాను, ఉపపురాణంగాను లభిస్తున్నది. రెండవదైన స్కాందోపపురాణం షట్ సంహితారూపంలో 50 ఖండాలుగా విభక్తమై ఉన్నదని స్కాందంలోని శంకరసంహితలోని హాలస్య మాహాత్మ్యంలో చెప్పబడింది.

శ్రీస్కాంద మహాపురాణంలోని వైష్ణవఖండంలో మొదటి నలభై అధ్యాయములలో శ్రీవేంకటాచల మాహాత్మ్యం లభిస్తున్నది. వీటిలో మొదటి పది అధ్యాయములు ధరణీవరాహసంవాదరూపంలో ఉండుటవలన తిరుమల తిరుపతి దేవస్థానములవారు ప్రచురించిన శ్రీవేంకటాచలమాహాత్మ్యగ్రంథంలో ఈ పది అధ్యాయము లను వరాహపురాణం ద్వితీయభాగంగా ప్రచురించినారు. మిగిలిన ముప్పది అధ్యాయములను కూడా నాలుగు భాగములుగా ప్రచురించి అధ్యాయ సంఖ్యనుమార్చినారు. కాని మూలభూతమైన స్కాందమహాపురాణంలోని వైష్ణవఖండంలో శ్రీవేంకటాచలమాహాత్మ్యం నలభై అధ్యాయములలో వరుసగా వర్ణించబడినది.

ఇందులో శ్వేతవరాహావతార వర్ణనం, వరాహస్వామిమహిమ వైభవ విశేషములు ప్రతిపాదించబడినవి.

ధరణీవరాహసంవాద రూపంలో వరాహమంత్రంయొక్క ఆరాధనాక్రమం, దానిఫలితం చెప్పబడింది. వేంకటాచల క్షేత్రాదివర్ణనం, చతుర్ముఖబ్రహ్మ ఆరంభించిన బ్రహ్మోత్సవ వర్ణన, శ్రీవేంకటేశ్వర వైభవవర్ణనం, వేంకటేశ్వరుని విషయంలో అష్టవిధభక్తి, భూతసృష్ట్యాదివర్ణన, భరద్వాజమహర్షి చెప్పిన శ్రీవేంకటాచల మాహాత్మ్య నిగమనం, పుత్రునికొఱకు ఆకాశగంగా తీరంలో అంజనాదేవి తపస్సుచేయడం, వ్యాసమహర్షి చెప్పిన ఆకాశగంగా స్నానకాలనిర్ణయం, శ్రీవేంకటాచలంలో ఆచరించవలసిన దాన విధులు మొదగునవి చెప్పబడినవి.

భూమినుండి పద్మావతీదేవి ఆవిర్భావము, నారదమహర్షిచెప్పిన పద్మావతీదేవి శరీరలక్షణము, వేటకై శ్రీనివాసుడు పుష్పాటవికి వచ్చుట, పద్మావతిని చూచి మోహించుట, పద్మావతిని పరిణయమాడుటకు శ్రీనివాసుడు చెప్పిన కారణములు, నారాయణవనమునకు వకుళమాత వెళ్ళుట, వకుళమాతకు పద్మావతీ సఖులు పద్మావతీవృత్తాంతమును చెప్పుట, పద్మావతి చెప్పిన భగవద్భాగవత లక్షణములు, వకుళమాత ధరణీ దేవికి వివాహనిశ్చయమును తెలుపుట, శుకమహర్షి శ్రీనివాసునికి పద్మావతీ పరిణయ నిశ్చయమును తెలియ జేయుట, లక్ష్మీదేవి మొదలగు వారు పద్మావతీదేవికి వివాహాలంకారములు చేయుట, బ్రహ్మాదిదేవతలు నారాయణవనమునకు వచ్చుట, పద్మావతీ శ్రీనివాసుల పరిణయం, శ్రీనివాసుడు ఆకాశరాజుకు భక్తిప్రాప్తి రూప వరప్రదానం చేయుట మొదలగు విషయములు వర్ణించబడినవి.

**తీర్థములు - ఉపాఖ్యానములు**

శ్రీవేంకటాచలాన్ని సర్వపుణ్యతీర్థాలకు నిలయంగా స్కాందపురాణం అభివర్ణించింది. దీనిలో ఇరువది తీర్థముల మాహాత్మ్యం చెప్పబడింది. స్వామిపుష్కరిణి, కుమారధార, తుంబురుతీర్థం, జాబాలితీర్థం, అస్థిసరోవరం, పాపవినాశం, ఆకాశగంగ, కటాహతీర్థం, పద్మసరోవరం, సువర్ణముఖరి మొదలగునవి. సువర్ణముఖరీ మాహాత్మ్యం ఇందులో చెప్పినంత విపులంగా ఇతర పురాణములలో చెప్పబడలేదు. దీనిలో 22 మంది భక్తుల చరిత్రలు ఉపాఖ్యానములుగా చెప్పబడినవి. అవి వసువనే నిషాదుని వృత్తాంతం, తొండమాన్ చక్రవర్తి వృత్తాంతం, భీముడనే భక్తునిచరిత్ర, కాశ్యప పరీక్షత్తుల ఉపాఖ్యానం, ధర్మగుప్తుని చరిత్ర, అర్జునుని తీర్థయాత్రావర్ణన, భరద్వాజ మహర్షి వృత్తాంతం, అగస్త్య మహర్షి వృత్తాంతం, శంఖరాజు వృత్తాంతం, సుమతి వృత్తాంతం, హేమాంగుని వృత్తాంతం, దృఢమతి చరిత్ర, భద్రమతి ఉదంతం, పద్మనాభుని కథ, రామానుజుడనే భక్తుని కథ, సుందరుడనే గంధర్వునివృత్తాంతం, కేశవుడనే భక్తుని చరిత్ర, రంగదాసు వృత్తాంతం మొదలగునవి.

**వాసుదేవాలయం**

శ్రీవేంకటాద్రిని లక్ష్మీపతి నివాసభూమిగా స్కాందం పేర్కొన్నది

**'సువర్ణముఖరీ తీరే లక్ష్మీపతి నివాసభూః ।**
**వేంకటాద్రిరితిఖ్యాతః సర్వలోకేషు పూజితః ॥** స్కాందపురాణము 2. 11-84

దీనిని వాసుదేవాలయంగా అభివర్ణించింది.

**శ్రీవేంకటాచలో నామ వాసుదేవాలయోమహాన్ ।**
**సప్తయోజనవిస్తీర్ణః శైలేన్ద్రో యోజనోచ్ఛ్రితః ॥**

**అస్తి స్వర్ణమయోదేవి! రత్నసానుభృదాయతః ।**
**ఇన్ద్రాద్యాదైవతగణాః వసిష్ఠాద్యామునీశ్వరాః ॥**

**సిద్ధాః సాధ్యాశ్చ మరుతో దానవాదైత్య రాక్షసాః ।**
**రమ్భాద్యా అప్సరస్సఙ్ఘాః వసన్తి నియతం ధరే! ॥**

**తపశ్చ రన్తి నాగాశ్చ గరుడాః కిన్నరాస్తథా ।**
**ఏతైరధిష్ఠితాస్తత్ర సరితః పుణ్యదర్శనాః ॥** స్కాందపురాణము 2.1. 40-43

బంగారు ఛాయతో, రత్నసానువులతో అలరారే ఈ పర్వతంపైన ఇంద్రాది దేవతలు, వసిష్ఠాదిమహర్షులు, సిద్ధులు, సాధ్యులు, మరుత్తులు, రంభాది అప్సరసలు, దానవులు, దైత్యులు, రాక్షసులు నిత్యం నివసిస్తున్నారు. నాగులు, గరుడులు, కిన్నరులు కూడ అక్కడ తపస్సు చేస్తున్నారు. ఇచ్చటి తీర్థములు పుణ్యప్రదములు. వాటి దర్శన మాత్రంచేతనే మానవులు పునీతులౌతారు.

ఈ వేంకటాచలంలోని సర్వతీర్థాలలో చక్రతీర్థము, దైవతీర్థము, ఆకాశగంగ, కుమారధార, పాపనాశనం, పాండవతీర్థం, స్వామి పుష్కరిణి అనే ఏడు తీర్థములు శ్రేష్ఠమైనవి. వాటి లోకూడ స్వామి పుష్కరిణి మిక్కిలి శుభప్రదమైనది. దానికి పశ్చిమతీరంలో భూదేవితోకూడి శ్రీవరాహస్వామి ఉంటున్నారు. దానికి దక్షిణతీరంలో జగత్ప్రభువైన శ్రీనివాసుడు నెలకొనిఉన్నాడు.

### పరమాత్మాలయం

ఈ పర్వతమును పరమాత్మాలయంగా స్కాందపురాణం అభివర్ణించింది.

జ్ఞానులు దీనిని పరమాత్మ నిలయంగా పేర్కొంటారు. వేలయోజనముల దూరములో ఉన్నప్పటికిని, ద్వీపాంతరంలో ఉన్నప్పటికిని, శ్రీవేంకటాద్రి ఉన్న దిక్కుకు తిరిగి భక్తితో నమస్కరిస్తే మానవుడు అన్ని పాపములనుండి విముక్తిపొంది విష్ణులోకమును పొందుతాడు. ఇది అప్రాకృతమైన దివ్యక్షేత్రం. ఈ బ్రహ్మాండంలోని తీర్థాలన్నీ శ్రీవేంకటాద్రిలో ఉన్నవి. ఈ పవిత్రపర్వతంపైన వేంచేసియున్న వేదవేద్యుడు, దేవదేవుడు, సనాతనుడు, పురుషోత్తముడు, భక్తాభయప్రదుడైన శ్రీవేంకటేశుని సేవించుటకై భక్తులు వివిధ ప్రాంతములనుండి వచ్చుచుందురు.

## బ్రహ్మోత్సవం

శ్రీవేంకటాద్రిలో బ్రహ్మదేవుడు కన్యామాసంలో ధ్వజారోహణం చేశాడు. ప్రతిసంవత్సరం భాద్రపద, ఆశ్వయుజమాసములలో వచ్చే బ్రహ్మోత్సవంలో దేవతలు, ఋషులు, గంధర్వులు, సిద్ధులు, సాధ్యులు, యోగులు, మానవులు శ్రీనివాసుని సేవిస్తారు.

## వేంకటాద్రి వైశిష్ట్యం

విద్యలలో వేదవిద్య, మంత్రములలో ప్రణవము, ధేనువులలో కామధేనువు, ప్రియవస్తువులలో ప్రాణము, సర్పములలో శేషుడు, పక్షులలో గరుడుడు, దేవతలలో విష్ణువు, వర్ణములలో విప్రుడు, వృక్షములలో కల్పవృక్షము, హితులలో భార్య, తీర్థములలో గంగ, తేజస్సులలో రవి, ఆయుధములలో వజ్రాయుధము, లోహములలో కాంచనము, రత్నములలో కౌస్తుభము వలె క్షేత్రములన్నింటిలో వేంకటాచలము ఉత్తమోత్తమమైనది. భగవంతుని యందు ప్రీతిని పెంపొందించుటలో దీనికి సాటిమరొకటిలేదు.

వైశాఖమాసంతో సమానమైన మాసం, కృతయుగంతో సమానమైన యుగం, వేదంతో సమానమైన శాస్త్రం, గంగతో సమానమైన తీర్థం, జలదానంతో సమానమైన దానం, భార్యాసుఖంతో సమాన సుఖం, కృషితో సమాన ధనం, జీవితంకంటె శ్రేష్ఠమైనలాభం, ఉపవాసమును మించిన తపస్సు, దానమును మించిన సుఖము, దయతో సమానమైన ధర్మము, చక్షువుతో సమానమైన జ్యోతిస్సు, భోజనంతో సమానమైన తృప్తి, వ్యవసాయంతో సమానమైన వాణిజ్యము, ధర్మంతో సమానమైన మిత్రుడు, సత్యంతో సమానమైన యశస్సులేనట్లే సాక్షాత్తు భగవంతుని నివాసభూమియైన శ్రీవేంకటాద్రితో సమానమైన స్థానము ఈ సృష్టిలో మరొకటిలేదు.

**"న మాధవ సమో మాసో నకృతేన సమం యుగమ్ ।**
**న చ వేదసమం శాస్త్రం న తీర్థం గఙ్గయా సమమ్ ॥**

**న ధర్మేణ సమం మిత్రం న సత్యేన సమం యశః ।**
**యథా తథా భగవతః స్థానేన సదృశం న హి ॥** స్కాందపురాణము 2.17-17,20

లోకంలో ఎవని కీర్తనం సకలపాపహరమో, ఎవనికి వందనం చేయుట సకల సౌఖ్యదాయకమో, ఎవని గూర్చి యాత్రచేయుట దేవతలకు కూడ పూజనీయమో, అటువంటి శ్రీవేంకటాచలము మహత్తరమైనది.

**"యత్కీర్తనం సకలపాపహరం మునీంద్రాః !**
**యద్వందనం సకలసౌఖ్యాదమేవ లోకే ।**
**యాత్రాఽపి యం ప్రతి సురైరపి పూజనీయా ।**
**తాదృఙ్ మహాన్ భవతి వేంకటశైల ముఖ్యః ॥** స్కాందపురాణము 2.17-21

## శ్రీవేంకటేశ్వర వైభవం

శ్రీవేంకటేశ్వరుని ఒక్కసారి దర్శించినా విష్ణుసాయుజ్యం వస్తుంది. కృతయుగంలో పది సంవత్సరములు సంపాదించే పుణ్యం, త్రేతాయుగంలో ఒకసంవత్సరంలో వచ్చే పుణ్యం, ద్వాపరయుగంలో ఐదునెలలకు వచ్చే పుణ్యం, కలియుగంలో ఒకరోజు పుణ్యం, కోటిరెట్లు ఎక్కువగా శ్రీనివాసుని దర్శిస్తే లభిస్తుంది. శ్రీనివాసునిలో సకలతీర్థాలు, దేవతలు, మునులు, పితృదేవతలు నివసిస్తారు. రోజుకొకసారి గాని, రెండుసార్లు గాని, మూడుపర్యాయములుగాని, సర్వకాలాల్లో శ్రీనివాసుని తలంచినా, కీర్తించినా, మానవులు పాపపంజరం నుండి బయటపడతారు. నారాయణుడు, పరదైవము, శంఖరాజపూజితుడు అయిన శ్రీనివాసుని తలచిన మాత్రముననే మానవులకు యముని భయముండదు.

శ్రీనివాసుని ఒక్కసారైనా అర్చించే వారికి దానములు, వ్రతములు, తపస్సులు, యజ్ఞములతో పనిలేదు. శ్రీనివాసుని స్మరింపనివాడు, క్షణమైనా ధ్యానించనివాడు అజ్ఞాని, పాపి, మూగవాడు, చెవిటివాడు మందబుద్ధి (జడుడు), గ్రుడ్డివాడుగా భావించాలి. వానికి శాంతిలేదు. శ్రీనివాసుని ఒక్కసారి దర్శించి, సేవించినచో కాశికి, గయకు, ప్రయాగకు పోవలసిన పనిలేదు. భూలోకంలో దుర్లభమైన మనుష్యజన్మపొంది, పరదేవతయైన శ్రీనివాసుని దర్శించి, సేవించి, పూజించినచో వారి జన్మ సఫలమౌతుంది. వారు ధన్యులు, కృతార్థులు. శ్రీనివాసుని సేవించని వారి జన్మవ్యర్థం, నిష్ఫలం.

శ్రీవేంకటేశ్వరుని దర్శించినా, పూజించినా, బ్రహ్మరుద్ర దేవేంద్రాదుల అనుగ్రహం లభించినట్లే, శ్రీవేంకటేశుని భక్తులు దుఃఖములను, యమలోకాన్ని పొందరు. శ్రీనివాసుని దర్శనం వలన సహస్ర బ్రహ్మ హత్యలు, అసంఖ్యాక సురాపానములు వలన కలిగేపాపాలు నశిస్తాయి. శ్రీనివాసునికి నమస్కరిస్తే సురలోక భోగములు ప్రాప్తిస్తాయి. ఆ ప్రభువు దర్శనం వలన కోటిజన్మలలో చేసిన పాపం నశిస్తుంది.

**"యాని కాని చ పాపాని కోటిజన్మ కృతాని చ ।**
**తాని సర్వాణి నశ్యన్తి వేంకటేశ్వర దర్శనాత్ ॥** స్కాందపురాణము 2.18-19

ఒకరి స్నేహం వల్లకాని, కుతూహలంచేతకాని, భయంవల్లగాని, లోభం వల్లగాని వేంకటేశ్వరుని స్మరించినచో ఇహపరాల్లో వారికి దుఃఖంలేదు. శ్రీనివాసుని కీర్తించినా, పూజించినా, విష్ణుసారూప్యం పొందుతాడు. ఇందులో సందేహంలేదు. అగ్ని క్షణకాలంలో సమిధలను భస్మం చేసినట్లు శ్రీవేంకటేశ్వరదర్శనం మానవుల సర్వపాపములను క్షణంలో భస్మం చేస్తుంది.

స్కాందపురాణంలో శ్రీవేంకటేశ్వరుని భక్తి ఎనిమిది విధములుగ చెప్పబడినది. 1. ఆ దేవదేవుని భక్త జనులపై వాత్సల్యము కలిగియుండుట, 2. స్వామివారికి పూజలు చేయించి సంతోషపడుచుట, 3. స్వయంగా స్వామివారిని పూజించుట, 4. స్వామి వారి సేవచేయుట, 5. శ్రీనివాసుని కథాశ్రవణమునందాసక్తి

కలిగియుండుట, 6. శ్రీవేంకటేశ్వరుని యందలి భక్తితత్పరత్వం వలన స్వర, నేత్ర, శరీరములందు మార్పు కలుగుట, (అనగా స్వరం గద్గదమగుట, నేత్రములనుండి బాష్పములు రాలుట, శరీరము గగుర్పాటు చెందుట మొదలగునవి). 7. ఎల్లప్పుడు శ్రీనివాసుని స్మరించుట, 8. వేంకటాద్రిలో నివసించుట, స్వామిని ఆశ్రయించి జీవించుట అను ఈ ఎనిమిది విధముల భక్తికలవారు ముక్తిపొందెదరు.

## శ్రీనివాసుడు సర్వసముడు

శ్రీనివాసుని దర్శనమాత్రం చేతనే సకలాశ్రమముల వారికి ముక్తి లభిస్తున్నది. యతులకు, బ్రహ్మజ్ఞానులకు, విరక్తులకు వేదాంతశ్రవణం, జ్ఞానం, వైరాగ్యం, సన్యాసస్వీకారం వల్లగాని అది లభించదు. శ్రీనివాసునికి క్రిమికీటకాదులు, దేవతలు, మునులు, తపోధనులు సమానులే. 'నేను పాపినే' అని భయపడ వలదు. పుణ్యాత్ముడనని గర్వించవద్దు. శ్రీనివాసుని **అనుగ్రహం పొందుటలో అందరు సమానులే అవుతారు. ఎక్కువ, తక్కువ భేదం లేదు. నీచులు, మహాత్ములు అనుతారతమ్యం లేదు. అందరు పూజ్యులే.**

సర్వపాప నిర్వాపకము, మహాపవిత్రమునైన వేంకటాద్రిలో శ్రీనివాసుని భక్తితో దర్శించి, సేవించిన వారితో చతుర్వేది కూడ సమానుడు కాడు. శ్రీనివాసుని సంసేవనం కంటె గొప్ప పుణ్యం కాని, సమానమైన పుణ్యం కాని వేరులేదు. శ్రీనివాసునికంటే గొప్పదైవం లేదు.

**"శ్రీనివాసార్చన సమం నాధికం పుణ్యమస్తి వై!"** స్కాందపురాణము 2.18-36

ఎవరైనా మదంతో, మోహంతో, అజ్ఞానంతో శ్రీనివాసుని దూషించినచో వారికి అనేక బ్రహ్మహత్యా పాతకములు సంభవిస్తాయి. అటువంటి వానితో మాట్లాడిన మాత్రం చేతనే నరకం ప్రాప్తిస్తుంది. వేదములు, యజ్ఞములు, సర్వము శ్రీనివాసుని పరములే. అతనికంటె వేరైనదేదియులేదు. కావున ఇతరములన్నీ విడచి శ్రీనివాసునే ఆశ్రయించవలెను, ఆయననే శరణుపొందవలెను.

**"శ్రీనివాస పరావేదాః శ్రీనివాస పరామఖాః ।**
**శ్రీనివాస పరాస్సర్వే తస్మాదన్యం న విద్యతే ।**
**అన్యత్సర్వం పరిత్యజ్య శ్రీనివాసం సమాశ్రయేత్"** స్కాందపురాణము 2.18-38,39

సర్వయజ్ఞ తపః ఫలం కంటె కోటిరెట్లు ఫలితం శ్రీనివాసుని సేవచే కలుగుతుంది. తపోదానాదులు కూడా అంతే. శ్రీవేంకటేశ్వరుని రెండు ఘడియలు ధ్యానిస్తే ఇరువదియొక్క తరముల వారితో కూడ విష్ణు లోకం పొందుతారు. స్వామిపుష్కరిణీస్నానం, శ్రీనివాస సందర్శనం కలిగిన వారికి గంగాస్నానం అవసరంలేదు. కావున ఎప్పుడైనను, ఏ విధంగానైనను ప్రయత్నంచేసి భక్తులు పరలోకేచ్ఛతో కృపాసముద్రుడైన శ్రీవేంకటేశ్వరుని దర్శించాలి.

**"సర్వయజ్ఞతపోదానతీర్థస్నానేతు యత్ఫలమ్**
**తత్ఫలం కోటిగుణితం శ్రీనివాసస్య సేవయా ॥** స్కాందపురాణము 2. 18-40

**శ్రీవేంకటాచలం - సర్వదేవతావాసం**

శ్రీవేంకటాచలంలో అనేక సరస్సులు, సెలయేళ్ళు, మహాపుణ్యప్రదములైన తీర్థములు, వనములు, ఆశ్రమములు, పుణ్యక్షేత్రజాతములైన వేదారణ్యములున్నవి. అచట వసిష్ఠాది మహర్షులు, సిద్ధచారణకిన్నరులు, శ్రీభూదేవులతో కూడిన మధుసూదనుడు, సరస్వతీసహితుడైన బ్రహ్మ, పార్వతీసహితుడైన శంకరుడు, గజానన షణ్ముఖాదులు, ఇంద్రాదిదేవతలు, అష్టదిక్పాలురు, ఆదిత్యాది గ్రహములు, అష్టవసువులు, పితరులు, లోక పాలకులు, ఇతరదేవగణములు రాత్రింబవళ్ళు నివసిస్తుంటారు. వీరంతా మానవుల చర్మచక్షువులకు గోచరించరు. చూడగలిగిన పుణ్యాత్ముల మనోనేత్రములకు గోచరిస్తారు. ఆ పర్వతదర్శన మాత్రంచేతనే నరులకు సద్బుద్ధి, సౌఖ్యం కలుగుతాయి. ఆ పర్వతంపై ఉంటున్న సిద్ధచారణవనితలు సర్వకాలములలోను కృపానిధియైన శ్రీవేంకటేశ్వరుని పూజిస్తారు. శ్రీవేంకటాచలంలో వీచేవాయువులు నరుల బ్రహ్మహత్యాది పాపములను నశింపజేస్తాయి.

**"తస్యదర్శనమాత్రేణ బుద్ధిసౌఖ్యం నృణాం భవేత్ ।**
**తన్మూర్ధని కృతావాసాః సిద్ధచారణ యోషితః ॥**
**పూజయన్తి సదాకాలం వేఙ్కటేశం కృపానిధిమ్ ।**
**కోటయో బ్రహ్మహత్యానాం అగమ్యాగమకోటయః ।**
**అఙ్గలగ్నా వినశ్యన్తి వేఙ్కటాచలమారుతైః "** స్కాందపురాణము 2.19-8,9

**సకలాభీష్టప్రదాత**

సర్వలోకసేవితము, మహాపుణ్యప్రదము, సర్వదేవతాభివందితము, మేరు పుత్రసంతానము అయిన వేంకటాద్రి వైకుంఠమునుండి గరుత్మంతునిచే తీసుకొనిరాబడినది. ఆ క్రీడాచలమును దేవతలు, ఋషులు పూజింతురు. ఆ వేంకటాచలమునందు సాక్షాత్తు శ్రీమన్నారాయణుడు స్వయంగా లక్ష్మీదేవి, భూదేవి, నీలా దేవులతో కూడి వేంకటేశునిగా దర్శనమిస్తున్నాడు. ఆయన మోక్షప్రదాయకుడు.

**"తస్మిన్ వేఙ్కట శైలేన్ద్రే సాక్షాన్నారాయణః స్వయమ్ ।**
**లక్ష్మీదేవ్యా చ భూదేవ్యా నీలాదేవ్యా సమాగతః ।**
**వర్తతే వేఙ్కటేశః సః సాక్షాన్మోక్షప్రదాయకః"** స్కాందపురాణము 2.28-78,79

శ్రీనివాసుడు అగస్త్యమహర్షికి ఈ విధంగా వరప్రదానం చేసినట్లు స్కాందపురాణం పేర్కొన్నది- అగస్త్యమహర్షీ! నీ ప్రార్థనవలన వైకుంఠమను పేరుగల ఈ పర్వతమున ఇప్పటినుండి సర్వదా నివసింతును. ఈ వైకుంఠపర్వతమున నిశ్చలభక్తితో నన్నెవరు దర్శించినను వారు భూలోకంలో పుత్రపౌత్రులను పొంది సర్వై శ్వర్యములను అనుభవించి, మరణానంతరము స్వర్గమున కల్పాంతము వరకు భోగములననుభవించి, పునరావృత్తి రహితము, కేవలానందభాసురమునగు నా స్థానమును పొందగలరు. ఈ విషయమై విచారించ నక్కరలేదు. నన్ను చూచుటకు వచ్చిన భక్తులందరిని చూచి వారి శుభప్రదములైన కోర్కెలను సదా తీర్చగలను. పుత్రార్థులకు బహుపుత్రులను, ధనముకోరువారికి ధనమును, ఆరోగ్యమును కోరువారికి ఆరోగ్యమును కలిగింతును. తీవ్రమైన ఆపదలలో నున్నవారికి ఆపన్నివారణము చేసి దుర్లభములైన భోగములను, కోరికలను సదా ప్రసాదింతును. ఎవరెవరు ఏఏ కోరికల నపేక్షించి ఇక్కడకు వచ్చి దర్శింతురో వారి కోరికల నన్నింటినీ తీర్చెదను. ఇందులకు సందేహము వలదు. నా భక్తులు ఎక్కడ ఉండినన్ను స్మరించినను నా అనుగ్రహమువలన వాంఛితసిద్ధిని పొందగలరు".

## సాటిలేనిక్షేత్రం, దైవం

స్కాందపురాణంలో భరద్వాజమహర్షి అర్జునునకు శ్రీవేంకటాచలమాహాత్మ్యమును ఈ విధంగా వివరించెను. "అర్జునా! నారాయణుని, వేంకటాద్రిని, స్వామిపుష్కరిణిని, ఈ మాహాత్మ్యమును స్మరించిన జనులు పాతకములనుండి విముక్తులగుదురు. ఈ బ్రహ్మాండమున వేంకటాద్రితో సమానమైన స్థానములేదు. వేంకటేశునితో సమానమైన దేవుడులేడు, ఇకముందు ఉండబోడు. వేంకటాద్రితో సమానమైన స్థానముకూడ ఉండబోదు. స్వామిపుష్కరిణితో సమానమైన సరస్సు మరెచ్చటనులేదు. ఎవరు ప్రాతఃకాలమున లేచి నిత్యము శ్రీవేంకటేశుని స్మరించెదరో వారికి మోక్షలక్ష్మి చేతియందుండును. ఇందుకు సందేహములేదు. స్వామి పుష్కరిణిలో స్నానముచేసి, వరాహాచలవాసి, సర్వాత్మకుడగు శ్రీవేంకటేశుని దర్శించువారు సహస్రాశ్వమేధముల, శతవాజపేయముల పూర్ణఫలమును పొందుదురు. దీనికి విచారించ నవసరములేదు. శ్రీవేంకటాచలమాహాత్మ్యమును వినినవారికి ఇహలోకమున భుక్తియు, పరలోకమున ముక్తియు కలుగును".

**"వేఙ్కటాద్రిసమం స్థానం బ్రహ్మాణ్డే నాస్తి కిఞ్చన ।**
**వేఙ్కటేశ సమో దేవో నభూతో న భవిష్యతి ॥**
**వేఙ్కటాద్రి సమం స్థానం న భూతం న భవిష్యతి ।**
**స్వామితీర్థ సరస్తుల్యం నకుత్రాపి చ విద్యతే ॥**
**ప్రాతరుత్థాయ యే నిత్యం వేఙ్కటేశం స్మరన్తి వై ।**
**తేషాం కరస్థా మోక్షశ్రీః నాత్ర కార్యావిచారణా ॥"**

స్కాందపురాణము 2.38-70,72

ఈ విధంగా స్కాందమహాపురాణమునందు శ్రీవేంకటాచలమాహాత్మ్యము 2,476 శ్లోకములలో అత్యద్భుతముగా వర్ణించబడినది. శ్రీపద్మావతీ శ్రీనివాసుల కల్యాణము ఆరు అధ్యాయములలో చెప్పబడినది. కాని ఇందులో కుబేరుని అప్పు ప్రస్తావనలేదు. అలాగే సువర్ణముఖరీ మాహాత్మ్యము ఆరు అధ్యాయములలో విపులముగ వర్ణించబడినది. ఇంకను తొండమాన్ చక్రవర్తి ఆలయగోపురములను కట్టించుట, విమాన వేంకటేశ్వరుడు మొదలగు విషయములెన్నో ఇందు కలవు. జిజ్ఞాసువులు, ముముక్షువులు, భక్తులు ఆదరముతో చదివి శ్రీవేంకటేశ్వరుని అనుగ్రహమునకు పాత్రులగుదురుగాక!

# స్కాందపురాణం - శ్రీవేంకటాచలమాహాత్మ్యం

డా॥ దావులూరి కృష్ణకుమార్

ఆముష్మికనిధికి, సామాజికధర్మకర్మవిచారణకు నిక్షేపాలవంటివి పురాణాలు. ఈ ధర్మవిద్యను సమ్మతంగా కధ ఉపకధల ద్వారా ఉపదేశించే గ్రంథాలు వరాహ, గరుడ, పద్మ, శేషధర్మ, బ్రహ్మాండ, మార్కండేయ వామన, బ్రహ్మ, భవిష్యోత్తర, స్కాంద, ఆదిత్య పురాణాలు శ్రీవేంకటాచలమాహాత్మ్యసంబంధి పురాణాలు.

స్కాందపురాణంలోని వేంకటాచలమాహాత్మ్యాన్ని, వేంకటాచలవాసుని భగవత్తత్త్వాన్ని, పుణ్యతీర్థాల మహిమల్ని, వాటి వృత్తాంత ప్రభావాల్ని ఈ పురాణప్రవచనాలతో పరిచయం చేయడం ఇక్కడ ఉద్దేశ్యం.

స్కాందపురాణంలో శ్రీవేంకటాచలస్వామి వైభవం నాల్గుభాగాల్లో 30 అధ్యాయాల్లో 1675 శ్లోకాల్లో ఉంది.

## వేంకటాచలక్షేత్ర ప్రాభవం

వేంకటాచలం స్వర్ణాచలం. ఇది స్వయం వ్యక్తస్థలం. 'సర్వపాతకనాశకం, సర్వదేవనిషేవితం, మహాపుణ్య ప్రదం, సురాసురసేవితం, సర్వకామఫలదం' అయిన వైష్ణవక్షేత్రం.

**సువర్ణముఖరీతీరే లక్ష్మీపతినివాసభూః**
**వేంకటాద్రిరితిఖ్యాతః స్సర్వలోకేషుపూజితః** 1-1-85

**సువర్ణముఖరీతీరే ఋషిసంఘనిషేవితే**
**వర్తతేదేవతైః సేవ్యః పావనో వేంకటాచలః** 1-9-76

**వర్తతే దేవసంఘైశ్చ సేవితో వేంకటాచలః**
**మేరుపుత్రో మహాపుణ్యస్సర్వకామఫలప్రదః** 1-12-47

'సువర్ణముఖరీ' నదికి ఆమడదూరంలో ఉన్న వేంకటాద్రి లక్ష్మీపతినివాసభూమి, విష్ణుప్రీతివర్ధనమైంది, సకలదేశప్రజలూ పూజించే క్షేత్రం ఇది. వరాహరూపంలో విష్ణువు సంచరించడం వల్ల దీన్ని 'వరాహక్షేత్రమ'నీ (3-7-14) అంటారు.

**విద్యానాం వేదవిద్యేవ మన్త్రాణాంప్రణవోయధా** 1-7-10

**ప్రాణవత్ప్రియవస్తూనాం ధేనూనాం కామధేనువత్**
**తధావేంకటశైలేంద్రః క్షేత్రాణాముత్తమోత్తమః** 1-7-11

**నానేవ పద్మశోలోకే విష్ణుప్రీతి వివర్ధనః** 1-7-16

విద్యలో వేదవిద్య, మంత్రాల్లో ప్రణవం, ప్రియమైన వస్తువుల్లో ప్రాణం, ధేనువుల్లో కామధేనువు, ఆయుధాల్లో వజ్రాయుధం, పక్షుల్లో గరుడుడు, వృక్షాల్లో కల్పవృక్షం, తీర్థాల్లో గంగ మాదిరిగా క్షేత్రాల్లో 'వేంకటాచలం' ఉత్తమోత్తమం. అంతేకాదు జీవితపువిలువలతో తులతూచినా ఈ క్షేత్రంతో సరిపోలే క్షేత్రం మరేదీ ఉండదు. జలదానంతో సమానమైన దానం, కృషితో సమానమైన ధనం, కంటిచూపుతో సమానమైన కాంతి, భోజనంతో సమానమైన తృప్తి, వ్యవసాయంతో సమానమైన వ్యాపారం, సత్యంతో సమానమైన యశస్సు, ధర్మంతో సమానమైన మిత్రత్వం ఉండనట్లే వేంకటాద్రితో సమానమైన స్థానం మరొకటి ఉండదు. (1-7-18,19,20) ఇలాంటి 'భాగవతస్థానా'న్ని దర్శించినంత మాత్రానే మంచిబుద్ధి, మంచిసౌఖ్యం కల్గుతుంది. 'తస్యదర్శన మాత్రేణ బుద్ధిసౌఖ్యంన్నృణామ్భవేత్'

ఇలాంటి 'పుణ్యావర్ధనం' అయిన వేంకటాద్రిపై కాలుమోపేటపుడు 'భక్తిభావన' ప్రతిఒక్కరిలో ఇలా మెదలాలి.

**స్వర్ణాచల మహాపుణ్య సర్వదేవనిషేవిత**
**బ్రహ్మాదయోపి యందేవాస్సేవన్తే శ్రద్ధయాసహ** 1-9-11
**తం భవన్తమహం పద్భ్యామాక్రమేయంనగోత్తమః**
**క్షమస్వతదఘంమేఽ ద్యదయయాపాపచేతనః** 1-9-12
**తన్మూర్ధని కృతావాసం మాధవం దర్శయస్వ మే॥** 1-9-13

బ్రహ్మాదులు శ్రద్ధతో సేవించే ఓ పవిత్రమైన పర్వతమా! 'నీపై నాపాదాలు మోపుతున్నాను. నా ఈ పాపాన్ని క్షమించు, నీ కొండకొనమీది వేంకటేశుని దర్శనభాగ్యం కల్గించమని వేడుకుంటూ మెల్లగా పాదాలు మోపుతూ కొండని ఎక్కాలి.

వేంకటాచలంమీద అన్నదానం, వస్త్రదానం, సువర్ణదానం చేస్తే మునిత్వంతో సర్వలోకసంచారం, సాలగ్రామ, శిలాదానాలుచేస్తే జన్మరాహిత్యం, గోదానంచేస్తే విష్ణుపదప్రాప్తి, భూదానంచేస్తే చెప్పనలవికానంత పుణ్యం, కన్యాదానంచేస్తే విష్ణులోకంలో పితృదేవతలతోడి సంతోషం, జలదానానికి చల్లని పందిళ్లు వేయిస్తే శేషుడికికూడా చెప్ప వశంకానంత పుణ్యం లభిస్తుంది. అన్నిదానాలూచేసి జలదానం చేయని హేమాంగుడూ, (ప్ర.భా.6అ) కుటుంబభారం వలని దారిద్ర్యంచే బాధపడే భద్రమతికి దానం చేయని దోషంచే సంఘోషుడూ (ప్ర.భా.10అ) వివేకహీనులై, తిరిగి ఈ పర్వతంమీద చేసిన జల, భూదానాలవల్ల సద్గతిపొందిన వృత్తాంతాలు వీటికి వివరణ ప్రాయాలు.

ఈ వేంకటాచలంలో అంజనం, అనంతం, వృషభం, నీలకేసరి, పోత్రి, నారాయణం, వేంకటం అనే ఉపవనాలు (3-7-13) ప్రసిద్ధమైనవి.

పూలతో పండ్లతో నిండిన చెట్లకొమ్మలనీడలు, బంగారం, రాగివర్ణ మిశ్రితమైన కొండచరియలు, సెలయేళ్లు, కొండప్రవాహాలు, పూలపరిమళాలు కలగలసిన పిల్లవాయువులు, పిట్టలకిలకిలలు (3-9-51,52,53) మొదలుగాగల పర్వత ప్రకృతి సౌందర్యాలు మానసికానందాన్ని అనుభవింపచేస్తాయి. ఈ కొండమీద వీచే మందమారుతాలు చేసిన పాపాల్ని తుడిపింపచేస్తాయి.

**'వేంకటాచలమాహాత్మ్యం యేశృణ్వంతినరోత్తమాః**
**తేషాం ముక్తిశ్చభుక్తిశ్చ ఇహలోకే పరత్ర చ'** 3-10-75

ఈ కొండ మహిమ వింటే ఈ లోకంలో భుక్తి, పైలోకంలో ముక్తి కలుగుతుంది.

## వేంకటాచలస్వామి వైభవం

**'అయం వేంకటనామాద్రిః త్రిలోకేషువిశ్రుతః**
**వైకుంఠాదపిమే రాజన్ ఆవాసోఽతిప్రియవాహః** (3-9-19)

వేంకటాద్రి ముల్లోకాల్లోనూ పేరు పొందినక్షేత్రం, విష్ణువుకి, వైకుంఠం కన్న అతిప్రియమైన నివాసస్థానం ఇదే.

**'తస్మిన్‌గిరౌ శ్రియాసార్థం వసంతం వేంకటాధిపమ్'** 3-7-25

ఈ వేంకటాచలంపై వసించే పురుషోత్తముడు శ్రీదేవిసహిత శ్రీనివాసుడు. ఈ స్వామి మంగళ విగ్రహరూపాన్ని ఒకటికి రెండుసార్లు సాక్షాత్కరింపచేసింది ఈ పురాణం (3-10-22 నుంచి 25) (శ్రీనివాసస్తోత్రం 1-10-71 నుంచి 81, 1-13-12 నుంచి 17).

**'శంఖచక్రధరం దేవం పీతాంబరం శుభమ్'** 1-7-3

**'కౌస్తుభాలంకృతోరస్కం భక్తానామభయప్రదమ్**
**దేవదేవం విశాలాక్షం వేదవేద్యం సనాతనమ్.** 1-7-4

శ్రీనివాసుడు శంఖచక్రధరుడు. పచ్చటి పట్టుబట్ట ధరించినవాడు. కౌస్తుభమణిని తాల్చినవాడు, అభయప్రదుడు. విశాలాక్షుడు, వేదవేద్యుడు, సనాతనుడు ఈ భాగవతోత్తముణ్ణి ఒక్కసారి చూసినా, కీర్తించినా, పూజించినా విష్ణుసారూప్యం కల్గుతుంది. సర్వపాపాలూపోతాయి.

**వేంకటేశే మహాదేవే శ్రీనివాసే విలకితే**
**నన్యూనానాధికాశ్చస్యుః కిన్తు సర్వేమహాజనాః** 1-8-33

ఈ మహాదేవుడి విలోకనం సమతాభావనగల 'మహాజనుణ్ణి' చేస్తుంది. ఎక్కువ తక్కువ అనే భావాన్నే దరికి రానీయదు. ఈ శ్రీనివాసుణ్ణి తలచుకోని వాడు అజ్ఞాని, పాపి, బధిరుడు, అంధుడు అవుతాడు. తలచుకుంటే

ఎన్నిదానాలు చేసినా, ఎన్ని తపస్సులు చేసినా, ఎన్నియాగాలు చేసినా దక్కనిఫలితం దక్కుతుంది.

**యత్కీర్తనం సకలపాపహరం మునీంద్రాః**
**యద్వన్దనమ్ సకలసౌఖ్యదమేవ లోకే**
**యాత్రాఽపి యం ప్రీతి సురైరపి పూజనీయా**
**తాదృఙ్మహన్భవతి వేంకటశైలముఖ్యః** 1-7-21

మునీంద్రుల శ్రీనివాసకీర్తనం సమస్తదోషనివారకం. వందనం లోకానికే సౌఖ్యదాయకం. వేంకటాచలయాత్ర సమస్త సుర పూజనీయం.

**వేంకటేశ్వర దేవేశం యః పూజయతి భక్తితః**
**సకోటికుల సంయుక్తః ప్రయాతి హరిమన్దిరమ్**
**శ్రీనివాసార్చనసమం నాధికం పుణ్యమస్తి వై** 1-8-36

వేంకటాచలస్వామిని భక్తితో పూజిస్తే కోటికుల సంయుక్తుడవుతాడు. హరిమందిరం చేరుకుంటాడు. శ్రీనివాసుని అర్చనతో సమానమైందిలేదు. అది అధికపుణ్యప్రదం.

**శ్రీనివాసపరాస్సర్వేతస్మాదన్యన్నవిద్యతే**
**అతస్సర్వం పరిత్యజ్య శ్రీనివాసం సమాశ్రయేత్** 1-8-39

సమస్తమూ శ్రీనివాసమయమే. అతడికంటే భిన్నమయింది మరిలేదు. అన్నిటిని కాదనుకుని శ్రీనివాసుణ్ణే ఆశ్రయించాలి.

శ్రీనివాసుడిపై స్థిరసంకల్పులై ఉండేవారికోరికలు వెంటవెంటనే నెరవేర్తుంటాయి. ఆపదలు వెంటాడవు. ఆ శ్రీనివాసుడిసేవ, సర్వయజ్ఞ తపోదాన తీర్థస్నానాల ఫలాన్ని కోటిగుణితం చేస్తుంది.

**వేంకటేశ్వరదేవస్య భక్తిరష్టవిధాస్మృతా**
**తద్భక్తజనవాత్సల్యం తత్పూజాపరితోషణమ్**
**స్వయంతత్పూజనమ్భక్త్యా తదర్థేదేహచేష్టితమ్** 1-8-24

**తన్మాహాత్మ్యకథవాంశ్చ శ్రవణేష్వాదరస్తథా**
**స్వరనేత్రశరీరేషు వికారస్ఫురణస్తథా** 1-8-25
**శ్రీనివాసస్య దేవస్యస్మరణం సతతం తథా**
**వేంకటాద్రినివాసం తమాశ్రిత్యైవోపజీవనమ్** 1-8-26

'స్వామిసేవకులపై వాత్సల్యంతో ఉండడం, ఆ భక్తులను పూజలతో తృప్తిపరచడం, దైవాన్ని తానుగా పూజించడం, దైహికంగా దేవుణ్ణి ఆరాధించడం, స్వామిమహిమలు చెప్పడం, వినడంపట్ల ఆదరం ఉండడం, సతతం స్మరించడం, దైవసన్నిధిలో జీవించడం, గొంతులో, నేత్రంలో, శరీరంలో 'దైవభావం' స్ఫురించడం అనేవి శ్రీనివాస సేవావిధానాలు. ఈ రీతి సేవానిరతి లేనివాడు బ్రహ్మహత్యచేసిన వాడితో సమానుడై 26 రకాల (1-2-3,7) నరకం అనుభవిస్తాడు.

**ప్రాతరుత్థాయ యే నిత్యం వేంకటేశం స్మరంతివే**
**తేషాం కరస్థామోక్షశ్రీః నాత్రకార్యావిచారణా** 3-10-72

ఉదయాన్నే వేంకటేశుని స్మరిస్తే మోక్షలక్ష్మి వశమవుతుందనడంలో ఎలాంటి సందేహం ఉండదు.

**యేవా పశ్యంతి నియతావరాహాచలవాసినమ్** 3-10-73
**తేఽశ్వమేధ సహస్రస్యవాజపేయశతస్యచ**
**ప్రాప్నువంతిఫలం పూర్ణం నాత్రకార్య విచారణా** 3-10-74

వరాహాచలవాసిని ప్రతినిత్యం దర్శించుకున్నవాడు వేయి అశ్వమేధయాగాల ఫలాన్ని, వంద వాజపేయ యాగాల ఫలాన్ని అందుకుంటాడు.

**యస్త్వేతచ్ఛృణు యన్నిత్యం పఠతే సభక్తికమ్**
**సవై వేంకటనాథస్య సేవాఫలమవాప్నుయాత్** 1-8-45

శ్రీనివాసవైభవాన్ని భక్తిశ్రద్ధలతో నిత్యం పారాయణంచేసినా, ఆలకించినా వేంకటేశుని సేవాఫలం పొందవచ్చు.

**వేంకటాచల తీర్థ మాహాత్మ్యం**

పంచభూతాల్లోకి నీరు శ్రేష్ఠమైంది. పుణ్యజలం కల్గి పుణ్యపురుషులకాశ్రయమైన పుణ్యజలాశ్రయం కల్గిన పుణ్యస్థలమే తీర్థం.

**సర్వేషామేవ తీర్థానాం ఆశ్రయోయంనగోత్తమః** 3-7-12

సమస్త పుణ్యతీర్థాలకు ఆధారమైంది ఈ వేంకటాచలం.

**'పృథివ్యాం యాని తీర్థాని బ్రహ్మాండంతర్గతానిచ**
**తానిసర్వాణి వర్తంతే వేంకటాహ్వాయ భూధరే'** 1-7-25

బ్రహ్మాండంలోని తీర్థాలన్నీ వేంకటాద్రిపై ఉన్నాయని భావం. ఇవన్నీ పాపవృక్షాలకు కుఠారాల్లాంటివి.

ఈవేంకటాచలంపై 66 కోట్ల తీర్థాలున్నా, వాటిలో 1008 ముఖ్యమైనవి; వీటిలో 108 సద్ధర్మతిప్రదాలు, 168 భక్తివైరాగ్యప్రదాలు, ఆరుముక్తి ప్రదమైనవి. (1-17-6,7). ఈ ఆరింటిలో నాలుగు స్కాందపురాణంలో వర్ణితమైనాయి. అవి స్వామి పుష్కరిణి, పాపవినాశనం, ఆకాశగంగ, తుంబురుతీర్థాలు. వీటితో పాటు జాబాలి, చక్ర, రామకృష్ణ, కటాహతీర్థమహిమానువర్ణనాన్ని ఆయా వృత్తాంతాలతో వివరిస్తుంది స్కాందపురాణం.

**స్వామిపుష్కరిణీ తీర్థం**

వేంకటాచలంలోని తీర్థాలన్నింటికి 'స్వామిని' వంటిది ఈ తీర్థం . ఈ తీర్థప్రాశస్త్యం పదేపదే స్కాంద పురాణంలో ప్రసక్తమైంది.

**'స్వామి తీర్థాభిధే తీర్థేసర్వపాతకనాశనే**
**అద్వైతజ్ఞానదే పుంసాం భుక్తిముక్తి ప్రదాయిని** 1-2-50
**'ఇష్టకామ్యప్రదేనిత్యం తథైవా జ్ఞాననాశనే"** 1-2-51

ఈ తీర్థస్నానం సర్వపాపాల్ని హరిస్తుంది. అద్వైతజ్ఞానాన్ని కల్గిస్తుంది. పురుషులకు భుక్తిని ముక్తిని ప్రసాదిస్తుంది. ఇష్టార్థాన్ని సిద్ధింపచేస్తుంది. తెలియనితనాన్ని తుడిచిపెట్టుంది.

**'పవిత్రాణాం పవిత్రం హి మంగళానాంచ మంగళం**
**శ్రుతిసిద్ధం మహాపుణ్యం బ్రహ్మహత్యాదిశోధకం'** 1-3-50

ఇది అన్ని తీర్థాల్లోకి పావనమైంది, శుభప్రదమైంది, వేదప్రశస్తమైంది. పుణ్యవంతమైంది, బ్రహ్మహత్యాది పాపాల్ని పవిత్రీకరించేది. సర్వతీర్థాలు సంగమించే సమయంలో అంటే ధనుర్మాసంలో శుక్ల పక్షం ద్వాదశినాడు ప్రాతఃకాలంలో ఈ తీర్థస్నానం ఆచరించాలి. (1-17-19,20) సాలగ్రామ, శిలాదానాలు చేయాలి.

**'స్వామితీర్థంచ పశ్యన్తి తత్రస్నాన్తిచయేనరాః**
**స్తువంతి చ ప్రశంసన్తి స్పృశన్తిచనమన్తిచ'** 1-2-53

ఈ తీర్థాన్ని కంటితో చూసినా, తాకినా, తీర్థంలో స్నానంచేసినా, స్తుతించినా, మరో పుట్టుక ఉండదు.

**'ప్రజ్ఞాలక్ష్మీర్యశస్సంప్రజ్ఞానంధర్మోవిరక్తాతా**
**మనశ్శుద్ధిర్నృణాం స్వామితీర్థ నిషేవణాత్** 1-3-43

ఈ తీర్థంలో మునిగినవారు ప్రజ్ఞ, లక్ష్మి, యశస్సు, ధ్యానయోగఫలం, తులాపురుష దానఫలం పొందగల్గుతారు. ఆత్మవిద్య అబ్బుతుంది. పాపపు ఆలోచనలేరావు. నరకబాధలుండవు (1-2-37,38). ఉన్మత్తులు, దుష్టగ్రహ

పీడితులు, దుఃఖాతప్తులు పొందే బాధలనుంచి తప్పుకోగల్గుతారు. (1-3-57) ఈ తీర్థంలోనేకాదు మరే తీర్థంలోనైనా 'స్వామితీర్థం, స్వామితీర్థం, స్వామితీర్థం' అని ముమ్మార్లు పలికి మునిగితేచాలు 'బ్రహ్మపదం' ప్రాప్తిస్తుంది. (1-3-62)

## పాపవినాశన తీర్థం

'సర్వతీర్థోత్తమం పుణ్యం నామ్నాపాపవినాశనమ్
అస్తి పుణ్యతమే విప్రాః పవిత్రే వేంకటాచలే' 1-9-18
'తత్రస్నానాన్నరాయాన్తి వైకుంఠంనాత్ర సంశయః' 1-9-19

అన్ని తీర్థాల్లోకి పుణ్యతమమైన ఈ తీర్థంలో స్నానంచేస్తే వైకుంఠం ప్రాప్తిస్తుంది. ఈ తీర్థస్నానం సంకల్ప పూర్వకంగా చేస్తే దీర్ఘరోగాలు పోతాయి. పుణ్యాత్ములవుతారు. భూతప్రేతపిశాచాదిభీతి, నివృత్తి అవుతుంది. (1-9-77) సర్వఐశ్వర్యవంతులవుతారు. ఈ తీర్థస్నాన కాలం అశ్వినీనక్షత్రం శుక్లపక్షం, సప్తమి ఆదివారం. ఈ తీర్థమహిమను 'ధృడమతి' వృత్తాంతంతో సమన్వయించింది స్కాందపురాణం.

## ఆకాశగంగా తీర్థం

వియద్గంగేతి నామ్నావై తీర్థమస్తి మహత్తరమ్
సర్వపాప ప్రశమనమాయురారోగ్యవర్ధనమ్. 1-12-50

సమస్త పాపాల్ని ఉపశమింపచేస్తుంది. ఆరోగ్యవంతుల్ని చేస్తుంది ఈ తీర్థస్నానం. ఈ తీర్థస్నానాన్ని చిత్తా నక్షత్రం, సూర్యుడు మేషరాశిలో ఉన్న సమయంలో పౌర్ణమినాడు చేయాలి. సువర్ణదానం, కన్యాదానం చేస్తే నూరు యాగాలఫలం కల్గుతుంది. స్వధర్మపరాయణుడైన బ్రాహ్మణుడు తన ముఖవైరూప్యాన్ని పోగొట్టుకున్న వృత్తాంతం ఈ తీర్థమహిమకు ఉదాహరణం.

## తుంబురు తీర్థం

ఈ తీర్థంలో మునిగినా, నీటిని తాగినా పరిశుద్ధులవుతారు. అన్ని తీర్థాలు సంగమించే వేళలో అంటే శుక్లపక్షం, ఉత్తరాఫల్గుణి నక్షత్రం, మీనరాశిలో సూర్యుడు ఉన్నపుడు స్నానంచేయడంవల్ల మంచిఫలితం ఉంటుంది. స్నానంచేయనివారికి పూలతో పండ్లతో నిండిన చెట్లను నరకడం, ఆత్మస్తుతి, కొండేలుచెప్పడం జీతం తీసుకుని చదువుచెప్పడం, గురుదేవుని ద్వేషించడం వంటి పాపం పనులు చేయడం వల్ల కల్గే పాపాలు చుట్టుకుంటాయి. చల్లటి మాఘమాసంలో వ్రతం ఆచరించడం గూర్చి ప్రశ్నించిన స్త్రీ (భార్య) కప్పరూపాన్ని పొంది ఈ తీర్థమహిమవల్ల ఆ రూపాన్ని పోగొట్టుకున్న వృత్తాంతం ఈ తీర్థమాహాత్మ్యకథ.

## జాబాలి తీర్థం

ఈ తీర్థంలో స్నానంచేసినవారికి మహాపాతకాలుపోతాయి. ఇలాంటి పాతకుల సంసర్గం వల్ల కలిగే దోషాలూ తొలగిపోతాయి. రత్నదానంచేస్తే కోటికన్యాదానాలు చేసినంతఫలం దక్కుతుంది. (1-15-27)

## చక్రతీర్థం

ఇదీ పుణ్యతమమైన తీర్థమే. అన్నదానం, జలదానం, గోదానం చేయనివారు ఈ తీర్థంలో మునిగితే ఆ దానాల ఫలాన్ని మించిన ఫలం లభిస్తుంది. పుత్రుల, పౌత్రుల, వంశజుల అందరి పాపాలూ నశిస్తాయి. పద్మనాభుడనే ద్విజుడి తపఃఫలం వల్ల వేంకటేశుడు ప్రత్యక్షమై సుదర్శనచక్రంతో అతడి కుమారుణ్ణి రాక్షస పీడనుంచి కాపాడిన కథ ఈ తీర్థమాహాత్మ్య వృత్తాంతం.

## రామకృష్ణ తీర్థం

'రామకృష్ణ' తపస్విపేర పేరుపొందిన తీర్థం ఇది. 'బుద్ధిశుద్ధి ప్రదం పుంసాం సర్వైశ్వర్య ప్రదాయకం' (1-5-26). ఈ తీర్థస్నానంవల్ల బుద్ధి వికసిస్తుంది. పురుషులకు సమస్త ఐశ్వర్యాలు ఒనగూడతాయి, తల్లిదండ్రుల్నీ, గురువుల్నీ అవమానపరచిన పాపం పోతుంది, వాంఛలన్నీ సిద్ధిస్తాయి. ఈ తీర్థమహిమవిన్నా, చదవినా 'విష్ణులోక నివాసం' ప్రాప్తిస్తుంది, రవి మకరరాశిలో ఉండగా పౌర్ణమినాడు ఈ తీర్థంలో స్నానం చేయాలి.

## కటాహతీర్థం

సర్వలోకపావనం అయిన తీర్థంగా దీన్ని శ్రుతి పేర్కొంటుంది. ఈ తీర్థసేవనం సర్వరోగనివారకం. మహావిష్ణు ప్రశమనం. భుక్తిముక్తిప్రదాయకం. నాల్గు ఆశ్రమవాసుల్లో ఎవరు సేవించినా 'పరమపదం' లభిస్తుంది.

**మంత్రేణాష్టాక్షరేణైవ పిబేత్తీర్థం మనోహరమ్**
**అథవా కేశవాద్యైశ్చనాభిర్వా పిబేజ్జలమ్**
**యద్వానామత్రయేణా పిబేత్తీర్థం శుభప్రదమ్** 2.37-30,31

అష్టాక్షరీ మంత్రాన్ని ఉచ్చరిస్తూనో, కేశవాదినామాల్ని పఠిస్తూనో ఈ తీర్థజలాన్ని పానం చేయాలి. కేశవద్విజ వృత్తాంతం ఈ తీర్థప్రభావం తెల్పే ఉపాఖ్యానం.

ఇంకా దేవర్షి పితృతీర్థ (3-6-11 నుంచి 14) శంఖతీర్థ (3-6-42,44) సువర్ణముఖరీనది (3-5) మహిమలు, శ్వేతవరాహావతారవృత్తాంతం. వేంకటాచల మాహాత్మ్య సంబంధితాలే.

ఈ తీర్థమహిమలు పునర్తుకాలనిపించినా పాపపరిశుద్ధితో పుణ్యశీలురై స్వధర్మపరాయణులై

యాగదానాది కార్యాలతో సౌఖ్యంగా జీవించి బ్రహ్మవిద్యాసంపత్తితో ముక్తిపొందడం. తద్వారా విష్ణుపదం, జన్మరాహిత్యం పొందడం ఈ తీర్థాలన్నింటి ఫలంగా భావించాలి. ఈ తీర్థమహిమల్ని నమ్మనివారు సర్వకర్మ బహిష్కృతులవుతారు. పరశువులతో నాలుకకొసన కాల్చి యమకింకరులు పెట్టే నరకాన్ని అనుభవిస్తారుట.

ఈ అఖిలతీర్థాలూ శ్రీవేంకటేశ్వర దేవునిలో అంతర్లీనమైఉంటాయి.

**శ్రీవేంకటేశ్వరేదేవే తీర్థానిసకలాన్యపి** 1-8-5
**విద్యన్తే సర్వదేవాశ్చ మునయః పితరస్తథా**

**ఏకకాలం ద్వికాలంవా త్రికాలంసర్వదైవవా** 1-8-6
**యేస్మరంతి మహాదేవం శ్రీనివాసం విముక్తిదమ్**

**కీర్తయన్త్యథవా విప్రాస్తేముక్తాః పాపపంజరాత్** 1-8-7

ఇలాంటి శ్రీనివాసుని స్మరించేవారు పరమాత్మలో విలీనమవుతారు.

### తీర్థమహిమాను వర్ణన వృత్తాంతాలు

కాశ్యప, ధర్మగుప్త, సుమతి, హేమంగ వృత్తాంతాలు మానవుడి స్వధర్మ నిర్వహణలోని దోషం నుంచి విముక్తి కల్గించినవే. ఇవి అధర్మం పట్ల భీతిని, ధర్మంపట్ల ఆసక్తిని కల్గించేవే.

సామాజిక, ఆధ్యాత్మిక ధర్మాల్ని సంకల్పపూర్వకంగా పాటించక పోవడం మహాపాతకం. దీనికి ప్రాయశ్చిత్తం లేదు. మహాపాపులు అనుభవించే నరకబాధల (పశుపక్ష్యాదుల్లా జీవించడం) పట్ల భయాన్ని కల్గించడం, ఆ పాతకంనుంచి బయటపడి మహాజనులు కావాలనే ప్రీతికల్గించడం ఈ వృత్తాంతాల పరమావధి.

పరస్త్రీ వ్యామోహంలో పడి దొంగతనం చేయడం వల్ల కల్గిన బ్రహ్మహత్యాఘాతుకం నుంచి 'సుమతి' అనే రాజు, వేశ్యాలంపటత్వం అనే బ్రహ్మహత్యాదోషంనుంచి కటాహతీర్థపానం వల్ల 'కేశవుడ'నే ద్విజుడు, మిత్రద్రోహంవల్ల వెఱ్ఱివాడై, ఆ విశ్వాసఘాతుకంనుంచి 'ధర్మగుప్తుడ'నేరాజు' వైద్యవిద్యాపారగుడు స్వధర్మాన్ని విస్మరించి ధనలోభమోహంతో రాజద్రోహి అయిన 'కాశ్యపుడ'నే రాజు వేంకటేశునిదర్శించి స్వామిపుష్కరిణిలో స్నానంచేసిన మహిమవల్ల ఆ యా దోషనివారణకులయ్యారు.

మాతృద్రోహం, భార్యాత్యాగం, కన్యకల్ని అమ్మడం ప్రాయశ్చిత్తంతోపోయే పాపాలు కావు. 'సుమతి' అనే రాజు పాపనాశనతీర్థంలో స్నాతుడై బ్రహ్మరాక్షసం నుంచి సద్గతిపొందాడు.

'రామానుజు'డనే బ్రాహ్మణుడు గొౢడ్రాలిభర్తను శ్రద్ధకర్మకు పిలువకూడదనే సామాజికనియమాన్ని తిరస్కరించినందువల్ల 'వికృతాకార'మనే (గార్దభముఖం) నరకాన్ని అనుభవించాడు. ఆకాశగంగలో మునగడం వల్ల ఆపాపం ప్రక్షాళితం అయింది.

సంకల్పశుద్ధిని, చిత్తశుద్ధిని స్థిరపరచుకున్నవారు సర్వమానవుల పట్ల సమతాదృష్టిపరులవుతారు. ఈ భాగవతధర్మసూత్రానికి అనువర్తితాలు ఈ వృత్తాంతాలు.

**'వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తి కించన,** 3-10-71

**'వేంకటేశసమోదేవో నభూతో న భవిష్యతి'** 3-10-70

వేంకటాచలంతో సరిపాటి వచ్చేక్షేత్రం మరొకటి ఉండదు. వేంకటేశ్వరుణ్ణి మించిన దైవం మరొకరు లేరు.

# అన్నమయ్య దర్శించిన వేంకటేశ్వరుడు

కాయిశెట్టి శ్రీనివాసులు

అన్నమయ్య దృష్టిలో రసస్పష్టిలో వేంకటరమణుడు కేవలం ఒక శిలలో మలచిన మూర్తికాడు. అతడే సకల జీవనాయికలను లాలించి పాలించే విశ్వనాయకుడు. ఆ పురుషోత్తమునితో ఆడిపాడినాడు, మాటాడి నడయాడినాడు. కలసినాడు, కలహించినాడు, పొగడినాడు, తెగడినాడు. అలగినాడు, తొలగినాడు. అన్నిటా అంతటా ఆ పరతత్త్వాన్ని దర్శించినాడు. ఆర్జవత్వంతో స్పృశించినాడు. ఆ అనుభవాలను వాచికంగ ఆవిష్కరించినాడు. ఆధిభౌతికము, ఆధ్యాత్మికము అయిన ఆ పరమాత్మతత్త్వం సత్యము-శివము-సుందరమూ అని అన్నముని ఆత్మవిశ్వాసం. 'శ్రీవేంకటేశ్వరుని సేవారతికిగాక జీవనభ్రాంతిపడు సిరులేల' అని ఆ భక్తకవి విశ్వసించి నిశ్వసించినాడు.

అన్నమయ్య జీవితం, సారస్వతజీవితం వేంకటేశ్వరుని చుట్టు పరిభ్రమించినది. తల్లి లక్కమాంబ ఉగ్గుపాలతో రంగరించిన వేంకటేశ్వరుని భక్తి కథలు, తండ్రి నారాయణ సూరి వివరించిన శ్రీనివాస తత్త్వ ప్రబంధం, యతి ఘనవిష్ణువు పాదుకొల్పిన వైష్ణవసంస్కారాలు, గురువు శరకోపయతులు బోధించిన రామానుజీయ వైష్ణవసిద్ధాంతాలు, ఆళువారుల పాశురాలు,కర్ణాటక హరిదాసుల దేవరనామాలు అన్నమయ్య అంతరంగాన సమాధిగతమైనవి. లోకశాస్త్రకావ్యాదుల అనుశీలనతో పదను తేరిన వ్యుత్పత్తి నైసర్గిక ప్రతిభకు తోడై వాడై శ్రీనివాసుని చరణమంజీరాల పదరచనలై నినదించినవి. అవి ఆంధ్రశారదాకాశాన పొగరు వెన్నెలల్ని కురిపించినవి; శ్రీనివాసభక్తి సామ్రాజ్యాన్ని స్థాపించినవి.

అన్నమయ్య 1408 తాళ్లపాకలో జన్మించినాడు. తల్లి లక్కమాంబ, మహాభక్తురాలు. తండ్రి నారాయణ సూరి, ఆతత విద్యాధురంధరుడు. జన్మతః సంక్రమించిన భక్తి, ఆధ్యాత్మికత్వం, విద్యావిజ్ఞానసంపదలు క్రమ క్రమంగ పెరిగి వేంకటేశ్వరస్వామి అనుగ్రహంతో వర్చస్వంతంగ నిలిచినవి. 1416లో తిరుపతి పవిత్రక్షేత్రంలో పదం మోపిన అన్నమయ్య వైష్ణవ ధర్మాన్ని అవలంబించినాడు. పంచసంస్కారాలు పొందిన అన్నమాచార్యుడు ఆడినది అమృతమయ కావ్యంగ పాడినది పరమగానంగ విలసిల్లింది. 1424లో వేంకటేశ్వరుడు సాక్షాత్కరించి సంకీర్తన యజ్ఞానికి అంకురార్పణ చేసినాడు. పదాలలో, ద్విపదరచనలలో శ్రీనివాసతత్త్వాన్ని లలితసుందరంగ ప్రపంచించినాడు. పల్లవి చరణాల వింగడింపుతో పాటకు శాస్త్రీయమైన ప్రాణప్రతిష్ఠ చేసినాడు. ఈ తొలితెలుగు వాగ్గేయకారుని "సంకీర్తనాచార్యుడని" కళాప్రపంచం ప్రశంసించినది. ప్రజల నోళ్లలో నానే నానుళ్లను, పదబంధాలను స్వీకరించి, తెలుగు నుడికారపు సొగసులతో రంగరించి తెలుగు జానపదుల గొంతుకలలో నిసర్గరమణీయంగ వెలువడిన స్వరధునులను పదిలపరచినాడు. భాషలో, భావంలో, ప్రక్రియలో విలక్షణత్వాన్ని నూతనత్వాన్ని పాదుకొలిపిన ఆ భక్తవాగ్గేయకారుని పదకవితాపితామహుడని సాహితీ ప్రపంచం సంభావించినది. నాలాయిర దివ్యప్రబంధాన్ని హృదయస్థం చేసుకొని తేటతెలుగుపాటల భాష్యాలు ప్రకటించిన ఈ భక్తకవికి ద్రవిడాగమసార్వభౌముడని ఆధ్యాత్మిక ప్రపంచం బ్రహ్మరథం పట్టినది. అన్నమయ్య పాటల గురించి మనుమడు చినతిరుమలయ్య తన సంకీర్తన లక్షణంలో పేర్కొంటాడు.

**శ్రుతులై శాస్త్రములై పురాణకథలై సుజ్ఞానసారంబులై**
**యతిలోకాగమవీధులై వివిధ మంత్రార్థములై నీతులై**
**కృతులై వేంకటశైలవల్లభు రతిక్రీడారహస్యంబులై**
**నుతులై తాళులపాక యన్నయ వ:° సూత్నక్రియల్ చెన్నగున్.**

అన్నమయ్య తాను దర్శించిన వేంకటపతిని అనంత మానవాళికి దర్శింప చేసినాడు. క్షేత్రం, తీర్థం, దైవతం అన్నీ శ్రీనివాసంగ అనుభవానికి తెచ్చుకొని మనల్ని అనుభవింపచేసినాడు. 'కట్టెదుట వైకుంఠము కాణాచయినకొండ తెట్టెలాయె మహిమలే తిరుమలకొండ,' పరమపవిత్రమైన తిరుమలయాత్రకు మనల్ని సంసిద్ధం చేసినాడు. మనకు తరగని ధనము ఆనందనిలయంలో ఉన్నదని చూపుతున్నాడు. 'ముంగిట నల్లదివో మూలనున్న ధనము బంగారు శిఖరాల బహుబ్రహ్మమయము అదె చూడుడు. అదె మొక్కుడు ఆనందమయము!' కొండ చేరుతూనే చేరవలసింది పుష్కరిణి చెంతకు. స్వామిపుష్కరిణి, అలమేలుమంగా శ్రీనివాసులను తెప్పల తేలించే ఆ లోకపావనికి వేవేల మొక్కులు సమర్పించినాడు. తిరుమల తొలివేలుపు ఆదివరాహస్వామికి ప్రణతులర్పించినాడు. వైకుంఠాన్ని వదలి వేంకటాచలం చేరిన కటివరదహస్తాల అందమైన వేలుపును చూపుతున్నాడు. సందడి సొమ్ములతో సాకారమై నిలిచిన శ్రీపతి దివ్యపాదాలను దర్శిస్తూ 'నల్లనిమేని నగవుచూపులవాని, తెల్లని కన్నుల దేవుని' మనముందు నిలిపినాడు. ఆ అందమైనమూర్తి వెనుక దాగిన ఆనంద తత్త్వాన్ని రసపరవశముతో గానం చేసినాడు. ఆ శృంగారరాయని మాధుర్యాన్ని శృంగారపదాలలో కురిపించినాడు. ఆ పరమపురుషుని లీలావిభూతిని శరణాగత కరదీపికలతో సాక్షాత్కరింపచేసినాడు. పుంఖాను పుంఖంగ అన్నమయ్య భావనామయ విశ్వంలో కదలాడిన బొమ్మలు శ్రీనివాసదార్శనిక కళలతో నవనవలాడినవి. కొన్ని లక్షల భావకుసుమాలు తిరుమల తిరువీధులలో వెల్లి విరిసినవి.

అన్నమయ్య శ్రీనివాసుని పరతత్త్వంగ, పరబ్రహ్మంగ భావించినాడు. తిరుమల మందిరంలో నిలిచిన మూర్తిని గురించి చేసిన వాదాలను, చెలరేగిన వివాదాలను లెక్కచేయలేదు. వైష్ణవులు 'విష్ణు'వన్నారు. శైవులు శివుడన్నారు. శాక్తేయులు శక్తిరూపమన్నారు. కాపాలికులు ఆదిభైరవుడన్నారు. వేదాంతులు 'పరబ్రహ్మం' అన్నారు. అన్నమయ్య వేంకటేశ్వరుని 'ఆశ్చర్యస్వరూపు'డన్నాడు. మనం ఎట్లా భావిస్తే అట్లా గోచరిస్తాడు పొమ్మన్నాడు. పిండికొద్దీ రొట్టె. ఎవ్వరేమనుకొన్న నాకేమి కొదువ. 'ఇదియే పరతత్త్వము నాకు' అని అన్నమయ్య తీర్మానించినాడు. వేంకటరమణునిలో శ్రీరామచంద్రుని దర్శించుకొన్నాడు. శ్రీరామ అవతారకథలను కీర్తించినాడు. ఆ సమరవిజయరాముడు, భయహరుడు, నిజభక్తపారీణుడు. వంశీమోహనుడు శ్రీకృష్ణ పరమాత్ముడే వెంకన్నమూర్తిలో నిలిచినాడు. బాలకృష్ణుని నుండి యోగేశ్వరేశ్వరుడైన, శ్రీకృష్ణతత్త్వాన్ని గానం

చేసినాడు. ఆ పరమపురుషుని, గోపాలబాలుని భావించి తనవిదీర కీర్తించినాడు. అహోబలనృసింహునిగ తిరుమల వేంకటేశ్వరుని భావించి 'కారణప్రకటుడైన వేంకటనారసింహుని'గా స్తుతించినాడు. నానాక్షేత్రాలలో వెలసిన విష్ణుదైవతాలకు వేంకటేశ్వరునితో అభేదసాదృశ్యాన్ని స్థాపించినాడు. ఎక్కడున్నా ఆయా వేల్పులందరికి వెంకటగిరికి రాక తప్పదు, 'వేంకట' ముద్ర వేసుకోక తప్పదు.

అన్నమయ్యకు వెన్నతో అబ్బినది వేంకటేశుమంత్రము. అన్ని మంత్రాలు ఈ మహామంత్రంలో ఆవహించి నాయంటాడు అన్నమయ్య. నాకు నాగురువిచ్చిన మంత్రము. నన్ను సదా కాపాడేమంత్రము. నాకు వెన్నెల వంటిది వేంకటేశుమంత్రము అని ఆ పరబ్రహ్మ మంత్రాన్ని అనుష్ఠిస్తాడు. శ్రీవేంకటేశ పరమమంత్రాలుగ 32000 సంకీర్తనలను వచించాడు. ఏ ఒక్కపాటలో కూడ తన పేరును చెప్పుకోలేదు. 'వేంకట'ముద్రనే అంకితముద్రగ స్వీకరించినాడు. వేంకట, తిరువేంకట తిరుశ్రీవేంకట యిత్యాదిగ ప్రతిపాటలో 'ముద్ర'ను చేర్చినాడు. అన్నమయ్య భక్తిపూర్వకంగా 'వేంకట'ముద్రాంకితం చేయడం వల్లనే అవి వేంకటేశ్వర మంత్రాలుగ భాసించినాయి. అందుకే చిన్నన్న తాతగారి చరిత్ర వ్రాస్తూ 'పరమమంత్రములు ముప్పదిరెండువేలు' అన్నమయ్య రచించి నాడంటారు. కర్ణాటకసంగీతపితామహుడు పురందరదాసు ఈ పదకవితాపితామహుడు అన్నమయ్య సంకీర్తనల గురించి 'కువలయంబునఁబేరుకొన్న మాత్రమున, తలఁచిన భూతభేతాళపిశాచములు పాఱిపోవు' నంటారు. ఆర్జవత్వంతో అన్నమయ్య ఆవిష్కరించిన సంకీర్తనలు శ్రీశ్రీనివాస సుదర్శనాలు.

తిరుమల శ్రీనివాసుడు అన్నమయ్యకు ఒక్కొక్క మారు ఒక్కొక్క లాగున కనిపిస్తాడు. పసిబిడ్డగ కనిపిస్తాడు. జొకొట్టి జోలపాడుతాడు (జో అచ్యుతానంద జోజోముకుంద). ఆదమరచి నిదురబోయే ఆ బాలునికి దోమలు కరవకుండా దోమతెరకడతాడు. 'పన్నగపు దోమతెరను పైకెత్తి భక్తుల విన్నపాలను వినమని' స్వామికి మేలుకొలుపులు పాడుతాడు. ఆ విశ్వవిరాట్ పురుషునికి షోడశకళానిధికి షోడశోపచారాలను నిర్వహిస్తాడు. రత్నసింహాసనం మీద కూర్చుండబెట్టి కొలువు గీతాలను వినిపిస్తాడు. ఆ అలమేల్మంగ అండనుండే స్వామికి శుక్రవారపు అభిషేకాలను సిద్ధంచేస్తాడు. శుక్రవారపు అభిషేకపు సొగసులతో కళగట్టిన స్వామి ముఖబింబాన్ని పరవశంతో తిలకిస్తాడు. వంటయింటిలో అలమేలుమంగ వండి వడ్డించిన భోజనాలను శ్రీవారి ఆరగింపులకు సిద్ధంచేస్తాడు. నుదుట కల్యాణ తిలకముదిద్ది శ్రీభూదేవేరులతో కల్యాణోత్సవానికి శృంగార శ్రీనివాసుని సింగారిస్తాడు. వాహనాలలో ఊరేగింపులలో శ్రీవారిని ఉభయనాంచారులతో అలంకరించుకొని కన్యాదాత అయి మురిసిపోతాడు. శ్రీవారికి ఏకాంత సపర్యలు చేస్తూ సకలచరాచర సృష్టిని 'సద్దు' చేయవద్దని శాసిస్తాడు.

**"రానుమీకడకు వో రమణులాల, పూవుం**
**బానుపు హరికి పరవవలయు నేడు"** అని సకల జీవనాయికలను హెచ్చరిస్తాడు.

అన్నమయ్య గీతాలను రచించలేదు, వచించినాడు. శ్రీనివాసుని మనసులో నిలుపుకొని భగవత్తత్త్వాన్ని

లీలావిభూతిని మధురమధురంగ వ్యాఖ్యానించినాడు. అతనికి అదొక తపస్సు. అదొక అనిర్వచనమైన అనుభూతి. అది నిర్మలము. అది యశస్కరము. అందుకే వేంకటేశ్వరుడు అన్నమయ్యపాటలు విని 'యితరవాగ్విరక్తుడై' నాడట. నేటికి తిరుమల దేవాలయంలో స్వామి అన్నమయ్య పాటలు వింటూ నిదురలేస్తాడు- నిదురపోతాడు.

శ్రీనివాస అద్వైతంగ సాగిన అన్నమయ్య జీవనయాత్ర శ్రీనివాస విశిష్టాద్వైతంగ ముగిసినది. అన్నమయ్య తన అంతరంగాన వేంకటేశ్వరుని 'అరచేతిదైవంగ' నిలుపుకొన్నాడు. నా మటుకు నాకు అన్నమయ్య ఆంజనేయునిగా భాసిస్తాడు. శ్రీరామచంద్రుని పాదాలచెంత కూర్చొన్న హనుమంతుడు; శ్రీవేంకటేశ్వరుని చరణాలవద్ద పాడుతున్న అన్నమాచార్యుడు ఒక్కటే. ఆ హనుమయ్య లేని రామయ్యను, అన్నమయ్యలేని వెంకటయ్యను ఊహించలేను, భావించలేను. అన్నమయ్య మాటనే నామనసంటున్నది-

**"విడువలేని శ్రీవేంకటవిభుడవు కడదాకా నిక కాతువుగాక".**

# అపరాధక్షమాపణస్తోత్రం శ్రీశేషశైలవిహారశతకం

డా॥ పాలకోడేటి జగన్నాథరావు

క్రీ.శ. 15వ శతాబ్దిలో పరమభక్తాగ్రేసరుడగు అన్నమాచార్యులు ఓంప్రథమంగా పాదార్పితం చేసిన శతక పుష్పాన్ని ఆఘ్రాణించిన శ్రీవేంకటేశ్వరస్వామి దాదాపు రెండు శతాబ్దులవరకు అంటే క్రీ.శ. 1640-45 వరకు మరో కవీశ్వరుని శతకపుష్పాన్ని ఆఘ్రాణించకుండ నిరీక్షించియుండడం తెలుగుసాహితీ జగత్తులో విచిత్రమైన విశేషమే. భక్తిపూర్వకంగా "శ్రీశేషశైలవిహారా" అంటూ సంబోధిస్తూ మలివేంకటేశ్వర శతకాన్ని సమర్పణంచేసే మహాభాగ్యాన్ని క్రీ.శ. 17వ శతాబ్దంలో అంటే క్రీ.శ. 1575-1655 మధ్య జీవించిన పుష్పగిరి తిమ్మన మహాకవికి ఆ శ్రీవేంకటేశ్వరస్వామియే అనుగ్రహించాలని సంకల్పించి యుంటాడు. కాకపోతే ఆ రెండు శతాబ్దులమధ్య మహాకవులెందరెందరు లేరు. ఏ ఒక్కరూ మలివేంకటేశ్వరశతకం రచనను స్పృశింపక పుష్పగిరి తిమ్మనకవికే ఆ అదృష్టాన్ని విడువుట ఏమిటి?

### అన్నమయ్య అనుకరణ

శతకంలో అన్నమయ్యను కంఠోక్తంగా ప్రస్తావించి సన్నుతింపకపోయినా వేలాది ఆయన కీర్తనలకు తిమ్మనకవి ప్రభావితుడు కాకపోలేదు. గణాంకాలతో తులనాత్మకంగా విపులంగా ప్రస్తావించడం పరిమితమైన పుటల వ్యాసంలో కష్టతరం కాబట్టి ఒక్కఉదాహరణ చూపుతాను.

"నిగమ నిగమాంత వర్ణిత మనోహరరూప నారాయణా"

ప్రసిద్ధమైన ఈ అన్నమయ్యకృతిని పద్యీకరించిన క్రింది తిమ్మన రచన చూడండి.

**కం॥ నిగమాగమనిగదితములు**
**నగణితములు నీ గుణమ్ములులనుగతకర్మా**
**ఖగభవరుగనలవగళిత**
**జగదగదంకార! శేషశైలవిహారా!** శే.శై.వి.36

ఈ విధంగా ప్రథమ వేంకటేశ్వర శతకకర్త అన్నమయ్యను సంభావిస్తూ తిమ్మనకవి

**కం॥ "హృద్యంబులు మద్విరచిత / పద్యంబులువినుము........" (17)**

అంటూ శ్రీశేషశైలవిహారా అనేమకుటంతో శతకాన్ని హృద్యంగా వినిపించాడు.

### తిమ్మనకవిపై రాధాకృష్ణ తత్త్వప్రభావం

ఆవిధంగా తిమ్మనకవి అన్నమయ్యను అనుసరించినా సప్తగిరివాసుని దేవేరులైన శ్రీదేవి-భూదేవీ వర్ణన విషయంలో మాత్రం విభేదించినట్లు కనబడుతుంది. శ్రీనివాసుని సతీమణులుగా శ్రీదేవి-భూదేవులకు ఉన్న ప్రశస్తి రాధాదేవికి లేదు. తిమ్మనకవి వారితో బాటు రాధాదేవికి కూడ తుల్యప్రాధాన్యమిచ్చి వర్ణించాడు.

కం॥ అణుమధ్యాత్మజ విత్తే
షణములపాలైతి, తెలిహొసంగుము, రాధా
ప్రణయోజ్జృంభిత సంభా
షణజిత కర్పూర! శేషశైలవిహారా! శే.శై.వి. 48

కం॥ రాధారత గాధాశత
బోధాయత హృదయసదయ! భూరిశ్వశుర
త్వాధారా సాధారణ
సాధాకూపార! శేషశైలవిహారా! శే.శై.వి. 85

రాధనేకాక ఆమె సఖీజనులైన గోపాంగనలను కూడ తిమ్మన విస్తారంగానే వర్ణించాడు.

కం॥ .....గోపభామాగృహకుం / భోద్యత్పక్వపయోదధి
సద్యోఘృతచోర! శేష శైలవిహారా! శే.శై.వి. 17

కం॥ ఆఘోషింతురు నీక్రియ
లాఘోషవధూటులౌర...... శే.శై.వి. 23

కం॥ శృంగారవరాభీరకు
రంగాలో కాంతరంగ రంజన, రంగ
ద్భృంగీతరళిత మురళీ
సంగీతస్మేర! శేషశైలవిహారా! శే.శై.వి. 25

కం॥ .....గోధు / గ్చక్రకుచానుక్రమ రా
సక్రీడాధీర! శేషశైలవిహారా! శే.శై.వి. 45

కం॥ కళిందజాగత గోధుగ్
సుస్తన్యతి నిస్తులవా
సస్తత్యపహార! శేషశైలవిహారా! శే.శై.వి. 78

ఈ వర్ణన కవియాదృచ్ఛికంగా చేసిందికాదు. తరచిచూస్తే దీనికొక చారిత్రక నేపథ్యం కనబడుతుంది. అన్నమయ్యకు 80 సం॥ తరువాత బెంగాల్‌లో పుట్టిన చైతన్య మహాప్రభువు (క్రీ.శ. 1486) రాధాకృష్ణ దివ్యప్రేమ తత్త్వాన్ని విస్తృతంగా ప్రచారంచేసాడు. దానితోబాటు ఎన్నోభక్తి ఉద్యమాలు క్రీ.శ. 16-17 శతాబ్దాలలో విస్తృతంగా

దక్షిణాన ప్రచారమయ్యాయి. తిమ్మనకవి సరిగ్గా అదే కాలంలో గ్రంథరచన చేస్తున్నవాడు. మరి ఆయన ఆ నూతనభక్తి తత్త్వానికి ప్రభావితుడు కాకుంటాడా? అందుకే అన్నమయ్యలో కానరాని రాధాకృష్ణతత్త్వం తిమ్మన శతకంలో విస్తారంగా కాకున్నా అంకురప్రాయంగానైనా పొడసూపింది.

## శ్రీనివాసుని వర్ణన - దివ్యశక్తి త్రయప్రతీక

శ్రీనివాసుని దేవేరుల వర్ణనవలె ఆయన స్వరూపవర్ణనలో కూడ పై రాధాకృష్ణ ప్రేమభక్తితత్త్వం కనబడుతుంది. ఈ శతకంలో శ్రీనివాసుడు (1) శాంతం లేదా ఆధ్యాత్మికం (2) శృంగారం (3) వీరం అను త్రివిధాత్మకంగా దర్శనమిస్తాడు. స్థూలదృష్టికిది సామాన్యంగా కనబడినా లోనారసి చూస్తే విశిష్టమైన ఒక తాత్త్వికత గోచరిస్తుంది.

చైతన్యమహాప్రభువు సాక్షాత్ శిష్యుడయిన రూపగోస్వామి (క్రీ.శ. 1470-1554) రచించిన భక్తిరసామృత సింధువు ననుసరించి శ్రీకృష్ణుని అనంతశక్తులలో అత్యంత ప్రధానమైనవి మూడు.

1. ఆంతరంగిక శక్తి 2. బాహిరశక్తి 3. తటస్థశక్తి

మొదటి ఆ అంతరంగికశక్తి మరల 1. సంవిత్, 2. హ్లాదిని. 3. సంధిని అని మూడు విధాలు. వీనిలో హ్లాదినీ శక్తి అత్యంతప్రధానమైనది. ఇదే శ్రీకృష్ణపరబ్రహ్మము నందుండే ఆనందమయరూపమైన శక్తిగా చెప్పబడుతూంది. స్వాత్మానందానుభవానికై శ్రీకృష్ణుడే తన హ్లాదినీ శక్తిని బహిర్గతం చేస్తాడు. అప్పుడు రాధగా దర్శనమిచ్చేది ఆశక్తియే. అంటే రాధ పరమాత్ముని ఆనందైక రసానుభూతికి ఆలంబనంగా నిలిచే శృంగారరూపమని చెప్పవచ్చు.

ఇక బహిరంగశక్తి. ఇదే సృష్టిస్థితిలయాది క్రియాకలాపాలను నిరంతరం నిర్వహించే శక్తి. ప్రవృత్తిరూపంలో వీరరసాకృతివహించి అవతారాలను ధరిస్తుంది.

మూడవదయిన తటస్థశక్తి. దీనినే వేదాంతులు తటస్థబ్రహ్మాగా వ్యవహరిస్తారు. జీవులయందు అంతర్యామిగా ఉంటూ వారిచేతవారి కర్మానుభవాన్ని అనుభవింపచేస్తూకూడ వానితో తానంటక సాక్షీభూతంగా ఉండే పరబ్రహ్మమే ఆ తటస్థశక్తి.

ఈ త్రివిధ శక్తుల్ని క్రమంగా రసపరంగా అన్వయించుకొంటే అవి శృంగార-వీర శాంత రసమయ మూర్తులుగా భావించవచ్చు. ఈ శతకంలో వర్ణింపబడిన శృంగార-వీర-శాంతరసమయమూర్తియైన శ్రీశేషాచల విహారుడు తాత్త్వికమైన ఈ శక్తిత్రయానికి ప్రతిబింబరూపమే. వ్యాసదీర్ఘతాభీతిచేత ఉదాహరణగా ఒకొక్క పద్యాన్ని పేర్కొంటాను.

శృంగారమూర్తి: కం॥ ఘనవక్షోగతలక్ష్మీ
కనకక్షోణీధ్రతులిత కలిత కుచాలిం
గనదక్షోల్లాస! జగ
జ్జనరక్షోదార! శేషశైలవిహారా! శే.శై.వి. 13

వీరరసమూర్తి: కం॥ .....వసురుద్రాద్యా / భేద్యమహోద్యద్విక్రమ
చైద్యప్రవిదార! శేషశైలవిహారా! శే.శై.వి. 31

శాంతరసమూర్తి: కం॥ సర్వగతసర్వకర్తృత
సర్వేశత్వంబు సర్వసాక్షిత్వంబున్
సర్వనియంతృతగలిగిన
సర్వజ్ఞుడ వౌర! శేషశైలవిహారా! శే.శై.వి. 43

కం॥ బోధకుడును బోధ్యుఁడు త
ద్బోధము నీవె యని వింటి, పోషింపు సదా
సాధకబాధక బోధక
సాధువ్యవహార! శేషశైలవిహారా! శే.శై.వి. 98

ఈ విధమైన వేంకటేశ్వరుని వర్ణన సమకాలీన రాధాకృష్ణ మధురభక్తి తత్త్వానికి ప్రతీకయై శతకానికి చారిత్రక ప్రాధాన్య గౌరవాన్ని కల్పిస్తుంది.

**ఏర్చిన వాక్సుమాల పద్యార్చన**

ఈ రీతిగా శ్రీనివాసుని వర్ణనకు నేపథ్యంగా దివ్యతత్త్వాన్ని ప్రకాశింపచేయడం ఆధ్యాత్మవిదుడు కాని కవికి అసాధ్యం. తిమ్మనకవి ఈ శేషశైలవిహార శతకాన్ని దాదాపు 65 సంవత్సరాల వయస్సులో వ్రాసినా ఆయన ముప్పది యైదేండ్ల ప్రౌఢనిర్భరవయః పరిపాకంలో ఉన్నప్పుడే వ్రాసిన శ్రీసమీరకుమార విజయప్రబంధ రచనాకాలం నాటికే ఆధ్యాత్మవిదుడు. ఈ విషయాన్ని తిమ్మనకవియే ఆశ్వాసాంతగద్యలో తాను "సగుణ నిర్గుణ ధ్యానవాసనాభిధాన" అని చెప్పుకొన్నాడు. సగుణారాధనవినా నిర్గుణారాధన ఫలవంతం కాదు. ఆధ్యాత్మ విదుల కీవిషయం అనుభవసిద్ధమే. అందుకే సగుణరూపమైన వేంకటేశ్వరుని రూపంలో విరాజిల్లే పరబ్రహ్మను

"ఏర్చిన వాక్సుమములనొ / నర్చెదనీయర్చనంబు" శే.శై.వి. 84

శతాధిక పద్యకుసుమాలతో

"సత్కారము చేసెదనీ / పత్కమలద్వయికి" శే.శై.వి. 21

భక్తిపూర్వక సత్కారంగా పదార్చన చేసాడు తిమ్మనకవి.

**లోభిజనయాచనాపాప పరిహారార్థంగా శతకరచన**

అయితే శేషశైలవిహార శతకపద్యపదార్చనారంభాన్ని గూర్చి

కం॥ మతకరిలోభిగులాముల
స్తుతినగు నఘమణఁగ నిన్ను స్తుతియింతు. శే.శై.వి. 79

అన్న తిమ్మనమాటే ఆశ్చర్యం కలిగిస్తుంది. ఎందుకంటె పైన పేర్కొన్న విధంగా 35 ఏండ్ల వయస్సులోనే "సగుణ నిర్గుణ ధ్యానవాసనాభిధానుడు" కావడమే కాదు

కం॥ ఊరక యుండిన దైవం
బేరీతి నొసంగు నంద్రు నెరుగవిమూఢుల్
భారముపై వైచిన పం
సారికి దైవంబు ఫలంబొసంగకయున్నే. సమీరకుమారవిజయం. 2-104

అని దైవాన్ని గాఢంగా సంపూర్ణంగా విశ్వసించినవాడు. మరియు కావ్యాల్ని నరాంకితంచేసి ధనమార్జించడం నేరం కాని ఆ రోజుల్లోనే బమ్మెర పోతనవలె

ఉ॥ రామనరేంద్రుఁ డట్టి ప్రభురత్నము శాశ్వత కీర్తి కల్గగా
నేమిటి కీ నరాధముల కిత్తురొయుత్తమ కావ్యముల్ కవుల్.

సమీరకుమారవిజయం. 1-27

సమీరకుమార విజయ ప్రబంధాన్ని శ్రీరామాంకితం చేసిన నిష్కాముడు, అంతమాత్రమే కాదు, ఉత్తర రామాయణరచనలో కంకటిపాపరాజుకు; విష్ణుమాయా విలాస పద్యకృతి రచనలో కంకంటి నరసింహరాజుకు, ద్విపద భాగవత కృతిరచనలో టేకుమళ్ల రంగశాయికి కృతిరచనా సహాయమందించిన కవికులగురువు తిమ్మన.

అట్టి మహాకవి ధనార్థియై లోభుల్నియాచించి చివరకు భంగపడి ఆశోపహతుడై చేసిన పాపానికి ప్రక్షాళనంగా ఈ శేషశైలవిహారశతక రచనారంభం చేయడమేమిటి? అసహజంగా కనబడే కవి జీవితంలోని ఈ ఘట్టమే భక్తజనమందారుడగు రమారమణుని అవ్యాజకరుణాపారతకు సజీవమైన నిదర్శనం.

పై ప్రశ్నకు సమాధానం తెలుసికోవాలంటే తిమ్మన కవిని ఆవిధంగా లోభుల్ని స్తుతించడానికి ప్రోత్సహించిన దైన్యమైన పరిస్థితులేమిటో తెలిసుకోవాలి. అవి ఈ శతకంలో స్పష్టంగా కానరావు గాని తదనంతర కాలంలో ఆయనే వ్రాసిన తిరువడాంబశతకం, రఘునాథశతకాల్లో సవివరంగా కన్పిస్తాయి. వ్యాసవిస్తరభీతిచేత కొన్నింటినే ఇక్కడ ప్రస్తావిస్తాను.

లయగ్రాహి: ........వితతంబగు దయా శ్రీ
లంబునఁ జెలంగెడు నినుంబొగడితిన్, బరిణ
యంబునకుఁ దీసిన ఋణంబుడుపవే, హే
రంబజననీ! తిరువడాంబ...... తిరువడాంబ.శ.50

లయగ్రాహి : పెంబలితమౌదలదలంబుగొనె, దృష్టిబెడఁ
గుంబడె, జవస్ఫురణయుంబదనులేద
య్యెంబిదపకాలమగుటం బహుకుటుంబభర
ణంబునకు లేదు భరణం బెపుడు, నన్నిం
కంబరిభవంబు తొలంగం బెనకువల్ బెనఁగొ
నం బణములిచ్చికరుణంబెనచెదో, హే/రంబజననీ... తిరువడాంబ.శ.47

శా॥ దారిద్ర్యంబు ఘటించి తద్వ్యథలచే దైన్యంబు కల్పించి సం
సార భ్రాంతి ధనప్రమత్తుల నుతించంజేసి యాశాగతుల్
మీరంజిక్కులు పెట్టెదేమిటికి స్వామీ! నన్ గనద్వాక్సుధా
ధారాయూథ! యనాథనాథ! రఘునాథా! సాధుమేధానిధీ రఘునాథ.శ.59

శా॥ సుగ్రాసం బొనఁగూర్చి కూర్మిమదిలో శోభిల్ల దౌర్గత్య రా
హుగ్రస్తున్ గవిచంద్రునన్మనుపవే యోదేవతాధ్యక్ష! రఘునాథ.శ.25

లయగ్రాహి: ...... ఇక్ష్వా/లంబునవదాన్యుఁడొకఁడుం బలుకడు... తిరువడాంబ.శ.38

చారిత్రకాధారాలవల్ల ఈ తిరువడాంబ- రఘునాథశతకాలు క్రీ.శ.1650-55 మధ్య అంటే తిమ్మనకవి తన 75 ఏండ్ల వయస్సులో వ్రాసినట్టివి. మరి ఆ వయస్సులో అటువంటి మహాకవికి రాదగినకష్టాలేనా? వాని ననుభవింపలేక ఆవిధంగా విలపించు దుస్థితియేనా? శ్రీశేషశైలవిహార శతకంలో ఈ విషాదోదంతాల్ని ఇంత స్పష్టంగా చెప్పలేదు గాని నాడు తిమ్మనకవి అనుభవిస్తున్నవి ఈ కష్టాలే. భరింపరాని ఆ కష్టాలకు కారణం తన తలరాతేనని

కం॥ వేధలిఖించినదైన్యపు/బాధపడంజాల వేగపాలింపుము..... శే.శై.వి. 22

అని మనస్సును ఊరటపరచుకొన్నాడేగాని సహజంగా అబ్బిన దైవవిశ్వాసం, నిష్కామ్యత గుణాల్ని నిరర్థకమైనవిగా నిందించుకొనలేదు. ఉచితంగా కృతిసహాయమందుకొన్న పాపరాజాదుల్ని తనకు సహాయపడనివారిగా శపించ లేదు. ఈ విధంగా తన శతకత్రయంలో వినిపించిన విషాదాలాపాల్ని విన్న మాకు కారణాలు వేరయినా అవసానకాలంలో విషాదాంత జీవితాన్ని తలచుకొని

సీ॥ కవిరాజుకంఠంబు కౌగలించెనుకదా/పురవీధి నెదురెండ పొగడదండ

అంటూ విలపించిన శ్రీనాధుడు గుర్తుకురావడంలేదా?

**తిమ్మనకవి పశ్చాత్తాపం**

లోకులు పెట్టేబాధల్ని ఎలాగో ధైర్యంగా ఎదుర్కొనవచ్చు గాని మరి ఆ లోకేశ్వరుడుపెట్టే బాధల్ని ఎదుర్కోవడం ఎవరికితరం? ఇక తిమ్మన కవిమాత్రం ఒక లెక్కా? వివశుడై ఒక క్షణిక బలహీనత చేత సహజమైన దైవవిశ్వాసం మరియు నిష్కామ్యభావన అనే ప్రధాన సౌశీల్యాలనుండి స్ఖలితుడై యాచ్నాదైన్యంతో తిమ్మనకవి లోభిజనుల్ని ఆశ్రయించాడు. అయినా ఫలితం దక్కని దుస్థితిని చూచి వ్రతంచెడిన తన తప్పి దానికి పశ్చాత్తప్తుడయ్యాడు. ఆ రీతిగా పశ్చాత్తప్తుడైన తిమ్మన హృదయ సంవేదనకు తార్కాణమే ఈ "మతకవిలోభి గులాముల...." అన్నపద్యం. పశ్చాత్తాపంతో తన సౌశీల్యాన్ని గూర్చి తానే ఆత్మనింద చేసుకొన్నాడు.

దంభాచారుఁడ, దుష్టా
రంభుఁడ, నియమంబులేదు, రక్షింపుము.... శే.శై.వి.20

శ్రీనివాసునకు పాదాక్రాంతుడయ్యాడు. సహజమైన సౌశీల్యంనుండి దిగజారి ప్రవర్తించిన

తానెంతో హీనుడనని కం॥ తమతమ ఉత్తమవ్రతములవిడరు
త్తమదమనిధులౌ త్వదీయదాసులు, సేవా
మమ తను నను(బ్రోవుము... శే.శై.వి.94

అనివ్యాజస్తుతి మార్గంలో దూషించుకొంటాడు. తాను చేసిన పాపాన్ని పశ్చాత్తాపాగ్ని దహిస్తుందా? కాదనుకొన్నాడేమో! శ్రీ శేషశైలవిహారా! స్వామి!

కం॥ జయ జయ యని నిను పొగడెద
దయ వన్నిఁక నెపుడు బ్రోచెదవు..... శే.శై.వి.27

అంటూ శ్రీవేంకటేశ్వరుని స్తుతించాడు. ధనార్థిత్వంతో చేసింది కాదు. ఆధ్యాత్మ విదుడైనకవిగా-

కం॥ శోషించక నిలుచున బహు
దోషాటవి నీస్తవాగ్ని, దూరీకృత దు
ర్భాషా దుష్టోర్మిదు రా
శాషదరివిదూర! శేషశైలవిహారా! శే.శై.వి.69

అనే అచంచల దైవ విశ్వాసంతో తిమ్మన మోక్షార్థియై

కం॥ సద్యోముక్తిప్రదమన
వద్యము మీ స్మరణమౌర... శే.శై.వి.31

అని అలమేల్మంగారమణుని స్తుతించాడు.

**తిమ్మన శుద్ధవైష్ణవాచారత**

హరిహర ద్వైతభావన మహాపాపమను నిజమైన అద్వైతిగా- ఆధ్యాత్మవిదుడుగా అచ్చమైన వైష్ణవభక్తుడై "స్వామిత్వమునీదే, యిది/నామతము"-(53) శ్రీనివాసునే స్వామిగా ఆశ్రయించాడు. "గతిలేకనీవె దిక్కని/ బ్రతిమాలెద నాదరింపు ప్రణతుఁడనింతే"-(50) అని అనన్య శరణార్థిత్వాన్ని ప్రకటించాడు. "భృత్యుఁడనంటే, నాదు/దుష్కృత్యము లెంచంగరాదు, చేపట్టగదే"(40) అని భృత్యభావాన్ని వహించాడు. "దిగవిడువక ననునీ యూ/డిగములలోఁగూర్పు మింక"(47) అని విష్ణుపాదసేవాధర్మాన్ని స్వీకరించాడు.

"వర్ణించెద నీకథ లా/కర్ణించెద నన్నుఁబ్రోవగదె"(44) అని భాగవతకథా శ్రవణతత్పరత వహించాడు. ఈ విధంగా శుద్ధవైష్ణవ ధర్మపరాయణుడై

"సంభృతరసజృంభితవాగ్గుంభన"గా శే.శై.వి.18

"భవజాటీతట గంగా/ రవధాటీ పటిమ"తో- శే.శై.వి.16

శ్రీశేషశైలవిహారుని శతాధికపద్య పుష్పార్చితుని చేసాడు తిమ్మనకవి.

**తిమ్మన కవి వేడుకోలు**

ఇలా అర్చించినా తాను లోభుల్ని ఆశ్రయించిన పాపాన్ని రాధారమణుడు క్షమించెనో లేదో అని - "సందర్శింపుచు నీ పద/వందనమొనరింతు, నిలువవలె నాయెదుటన్"-(98) "ముకుళించెద నిదెకరములు' '(95), "కరములు ముకుళించెద నన్నరయుము"(33) అంటూ ప్రణమిల్లుతూ ప్రార్థించాడు తిమ్మన.

ఎంత ప్రార్థించినా వడ్డీకాసులవాడు అంత సులభంగా కరుణిస్తాడా? కవి దైన్యస్థితి తొలగనేలేదు. చివరగా తిమ్మనకవి-

వినవింపుగాదొనాస్తుతిదనరింపపు-90

పటుమతిఁ దెలిపితి నా స్థితి/నటునిటునకవధరింపుము-103

నా తలపులు నాయలపులు/నీతోవివరింపనేల? నీకే తెలియున్-104

అని వేడుకోలును విరమించి తన శతకంలోని

కం॥ మందారవిందకువలయ/
మందారసమములు వాక్సుమములానఁగదే — శే.శై.వి. 102

కం॥ కవనమువిను మేల పరా
కవనమునకు నీవె కర్తవు.... అంటూ వేడుకొంటాడు. — శే.శై.వి82

**తిమ్మనకవిపై లక్ష్మీపతికటాక్షం**

భక్తజనవందారుమందారుడగు ఆ కలియుగ వైకుంఠుని తిమ్మన "కలిమిచెలిమిన్నపతివే/ కలిమికినే కాద? వినవు"-(39) అని చేసిన ప్రార్థన వ్యర్థంకాలేదు. "దైవం మానుషరూపేణ" అన్నట్లు తిమ్మనకవి మిత్రుడు-సాహిత్యాభిమాని నెల్లూరు జిల్లా కోవూరు తాలూకా మోడేగుంటనివాసి అయిన వేమారెడ్డి ముత్యాలరెడ్డి రూపంలో ఆ శ్రీనివాసుడాదుకున్నాడు. కుటుంబభరణాని కవసరమైన గృహ-ధన-భూదానాదుల్ని ప్రసాదించాడు. అతని కాలంలోనే తిమ్మనకవి వైకుంఠప్రాప్తి పొందాడు. ఆయన కుమారుడు లక్ష్మీపతి చిరకాల అభిజనమైన తాటిపర్తిని వీడి మోడేగుంట స్థిరనివాసం చేసుకున్నాడు. నాటినుండి పుష్పగిరి తిమ్మన వంశీకులకు మోడేగుంటయే స్థిరనివాసమయింది.

**శ్రీనివాసుని అపరాధక్షమాపణ నామవైభవం**

శ్లో॥ అతివేలతయా తవదుర్విషహై/రనువేలకృతైరపరాధశతైః
భరితం త్వరితం వృషశైలపతే/పరయా కృపయా పరిపాహిహరే

అంటూ శ్రీవేంకటేశ్వరుని నామ,రూపాలను స్మరించి దర్శించి ప్రార్థించాలేగాని దయామృత తరంగిణులైన ఆ పరమాత్ముని అపాంగాలనుండి ప్రవహించివచ్చు శీతలకరుణామృత తరంగాలు ఎవరి పాపసమూహాలను ప్రక్షాళింపచేసి రక్షింపవు. ఈ సత్యాన్ని రూపగోస్వామి మొదలైన మహనీయులు.

శ్లో॥ **వాచ్యం వాచకమిత్యుదేతిభవతో నామస్వరూపద్వయం**
**పూర్వస్మాత్పరమేవహంత! కరుణం తత్రాపి జానీమహే**
**యస్తస్మిన్ విహితాపరాధనివహః ప్రాణీసమంతాత్‌భవేత్**
**ఆస్యేనేదముపాస్యసోఽపిహి సదానందాంబుధౌ మజ్జతి ఉజ్జ్వలనీలమణి.**

అని స్వానుభవంతో వచించారు. అయితే భక్తివశంవదుడగు ఆ పరమాత్ముని పై విశ్వాసముంచి, సహన శీలంతో నామ,రూపవైభవాల్ని స్తుతించి దర్శించాలి. తిమ్మన కవి ఆ రీతిగా- కం॥ "సైరణగలవారికి శుభ/ కారణమగు నీస్తవంబు.." (శే.శై.వి.66) అని సైరణభావంతో "వేధలిఖించినదైన్యపు/బాధలను" భరిస్తూ "శ్రీశేషశైలవిహారా" అంటూ శతాధికపద్యసుమాలతో శ్రీనివాసుని పాదపద్మాల్ని అర్చించాడు. కరుణాపాత్రుడై ధన్యుడయ్యాడు.

# తిరుమల తొలిగడప దేవుని కడప

## అన్నమయ్య కొలువందుకొన్న దేవుని కడప వేంకటేశ్వరుడు

డా॥ కట్టా నరసింహులు

రాయలసీమలో కడప నగరానికి ఒక విశిష్టస్థానం ఉన్నది. కడప నగరానికి అత్యంత సమీపంలోని దేవునికడపలో శ్రీప్రసన్నలక్ష్మీ వేంకటేశ్వరుడు వెలసాడు. తిరుమలకు దేవుని కడపకు ఉన్న విడదీయరాని అనుబంధం పౌరాతన్యాన్ని, సంతరించు కొన్నది. కడపకు ఈవలియాత్రికులు మొదట దేవుని కడపలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి దర్శనం చేసుకొని తమయాత్రను తిరుమలవైపు సాగిస్తారు. తిరుమల మహాక్షేత్రానికి దేవునికడపను గడపగా సంభావించి ఆ గడపలో తొలిమొక్కు చెల్లిస్తారు. కడప నుండి పాలకొండల ద్వారా తిరుమలకు ఒక మార్గం ఉంది. యాత్రీకుల విశ్రమార్ధం మార్గమధ్యలో అక్కడక్కడ నిర్మింపబడిన మండపాలు నేటికీ చూడవచ్చు.

దేవుని కడపలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామిని కృపాచార్యులు ప్రతిష్ఠించినట్లు ప్రతీతి. తిరుమలను వరాహక్షేత్రమని పిలుస్తారు. కాగా దేవుని కడపను హనుమత్‌క్షేత్రం అంటారు. ఇట వేంకటేశ్వరుని వెనుక భాగంలో ఆంజనేయస్వామి విగ్రహమున్నది. ప్రసన్న వేంకటేశ్వరుడు భక్తుల కొంగు బంగారంగా, దేవుని కడప మరో తిరుమలగా భక్తులకు వరదాయినిగా నున్నది. తిరుమల దేవునికి జరిగే ఉత్సవాలు కడప దేవునికి కూడ జరుగుతాయి.

విజయనగర సామ్రాజ్యస్థాపకులైన హరిహరరాయలు, బుక్కరాయలు; ఈ ప్రాంతీయుడే అయి విజయ నగర సామ్రాజ్యాధిపతి అయిన సాళువ నరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలు ఈ స్వామికి అమూల్యా భరణాలు, మడిమాన్యాలు సమర్పించినారు.

నందాల్య ఔబుళ దేవ మహారాజు (శా.శ.1484) ఈ స్వామి కైంకర్యానికి భూదానం చేశాడు, మహామండలేశ్వరుడు తిమ్మయదేవ మహారాజు (క్రీ.శ. 1396) ఉదయగిరి సీమలోని యొక గ్రామాన్ని ఈ మందిరానికి సమర్పించాడు. అరణం సర్వప్ప (శా.శ. 1609) కిరీటాన్ని సమర్పించాడు. సదాశివదేవ మహారాయలు భూదానం చేశాడు. చిన్న ఔబళేశ్వరరాజు పూదోటకై భూమిని సమర్పించాడు. ఆలయ కుడ్యాలమీది శాసనాలు ఈ విషయాన్ని తెలియజేస్తున్నాయి.

### ఆలయం

దేవుని కడప ఆలయ శిల్పం రమణీయంగా ఉంటుంది. స్వామి సన్నిధిలో నున్న మంటపం విజయ నగర రాజుల కాలంలో నిర్మించబడింది. అందలి తాండవ గణపతి శిల్పం మనోహరంగా ఉంటుంది. ఒక ఆలయస్తంభం మీద దంపతుల మూర్తులున్నవి. బహుశా ఈ రాజకుటుంబికులే ఆలయ నిర్మాణం చేసి

ఉంటారని భావించబడుతున్నది. ఆలయ రాజగోపురం మట్లరాజుల కాలంలో నిర్మించబడింది. గోపురద్వారాని కిరువైపుల రాయవంశీకుల శిల్పాలున్నవి. ఈ రాజగోపురం, తిరుపతి గోవిందరాజస్వామి ఆలయగోపురం ఒకే కాలంలో నిర్మింపబడినట్లుంది. ఈ దేవాలయంలో పల్లవ శిల్పం అక్కడక్కడ గోచరిస్తుంది. విజయనగరశిల్పం సరేసరి. ఆలయ నిర్మాణం పల్లవులతో ప్రారంభమయి విజయనగర సార్వభౌముల పర్యవేక్షణ క్రింద ఉండినదని చెప్పవచ్చును.

కడప జిల్లాకు మొదటి కలెక్టర్‌గా పనిచేసిన ఆస్తిక మహాశయుడు, ధార్మిక పరాయణుడు సర్‌థామస్ మన్రోదొర కడపరాయని సేవించాడు. ఆలయగోపురం మరమ్మత్తులకు సహాయంచేసినట్లు తెలుస్తున్నది.

## గర్భాలయం

స్వామి గర్భాలయం వెనుకవైపు గోడకు చేరువుగ ఎత్తైన ఆంజనేయస్వామి విగ్రహమున్నది. ఆంజనేయ మూర్తికి ముందువైపున స్వామివారి మూలమూర్తి పశ్చిమాభిముఖంగా ఉన్నది. స్వామి వక్షస్థలంపై కుడివైపున శ్రీవత్సచిహ్నంతో మహాలక్ష్మీమూర్తి శిల్పీకరించబడి ఉన్నది. స్వామివారి శిలామూర్తి పై యజ్ఞోపవీతాలు, నాలుగు కంఠాభరణాలు సుందరంగా ఉన్నవి. స్వామి వారి మందిరానికి ఎడమవైపు శ్రీమహాలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక మందిరమున్నది. అమ్మవారి ఆలయం కప్పులో రాతి బల్లులున్నవి. కంచిలో వలె ఈ బల్లుల్ని తాకితే దోష నివారణ మౌతుందని భక్తుల విశ్వాసం. జయవిజయుల విగ్రహాలు చూపరుల్ని ఆకట్టుకొంటున్నవి.

## ఆలయ ప్రాంగణం

విశాలమైన ఆలయ ప్రాంగణంలో విష్వక్సేన మందిరం, నాగుల విగ్రహాలు, వినాయకుడు, ఆండాలమ్మ వారి మందిరం (బీబీనాంచారమ్మ) శమీవృక్షం, ధనుర్మాస మంటపం, బావి, పాకశాల రథవాహనం, యాగశాల, ఆళ్వార్లసన్నిధి, వాహనమంటపం, కల్యాణమంటపం, గరుడాళ్వార్ల సన్నిధి, తులసి బృందావనం, బలిపీఠం, భరతమంటపం ఉన్నవి. కల్యాణమంటపం పైకప్పు, మరియు నలువైపుల శిలాస్తంభాలు, భరతమంటపం సుందరశిల్ప కళాఖండాలతో యాత్రికుల్ని ఆకర్షిస్తున్నవి.

ఆధునిక నిర్మాణమైన అద్దాలమహలు శ్రీవేంకటేశ్వరవైభవాన్ని, దిగ్వ్యాప్తం చేస్తున్నది.

## పుష్కరిణి

ఆలయానికి సమీపంలో హనుమత్ పుష్కరిణి ఉన్నది. కడప-కర్నూలు కాలువ నీరు ఈ పుష్కరిణిలోనికి ప్రవేశించుటకు, వెలుపలికి పోవుటకు వీలున్నది. 1930 వరకు ఈ పుష్కరిణిలో తెప్పోత్సవాలు జరుగుతుండేవి. ఆ తరువాత ఆగిపోయిన ఈ ఉత్సవాలు రెండుసంవత్సరాల నుంచి పునరుద్ధరించబడినవి. తెప్పోత్సవం కోనేటి నీటికోసం బోరుబావులు తవ్వించి నీరు సరఫరా చేస్తున్నారు.

**రథోత్సవం**

ప్రతి సంవత్సరం మాఘశుద్ధ సప్తమిని పురస్కరించుకొని పన్నెండు దినాల పాటు బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతాయి. ఈ బ్రహ్మోత్సవాల్లో స్వామివారి కల్యాణం, రథోత్సవం భక్తుల్ని విశేషంగా ఆకర్షిస్తాయి. సప్తమినాడు రథోత్సవం జరుగుతుంది. ఆబాలగోపాలం ఈ ఉత్సవంలో తండోపతండాలుగా పాల్గొంటారు. స్వామి ఉభయనాంచారులతో తేరెక్కి ఊరేగుతాడు. అన్నమాచార్యులు ఈ మహోత్సవాన్ని వర్ణిస్తూ భక్తిపారవశ్యంతో ఎన్నో పాటలు పాడాడు. కాంతతో శ్రీవేంకటేశ "కడపలో తేరెక్కి యింత నన్నుగూడి వీధులేగితివి నీవూ" అని గానం చేసినాడు.

ఈ ఆలయంలో పాంచరాత్రాగమం ప్రకారం పూజాదికాలు నిర్వహిస్తారు.

**మహమ్మదీయుల పూజలు**

ఈ ఆలయంలోని ఆండాళమ్మ వారిని మహమ్మదీయులు ఉగాదినాడు ప్రత్యేకంగా దర్శించి పూజిస్తారు. అంతేగాక ఏడాది పొడుగునా మహమ్మదీయులు స్వామివారిని దర్శిస్తూఉంటారు.

**అన్నమయ్య కొలువందుకొన్న కడప వేంకటేశ్వరుడు**

తాళ్ళపాక అన్నమాచార్యుడు కడప జిల్లాలోని పలుక్షేత్రాలు దర్శించాడు. దేవుని కడపలోని రథోత్సవాన్ని కన్నులారా తిలకించినాడు. ఇలా పాడినాడు.

**కన్నుల పండుగలాయ కడపరాయని తేరు**
**మిన్నుమీరి శృంగారము మితిమీరినట్లు**
**కదలెకదలె నదె గరుడధ్వజుని తేరు**
**ఒదిగి ఒదిగి దేవదుందుభులు మ్రోయగా**
**పదివేలు సూర్యబింబములు ఉదయించినట్లు**
**పొదలి నీలువు వచ్చి పొడసూపినట్లు**
**వచ్చె వచ్చె నంత నింత వాసుదేవుని తేరు**
**అచ్చుగ దేవకామినులాడి పాడగా**
**ముచ్చటతో గరుడడు ముందట నిలిచినట్లు**
**మెచ్చుల మెండులతో మేఘము వాలినట్లు**
**తిరిగె తిరిగెనదే దేవదేవోత్తముని తేరు**

**వరుస దేవతలెల్ల జయవెట్టగా**
**విరివి కడపలో శ్రీవేంకటేశ్వరుడు తేరుపై**
**తిరమాయె సింహాసనమిదే అన్నట్లు**

ఆయన కడపరాయని సంబోధిస్తూ మరెన్నో గేయాలు రచించాడు. కొన్ని పల్లవులు

1. **కప్పురమందుకొంటి కడపరాయా నీకు**
   **కప్పము మాజవ్వనము కడపరాయ**

2. **కాదనకు నామాట కడపరాయ-నీకు**
   **గాదెబోసె వలపులు కడపరాయ**

3. **కానీవయ్య అందుకేమి కడపరాయ-నేము**
   **కానమా నీ చేత లెల్ల కడపరాయా**

'కడపరాయని' గురించిన సాహిత్యమెంతో ఉన్నది. ముఖ్యంగా తాళ్ళపాక అన్నమయ్య కడపరాయని స్తుతిస్తూ పాడిన కీర్తనలు మనకు చాలానే దొరుకుతాయి.

దేవుని కడపను దర్శించిన వేదాంత దేశికులు కడపను తిరుమల మహాక్షేత్రానికి దేహళీపురంగా సంభావించారు.

తిరుమలవెళ్ళే యాత్రికులకు దేవునికడప "తిరుమల గడప"గాను హిందూ మహమ్మదీయుల సఖ్యతకు చిహ్నంగాను, అన్నమాచార్యుని కొలువందుకొన్న దివ్యక్షేత్రంగాను, వేదాంతదేశికుల నుతులగొన్న దేహళీపురంగాను, శ్రీవేంకటేశ్వరవైభవానికి కాణాచిగాను కళకళలాడుతూ ఉంది.

# అన్నమయ్య ఆధ్యాత్మిక సంకీర్తనలలో వేంకటేశ్వర భక్తితత్త్వం

డా॥ 3. మెహర్‌ముణి

శ్రీవేంకటేశ్వర వరప్రసాది అయిన అన్నమయ్య సర్వకాల సర్వావస్థల్లో త్రికరణ శుద్ధిగా వేంకటేశ్వరుని సేవించి ముప్పదిరెండువేల సంకీర్తనలతోపాడి అయనను స్తుతించి తాను తరించి, వేంకటేశ్వర భక్తులందరినీ తరింపచేసిన ధన్యజీవి. అన్నమయ్య వెలయించిన సంకీర్తనలు ప్రధానంగా ఆధ్యాత్మిక సంకీర్తనలు, శృంగార సంకీర్తనలు అని రెండు రకాలు. కాని ప్రతి సంకీర్తనలోను వేంకటేశ విభుని ప్రస్తావన తప్పనిసరి. అన్నమయ్య తన సంకీర్తనలన్నింటిలోను ఆధ్యాత్మిక తత్త్వాన్ని ప్రతిపాదించాడు.

అన్నమయ్య ఆధ్యాత్మిక కీర్తనల్లో వేంకటేశ్వర భక్తితత్త్వంతో పాటు సామాజిక నీతి తత్త్వం ఎలా ప్రతిపాదించబడిందో స్థూలంగా వివరించటం జరిగింది. శ్రుతి, స్మృత్యాదులలో వర్ణించబడిన పరమాత్మ స్వరూపమే శ్రీవేంకటేశ్వరుడని తలంచి అన్నమయ్య

**నిత్యాత్ముడై యుండి నిత్యుడై వెలుగొందు**
**సత్యాత్ముడై యుండి సత్యుడై తానుండు**
**ప్రత్యక్షమై యుండి బ్రహ్మమై యుండు సం**
**స్తుత్యుడీ తిరు వేంకటాద్రి విభుడు-**

అని వేంకటేశ్వర తత్త్వాన్ని నిరూపించాడు.

**ఆకటి వేళల నలపైన వేళలను**
**తేకువ హరినామమే దిక్కు మరి లేదు-**

అనే కీర్తనలో జీవులకు కష్టకాలంలో హరి నామమొక్కటే దిక్కని తెలియజేశాడు.

**సంకెళ బెట్టిన వేళ చంప బిలిచిన వేళ**
**అంకిలిగా నప్పుల రాగిన వేళ**
**వేంకటేశు నామమే విడిపించ గతి గాక**
**మంకు బుద్ధి బొరలిన మతి లేదు తెలుగు**

భగవద్భక్తిని విడిచి మూర్ఖత్వంతో ప్రవర్తించటం నిష్ప్రయోజనమని తెలియజేశాడు.

**క్షరము నక్షరమును సాక్షి పురుషుడని**
**పరవి తెలియుటే సాత్త్వికము**
**క్షరము ప్రపంచము, మక్షరము కూటస్థుడు**
**పిరి పురుషోత్తముడే శ్రీవేంకటేశుడు**

**తనువే గుడియట తలయే శిఖరమట**

**పెను హృదయమే హరిపీఠమటా**

**కనుగొన చూపులే ఘన దీపములట**

తన లోపలి అంతర్యామిని-- భగవంతుడిచ్చిన ఈ శరీరాన్ని భగవదర్పితం చేయాలంటున్నాడు ఈ కీర్తనలో అన్నమయ్య.

**చలము గోపంబు దను జంపేటి పగతులని**

**తెలిసినది యది గదా తెలివి**

**తలకొన్న పరనింద తనపాలి మృత్యువని**

**తొలగినది యది గదా తొదగన్న ఫలము**

**ఎనలేని తిరువేంకటేశుడే దైవమని**

**వినగలిగినది గదా వినికి**

**అనయంబు నతని సేవానంద పరులయి**

**మన గలిగినది గదా మనుజులకు మనికి**

కోపం, పరనింద మొదలైన దుర్గుణాలు తన పాలిటి శత్రువులని తెలుసుకుని వాటిని విడిచి పెట్టాలని, ఎల్లప్పుడూ వేంకటేశ్వరుని సేవించి ఆనందంతో బ్రతికే వారిదే బ్రతుకని ఈ కీర్తనలో నిరూపిస్తున్నాడు.

**పోయగాలంబడలికి గాయు వెన్నెల కరణిని**

**శ్రీయుతు దలచుడీ నరులు మాయబడి చెడక**

**చిత్తము చేకూరుచుకొని చిత్తైకాగ్రతను**

**చిత్తజ గురుని తలచుడీ చిత్తజు జొరనీక**

**బూరుగు మాకున జెందిన కీరము చందమున**

**అరయ నిష్ఫలమగు మరి యన్యుల జేరినను**

**కూరిమి మా తిరువేంకటగిరి గురు శ్రీపాదములు**

**చేరిన వారికి భవములు చెందవెపుడు నటు గాన**

మాయ అనే ఆశలోపడి కాలాన్ని వృధాచేయకుండా చంచలమైన మనస్సును నిగ్రహించుకుని నిశ్చల తత్త్వాన్ని పొంది, ఆ నిశ్చలమైన మనస్సును భగవదర్పితం చేయమని సూచిస్తున్నాడు పై కీర్తనలో.

సంసార జీవితంలో ఉన్న భారాన్ని ఇలా వర్ణిస్తున్నాడు మరొక కీర్తనలో

**ఇట్టె సంసారి కేదియు లేదాయె**

**తట్టు వడుటె కాని దరి చేర లేదు**

ఎక్కువ శ్రమతో బరువైన మోపును మోసే వాడు అలసినప్పుడు ఆ మోపును దించి తన అలసటను అప్పుడప్పుడు తీర్చుకుంటాడు గానీ ఈ సంసారమనే భారపు మోపును మోసే ఏ జీవియైనా ఆ భారాన్ని చివరి దాకా మోయాల్సిందేగాని మధ్యలో దించుకునే అవకాశం లేదు. వేప చేదును మందులాగా తాగేవాడు మధ్యలో అవసరమైనప్పుడు తీపి తిని నోటి చేదును పోగొట్టుకునే అవకాశం ఉంది గానీ సంసార జీవితంలో వచ్చిన కష్టాలు, సమస్యలు అనే చేదును తొలగించుకునే అవకాశం లేదు. అదే విధంగా దుర్గంధంతో కూడిన శరీరాన్ని శుభ్ర పరచి సుగంధ ద్రవ్యాన్ని పూసుకోవచ్చు గానీ సంసార జీవితంలో ఆ అవకాశం లేదు. మనసులో ఏర్పడిన మలినాన్ని తొలగించుకునే అవకాశం భగవంతుని సేవించటం ద్వారానే వస్తుందని ఇందులోని భావం.

**అందరి వశమా హరి నెఱంగ**

**కందువగ నొకడు గాని యెరగడు**

అనే కీర్తనలో భగవంతుడిని, భగవత్తత్త్వాన్ని తెలుసుకోవటం అందరి తరము కాదని, పది కోట్ల మందిలో ఏ ఒక్కడో భగవంతుని తెలుసుకొన గలుగుచున్నాడని అలా భగవంతుడిని గుర్తించ గలిగిన కోట్లమంది పుణ్యాత్ములలో ఒక్కడు మాత్రమే భగవత్తత్త్వాన్ని పూర్తిగ గ్రహించ గలుగుతున్నాడని తెలియజేసాడు.

**ఇందుకు విరహితము లిన్నియు వజ్ఞానమని**

**చందమున గీతలందు జాటీ విదిలో**

**మానవమానములు మాని దంబు విడుచుట**

**పూని హింసకు జొరక యోరుపు కలుగుటయు**

**అవిమతి గరగుట యాచార్యోపాసన**

**తానెపుడు శుచియౌట తప్పని విజ్ఞానము**

**అంచల సుస్థిరబుద్ధి యాత్మనిగ్రహము**

**అంచిత విషయ విరహంకారాలు**

**ముంచిన జన్మదుఃఖములు దలపోయుట**

**కంచపు పంపారము గడుచుటే జ్ఞానము**

**అరిమిత్ర పమబుద్ధి యనన్య భక్తియు**

**పరినేకాంతమును సజ్జనసంగ విముక్తి**
**ధర నధ్యాత్మ జ్ఞానతత్వము దెలియుట**
**గరిమలందుట శ్రీవేంకటపతి జ్ఞానము**

మానావమానాలను విడిచి పెట్టడం, డంబము లేకుండా ఉండటం, హింస చేయక పోవటం, సహనం కలిగి ఉండటం, మోసపు బుద్ధి లేకపోవటం, పెద్దలను గౌరవించటం, శుచిగా ఉండటం, నిశ్చలమైన బుద్ధి, మనోనిగ్రహం, విషయ సుఖాలపై ఆసక్తి లేకపోవటం, అహంకారం విడిచి పెట్టడం, నీతివంతమైన సంసార జీవితాన్ని గడపటం, శత్రుమిత్రులయందు సమభావం కలిగి ఉండటం, భగవంతుని మీద అనన్యమైన భక్తిని ఏర్పరచుకోవటం, విజన స్థలంలో ఉండటం, దుర్జన సాంగత్యాన్ని విడిచి పెట్టడం, ఎల్లప్పుడూ ఆత్మజ్ఞాన తత్వాన్ని తెలుసుకోవడానికి ప్రయత్నం చేయటం మొదలైన వన్నియు జ్ఞానవంతులు అనుసరింప దగినవని పై కీర్తనలో వివరించాడు.

భగవంతుని దృష్టిలో మనుషులందరు సమానమే అని చెబుతూ

**ఇందరు నీకొక్క సరి యెక్కువ తక్కువలేదు**
**చెంది నీ సుద్దులు యేమి చిత్రమో కాని**
**నీ నామముచ్చరించి నెరవేరె నొక్క మౌని**
**నీ నామము వినక నెరవేరే నొకడు**
**పూని నిన్ను నుతియించి భోగియాయె నొకడు**
**మోసమున నిన్ను దిట్టి మోక్షమందె నొకడు**
**మతిలో నిన్ను తలంచి మహియందె నొక యోగి**
**తతి నిన్ను దలచకే తగిలె నిన్నొకడు**
**అతి భక్తి బని సేసి అధికుడాయె నొకడు**
**సతతము బనిగొని సుఖుడాయె నొకడు**
**కౌగిట సుఖములిచ్చి కలిసిరి కొందరు**
**ఆగి నిన్ను వెంట దిప్పి ఆవులు మేలందెను**
**దాగక శ్రీవేంకటేశ దగ్గరైన దవ్వయిన**
**యాగి నిన్ను దలపోసె మనసే గుఱుతు**

పై కీర్తనలో భగవంతుని మీద అత్యంత భక్తితో అతనిని సేవించి, పూజించి, తరించిన వారున్నారు. భగవంతుని పై పగ, ద్వేషాన్ని పెంచుకుని సదా భగవన్నింద చేస్తూ తమకు తెలియకుండానే తద్వారా భగవన్నామ స్మరణ చేస్తూ భగవంతుని కృపకు పాత్రులైన వారూ ఉన్నారు. కాబట్టి ఎవరు ఏ విధంగా తలంచినా, ఇష్టంతో తలంచినా, అయిష్టంతో తలంచినా కేవల భగవన్నామస్మరణ వల్ల ముక్తి కలుగుతుందని చెబుతూ ఓ వేంకటేశా! నీ చర్యలెంత చిత్రములో గదా అని వర్ణిస్తున్నాడు.

తనకు, భగవంతునికి గల భేదాన్ని ఒక కీర్తనలో చక్కగా వర్ణించి, ఆ భగవంతుని రక్ష తనకు కావాలని కోరుతున్నాడు అన్నమయ్య-

**పురుషోత్తముడ నీవు పురుషాధముడ నేను**
**ధరలో నా యందు మంచితన మేది?**
**అనంతాపరాధములు అటునేము సేసేవి**
**అనంతమయిన దయ అది నీది**
**నిను నెఱగకుండేటి నీచు గుణము నాది**
**నను నెడయకుండే గుణము నీది**
**సకల యాచకమే సరుస నాకు బని**
**సకల రక్షకత్వము సరి నీ పని**
**ప్రకటించి నన్ను దూరే పలుకే నాకెప్పుడును**
**వెకలి నైనను గాచే విధము నీది**
**నేర మింతయు నాది నేరుపింతయు నీది**
**సారెకు నజ్ఞాని నేను జ్ఞానివి నీవు**
**ఈ రీతి శ్రీవేంకటేశ యిట్టే నన్ను నేలితివి**
**ధరణిలో నిండెను ప్రతాపము నీది**

పై కీర్తనలో జీవాత్మ పరమాత్మ సమభావాన్ని అతి చక్కగా వర్ణించాడు. అజ్ఞానియైన జీవి ఎన్ని తప్పులు చేసినా పరమోత్కృష్టమైన పరమాత్మ దయామయుడై అతనిని కరుణిస్తాడని రక్షిస్తాడని ఈ కీర్తనలో పరమార్థం.

మోక్షాన్ని సాధించాలంటే తగిన ప్రయత్నం అవసరమని ఒక కీర్తనలో తెలియజేస్తూ ఆధ్యాత్మికపరమైన మోక్షసాధనకు కృషి అవసరమని తెలియజేశాడు.

**ఊరకే దొరుకునా ఉన్నతోన్నత సుఖము**
**సారంబు దెలిసి కా జయము చేకొనుట**
**తన శాంత యాత్మలో దగిలినప్పుడు గదా**
**పనిగొన్న తన చదువు ఫలియించుట**
**ఎనలేని శ్రీవేంకటేశ్వరుని దాస్యంబు**
**తనకు వచ్చిన గదా దరి చేరి మనుట**

# తాళ్లపాకవారి సంకీర్తనలలో స్త్రీ స్వభావచిత్రణ

డా॥ యమ్. లలితకుమారి

ఆధునిక యుగంలో అన్ని రంగాల్లో స్త్రీలకు ప్రాధాన్యం గుర్తింపు దిశగా ప్రయాణం సాగుతోంది. తాళ్ళపాక అన్నమాచార్యుడు సంగీత సాహిత్యాలలో నిష్ణాతుడైన వాగ్గేయకారుడు, పదకవితాపితామహుడు, సంకీర్తనాచార్యుడు. అన్నమయ్య సంకీర్తనలలో ఎక్కువ భాగం శ్రీవేంకటేశ్వరుని కీర్తించినవే ఉన్నాయి. వీరి సంకీర్తనలలో నాయకుడు, వేంకటేశ్వరుడు, నాయిక అలమేల్మంగ కొన్ని సంకీర్తనలలో శ్రీసతి, సత్యభామ, వంటి ఇతరనాయికలు కూడా కన్పించినా శృంగారనాయిక అలమేల్మంగమ్మదే ప్రధానపాత్ర. అన్నమయ్య సంకీర్తనలలో అలమేలుమంగమ్మ శ్రీమాతగా, జగదేక విభురాణాగా, లక్ష్మీస్వరూపిణిగా, శ్రీవేంకటవిభునిత్య వక్షస్థల వాసినిగా, శృంగార రసాధిదేవతగా, అనపాయినిగా కీర్తించబడింది.

నందకాంశ సంభూతుడైన అన్నమయ్య సంకీర్తనలలో మృదుమధుర పదవిన్యాసానికి జీవాతువునిచ్చిన వాత్సల్యప్రదాయిని అలమేలుమంగ. ఆమె దివ్యస్వరూపాన్ని వీక్షించిన భగవతీ కృపాకటాక్ష పాత్రుడు అన్నమయ్య. అద్వితీయ రసపేశలమైన సంకీర్తనలను ఆలపించి ధన్యుడైనాడు.

అలమేలుమంగ అన్న పదం 'అలర్‌మేల్‌మంగై' అన్న ద్రవిడ పదానికి పర్యాయవాచకం. "అలర్" అనే పదానికి తెలుగులో 'పువ్వు' అని 'మేల్' అనే పదానికి పైన (ఆసీనమైన) అనియు, 'మంగై' అనే పదానికి 'మగువ' అనియు అర్థాలు. ఈ విధంగా పద్మాసీనురాలైన యవ్వనవతి అని గ్రహించవచ్చు. ఈ విధమైన దివ్యమంగళ విగ్రహురాలైన అలమేలుమంగ అన్నమాచార్యుల వారికి గోచరించిన శ్రీవేంకటేశ్వరుని పట్టపురాణి. పదకవితాపితామహుడైన తాళ్ళపాక అన్నమాచార్యుల యింటి ఆడపడుచు ఆలమేలుమంగ అన్న ప్రసిద్ధి అన్వర్థమైంది. తనను కన్న తల్లిలా లాలించి, పాలించిన అలమేలు మంగను కన్నబిడ్డగా ఎంచి కీర్తించాడు. అన్నమయ్య కన్యాదాతయై శ్రీవేంకటపతి కాళ్ళుకడిగి కన్యాదానం చేశాడు. "శ్రీవేంకటేశ్వరుడు మదీయమాతా మహవంశ శిఖారత్నంబగు అన్నమాచార్యునకు జామాతురుండ"నిపించుకున్నాడు.

అన్నమాచార్యుల ఈ శృంగార సంకీర్తనలలో అలమేలుమంగను కనులారా చూడమంటున్నాడు. సర్వలక్షణాలతో, సర్వాంగ సుందరంగా అమ్మవారిని దర్శింపజేశాడు.

**"చిగురు మరుకాళెలు, జిగిగల యరటులు,**
**సొగసైన యట్టి యిసుక దిబ్బలు**
**తగిన బిలము, మంచితరగలు, సింహము**
**మొగిచిన చక్రవాళములు పిల్లలు**

**జవళి తామరతూండ్లు చక్కని శంఖము పోక**

**పవడాలు వజ్రాలు పసిడి యద్దాలు**

**మవు పూవు కలువలు నూలుకొన్న శ్రీకారాలు**

**అవిరళమైనవాడ్లు అరధి చంద్రుడూ,**

**తమ్మివిరి నీలాలు తళుకు మెఱుగులు**

**తమ్మిదల చెదరని తోరపుగుంపు**

**ఇమ్ముల శ్రీవేంకటేశ యిదె నీవురముమీద**

**నెమ్మది దావుకొని నిండెను యీసిరులు**

ఈ కీర్తనలో ఉపమానాలతో అమ్మవారిమూర్తిని సర్వోపమాలంకారాలతో అలంకరించాడు. ప్రకృతిలోని సౌందర్యాన్నంతా ప్రోదిచేసి సౌందర్యవతిగా మలచాడు, కీర్తించాడు. అన్నమయ్య సంకీర్తనలలో అలమేలుమంగ శ్రీవేంకటేశ్వరుల పరిణయాన్ని వర్ణిస్తూ-

**"అంగనకు నీవె అఖిల సామ్రాజ్యము**

**శ్రింగారరాయఁడ నీకు శ్రీసతి నిధానము"**

అన్న సంకీర్తనలో సతీపతుల అభేదాన్ని ఆవిష్కరించాడు.

శ్రీవేంకటేశ్వరుని కల్యాణానంతరం ఆ దంపతుల దివ్య ప్రణయలీలా వైభవాన్ని భక్తి పరవశంతో రచించి జగత్తును తన పదకవితా చమత్కారంతో ఓలలాడించాడు.

**"తరితోడమంచి జాణ తనవు మాటలనెల్ల**

**మెఱసితి గదే యలమేలుమంగా**

**తెఱగున నీపతికి తెల్లని నవ్వులు చల్లి**

**అఱచేతి మణివైతివి అలువేలు మంగా"**

**శశి కిరణములకు చలువల చూపులు**

**విశదముగా మీద వెదచల్లుచు**

**రసికతపెంపున కరగించి యెప్పుడు నీ**

**వశము చేసుకొంటి వల్లభునోయమ్మా"**

అన్నమయ్య అలిమేలుమంగను, జాణగా వర్ణించాడు. జాణతనంలో ఎల్లప్పుడు నాథుణ్ణి పరవశింపచేస్తుంది.

చల్లని చూపులను వెదజల్లుతూ పతిని వశం చేసుకుంటుంది. అన్నమయ్య అలుమేలుమంగను నవరస భరితంగా వర్ణించి శృంగార రసాధిదేవతగా అభివర్ణించాడు.

**"నవరసములదీ నళినాక్షి**
**జవకట్టి నీకు చవిసేసీని"**

అన్నలోకోత్తరమైన సంకీర్తనలో ఆమె అంగాలను నవరసాలతో పోల్చిచెప్పిన రససిద్ధుడైన కవీశ్వరుడు.

అలమేలు మంగను విభిన్నశక్తులకు సమాహార రూపిణిగా, శ్రీవేంకటేశ్వరునికి తన సర్వస్వాన్ని సమర్పిస్తున్న ఒక శృంగార రసనిర్ఝరిగా ఉల్లేఖించాడు ఈ సంకీర్తనలోని ఉల్లేకాలంకార వైభవం సహృదయుల హృదయాలను రసానందంలో ముంచెత్తుతుంది.

**"చూడరమ్మ సతులాల సోబాన పాడరమ్మ**
**కూడున్నది పతి చూడికుడుతనాంచారి"**

ఈ సంకీర్తనలోని 'నాంచారి' అన్న పదాన్ని మరో సంకీర్తనలో ప్రస్తావిస్తూ అలమేలుమంగకు పర్యాయవాచకంగా ప్రయోగించాడు.

**"అమ్మమ్మ ఏమమ్మ అలమేలుమంగ నాంచారమ్మా**
**తమ్మియింట నలరు కొమ్మా వో యమ్మా"** అని అలుమేలుమంగ లీలావిలాసాలను అపురూపంగా కొనియాడాడు.

**"అంతేకాక" సువ్వి సువ్వి సువ్వాలమ్మా,**
**నవ్వుచు దేవకి నందను గనియె"** అన్న కృష్ణ జనన వృత్తాంతాన్ని వర్ణిస్తూ సంకీర్తన ఆఖరిపంక్తులలో

**"కలిజారె వేంకటపతిమీరె**
**అలమేల్మంగ నాంచారమ్మకు అలుకలు తీరె"** అని పేర్కొన్నాడు. ఇక్కడ కూడ అలమేలు మంగను "నాంచారి" శబ్దానికి సమన్వయించాడు.

అలమేలుమంగ అమ్మలగన్నయమ్మ. శ్రీనివాసుని ధర్మపత్ని. వారి దాంపత్యం విశ్వానుకరణీయం. పతి వక్షస్థలమే నిత్యనివాసమై, శ్రీవారి నిరంతర ప్రేమానురాగాలకు పులకించిన భోగాయతనము అల మేలుమంగమ్మది.

అలమేలుమంగ 'లోకమాత'. 'భోజ్యేషుమాతా' అన్న సూక్తికి ప్రతీక. ఈ విషయాన్ని అన్నమయ్య తన సంకీర్తనావాహినిలో పొందుపరుస్తూ-

**"ఇందిర వడ్డించ ఇంపుగను చిందక**
**యిట్లే భుజించవో స్వామి"-** అంటాడు.

జగన్నాయకుడైన శ్రీవేంకటేశ్వరునికి షడ్రసోపేతమైన భోజనాన్ని, ప్రేమరసభావంతో రంగరించి వడ్డించే దొడ్డ యిల్లాలు. లోకబాంధవుడికే చవులూరించే అద్భుతవంటకాలను ఆశ్రితులైన భాగవతకోటికి ప్రసాదించే కరుణాం తరంగి. అష్టైశ్వర్యప్రదాయిని ఆదిలక్ష్మి. ఆమె పాక ప్రావీణ్యాన్ని, ఆశ్రితపోషకత్వాన్ని చక్కగా వర్ణించాడు.

ఈ విధంగా అలమేలు మంగను అత్యంత సౌందర్యవతియైన శృంగార నాయికగా, స్వాధీనపతికగా, ప్రణయినిగా, గృహిణిగా, ఆదిలక్ష్మిగా, అష్టవిధ సౌభాగ్యాలకు నిలయంగా చాటిచెప్పేడు.

**"ఇన్నిరాసుల యునికి యింతి చెలువపురాశి**
**కన్నె నీరాశి కూటమి గలిగిన రాశి"**

అన్న సంకీర్తనలో జ్యోతిర్మయ స్వరూపంగా, జగత్తుకు ఉపాదాన కారణంగా వర్ణించాడు. దీన్నే మూలప్రకృతి అంటారు. ఈ మూలప్రకృతి విశ్వమందలి స్థావర జంగమరూపాలకు మూలము. దాని మొదటి వికారం మహత్తు అని శ్రీవైష్ణవ సంప్రదాయం ప్రబోధిస్తున్నది. సాత్వికాది రూపంలో దర్శనమిచ్చే ఆకాశతత్త్వం ఇందులో భేదమే. జ్యోతిరాదిత్యాది స్వరూపంలో ఉండే నక్షత్ర గ్రహాదులకు అధినేత విరాట్పురుషుడు. శింశుమార జ్యోతిర్మండల అధినేత శ్రీనివాసుడు. ఈ సంప్రదాయ బలంతో అన్నమయ్య అలమేలుమంగను ద్వాదశ రాసులకు నిలయమైన శింశుమార జ్యోతిర్మయిగా తెలియజెప్పాడు. అందుకే ఈమె జగత్తుకు మంగళదాయిని శక్తిస్వరూపిణి. శతపత్ర నికేతనురాలై విలసిల్లుచున్నదని అన్నమయ్య ప్రవచించాడు.

ఆ లోకమాతను పురుషకార స్వరూపిణిగా వీధి వెలుగుగా, శింశుమార జ్యోతిర్మయిగా, ఉత్సవ విలాసినిగా, ఆ అలమేలుమంగ యొక్క సమస్త మంగళదేవతా తత్త్వాన్ని అన్నమయ్య ఆవిష్కరించాడు.

# శ్రీనివాస విలాససేవధి - శ్రీనివాసుని వైభవం

డి.వి. లక్ష్మి

భక్తవత్సలుడూ, భగవంతుడూ అయిన శ్రీమన్నారాయణుని లీలలు అనంతములు. శ్రీకాంతుడూ, శ్రీనివాసుడూ అయి భక్తులపాలిట కామధేనువుగా వేంకటాచలముపై కొలువుతీరిన ఆ స్వామి వైభవమూ, వైశిష్ట్యమూ అనుభవైకవేద్యాలే తప్ప వర్ణనాతీతాలు. ఆ విషయం చతుర్ముఖుడయిన విధాత, పదివేల పడగలున్న శేషుడూ కూడ అనుభవపూర్వకంగానే తెలుసుకొన్నారని మన పురాణాలు చెబుతున్నాయి. అంతటి ఆ స్వామిని కొనియాడి తమ మానసికమయిన భక్తిమధురభావననూ, అంతరంగాన్నీ సంతృప్తి పరుచుకోవాలని ప్రతి భక్తకవికీ, వాగ్గేయకారునికీ కోర్కె ఉంటుంది.

అయితే వేంకటాచలపతి శ్రీనివాసుని విలాసకథలను, శ్రీవేంకటాచలమాహాత్మ్యాన్ని మేళవించి తెనుగు భాషలో ద్విపదగా మధురకావ్య సుమమాలతో స్వామి నర్చించిన తొలిద్విపద కవి శ్రీశ్రేష్ఠలూరి వేంకటార్యుడు. ఈ కవి రచించిన ద్విపద కావ్యమే "శ్రీనివాసవిలాససేవధి"

శ్రీవేంకటాచలనివాసుడయిన శ్రీనివాసుని గూర్చిన కథలు సంస్కృత భాషలో వరాహ, వామన, బ్రహ్మాండ, పద్మ, గరుడ, స్కంద, మార్కండేయాది పురాణాలలో పెనవేసుకుని చిక్కుపడి ఉన్నాయట! సముచిత రీతిలో ఆ చిక్కును సున్నితముగ విడదీసి పూర్వోత్తర విరోధములు లేని తీరులో సర్వసమాధాన వైఖరితో సర్వజనులకు సుబోధమగు తీరులో తేనెతెనుగున ద్విపదగా చించాడీ కవి. ఈ కావ్యాన్ని గోవిందరాజునకు అంకితమిచ్చాడు. ఆంధ్రభాషలోని ద్విపద కావ్యాలలో ఇది రసవత్తరమై హృదయరంజకమై అలరారింది. ఈ కావ్యాన్ని తిరుమల తిరుపతి దేవస్థానమువారే 1952లో కోరాడ రామకృష్ణయ్యగారి సంపాదకత్వంలో ముద్రించారు. భక్తవిద్వల్లోకానికి అమందానందాన్ని ప్రసాదించారు.

వేంకటార్యకవికృతమైన "శ్రీనివాసవిలాస సేవధి" అనే ఈ ద్విపద చక్కని భక్తిరసవత్కావ్యము. శ్రీనివాసుని విహారలీలలనూ, వైభవమునూ వర్ణించిన రసవత్ప్రబంధం. ఇది ఆరు ఆశ్వాసముల కావ్యం.

ప్రతికవి దాదాపుగా తాను ఆకావ్య రచన చేయడానికి కారణం చెప్పుకుంటాడు. భక్తికావ్యరచనకుగల కారణం జన్మరాహిత్యమూ మోక్షకాంక్షే. మహాభాగవతకర్త పోతననుండి మొల్ల మొదలయిన అందరూ అదే దారిలో నడిచారు. ఇక్కడ మరొకమాట కూడ చెప్పుకోవాలి. అదే పరంపరగా శ్రీవేంకటార్యుడు కూడ చెప్పుకున్నాడు.

**"గరిమనీక్షించి యోకవివర్య మున్ను**
**ధర సంస్కృత ప్రాకృతముఖ భాషలను**
**ద్రవిడాంధ్రముల ప్రబంధము లెన్నియైన**
**సవరించితివి మాకు సంతోషంబెసగ**

నొకకృతి శేషాచలోరువైభవము
ప్రకటితాలంక్రియాస్పదవర్ణనలను...
విసువక శృంగారవీరాద్భుతాది
రసములు భావముల్‌రంజిల్లునట్లు
ద్విపదలోకులకెల్ల తెలివిడికాన
ద్విపదగా తెనుగున తేటగావించు
వారాహవామన బ్రహ్మాండపాద్మ
గారుడ స్కాందమార్కండేయముఖ్య
బహుపురాణోక్తి సంబంధంబువలన
గహనమై పెనుగొన్న కథ చిక్కుదీర్చి......
భూషణంబుగను సల్పుము చెల్వుగుల్క" -శ్రీనివాస విలాససేవధి

పై విధముగా స్వామి కవికి స్వప్నమున దర్శనమిచ్చి కావ్యరచన చేసి తన కర్పించమని ఆదేశించాడు. తనకు కావలసిన కథ, కథనము, కావ్యపు తీరు అంతా ఆయనే తన కిష్టమైన మార్గాన్ని ఆదేశించాడు. స్వామి ఆదేశాన్ని కవి త్రికరణ శుద్ధిగా శిరసావహించాడు. ఇక్కడే కవి యితర గ్రంథములను గూర్చిన ప్రసక్తికూడ ఉంది. సంస్కృత ప్రాకృత ప్రముఖ భాషలలో ద్రవిడాంధ్ర ప్రబంధముల నెన్నింటినో రచించినట్లు స్వామి స్వయంగా చెప్పినట్లు ప్రస్తావన ఉన్నది. వైష్ణవ సంప్రదాయ గ్రంథములగు అష్టాదశ రహస్యములలో ఒకటైన "శ్రీవచన భూషణము"నకు వ్యాఖ్య వ్రాశారు.

ఇక కవి తనను గూర్చి తాను చెప్పుకొన్న వివరాలు ఇలా ఉన్నాయి. ఈ కవి భారద్వాజ గోత్రుడు. ఆపస్తంభసూత్రుడు

"అష్టభాషాకవిత్వార్జిత ప్రోద్య
దష్టావధాన విఖ్యాత భైరవుడు
శ్రీకృష్ణయార్య లక్ష్మీ గర్భవార్ధి
రాకాసుధానిధి రాజపూజితుడు
వివిధ విద్యాశాలి వేంకటార్యుండు"

పైన చెప్పిన దానిని బట్టి ఈ కవిపేరు వేంకటార్యుడు. శ్రీకృష్ణయార్యుడు, లక్ష్మి జననీజనకులు. ఈ కవి అష్టభాషలయందు కవిత్వము చెప్పనేర్చినవాడు. రాజపూజితుడు. వివిధ విద్యాశాలి అనికూడ తెలుస్తున్నది. శ్రేష్ఠలూరు అంటే ప్రస్తుతం అనంతపురం జిల్లాలోని చెట్లూరు కావచ్చునన్పిస్తున్నది.

ఈ కవి 17 శతాబ్దికి చెందినవాడని చెప్పవచ్చు. అందుకు ఆంతర దృష్టాంతాలు కావ్యాంతర్గతాలుగా ఉన్నాయి. ఈ కవి గురువు అన్నావియప్పలాచార్యులు. ఈ అప్పలాచార్యులే కందాడై కోవిల అణ్ణన్ అని నామాంతరము కల్గి ఉన్నట్లు తెలుస్తున్నది. తెనాలిరామకృష్ణుడు, సారంగుతమ్మయ కూడ తమ కావ్యాలలో ఈ అప్పలాచార్యునే గురువుగా చెప్పుకొని ఉండడంతో ఈ ఆంతరసాక్ష్యంతో వేంకటార్యుడు వీరిర్వురు కూడ ఒకే గురుని సహాధ్యాయులు కనుక 17వ శతాబ్ది వారని చెప్పవచ్చు.

భావుకభావ సంభావ్యతతో మహాకావ్య లక్షణములు వెలయునట్లుగా, వేంకటాద్రిమాహాత్మ్యమిం పొందునట్లు భూనుతవిఖ్యాతిగా ఈ కావ్యమును వ్రాయదునన్నట్లు చెప్పుకొన్నాడు. ఇది ద్విపద అయినా కవితారీతులలోనూ, భావాలలోనూ పాల్కురికి సోమనాధుని ఛాయలు కన్పిస్తుంటాయి. అయితే కవి తన కావ్యలక్ష్యాలను, లక్షణాలను ఏమేమి చెప్పాడో అవన్నీ అమరి ఉన్నట్లే!

**కథాసంవిధానపు తీరు-కథా కథనము**

ఇతడు వరాహవామనాది పురాణాంతర్గత కథలను శోధించి వెలికితీసి కసటు దీర్చి, నిగ్గుతీసి చెబుతున్నట్లు చెప్పుకొన్నాడు. సాధారణంగా పురాణ కథలన్నిట సుక్షేత్రం నైమిశారణ్యమే ఇక్కడకూడ ప్రస్తావించబడింది. నైమిశారణ్యంలో సకల పురాణవ్యాఖ్యాన వైఖరీసమేతుడయిన సూతుడు శౌనకాది మహర్షులకు చెప్పినట్లే కథా సందర్భం కూడ ఉంటుంది. ఈ సన్నివేశంతో ఈ ద్విపద కావ్యం ప్రారంభమయింది. భూలోకమున అతి పుణ్యతమమైన క్షేత్రమేది అని మునులు సూతుని ప్రశ్నించారు. సూతుడు కొలది క్షణాలు మౌనము వహించి, యించుక ధ్యానించి తెలిసికొని ఆశ్చర్యమునొంది వేంకటాద్రియే అటువంటి క్షేత్రమని, అదియే జ్ఞానసాధన స్థానమనీ వ్యక్తంచేశాడు. ఇంకెన్నో అద్భుత విశేషాలనుకూడ చెప్పాడు.

మహావైభవోపేతుడు వైకుంఠవాసుడు అయిన విష్ణుదేవుడు లక్ష్మీమాతతో వచ్చి ఈ వేంకటాద్రిపై వసియించినాడట! ఆ గిరి మాహాత్మ్యము అత్యద్భుతమట! భూమిని, భూలోకవాసులను ఉద్ధరింపనెంచిన మహావిష్ణువు ఆ గిరికి విచ్చేసినాడు.

విష్ణుదేవుడు వరాహరూపమున భూమినుద్ధరించి ఆ భూమిపైనే కొంతకాలమువసింప నెంచినాడు. ఇందిరాదేవిని తక్కిన తన పరివారమును రప్పించి స్వామిపుష్కరిణిచెంత నుంచాడు. ఇక్కడ స్వామి పుష్కరిణి వైశిష్ట్యాన్ని గూర్చి కూడ విశేషంగా చెప్పాడు కవి. వైకుంఠ విలసితోద్యాన ప్రవిష్టమైనట్టి ఈ స్వామి పుష్కరిణి స్వామి పిలువగా గంగతో కలిసి భూలోకమునకు వచ్చిందట. ఇది ఆ జలజాక్షుని కేళీ సరస్సు. ఆ హరికే మానసానందదాయిని. అటువంటి విశిష్ట తీర్థమును ప్రదక్షిణ పూర్వకంగా పూజిస్తే సర్వజనులకు ఇష్టకామ్యసిద్ధి వరంగా లభిస్తుంది. దీనికి సంబంధించి మాళవరాజా విజయుని కథచెబుతాడు. ఈ కథలో రాజ్యభ్రష్టుడయిన మాళవరాజా పుష్కరిణీ స్నానమూ శ్రీనివాసుని సేవతో రాజ్యప్రాప్తిని పొందాడు. అయితే ఈ పుష్కరిణిని గూర్చి చెబుతూ దీనికి ఏ దిశలో ఏ తీర్థమున్నదో కూడ చెప్పాడు.

స్వామి పుష్కరిణికి వాయువ్య కోణమున-వారాహతీర్థము; ఉత్తరదిశను-ధనదతీర్థము; ఈశాన్యమున- గాలవతీర్థము; తూర్పున-మార్కండేయ తీర్థము; ఆగ్నేయమున-అగ్నితీర్థము; దక్షిణమున-యమతీర్థము; నైఋతిలో-వాశిష్ఠతీర్థము; పడమట అశ్వత్థ వృక్షచ్ఛాయను-వాయు తీర్థము; నడుమ-సరస్వతీ తీర్థము- (ఇది విద్యాప్రకాశమునిస్తుంది.) వున్నాయని చెప్పాడు.

స్వామి పుష్కరిణిలో స్నానమాడి వరాహుని సేవింపకనే శ్రీనివాసుని సేవింపగా వెడలినట్లయితే అతనికి సంకల్ప సిద్ధి ఒనగూరదు. భూలోకమునగల పుణ్య తీర్థములన్నీ స్వామి పుష్కరిణిలో కలుస్తాయి అని సూతుడు చెప్పినట్లు చెప్పబడింది అంటూ ప్రథమాశ్వాసాన్ని ముగించాడు.

ఆత్మారాముడనే ఒక బ్రాహ్మణుని కథతో ద్వితీయాశ్వాసం మొదలవుతుంది. పదునేడు తీర్థముల మహిమాభివర్ణనము, కపిల, ఇంద్ర, విష్వక్సేన, శంఖ, చక్ర, అగ్నికుండ, బ్రహ్మ, సప్తతీర్థములు- అన్నీ కలిపి 17 తీర్థముల వైశిష్ట్యమూ చెప్పబడింది. వైకుంఠగుహ మహిమావర్ణనము, అంజనాదేవి రామునికి హితవు చెప్పడం, బ్రహ్మాదులు నారదునితో కలిసి శేషశైలమునకు వెళ్ళడం, బ్రహ్మాదులు వెన్నునిగాన లేక తిరుగుట, దశరథుడు మహావిష్ణువుని (శ్రీనివాసుని) నాల్గుశ్లోకములతో స్తుతించుట, నల్వురు పుత్రులను పొందుట, లోకకంటకులను సంహరింపుమని స్వామి సుదర్శనుని కాజ్ఞాపించుట ఇతి వృత్తముతో ద్వితీయాశ్వాసం పూర్తి అయింది.

చక్రాయుధము తూర్పుదిక్కునగల రక్కసుల చెండాడుట, ఆగ్నేయదిక్కున మాయాక్షుడను దానవుని సంహరించుట, చక్రరాజు ఉత్తర దిగ్విజయం, చక్రరాజు వేంకటాద్రికి వచ్చుట, బ్రహ్మ శ్రీనివాసునికి ఉత్సవము చేయుట కనుజ్ఞవేడుట, స్వామివేంకటాచలమునందే వసించునట్లు బ్రహ్మవరము పొందుట, వేంకటాచల మహిమలు చెప్పుటతో తృతీయాశ్వాసం ముగిసింది.

విష్ణు కథ అయినా కొంత శివకథను చెప్పడం కవి సమదృష్టికి జ్ఞానపరిపక్వతకు నిదర్శనం. శివుడు వేంకటాద్రికి పోవుటను గూర్చి మునులు ప్రశ్నించుట. రజతగిరిమీద శివుని యాస్థాన వర్ణనము, శివపార్వతుల యొద్దకు కుమారుడు వచ్చుట, కుమారుడు తారకవధ వలన తనకు గలిగిన బాధలను తెల్పుకొనుట, అందుకు ప్రాయశ్చిత్తముగ నారాయణ మంత్రోపదేశము, కుమారస్వామి జననకథ, వేంకటాచలమునకు శివపార్వతులరాక, విశ్వక్సేన తీర్థమాహాత్మ్యము, శంభుని కథ, వసురాజు కథ, వేంకటాద్రికి వివిధ నామములు కలుగుటకు కారణము, వసంతవర్ణనము, మాధవ మాతంగిల సమావేశంతో చతుర్థాశ్వాసం పూర్తయింది.

వృషభాసురుని కథ, గోవిందుడు శేషశైలమునకు వేటాడబోవుట, శ్రీనివాసుడు వృషాసురునిపై చక్ర ప్రయోగము చేయడం, ఆకాశరాజు ధరణీదేవి పద్మినిని (పద్మావతిని) గనుట, పద్మినీ సౌందర్య వర్ణనము, శ్రీనివాసులు చెంచురూపమున వేటకు పోవుట, శ్రీనివాసుని విరహము, వకుళమాలికతో శ్రీనివాసుడు తన

విరహ కారణము చెప్పుట, పద్మావతి అనురాగమునకు గల కారణము- వేదవతి వృత్తాంతము, వకుళమాలిక తాను వచ్చిన కార్యము నెరిగించుట, ముహూర్తనిర్ణయము, వివాహసన్నాహము, పద్మావతీ వివాహముతో పంచమాశ్వాసము పూర్తి అయింది.

భవిష్యత్కథలు, కలి విజృంభణము, వేంకటరమణుని అర్చావతారము, మహిమలు, పాండ్యదేశీయు డయిన రంగదాసు స్వామికొరకు పూలతోటవేయించి యిచ్చుట, స్వామిని సేవించుట, రంగదాసుని మతిభ్రమ, తొండమానుని పట్టాభిషేకము, తొండమానుని వివాహములు, వసుడను నిషాదుడు శ్వేత వరాహమును గూర్చి తెల్పుట, వరాహము పుట్టనుజొచ్చుట, తొండమానుడు స్వామికి విమానాదులను నిర్మించి యిచ్చుట, తిరునాళ్ళ వర్ణన, కృష్ణశర్మ కధ, కుమ్మరికధ, స్వామి తొండమానునికి సాయుజ్యము కటాక్షి··ంట తుదినొక్క రహస్యము.

సకల వేదాంతార్థ సారరూపంబు
శ్రీనివాసులు వట్టి శ్రీవేంకటాద్రి
యానంద నిలయంబు నా స్వామి సరపి
జీవకోటుల బ్రోవ జెలగి యెల్లెపుడు
పావనస్థితినుండు భావంబు దెలిసి
తద్వైభవంబులు తలచి సంతతము
సద్వివేకము మించంగ కీర్తించి
ద్వీపాంతరములనే దేశాంతరముల
నేపట్లనుండైన నెట్టివాడైన
దదభిముఖంబుగా ధరవ్రాలిమ్రొక్కి
మదిలోన గొల్చిన మాత్రంబునంత
శ్రీనివాసులు వారి చెంగిటనిల్చి
తానెయిష్టార్థముల్ దయమీరనొసగు
వేదశాస్త్రమువంటి విద్యలేకుండు
శ్రీదేవికెనయైన చెలువ యొకర్తు
స్వామి పుష్కరిణికి సాటి తీర్థంబు
వేంకటాద్రికి నుద్ది విష్ణు స్థలంబు
వేంకటేశ్వరుబోలు వేరె దైవతము
సత్యంబు గానెచ్చట లేదు లేదు.

అంటూ పరమయోగులు చెప్పిన పరమరహస్యాన్నీ, బ్రహ్మవిద్యనూ గుట్టు విప్పి చెప్పాడు కవి. ఇంతటితో షష్ఠాశ్వాసము, కావ్యమూ సంపూర్ణమైనది.

నిజానికి కావ్యం ద్విపద అయినా పదబంధంలోనూ భావసంపదలోనూ అలంకారవైఖరిలోనూ ఈ కావ్యం ఏ ప్రబంధానికి తీసిపోదని చెప్పవచ్చు. భక్తసులభుడు, లక్ష్మీవల్లభుడూ అయిన ఆ శ్రీనివాసుని అనుగ్రహానికి కావ్యఫలసమర్పణతో తాను పాత్రుడయి మహాకావ్యలక్షణాలు వెలయునట్లుగా వేంకటాద్రి మాహాత్మ్యం ఇంపొందునట్లుగా ఈ కావ్యం వ్రాశాడు. పరితులయిన భక్తులను ధన్యులనూ చేశాడు ఈ కావ్యకర్త.

# తాళ్లపాక అన్నమాచార్య సంకీర్తనల్లో శ్రీవేంకటేశ్వర వైభవం

డా॥ కె.వాణి

తెలుగు సాహిత్యంలో 15 శతాబ్దానికి ముందు వేంకటాద్రిని, శ్రీవేంకటేశ్వరుని కీర్తించిన గ్రంధాలు ఎక్కువలేవు. ఆంధ్రసాహిత్యంలో వేంకటేశ్వరప్రసక్తి మొట్టమొదట ఎఱ్ఱన నృసింహపురాణంలో కన్పిస్తుంది. తదనంతరం శ్రీనాధుని కాశీఖండంలో ఇతర పర్వతాలతో పాటు వేంకటాచల ప్రసక్తి స్పష్టంగా వుంది. అయినా విజయనగరరాజులకాలం నుండే ప్రత్యేకించి ప్రబంధకవుల రచనలలో శ్రీనివాస ప్రసక్తి, తిరువేంకటగిరి వైభవం కన్పిస్తున్నది. ఏది ఏమైనా శిష్టసాహిత్యంలో కంటే సంకీర్తన సాహిత్యంలోనే శ్రీనివాస వైభవం పదిలంగా ఉందని చెప్పడం అతిశయోక్తికాదు.

వేంకటేశ్వరుని వైభవానికి మేలుకొలుపులు పాడినవారు తాళ్ళపాకవారే! వారిలో మొదటివాడైన అన్నమయ్య 32,000 కీర్తనలతో ఆధ్యాత్మిక భావనతో, మధురభక్తి ప్రదర్శనతో యౌగిక విధానాలతో శ్రీవేంకటేశ్వరుని కీర్తించివున్నాడు.

అన్నమయ్య సంకీర్తనలలోని శ్రీనివాస వైభవాన్ని ప్రాదేశికవైభవం, మూర్తివైభవం, ఉత్సవవైభవం, జానపద వైభవం, క్షేత్రవైభవం అని స్థూలంగా వర్గీకరించవచ్చును.

**ప్రాదేశిక వైభవం**

ఒక ప్రదేశానికి ప్రఖ్యాతిరావడానికి తీర్థం, లేదా క్షేత్రం, లేదా దైవతం కారణం కావచ్చును. ఈ మూడు ఒకచోట ఇమడడం అరుదు. వేంకటేశ్వరుడు నెలకొన్న తిరువేంకటగిరి, ఆ కొండలలో నెలకొన్న అనేక తీర్థాలు, సహజసుందరము, సమ్మోహకమైన శ్రీనివాసవిగ్రహం తిరుమల ప్రాదేశిక వైభవానికి కారణాలని స్పష్టంగా చెప్పవచ్చును. అన్నమయ్య తిరుమలగిరికి సంబంధించి అనేక కీర్తనలు రచించాడు.

ఆయన తిరుమల కొండలను

**అదివో అల్లదివో హరివాసము**
**పదివేలు శేషులపడగలమయము॥** అనే సంకీర్తనలో
**అదె వేంకటాచల మఖిలవున్నతము**
**చెంగట నల్లదివో శేషాచలము ॥** అని కీర్తిస్తూ
**కైవల్యపదము వేంకటనగ మదివో**
**శ్రీవేంకటపతికి సిరులైనది**
**భావింప సకల సంపదరూప మదివో**
**పావనములకెల్లఁ బావనమయము ॥** అని సకల వైభవరూపంగా వర్ణించాడు.

ఎందరో చక్రవర్తులు, మఠాధిపతులు తిరుమల క్షేత్ర ప్రాభవానికి సేవచేసినవారే! అందుకే అట్టి తిరుమలను గూర్చి అన్నమయ్య

**అదె చూడు తిరువేంకటాద్రి నాలుగుయుగము**
**లందు వెలుగొందీ ప్రభమీఱఁగాను ॥**
**తగ నూటయిరవై యెనిమిది తిరుపతులం గల**
**స్థానికులును చక్రవర్తి పీఠకములును**
**అగణితంబైన దేశాంత్రుల మఠంబులును**
**నధికమై చెలువొందఁగాను ॥**

గగనంబు దాఁకి శృంగారరసభరితమై
కనకమయమైన గోపురములనుఁ జెలువొంది
జగతీధరుని దివ్యసంపదలుగల నగరు
సరుగననుఁ గానరాఁగాను ॥
తిరుమలకు వెళ్ళే సోపానమార్గాన్ని (మెట్లదారిని)

**తోరణములే త్రోవెల్లా**
**మూరటబారట ముంచినలతల ॥** అని హృద్యంగా వర్ణించాడు.

తిరుమల ఆలయపరిసరాలైన ఉయ్యాలగంభము, గరుడగంభము, నడిమి గోపురం, నీడతిరుగనిచింత మొదలైన పరిసరాలను అన్నమయ్య కీర్తనల్లో ప్రస్తావించాడు.

**మూర్తి వైభవం :**

అన్నమయ్య స్వామి విశ్వమోహనరూపాన్ని

**కంటిఁ గంటి నిలువుచక్కనిమేను దండలును**
**నంటుఁజూపులను జూచేనవ్వుమోము దేవుని ॥**

**కనకపుఁ బాదములు గజ్జెలు నందెలును**
**ఘనపీతాంబరము పైకట్టు కటారి**
**మొనసి యొడ్డాణపు మొగవుల మొలనూలు**
**ఒనర నాభీకమల ముదరబంధములు ॥**

**కట్టిన కంటసరులు ఘనభుజకీర్తులు**
**కట్టాణి ముత్యాల సింగార నామము**
**నెట్టన శ్రీవేంకటేశ నీకుఁ గర్ణపత్రములు**
**వట్టె సిరసుమీఁద నమరేకిరీటము ॥**

సర్వాభరణయుక్తంగా ఆపాదమస్తక వర్ణన చేశాడు అన్నమయ్య. ఆయన స్వామి మూర్తిని వర్ణించడమే కాకుండా స్వామిని లీలావైభవమూర్తిగా కూడా వర్ణించాడు.

**ఇందరికి నభయంబు లిచ్చుచేయి**
**కందువగు మంచిబంగారు చేయి ॥**
**తిరువేంకటాచలాధీశుఁడై మోక్షంబు**
**తెరువు ప్రాణులకెల్ల ఁదెలిపెడి చేయి ॥** అని అభయహస్తాన్ని

**ఈ పాదమేకదా యిలయెల్లఁ గొలచినది**
**యీ పాదమేకదా ఇందిరాహస్తముల కితవైనది ॥**
**యీ పాదమేకదా యిభరాజు దలఁచినది**
**యీ పాదమేకదా యీక్షింప దుర్లభము**
**యీ పాదమేకదా యీ వేంకటాద్రిపై నిరవైనది ॥** అని పాదపద్మాలను కీర్తించాడు.

శ్రుతి స్మృత్యాదులలో వర్ణింపబడిన పరమాత్ముడే శ్రీవేంకటేశ్వరుడని కూడా అన్నమయ్య కీర్తించాడు.

**ఏమూర్తి నిజమూర్తి-ఏమూర్తియునుఁగాడు ।**
**ఏమూర్తి త్రైమూర్తు లేకమైన యాతఁ**
**డేమూర్తి సర్వాత్ముఁ డేమూర్తి పరమాత్ముఁ**
**డామూర్తి తిరువేంకటాద్రి విభుఁడని ॥** కీర్తించాడు.

ఎంతమాత్రమున నెవ్వరు దలఁచిన అంతమాత్రమే నీవు- అని శ్రీవేంకటేశ్వరుని పరతత్త్వంగాను కీర్తించి

**శ్రీవేంకటేశ్వరుని సింగారము వర్ణించితే**

**యేవిధానఁ దలఁచినా యిన్నిటికిఁ దగును ॥** అని సమన్వయించాడు అన్నమయ్య.

**ఉత్సవ వైభవం**

శ్రీవేంకటేశ్వరస్వామికి సంప్రీతికరంగా, తిరుమలలో ఉత్సవాలు జరుగుతుంటాయి. తిరుమలలో ఉత్సవాలు స్వామివారి అంగరంగ వైభవానికి నిదర్శనాలుగా నిలిచాయి.

తిరుమలలో జరిగే నిత్యోత్సవాలు, పర్వోత్సవాలు, వారోత్సవాలు, మాసోత్సవాలు, బ్రహ్మోత్సవాలన్నింటి లోను శ్రీవేంకటేశ్వరుణ్ణి వైభవంగా కీర్తించాడు అన్నమయ్య.

నిత్యోత్సవాలలో మేలుకొలుపు మొదటిది. తాళ్లపాక అన్నమాచార్యులు

**విన్నపాలు వినవలె వింతవింతలు**

**పన్నగపు దోమతెర పైకెత్తవేలయ్యా ॥** అని స్వామివారికి మేలుకొలుపు పాడాడు.

వారోత్సవాలలో స్వామివారికి జరిగే అభిషేకోత్సవం ప్రసిద్ధమైనది. ఈ అభిషేకోత్సవాన్ని అన్నమయ్య ఆధ్యాత్మికంగాను, మధురభక్తి పరంగాను ఎన్నో సంకీర్తనల్లో వర్ణించాడు.

**కంటి శుక్రవారము గడియ లేడింట**

**అంటి అలమేల్మంగ అండనుండే స్వామిని ॥**

**నేఁడె సుక్కురారము నెలఁతలాల**

**పోఁడిమి సేవసేయరే పుణుఁగుకాపు ॥**

**పన్నీటి కాలువలు పారీనిఁ జూడరే**

**అన్నిటాఁ గొండవంటి శ్రీహరిమీఁదను**

**యెన్న నభిషేక మంత్రాలిదె చెప్పేరు వినరే**

**తిన్నని పుణుగుకాపు దేవునికి నేఁడు ॥** అని అభిషేకోత్సవాన్ని వర్ణించాడు అన్నమయ్య.

శ్రీవేంకటేశ్వరునికి జరిగే అనేక ఉత్సవాలలో గొప్పగా, జరుపబడే ఉత్సవమే బ్రహ్మోత్సవం. అన్నమయ్య బ్రహ్మోత్సవాలలో తిరుమలకు చేరే భక్తబృందాన్ని గూర్చి

**నానాదిక్కుల నరులెల్లా**

**వానలలోనె వత్తురు గదలి**

**సతులు సుతులుఁ బరిసరులు బాంధవులు**

**హితులు గొలవఁగా నిందరును**

**మగుటవర్ధనులు మండలేశ్వరులు**

**జగదేకపతులుఁ జతురులును ॥** బ్రహ్మోత్సవాల్లో వేంకటపతిని దర్శించడానికి, వస్తారని కీర్తించాడు.

తిరుమలలో జరిగే బ్రహ్మోత్సవాల వాహనసేవల క్రమాన్ని అన్నమయ్య కీర్తించాడు.

**తిరువీథుల మెరసీ దేవదేవుఁడు**

**గరిమల మించిన సింగారములతోడను ॥**

అనే సంకీర్తనలో 9 రోజుల పాటు జరిగే వాహనసేవలైన తిరుదండెలు, శేష, ముత్యాలపందరి, గరుడ, ఏనుగు, సూర్య, అశ్వ, కనకపుటందలాల్లో స్వామి వూరేగిన వైభవాన్ని కీర్తించాడు. తిరుమలలో జరిగే కల్యాణోత్సవ వైభవాన్ని అన్నమయ్య దాదాపు వందకుపైగా కీర్తనలో రచించాడు.

**పసిడి యక్షంతలివెపట్టరో వేగమే రారో**

**దెసల బేరటాండ్లు దేవుని పెండ్లికిని॥** అని కీర్తించాడు.

అన్నమయ్య సంకీర్తనల్లో ఉత్సవాలలో శ్రీవేంకటేశ్వరవైభవాన్ని గూర్చి ప్రత్యేకంగా చెప్పడానికి ఎంతో అవకాశం వుంది.

**జానపద వైభవం**

జానపదగేయాలు సులభశైలిలో సాగేరచనలు. అన్నమయ్య వైష్ణవమత వ్యాప్తికోసం వాడవాడల సంచారం చేసాడు. భాగవత తత్వాన్ని సామాన్యులకు తెలిపే ప్రయత్నంలో అన్నమయ్య పదాల్లో అనేక విధ లైన జానపదగేయరీతులు చోటుచేసుకొన్నాయి. దేశికవితాప్రక్రియకు చెందిన మేలుకొలుపు, తందనాన, కోలాటం, దివ్యనామ, గొబ్బిళ్లు, నృత్యాత్మక మొదలుగా ఎన్నో జానపదప్రక్రియల్లో శ్రీవేంకటేశ్వరుని కీర్తించాడు అన్నమయ్య. ఈ సృష్టిలో వుండే సమస్తం ఎల్లప్పుడూ పరిణామం చెందుతూ వుంటుంది. కానీ ఎలాంటి మార్పు లేకుండా శాశ్వతంగా, స్థిరంగా వుండేది పరబ్రహ్మమొక్కడే! ఈ తత్వాన్ని అన్నమయ్య.

**తందనాన ఆహి తందనాన పురె**

**తందనాన భళా తందనాన ॥**

**బ్రహ్మమొకటె పరబ్రహ్మ మొకటె పర**

**బ్రహ్మ మొకటె పరబ్రహ్మమొకటే**

**కందువగుహీనాధికము లిందు లేవు**

**అందరికి శ్రీహరే అంతరాత్మ ॥**

**కడుఁ బుణ్యులను పాప కర్ములను సరిగావ**

**జడియు శ్రీవేంకటేశ్వరు నామమొకటే ॥**

భగవంతుడైన శ్రీవేంకటేశ్వరునికి హీనాధికాలుండవని సామాన్యులకు "తందనాన" గేయసరళిలో వెల్లడించాడు అన్నమయ్య.

జానపదులు పాడుకొనే దివ్యనామ సంకీర్తనల్లో శ్రీవేంకటేశ్వరుని స్తుతించాడు.

(i) శోభనమే శోభనమే - వైభవముల పావనమూర్తికి

(ii) కొలనిదోపరికి గొబ్బిళ్లో - యదుకుల సామికిని గొబ్బిళ్లో

(iii) అంగనలీరే యారతులూ - అంగజగురునకు నారతులూ ॥ మొదలుగా ఎన్నో జానపదకీర్తనల్లో వేంకటేశ్వరుని కీర్తించాడు అన్నమయ్య.

**క్షేత్రవైభవం**

భారతీయ సంస్కృతిలో పుణ్యక్షేత్ర దర్శనం, తీర్థస్నానాలుచేయడం, దేవతామూర్తులను సేవించడం ఒక సంప్రదాయం. ఆంధ్రదేశంలోని అనేక దేవాలయాలను దర్శించి శ్రీవేంకటేశ్వరునికి ఆయాక్షేత్రమూర్తులకు అభేదత్వం పాటిస్తూ అనేకమైన సంకీర్తనలు రచించాడు.

**అన్నిచోట్లఁ బరమాత్మ నీవు**
**యిన్నిరూపుల భ్రమయింతువుగా ॥**
**భూలోకనిధివై పురుషోత్తమాన నుండి**
**వేలసంఖ్యలరూపై విచ్చేతుగా ॥**
**కైవల్యమున నుండి కమలజలోకాన**
**మోవఁగ శ్రీరంగమున నుండి**
**యీవల నావల నుండి యీవేంకటాద్రిపై**
**నీవే నీవే వచ్చి నెలకొంటిగా ॥**

శ్రీవేంకటేశ్వర వైభవాన్ని గూర్చి అన్నమయ్య వర్ణించిన కీర్తనలు అనన్యసామాన్యం.

**అన్ని విభవముల అతఁడితఁడు**
**కన్నులు వేవేలుగల ఘనుఁడితఁడు ॥**

**గరుడని మీదటి ఘనుఁడితఁడు**
**సిరులిందరికి నిచ్చే చెలువితఁడు**
**తిరువేంకటనగము దేవుఁడితఁడు**
**పరమ పదమునకు ప్రభుఁడితఁడు ॥**

# అన్నమాచార్య సంకీర్తనలు - ఆగమ సంప్రదాయ విశేషాలు

డా॥ వి. రాజగోపాల చక్రవర్తి

కలియుగ ప్రత్యక్షదైవము, భక్తులకు, కొంగుబంగారము అయిన శ్రీవేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని ప్రాభవాన్ని అన్నమాచార్యులు ముప్పదిరెండు వేల సంకీర్తనల ద్వారా భక్తలోకానికి అందించాడు. అన్నమయ్య తిరుమల ఆలయాన్ని ఆలంబనగా చేసుకొని, తాను నమ్మిన వైష్ణవమతాన్ని, శ్రీవేంకటేశ్వర తత్త్వాన్ని మహత్త్వాన్ని సంకీర్తనలరూపంలో సమకాలీనసమాజానికి అందించాడు. ఈ సందర్భంగా తన ఆధ్యాత్మిక సంకీర్తనలలో తిరుమల ఆలయ అంశాలు, సామాజిక విధానము, ఆధ్యాత్మిక అంశాలు పొందుపరిచాడు. అనేక ప్రాంతాలు పర్యటించి. అక్కడున్న దేవతామూర్తులను అన్నమయ్య కీర్తించాడు. సూక్ష్మంగా పరిశీలించితే అన్నమయ్య సంకీర్తనలలో వేదప్రతిపాదిత అంశాలు, ఉపనిషత్ రహస్యాలు, పౌరాణిక విషయాలు, ఇతిహాసకథనాలు, ఆగమసంప్రదాయ విశేషాలు మనకు అందివస్తాయి.

**ఆగమము అంటే**

ఆలయ నిర్మాణము, ప్రతిష్ఠా విధానము, అర్చనారీతులు తెలియచేసే గ్రంథాలను ఆగమాలు అని వ్యవహరిస్తారు. ఆగమానికి అనుగుణంగా, లేక ఆగమవిహితంగా, కొన్ని సంప్రదాయాలు కూడా ఆలయంలో స్థానిక ఆచారవ్యవహారాలకు అనుబంధంగా సాగుతుంటాయి. తిరుమల ఆలయం అనేక సంప్రదాయాలకు నిలయం. ఆలయంలో జరిగే ఆగమ-సంప్రదాయాలను తన కీర్తనలలో చక్కగా నిక్షిప్తంచేశాడు అన్నమయ్య. భగవంతుడిని సాకారరూపంగా అనగా దివ్యమంగళ విగ్రహరూపంలో ప్రతిష్ఠించి, అర్చించి తద్వారా లోకానికి శ్రేయస్సును కలిగింపచేయటానికి ఆవిర్భవించిన ఆగమాలకు భగవత్‌శాస్త్రాలు అని పేరును మహర్షులు స్థిరీకరించారు. విగ్రహారాధన అన్ని వర్గాల ప్రజలకు శుభాన్ని చేకూరుస్తుంది "అవిచ్ఛిన్నం శాశ్వతం నిత్యం ప్రతిమారాధనం పరమ్- ఆగమోక్త విధానేనకలౌదేవాన్యజేత్సుధీ" అనే వాక్యాలవల్ల విగ్రహారాధన ఆగమప్రాశస్త్యం మనకు అర్థమవుతుంది. భగవంతుడు సాకారము- నిరాకారము, సగుణము- నిర్గుణము, కళాపూర్ణుడు-నిష్కళుడు, అంతరాత్ముడు-ఆనంద విగ్రహస్వరూపుడు. అన్నమయ్య ఈ భావనతో రచించిన సంకీర్తనచూడండి.

**ఏదియుఁగానఁడు (గాన నందు?) నేదిగాదందు- ఆదిపురుష నీదాస్యమేచాలనాకు**

**గరిమఁగొందరికి సాకారమై నిలిచితి-గురునిరాకారమైకొందరికి**

**సరుసఁ గొందరికెల్లా సగుణుఁడవటనీవు-ధరనిర్గుణమవటతగిలికొందరికి**

**వొకటిఁగళాపూర్తి నొనరియుందువట వొకట నిష్కళుఁడనైవుడివోవట**

**వొకచోజీవుల (కు) నీ కొరయభేదమట-వొకచోనె (న?) భేదమటవున్నారటనీకు**

**అందననిందరిలోన నంతరాత్ముఁడవట-యెదుట శ్రీవేంకటేశుఁడవట**
**యిదియదియననేలయింతయును నీమహిమ-కదిసినీపాదాలే కనుఁగొంటగాక**

**ఆగమశబ్ద ప్రయోగాలు**

అన్నమయ్య తన సంకీర్తనలో ఆగమశబ్దాన్ని వేదార్థంలో కాకుండా ఆలయసంబంధిత అర్థంలోనే ప్రయోగించినట్లుగా తెలుస్తుంది.

ఉదా: 1. భాగవతములోఁజెప్పెబలరాము తీర్థయాత్ర
నాగమోక్తమైన దైవమాతఁ డితఁడే

2. ఆగమోక్త విధులందు నలరిననిత్యుఁడు

3. ఆగమభోగములకు హరినాలోనున్నవాడు

4. అంతరంగుఁడును నర్వావతారము
నింతయు శ్రీవేంకటేశ్వరుఁడే

5. ఆగమోక్తమీహరి కైంకర్యము

అన్నిచోట్ల వ్యాపించిన పరమాత్మ విగ్రహరూపంలో ఆలయంలో ప్రతిష్ఠితమై అర్చనలు అందుకొంటూ భక్తులను అనుగ్రహించే విధాన స్వరూపాన్ని తెలియచేసే 'ఆగమ' విధానాన్ని అన్నమయ్య ప్రస్తుతించాడు. ఆగమ ప్రకారంగా పూజలందుకొనే పరమాత్మయొక్క సాకారరూపక్షేత్రాలను అన్నమయ్య సంకీర్తించాడు.

ఉదా :

**అన్నిచోట్లఁ బరమాత్మనీవు**
**యిన్నిరూపుల భ్రమయింతువుగా**
**పాలజలధి నుండి బదరీవనాన నుండి**
**ఆలయమైగయలోఁబ్రయాగనుండి**
**భూలోకనిధినై పురుషోత్తమాననుండి**
**వేలసంఖ్యలరూపై విచ్చేతుగా**
**వుత్తరమధురలో నయోధ్యలోపలనుండి**
**నత్తైననందవ్రజాననుండి**
**చిత్తగించి పంచవటి సింహాద్రిలోననుండి**

**వత్తుగాలోకములు పావనము సేయఁగను**

**కైవల్యమునమండి కమలజలోకాన**

**మోవఁగ శ్రీరంగమునమండి**

**యీవల నావలమంచి యీ వేంకటాద్రిపై**

**నీవే నీవే వచ్చి నెలకొంటిగా**

పై క్షేత్రాలన్నీ స్వయంభువక్షేత్రాలుగా ప్రసిద్ధిని పొందాయి. వీటిల్లో తిరుమల దివ్యక్షేత్రం మరింత ప్రసిద్ధిని పొందినది. శ్రీవేంకటేశ్వరస్వామి స్వయంభువుగా కోరి నిలిచిన క్షేత్రం ఇది. అందుకే "నీవే నీవేవచ్చినెలకొంటిగా" అని అన్నమయ్య పేర్కొంటున్నాడు. ఈ అంశం మనం గమనించగలగాలి.

తిరుమలలో వైఖానసాగమము ద్రావిడ వేదసంప్రదాయాలు- స్థానిక ఆచారవ్యవహారాలు ముప్పేటలా ముడివేసికొని ఉంటాయి. 'స్వయంవ్యక్తం దివ్యమార్షం పౌరాణం మానుషమితి పంచస్థానాని భగవతః కృపయాఽనుగృహీతాని" అనే వాక్యాన్ని బట్టి 5 విధాలుగా విభజింపబడిన ఆలయాలలో 'స్వయంవ్యక్తి' ఆలయం మహామహిమాన్వితంగా ప్రకాశిస్తుంది. ఇతర గ్రంథాలద్వారా భారతదేశంలో ఎనిమిది స్వయం వ్యక్తక్షేత్రాలున్నాయని తెలియవస్తుంది. అయితే తిరుమలకున్న వ్యాప్తి అనన్యసామాన్యమైనది. వేంకటాచల మాహాత్మ్యం, తమిళసాహిత్యం, శాసనాలు, తెలుగుసాహిత్యం, సంస్కృతసాహిత్యం, సంప్రదాయ గ్రంథాలు, స్థానిక కథలు, గాథలు, ఆలయం లోపల బయట దైవసంబంధితకార్యక్రమాలు, ఆలయనిర్మాణ రీతులు ముఖ్యంగా అన్నమయ్య సంకీర్తనలు, అన్నమయ్య వంశీకుల సాహితీ ప్రక్రియ గ్రంథాలు, దేవస్థానపరిపాలనా సంబంధిత రికార్డులు మొదలైనవి రేఖామాత్రంగా పరిశీలిస్తే ఈనాడు మనం చూస్తున్న ఆలయకార్యక్రమాలు ఎన్నోమార్పులు చేర్పులు కూర్పుతో ఈనాటిరూపంలో మనకు కనిపిస్తుందనటంలో అతిశయోక్తి ఏమీలేదు. కాలానుగుణంగా భక్తులకోసం ఈ అనివార్యమైన మార్పు మనకు కనిపిస్తుంది. భౌతికంగా మార్పుకనిపిస్తున్నా అంతర్లీనంగా అనుస్యూతంగా ఆగమ సంప్రదాయాలు కలిసి ఒక విశిష్టమైన రీతిలో ఆలయంలో కొనసాగుతున్నాయని చెప్పటంలో ఎటువంటి విప్రతిపత్తిలేదు.

**ఆగమం-సంప్రదాయం**

అన్నమయ్య సంకీర్తనలలో నిత్యోత్సవాలు, వారోత్సవాలు, మాసోత్సవాలు, నక్షత్రోత్సవాలు, జయంతి ఉత్సవాలు, బ్రహ్మోత్సవాలు సంప్రదాయవిశేషాలు, పర్వోత్సవాలు, వివిధ ద్రావిడ వేదాంత విశేషాలు మనకు మనోజ్ఞంగా కనిపిస్తాయి. అన్నమయ్య తన సంకీర్తనలలో ఆగమ అంశాలకు సంప్రదాయ అంశాలకు సమమైన

ప్రాధాన్యత ఇచ్చినట్లుగా మనకు కనిపిస్తుంది. ఒక సంప్రదాయకీర్తన చూడండి. ఇది ధనుర్మాసానికి సంబంధించి నది. నిజానికి ధనుర్మాసం పూర్తిగా ఆగమ సంబంధ అంశంకాదు. మాసార్చనా విధానం ఆగమవిహితం అయిన తిరుమల ఆలయంలో- వేలాది ఆలయాలలో ఆగమసారభంలో ధనుర్మాస పుష్పార్చన శ్రీవారికి సమర్పించ బడుతుంది. చూడండి ఈ ధనుర్మాస సంకీర్తనా వైశిష్ట్యం.

ఉదా :

ఏమినిద్దిరించేవు యెందాఁకాను-కామించి బ్రహ్మేంద్రదులెల్లఁగాచుకున్నారిదివో ॥పల్లవి॥

పులుఁగాలుఁ బచ్చళ్ళు బోనముపెట్టినదిదే- వెలయు ధనుర్మాసవేళయునిదే
బలసి సంకీర్తనపరులుపాడేరిదే-జలజాక్షుఁడ లేచి జలకమాడవయ్యా ॥ ॥ఏమి॥

తోడనే గంధాక్షతలు ధూపదీపాలివిగో-కూడినవిప్రులవేదఘోషణలివే
వాడుదేరఁ బూచింవలెఁ గమ్మఁ బువ్వులివె-పీడెమిదె కొలువుకు విచ్చేయవయ్యా ॥ఏమి॥

చదివేరు వైష్ణవులు సారెఁ దిరువాముడిదె-కదిసి శ్రీసతిముందేకాచుకున్నది
అదనాయశ్రీవేంకటాధిపమాచరపిదే- యెదుట నిన్నటి మాపేయియ్యకొంటివయ్యా ॥ఏమి॥

## నిత్యారాధనము-సేవలు

ప్రతిరోజూ ఆలయంలో శ్రీవారికి నిత్యారాధన- సేవలు ఆగమ విహితంగా సంప్రదాయబద్ధంగా అర్చక స్వాములు నిర్వహిస్తుంటారు. మేలుకొలుపు నుంచి ఏకాంతసేవ వరకు జరిగే నిరంతరాయ దైవకార్యక్రమాలలో కొన్నిటిని అన్నమయ్య తన సంకీర్తనలలో అభివర్ణించాడు. 500 సంవత్సరాల నాటి ఆలయ ఆగమ సంప్రదాయ విశేషాలను ఈ సంకీర్తనల ద్వారా మనం తెలుసుకోవచ్చును. ప్రస్తుతవ్యాసంలో కొన్ని అంశాలు పరిశీలించ వచ్చును.

## సుప్రభాతం - మేలుకొలుపు

వైఖానసాగమ ప్రకారంగా అన్ని దేవాలయాలలో మంత్రపూర్వకంగా తలుపులు తెరవటం, శయనమూర్తిని ధ్రువమూర్తి దగ్గర వేంచేపు చేయటం జరుగుతుంది. ఈ ఆగమవిధానము అనలుకొనలు సాగి సుప్రభాత పరనం- సేవగా తిరుమలలో జరుగుతుంది. ఈనాడు ఆంధ్రదేశంలోని ఆలయాలలో సుప్రభాతసేవ జరగటానికి తిరుమల ఆలయ ప్రభావమే కారణంగా చెప్పుకోవచ్చును. కాగ అన్నమయ్య 'మేలుకొలుపు' పేరుతో ఈ ఆగమసేవావిధానాన్ని అనేక విధాలుగా వర్ణించాడు.

ఉదా:

1. ఎందాకనిద్రనీకిది తెల్లవారెగదె-యిందిరారమణనీవిటుమేలుకొనవె...
2. భోగిశయనము బుసకొట్టెడిని-యోగనిద్రపాయును మేల్కొనవే...
3. మేదిని జీవులఁగావమేలుకోవయ్యా-నీదయే మాకెల్లరక్షనిద్రమేలుకోవయ్యా
పొరసి నీవు నిత్యభోగములు భోగించ-నిరతి శ్రీవేంకటేశ నేఁడుమేలుకోవయ్యా...
4. మిన్నకవేసాలుమాని మేలుకోవయ్యా-సన్నల నీ యోగనిద్ర చాలుమేలుకోవయ్యా...
అలరిన శ్రీవేంకటాద్రిమీఁది బాలకృష్ణ యిలమామాటలు వింటివిఁక మేలు కోవయ్యా

బహుశః చివరి సంకీర్తన ఉత్థాన ఏకాదశికి గాని, ధనుర్మాసానికిగాని సంబంధించినదై ఉండవచ్చును.

**నివేదనలు**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి జరిగే నివేదనల భోగాలు ఆంధ్రదేశంలో మరి ఏ ఇతర ఆలయాలలో జరగవు. అంతవైభవం శ్రీవారిది!! త్రికాలాలలో స్వామివారికి ఘనంగా నైవేద్యాలు సమర్పించబడతాయి. అన్నమయ్య వివిధ సందర్భాలలో స్వామివారికి సమర్పించబడే ప్రసాదాలను వర్ణించటం జరిగింది.

ఉదా:

**ఇందిరవడ్డించ నింపుగను**
**చిందక యిట్లే భుజించవోస్వామి**

**అక్కాళపాశాలు నప్పాలువడలు**
**పెక్కైన సయిఁదంపుపేణులును**
**సక్కెరరాసులు సద్యోఘృతములు**
**కిక్కిరియనారగించవో స్వామీ!**

**మీరినకెళంగు మిరియపుఁ దాళింపుఁ**
**గూరలుకమ్మనికూరలును**
**సారంపుఁ బచ్చళ్ళుచవులుగనిట్టే**
**కూరిమిలోఁ జేకొనవో స్వామీ!**

**పిండివంటలునుఁ బెరుగులుఁ బాలు**
**మెండైనపాశాలుమెచ్చిమెచ్చి**

**కొండలపొడవుకోరి దివ్యాన్నాలు**
**వెండియుమెచ్చవే వేంకటస్వామి!**

### ఊంజల్

అన్నమయ్య అనేక ఊయలపాటలు సంకీర్తనలరూపంలో మనకు అందించాడు. తిరుమలలో మధ్యాహ్నం వేళ డోలోత్సవం, సాయంకాలం వేళ ఊంజల్ సేవ కార్యక్రమాలు ప్రసిద్ధిని పొందాయి. రాత్రివేళ జరిగే ఏకాంత సేవ దర్శనం కొద్దిపాటి భక్తులకు పరిమితమై ఉంటుంది. అన్నమయ్య ఉయ్యాలసంకీర్తనలు అనేక విశేషాలను మనకు అందిస్తాయి.

ఉదా:

1. **అలరఁ జంచలమైన ఆత్మ లందుండనీ-యలవాటుసేసెనీవుయ్యాల**
   **పలుమారునుచ్ఛ్వాసపవనమందుండనీ-భావంబుదెలిపె నీవుయ్యాల**
2. **జనులు నమరులును జయలిడఁగా**
   **ఘనుఁడదెవుయ్యాల గంభముకాడ**

రెండవకీర్తన ద్వారా ఆలయానికి అభిముఖంగా ఈనాడు మనం చూస్తున్న గొల్లమంటపంలో ఆనాడు ఊయల్ సేవ జరుగుచున్నట్లుగా తెలుస్తుంది. ఈ సంకీర్తనలోనే తర్వాత గరుడ గంభము, నడిమి గోపురము, నీడ దిరుగని చింతాడ ప్రస్తావనలద్వారా ఆలయ అనుక్రమణిక మనకు అర్థమవుతుంది.

### శుక్రవార అభిషేకం

తిరుమల ఆలయంలో వారానికి ఒకసారి జరిగే శుక్రవార అభిషేకం విశేషమైన ప్రాముఖ్యం కలిగి ఉన్నది. ఈ అభిషేక మనోహరదృశ్యాన్ని అన్నమయ్య అనేక విధాలుగా వర్ణించాడు. "కించ లక్ష్మ్యభిషేకస్తు వాసరే భార్గవేహరేః-సాన్నిధ్యకారీ సతతం సర్వసంపత్ప్రదాయకః" అనే వాక్యం ప్రకారం తిరుమల శ్రీవారి అభిషేకం ప్రాచీనకాలం నుంచి జరుగుతూఉండేది. భగవద్రామానుజాచార్యులు ఈ అభిషేక ప్రక్రియను వైఖానసాగమ ప్రకారంగానే కట్టుదిట్టంచేసినట్లు కొన్ని తిరుమల సంప్రదాయ గ్రంథాలద్వారా తెలుస్తుంది. అన్నమయ్య కీర్తనలు చూడండి!

ఉదా:

1. **మదన జనకునికి మజ్జనవేళ-పదివేలు భోగములు పరగేనీదె**
2. **సందడి విడువుముపొసముఖా-మందరధరునకు మజ్జన వేళా**
3. **తిరుమజ్జనపు వేళ దేవునికి నిదివో-పరగనారదాదులు పాడరోయిందరును**
4. **అప్పుడు మజ్జనమాడీనంగనగూడి-కుప్పలుఁ దెప్పలుగాఁ గ్రుమ్మరించరో**

పై వాక్యాలతో కూడిన సంపూర్ణ సంకీర్తనల ద్వారా శ్రీవారి అభిషేకానికి పన్నీరు, కర్పూరం, తట్టుపునుగు, నూతనవస్త్రాలు, ఆభరణాలు, ఆలవట్టములు, కాళింది, చామరాలు వినియోగిస్తున్నట్లుగా తెలుస్తుంది. ఈనాడు జరిగే అభిషేకాన్ని భక్తులందరూ భక్తిపారవశ్యంతో దర్శిస్తూ ఆనంద అలౌకిక ఆధ్యాత్మిక అనుభూతితో ధన్యులవుతుంటారు.

**బ్రహ్మోత్సవాలు**

తిరుమలలో శ్రీవేంకటేశ్వరస్వామివారికి జరిగే అన్నిఉత్సవాలలో బ్రహ్మోత్సవాలు విశేషమైన ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. వైఖానసాగమ ప్రకారంగా ఈ బ్రహ్మోత్సవాలు నిర్వహించబడుతుంటాయి. బ్రహ్మస్వయంగా ఈ ఉత్సవాలు నిర్వహించాడు కాబట్టి బ్రహ్మోత్సవాలు అనే ప్రతీతి ఏర్పడింది. వేంకటాచలమాహాత్మ్యం గ్రంథప్రకారం తొండమాన్‌చక్రవర్తి ఆలయాదులు నిర్మించిన పిమ్మట ఈ బ్రహ్మోత్సవాలు మొదటిసారిగా జరిగాయి. అన్నమయ్య తనకాలంనాటి వైఖానసాగమ ప్రకారం జరిగే బ్రహ్మోత్సవాలు, వాహన సేవలు రమణీయంగా కమనీయంగా వర్ణించాడు. ఉదా: తిరువీధుల మెరసీదేవదేవుడు- గరిమలమించిన సింగారముల తోడను.. అనే సంకీర్తన ద్వారా నాటి వాహన విశేషాలు మనకు తెలుస్తాయి. ఆగమ సంప్రదాయ ప్రకారంగా అందరినీ ఉత్సవాదులకు ఆహ్వానించటం, అయిన పిమ్మట వీడ్కోలు పలకటం మొదలైన అంశాలను అన్నమయ్య అక్షరీకరించాడు. "నానాదిక్కులనరులెల్లా వానలలోననె వత్తురు గదలి"; "భోగీంద్రులును మీరుఁబోయిరండు- వేగనమీఁదటవిభవాలకు". అన్నమయ్య సంకీర్తనలద్వారా బ్రహ్మోత్సవాలలో చివరన పుష్పయాగం జరుగుచున్నట్లుగా తెలుస్తుంది. ఇది ఆగమవిహితమైన అంశమే! అయితే నేడు తిరుమలలో బ్రహ్మోత్సవాలలో భాగంగా పుష్పయాగం చేయటంలేదు. కార్తీకమాసంలో పుష్పయాగాన్ని ఆర్జితసేవగా నిర్వహించటం జరుగుతుంది.

**ప్రతిష్ఠా విధులు**

అన్నమయ్య కొన్ని సంకీర్తనలలో ఆగమప్రకారంగా ఆలయాలలో భగవంతుడిని విగ్రహరూపంలో అర్చావతారంగా ప్రతిష్ఠించే విధానాలు వర్ణించాడు. అన్నమయ్య సంకీర్తనలలో రెండిటిని చూడండి.

ఉదా:

**1. యజ్ఞమూర్తి యజ్ఞకర్తయజ్ఞ భోక్తవిన్నిటాను-యజ్ఞాదిఫలరూప మిటునీవైవుండవే**
**పరికించ జీవులకు ప్రాణమవైననీకు- నిరతిఁబ్రాణ ప్రతిష్ఠ నేముసేసేమా**
**మరిగి మా పూజలంది మమ్ముఁ గాచెడికొరకు- హరివీమూర్తి ప్రాణమావహించవే**
**జగతికి నీపాదజలమే సంప్రోక్షణ-జిగినీకుసంప్రోక్షణసేయువారమా**

పగటున నన్ను నేఁడు పావనముసేయుటకు-అగుపుణ్యతీర్థముల అభిషేకమందవే
వేదములుదెచ్చిన శ్రీవేంకటేశ నేము నీకు-వేదమంత్రముల పూజావిధిసేసేమా
యీదెస నీదాసులమయిన మమ్ముఁగాచుటకు- వేదమూర్తివై యిందేవిచ్చేసివుండవే

2. నేముసేసేయందుమారునీవే చేకొంటివి-నేమవు నాపూజలెల్లా నీకు నెక్కెనయ్యా
పాలజలనిధిలోనఁ బవ్వళించినదియేపో-వాలివనీకు జలాధివాసము
కోలుముందై బ్రహ్మయజ్ఞకుండము లాహుతిగొని-వోలినుండే అది నీకు హోమము
అడననాపో నారాయణుఁడ వయిన నీకు అదియపోమంత్రకలాశాభిషేకము
మొదలనంతర్యామి మూర్తివయిననీకు-పదవిమీరనదియే ప్రాణప్రతిష్ఠ
అక్కున శ్రీవేంకటాద్రినలమేలుమంగఁగూడి-వొక్కటైవుండినదే నిత్యోత్సవము
లెక్కలేనివరములు లీలతో మాకిచ్చితివి-యిక్కడనే పొద్దుమాయింటనుండవయ్య

ఆగమప్రకారంగా ప్రతిష్ఠించే విగ్రహాలకు జలాధివాసం, క్షీరాధివాసం, చతుర్దశ కలశస్నపనం, హోమాలు, ప్రాణప్రతిష్ఠ జలాధివాసము, (కళావాహన) మొదలైనవి చేయటం జరుగుతుంది. అన్నమయ్య పై రెండు సంకీర్తనలలో ప్రాణప్రతిష్ఠ సంప్రోక్షణ, జలాధివాసము, హోమం, కలశాభిషేకం, పూజలు వర్ణించాడు. సర్వవ్యాపకుడైన విష్ణువును విగ్రహ రూపంలో ప్రతిష్ఠించటం ఆగమ విహితం అయినా, అంతకన్నా ఉదాత్త భావనతో భగవతత్త్వాన్ని శరణాగతి భావనతో వర్ణించటం హృద్యంగా ఉంది. నిత్యోత్సవమనే ఆగమ పదపరిభాషకు తిరుమల క్షేత్రంలో వేంకటేశ్వర స్వామి ఆలమేలుమంగతో కూడికొని ఉండటమే అని అన్నమయ్య నూతన నిర్వచనం ఇవ్వటం ఒక విశేషం! “యిక్కడ నే పొద్దు మాయింటనుండవయ్య” అనే వాక్యాన్ని చారిత్రకంగా పరిశీలించవలసి ఉన్నది. ఇదే విధంగా ...యిందేవిచ్చేసి వుండవే అనే వాక్యాన్ని కూడా మనం గమనించాలి. ఈ ప్రతిష్ఠాకార్యక్రమం ఎప్పుడు? ఎక్కడ అనేది కూడా పరిశోధించాల్సిన అవసరం ఉంది. దీనివల్ల క్రొత్తవిషయాలు అందివచ్చే అవకాశం ఉంది.

ఆగమంలో చెప్పిన ఉపచారాల గూర్చి అన్నమయ్య ఎన్నో సంకీర్తనలలో అనేక విధాలుగా వర్ణించాడు. నిత్యపూజలివిగో నేర్చితినోహో, షోడశకళానిధికిషోడశోపచారములు...., ఇంతకంటే నేమిసేసేమిదే మా మానస పూజ...., అనే సంకీర్తన మనం చూడవచ్చు. ఇంకా అనేక విశిష్టమైన ఆగమశబ్దాలు ప్రయోగించిన అన్నమయ్య తన సంకీర్తనలలో తిరుమల ఆలయ విశేషాలను నిక్షిప్తంచేసి భవిష్యత్తరాలకు అందించాడు. తనకాలం నాటి సంప్రదాయాలను అక్షరబద్ధం చేశాడు. అన్నమయ్య కాలంనాటి కొన్ని విశేషాలను మనం ఈనాడు పునరుద్ధరించుకోవచ్చును. భక్తలోకానికి అందించవచ్చును. దీనివల్ల శ్రీవేంకటేశ్వర వైభవం మరింతగా ప్రకాశమానమవుతుంది. శ్రీవేంకటేశ్వర వైభవాన్ని సమస్త భక్తలోకానికి అక్షరరూపంలో అందించిన ‘నందకాంశ’ సంజాతుడైన అన్నమయ్య ధన్యజీవి.

# అన్నమయ్య దృష్టిలో 'వెంకన్న' తత్త్వం

ప్రొఫెసర్ హెచ్.ఎస్. బ్రహ్మానంద

తాళ్లపాక అన్నమాచార్యుడు (15వ శతాబ్ది) 32,000 కీర్తనలతో శ్రీవేంకటేశ్వరస్వామిని వర్ణించి తరించిన మహాభక్తుడు. భగవద్విషయం తర్కానికి లొంగేదికాదు. వారివారి అనుభవమే దీనికి ప్రమాణం.

శ్రీవేంకటేశ్వరుడు ఎవరు? మహావిష్ణువు కృష్ణునిగా తన అవతారం ముగించిన పిదప శ్రీనివాసునిగా కలియుగారంభంలో అర్చామూర్తిగా రూపుదాల్చాడని వేంకటేశ్వరుని గురించిన పురాణాలు స్పష్టంగా చెబుతున్నాయి.

మరి విష్ణుస్వరూపమని తెలిసిన తరువాత కూడా 'అతర్క్య'మైన ఆ తత్త్వాన్ని గురించి ఆ నాటినుండి ఈ నాటివరకు 'పండితులు' వాదోపవాదాలుచేస్తూనే ఉన్నారు.

శివుడా! బ్రహ్మయా! శక్తి స్వరూపమా! సుబ్రహ్మణ్యుడా! నరసింహుడా!- ఏ దైవతం ఇతడు? అన్నదే వీరందరి ప్రశ్న. సామాన్య భక్తునికి 'పరమాత్మ' అని మాత్రం తెలుసు. అతణ్ణి నమ్ముకుంటే కోరిన వరాలు సిద్ధిస్తాయని తెలుసు. చివరికి మోక్ష మిస్తాడనికూడా తెలుసు. అక్కడ జరిగే పూజలతో ఆచారవ్యవహారాలతో నిమిత్తంలేని కోట్లమంది భక్తులు ఇలాఎంతో విశ్వాసంతో అత్యంత శ్రద్ధాసక్తులతో సేవించే తిరుమల దేవుడు ఎవడు? అనే ప్రశ్న బుద్ధిజీవులైన కొందరు పండితులకు మాత్రమే అవసరమైంది.

అన్నమాచార్యులు స్వామివారి ఆలయంలోనే ఎన్నో దశాబ్దాలపాటు ఉంటూ అతి గొప్ప ఆళ్వారుల నుండి, వేదపురాణపండితులనుండి, అతి సామాన్యులదాకా అందరి భక్తిప్రపత్తులు చూసినవాడు. అందుకే ఆయన స్వామివారి 'దివ్య'తత్త్వంలో అన్నీ ఉన్నాయని తెలుసుకున్నాడు. అతనిది 'రస'మార్గం. అనుభూతి ఒకటే అతనికి ప్రమాణం. జీవితంలో అందరికీ ఉన్నది ఈ 'అనుభూతి' మాత్రమే.

అందుకే ఆయన ఒక సంకీర్తనలో ఇలా అంటాడు :

**హరి నీవే సర్వాత్మకుడవు**

**యిరవగు భావన యియ్యగదే**

**చూడక మానవు చూచేటి కన్నులు**

**యేడనేమైనా యితరములు**

**నీడలనిండా నీరూపములని**

**యీడువడని తెలి వియ్యగదే**

**సారక మానదు పాపపు మనసిది**

యీరసములతో నెందైనా
నీరజాక్ష యిదినీ మయమేనని
యీ రీతుల తలపియ్యగదే

కలుగక మానవు కాయపు సుఖములు
యిలలోపల గల వెన్నైనా
అలరిన శ్రీవేంకటాధిప నీకే
యిలనర్పితమగు యీహమియ్యగదే

మనకు- అంటే పండితులకు లేనిది 'ఇరవగుభావన'. భగవంతుడు సర్వాత్మకుడు అని తెలుసుకొంటే, అతనికే అన్నీ అర్పణంచేయాలి, అనే బుద్ధి ఏర్పడుతుంది. అదే ఇరవగుభావన.

మనబుద్ధి ప్రవేశిస్తే ఏమవుతుందో చూడండి-

ఇది కల్ల యనరాదు యిది నిశ్చయింపరాదు
పదిలాన గొలువగా ప్రత్యక్షమయ్యేవు

ఎదలో నుందువని యివన్ని వేదాలు చెప్పగా
వెదకి ధ్యానము సేతు వెసకనుగొంటలేదు
చెదరకందే మరి జీవుడున్నాడందురు
పదిలముగా జాతు భావించరాదు

అంతటా నుందువని ప్రహ్లాదుడు చెప్పెననగా
చింతించి పట్టదలుతు చేతికి చిక్కుటలేదు
సంతత జ్ఞానాన నీసాకారమున్నదందురు
మంతనాన బిల్తునొకమాట వినబడదు
రవిలో నుందువని సురలు నిన్ను గొల్వగా
తవిలి పూజించేనంటే దగ్గరి వచ్చుటలేదు
యివల శ్రీవేంకటాద్రి నిరవై నీవున్నాడవు
తివిరి సేవించితిమి ద్రిష్టమాయమాకు

ప్రత్యక్షంగా భగవంతుడు ఏదో ఒక సందర్భంలో మనిషికి ఒకడుగానే అనుభవంలోకి వస్తున్నాడు. కాని మరుక్షణంలో 'అవిద్య' లో పడి చూసినా చూడలేడు, వినినా వినలేడు, పట్టుకోవడానికి ప్రయత్నిస్తాడు, సమీపించ డానికి వీలులేని సూర్యబింబంలాంటివాడని- అన్నమయ్య సిద్ధాంతం చేశాడు.

ఎవరికి స్వామి ఎవడో కనుక్కోవటం సాధ్యం? అనే ప్రశ్నకుకూడా అన్నమయ్య సమాధానం చెప్పాడు.

**నీవనగ నొకచోట నిలిచివుండుటలేదు**

**నీవనుచు కనుగొన్న నిజమెల్ల నీవే**

ఎవరు నిజంగా పండితుడు? అన్న ప్రశ్నకు సమాధానంగా ఈ లక్షణాలు చెప్పాడు.

పండితులంటే 'జ్ఞానులు' అంతే తప్ప వాదోపవాదాలు చేసేవారుకారు. భగవద్గీతలో చెప్పినట్టు ద్వంద్వాతీతులైనవారు, పరమజ్ఞాని ఎవడో, వాడు అతనితో సమానుడు- అంటే భగవత్తుల్యుడు- అలాంటివాడే స్వామివారి నిజతత్వాన్ని తెలుసుకోగలడన్నాడు అన్నమయ్య. అలాంటి పండితునికి స్వామి ఎవరైనా విప్రతిపత్తి లేదు. కావల్సింది ఆయనను ఆవలి'తత్త్వం'గా గుర్తించి అతని అనుగ్రహంకోసం 'శరణాగతి' చేయటమే. అందుకే మరొక సంకీర్తనలో ఇలా కీర్తించాడు;

**ఎంతమాత్రమున ఎవ్వరుగొలిచిన అంతమాత్రమే నీవు**

**అంతరాంతరము లెంచి చూడ పిండంతే నిప్పటి యన్నట్లు**

**యే యథామాం ప్రపద్యంతే-తాంస్తథైవ భజామ్యహమ్** అని భగవద్గీతలో స్వామివారు సెలవిచ్చినట్టే శ్రీవారి విషయంలోనూ అంతే- 'నీవు ఎలాచూస్తావో నీకు నేను అలాకనిపిస్తాను'అంటాడు స్వామి.

హిందూధర్మంలోని ఒక వైశిష్ట్యం ఏమిటంటే అర్చారూపంలో (విగ్రహంలో) మనం చూసేది మన ఇష్ట దైవాన్ని. పూజించేది ఆ దైవాన్నే. విగ్రహాల్నికాదు. భగవద్రామానుజులకు శ్రీవేంకటేశ్వరస్వామి ఎలా కనిపించారో చూద్దాం.

**అఖిల భువనజన్మ స్థేమ భంగాదిలీలే**

**వినతవివిధ భూతవ్రాత రక్షైకదీక్షే**

**శ్రుతిశిరసి విదీప్తే బ్రహ్మణి శ్రీనివాసే**

**భవతు మమ పరస్మిన్ శేముషీ భక్తిరూపా ॥**

సృష్టిస్థితిలయాలను 'లీల'గా నిర్వహించేవాడు, సకలభూతరాశిని రక్షించటమే దీక్షగాకల్గినవాడు, వేదాల చివరిదైన ఉపనిషత్తులో భాసించే ఆత్మతత్త్వమూర్తి పరబ్రహ్మ తత్త్వమూ- వేంకటేశ్వరుడని ఆయనవర్ణించాడు.

ఒకే తత్త్వమే భగవంతుడు. ఒకోపని చేసేటప్పుడు ఒకో పేరుతో పిలుస్తాం. సృష్టి చేసేటప్పుడు బ్రహ్మ. స్థితి నిర్వహించేటప్పుడు విష్ణువు. నశింపచేసేటప్పుడు శివుడు- ఈ ముగ్గురికీ అతీతమైన పరతత్త్వంగా 'గోవిందు'ని మనం దర్శించడం నేర్చుకోవాలి- అని అన్నమయ్య సులభంగా ప్రబోధించాడు.

ఇంత ఉదారంగా ప్రబోధించిన అన్నమయ్య చివరికి ఇలా అన్నాడు :

**పొడైన ఎరుకతో బంధమోక్షములొక్క**
**గాడికట్టుట తెలివిగావకే కాదా ॥**

**భావించి నిమ పరబ్రహ్మమనివేదములు**
**వేవేలు విధుల మొరవెట్టగాను**
**కేవలపు నిన్ను తక్కివ దైవములగూర్చి**
**సేవింపుటిది తప్పుసేయుటే కాదా**

**పరిలేని విన్ను ఉపనిషద్వాక్యములె పరా**
**త్పరుడవని నలుగడల బలుకగాను**
**వరుసతో పెక్కుదైవములు సంగడినిన్ను**
**తొరల గొలుచుట మహాద్రోహమే కాదా**

**ఎందు జూచిన పురాణేతిహాసములు నీ**
**చందమే యధికమని చాటగాను**
**కందర్పజనక వేంకటగిరి స్వామినీ**
**కందు వెఱగని యజ్ఞానమే కాదా**

విష్ణుతత్త్వానికి ఉన్న ప్రత్యేకత అం టా ఉండటమే, అన్నిరూపాలూ పొందటమే. సగుణ నిర్గుణ తత్త్వాలు రెండూ అందులో ఉన్నాయి. వైఖానస . మాత్రమే దీన్ని గుర్తించింది.

**ఏకో విష్ణుః మహద్భూతమ్ పృథఙ్భూ న్యనేకశః**

**త్రీన్‌లోకాన్ వ్యాప్య భూతాత్మా భుం విశ్వభుశవ్యయః**

అంచేత ఆయన్ని పూజిస్తేచాలు. సకల దేవతల్ని పూజించినట్టే. శ్రీహరి విషయాలు ఇంతే. ఇక్కడ అన్యదేవతా స్మరణ అనవసరం. అలా చేస్తే స్వామివారికి ద్రోహం చేసినట్టు జ్ఞానమంటే అదే.

# దయాశతకము - శ్రీవేంకటేశ్వరుడు

డా॥ సముద్రాల లక్ష్మణయ్య

భగవంతుని స్వరూపం పర-వ్యూహ-విభవ-అంతర్యామి-అర్చాభేదాల ననుసరించి ఐదు విధాలుగా ఉంటుంది. అందులో అర్చారూపములో ఉన్న దేవుడు వారు, వీరు అనక ఎల్లవారికి భజనీయుడై ముక్తిప్రదాత అవుతున్నాడు.

తిరుమలలో వెలసిన శ్రీవేంకటేశ్వరుడు అర్చామూర్తి యైన భగవానుడే. ఈ దేవుడు పాపపరిహారకుడనీ, అమృతత్వాన్నీ, ఐశ్వర్యాన్నీ ప్రసాదించే కరుణామయుడనీ-

**సర్వపాపాని వేంప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే ।**
**వేంకారోఽమృత బీజంస్యాత్కటమైశ్వర్య ముచ్యతే ॥**

ఇత్యాది ప్రమాణవచనాలు ఉద్ఘోషిస్తున్నాయి.

**వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తి కించన**
**వేంకటేశసమో దేవో నభూతో నభవిష్యతి॥**

ఇత్యాదిగా పురాణాలు శ్రీవేంకటేశ్వరవైభవాన్ని నిశ్చప్రచంగా ప్రకటిస్తున్నాయి.

సంసార సాగరంలో పడిన మనము ముక్తితీరం చేరడానికి ప్రయత్నిస్తాము. ఇందుకు కర్మయోగం, భక్తియోగం, ధ్యానయోగం మరియు జ్ఞానయోగమనే నాల్గు యోగాలు సాధనాలుగా శాస్త్రాలు పేర్కొంటున్నాయి. ఈ యుగంలో భక్తి యోగ మొకటే సులభమైన తరణోపాయమని పెద్దలన్నారు.

భక్తి కంటే గూడ ప్రపత్తి సులభతరమైన ముక్తిసాధనమని శ్రీభగవద్రామానుజులు మున్నగు వైష్ణవాచార్యులు నొక్కివక్కాణించారు. భగవద్గీతలో పరమాత్మ-

**సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ ।**
**అహం త్వా సర్వపాపేభ్యో మోక్షయిష్యామి మాశుచః ॥**

అన్న చరమశ్లోకంలో ప్రపత్తిని గురించి చెప్పిన మాటలు అందరికీ తెలిసినవే.

ప్రపత్తిని గూర్చి తెలిపే గ్రంథాలు చాలావున్నాయి. అందులో శ్రీవేంకటేశ్వరుని దయాదేవిని స్తుతించే దయాశతకం అగ్రగణ్యమనడం నిస్సంశయం. దీనిని భగవద్రామానుజుల తరువాత అంతటి మహనీయులుగా ప్రసిద్ధికెక్కిన శ్రీవేదాంతదేశికులవారు రచించారు.

వీరు 13వ శతాబ్ది ఉత్తరార్ధంలో జన్మించారు. శతాధికంగా గ్రంథాలు రచించారు. "సర్వతంత్ర స్వతంత్రులుగా, కవి తార్కిక సింహులుగా, వేదాంతాచార్యులుగా, సమస్యా సహస్రి"గా పేరొందిన ఆచార్యవర్యులు.

వీరు ప్రపత్తి ప్రాముఖ్యాన్ని ప్రతిపాదించడానికే దయాశతక నిర్మాణం చేశారు. శ్రీవేంకటేశ్వరుని పట్ల ప్రపత్తి అనుష్ఠింపదగినదని ఈ శతకం నొక్కి వక్కాణిస్తున్నది.

ఈ శతకంలో మొదటి శ్లోకం 'ప్రపద్యే' అనే పదంతో ప్రారంభమవుతుంది. శ్రీదేవి, భూదేవి, నీళాదేవి అనే మహావిష్ణువు దేవేరులు వేరే ఉన్నారు. కాని ఆ దేవుని దయాగుణమునే ఒక దేవిగా రూపించి ఆ గుణ విశిష్టతను శ్లాఘించుటకు, ఆమె పట్ల ప్రపత్తి అనుష్ఠేయమని ప్రతిపాదించుటకు ఈ శతకం అవతరించింది.

శ్రీనివాసుని కృపారసమే ఘనీభవించి 'సప్తగిరులు'గా ఏర్పడినదని శ్రీదేశికులవారు చెప్పారు. భగవంతుడు సకల కల్యాణగుణ నిలయుడు. ఆయనలో జ్ఞానం, బలం, ఐశ్వర్యం, వీర్యం, శక్తి, తేజస్సు అనే గుణాలు ముఖ్యంగా ఉన్నాయి. కాని అన్ని గుణాలనూ మించినది దయాగుణం. అది లేకపోతే తక్కినగుణాలన్నీ దోషాలుగా మారిపోతాయని ఈ శతకం చెప్పింది.

**వృషగిరి గృహమేధిగుణాబోధచలైశ్వర్యవీర్య శక్తిముఖా: ।**
**దోషా భవేయురేతే యదినామదయేత్వయావినాభూతా: ॥**

భగవంతుని దయాగుణానికి చేతనత్వం కల్గించి ఆ దేవి పట్ల శరణాగతులైన వారు ముక్తులు కాగలరని ఈ శతకం ముక్తకంఠంతో ఉద్ఘోషిస్తున్నది.

ఈ శతకంలో దశ దశకాలు, ఉపసంహారాష్టకంతో కలిపి మొత్తం 108 పద్యాలున్నాయి. అనుష్టుప్, ఆర్య, ఔపచ్ఛందసికం, మాలిని, మందాక్రాంత, నర్కుటకం, శిఖారిణి, హారిణి, పృథ్వి, వసంతతిలక అనే ఛందస్సులు ప్రయోగించబడ్డాయి. చివర వసంతతిలక, మాలిని, శార్దూల విక్రీడితాలతో ఉపసంహారాష్టకం పూర్తి అయింది. ఇందలి ఐదుదశకాలు పదునేడక్షరాలు గల ఛందస్సులతోనే నడవడమొక విశేషం.

శ్రీవేదాంతదేశికుల కవిత్వం అత్యంత మనోజ్ఞమైనది. వారికి భాషమీద అసాధారణమైన అధికారం ఉన్నది. విశిష్టాద్వైతతత్త్వనిరూపణలో వీరు అద్వితీయులు. సుప్రభాతం తరువాత దయాశతకం శ్రీవేంకటేశ్వర పరమైన భక్తి సాహిత్యంలో ఎక్కువ ప్రజాదరణకు పాత్రమైనది. కవిత్వగుణంతో పరిశీలిస్తే సుప్రభాతం కంటె దయాశతకమే మిన్న అని చెప్పకతప్పదు. గ్రంథాంతంలో శ్రీవేదాంత దేశికులు

**"వేదాంత దేశికపదే వినివేశ్యబాలం**
**దేవో దయాశతకమేత దవాదయన్మామ్"**

అని శతకకర్తృత్వం భగవంతునికే ఆపాదిస్తూ తమ వినయాతిశయం ప్రకటించారు.

**"పలికించెడివాడు రామభద్రుండు"** అని పోతన, **"నా నాలుకపై నుండి నానా సంకీర్తనలు పూని నాచే నిన్నిట్లు పొగడించితివి"**
అని అన్నమయ్య కూడా ఈ ధోరణిలోనే తమ వినయాతిశయాన్ని ప్రకటించివున్నారు.

భగవంతుని సంకల్పమనే కల్పవృక్షం నుండి ఝుంఝూమారుతానికి మామిడికాయలు రాలినట్లు ఈ శతకంలోని పద్యాలు దొరలినాయని చెప్పడం ఆ మహనీయునికే చెల్లింది.

ఈ శతకంలో ఆచార్య పరంపరాస్తుతి, దయాగుణ ప్రాముఖ్యం, దయచే కల్గే ఉపకారాలూ, జీవుని భగవద్దయ కనికరించే విధానం, వేంకటాద్రిలో స్థావరంగానైనా జన్మించడంలోని వైశిష్ట్యం, ప్రపత్త్యంగాలు, దయాదేవియొక్క నిరతిశయ ప్రభావం, దయాస్వరూపం, భగవానుని అర్చావతారాలు, మత్స్యకూర్మాద్య వతారాలు, స్వాభీష్టముక్తి కొరకై దయాదేవిని ప్రార్థించుట- అనే అంశాలు ముఖ్యంగా నిరూపించడ మయింది.

మానవుడు ఉత్కృష్టుడనిపించుకొనుటకు వానిలో ఉత్కృష్ట గుణాలు ఉండాలి. అట్టి గుణాలలో దయాగుణమే పరమోత్కృష్టమైనది. ఇట్లుండగా ఇక దేవుని విషయములలో చెప్పవలసినదేమున్నది? దేవుడు సర్వోత్కృష్టుడై విరాజిల్లాలంటే ఆయనలో గూడ మహోత్కృష్టమైన దయాగుణం ఉండకతప్పదు. అట్టి గుణం ఉండడం వల్లనే శ్రీవేంకటాచలాధీశ్వరుడు దేవతలకు దేవతగా, ప్రభువులకు ప్రభువుగా, శరణాగతత్రాణ పారీణుడుగా వినుతిగాంచినాడు.

ఈ విషయమును అత్యంత రమణీయమైన కవితాముఖమున తేటతెల్లము గావించిన దయాశతకం నిరుపమాన మనుటలో వింత యేమున్నది?

శ్రీవేంకటేశ్వర భక్తులకెల్లరకూ దయాశతకం అనుదిన పఠనీయమై, అభీష్టఫలదాయకమై, చివరికి పునరావృత్తిరహితముక్తి ప్రదమై భాసిల్లుతుండటం మన అదృష్టఫలమే అని చెప్పకతప్పదు.

# ప్రసన్న వెంకటదాసుల సంకీర్తనలలో శ్రీనివాస వైభవం

*ఆచార్య 3. సర్వోత్తమరావు*

ఆంధ్రవాగ్గేయకారులలో తాళ్ళపాక అన్నమయ్య, పెదతిరుమలయ్య, చిన తిరుమలయ్య, క్షేత్రయ్య, రామదాసు, త్యాగయ్యలు ప్రసిద్ధులు. ఆలాగే కన్నడ కీర్తనకారులలో పురందరదాసు, కనకదాసు, విజయదాసు, ప్రసన్నవేంకటదాసు, గోపాలదాసు, జగన్నాథదాసు సుప్రసిద్ధులు. తాళ్లపాక పదకవులకు కన్నడ కీర్తనకారులకు అనేక సామ్యాలున్నాయి. వీరు విశ్వసించి సేవించిన మూర్తి శ్రీవేంకటేశ్వరుడు కావడం విశేషం. 'దేవరందరె తిమ్మప్ప' అని కన్నడ కీర్తనకారుల చెదరని కదలని నమ్మకం. అందుకే వీరందరు తిరుమలేశునిపై పదులకొలది పాటలు పాడారు. వారిలో ప్రసన్న వెంకటదాసుల శ్రీనివాస సంకీర్తనలను పరిశీలించడం ఈ వ్యాస ప్రధానాంశం.

అన్నమయ్యకు ప్రసన్నవెంకటదాసులకు ఎన్నోసామ్యాలు కనిపిస్తాయి. అన్నమయ్య రాయలసీమనివాసి. ఇంచుమించు రాయలసీమవంటి బాగలకోటలో వెంకటదాసు బాల్యం సాగింది. అన్నమయ్య క్రీ.శ. 1408-1503 వాడయితే వెంకటదాసు క్రీ.శ. 1680-1752 నాటివాడు. ఇద్దరూ వేంకటేశ్వరానుగ్రహంతో జన్మించడం మరో ప్రత్యేకత. వైష్ణవస్వీకారానికి అన్నమయ్యకు ఘనవిష్ణువు కారణమయితే సాక్షాత్ స్వామి దాసరూపంలో వచ్చి వెంకటదాసులకు 'దీక్ష' ఇప్పించాడని ఐతిహ్యం. అన్నమయ్యది శ్రీవైష్ణవమయితే దాసుల వారిది ద్వైతమతం. వివిధ క్షేత్రదర్శనం, నైతికతాప్రబోధం, నిర్మల జీవితం, శేషాచలాధీశ్వరసేవనం- లాంటివి కొన్ని సామ్యాలు. అయినా అన్నమయ్యకున్నంత ఆలయ అనుబంధం ప్రసన్నవెంకటదాసులకు లేదు. అన్నమయ్యను నుతించిన వాగ్గేయకారులు లేరుగాని, వెంకటదాసులను కీర్తించిన రమాపతి విరలదాసాదుల రచనలున్నాయి. అన్నమయ్య రచనలు 12 శతకాలు, 32 వేల కీర్తనలు, సంకీర్తన లక్షణం. రామాయణం, శృంగారమంజరి అయితే ప్రసన్నవెంకట దాసులవారు భాగవతం, సమస్తనామమణిగణ షట్పరణ పద్యమాల, నారదరు కురవంజియ వేష తాళ్ధచరిత్రె, నవవిధ భక్తియపద్యగళు, శ్రీకృష్ణపారిజాత, నారాయణ పంజర, మూడువందల దేవరనామాలున్నాయి. వాటిలో సూమారు 70 శ్రీనివాస సంకీర్తనలు. ఇరువురి జీవితాలలోను మహిమలు కోకొల్లలు కూడా. ప్రస్తుతాంశం వెంకటదాసుల సంకీర్తనలలోని ప్రాదేశిక వైభవం, మూర్తివైభవం. ఉత్సవాది వైభవాలను చర్చించడం మాత్రమే. క్రీ.శ. 17,18 శతాబ్దాలనాటి తిరుమల వైభవం తెలుసుకోవడానికి కన్నడదాససాహిత్యం కరదీపిక.

## ప్రాదేశికవైభవం

'తిరుమల' ప్రసిద్ధక్షేత్రం. తమిళసంగవాఙ్మయంలోనే తిరుమల ప్రశస్తివుంది. ఆళ్వారుల పాశురాలలో తిరుమల ప్రకృతి రమణీయంగా వర్ణితం. తాళ్ళపాక కవుల రచనలలో చెప్పపనిలేదు. ప్రసన్నవెంకటదాసులు తిరుమలను 'భూవైకుంఠావిదెందు', వైకుంఠసదనా, వైకుంఠకర్తా అని ప్రశంసించాడు. ప్రత్యేకించి స్వామి పుష్కరిణిని ఇతర తీర్థాలను అనేక సందర్భాలలో ఘనంగా కీర్తించాడు. స్వామిపుష్కర తీరనిలయనమో,

సువర్ణముఖరియాతీరది, స్వామిపుష్కరణెంబ తీర్థద నామదా మహిమేనెంబ, స్వామిపుష్కరవాస శుభమంద స్మితహాస- అని ఉల్లేఖించాడు. ఇంకా సప్తగిరులలో వెంకటాద్రి, అంజనగిరి, శేషాద్రి, గరుడాద్రి కొండలను భక్తితో కొనియాడినాడు. ప్రస్తుతం లభ్యమవుతున్న తాళ్ళపాక పదకవులలో కనిపించని 'వరాహమూర్తి వర్ణనలు' ప్రసన్న వెంకటదాసుల రచనల్లో కనిపిస్తాయి. శరణు శ్రీభూవరాహదేవనె, స్వామివరాహవెంకటనాయకా, శ్వేత వరాహవెంకటనాయకా అని కీర్తించాడు. 'భూవరాహస్వామియ సన్నిధిలి' అంటూ వరాహస్వామి ఆలయ సేవావిధానాన్ని స్పష్టంగా చెప్పాడు.

**మూర్తివైభవం**

విజయనగర రాజులకాలంలో తిరుమల వెలిగిన అంశం జగద్విదితమే. రాయలవారు ఏడుమార్లు తిరుమలకు వేంచేసి స్వామికి ఎన్నో కైంకర్యాలు నిర్వహించారనడానికి శాసన సాక్ష్యాలున్నాయి. ఆ బాటలోనే అచ్యుతదేవరాయ, సదాశివరాయలు నడిచారు. అయితే తురకల దండయాత్రలవల్ల, విజయనగర సామ్రాజ్య విచ్ఛిన్నతవల్ల కొంత క్షీణత ఉన్నా ప్రసన్న వెంకటదాసుల రచనలను బట్టి శ్రీనివాసుని వైభవానికి 'లోటు' ఏమీ లేదని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే ఆ మూర్తిని ఎన్నో కీర్తనలలో అనుభూతితో వర్ణించారు. 'వెంకటేశన మహిమెయా' అనే కీర్తనలో కిరీట కుండల విట్టను తిమ్మయ్యా, అరిశంఖవను దరిసిద, హారకేయూర కౌస్తుభ దొప్పిద, తోళబందియు కంకణముద్రికె. కీలుకడగావడ్యాణ నీలమాణిక పచ్చద ముత్తిన మాలెగళిందొప్పిద, మణిమయద కవచతొట్టు గళదలి మినుగువాభరణవిట్టు కనక పీతాంబరట్టు కటియల్లి అణుఘంటెగళెసదవు, రన్నదందుగ నిట్టహపాదకె, పొన్నావుగె మెట్టహ అని స్వామి ఆకారాన్ని మనముందు నిలిపినాడు. 'సలహు వెంకటరమణ దయాంబుధి' కీర్తనలో మాణిక్యకిరీటాన్ని, కస్తూరి నామాన్ని, వనమాలికను, వైజయంతిపతకాన్ని, ముత్యాలహారాలను, భుజకీర్తులను, కంకణముద్రికలతో శోభించే అభయవరదహస్తాన్ని, నడుమున ధరించిన ఖడ్గాన్ని, హారభూషితుని వర్ణించాడు. ఈ వర్ణనలవల్ల క్రీ.శ. 17,18 శతాబ్దాలలో స్వామి నగలేవీ అపహరింపబడలేదని స్పష్టం.

**ఉత్సవవైభవం**

సంతోషాన్ని, ఉల్లాసాన్ని కలిగించేది ఉత్సవం. ఆలయాలలో ఉత్సవాలు అనేకరకాలు. నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాదులు. తిరుమలలో అన్ని ఉత్సవాలకంటె బ్రహ్మోత్సవం ప్రసిద్ధం. హరిదాసులందరు ఈ ఉత్సవాలను దర్శించినవారే, అనుభూతితో వర్ణించినవారే. అన్నమయ్య 'వానలలోనె వత్తురు కదలి' అన్నట్లు ప్రసన్న వెంకటదాసులు 'బణ్ణిసాలమ్మనానూ- వర్ణించలేనయ్యా నేనూ' అనే కీర్తనలో 'పరుషల సొబగు'ను కనులకు కట్టినాడు. కదలివచ్చే యాత్రిక సందోహం. గుంపుగా ఛత్రచామరాదులు ధరించినవారు, కుచ్చుదండములు, పతాకములతో కదలువారు, శంఖకాహళనాదాలు

చేసేవారు. తాళతంబూరాలను పట్టి నర్తించే హరిదాసులు, కానుకల సమర్పణకోసం ఉయ్యాల, మంచాలు తెచ్చేవారు, తుమ్మెదలలాగా వచ్చే ఐదేండ్లబాలురు, యువతులు, నడివయసులవారు, ముదుసలులను వర్ణించాడు. ప్రత్యేకించి దాసులవారు హనుమ, గరుడవాహనాలను పేర్కొనడంలో మతానురక్తికూడా లేకపోలేదు.

వెంకటదాసు 'బ్రహ్మోత్సవాల' తరువాత ప్రశంసించిన ఉత్సవం 'శుక్రవారోత్సవం'. పెదతిరుమలయ్య, చినతిరుమలయ్యలు అభిషేక కీర్తనలెన్నో వ్రాశారు. వెంకటదాసు స్వామికి జరిగే పూలంగిసేవ, పునుగు అభిషేకాలను చెప్పడంలో ప్రత్యేకత ఉంది. వ్యాసరాయల వారు 'పూలంగిని' ప్రవేశపెట్టినట్లు ఆధారాలున్నాయి. ఇతర 'కాపుల'కంటె సువాసనభరితమయిన 'పునుగు' అభిషేకము దాసులవారికి నచ్చినట్లున్నది. ఆలాగే స్వామికి సాయించే ఉపచారాలను 'బిడసోనన్నంఘ్రి' కీర్తనలో పంజు (దివిటీ) సత్తిగెచామర (ఛత్రచామరాలు) లను వ్యక్తం చేసినాడు.

**ఇతరాంశాలు**

వైష్ణవములో ఉత్సవాదులు, అలంకరణల తరువాత 'ప్రసాదవైభోగం' గుర్తింపదగ్గ అంశం. తిరుమల ఆలయంలో రకరకాల ప్రసాద నివేదనలున్నాయి. అన్నమయ్య వీటిని అనురక్తితో వర్ణించినాడు. పురందరదాసు 'అతిరసమెద్ద' అన్నాడు. కనకదాసు ప్రసాదాలను అమ్ముకొనే తీరును వర్ణించినాడు. ప్రసన్న వెంకటదాసులవారు కూడా తళగీయదధ్యాన్న బలురుచి అప్పాలు బకుళన్న పొంగాలు నలెమృదుఘారిగె శిఖెనుండెణ్ణారిగె పుళితిక్త మధుమిశ్ర పులసు పాలినదోసె హలవుపరియఘృతపక్వ పంచామృత పాలత్తెంతొళె మనోహరాప్రసాద ఉండు కళె' అని దధ్యోధనాదులను ప్రశంసించినాడు.

ప్రసన్న వెంకటదాసు ప్రస్తావించిన మరో అంశం 'నీరాజనం' స్వామి ఊరేగింపువేళ భక్తులు సభక్తికంగా అర్పించే సేవలలో ఇది ఒకటి.

'నీరాజనవనెత్తిరో తిమ్మయ్యగె'లో నీరాజనాన్ని మంగళ మహిమగెలో 'ఆరతీయ బెళగిరె' అని హారతిని, జయమంగళం మహాశుభమంగళం లోనూ మంగళ అంజనగిరిపతిగె మంగళం మకరకుండల మండితాదవగె, మంగళమందిరగె మంగళ మురారిగె-లో మంగళాన్ని చెప్పాడు. ఉత్సవసమయాలలో 'సాసముఖా'లాగా పరాకు చెప్పే సంప్రదాయాన్ని 'శ్రీపతిపరాకుస్వామి మహీపతిపరాకు' కీర్తనలోనూ, జయభోజయభో జయ వేంకటేశ ప్రభో. జయకర్తా భయహర్తా అభయదాయకమూర్తేలో జయ జయ ధ్వానాలు చేశారు దాసులవారు.

తాళ్ళపాక పెదతిరుమలయ్యలాగా సంకీర్తనలను కన్నడ హరిదాసులు రాగిరేకులలో భద్రపరచివుంటే తిరుమల వైభవం, శ్రీనివాసవైభవం ఇంకా బాగా తెలియడానికి వీలుండేది. నామసార్థక్యంతో వెంకటదాసుల వారు వేంకటేశ్వరుని వైభవం కీర్తించడంలో సఫలుడయ్యాడనడంలో సందేహం లేదు.

# శ్రీవేంకటేశ్వర వైభవం - పురందరదాసులు

డా॥ జానమద్ది హనుమచ్ఛాస్త్రి

**'వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన,**
**వేంకటేశసమో దేవో నభూతో న భవిష్యతి'**

బ్రహ్మాండంలో వేంకటాద్రికి సమమైన పుణ్యక్షేత్రం లేదు. శ్రీవేంకటేశ్వరునికి సమానమైన దేవదేవుడు ఇదివరలో లేడు. భవిష్యత్తులో ఉండబోడు.

మహిమాన్వితమైన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన తిరుమల క్షేత్రం ఎందరో మహాభక్తుల సేవలందుకున్నది. విభిన్న భాషలలో విభిన్న ప్రక్రియలలో తిరుమల క్షేత్రం- తిరుమలేశుని వైభవం వర్ణింపబడింది.

ఆంధ్ర వాఙ్మయంలో పదసాహిత్యం వలె 'కన్నడ భాషలో కూడా హరిదాస వాఙ్మయం అత్యంత జనాదరణ మందుకొన్నది. హరిదాస వాఙ్మయంలో విఖ్యాతులైన శ్రీపాదరాయలు, వ్యాసరాయలు, పురందర దాసు, దాససాహిత్యామృతాన్ని పంచిపెట్టిన మహానుభావులు. ఈ త్రిమూర్తులు సప్తశైల క్షేత్రంలో కొంతకాలం వుండి ఏడుకొండల మహిమను, తనవితీర గానం చేశారు.

ఈ త్రిమూర్తులలో పురందరదాసుల స్థానం విశిష్టమైనది. "దాసరెందరె పురందరదాసరయ్య" **(దాసులంటే పురందర దాసులవారు మాత్రమే)** నని గురువులైన వ్యాసరాయల వారిచే ప్రశంసలందుకొన్న సంకీర్తనాచార్యులు పురందరదాసు. కర్ణాటక సంగీత పితామహుడుగా కీర్తింపబడుతున్న పురందరదాసులవారు శ్రీవేంకటేశ్వరస్వామిని తనివితీర కీర్తించారు. పురందరదాసు కీర్తనలు పురందరోపనిషత్తుగా ప్రశస్తినందుకొన్నవి నాదబ్రహ్మగా నుతింపబడుతున్న త్యాగరాజస్వామివారికి స్ఫూర్తిప్రదాత పురందరదాసు. లోకారాధ్యుడైన శ్రీనివాసునికి సుప్రభాతం పలుకుతూ

**"ఏళయ్య బెళగాయితు**
**ఏళు నారాయణనె**
**ఏళు లక్ష్మీరమణ**
**ఏళు శ్రీగిరియొడయ వెంకటేశ**
**దాసరెల్లను బందు ధూళి దర్శనగొండు**
**లేసాగి తాళదండియపిడిదు కేశవనే నిమ్మ సిరి**
**నామవనే స్మరిసుతరి వాసుదేవనే ఉదయదలి**
**పాడుతిహరు అరళుమల్లిగె జాజి పరిమళద**
**పుష్పగళ సురరు తందిహిరయ్య సుజన**

**రొడెయ అరవిందలోచననె కొళికూగితు కేళు**

**పురందర విఠలనే బెళగాయితు"**

(ధూళి దర్శనం = క్షేత్రమునకు విచ్చేసిన వెంటనే చేయుమొదటి దర్శనం; లేసాగి = లెస్సగా; మనోహరంగా, దండెగె = తుంబుర; అరళుమల్లిగె = వికసించిన మల్లియలు.)

కొండలరాయుడైన శ్రీవేంకటేశ్వరుని పురందరదాసులవారు ఆపాద మస్తకం వర్ణిస్తూ,

**"బందు నింతహనోడి - భూతళది వేంకట**

**ఇందిరెయ ఒడగూడి - ఒప్పున నిరంతర**

**పొంది భజనెయమాడి - ఆనంద బేడి**

**..................................................**

**త్రిదశపూజిత త్రిభువనేశ ।**

**సదువిలాసది స్వామి తీర్థది**

**ఉదిసుతిరె సిరి మహిళె సహితది**

**పదుమనాభ పురందర విఠలను**

**ముదది బ్రహ్మోత్సవది మెరెయుత"**

(త్రిదశ = దేవతలు; త్రిభువనేశ = మూడులోకాలను ఏలే దేవుడు;)

పురందరదాసులవారు శ్రీవేంకటేశ్వరస్వామిని భవరోగ విముక్తుడుగా వర్ణించారు.

**"వైద్య బంద నోడి వేంకటనెంబ**

**వైద్య బంద నోడి**

**వైద్య బందను వేదవేద్య నోడిగలె**

**శ్రీదేవి రమణను శ్రీనివాసనెంబ**

**............................................**

**ధర్మవైద్య నివ జగకెల్ల ఒబ్బనె**

**మర్మబల్ల రోగ జీవంగళ**

**నిర్మలవాగిహ తన్న నామస్మరణె**

**ఒమ్మె మాడలు భవరోగ బిడిసువ**

అన్యవైద్యనేకె అన్య ఔషధవేకె?
అన్య మంత్ర-తంత్ర-జపవేతకె?
చెన్న పురందర విఠలన్న నెనెదరె ।
మన్నిసి సలహువ వైద్య శిరోమణి ॥

(భవరోగ = సంసారమను వ్యాధి; మర్మబల్ల = గుట్టుతెలిసిన)

పరమపావనుడైన తిరుమలేశుని పాదారవిందములకు దండప్రణామాలు అర్పిస్తూ దాసులవారు

"శరణు వెంకటరమణ నిన్న
చరణవ నంబిదె నాను
కరుణాసాగర కామితఫలవీవ
శరణ భక్తర కావ గరుడవాహనదేవ

..................................................

దేశకధికవాద-నమ్మ-
శేషగిరియలి వాస
శ్రీవేంకటగిరి తిరుమలేశ
దాస దాసర సలహువ పురందర విఠల"

శ్రీనివాసుడు దయామయుడని కీర్తిస్తూ

"నేనే దయాళు నిర్మలచిత్త గోవింద

నిగమగోచర ముకుంద

..............................................

..............................................

మందర ధర అరవింద లోచన నిన్న
కందనెందెణిసో ఎన్న
సందేహవేవెకిన్ను స్వామి ముకుందనె
బందెన్న కాయో శ్రీపురందర విఠలనె"

శ్రీనివాసునిలో పురందర విఠలుని దర్శించి కీర్తించిన మహాభక్తుడు పురందరదాసు. అభయప్రదాతగా నుతులందుకొన్న శ్రీవేంకటేశ్వరుని పట్ల అచంచలమైన విశ్వాసంతో గుణగానం చేస్తూ:

"నీనిరలు నమగేతర భయవో
సనకాదిగళ ప్రియ తిరువెంగళయ్య
..........................................................
..........................................................
నీరబొబ్బుళియంతె నిత్యవెల్లవొ దే
ఘోర సంసారళు తెళలిసబేడ"

(నీరబొబ్బుళి = నీటి బుడగ)

మనస్సు చంచలమైనది. వక్రమార్గంలో పరుగుతీయటం గమనింపదగును. పురందరదాసు మనస్సును శ్రీనివాసునిలో సంలీన మొనర్చవలసినదిగా వేడుకొంటూ-

"ఎన్న మనద డొంక తిద్దిసో -శ్రీనివాస
ఎన్న మనద డొంక తద్దిసో
ఎన్న మనద డొంక తిద్ది నిన్న చరణదల్లి సేరిసో
నిన్న సేవకనాద మేలె ఇన్ను సంశయవేకె కృష్ణ
ఉదయవాదరె ఊటద చింతె
అదర మేలె భోగద చింతె
హదనాల్కు లోకంగళనాళబేకంబు చింతె
ఇదు పుణ్య ఇదు పాపవెందు
హృదయదల్లి భయవిల్లదె
మదమోహితవాద నిన్న
పదవ నంబదె దీన దయాళో
.............................................."

దాసులవారు వడ్డికాసుల స్వామిని గురించి కీర్తిస్తూ-

"కూసు కండెవమ్మ-అమ్మ-నిమ్మ-కూసు కండెనమ్మ
కాసిగె వీసది బడ్డి గళిసికొండు
శేషగిరియ మేలె వాసవాగిద్దానె"

వడ్డికాసులవాడై శేషగిరి మీద నెలకొన్నాడని బలిని వంచించి జగమంత నిండి కంచిపట్టణంలో నెల

కొన్నాడని, గోవులను కాచి జగన్నాథంలో ఉన్నాడని పాలు, పెరుగు కుండలను పగులగొట్టి ఉడుపిలో ఉన్నాడని మంగళరేఖలున్న పురందరవిరలుడు శ్రీకృష్ణుడని కీర్తిస్తూ, శ్రీవేంకటేశ్వరుడు కాంచనబ్రహ్మ, ఉడుపి శ్రీకృష్ణుడు అన్నబ్రహ్మ, పురందర విరలుడు నాదబ్రహ్మ అంటూ కొనియాడాడు. విరలుని ఆరాధించిన వారందరూ సంగీతానికి ప్రాధాన్యత నిచ్చినట్టు విశదమగుతోంది.

వేంకటరాయునికి శోభానం పాడుతూ

**శోభానమే శోభానమే । భూదేవి పతి**

**వెంకటరాయునకు । శోభనమే శోభానమే ।**

**అందుక్షీరాంబుధి మొదలు । ఇందిరయును ధరించివచ్చి**

**కందర్పకోటి లావణ్య మూర్తికి । మందారమాల వేసిన శ్రీశునకు ॥**

**జనకుని యింటిలో । రాజాధి రాజులు**

**జనసమూహము । గుంపుగను రాగ ॥**

**సనకాది వంద్యుని । చూచి సంతోషమునను**

**జానకి మాలను । వేసిన రామునకు ॥**

**పదుమ దేశముననొకడు । దేవాంగనను ।**

**పదుమముఖి। శృతి హ్రాతియు ।**

**పదుమనాభశ్రీ । శ్రీపురందర విరలునకు ।**

**పద్మావతి ప్రియుడగు । శ్రీనివాసునకు ॥**

కల్యాణకారకుడై శ్రీనివాసునికి పురందరదాసు మంగళహారతి పాడుతూ

**"మంగళం జయ మంగళం**

**మంగళం శుభ మంగళం"**

**అక్రూరగొలిద త్రివిక్రమగె**

**వక్రవగెలిద పరాక్రమిగె**

**శక్రనగర్వాపహారవ మాడిద**

**శుక్రన శిష్యన గెలిదవగె**

గంగెయ పడెద శ్రీరంగనిగె
రంగు మాణిక్య దుంగురదవగె
భృంగకుంతళెయర వ్రతవనె కెడిసిద
అంగజనయ్య శుభాంగనిగె

ధరయొళధిక వెంకటాచలది
స్థిరవాగి పుష్కరణియలి నెలసిహగె
పరతర శ్రీపురందర విఠలగె
వరవెంకట శ్రీనివాసనిగె

(శక్రన = ఇంద్రుని; శుక్రన శిష్యన = బలచక్రవర్తిని, భృంగకుంతళెయర = భృంగవంటి శిరోజములున్న స్త్రీల.)

"వినావేంకటేశం ననాథో ననాథః" అంటూ పురందరవిఠలుని, శ్రీవేంకటేశ్వరుని అద్వైత భావంతో స్తుతించిన సంకీర్తనాచార్యుడు శ్రీపురందరదాసు. శ్రీనివాసునిలో పురందర విఠలుని దర్శించి కీర్తించిన మహాభక్తుడు పురందరదాసు. అభయప్రదాతగా నుతులందుకొన్న శ్రీవేంకటేశ్వరుని పట్ల అచంచలమైన విశ్వాసంతో గుణగానం చేస్తూ.

నీనిరలు నమగేతర భయవో
సనకాదిగళప్రియ తిరువెంగళయ్య

.................................................

.................................................

నారాయణతే నమోనమో భవ
నారద సన్నుత నమోనమో

అన్న సంస్కృత కీర్తనలో నారాయణుడు నారద సన్నుతుడు, ఆదిదేవుడు ఆగమశాస్త్ర పూజితుడు, యాదవ కుల దీపకుడు, సుందర రూపుడు, వేదాలను ఉద్ధరించినవాడు శ్రీవేంకటేశ్వరుడేనని స్తుతించాడు.

భక్తుడు దైవం ఎదుట తాను చేసిన తప్పులను ఒప్పుకొని పశ్చాత్తాప పడతాడు. అలా తప్పులను ఒప్పు కుంటూ
'సతిసుతరిగె సంసారబలెగె అతి మతిహీనవాగి సిక్కి ఆసెగళిగె
మితికాణెనయా ఎన్నపాపగళిగె ముందె గతియావుదయ్య
హరియప్రదక్షిణ మాడలిల్ల నరహరియ పాదకె నాబీళలిల్ల
అతిథిగళెందు బందరె మనెగె నా గతియిల్లు కూడదు ఎందె అంటూ కుమిలిపోయాడు.

ప్రహ్లాదుని, ధ్రువుని, ద్రౌపది, అహల్యను, పిడికెడు అటుకులు సమర్పించిన వాడిని కాపాడావు. మహాపాపి యైన అజామీళుని కాపాడావు. వాడు నీకు మేనల్లుడా? అని నిక్కచ్చిగా ప్రశ్నిస్తూ నన్ను కూడా నీవే కాపాడు అని ప్రార్థిస్తూ

**నానేనో మాడిదెనో వెంకటరాయ నీనెన్నకాయబేకో**
**మానాపమానవు నిన్నదు, ఎనగేను దీనరక్షక**

అన్నాడు. నా భారం నీదేనన్న విశ్వాసం కూడా వుంది. 'వేంకటాచలనిలయం వైకుంఠ పురవాసం' కీర్తనలో విష్ణుమూర్తిని సన్నుతించాడు.

కలలో కనిపించిన స్వామిని తనలోనికి ఆహ్వానిస్తూ 'వెంకట రమణనె బారో; శేషాచలవాసనెబారో' పంకజనాభ పరమపవిత్ర శంకరమిత్రనె బారో అన్నాడు. అలా అనడంలో శివకేశవులు మధ్య ఎలాంటి అంతరం లేదన్నాడు.

'వేంకటేశ' అన్న నామం నాలుగువేదాల సమన్వయం అంటూ "వెంకటేశ నిన్న నామక్కె మొదలు నాకు అక్షరగళ నాడో' బింకవాద నాల్కువేదశాస్త్ర పురాణగళు అదరింద' అని కీర్తించాడు.

**'నోడు నోడు వెంకటేశ నోడు నోటవ**
**అవ ఆడు ఆటవ**
**బేటగాగి హరటుబంద ప్రఖ్యాతన'** అన్న కీర్తనలో పద్మావతీ కల్యాణాన్ని వివరించాడు.
ఇలా ఎన్నో, ఎన్నెన్నో కీర్తనలు రచించిన పురందరదాసు-

**'ధరెయోళధిక వేంకటచలగె**
**స్థిరవాగి పుష్కరణిలి నెలసిహగె**
**పరతత్వ శ్రీపురందర విఠలగె**
**వరవేంకట శ్రీనివాసనిగె మంగళం'**

అని భక్తిపూర్ణహృదయంతో మంగళం పలికాడు.

తిరువేంకటేశ్వరుని ఆలయంలో పురందరదాసు అన్నమయ్యను దర్శించాడు. ఆయన సంకీర్తనను విన్న దాసు సంతోషంతో "శ్రీవేంకటేశ్వరుని దర్శించినంత ఆనందంగా వుంది" అన్నాడు. అన్నమయ్య కోరికమేరకు తాను కూడా కన్నడ కీర్తనలను ఆలాపించాడు. ఆ కీర్తనలలో పాండురంగ విఠలుని దర్శనం పొందిన అన్నమయ్య పరవశించాడు. అన్నమయ్య సంకీర్తనలలాగే పురందరదాసు కీర్తనలు కూడా రక్కస తంగడి యుద్ధం తరువాత 'హంపి' శిధిలమైనప్పుడు కాలగర్భంలో కలిసిపోయాయి.

రామభక్తుడైన త్యాగయ్య తన తండ్రి రామబ్రహ్మం ద్వారా పురందరదాసు కీర్తనలు నేర్చుకున్నారు. ఎంతో స్ఫూర్తి పొందారు.

# ఆముక్త మాల్యద - శ్రీవేంకటేశ్వరుని వైభవము-ఒక పరిశీలన

*ఆచార్య భమిడిపాటి విశ్వనాథ్*

శ్రీకృష్ణదేవరాయలు గొప్పచక్రవర్తియేగాక గొప్ప కళాతపస్వి. మరియు గొప్పవైష్ణవభక్తుడు. భక్తుడగుటయే గాక వైష్ణవ నియమములను బాగుగా నెరిగి అనుసరించెడివాడు. అతడు రచించిన ఆముక్తమాల్యద గ్రంథ మిందులకు పరమనిదర్శనము. ఆముక్తమాల్యదలోనే శ్రీవేంకటేశ్వరునిపై రాయలు ప్రదర్శించిన భక్తి నిరుపమానము.

ఆముక్తమాల్యదలోని మొట్టమొదటి పద్యములోనే శ్రీవేంకటేశ్వరుని రాయలు స్తుతించుట, ఆ తరువాతి పద్యములలో శ్రీవేంకటేశ్వరుని సర్వాలంకారములను పోతలు పోసిన విధానము రాయలు ఆవిష్కరించుట గమనార్హము. శ్రీలక్ష్మి, శ్రీవేంకటేశ్వరులను రాయలు స్తుతించిన మొట్టమొదటి పద్యమిది.

**ఉ॥ శ్రీకమనీయహారమణి జెన్నుగదాను, గౌస్తుభంబునం**
**దాకమలావధూటియు నుదారత(దోప, పరస్పరాత్మలం**
**దాకలితంబులైన తమయాకృతు లచ్చత బైకి(దోపన**
**స్తోకతనందు(దో(చె నన శోభిలు వేంకటభర్తగొల్చెదన్**

కావ్యమును ప్రారంభించుటకు "ఆ శీర్నమస్క్రియా వస్తు నిర్దేశావాపి తన్ముఖమ్" అను నియమము ననుసరించి నమస్క్రియతో రాయలు ఆముక్తమాల్యద గ్రంధారంభము గావించినాడు. మరియు శ్రీతో కావ్య మారంభించినాడు. ఎందుల కనగా

**"వేదములకెల్ల నోంకారమాదియైన కరణి, కృతులకునెల్ల శ్రీకారమాది**
**గాన కవివరులెల్లరుమ, దానిదక్కనితర వర్ణంబులిడరు సత్కృతుల మొదల"** అని శాస్త్రవచనమున్నది గనుక.

సాధారణముగా శార్దూల విక్రీడితములతో కావ్యములు ప్రారంభించుట పరిపాటియై యుండగా, ఈ కావ్యములో ఉత్పలమాలతో ప్రారంభమైనది. రాయలు శ్రీవేంకటేశ్వరునకు భక్తితో నుడుగరలు ఘటించినది ఉత్పలమాలలతోనే. మహాలక్ష్మి, శ్రీవేంకటేశ్వరులు, ఇరువురి వక్షస్థలములందు పరస్పరము రూపములు ప్రతి ఫలించుట ద్వారా, కావ్యకథలోని ఆముక్తమాల్యద, రంగనాయకులు పరిణయ వృత్తాంతమును సూచించుట ద్వారా వస్తునిర్దేశము గావించినాడు రాయలు.

తదుపరి వర్ణన విష్ణుమూర్తి శయనించు శేషుని వర్ణన. శ్రీదేవిని కనుమరుగుపరచి, శ్రీవేంకటేశ్వరునికి భూదేవితో క్రీడించుట కవకాశము గల్పించిన శేషుని రాయలు స్తుతించినాడు. ఆముక్తమాల్యదలో తరువాతి పద్యములలో చాలభాగము తిరుమలనంతయు సాక్షాత్కరింపజేసినాడు రాయలు. గరుత్మంతుని రెక్కల వలన, పాపములు దూది పింజలవలె ఎగిరిపోవునని రాయలవర్ణన.

తిరుమలలో, బ్రహ్మోత్సవ సందర్భములో గాని, ఇతర పూజా సందర్భములలో గాని, ధ్వజారోహణ గావించి శుభారంభము గావించెడు సందర్భములలో విష్వక్సేనుని పూజించుట నేటికీ పరిపాటి. అనుస్యూతముగా వచ్చుచున్న ఈ ఆచారాన్ని రాయలు ఆముక్తమాల్యదలో ఇలా వర్ణించాడు.

**ఉ॥ పూనిముకుందునాజ్ఞ గనుబొమ్మనె కాంచి యజాండభాండముల్**
**వానమిూదబోవ నడువన్గానె౹దన్ననవగ్రనిశ్చల**
**త్వానుచలత్వనిష్ఠలె సమస్త జగంబుల జాడ్యచేతనల్**
**గా నతికెక్కు సైన్యపతి కాంచనవేత్రము నాశ్రయించెదన్"**

విష్వక్సేనుని బంగారు వేత్రము (దండము) కదలనిదే లోకవ్యవహారమే జరుగదుగదా! అటులనే వారణాసిలో శ్రీకాలభైరవుని దండము కూడ.

విష్ణుచక్రమైన సుదర్శన దేవుని రాయలు స్తుతించిన తీరు ఒక సంఘటనతో కూడి, తార్క్ష్యాణమై అమృత రక్షణభారమును వహించిన తీరును కనులకు కట్టినట్లుగా నున్నది.

పాంచజన్యమును హరి పూరించినంతనే ఆ ధ్వని మాత్రము చేతనే రాక్షసుల ప్రాణములు హరీయన్నవట.

**మ॥ హరిపూరింప దదాస్యమారుతసుగంధాకృష్టమై నాభిపం**
**కరుహక్రోడమిళింద బృందమెదు రెక్కం దుష్క్రియాపంకసం**
**కరదైత్యాసు పరంపరం గముచు రేఖంబొల్చురాకానిశా**
**కరగౌరద్యుతి పాంచజన్యమొసగుం గళ్యాణ సాకల్యమున్.**

పాంచజన్య ధ్వనిచే రాక్షసులు మరణించుటయే కాదు, రాకా పున్నమినాటి చంద్రుని తెల్లని కాంతిగల హరిశంఖము వెలుగులీనుచు, కల్యాణ సమృద్ధినికూడ ఒనగూర్చునని రాయల శుభాశంసన.

శంఖుచక్ర గదాధరుడనికదా శ్రీవేంకటేశ్వరుని స్తుతి. కాని రాయలు ఆముక్తమాల్యదలో చక్రమునకే పెద్దపీటవేసి తరువాత శంఖువు గదలను వర్ణించినాడు. సుదర్శనచక్రము యొక్క విశిష్టత అట్టిది.

సర్వశత్రునిరాసకంబైన ఆ కౌమదకీగద మదీయ శత్రు నిరాసకం బొనరించుగాత అని రాయలు వర్ణించెను. శార్ఙ్గధనువు అను విల్లుకూడ చాల ప్రశస్తి గాంచినది. పాపములనియెడు తీగల యొక్క శ్రేణిని పటా పంచలము చేయగల సామర్థ్యము కలది నందకఖడ్గము.

**మ॥ ప్రతతోర్ధ్వాధర భాగపీఠయుగళీభాస్వత్సరుస్తంభ సం**
**స్థితి ౹దీంద్రించెడు జాళువా మొసలివా దీప్తార్చిగా౹ గజ్జలా**

న్వీత ధూమసిత రేఖపై యలుగగా విజ్ఞానదీపాంకురా
ౄతి నందంబగు నందకంబఘులతా శ్రేణిచ్ఛిదం జేయుతన్ ॥

శ్రీవేంకటేశ్వరునకు, ఆతనికి సంబంధించిన శంఖుచక్రగదాదుల నెంతగా పైరీతి రాయలు స్తుతించుటయే గాక శ్రీవైష్ణవమతానుయాయి గనుక, తన్మతప్రతిష్టమ్ మూలకారకులైన పన్నిద్దరాళ్వారుల నిట్లు స్తుతించినాడు.

మ॥ అలపన్నిద్దఱు సూరులందును సముద్యల్లీలగా పున్నవె
గ్గలపుం దాపముఁబాపనా నిజమనః కంజాత సంజాతపు
ష్కల మాధ్వీక ఝురిన్మురారి సొగియంగాఁజొక్కి ధన్యాత్ములౌ
నిలపన్నిద్దఱు సూరులందలతు మోక్షేచ్ఛామతిం దివ్యులన్

స్వామి కంటె అతని భక్తులకే పెద్దపీట వేయించడం శ్రీవేంకటేశ్వరుని విశిష్టత. అన్నమయ్యకు అదే విధంగా స్వామి నేటికి ప్రశంసలు కురిపిస్తున్నాడుకదా. ఇక్కడ పన్నిద్దరు ఆళ్వారుల గురించి వివరించవలసిన అవసరం ఎంతైనా ఉన్నది. ద్రావిడదేశంలో క్రీ.శ. 10వ శతాబ్దికి పూర్వం, ద్వాదశాదిత్యులవలె, మహావైభవంతో ద్వాదశదివ్యసూరులు పన్నిద్దరాళ్వారులు అవతరించి తమ దివ్యగానప్రబంధంచేత, పరమ పవిత్రచరిత్ర చేత దేశాన్ని భక్తిరససాగరంలో ముంచెత్తారు. వీరు మైమరచి ద్రావిడభాషలో గానం చేసిన భగవన్మహిమను వివరించే గ్రంధరాజములే దివ్యప్రబంధములు. దక్షిణదేశానికి చెందిన వైష్ణవాలయాలు వీరి ప్రబంధాలు గానం చేయనిదే, వీరిశిలావిగ్రహాలను ప్రతిష్ఠించి పూజించనిదే దివ్యస్థలమనే మహారాజ గౌరవం వచ్చేదికాదు. దివ్య ప్రబంధాలకు దాక్షిణాత్య శ్రీవైష్ణవులు వేదప్రామాణ్యాన్ని ఒసంగారు. దివ్యప్రబంధములు 24. వీనిలోని పాశురములు అంటే ద్రావిడ పద్యముల సంఖ్య 4000. నేటికీ తిరుమలలో ఈ పాశురములను అనునిత్యం గానం చేస్తూనే ఉంటారు.

ఆముక్తమాల్యదను శ్రీవేంకటేశ్వరున కంకితమీయకోరినవాడు శ్రీకాకుళాంధ్రదేవుడు. ఈ దైవ నిర్ణయము అద్భుతము. లోకకల్యాణకారకము. శ్రీకాకుళాంధ్రదేవుడే రాయలకిట్లు సెలవొసంగినాడు.

క॥ అంకితమోయన నీకల
వేంకటపతి యిష్టమైన వేల్పుగుట దదీ
యాంకితముపేయు మొక్కొక
పంకేతమ కాకతదరప న్నేగానే

సాధారణంగా షష్ఠ్యంత పద్యాలలో కావ్యాలను అంకితమిచ్చునపుడు, వారి పైవారి గొప్పదనములను వివరించుచూ వారికి కృతిని సమర్పించుట సాహితీలోకములో పరిపాటి, సంప్రదాయము. అనేక ప్రబంధ

రాజములను కృతిగన్న కృతిభర్త చక్రవర్తి శ్రీకృష్ణదేవరాయలు. అతనికే కాక సమస్త భువనములకు చక్రవర్తియైన లోకైక నాథుడు శ్రీవేంకటేశ్వరుడు. ఇంద్రాది దేవతలకే దిక్కైన, ఆ నరసింహాకృతి దాల్చిన శ్రీవేంకటేశ్వరునికి ఈ క్రింది విధంగా ఆముక్తమాల్యదను సమర్పించాడు. ఆ పద్యం ఇది.

**క॥ అంబోధికన్యకాకుచ**
**కుంభోంభిత ఘుసృణ మసృణ గురువక్షునకున్;**
**జంభారిముఖాధ్యక్షున**
**కంభోజాక్షునకు సామిహర్యక్షునకున్**

స్వామి హర్యక్షునకున్ అనుపదములో ఒక చమత్కారమున్నది. సామి = అంటే అర్ధభాగం. హర్యక్షునకున్= సింహమగు వానికి అనికదా అర్థం. అంటే నరసింహాకృతి దాల్చినవానికి అని అర్థం. చమత్కారమేమిటంటే నరులలో సింహం శ్రీకృష్ణదేవరాయలైతే, ఆ నరసింహునకే నరసింహుడు శ్రీవేంకటేశ్వరుడు. శ్రీవేంకటేశ్వరునిపై రాయలకు ఎంత భక్తి. ఆముక్తమాల్యదలో శ్రీవేంకటేశ్వరునిపై రాయలు రచించిన భావాలలో అవకాశం, సందర్భం అల్పమే అయినా, అతడు భక్తితో ఉడుగరలు ఘటించినది అనల్పం. అతడు వర్ణించని, శ్రీనివాసుని ప్రత్యంగదేవతలుగాని, ప్రదేశములు గాని లేవు. శ్రీవేంకటేశ్వరుని శ్రీదేవి, భూదేవుల, తిరుపతి మరియు తిరుమలలోని అన్ని ప్రదేశములను మనముందుంచినాడు రాయలు.

ఈ షష్ఠ్యంత పద్యాలన్నింటిలోను, సామాన్యమైన ఒక విశేషం గోచరిస్తుంది. అదేమిటంటే రాయలు శ్రీవేంకటేశ్వరుని శత్రుసంహారకునిగా అధికభాగం వర్ణించడం. ఎన్నోయుద్ధాలు చేసిన రాయలు శ్రీవేంకటేశ్వరుని, అనేక సందర్భాలలో మానసికంగా పరిపూర్ణంగా కొలుచుకున్నాడు. దాని ఫలితమే రాయలు సర్వరాజన్యసార్వభౌముడై, సర్వకవికుల సార్వభౌముడై, ప్రశాంతజీవనం గడపగలిగాడు. ఆ కృతజ్ఞతను ఈ షష్ఠ్యంతపద్యాలలో ఆముక్తమాల్యదలో గనపరచాడు.

తెలుగుసాహిత్యంలోనే అత్యంతవర్ణనాప్రియుడైన రాయలు ఈ ఆముక్తమాల్యదలో ఆ షష్ఠ్యంతాలను తెలుగులోనే చాలా చిన్న వృత్తమైన కందపద్యాలలో వర్ణించడం విశేషం. ఈ చిన్నపద్యాలలోనే అనంతమైన ఆ అనంతుని వైభవాన్ని ఇంకా ఇలా వర్ణించాడు.

**క॥ మర్దిత కాళియ ఫణికి గ**
**పర్ద భృదజబింబితాచ్ఛపదనఖ ఘృణికిన్**
**దోర్దండ శార్ఙ్గకిణి కఘ**
**కర్దమ దినమణికి దనుజకరివరసృణికిన్**

అన్నమయ్యచే తరువాత బ్రహ్మకడిగినపాదము కీర్తన ప్రసిద్ధి గాంచినది.

ఈ షష్ఠ్యంతములను చివరగా ఆముక్తమాల్యదలో రాయలు మరల సుదర్శన చక్రవిశిష్టతను వర్ణించుటతో ముగించినాడు. మరల సుదర్శనచక్రమునకు పెద్దపీటవేసినాడు. ఆ సుదర్శనచక్రమును, ఆ సుదర్శనధారి శ్రీవేంకటాచలపతిని ఇట్లు నుతించినాడు.

క॥ బంధురరథాంగ ధారా
గంధవహోత్థజ్వలచ్ఛిఖా పటలపున
స్సంధుక్షణ ఘృతరాహుప
లాంధోస్పృక్ప్రుతికి వేంకటాచల పతికిన్

ఇదే విధంగా ఆశ్వాసాంత, ఆశ్వాసాది పద్యములలో శ్రీవేంకటరమణుని స్తుతించినాడు రాయలు. ఆ సందర్భములో కూడ కాకాసురుని శిక్షించిన వానిగా, మరియు హిరణ్యాక్షునివంటి అనేక దనుజుల శిక్షించిన వానిగా, నరసింహావతార వరహావతార విశేషరూపునిగ రాయలు శ్రీవేంకటేశ్వరుని వైభవాన్ని నుతించినాడు.

అనితర సాధ్యమైన విష్ణుసాక్షాత్కారాన్ని విష్ణుచిత్తునకు లభించినట్లు, ఆముక్తమాల్యదలో నివవర్ణన. ఈ ఘట్టములోనే రాయలు విష్ణుచిత్తునిచే దశావతారవర్ణనను గావించినాడు. ఈ క్రింది కంద పద్యంలో రాయలు దశావతార వర్ణనను ఎంత అద్భుతంగా వర్ణించాడో గమనించండి.

క॥ జలచరకిటి హరి వటు భృగు
కుల రఘుకుల సీరిబుద్ధ ఘోటి ప్రముఖో
జ్జ్వల జనికృతజనరక్షా
యలమేల్మంగాభిధేందిరాలయవక్షా!

ఈ దశావతారములతో శ్రీవేంకటేశ్వరుడు తనవైభవంతో జనరక్ష సదా చేయుచునే యున్నాడు. ప్రాచీనాంధ్ర వాఙ్మయంలో నాయికా నామములో వెలసిన ప్రబంధము ఆముక్తమాల్యద. రాయలు మహావిష్ణు భక్తుడు, తాతాచార్యులవారి శిష్యుడు. శ్రీవేంకటేశ్వరునకు పరమభక్తుడైన రాయలు తన లోహవిగ్రహాన్ని, దేవేరులైన తిరుమలదేవి, చిన్నాదేవులయొక్క లోహవిగ్రహాలను నిర్మింపజేసి, తిరుమలలోని దేవాలయ ప్రాంగణంలో స్వామికభిముఖంగా ప్రతిష్ఠింపజేశాడు.

ఆముక్తమాల్యద కేవలము ఆంధ్రులు గర్వింపదగ్గ గ్రంథరాజమే గాక, యావద్భారతీయ విజ్ఞాన సంస్కృతులకుగని. శ్రీవేంకటేశ్వరుని వైభవాన్ని చాటి చెప్పే సుదర్శన చక్రము. స్వామి మెడలోని, కౌస్తుభమణిహార సదృశము.

# తరిగొండ వేంకమాంబ కవిత్వంలో శ్రీవేంకటేశ్వర వైభవం

డా॥ మన్నవ భాస్కరనాయుడు

అటు తరిగొండను, ఇటు తిరుకొండను తన గుండెలలో నింపుకొన్న వేంకమాంబ చిత్తూరు జిల్లా తొలి తెలుగు కవయిత్రి! శ్రీనివాసుని పదకమలాల నర్చించిన కవిత్వనైవేద్యపత్రి! కవితా కైవల్యం దర్శించిన భక్తిహృదయనేత్రి!

తరిగొండలో వెలసిన శ్రీనృసింహాలయం పూజారి పుత్రికగా జన్మించి, తిరుమల శ్రీవేంకటేశ్వరుని అర్చించిన మధుర కవిత్వసుధాపాత్రికగా తరించిన మహాకవయిత్రి తరిగొండ వేంకమాంబ! క్రీ.శ. 1735-1817 సం॥ల మధ్య జీవించిన వేంకమాంబను గురించి చాలా కట్టుకథలు సాహిత్యప్రపంచంలో కూడా ప్రాచుర్యం పొందాయి. కానీ, కావ్యపుష్పాలతో స్వామివారిని సేవించిన ఆమె వ్యక్తిత్వం ఆమె రచనలలో స్పష్టంగా సాక్షాత్కరిస్తుంది.

సనాతన సాంప్రదాయిక శ్రోత్రియ కుటుంబంలో జన్మించిన వేంకమాంబ చదువుకు నోచుకోలేదు. ఆ నాటి సామాజిక వ్యవస్థలో ఆడపిల్లలు చదువుకునే అవకాశాలులేవు. చదువుకోవాలన్న ఆర్తి ఉన్నా, అవకాశాలు కలిసిరాని వేంకమాంబ హృదయవేదన ఆమె మాటలలోనే విదితమవుతున్నది.

**"నా చిన్ననాట ఓనామాలనైన ఆచార్యుల చెంతనే చదువలేదు....**

**తరికుండపురి నారసింహదేవు**

**డానతిచ్చిన రీతిగ నే నిమిత్త**

**మాత్రమున పల్కుదును......"** (శ్రీవేంకటాచలమాహాత్మ్యం 1-21)

మనసున్నచోట మార్గం ఉంటుంది. సంకల్ప బలం కావచ్చు. సంస్కార నిష్ఠమైన అభీష్టబలం కావచ్చు, వేంకమాంబ కవితాభిలాష సఫలం అయింది. తరిగొండ వేంకమాంబ సహజవైదుష్యం సంపన్న అయింది. భక్తి కవితా దీక్షతో రెండు శతకాలు, రెండు పద్యకావ్యాలు, నాలుగు ద్విపదకావ్యాలు, తొమ్మిది యక్షగానాలు, అనేక తత్వకీర్తనలు రచించగలిగింది. "ఈమెవలె ఇన్ని యక్షగానములు ఇంత సమర్థముగా రచించిన కవయిత్రులు లేరు. సరికదా, కవులునులేరు" అని విమర్శకులు అంగీకరించారు. (ఆచార్య యస్.వి. జోగారావు-ఆంధ్రయక్షగాన వాఙ్మయచరిత్ర). కండగలిగిన కలకండ రుచులతో ఇన్ని మధుర భక్తికావ్యాలు రచించగలిగినా, వేంకమాంబ వినయగుణసంపదను వదలుకోలేదు.

**"పండితాగ్రణులార! ప్రజలారా! ఇపుడు నా**

**బాలభాష కసూయ పడక, వినుడు"** అనీ (శ్రీవేం. మా.1-19)

**"భారతిని జిహ్వాయందుంచి నారసింహు**
**డే విధంబున బలికించు నా విధమున**
**పలికెదను భాగవతులు! నా బాలభాష**
**వినుడు నెయ్యంబుమీరగ విబుధులార!** అనీ (వేం.మా.6.6) మరిమరీ విన్నవించుకొన్నది. బాలవాక్కు బ్రహ్మవాక్కు అవుతుందో లేదో తెలియదుకాని, వేంకమాంబ చెప్పిన బాలభాష బ్రహ్మానంద పరిపోషితమైన కావ్యభాష అయింది. తరిగొండ వేంకమాంబ తాను నమ్ముకొన్న దేవుని సోదరుడుగా భావించింది, సంభావించింది!

**"సంగతి కృష్ణుండు సైదోడు గాగ**
**వేంగమాంబిక ప్రభవించి"నది!     (భాగవతం)**

అంతేకాదు, తరిగొండ ధాముడు ఒకనాటి "మధ్యాహ్న సమయంబునందు

**చిన్నికృష్ణుని రీతి చెంతకువచ్చి**
**పన్నుగాదెచ్చి శ్రీభాగవతంబు**
**నన్ను చేకొమ్మని నాచేతికిచ్చి**
**సన్నసైగల నిది సారంబుగాను**
**వరుసగా ద్విపదకావ్యము చేయుమనుచు**
**చిరమైన దయను సూచించియున్నాడు.....**
**..............అమ్మహామహుడు**
**చెదరక కృతినెట్లు చెప్పింపగలడొ?**
**అతని చెల్లెలను నేనా చందమెరుగ"** ననీ వెల్లడించింది. ఆమె నమ్మకం వమ్ముకాలేదు. వేంకమాంబ కవితాహృదయంలోని భగవంతుడు సోదరభావమాధుర్యంతో అక్షరక్షరంలో సాక్షాత్కారిస్తున్నాడు.

వేంకమాంబకు పుట్టినిండ్లురెండు! ఆమె భౌతిక జీవితానికి పుట్టినిల్లు తరిగొండ. ఆమె బౌద్ధిక ఆధ్యాత్మిక జీవితానికి పుట్టినిల్లు తిరుకొండ! ఆమె మెట్టినిల్లు చిత్తూరు సమీపంలోని నారగుంటపాళెం. ఆమె భర్త ఇంజేటి వేంకటాచలపతి. వేంకమాంబకు మెట్టినిల్లు అచ్చిరాలేదు. భర్త అకాల మరణానికి గురికావడం వల్ల పుట్టినింటికి చేరింది. కొంతకాలానికి రెండవ పుట్టినిల్లు వంటి తిరుమల చేరుకొన్నది. వేంకమాంబ పుట్టింటివారిపేరు కానాలవారు. అయితే తరిగొండ వేంకమాంబగానే ఆమె పేరు సాహిత్య ప్రపంచంలో స్థిరపడింది. వివాహానంతరం భర్త ఇంటిపేరే భార్యకు సంక్రమిస్తుంది. అందువల్ల ఇంజేటి

వేంకమాంబగా వ్యవహారంలో రూఢికి వచ్చి ఉండాలి. కానీ రాలేదు. వేంకమాంబ తన విష్ణుపారిజాతం, భాగవతం, చెంచునాటకం వంటి ఆరేడు కావ్యాలలో తనపేరు ఇంజేటి వేంకమాంబగానే పేర్కొన్నది.

తరిగొండాధిపునిలో శేషాచలపతినీ, శేషాచలపతిలో తరిగొండాధీపునీ దర్శించిన వేంకమాంబ శేషజీవితం తిరుమలలోనే గడపింది. తన రచనలలో శ్రీవేంకటేశ్వర వైభవం చిత్రించి జన్మధన్యం చేసి కొనింది. శ్రీవేంకటాచల మాహాత్మ్యం అనేపద్యకావ్యంలో శ్రీవేంకటేశ్వర వైభవాన్ని మధురమనోహరంగా వర్ణించింది. ఇష్టదేవతాస్తుతిలో...

**"తిరమై శ్రీయలమేలుమంగ యురమందే నిల్చి దీపింపగా**
**పరమైశ్వర్య ధురం ధరుండగుచు నాపాలన్ కృపన్ నిల్చి సుం**
**దర దివ్యాకృతి నప్పటప్పటికి మోదం బొప్పగా జూపి, మ**
**ద్వరదుండై తగు వేంకటాచలపతిన్ వర్ణింతు నశ్రాంతమున్"** **(వేం.మా.1-15)**

సహజంగా కవులు తమ కావ్యాదిలో ఇష్టదేవతలను స్తుతిస్తారు. వేంకమాంబ ఈ కావ్యంలో తన ఇష్ట దైవమైన శ్రీవేంకటాచలపతిని వర్ణిస్తానని చెప్పడం విశేషం, విశిష్టం!

తిరుమలను ఏడుకొండలుగా, శ్రీవేంకటేశ్వరుడు ఏడుకొండలస్వామిగా భక్తజనం కొనియాడుతూ ఉంది. వేంకమాంబ వేంకటాద్రిని పదునెనిమిది పేర్లతో సమ్మానించింది. ప్రతి పేరు ఎందుకు కలిగిందో అర్థవంతంగా, సమర్థవంతగా వివరించింది. శేషాద్రి, క్రీడాద్రి, వేంకటాద్రి **అనే పేర్లు ఈ గిరికి ఎందుకు కలిగాయో వివరించు మని శౌనకాదిమునులు సూతుని అభ్యర్థించారు. ఈ సన్నివేశంలో సూతుడు ఈ గిరికి ఉన్న 18 పేర్లు వివరిస్తాడు-** భక్తుల చింతదీర్చి వారికోరిక లీడేర్చుతూ ఉండటం వల్ల "చింతామణి" గా, మానవాళికి మహిత జ్ఞానం వృద్ధి చేస్తున్నందువల్ల "జ్ఞానాద్రి"గా, తీర్థజనులకు ముక్తిదాయకాలైన సమర్థ తీర్థములుండటం వల్ల "తీర్థాచలం"గా, తపోధనుల అవసరాలకై పుష్కలంగా పుష్కరిణులు ఉండటంవల్ల "పుష్కరశైలం"గా, వృషభాసురుడు తపస్సు చేసినందువల్ల "వృషభాద్రి"గా, దేవతలకే స్వర్ణప్రభాభాసురమై కనిపిస్తూ ఉండటం వల్ల "కనకాచలం"గా, నారాయణుడనే విప్రశేష్ఠుడు తపసుచేసిన చోటు కాబట్టి "నారాయణాద్రి"గా, వైకుంఠంనుంచి గరుడుడు తెచ్చి దించినందువల్ల "శ్రీవైకుంఠాద్రి"గా, నరసింహుడై ప్రహ్లాదుని కాపాడిన భద్రస్థలం కావున "నరసింహగిరి"గా, అంజనాదేవి తపముండి ఆంజనేయుని ప్రసవించిన పవిత్రస్థలము కాబట్టి "అంజనాద్రి"గా వరాహస్వామి కొలువైనందువల్ల "వరాహగిరి"గా, నీలుడనే వానరవరుడు తపసు చేసి ముక్తి పొందినందువల్ల "నీలాద్రి"గా, శ్రీమహాలక్ష్మికి నెలవుకావున "శ్రీగిరి"గా, శ్రీసతి శ్రీమహావిష్ణు వైభవాన్ని ఉల్లాసంగా ఆస్వాదించిన స్థలంకావున "శ్రీసతిగిరి"గా, శ్రీరమ తన సఖీమణులతో కలిసి క్రీడించిన వనంకాబట్టి "క్రీడాచలం"గా, వైకుంఠమునందలి క్రీడాద్రిని గరుడుడు తెచ్చినందువల్ల "గరుడాద్రి"గా,

శేషాకృతితో స్వామి విశేషవైభవాలకు నిలయమైనందువల్ల "శేషాచలం"గా, 'వ'కారం అమృతబీజం; క,ట, శబ్దాలు సంపత్కరములు; ఈ మూడక్షరాలు కలిసి అక్షయమైన అమృతసంపదలు అందిస్తాయి కాబట్టి "వేంకటాచలం"గా (1.104-122) నామ వివరణ చేసింది వేంకమాంబ! ఈ నామసంపదను పంచుతూ శ్రీవేంకటాచల వైభవాన్ని మాహాత్మ్యాన్ని భక్తితాదాత్మ్యంతో వివరించింది.

"కావున వేంకటాచలమఘుంబుల కెల్ల భయంకరంబునై
పావనమై సువర్ణమణి భాస్వరమై ధరణీసురాలికిన్
జీవనమై తపోజన వశీకరమై అజరుద్ర శక్ర సం
సేవితమై సుభక్తులకు శ్రీకరమై నుతి పాత్రమై తగున్! అంటుంది (వేం.మా.1-91)

పదునెనిమిది పేర్లతో విరాజిల్లుతున్న శ్రీవేంకటాచలం ఒక్కొక్క సమయంలో ఒక్కొక్క విధంగా దర్శనమిస్తుందని వివరిస్తూ వేంకమాంబ వేంకటాద్రి వైభవాన్ని మధురచిత్ర హరిత పత్రంగా, మహాద్భుత మహిమ పాత్రంగా వర్ణించింది.

"ఆ వేంకటాద్రి మహాద్భుతంబుగ నొక్కతరి హరి విధమునన్ తనరుచుండు
ఒకతరి కనకాద్రి యొప్పున జూపట్టు ఒకవేళ జ్ఞాన సంయుతము నొందు
ఒక సమయంబున ప్రకటిత మరకతమణివోలె దీపించు మహిమమీర
ఒక కాలమున మహినొప్పును కలికాల పాషాణశైల రూపములుగాను

కాన ఆ వేంకటాచల ఘనత నుడువ ఆదిశేషునకైన కాదరయ, నింక
నేను జెప్పగనేర్తునే నెమ్మి మీకు పరమ మునులార! విమల కృపాత్ములార!" (1-208)

అని సూతునిచే మునులకు తెలియజేసింది. శ్రీవేంకటాచల వైభవం వివరించి చెప్పటానికి వేయి నోళ్లున్న ఆదిశేషునికి అసాధ్యం కావచ్చుకాని, తరిగొండ వేంకమాంబ భక్తివాక్పటిమకు అసాధ్యం కాలేదు. ఆమె విశ్వసించిన శ్రీనివాసుడే ఆమె నాలుకపై నివసించి ఉన్నాడు కాబట్టి ఈ అద్భుత భావానికి రూపం ఇవ్వగలిగింది.

కపిల తీర్థం నుంచి శ్రీవారి ఆలయం వరకు ఈ వేంకటాచలంలో గల ఉత్తుంగ శృంగ సమూహాలు, వివిధ సానుప్రదేశాలు, పావన వృక్ష సందోహాలు, అసంఖ్యాక నిర్మల తీర్థాలు, నానావిధ విహగముల కోలాహలములు, విభిన్న మృగసమూహాలు, గరుడ గంధర్వాది దివ్యవర్గాలతో కన్నులపండువుగా ఉన్న వేంకటాచల వైభవాన్ని (3-179) పరవశించి దృశ్యమానం చేస్తుంది వేంకమాంబ!

ఈ వేంకటాచలం కలియుగ వైకుంఠం అని ప్రసిద్ధిపొందింది. కానీ, వేంకమాంబ ప్రాచీనయుగాలలోని భక్తులకు ఈ పావనక్షేత్రాన్ని దర్శింపజేస్తుంది. బ్రహ్మరుద్రాది దేవతలనుంచి, దశరథుడు, జనకుడు,

శ్రీరాముడు, బలరామకృష్ణులు వంటి మహామహుల వరకు శ్రీవేంకటాచలవైభవ దర్శనానికై రప్పించింది. భువనమోహనమైన, భక్తవరదాయకమైన శ్రీవేంకటేశ్వర వైభవం తిలకించే అవకాశం ఇప్పించింది.

ఇటువంటి మహిమోన్నతమైన వేంకటాచలంమీద కొలువుదీరిన శ్రీవేంకటేశ్వర మధురమోహనరూప వైభవాన్ని వేంకమాంబ భక్తిమాధురీసుధారసంతో చిత్రిస్తుంది. అనల్పమైన కవిత్వకళావిన్యాసంతో శిల్పీకరిస్తుంది.

**"మకుట కౌస్తుభరత్న మకరకుండలములు ఘనమేఖలాంగద కంకణాలు**
**వరవనమాలికావైజయంతులదీప్తి నలరు గ్రైవేయక హారములును**
**కనకాంబరంబొగి కాంతులనీను దేహమునందు వెలుగగా అభయమాన**
**కలిత దక్షిణకరకమలంబు పావన చరణంబు లర్చించు సరవి జూప**

**వామ హస్తాంబుజము కటిసీమనొప్ప తక్కిన కరంబులను శుభదమగు శంఖ**
**చక్రముల కాంతులెసలార శస్త్రకాంతి సర్వతోముఖుడై దయాస్వాంతుడగుచు"** (2-59)

ఆనంద నిలయంలో కొలువుదీరిన శ్రీవేంకటేశ్వర వైభవశోభను పాఠకులు వేంకమాంబ పద్యశిల్పంలో దర్శించ గలుగుతారు.

బ్రహ్మదేవుడు వేంకటాచలానికి విచ్చేసి, తన జనకుడైన వేంకటేశ్వరునికి సభక్తికంగా, వైభవోపేతంగా నిర్వహించిన బ్రహ్మోత్సవసంబరాలను వేంకమాంబ సవివరంగా సుమారు పదునారు గద్యపద్యాలలో వర్ణించింది. తిరుమలనాధుని సేవించుకొంటూ, నిత్యార్చనలలో పాలుపంచుకొంటూ, స్వామివారి ఉత్సవాలను తనివిదీరా చూచి, అనుభవించి, అణువణువు తాదాత్మ్యమై, భక్తిపారవశ్యంలో మునిగి తేలిన వేంకమాంబ బ్రహ్మోత్సవ రథోత్సవాలను శాస్త్రబద్ధంగా, భక్తిప్రబుద్ధంగా వర్ణించిన తీరు నిరుపమానం!

**"అఖిల వైభవములు నానంద నిలయాంబునకు ప్రదక్షిణముగ నలినభవుడు**
**శ్రీహరి వేంచేపు జేయించి కొనిరాగ......"** (2-113) స్వామి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణంతో ఆరంభమై చక్రస్నానంతో పరిపూర్ణం అయ్యేవరకు వివిధ వాహనసేవలను వేంకమాంబ ప్రత్యక్షసాక్షియై అక్షరీకరించింది. శ్రీవేంకటేశ్వరునికి మహావైభవంగా బ్రహ్మనిర్వహించిన రథోత్సవం ఆమె హృదయ పథోత్సవంగా చిత్రించింది.

**"ఘనతరోన్నతముగ కనకాద్రి తుల్యమై రంగు నిగ్గుల నొప్పు రథమునందు**
**నెలవుగ శ్రీభూమి నీళలతోగూడి హరి నుంచి, బ్రహ్మాదుల లఘు రథము**
**సాగించుచుండగ, సకల దిక్పాలకుల్ గరుడ గంధర్వ కిన్నర గణములు**
**సిద్ధవిద్యాధరుల్ సేవింప దేవదుందుభులు మ్రోయగ మహాద్భుతము దవర**

**పారిజాతసుమంబులా బ్రహ్మరథము పైన రంభాదులట జల్లి పాడి యాడి**
**కనుల పండువుగా జూడగా ధరిత్రి యందుగల మానవులు వేంకటాద్రిమీద!"** (2-115)

శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో శ్రీవేంకటేశ్వరుని మహిమవైభవాన్ని, భక్త రక్షణ వైభవాన్ని, దయా వైభవాన్ని వేనోళ్ల ప్రస్తుతించింది వేంకమాంబ. స్వామివారి వైభవలీలల వర్ణనకు దోహదంగా, ఆధ్యాత్మిక మనోల్లాసానికి సాధనంగా అష్టాంగయోగాలను, వివిధ ఆసనాలను విస్తృతంగా విశదీకరించింది. "అవాఙ్మానస గోచరం బైన బ్రహ్మానుభవమే రాజయోగం" అని వక్కాణించింది. (3-145)

ఆర్తత్రాణ పరాయణుడు, ఆపదమ్రొక్కులవాడు, ఆదిమధ్యాంతరహితుడు, తోడనినమ్మి అర్చించిన భక్తుల పాలిట ఏడుగడ అయిన ఏడుకొండల స్వామిని దర్శించుకొని, స్వామి మహిమకు పరవశించిన పరమ మునివరుల భక్త్యావేశాన్ని వేంకమాంబ మధురానంద నిష్యందంగా వర్ణించింది.

**"శ్రీనివాసుని జూచి ఆనందపరవశులై జడల్ జీరాడ నాడి యాడి**
**ఇదమిత్థమననేర కెనలేని ముదమున ఇందిరేశుని చెంత నెగిరి యెగిరి**
**భక్తియుక్తావేశ భరితాత్ములై అప్డు చక్కగ చిందులు త్రొక్కి త్రొక్కి**
**ఘనపదక్రమ జటకలిత స్వరంబుల సకలవేదంబుల జదివి చదివి**

**నిలిచి ఆనంద దుగ్ధాబ్ధి నెమ్మిమునిగి శ్రీనివాసుని రూపంబు ప్రియము గదుర**
**కనుల పండువుగా జూచి మనములచట మగ్నములొనర్చి రెంతయు మౌనివరులు!"** (3-180)

శ్రీవేంకటాచల మాహాత్మ్యంలోనే కాకుండా ఆమె తన రచనలన్నింటిలోను భక్తిపారమ్యాన్ని వ్యక్తం చేస్తుంది. మహామహిమాన్వితములుగా ప్రసిద్ధిచెందిన కుమారధారాప్రశస్తిని (1.152-156) చెంచునాటకంలో తుంబురుకోన ప్రకృతి రామణీయకతను, భక్తివైభవవిశిష్ట దృశ్యాలను కన్నులకు కట్టిస్తుంది.

తాను ఓనామాలు కూడా చదువుకోలేదనీ, తనది బాలభాష అనీ నమ్రంగా వెల్లడించిన తరిగొండ వేంకమాంబ కవిత్వంలో చేయితిరిగిన విదుషీమణిగా కనిపిస్తుంది.

పోతనలాగా కావ్యపాత్రల మిషతో స్వామివారిని పరవశించి ప్రస్తుతించింది. సూతుని ప్రోత్సాహంతో వేంకటాచలాన్ని దర్శించిన శౌనకాదిమునులు శ్రీవేంకటేశ్వర వైభవదర్శన పారవశ్యంతో స్వామివారిని ప్రస్తుతిస్తారు. ఈ సన్నివేశంలో వేంకమాంబ నాలుగు శ్లోకాల మాలికను భక్తిసుమమాలికగా గుదిగూర్చింది.

తరిగొండలో జన్మించి, తిరుకొండలో తరించిన వేంకమాంబ తన శ్రీవేంకటాచల మాహాత్మ్యంలో చిత్రించిన శ్రీవేంకటేశ్వర వైభవం ఆమె స్వయంగా జీవితాంతం వరకు ప్రతినిత్యం అనుభవించి ఆస్వాదించిన అనుభూతి సంపద! తన కవిత్వ నీరాజనాలతో శ్రీవేంకటేశ్వర వైభవాన్ని అర్చించిన తరిగొండ వేంకమాంబకు మన హృదయనీరాజనాలు సమర్పించటం సముచితం!

# శ్రీవేంకటేశ్వరుని దేవాలయంలోని ఉత్సవాలు- ప్రాముఖ్యత

డా॥ వై. విజయలక్ష్మి

"వేదములే శిలలై వెలసిన దీ కొండ

యేదెస బుణ్యరాసులే యేరులైన దీ కొండ

గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ

శ్రీదేవుడుండేటి శేషాద్రి యీ కొండ"

అంటూ తిరుమల క్షేత్రం యొక్క ఆధ్యాత్మిక తేజోవైభవాన్ని అన్నమాచార్యులు ఆవిష్కరించాడు.

"స్మరణా త్సర్వపాపఘ్నం స్తవనా దిష్టవర్షిణమ్

దర్శనా న్ముక్తిదం చేశం శ్రీనివాసం భజేఽనిశమ్"

ఆ స్వామిని స్మరిస్తే చాలట! పాపాలన్నీపోతాయి. ఆ దేవుణ్ణి కీర్తిస్తే చాలట! కోరికలన్నీ తీరుతాయి. ఆ దేవదేవుణ్ణి కన్నులారా దర్శిస్తే చాలట ముక్తి కలుగుతుంది. అటువంటి శ్రీనివాస భగవానుణ్ణి నిరంతరం భజిస్తాను.

## దేవాలయ పరిచయం

శ్రీవేంకటేశ్వరస్వామి అర్చామూర్తియై స్వయంభువుగా వెలసిన పవిత్ర స్థలమే తిరుమల పుణ్యక్షేత్రం. ఆ ఆనందనిలయుని ఆలయప్రాంగణంలోని అనేక దివ్యస్థలాలు, మండపాలు, అద్భుతశైలీ విన్యాసములతో విరాజిల్లడంతో పాటు, తిరుమలేశునితో పెనవేసుకున్న ఎంతోమంది భక్తుల మధుర జీవిత ఘట్టాల్నీ, తద్వారా శ్రీనివాసుని భక్తవాత్సల్యాన్నీ, లీలలను నిక్షిప్తం చేసుకొని వున్నాయి. "తిరుమల" అనే పదం తిరుమలై అను తమిళ పదానికి రూపాంతరం తిరు అనగా శ్రీ అని, మలై అనగా శైలమని, తిరుమలై అనే శబ్దం శ్రీశైలం అనే అర్థంలో ప్రయోగింపబడుతోందని తెలుస్తున్నది.

శ్రీవేంకటాద్రిని తిరు వేంకటాద్రి అని, తిరువేంగడమని, శ్రీవేంకటనాధుణ్ణి తిరువేంకట నాథుడని, తరువేంగడనాధుడని పిలుస్తున్నారు. దక్షిణదేశంలో కన్యాకుమారి నుండి ఉత్తరాన తిరువేంగడం వరకు తిమిళదేశమని, క్రీ.శ. 1 వ శతాబ్దం నాటికే సంగమ వాఙ్మయంలో సుప్రసిద్ధమైన లక్షణ గ్రంధం "తొల్కాప్పియమ్" పేర్కొంటున్నది.

ఋగ్వేదంలో దశమ మండలంలో వేంకటగిరి ప్రస్తావన ఉందని పెద్దలు చెబుతారు. బ్రహ్మపురాణం వేంకటాద్రి క్షేత్రం అత్యుత్తమమైందని, అచట అవతరించిన స్వామి వేంకటేశ్వరుడని పేర్కొంటున్నది.

బ్రహ్మాండ-ఆదిత్య పురాణాలు వేంకటాద్రితో సమానమైన స్థానం ఈ బ్రహ్మాండం లోనే లేదని వేంకటేశ్వరునితో సమానమైన దేవుడు ఇంతవరకు లేడు, ఇక ముందు కూడా ఉండబోడని ప్రతిపాదిస్తున్నాయి.

## సంహితలలో ఉత్సవ ప్రసక్తి

వైదికవాఙ్మయంలో దేవాలయ పూజావిధానాలను గూర్చి విశదీకరించే గ్రంథాలలో పాద్మసంహిత, శ్రీ ప్రశ్న సంహిత, ఈశ్వరసంహిత, విష్వక్సేన సంహిత, మరీచి సంహితలు ప్రధానాలు. ఈ గ్రంథాలన్నిటిలోను ఉత్సవ శబ్ద స్వరూప వివరణ ఉంది.

## పాద్మసంహిత

ఉత్ + సవః = ఉత్సవః "సవ" అంటే సంసారికమయిన దుఃఖసముద్రం ఆ దుఃఖసాగరాన్ని తరింపజేసేది ఉత్సవం. భగవద్భక్తులు ఉత్సవం ద్వారా దుఃఖాన్ని మరిచిపోయి ఆనంద సముద్రంలో మునిగి తేలియాడుతారు. ఈ విషయ వివరణే "సవఃసాంసారిక దుఃఖముత్తరన్తితదం భుగమ్ యస్మార ఇతి విద్యాంసో నిర్భువన్త్యుత్స వాహ్వాయమ్" శ్లోకంలో కనిపిస్తుంది. (10-67)

## శ్రీప్రసన్న సంహిత

నిత్యారాధన కంటె భగవంతునికి సంతోషదాయకం అయింది ఉత్సవం. ప్రీతి పాత్రుడయిన ఆ స్వామి అప్పుడే తన యొక్క అనుగ్రహ వీక్షణాలను భక్తాదుల మీద ప్రసరిస్తాడు. ఈ అంశం వివరణ.

**ఉత్సూతే హర్షం భగవతః ఇతి ఉత్సవం (30-8)**

అన్నవాక్యంలో వివరింపబడింది. (10)

ఈశ్వర సంహితలో "సవ" అంటే దుఃఖం. ఆ దుఃఖాన్ని పోగొట్టేదాన్ని ఉత్సవం అంటారు.

'ఉ' అనగా ఉత్కృష్టమయినది. 'సవం' అనగా యజ్ఞం పెద్దదైన యజ్ఞం ఉత్సవం అని మరీచి సంహితలో తెలపబడింది.

## ఉత్సవ భేదాలు

స్వామికి సంప్రీతికరంగా భక్తాదుల అనుగ్రహ వీక్షణానికి ఆస్కారం కలిగించే ఉత్సవాలు ప్రతి ఆలయంలో జరుగుతుంటాయి. అవి రెండు రకాలు.

1.సామాన్య ఉత్సవాలు

2. సంవత్సరోత్సవాలు

నిర్దిష్ట దినాలలో చేయాలనే నియమం లేకుండా ఎప్పుడంటే అప్పుడు చేసే ఉత్సవాలు సామాన్య ఉత్సవాలు. ఈ ఉత్సవాలు మూడురకాలు. అవి నిత్య, నైమిత్తిక, కామ్యోత్సవాలు. నిత్యోత్సవమంటే ప్రతిరోజు ఆలయంలో జరిగేదేవతారాధన. ఒకకారణాన్ని ఉద్దేశించి జరుపబడే ఉత్సవం నైమిత్తికోత్సవం."కామ" అంటే కోరిక ఒక ధ్యేయాన్ని ఉద్దేశించి కోరి చేసే ఉత్సవం కామ్యోత్సవం అంటారు. సంవత్సర కాలంలో ఒకసారి జరుపబడే ఉత్సవాలు. ఇవేకాకుండా రోజులు బట్టి, ఉత్సవాన్ని పరిగణించే పద్ధతి కూడా ఉంది.

పాద్మసంహితలో మాసోత్సవ, పక్షోత్సవ, ద్వాదశోత్సవ, నవరాత్రోత్సవ పంచాహోత్సవ నిత్యోత్సవం అని దినసంఖ్యను బట్టి వివరణ ఉంది. (10-22-23)

అఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడైన శ్రీమన్నారాయణుడు అన్యజనులను అనుగ్రహించుటకుగాను శ్రీవేంకటాద్రియందు శ్రీనివాసునిగా స్వయం వ్యక్తమై విరాజిల్లుచున్నాడు. శ్రీస్వామివారి సన్నిధిలో నిత్యకళ్యాణ పచ్చతోరణములుగా జరుగు ఉత్సవాదులు ఎన్నో ఎన్నెన్నో. స్వామివారి సన్నిధిలో జరుగు కొన్ని ఉత్సవ విశేషములను గూర్చి యిక్కడ పేర్కొన బడుచున్నది. తిరుమల శ్రీవేంకటేశ్వరుని ఆలయంలో వైఖానస ఆగమోక్తప్రకారము అర్చనాది కైంకర్యములు, ఉత్సవాలు నిర్వహింపబడుతూ ఉన్నాయి.

"కలౌ వేంకటనాయకః" అన్న ప్రసిద్ధిని పొందిన దేవదేవుడు జగత్కల్యాణ చక్రవర్తి తిరుమల గోవిందుడు. తిరుమల శ్రీనివాసునికి ప్రతినిత్యమూ జరిగే ఎన్నో సేవల్లో... మరెన్నో ఉత్సవాల్లో శ్రీవారి వైభవాన్ని తిలకించిన వారికి ఒక్కొక్క సేవలో ఒక్కొక్క సంతృప్తి! ఒక్కొక్క ఉత్సవంలో ఒక ఉత్సాహం. ఒక్కొక్క ఊరేగింపులో ఒక్కొక్క దివ్యానుభూతి! ఒక మైమరుపు! ఒక తన్మయత్వం! కలుగుతుంది. ఇలా భక్తులకు వింత వింతలుగా అనుభవాలను, అనుభూతులను దివ్యాతిదివ్యంగా పంచుతూ వున్న శ్రీవేంకటేశ్వర స్వామివారి ఉత్సవాలు, సేవలు ఏడాది పొడవునా జరుగుతూనే వుంటాయి. కనుకనే తిరుమల పుణ్యక్షేత్రంలో ప్రతిరోజూ పండుగనే! ప్రతిపూటా పాయసాలే! పరమాన్నాలే! సంవత్సరం పొడవునా అంటే 365 రోజుల్లో తిరుమలలో 450కి పైబడే ఉత్సవాలు, ఊరేగింపులు జరుపబడుతున్నాయి. వీటి సంఖ్య ఎప్పటికప్పుడు ఇంకా పెరుగుతూనే వుంది. వీటిలో కొన్ని సేవలు శ్రీనివాసుని మూలమూర్తికి జరుగుతూ వుండగా, అత్యధికంగా శ్రీవారి ఉత్సవమూర్తి అయిన శ్రీ మలయప్పస్వామి వారికే నిర్వహింపబడడం విశేషం!

ప్రస్తుతం ఏడాది పొడవునా శ్రీదేవి భూదేవులతో కూడివున్న శ్రీమలయప్పస్వామి వారికి జరుగుతూ వున్న అన్ని సేవలను గూర్చి ఏకరవు పెట్టడం కూడా అంత సులభం కాదు. అయినా వాటిల్లో అతి ముఖ్యమైన వాటిని గూర్చి క్లుప్తంగా తెలుసుకుందాం.

## నిత్య కళ్యాణోత్సవం

భక్తులు కోరిన సంతానం, వివాహాలు, ఉద్యోగాలు, గృహ నిర్మాణాది సర్వ శుభకార్యాలను సంపూర్ణంగా

నెరవేర్చి, వారిచేత తాను నిత్యకళ్యాణం చేయించుకోవడం శ్రీవేంకటేశ్వర స్వామి వారికి భలే ఇష్టం. తిరుమల పుణ్యక్షేత్రంలో శ్రీదేవి, భూదేవులతో శ్రీవేంకటేశ్వర స్వామివారికి నిత్యమూ కళ్యాణోత్సవం జరుగుతుంది. 15 వ శతాబ్దంలో తాళ్ళపాక అన్నమయ్య ఏర్పాటుచేసిన ఈ నిత్య కళ్యాణోత్సవం నేటికీ నిర్విఘ్నంగా, నిరాఘాటంగా కొనసాగుతూ వుంది. తిరుమల క్షేత్రంలో భక్తులు అత్యధికంగా పాల్గొనే సేవ కూడా నిత్య కళ్యాణోత్సవం ఒక్కటే. కూటికే గడవని అతి పేద వారు మొదలుకొని, కోట్లకు పడగెత్తిన ధనవంతుల వరకూ అందరూ పాల్గొనే ఈ నిత్య కళ్యాణోత్సవంలో భక్తుల సంఖ్య నానాటికీ పెరుగుతూనే వుంది.

తిరుమల శ్రీవేకంటేశ్వర స్వామివారి ఉత్సవమూర్తి అయిన శ్రీమలయప్పస్వామి వారికి ప్రతి సంవత్సరం ఉగాది నుంచి ఉత్సవాలు, ఊరేగింపులు ప్రారంభమవుతాయి. తెలుగు సంవత్సరాది పండుగను, తెలుగువారి ఇలవేలుపు అయిన శ్రీవేంకటేశ్వరుడు తెలుగువారి సంప్రదాయ రీతిలోనే జరుపుకొంటారు. ఉగాది రోజున శ్రీవారి ఆలయంలో జరిగే వేడుకను "ఉగాది ఆస్థానం" అంటారు.

## ఉగాది ఆస్థానం వగైరా ఉత్సవాలు

ఉగాది ఆస్థానం రోజున శ్రీమలయప్పస్వామి శ్రీదేవి భూదేవి సమేతంగా సర్వశోభాయ మానంగా వజ్ర వైడూర్యాది అనేకమైన నగలతో అలంకరించుకొని బంగారు వాకిలి ముందున్న గంటా మండపంలో తూర్పుముఖంగా సర్వభూపాల వాహనంలో వేంచేస్తారు. ఆ ప్రక్కనే మరొక పీఠంపై దక్షిణాభిముఖంగా శ్రీవారి సేనాపతి వస్తాడు. నివేదనాదులు అన్నీ అయిన తర్వాత శ్రీస్వామివారికి అర్చక స్వాములు పంచాంగ శ్రవణం శోభాయమానంగా చేయిస్తారు. సంవత్సర ఫలితాలు, లాభనష్టాలు, ఆదాయ వ్యయాలు వగైరా విషయాలన్నీ పంచాంగ శ్రవణం ద్వారా శ్రీనివాసుడు తెలుసుకుంటాడు. ఆ తర్వాత శ్రీస్వామి వారికి అక్షతారోపణ, కర్పూరహారతులు జరుగుతాయి. ఇదే ఉగాది ఆస్థానం. ఇంచుమించు ఇదే రీతిలో దక్షిణాయన పుణ్యకాలమైన కర్కాటక సంక్రాంతి (జులై 16) నాడు ఆణివార ఆస్థానం, దీపావళి నాడు, బంగారువాకిలి ముందట శ్రీమలయప్పస్వామి వారికి ఆస్థాన సేవలు జరుగుతాయి. ఇలా తొలిగా ఆస్థానం మొదలు శ్రీమలయప్ప స్వామివారికి ప్రారంభమైన ఉత్సవాలు ఏడాది పొడవునా జరుగుతాయి. ఉత్సవ శ్రీనివాసమూర్తి అనబడే ఈ మలయప్ప స్వామివారికి ప్రతిరోజు నిత్యకళ్యాణోత్సవం, వాహనసేవలు, సహస్ర దీపాలంకార సేవ వంటి నిత్యోత్సవాలు, విశేషపూజ, శ్రవణం, ఆరుద్ర వంటి నక్షత్రోత్సవాలు (మాసోత్సవాలు), వసంతోత్సవం, ఆణివార ఆస్థానం, పవిత్రోత్సవం, బ్రహ్మోత్సవం, పారువేటోత్సవం పుష్పయాగం, పద్మావతీ పరిణయోత్సవం, తెప్పోత్సవాలు వంటి వార్షిక ఉత్సవాలు నిర్వహింపబడుతూ వున్నాయి. ఏడాదిపాటూ ప్రతిరోజు జరిగే అన్ని సేవలు, ఉత్సవాలు ఊరేగింపులకంటే సంవత్సరంలో ప్రతి కన్యామాసంలో తొమ్మిదిరోజులపాటు జరిగే బ్రహ్మోత్సవ వైభవం మాత్రం తిరుమల పుణ్యక్షేత్ర చరిత్రలోనే పరాకాష్ఠ

# శ్రీవేంకటేశ్వరుడు - తీర్థములు

డా॥ సి. లలితారాణి

**"సర్వాత్మకే రమాధీశే వేంకటేశే పరాత్మని"**

తిరుమలలో వెలసిన స్వయంవ్యక్త మూర్తి- స్వామి. ఇది స్వయం వ్యక్తక్షేత్రము అనికూడా పురాణాలు ఉద్ఘోషిస్తున్నాయి. వైష్ణవులకు పవిత్రములైన నూటఎనిమిది దివ్యక్షేత్రములలో ఇది ఒకటి.

వేదములు పరమ పురుషుని నిశ్వాసరూపములు. వేదము లన్నింటిలో సర్వప్రథమముగా చెప్పదగినది ఋగ్వేదము.

ఇట్టి ఋగ్వేదమున వేంకటాద్రి ప్రస్తావము కలదని సాంప్రదాయవాదులు అభిప్రాయపడుచున్నారు, ఋగ్వేదము నందలి దశమ మండలమున ఈక్రింది మంత్రము కలదు. దానిని ఒకసారి పరిశీలిద్దాం-

**అరాయి కాణే వికటేగిరిం గచ్ఛసదాఽన్వే ।**
**శిరింభిరస్య సత్త్వభిస్తే భిష్ట్వాచాతయామసి॥**

అరాయి : నిర్ధనుడా. (పరలోకజ్ఞానరహితుడా)

కాణే : అంధుడా (పరమార్థ జ్ఞానము లేనివాడు)

వికటే : దుర్గమ పరిస్థితులలో ఉన్నపుడు

సదాన్వే : దానవులచే ఆవరించబడినపుడు (తత్త్వవిరోధులగు లౌకికవిషయములు నిన్నూపిరి సల్పకుండ చేసినపుడు)

శిరంభిరస్య : శ్రీపీర్యశ్రీనివాసస్య: శ్రీకినివాసస్థానముగా ప్రసిద్ధికెక్కిన వక్ష స్థలము గల వేంకటేశ్వరుని యొక్క

గిరిం గచ్ఛ : పర్వతమును (వేంకటాచలము) అధిరోహింపుము

పారలౌకిక జ్ఞానరహితుడా! పరమార్థజ్ఞానములేక గుడ్డివాని వలె సంచరించువాడా! లౌకికమైన విషయములచే నీవు తలమునకలై క్లిష్ట పరిస్థితులలో చిక్కుకొన్నప్పుడు లక్ష్మీదేవిని వక్షఃస్థలము నందుంచుకొని ప్రకాశించుచున్న శ్రీవేంకటేశ్వరునకు నిలయమగు వేంకటాచలము నధిరోహింపుము. ఆయన అనుగ్రహము వలన చిక్కు లన్నియు చక్కగా తీరిపోవునని భావము.

వేంకటాచల మాహాత్మ్యమును అభివర్ణించిన భవిష్యోత్తర పురాణము వేంకటాచలమును వేదమయమైన పర్వతముగా పేర్కొచుచు, అదే మంత్రాన్ని ఇట్లు పేర్కొనుట ఇచ్చట విశేషము.

**ఏవం శ్రీకృష్ణరూపేణ క్రీడితో వేంకటాచలే ।**

**అరాయికాణే వికటేగిరింగచ్ఛ తి తంవిదు: ॥**

**ఏవం వేద మయః సాక్షాత్ గిరీన్ద్రః పన్నగాచలః ।**

**ఛన్నవల్మీకదేహోఘ్యో వైకుంఠాదధికోహ్యభూత్ ॥**

హే అరాయి : దానవిరోధికి

కాణే : కుత్సిత శబ్దము నొనర్చుదానా! (చెడ్డచూపుకలదానా)

వికటే : వికృతగమనా

సదాన్వే : ఎల్లపుడు ఆక్రోశపడు ఓదుర్భిక్షాది దేవతా!

గిరిం : పర్వతమునకు

గచ్ఛ : వెళ్ళుము (మమ్ములను బాధింపవద్దు)

శిరింబిరస్య : మేఘము యొక్క

సత్వభిః : లోపల నుండు నీళ్ళచే

త్వా : నిన్ను

చాతయామసి : నాశనము చేయగలము, లేక భరద్వాజపుత్రుడగు శిరింబిడుని కర్మలచే ఓ అలక్ష్మి నిన్ను నాశనము చేయగలము అందువల్ల నీవే త్వరగా కొండకు వెళ్ళిపొమ్ము.

ఋగ్వేదమున, వేంకటాచలప్రశంస కలదని వైఖాన సాగమ సంప్రదాయము నందు, భవిష్యోత్తర పురాణము నందు ప్రతిపాదింపబడినట్లు తెలుస్తోంది.

తిరుమల పర్వత శ్రేణి ఎంతవరకు వ్యాపించి నదో భవిష్యోత్తర పురాణము ఇట్లా వర్ణిస్తుంది-

**వదనం వేంకటగిరిః నృసింహాద్రిశ్చ మధ్యమః**

**శ్రీశైలః పుచ్ఛభాగస్థః సర్వక్షేత్రమయోగిరిః ॥**

ఇందు శేషుని ముఖమే వేంకటాద్రి, నృసింహాద్రి మధ్యభాగము, శ్రీశైలము పుచ్ఛభాగమని ఈపురాణము వివరిస్తుంది.

**సువర్ణగిరి పుత్రస్తు సర్వతీర్థ సమన్వితః ।**

**సాక్షాచ్ఛేషా వతారోఽసౌ సర్వధాతువిరాజితః ॥**

తీర్థరాజాలతో విరాజిల్లుతున్న పర్వతరాజంగా ఈ పర్వతశ్రేణి పేర్కొనబడింది.

శ్రీస్వామివారి దర్శనానంతరం మనం తీర్థాన్ని స్వీకరిస్తాం. తీర్థం ఎందుకు తీసుకోవాలి? స్వామి వారి పాదాలనుండి లభించే పవిత్రమైనజలం, పుణ్యాజలం అని మనం వాటిని స్వీకరిస్తాం. శ్రీనివాసుని పాదపద్మాల క్రింద ఇప్పటికీ విరజానది ప్రవాహం ఉన్నదని విజ్ఞుల అభిప్రాయం.

శ్రీనివాసుని సన్నిధిలో దేవతలు వచ్చి పూజలు నిర్వహిస్తారని కూడా పెద్దల అభిప్రాయం. పుణ్యం, తీర్థము రెండు పదములు.

పుణతి : శుభం కరోతి శుభమును కలుగజేయునది.

తీర్థము అనగా తరన్త్యనేన - తరింపజేయు చున్నది, శుభాన్ని కలుగజేసేది తరింపజేస్తుందని

నిఘంటుకారుల అర్థము -"ఋషిజుష్టజలము" ఋషిజుష్టజలే గురౌ, మహర్షులు ప్రీతితో సేవించి తరించిన జలము తీర్థము లని అట్టివే పుణ్యతీర్థములని పేర్కొనుచున్నారు.

తీర్థక్షేత్రమైన ఈ శేషపర్వతము నందు అరవై ఆరుకోట్ల తీర్థములు ప్రకాశించుచున్నవి అని బ్రహ్మపురాణము, స్కాందపురాణములు పేర్కొనుచున్నవి.

ఈ తీర్థరాజము లన్నింటిలోను ముఖ్యము లగు పుణ్య తీర్థములు నాలుగు విధములుగా విభజింపబడినట్లు తెలుస్తోంది అవి-

1. ధర్మరతి ప్రదములు

2. జ్ఞానప్రదములు

3. భక్తివైరాగ్యప్రదములు

4. ముక్తిప్రదములు

## 1. ధర్మరతి ప్రదములగు తీర్థములు

ఆ తీర్థమున నివాసము చేత, స్నానాదులచేత, పానము (త్రాగుట) చేత మానవులకు ధర్మాసక్తిని కలుగజేసి కర్మయోగాది సంపాదన ద్వారా క్రమముగా అంతిమ మార్గమును కలుగజేయు పుణ్యతీర్థములు. ఇవి 1008 తీర్థములుగా నిర్ణయించబడినవి-

## 2. జ్ఞానప్రదములగు పుణ్య తీర్థములు

ఈ తీర్థములను సేవించిన మానవులకు సద్ జ్ఞానము కలుగజేసి భక్తి యోగ సాధన ద్వారా ఉన్నతమైన మార్గానికి నడిపించేవి. అవి 108 తీర్థములు. ఇవి ఒక వెయ్యి ఎనిమిది (1008) పుణ్యతీర్థముల కంటే ప్రముఖస్థానములో ఉన్నాయి.

అవి-

1. మనుతీర్థం 2. ఇంద్రతీర్థం, 3. వసుతీర్థము 4. రుద్రతీర్థములు- 11, (15) ఆదిత్య తీర్థములు- 12, (27) ప్రజాపతి తీర్థములు- 9, (36) అశ్వనీతీర్థము 37. శుక్రతీర్థము 38. వారుణ తీర్థము, 39 .జాహ్నవీతీర్థము. 40. కాపేయతీర్థము 41. కాణ్వతీర్థము, 42. ఆగ్నేయ తీర్థము 43. నారద తీర్థము 44. సోమతీర్థము 45. భార్గవతీర్థము 46. ధర్మతీర్థము 47. యజ్ఞతీర్థము 48. పశుతీర్థము 49. గణేశ్వరతీర్థము 50. భౌమాశ్వతీర్థము 51. పారిభద్రతీర్థము 52. జగజ్జాడ్యహరతీర్థము 53. విశ్వకల్లోలతీర్థము. 54. యమతీర్థము 55. బార్హస్పత్య తీర్థము 56. కామహర్థతీర్థము 57. అజామోదతీర్థము 58. జనేశ్వరతీర్థము 59. ఇష్టసిద్ధితీర్థము 60. కర్మసిద్ధితీర్థము 61. వటతీర్థము 62. ఔదుంబరతీర్థము 63. కార్తికేయతీర్థము 64. కుబ్జతీర్థము 65. ప్రాచేతస తీర్థములు (10) 75. గరుడతీర్థము 76. శేషతీర్థము 77. వాసుకితీర్థము 78. విష్ణువర్ధనతీర్థము 79. కర్మకాండతీర్థము 80. పుణ్యవృద్ధితీర్థము 81. ఋణవిమోచనతీర్థము 82. పార్జన్యతీర్థము 83. మేఘతీర్థము 84. సాంకర్షణ తీర్థము 85. వాసుదేవతీర్థము 86. నారాయణతీర్థము 87. దేవతీర్థము 88. యక్షతీర్థము 89. కాలతీర్థము 90. గోముఖతీర్థము 91. ప్రాద్యుమ్న తీర్థము 92. అనిరుద్ధ తీర్థము 93. పితృతీర్థము 94. ఆర్షేయ తీర్థము 95. వైశ్యదేవతీర్థము 96. స్వధా తీర్థము 97. స్వాహాతీర్థము 98. అస్థితీర్థము 99. ఆంజనేయ తీర్థము 100. శుద్ధోదక తీర్థము101. అష్టభైరవతీర్థములు 8 (108 పుణ్య తీర్థములు)

### 3. భక్తి వైరాగ్య ప్రదములగు పుణ్య తీర్థములు

పైన పేర్కొనిన (108) నూట ఎనిమిది పుణ్య తీర్థముల కంటె అత్యంత ముఖ్యములైన పుణ్యతీర్థములు (68) అరువది ఎనిమిది గా పరిగణింపబడి యున్నవి. ఈ తీర్థములు సేవించిన మానవులకు పాప ప్రశమనము చేయుటయేకాక సంసారమునందు వైరాగ్యమును, పరమేశ్వరుని యందు భక్తి. ఆ భక్తి యోగము ద్వారా క్రమముగా కృతార్థతను కలుగ చేస్తుంది.

అవి-

1. చక్రతీర్థము 2. వజ్ర తీర్థము 3 విష్వక్సేన తీర్థము 4. పంచాయుధ తీర్థము 5. హలాయుధ తీర్థము 6. నారసింహ తీర్థము 7. కాశ్యపతీర్థము 8. మాన్మథతీర్థము 9. బ్రహ్మతీర్థము 10. అగ్ని తీర్థము 11 గౌతమ తీర్థము 12 దైవ తీర్థము 13. దేవల తీర్థము 14. విశ్వామిత్ర తీర్థము 15. భార్గవతీర్థము 16. అష్టావక్రతీర్థము 17. దురారోహణతీర్థము 18 భైరవతీర్థము (పిశాచాదిమోచనము) 19 మేహ తీర్థము (ఉదరవ్యాధినాశనము) 20. పాండవ తీర్థము 21 వాయుతీర్థము. 22. అస్థి తీర్థము (పునర్జీవన సాధనము) 23. మార్కండేయ తీర్థము (ఆయుష్య వర్ధనము) 24 జాబాలి తీర్థము 25 వాలఖిల్య తీర్థము 26 జ్వరహర తీర్థము

(సర్వజ్వరనాశనము) 27. విషహర తీర్థము (తక్షకవిషవ్యాధి నివారకము) 28. లక్ష్మీ తీర్థము 29. ఋషి తీర్థము 30 శతానంద తీర్థము 31. సుతీక్ష్ణక తీర్థము 32. వై భాండక తీర్థము 33. బిల్వతీర్థము 34. విష్ణు తీర్థము 35. శర్వ తీర్థము 36. శారభ తీర్థము 37. బ్రహ్మతీర్థము 38. ఇంద్రతీర్థము 39. భారద్వాజ తీర్థము 40. ఆకాశగంగాతీర్థము 41. ప్రాచేతస తీర్థము 42. పాపవినాశనతీర్థము 43. సారస్వత తీర్థము 44. కుమారధారాతీర్థము 45. గజ తీర్థము 46. ఋష్యశృంగ తీర్థము47. తుంబురు తీర్థము (నారదాది సేవితము) 48. దశావతార తీర్థములు(10), 58, హలాయుధతీర్థము 59. సప్తర్షితీర్థములు (7) 66. గణకోణతీర్థము 67. విష్వక్సేనతీర్థము 68. యుద్ధసరస్తీర్థము (జయదాయకము) ఇవి 68 పుణ్యతీర్థములు.

**4. ముక్తి ప్రదములగు పుణ్య తీర్థములు :**

అరువది ఎనిమిది పుణ్యతీర్థములకంటె ముఖ్యములైన పుణ్యతీర్థములు 7. ఈ తీర్థములు తమను సేవించిన మానవుల సర్వపాపములను నివర్తింపచేసి ముక్తిసాధనములను సమకూర్చుచు ముక్తి ప్రదానములగుటచే ఇవి అన్ని తీర్థముల కంటె పరమోత్కృష్టములగు తీర్థములుగా పేర్కొనబడిచున్నవి.

ముక్తి ప్రదములై, సర్వతీర్థములలోను ముఖ్యములగు పుణ్యతీర్థముల పేర్లు-

1. స్వామి పుష్కరిణీ తీర్థము
2. కుమార ధారా తీర్థము
3. తుంబురు తీర్థము
4. రామకృష్ణ తీర్థము
5. ఆకాశగంగా తీర్థము
6. పాపవినాశతీర్థము
7. పాండవ తీర్థము (గోగర్భతీర్థము) ఇవి అత్యంత ముఖ్యమైనవి.

వేంకటాచల మాహాత్మ్యం అభివర్ణించిన పదకొండు పురాణాలలో ఇరవైఆరుముఖ్యతీర్థాలు పేర్కొనబడినట్లు తెలుస్తున్నవి. అవి-

1. కుమారధార 2. కపిల. 3. పాండవ 4. జరాహర 5. ఫల్గుణి 6. జాబాలి 7. సనకసనందన 8. కాయరసాయన 9. పాపవినాశన 10. దేవ 11. పద్మసరోవరం 12. అస్థిసరోవరం 13. తుంబ లేక తుంబురు 14. ఆకాశగంగ 15. చక్రతీర్థం 16. కటాహ తీర్థము 17. మన్వాద్యష్టోత్తర శత తీర్థాలు 18. రామకృష్ణ తీర్థము 19. శంఖ 20. కల్యా 21. శక్ర 22. విష్వక్సేన 23. పంచాయుధ 24. బ్రహ్మ 25. సప్తర్షి 26. వ్రతతీ వర్తనీ తీర్థాలు.

మనం వీటిని ఇప్పటికీ తిరుమలలో దర్శిస్తున్నాము. తిరుమల - తిరుపతి దేవస్థానము వారు కొన్నిటిపై డ్యామ్‌లను (ఆనకట్టలు) నిర్మించారు.

వరాహ - పద్మ - మార్కండేయ- వామన - స్కాంద-బ్రహ్మాండ- బ్రహ్మ-గరుడ- భవిష్యోత్తర - ఆదిత్య - హరివంశము పురాణములలో ఈక్రింది విధంగా పేర్కొనబడినది.

**1. వరాహపురాణము:**

సమస్త పుణ్యతీర్థమయము గాన 'తీర్థాద్రి' అని అభివర్ణించుచున్నది.

**2. పద్మపురాణము:**

స్వామి పుష్కరిణీ వర్ణనము, ప్రభావము అభివర్ణితము.

**3. గరుడ పురాణము:**

ఆకాశగంగ, పాపవినాశనము, తుంబురతీర్థ ప్రశంస కలదు.

**4. హరివంశము పురాణము:**

శ్రీనివాసుడు స్వామి పుష్కరిణి తీర్థమున లక్ష్మితో పాటు దర్శనమిస్తున్నాడని అభివర్ణితము.

**5. బ్రహ్మాండ పురాణము:**

తీర్థాద్రి అను పేరును ఈ పురాణముకూడా పేర్కొనుచున్నది. శేషుని ఫణామణి ప్రదేశమే శ్రీనివాసుని ధామమని వర్ణించుచున్నది.

**6. మార్కండేయ పురాణము:**

కుమారధారా తీర్థ మాహాత్మ్యము వర్ణింపబడినది.

**7. వామన పురాణము:**

అనేక పుణ్యతీర్థముల వర్ణనము, స్వామిపుష్కరిణీ వర్ణనము.

**8. బ్రహ్మపురాణము :**

అనేక తీర్థములు కలవని అభివర్ణించుచున్నది.

**9. స్కాందపురాణము:**

స్వామిపుష్కరిణి, అనేక తీర్థముల మాహాత్మ్యములు వర్ణింపబడినవి.

**10. ఆదిత్య పురాణము:**

వేంకటాద్రి సర్వోత్కృష్టమైనదని వర్ణింపబడినది. తీర్థముల ప్రశస్తిలేదు.

**11. భవిష్యోత్తరపురాణము :**

వేంకటగిరి నాథుని పర్వత ప్రశంస వర్ణింపబడినది. ఇందు శేషుని వదనమే వేంకటాద్రి, నృసింహాద్రి మధ్య భాగమని, శ్రీశైలము పుచ్ఛభాగమని విశదపరచుచున్నది.

## స్వామి పుష్కరిణి:

లోకములోని పుష్కరుణుల కన్నింటికి ఈ పుష్కరిణి స్వామి కనుక దీనికి స్వామి పుష్కరిణి అను పేరు వచ్చినది. "స్వామినీ చాసౌ పుష్కరణీ చ స్వామి పుష్కరణీ" అను వ్యుత్పత్తిని కొందరు చెప్పుచున్నారు.

అట్లు కాక కొందరు స్వామి పుష్కరిణి అను శబ్దమునకు 'స్వామినం కరోతి స్నాతమితి స్వామి పుష్కరిణి' అను వ్యుత్పిత్తిని చెప్పుచున్నారు. ఈ పుష్కరిణిలో స్నానము చేసిన వానిని అధిపతిని చేయుచున్నది. కావున ఇది స్వామి పుష్కరిణి అని చెప్పుచున్నారు. వరాహస్వామి ఆలయ సమీపమున ఉండుటచే వరాహపుష్కరిణి అని మరియొక పేరును కూడా చెప్పుచున్నారు.

## పుష్కరిణీ వర్ణనము :

సుగంధ పుష్పవల్లులతోను, నారికేళ, కేతక, స్వర్ణకేతక వృక్షములతోను చందన, పాటల, అశోక, చంపక, నక్తమాల పుష్పములతో విరాజిల్లుతోంది. తరుణాదిత్యునితో సమానముగ ప్రకాశించు తాపసులతోను, వరాహ, సింహ శార్దుల మాతంగ కులసంకులము, జలపక్షి యుతము, కలహంస కలాలాపవాచాలితము అయి స్వామి పుష్కరిణి ప్రకాశించుచున్నది.

స్వామిపుష్కరిణి 'సర్వకామద' అని, మార్గశిర శుద్ధ ద్వాదశిరోజు అరుణోదయము వేళలో మూడున్నరకోటి తీర్థములు ఈ పుష్కరిణిలో ప్రవేశించునని వామన పురాణము పేర్కొనుచున్నది.

ఈ పుష్కరిణి శ్రీనివాసుని ఆలయమునకు ఉత్తరమున దర్శన భాగ్యము కలుగజేయుచున్నది. ప్రతిసంవత్సరము ఫాల్గుణ పూర్ణిమకు ముందు ఐదురోజులు శ్రీస్వామివారికి తెప్పోత్సవాలు ఘనంగా రమ్యంగా నిర్విహిస్తున్నారు దేవస్థానము వారు.

బ్రహ్మపురాణము అష్టమ అధ్యాయమునందు స్వామి పుష్కరిణి యందు మహాశక్తివంతములగు తొమ్మిది తీర్థరాజములు కలుస్తాయని అని వాటిని గురించి ఇలా వివరిస్తోంది. అవి-

1. తూర్పు భాగమున మార్కండేయ తీర్థము (ఆయుఃప్రదము)
2. ఆగ్నేయభాగమున ఆగ్నేయ తీర్థము (పాపవినాశకము)
3. దక్షిణమున యామ్యతీర్థము (నరకోత్తారకమగు)
4. నైఋతి భాగమున వశిష్ఠతీర్థము (ఋణవిమోచకము)
5. పశ్చిమభాగమున వారుణ తీర్థము (పుణ్యప్రదము)
6. వాయవ్య భాగమున వాయు తీర్థము (కైవల్యదాయకము)
7. ఉత్తరభాగమున ధనద తీర్థము (ధనసంపత్ప్రదమగునది)
8. ఈశాన్య భాగమున గాలవ తీర్థము (భుక్తిముక్తి ప్రదాయకము)
9. మధ్యభాగమున సరస్వతీ తీర్థము (మహాపాతకనాశకము)

**1. స్వామి పుష్కరిణీ తీర్థముక్కోటి**

ధనుర్మాసంలో అరుణోదయం ద్వాదశితిథి రోజు మూడు కోట్ల యాభైలక్షల పుణ్య తీర్థములు స్వామి పుష్కరిణిలోనికి వచ్చిచేరుతాయి ఆరోజున ఇప్పటికి ఈ తీర్థ ముక్కోటి అను పేరుతో ఒక ఉత్సవ విశేషం తిరుమలపై నిర్వహింపబడుతున్నది.

**రామోఽపి తత్ర స్నానేన హృతాంసీతామగాత్పురా ॥**

**స్వామి పుష్కరిణీ తీర్థం భక్తిజ్ఞాన సుఖప్రదమ్ ॥**

**స్వామి పుష్కరిణీ తీర్థం దివ్యౌషధ, రసాయనమ్ ।**

**వైద్యః శ్రీవేంకటేశోఽయం మృత్యురోగనివర్తనీ॥**

**2. శ్రీరామకృష్ణ తీర్థముక్కోటి :**

ప్రతి సంవత్సరము మకరమాసం పుష్యమి నక్షత్రయుక్త పూర్ణిమ రోజు జరుగుతుంది.

**3. కుమారధారా తీర్థముక్కోటి:**

కుంభమాసం మఖా నక్షత్రయుక్తపూర్ణిమా పర్వదినమున జరుగును. రుద్రుడు క్షేత్రపాలకుడు.

**4. తుంబురు తీర్థముక్కోటి :**

మీన మాసమున ఉత్తరా నక్షత్ర యుక్త పూర్ణిమ అపరాహ్ణకాలమునందు. అత్యంత వైభవంగా ఇప్పటికి ఈ ఉత్సవాలను దేవస్థానము నిర్వహిస్తున్నది. వీటిలో పాల్గొని భక్తులు తరింతురుగాక!

# తిరుమల శ్రీవారి ఉత్సవాలు

డా॥ చిట్రాజు గోవిందరాజు

ఒక కుటుంబంలోని వారు ఇంట్లోగాని ఇంటి ఆవరణలోగాని జరుపుకొనే మతసంబంధి కార్యానికి పండుగ అని పేరు. వయోభేదం, స్త్రీ పురుషభేదం, కులమత భేదాలు లేకుండా గ్రామాధికారి నాయకత్వంలో గ్రామదేవతలకు సంబంధించిన మొక్కుబడుల కార్యక్రమ విశేషానికి జాతర అని పేరు. అలాగే అర్చా మూర్తులకు ఆగమోక్తంగా జరిపే కార్యక్రమాలకు ఉత్సవాలనిపేరు.

ఆలయం కళలకు నిలయం. నమ్మకాలకు నికేతం. హైందవ సిద్ధాంతాలకు మందిరం. హైందవ జీవితంలో దేవాలయం ప్రాణంకంటే ఎక్కువ, అందువల్లనే ఆలయనిర్మాణం, పాలన, రక్షణ పవిత్ర ధర్మకార్యాలుగా పరిగణింపబడుతున్నాయి. ఏ ఆలయంలో అయితే ఉత్సవాలు ఎక్కువగా జరుగుతాయో ఆ ఆలయాలలో తిరుమల ఒకటి.

తిరుమల జగద్విఖ్యాతమైన దివ్యక్షేత్రం. బహుశతాబ్దాల చరిత్ర, ప్రతిరోజూ వేలాదివేల యాత్రికుల రాక, మొక్కుబడుల చెల్లింపులు, తిరుక్షవరం, ఆలయానికి కోట్లాది ఆదాయం, నిత్యకల్యాణం పచ్చతోరణంలా ఏడాదిపొడవునా ఎడతెరిపిలేకుండా జరిగే పూజలు ఉత్సవాలు ఈ క్షేత్రం యొక్క ప్రత్యేకత. ఏడు కొండల మీద వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి భోగమూర్తి, వరప్రదాత, నమ్మిశరణన్న భక్తులకు పెన్నిధి.

వైష్ణవులకు 108 దివ్య తిరుపతులలో శ్రీరంగం. కంచి, మేల్కోటే, తిరుమల ప్రధానమైనవి. వీటిలో తిరుమల పవిత్రస్థలం. చరిత్ర కందనికాలం నుంచి ఉత్సవాదులు జరుగుతున్నా భగవద్రామానుజులు కట్టడితో కైంకర్యాలు సజావుగా నిర్వహింపబడుతున్నాయి. 8-5-2000 నాటి కార్యనిర్వహణాధికారి ఇలపావులూరి సుబ్బారావుగారు అన్నమాచార్య కళామందిరంలో భగవద్రామానుజుల ప్రారంభోపన్యాసంలో భారత రాజ్యాంగాన్ని సవరించినట్లు రామానుజుల వారు వైష్ణవ ఆగమాల్ని లేదా వైష్ణవ సిద్ధాంతాల్ని సవరించి సప్రమాణంగా వైష్ణవులకు అందించారనడం సత్యదూరంకాదు. తిరుమల శ్రీవారి ఆలయంలో రాత్రి భాగంలో బ్రహ్మాదిదేవతలచే ఆరాధన జరుగుతోంది. పగలుత్రికాలాల్లో శ్రీవైఖానస శాస్త్ర ప్రకారం ఆరాధనలు జరుగుతున్నాయి ఈ ఉత్సవాలు జనసమీకరణకు విశ్వాస ప్రకటనకు సమైక్యతకు కళాప్రదర్శనకు నిదర్శనాలు. ఉత్సవాల్లో ఉల్లాసం వినోదం ప్రధానం అనడంలో సందేహంలేదు. ఉత్సవాది సమయాలు మంత్రం శాస్త్రాలను ఆచారాలను అనుసరించి ఏర్పడివున్నాయి.

ఒక ఆలయంలో ఒక వ్యక్తి కున్న సంబంధాన్ని నిర్దేశించడానికి కొన్ని కొలబద్దలుంటాయి. ఈ దృష్టితో పరిశీలిస్తే అన్నమయ్య ఆలయ ఉద్యోగికాదు. ఆలయమర్యాదలకు నోచుకొన్నవాడు కాదు. అర్చక పరిచారక వర్గంవాడు కూడకాదు. కాని స్వామికటాక్షంతో వైఖానసులకంటె, జియ్యర్లకంటె రాజాధిరాజులకంటె విశేషమయిన

గౌరవాదులు ఆలయంలో కలవాడనడంలో సందేహం లేదు. అందుచేతనే అన్నమయ్యలో ఆలయకీర్తనలు ఆలయంలోని దేవతామూర్తుల కీర్తనలు, ఆలయంలో జరిగే ఉత్సవాదుల కీర్తనలు విరివిగా కనిపిస్తున్నాయి. అన్నమయ్య తరువాతి కాలం నాటికి ఈ వ్యవస్థ పటిష్ఠమయిందనడానికి శ్రీమద్రామానుజుల ఆలయం ప్రక్కనే తాళ్లపాక అరస్థాపించడం సాక్ష్యంగా చెప్పవచ్చు. ఇటువంటి గౌరవం ప్రాధాన్యం కలగడానికి కారణాలు లేకపోలేదు. ఒకటి అన్నమయ్య వ్యక్తిత్వం, రెండు సాళ్వనరసింగరాయలకు గురుస్థానంలో ఉండడం, మూడు తానే కొన్ని ఉత్సవాలకు శ్రీకారం చుట్టడం.

తిరుమల శ్రీవారి ఆలయంలోనే దాదాపు 450కి పైగా ఉత్సవాలు నిర్వహింపబడుతున్నాయి. వీటిని మూడు రకాలుగా వర్గీకరించవచ్చు. ప్రదేశాన్నిబట్టి ఒక విభజన ప్రకారం గుడిలో జరిగేవి. గుడిచుట్టూ గుడికి సుదూరంలో జరిగేవి. రెండవ విభజన ప్రకారం మూలమూర్తికి జరిగేవి, ఇతరదేవతామూర్తులకు జరిగేవి. మూడవ విభజనప్రకారం నిత్య, వార, పక్ష, మాస, సంవత్సరోత్సవాలు అని చెప్పవచ్చు. అన్నమయ్య ప్రవేశపెట్టిన ఉత్సవాలు కల్యాణ, ఉట్ల, వనభోజనోత్సవాల గురించి ఇక్కడ వివరించడం ఉద్దేశ్యం.

**కల్యాణోత్సవం:**

'కల్యం సుఖం అణయతి ప్రాపయతి ఇతి కల్యాణమ్' సుఖాన్ని కలిగించేది కల్యాణమని సామాన్య అర్థం.వ్యక్తుల కల్యాణం ఆ యా వ్యక్తులకు, కుటుంబాలకు మంగళకరమయితే స్వామివారి కల్యాణం లోకానికి మంగళకరం. అందు వల్లనే దేవాలయాల్లో ఇతర ఉత్సవాదులతోపాటు కల్యాణోత్సావాలకు ప్రాముఖ్యం పెరిగింది. విశేషించి వైష్ణవాలయాలలో కల్యాణోత్సవం చేయించడం శుభప్రదంగా ప్రజలు భావిస్తారు.

తిరుమలలో కల్యాణోత్సవం బ్రహ్మోత్సవాలకు అనుబంధంగా జరుగుతుండేది. ఈ ఉత్సవం తిరుమామణి మంటపంలో జరిగేది. ఇక్కడ ఒక రాతి మీద విష్ణువు నాలుగు చేతులవాడయి గజవాహనం మీద ఊరేగే శిల్పం ఉండడం ఒకకారణం. రెండవది అన్నమయ్య కూడా తిరుమామణి మంటపాన అనడం. రానురాను భక్తజనుల తాకిడి పెరిగినందువల్ల కల్యాణోత్సవాలు సంపంగి ప్రదక్షిణంలో దక్షిణం వైపున ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన మండపంలో నిర్వహింపబడుతూవున్నాయి.

విష్ణు చిత్తుడయిన పెరియాళ్వార్ గోదాదేవిని శ్రీరంగనాథునికిచ్చి వివాహం చేసి మామగారు అయినట్లే అన్నమయ్య మంగాంబికను శ్రీవారికి ప్రదానంచేసి మామగారయ్యాడు. అందువల్లనే అన్నమయ్య కల్యాణకీర్తనలు ఎన్నోపాడాడు ఈ విషయాన్ని అన్నమాచార్యుని దౌహిత్రుడయిన రేవణూరి వేంకటాచార్యుడు శ్రీపాదురేణు మాహాత్మ్యంలోని; శ్రీలలరంగమంగమను, అనే పద్యంలో స్పష్టపరిచాడు.

అన్నమయ్య శ్రీవారి కల్యాణోత్సవాన్ని మొదలి తిరునాళ్ళకు మొక్కేము నేడు అని మొదలి తిరునాళ్లుగ పేర్కొన్నాడు. అన్నమయ్య కాలంలో బ్రహ్మోత్సవాలలో భాగమైన కల్యాణోత్సవాన్ని. పెనచి పదోనాడు పెండ్లిపీట'మీద' అని వర్ణించాడు. సామాన్యులయిన మానవమాత్రుల కల్యాణంలాగే శ్రీవారి కల్యాణోత్సవాన్ని వర్ణించడానికి కిందివాక్యాలే సాక్ష్యం. వైవాహికోత్సవంలో అంకురార్పణ (28-96) సేనాపతి కర్పూర తాంబూలం యివ్వడం, రక్షగా సుదర్శనచక్రం తిరగడం (18-4) పెండ్లిపీటను (20-365). పెండ్లికూతురు, పెండ్లికొడుకును (20-365), తెరను (25-411), మంగళాష్టకాలు (20-365), కంకణధారణ (20-365) ముహూర్తాన్ని (20-110) తలంబ్రాలు (8-194) ఆరతులు (20-110) కొంగుముళ్లు (20-365) బాసిక కట్టడం (20-365). నేడు తిరుమలలో ఆర్జిత కల్యాణోత్సవాలు సంవత్సరంలో దాదాపు అన్నిరోజులు జరుగుతున్నాయి.

**ఉరి అడి:**

జన్మదినోత్సవానికి ప్రాధాన్యం యిస్తూ వినోదానికి కూడ అవకాశం కల్పించే పండుగ ఉట్లపండుగ ఉరి అంటే ఉట్టి 'అడి' అంటె కొట్టడం. తెలుగులో ఉరిఉత్సవం, ఉట్టిపండుగ. సంస్కృతంలో శిక్యోత్సవం. వైష్ణవంలో తమిళపదాలకు వాడుక ఎక్కువ కావడం వల్ల 'ఉరిఅడి' అనడానికే ప్రాచుర్యం ఎక్కువ. కల్యాణోత్సవం మలయప్ప స్వామికైతే ఉట్ల ఉత్సవం శ్రీకృష్ణునికి సంబంధించింది. ఈ ఉత్సవం జరగడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి తిరుమల సేవలో మానవులకున్న ప్రత్యేకగౌరవం మొట్టమొదట ఆలయ ప్రవేశం- నాటికి నేటికి యాదవులదే. రెండవది యాత్రీకుల వినోదార్థం పైగా వసి పిల్లలకు ఉల్లాసార్థం.

సంచితకర్మ ప్రారబ్ధ కర్మలను తొలిగించు కొన్నప్పుడే ముక్తి సాధ్యం. ఈ రహస్యాన్ని తెలియజేసేది ఉట్లఉత్సవం. అన్నమయ్య అటుకుల వుట్టి, చెక్కరవుట్టి, తేనెవుట్టి, పంచదారవుట్టి, వెన్నవుట్టి మొదలైన వానిని ప్రస్తావించివున్నాడు పైగా దీనిని పండగ అన్నాడు.

**పచ్చిదేరుచు నుట్ల పండగాయను**
**గచ్చులకు గొల్లెతలు కౌగిలించి పట్టగా**
**పైకొని చూడరో వుట్ల పండగనేడు**
**ఆకడ గొల్లెతలకు నానందము నేడు**

తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామివారికి ప్రతిసంవత్సరం గోకులాష్టమి ఆస్థానం. మరుదినం శ్రావణ బహుళాష్టమి నాటిరోజు ఉట్లపండుగ నిర్వహిస్తారు ఈ ఉత్సవంలో ఉత్సవ మూర్తులైన మలయప్ప స్వామివారికి, శ్రీకృష్ణస్వామి వారికి ప్రాధాన్యం. చతుర్వీథుల ఉత్సవం నిర్వహిస్తారు. ఉత్సవ వీధులలో ఏర్పాటుచేసిన ఉట్లను భక్తజనానికి ఆనందంకలిగేటట్టు కొట్టుతూ ఉత్సవం జరుపుతారు. ఉత్సవాల్లో పాల్గొనే వారు కేవలం పురుషులే.

**వనభోజనోత్సవం:**

ఒక ఉద్యానవనంలోకి శ్రీవైష్ణవులతో కలిసి వెళ్ళి అక్కడే పూజాదులు నిర్వహించి తళిగె సమర్పించి వినోదించడం వనభోజనోత్సవం. ఇది కార్తీక మాసంలో జరిగేటటువంటి ఉత్సవం. దీనికోసం పెదతిరుమలయ్య స్థనత్తురుల పేరుమీద పన్నెండు మండపాలను కట్టించాడు. అన్నమయ్య తనసంకీర్తనలలో పులగాలు, బువ్వాలు, విందులు, సింగారుపు తోట పదాలవాడకం వల్ల వనభోజన ప్రసక్తి కనిపిస్తుంది.

ఇంతేకాక అన్నమయ్య సుప్రభాతం, కొలువు, ఏకాంతసేవ, శుక్రవారాభిషేకం, ధనుర్మాసం, తెప్ప, పుష్ప, కోడైతిరునాల్, శ్రీరామనవమి, ఉగాది, సంక్రాంతి మొదలైన ఉత్సవాలను దర్శించి సంకీర్తనలు ఆలపించాడు.

# తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో ప్రదర్శించే కళారూపాలు

డా॥ గెంఢ అరుణ

కోలాహలం లేకపోతే అది ఉత్సవంకాదు. కాబట్టే వాహన ఊరేగింపులో మంగళ వాద్యాలు, ఏనుగులు, గుర్రాలు, వృషభాలు అన్నీ మర్యాద పూర్వకంగా ముందుగా వెళ్తుంటాయి. వాటికన్నా ముందుగా సందడి చేస్తూ భక్తులు అనేక ప్రదర్శన కళలను ప్రదర్శిస్తూ ముందుకు సాగుతూ ఉంటారు. ఈ ప్రదర్శన కళలలో వారి వారి శక్త్యానుసారం భక్తులు కళారూపాలను ప్రదర్శిస్తూ స్వామిపై అలా భక్తిని చాటి చెప్తూఉంటారు.

మనస్సులోని సంతోషాన్ని, బాధను వ్యక్తంచేయడానికి కళ ఎంతగానో ఉపయోగపడుతుంది. ఉత్సవ సమయంలో భగవంతుడి ముందు భక్తులు ఆటలను, పాటలను ఆడి పాడి తమ సుఖదుఃఖాలను వ్యక్త పరుస్తూంటారు. తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అనేక ప్రదర్శన కళలు చోటుచేసుకున్నాయి. అలాంటి కళలు కిందివిధంగా ఉన్నాయి.

**మంగళవాద్యాలు :**

మంగళ వాద్యాలనే మేళతాళాలు అనీ సన్నాయి మేళం అని అంటారు. మంగళ వాద్యాలను శుభకార్యాలు చేసేటప్పుడు వాయిస్తుంటారు. మంగళ వాద్యాలు ఎక్కువగా దేవాలయాల్లో కనబడుతూ ఉంటాయి. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో మంగళవాద్యాలను ఊరేగింపుముందు వాయిస్తూ వెళ్తారు. మంగళ వాద్యాల్లో డోలు, సన్నాయి వాయించేటప్పుడు వాటి లయకు అనుగుణంగా తాళాలను శృతినికూడా వాయిస్తారు.

**తాళభజన :**

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలలో అనేక బృందాలు తాళభజన చేస్తూ కనబడుతాయి. తాళభజనలో తాళాలు, హార్మోనియం వంటివి ఉంటాయి. పాటకు అనుగుణంగా తాళాలను వాయిస్తూ ఒకరు, పాటపాడ్తూ ఉంటే పాడేవ్యక్తిని అనుసరిస్తూ తాళాలను వాయిస్తూ మిగిలిన వాళ్ళు వంతపాడుతూ ఉంటారు. ఇలా వీరు భజన చేస్తూ తిరుమల వీధుల్లో కనబడుతారు.

**డక్కి :**

తిరుమల బ్రహ్మోత్సవాల సమయంలో డక్కివాద్యాన్ని వాయిస్తూ పాటలను పాడ్తారు. మధ్యలో ఒకస్త్రీ నిలబడి డక్కి వాయిస్తూ పాటను పాడ్తూవుంటే చుట్టూ నిలబడి స్త్రీలు వంత పాడుతూ వారి చేతిలోని డక్కిని వాయిస్తారు.

**జక్కికి:**

జక్కికి నృత్యాన్ని స్త్రీలు ప్రదర్శిస్తారు స్త్రీలు అందరూ గుండ్రంగా నిలబడి ఒకరి చేతులను ఒకరు చరుస్తూ జక్కి నృత్యం చేస్తారు. పిల్లలు పెద్దలు అందరూకలిసి ఈ నృత్యాన్ని చేస్తారు.

ఇలా పాటను పాడుతూ తిరుమల బ్రహ్మోత్సవాలలో స్త్రీలు జక్కి నృత్యాన్ని ప్రదర్శిస్తారు.

**కోలాటం :**

కోలలతో చేసే నృత్యాన్ని కోలాటం అని అంటారు. కోలాటాన్ని పూర్వం స్త్రీలే వేసేవారు. కాల క్రమేణా పురుషులు కూడా ఈ కోలాటాన్ని వేయడం మొదలు పెట్టారు. కోలాటంలోని అడుగులను కోపులు అని అంటారు. కోలాటంలో గురువు చెప్పిన విధంగా పాటకు తగ్గట్టుగా కోపులను మారుస్తూ నృత్యం చేస్తారు. ఈ నృత్యంలో ఉద్దీలు సరిసంఖ్యలో ఉంటారు. పురుషులు పంచ లేదా అరనిక్కరు, బనియను వేసుకొంటారు తలకు దట్టీని, నడుముకు సవకాన్ని కట్టుకొంటారు. నుదుట బొట్టు పెట్టి చేతిలో కోలలను పట్టి కాళ్లకు గజ్జెలను కట్టుకొంటారు. స్త్రీలు చీర రవిక ధరిస్తారు. పిల్లలు పావడ, రవిక గాని లేదా పంజాబీ డ్రస్సుగాని ధరిస్తారు. జడకుచ్చులు, మెడగొలుసులు, గాజులు, చెవిరింగులు, కాళ్లగజ్జెలు, తలలో పువ్వులు వంటివి ధరిస్తారు. ఒక గుంపులో సుమారుగా నలభై మంది వరకు ఉంటారు. వీళ్ళు వారి వారి చుట్టు పక్కల గ్రామాల్లో ఉండేవాళ్ళు గురువు దగ్గర విద్య నేర్చుకొంటూ ఉంటారు. తిరుమల బ్రహ్మోత్సవాలకు వీరంతా ఒక బృందంగా ఏర్పడి స్వామిసేవకు తరలి వస్తారు. ఈ నృత్యంలో పక్క ఉద్దీకోలలను చరుస్తూ వెనక్కు తిరిగి ముందుకువంగి, పక్కకు తిరిగి ఇలా అనేక విధాలుగా నృత్యాన్ని చేస్తారు.

**చెక్కభజన :**

చెక్కలతో చేసే భజనను చెక్కభజన అని అంటారు. ఈ చెక్కలు ఒక అడుగు పొడవు వుండి పట్టుకోడానికి వీలుగా పిడి ఉంటుంది. ఈ నృత్యంలో అనేక మంది పాల్గొంటారు. స్త్రీ పురుషులు ఇద్దరూ ఈ నృత్యాన్ని చేస్తారు. స్త్రీలు రవిక, చీర ధరిస్తారు. ఆడ పిల్లలు పావడ, రవిక లేదా పంజాబి దుస్తులు ధరిస్తారు. పురుషులు పంచ లేదా అరనిక్కరు, బనియను ధరిస్తారు. కాళ్లకు గజ్జలు కట్టుకొని, తలకుదట్టీని కట్టి నుదుట కుంకుమ బొట్టు పెట్టుకొంటారు. ఈ నృత్యంలో పదమూడు రకాల అడుగులను వేస్తారు. గురువు దగ్గర నృత్యాన్ని నేర్చు కొంటారు. గురువు పాటపాడుతూఉంటే నృత్యకారులు లయబద్ధంగా నృత్యంచేస్తూ వంతపాడ్తూ ఉంటారు.

**కులుకుభజన :**

కులుకుతూ చేసే భజనను కులుకుభజన అని అంటారు. ఈభజనలో కూడా చెక్కలను వాడుతారు. ఈ భజనలో సుమారు ముప్పైమంది వరకు నృత్యకారులు ఉంటారు. ఒక చేతిలో చెక్కలు వాయిస్తూ నృత్యం చేస్తారు. కాళ్లకు గజ్జెలు కట్టుకొంటారు. ఈ భజనలో గుండ్రంగా తిరుగుతూ ముందుకు వంగుతూ, పక్కలు తిరుగుతూ, వెనక్కి అడుగువేస్తూ ఇలా అనేక విధాలుగా నృత్యం చేస్తారు.

**గోప్రాత :**

తిరుమల బ్రహ్మోత్సవాల సమయంలో గోప్రాతకళను ప్రదర్శిస్తారు. మొక్కు బడి ఉన్నవాళ్ళు ఈ కళను ప్రదర్శిస్తారు. ఇద్దరు భక్తులు మొలకు పంచ, నడుముదాకా దట్టీకట్టుకొని ఉంటారు. వాళ్ళ చేతిలో

గుడ్డలతో చేసిన చిన్న తొండం లాంటి తుండును పెట్టుకొని ఉంటారు. కాగడాను పట్టుకొని వాళ్ళతో ఒక వ్యక్తి నడచి వస్తుంటాడు. ఆ కాగడాతో గుడ్డ తుండును వెలిగించుకొని వీపుకు, గుండెలకు బాదుకొంటూ 'గోప్రాత్, గోప్రాత్' అని అరుస్తూ ఉంటారు. అగ్గి ఆరిపోయినప్పుడల్లా మళ్ళీ వెలిగించుకొని కొట్టుకొంటారు. ఆ విధంగా భక్తితో కొట్టుకోవడం వల్ల వాళ్ళ శరీరాలు కాలవని నమ్ముతారు.

**రోకలి గెరిగ :**

తిరుమల బ్రహ్మోత్సవాల సందర్భంగా రోకలి గెరిగ ఆట ఆడుతారు. ఒక రోకలి లాంటి గడకొయ్యకు పైన గొడుగులాగా పట్టు దారాలతో కడ్తారు. దీనిని రోకలి గెరిగ అని అంటారు. దీన్ని ఒక వ్యక్తి తలపై పెట్టుకొని చేతితో దాన్ని పట్టుకోకుండా బ్యాలెన్సు చేస్తూ అడుగులు వేస్తూ ఉంటాడు. ఈ నృత్యం చేసే వ్యక్తి కుర్తా పైజమాను ధరించి, కాళ్ళకు గజ్జెలను కట్టుకొని ఉంటాడు.

ఇలా తిరుమల బ్రహ్మోత్సవాలలో అనేకరకాల కళలను ప్రదర్శిస్తూ స్వామి వారిపై భక్తిని చాటి చెప్పు కొంటారు. ఈవిధంగా శ్రీవారి బ్రహ్మోత్సవాలు భక్తులకోలాహలం మధ్య అంగరంగ వైభవంగా జరుగుతాయి.

# శ్రీవేంకటేశ్వర ఉత్సవ వైభవమ్

డా॥ పూర్ణవల్లి

**శ్రీవేంకటాద్రి నిలయః కమలాకాముకః పుమాన్ ।**

**అభంగుర విభూతిర్నస్త రంగయతు మంగళమ్ ॥**

అపార కారుణ్యౌదార్య వాత్సల్య సౌశీల్య స్వామిత్వ సౌలభ్యాద్యనన్త కల్యాణగుణ మహోదధియై కలియుగ ప్రత్యక్షదైవమై కామితార్థ ప్రదుడై శ్రీవేంకటా యందు ఆనందనిలయమున పరమానంద ప్రదాతయై అర్చావతారమున శ్రీవేంకటేశ్వరస్వామి వారు వేంచేసి యున్నారు.

అంజనాద్రి, నీలాద్రి, వృషాద్రి, వృషభాద్రి, శేషాద్రి, గరుడాద్రి, వరాహాద్రి, శ్రీనివాసాద్రి, తీర్థాద్రి, కనకాద్రి, పుష్కరాద్రి, సుమేరుశిఖరాద్రి, వేదాద్రి, జ్ఞానాద్రి, ఆనన్దాద్రి ఇత్యాద్యనేక సార్థక నామములతో పురాణ ప్రఖ్యాతి గాంచిన వే.కటాద్రి (తిరుమల) యందు ఇరువది యెనిమిదవ ద్వాపర యుగాన్తము నందలి ఈ కలియుగమునందు విష్ణ్వర్చావతారముగా నవతరించినట్లు ఈ క్రింది ఋగ్వేద మంత్రముచే తెలియుచున్నది.

**"ప్రవః పాన్త మన్ధసో ధియాయతే ।**

**మహే శూరాయ విష్ణవే ర్చత॥" (ఋ10 మండలం 155 సూక్తము 1వ మంత్రము)**

**అర్చావతార వైభవమ్ :**

**అర్చావతార స్సర్వేషాం బాంధవో భక్తవత్సలః**

**స్వత్మ మాత్మని సంజాతం సామిత్వం బ్రహ్మణిస్థితమ్**

భక్తుడు తన ఇష్టానుసారముగా తన శక్తిననుసరించి స్వర్ణము, రజితము, దారువు, సుధాలతో భగవంతుని ప్రతిమను నిర్మించి అర్చించవీలుగాను. దేశ, కాల, అధికార, నియమములు లేక దేవాలయములందును గృహములందును వేంచేపు చేసుకోను వీలుండును. సాధారణముగా స్వయం వ్యక్త మూర్తి దుర్లభము. కావున భగవంతుని మూర్తిని ప్రతిష్ఠించి అరాధింపవలయునని పద్మపురాణము తెలుపుచున్నది.

అర్చావతారమున భగవంతుడు భక్తపరాధీనుడై ప్రీతిని కొలువుతు, మంగళకరుడై సమస్తులకు సులభముగా ఆశ్రయింప, అనుభవింప తగిన సంపూర్ణుడుగా నుండును.

**సురూపాం ప్రతిమాం విష్ణోః ప్రసన్న వదవేక్షణమ్ ।**

**కృత్వాత్మనః ప్రీతికరం సువర్ణ రజితాదిభిః**

**తామర్చయేత్ తాం ప్రణయేత్ తాంవయేత్ తాంవిచిన్త యేత్**

**విగతం దోషస్తు తామేవ బ్రహ్మరూపిణీమ్ ॥**

ఉపాసకునకు ఎప్పుడు ఎచ్చట శ్రద్ధ కలిగినప్పుడు అప్పుడు అచ్చటచ్చట అర్చామూర్తులకు అర్చనచేసి తరింప వచ్చునని పురాణ ప్రబోధము.

**"మదర్చాం సంప్రతిష్ఠాప్య మందిరం కారయే ద్రుఢమ్**
**పుష్పోద్యానాని రమ్యాణి పూజా యాత్రోత్సవాశ్రితాన్ ॥**

అని శ్రీభాగవతము నందు గూడ ప్రతిమా వైశిష్ట్యము తెలుపబడి ఉన్నది.

అర్చామూర్తిని నిర్మించి, ప్రతిష్ఠించి ధృఢమైన మందిరమును, సుందర నందన వనమున నిర్మించి పూజలు, ఉత్సవాలు, యాత్రలు అవిచ్ఛిన్నముగా జరిపించి పర్వదినములలో గో, భూ, ధన, కనక వస్తు వాహనములను దానము చేసినచో అష్టైశ్వర్యములను పెంచుటయే గాక బ్రహ్మలోకమును పొందవచ్చునని శ్లోకసారము.

భగవంతుడు అనగా జ్ఞాన శక్తి బల ఐశ్వర్య వీర్య తేజస్సు అను ఆరు గుణములను పూర్తిగా కలవాడని అర్థము. ఆ షడ్గుణములు మంత్రములందును, భగవంతుని ప్రతిమలందును కూడ ఉండును. కావున అర్చావతార మూర్తులను కేవలం ప్రతిమలుగా భావించి అర్చించరాదు. శ్రీవేంకటేశ్వరస్వామి వారు దక్షిణహస్తముతో తన పాదాబ్జములను శరణవరణ స్థానముగా చూపుతూ-

**కటిన్యస్త కరేణాపి నిజ పాదాబ్జగామినీమ్ ।**
**నృణాంభవపయోరాశిం కటిదఘ్నం ప్రదర్శయన్ ॥ (భవిష్యోత్తర 13వ అధ్యా)**

కటిహస్తముతో తన్నుశరణు జొచ్చిన వారికి సంసారసాగరము కటిదఘ్నమగునని కటిలోతు చూపుతూ, ఉభయ పార్శ్వముల శంఖ చక్ర ధారియై స్వయంభూ అర్చావతారమూర్తియై దర్శన మిచ్చు చున్నారు.

**నిత్యారాధన వైభవమ్ :**

శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రతినిత్యము జరుగు ఆరాధనమే ఒక వైభవము. బ్రహ్మముహూర్తమునకు పూర్వముగానే మహర్షికుల తిలకుడు విశ్వామిత్ర మహాముని త్రేతాయుగమునందు శ్రీరాముని మేలుకొలుపునకు గావించిన "కౌసల్యా సుప్రజా రామ ! పూర్వా సంధ్యా ప్రవర్తతే ..." అను సుప్రభాత గీతను ప్రారంభించి ప్రతివాది భయంకర అణ్ణన్ గారు రచించిన శ్రీవేంకటేశ్వర సుప్రభాతమ్ లోని 70 శ్లోకములు (సుప్రభాతమ్ -29 శ్రీ వేంకటేశ్వర స్తోత్రమ్ - 11 ప్రపత్తి -16 మంగళా శాసనమ్ -14) పూర్తిగా మధురముగాను, మృదులముగాను, బంగారు వాకిలి వద్ద పఠింపబడుతుంది. భక్తులకు దర్శనం కల్పించిన తదుపరి ఆలయ శుద్ధి జరిగి తోమాలసేవ ప్రారంభమగును.

శ్రీజియ్యంగార్ స్వామి, అధ్యాపకులు శ్రీఅండాళ్ సాయించిన తిరుప్పావై లోని 28 పాశురములను పఠించుచుండగా అర్చకస్వాములు జియ్యంగార్ అందించు పుష్పమాలలను, శ్రీభోగశ్రీనివాసమూర్తికి అభిషేకాది ఉపచారములు సమర్పించిన తరువాత, శ్రీవేంకటేశ్వర స్వామి వారికి (అలంకారప్రియోవిష్ణు) కంఠమాలలు, హృదయ పర్యన్తమాలలు. నాభి పర్యన్త మాలలు, కటి పర్యన్తమాలలు జాను పర్యన్తమాలలు పాదపర్యన్త మాలలు, కరారిమాలలు, శంఖచక్ర మాలలు, శిరోమాలలు, శిఖరమాలలు సమర్పించు వైభవమును చూచి తరించవలసిందే గాని వర్ణింప నలవికాదు. సేవాంత్యమున మంత్ర పుష్పము పఠించిన తదుపరి నక్షత్ర హారతి కర్పూర హారతి జరుగును. భక్తులకు దర్శనం కల్పించిన అనంతరం కొలువు (దర్బారు).

కొలువు శ్రీనివాసమూర్తిని బంగారు వాకిలికి సమీపమున ఏర్పరచిన సింహాసనమున సువర్ణ ఛత్రము, వింజామరలు మొదలగు మహారాజ మర్యాదలతో వేంచేపు చేసి ఆరాధనోపచారములు జరిపించి ఆ దిన, పరదినమున గల తిథి వార నక్షత్ర యోగ కరణములను హుండీ ఆదాయవివరములను ఉత్సవాది విశేషములను వినిపింపబడుతుంది. తరువాత స్వామి విగ్రహము గర్భాలయంలోకి కొనిపోబడిన తరువాత సహస్రనామార్చన జరుగుతుంది. బ్రహ్మాణ్డ పురాణాంతర్గతమగు శ్రీవేంకటేశ్వరస్వామి వారి సహస్రనామములు మధురాతి మధురముగా అతిశ్రావ్యంగా ఆద్యన్తము లందు ప్రణవ నమస్సంపుటీ (ఓం...నమః) కరణము చేసి పఠింపబడుతుంది. వరాహపురాణోక్తములగు లక్ష్మీనామములతో శ్రీభూదేవేరులకు అర్చన జరుగును.

ప్రాతర్నివేదనము బలి శాత్తుమొర జరిగిన అనంతరము సర్వదర్శనము భక్తులకు తీర్థము, శఠారి ప్రసాదములు ఇవ్వబడుతుంది. స్వామి వారు. భక్తుల కష్టసుఖాలను ప్రార్థనలను మన్నించునట్లు గోచరిస్తారు. ఇదియే సర్వదర్శన వైభవము.

మాధ్యాహ్నికారాధనముగా వరాహ పురాణాన్తర్గతములగు అష్టోత్తరశతనామములు పఠింపబడుతాయి. సాయంకాలారాధన క్రమంలో గూడ తోమాలసేవ. అష్టోత్తరశతనామార్చన జరిగి సర్వదర్శనము తరువాత ఏకాంతసేవ జరుపడం కూడ ఒక వైభవమే. వెండి గొలుసులతో బంగారు మంచం అందులో పట్టు పరుపులు, దిండ్లు, శాటీలు ఏర్పరిచి కౌతుకమూర్తి యగు శ్రీభోగశ్రీనివాసమూర్తిని (ధనుర్మాసములో శ్రీకృష్ణుని) శయనాసనమున వేంచేపు చేసి ఫలములు, ద్రాక్ష, శర్కర, కలకండ, బాదాంపప్పు, జీడిపప్పు క్షీరములు నివేదింపబడగ, తాళ్ళపాక అన్నమాచార్య వంశస్థుల అన్నమయ్య కీర్తనలను తంబూర నాదముతో గానము చేసి స్వామి వారిని నిదుర పుచ్చుదురు. తరిగొండ వేంగమాంబ ముత్యాలహారతి చివరి హారతిగా యివ్వబడుతుంది.

ఇలా శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రతిరోజు నిత్యకల్యాణం పచ్చతోరణమే.

**బ్రహ్మోత్సవ వైభవమ్ :**

ఉత్సవమనగా ఉత్సూతే హర్షం ఇతి ఉత్సవః అను వ్యుత్పత్తిచే ఆనందమును అధికముగ కనునది అని అర్థము.

శ్రీవేంకటేశ్వరస్వామి వారికి ప్రతిసంవత్సరం కన్యామాసంలో శుక్ల పక్షమున శ్రవణనక్షత్రం రోజు చక్రస్నాన మహోత్సవాన్ని నిర్దేశించి తొమ్మిది రోజులు ముందుగా ధ్వజారోహణము, అంతకుముందు దినము అంకురార్పణ జరుపబడుతుంది. ధ్వజారోహణమాధాయ సాంకురార్పణ మేవచ (అని ఆగమశాస్త్రంలో చెప్పబడివుంది.)

పరబ్రహ్మయగు శ్రీమన్నారాయణునికి చతుర్ముఖ బ్రహ్మ కన్యామాసంలో శుక్లపక్షమున శ్రవణ నక్షత్రం రోజున అవభృథమును సంకల్పించి బ్రహ్మ సంఖ్యాకమగు తొమ్మిది రోజులు జరిపించిన ఉత్సవమే బ్రహ్మోత్సవము. పరబ్రహ్మయగు సర్వేశ్వరుని ఉత్సవమగుట చేత బ్రహ్మోత్సమని అంటారు. కావున ఇది సర్వకామ ప్రదమగును. ఇది వరహాపురాణంలో చెప్పబడింది.

సాధారణముగా కన్యామాసము అశ్వయుజమాస మైనప్పుడు ఈ ఉత్సవము విజయదశమి వరకు తొమ్మిదిరోజులు జరుగును. ఒకప్పుడు కన్యామాసము భాద్రపదమాసమైనప్పుడు భాద్రపదమునందును, ఆశ్వయుజము నందును కూడా జరుగును. మొదటి ఉత్సవము మామూలు బ్రహ్మోత్సవము రెండవ ఉత్సవమును నవరాత్రి ఉత్సవమందురు. ఇందులో ధ్వజారోహణము, రథము, ధ్వజావరోహణము ఉండవు. దారు రథమునకు బదులు రజిత లేక స్వర్ణ రథోత్సవము జరుప బడుతుంది. ప్రతి దినము పగలు, రాత్రి రంగమండపంలో శ్రీమలయప్పస్వామి వారిని పెద్దశేషవాహనంపై ఉభయ దేవేరులకు వేంచేపు జరిపి ఆస్థానం జరిపిస్తారు.

భవిష్యోత్తర పురాణంలో బ్రహ్మదేవుడు శ్రీస్వామి వారికి గావించిన బ్రహ్మోత్సవ వాహన క్రమము ఉత్సవ క్రమము 14వ అధ్యాయమునందిట్లు వర్ణింపబడి యున్నది.

**"తస్మిన్ మహోత్సవే విష్ణోః ధ్వజారోహణ వాసరే**
**ప్రథమే ప్రథమం యానం మనుష్యాన్దోళికాభవత్ ॥**

**తృతీయం మంగళ గిరిరేర్యానం రాత్రావభూత్తతః**
**ధ్వజావరోహణాభిఖ్యః ఉత్సవోఽ భూత్తదా హరేః ॥**

బ్రహ్మోత్సవంలో ధ్వజస్తంభస్థాపన గ్రామాలంకరణ, ఆచార్య ఋత్విక్కుల నియమాలు, అంకురార్పణ, ధ్వజారోహణ, నవకుంభారోహణ, హోమం, వీధి ఉత్సవాలు చక్రస్నానం (అవభృధస్నానం) ధ్వజావరోహణ అను క్రియలు ఉండును (ఈ బ్రహ్మోత్సవము పదిరోజులపాటు జరుగుతుంది.) మొదటిరోజు అంకురార్పణం చేస్తారు. ఆరోజు సాయంకాలం సేనాధిపతియైన విష్వక్సేనుల వారు వేదమంత్రాలతో ఆహ్వానింపబడి అంకురార్పణమునకు అవసరమగు మృత్సంగ్రహణము తీసుకొని జరుగబోవు శ్రీవారి బ్రహ్మోత్సవమును తిలకించడానికి సకల దేవతలను ఆహ్వానిస్తారు ఊరేగింపు అనంతరం విష్వక్సేనుల వారు అనంత గరుడ సుదర్శనులతో యజ్ఞశాల యందు వేంచేసి యుందురు. జాలి, వ్రీహి, యవ, ముద్గ మాష ప్రియంగు సర్షప గోధుమ అను ధాన్యములను పుట్టమట్టి పోసిన పాలికల యందుంచి ప్రతిదినము అర్చించెదరు. రాత్రి కాలము చంద్రునిది. చంద్రుడు ఓషధులకు అధిపతి. కావున రాత్రి చంద్రుని సాక్షిగా అంకురార్పణచేయవలయునన్నది ఆగమశాస్త్ర ప్రమాణము. ఇది అన్ని వైదిక క్రియలకు అత్యావశ్యకము, లేకున్న అన్ని కార్యములు వ్యర్థమే.

మరునాడు బ్రహ్మోత్సవం ప్రారంభసూచకంగా శ్రీవిష్ణు పతాకంకొని గరుత్మంతునికి (గరుడ ధ్వజాన్ని) పూజలు జరిపించి ధ్వజస్తంభపు చివరకు ఆరోపిస్తారు. జగన్నాధుడైన శ్రీవేంకటేశ్వరస్వామి వారు శ్రీదేవి భూదేవి సమేతుడై సర్వాభరణ భూషితుడై దివ్యనవ్య వికసిత పుష్పమాలాధరుడై తిరువీధుల ఊరేగి తిరుమలరాయ మండపం వేంచేసియుండిన ప్రధానార్చకులు వేద ఘోషలతోను నాదస్వరాది మంగళ వాద్యములు మ్రోగుచుండ నిర్ణీతశుభమూహుర్తమున ఆగమోక్తరీతిగా ధ్వజారోహణ జరువుతారు.

వివిధ వాహనములకు ముందు అలంకరింపబడిన చిన్నరథం త్రిప్పుతుంటారు. ఇదే బ్రహ్మరథం. అంటే ఈ బ్రహ్మోత్సవాన్ని స్వయంగా బ్రహ్మదేవుడే ఈ రథంలో ఉండి జరిపించుచున్నారని ఐతిహ్యము.

మొదటిరోజు అనగా ధ్వజారోహణం రోజు రాత్రి సప్తశిరములతో బహుమనోహరమైన పెద్ద శేషవాహనముపై శ్రీమలయప్పస్వామి వారు. శ్రీభూదేవేరులతో కలసి ఊరేగుతారు.

రెండవరోజు చిన్నశేష వాహనంపై శ్రీనివాసుని మాత్రమే అలంకరించి ఊరేగిస్తారు రాత్రి పురాణప్రసిద్ధమైన హంసవాహనంపై ఊరేగింపు. హంసవాహనారూఢుడైన స్వామి వారిని దర్శించిన వారికి సకల బాధలు తొలుగునని భక్తుల నమ్మకం.

మూడవరోజు ప్రొద్దున సింహవాహనంపై శ్రీనివాసమూర్తికే ఉత్సవం జరుగుతుంది. రాత్రి ముత్యపు పందిరి వాహనంలో శ్రీభూదేవేరులతో ఊరేగుతారు.

నాల్గవరోజు కల్పవృక్షవాహనారూఢుడై దేవేరులతో తిరువీధులలో ఊరేగుతూ, తన భక్తులకు ఇహపర సుఖములను ప్రసాదిస్తారు. రాత్రి కూడా దేవేరులతో సర్వభూపాల వాహనంలో సేవచేయిస్తారు.

బ్రహ్మోత్సవంలో ఐదవరోజు చాలా ముఖ్యమైనది. ప్రొద్దున మలయప్పస్వామి వారు దంతపు పల్లకిలో మోహినీ అవతారంలో ఉరేగుతారు. వరదహస్తం ఆరోజు అభయహస్తంగా ఉంచి భక్తులను ఆదరించునట్లుగా

దర్శనమిస్తారు. రాత్రి గరుడోత్సవం. శ్రీవేంకటేశ్వరస్వామి వారి (మూలవిరాట్టు) అలంకారాభరణములైన లక్ష్మీహారము. మకరకంఠి మొదలగు అమూల్య ఆభరణములు గరుడవాహనంలో మలయప్పస్వామి వారికి అలంకరిస్తారు. ఈనాటి రెండు వాహనసేవలను వర్ణింప నలవికాదు తనివితీర దర్శించి తరించవలసినదే.

ఆరవనాడు ఉదయం హనుమద్వాహనసేవ మధ్యాహ్నం వసంతోత్సవ సందర్భంగా జరుగు సువర్ణరథం రాత్రికి జరిగే గజవాహన సేవలలో స్వామి వారు సర్వరాజలాంఛనాలతో వైభవంగా దర్శన మిస్తారు.

ఇక ఆరునొకటవ రోజు తాను సూర్య చంద్ర గోళములలోను నివసించి "భీషోదేతి సూర్యః' అనియు పూష్ణామి చౌషధీస్యరాః, సోమో భూత్వా రసాత్మకః" అనునట్లు దర్శన మిస్తారు శ్రీస్వామి వారు.

ఎనిమిదవరోజు ప్రొద్దున శ్రీమలయప్పస్వామి దేవేరులతో నిర్ణయిత ముహూర్తమున తిరువీధుల రథం పై ఉరేగుతారు. "రథస్థం కేశవం దృష్ట్వా పునర్జన్మ న విద్యతే" అన్నది పెద్దల ఉవాచ. అందుకే ఈరోజు తిరుమల జనసందోహంతో ఉంటుంది. రాత్రి శ్రీస్వామివారు అశ్వంపై ఉరేగుతూ-

**"యదా యదా హి ధర్మస్య గ్లానిర్భవతి భారత।**
**అభ్యుత్థానమధర్మస్య తదాఽఽత్మానం సృజామ్యహమ్ ॥**
**పరిత్రాణాయ సాధూనాం వినాశాయ చ దుష్కృతామ్**
**ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే ॥**

అని ప్రబోధిస్తున్నట్లు దర్శనమిస్తారు.

బ్రహ్మోత్సవం జయప్రదంగా జరిగిందని సూచింప తొమ్మిదవ రోజు స్వామి పుష్కరిణిలో సుదర్శన చక్రానికి అభిషేకం జరుపబడుతుంది. ఆరోజు స్వామి పుష్కరిణిలో అవభృథస్నానం చేసిన వారికి సకల పాపాలు నశిస్తాయని వారికి శాశ్వతానందం చేకూరుతుందని శ్రీవేంకటేశ్వరుడు ఈ కలియుగారంభంలో భూమండలమున అవతరించిన రోజు బ్రహ్మ సనత్కుమార సనకసనందాదులకు ఉపదేశించారని పురాణములు తెలుపు చున్నవి. సాయంకాలం ధ్వజావరోహణమునకు గాను తిరువీధి ఉత్సవం జరుగుతుంది.

ఈ బ్రహ్మోత్సవాన్ని వర్ణింప వేయి నోళ్ళున్న ఆదిశేషునికే తరమా అన్నసంశయం ఉన్నది కావున అందరు ప్రత్యక్షంగా శ్రీస్వామివారి ఉత్సవాన్ని దర్శించి తరించవలసిందే.

శ్రీవారి మహోత్సవమునకు ముందుగా అతిమనోహరాలంకారములతో భాసిల్లు ఊర్ధ్వ పుండ్రములను ధరించిన ఐరావతములవంటి మత్త గజములు. వినూత్నాలంకారములతో ప్రకాశించు ఉచ్చైశ్రవముల వంటి అశ్వములు, మనోహర ఆకృతుల చేతను, అలంకారములచేతను భాసించు వృషభములు, వైష్ణవ స్వరూపధారులై ప్రకాశించు పరివారజనములు విచిత్రగతుల ముందుగా గమనము చేయుచుందురు.

ద్వాదశోర్ధ్వ పుండ్ర ధారులై పవిత్ర పద్మాక్ష మాలా ద్యలంకృతులై శ్రీవైష్ణవులు పంక్తులు తీరి నాలాయిర దివ్య ప్రబంధములను మధురకళారవముతో గానము చేయుచుండ-

నానాదేశాగత నానా భాషా భాషణతత్పరులగు యాత్రిక భక్త సమూహములు "వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని, ఆపద మ్రొక్కుల వాడే ఆది దేవుడే వాడు తోమని పళ్యాలవాడే దురిత దూరుడే, పుట్టు గొడ్డు రాండ్రకు బిడ్డలిచ్చే గోవిందుడే ఎలమి కోరిన వరాలిచ్చే దేవుడేవాడు" అని పరవశంతో పాడుతూ, భగవదుత్సవ సందర్శనముచే అమందానందమందాకినీ వీచికల తారసలాడుచుండ,

నాగస్వరం వాద్యవిద్యాంసులు తమ గానవాదనవైశద్యవైచిత్ర్యమాధుర్య నైపుణ్యములతో భక్తులను మై మరిపించి ఆనంద డోలికలలో ఉగించుచూ,

అధికారులు, అనధికారులు, వర్తకులు, నర్తకులు శ్రీపతులు,భూపతులు ఉత్సవమునందు పాల్గొను చుందురు. పామర భక్తజనులు స్వామి వారిని కీర్తింప పదములు తెలియక గోవిందా! గోవిందా! అనుచుందురు.

శ్రీవారి వెనుక వైదికసార్వభౌములైన చతుర్వేద పారాయణ ప్రవీణులు వేద పఠన మాచరించుచుండ ఈ బ్రహ్మోత్సవ వైభవం వైభవమే.

**సేవా ఫలమ్ :**

ప్రతి సంవత్సరం కన్యామాసములో ఉత్సవము (ఆర్జిత బ్రహ్మోత్సవము) చేసి దేవతలు, యోగులు, మునులు, మనుజులు భూలోకమున సర్వకామములను అనుభవించి బ్రహ్మలోక ప్రాప్తి చెందుదురనియు బ్రహ్మోత్సవ సమయమున చలివేంద్రములను ఏర్పరిచిన వారి హృదయము శీతల మగుననియు, అన్నదానము గావించిన వారికి (ఏడుతరాలవరకు- సప్తపురుషాంతరముల వరకు) అన్న సమృద్ధి కలుగుననియు, శాస్త్రో దితములైన దానము చేసిన వారికి ఐహిక సుఖములు కలుగుననియు, ఇంతయేల? దర్శనార్థమై తిరుమలకు రావడానికి ప్రయత్నించిన వారికి గూడ వైకుంఠప్రాప్తి కలుగునని బ్రహ్మగావించిన ఉత్సవమునకు సంతసించిన శ్రీనివాసుడు స్వయంగా చెప్పాడు.

# రాయలసీమ జానపదగేయాలలో వెంకన్న

డా॥ వి.ఆర్. రాసాని

జనపదం అంటే పల్లెటూళ్ళు. జానపదులు అంటే పల్లెల్లో జీవించేవాళ్ళు (Folkmen or country men) అని అర్థం. జానపద సాహిత్యం అంటే ఆ జానపదులకు సంబంధించిన సాహిత్యం. అంటే విద్యాగంధపు వాసన నెరుగని కర్షకులకు, శ్రామికులకు సంబంధించిందన్నమాట. ఇది వారికోసం వారే సృష్టించుకున్న సామూహిక సాహిత్యం. ఏ రాతపూతలతో పనిలేకుండా కేవలం మౌఖిక ప్రసారంలోనే ఒక తరంనుంచీ మరో తరానికి సునాయాసంగా అందివ్వబడుతున్న సాహిత్యమిది. అందుకే దీన్ని మౌఖిక సాహిత్యం అని కూడా అంటారు. జానపదులకు సంబంధించి సాంస్కృతికమైన ప్రతి అంశాన్ని గురించి తెలియచేసేది జానపదవిజ్ఞానం. ఆ విజ్ఞానంలో ఒక ప్రధానమైన అంగం జానపదసాహిత్యం. ఇది గేయరూపం, వచనరూపం అని రెండురకాలుగా వుంటుంది.

ఈ గేయరూప సాహిత్యంలో వేంకటేశ్వరుడు ఎలా వర్ణించబడ్డాడో చిత్రింపబడ్డాడో తెలియ చేయడం వరకే ఈ వ్యాసం ఉద్దేశింపబడింది.

పొలం పనుల్లోను, తీరుబడిగా ఇళ్ళముందరగానీ, గుడిముందరగానీ కూర్చున్న సమయంలోనో, లేదా ఏ వెన్నెల రాత్రుల్లో ఆడే ఆటపాటల్లోను అలా అనేక సందర్భాలలో జానపదులు పాడుకున్న గేయాలలో భక్తి, శృంగారం, కరుణం, హాస్యం వంటి ఎన్నో విషయాలకు సంబంధించిన అంశాలు వుంటాయి. వాటిలో పారమార్థిక గేయాలు, భక్తిగేయాలు, తత్త్వాలు ప్రజల ఆధ్యాత్మికతను తెలుపుతాయి. అలాంటి ఆధ్యాత్మిక సంబంధ గేయాలలో తిరుమల వెంకన్న గురించి ఎలా గానం చేయబడిందో తెలుసుకుందాం.

శ్రీవేంకటేశ్వరునికి సంబంధించిన గేయాలను పరిశీలనా సౌలభ్యం కోసం ముక్తక గేయాలనీ, కథాత్మక గేయాలనీ రెండుగా విభజించి చర్చించవచ్చు.

## 1) ముక్తగేయాలలో వెంకన్న

జానపదులు తమ కోరికలు తీర్చే దేవుళ్ళకు అనేక మొక్కులు చెల్లిస్తుంటారు. కొందరు హుండీల్లో డబ్బులు వేస్తే, మరికొందరు తలనీలాలు సమర్పించుకుంటారు. కొందరు తులాభారాలు వేస్తే ఇంకొందరు నిలువుదోపిడీలు యిచ్చుకుంటారు. ఈ మొక్కుల కయ్యేఖర్చు కోసం గొర్రెల్ని మేకల్ని పోట్టేళ్ళని లేదా కోడెదూడల్ని దేవుడిపేరుతో వదిలి, అవి పెద్దవయ్యాకా, వాటిని అమ్మి ఆ డబ్బుతో ముడుపులు గట్టి, యింటిళ్ళపాదీ బయల్దేరి తిరుమలకు వెళతారు. వెళ్ళి గోవిందున్ని దర్శించి మొక్కులు చెల్లించి వస్తుంటారు. ఇలా కుటుంబమంతా పిల్లాజల్లా, ముసలిముతకా అందరూ కలిసి తిరుమలకు యాత్రచేయడాన్ని 'ఇల్దీర్థం' అని పిలుస్తారు.

అలా ఆలు బిడ్డలతో యిల్లీర్థం వెళ్ళి మాటి మాటికి గోవిందా గోవిందా అంటూ కొండనెక్కాలనీ, అలా ఎక్కి గాలిగోపురాన్ని చూస్తే కోరిన కోర్కెలు తీరుతాయనీ, మనోవ్యాకులత తొలగిపోతుందనీ ప్రజలు నమ్ముతారు. ఆ అంశాన్నే ఒక కోలాట పాటలో మధురంగా గానం చేయడం చూడవచ్చు.

" మోహన రూపం చూడాలంటే
దేహవిముక్తికి పోవాలంటే
ఏడుకొండలెక్కాలోయ్ అన్నా రంగన్నా
మన ఎంగటేశునే చూడలోయ్ అన్నా రంగన్నా
వడ్డికాసులను మూటగట్టుకొని - పిడికెడు రూకలు చేతబట్టుకొని
సతీసుతులను వెంటబెట్టుకొని ఏడుకొండలెక్కాలోయ్ అన్నా రంగన్నా
మోకాళ్ళ మెట్లను యెక్కవలనంట- మనసులో దేవుని తలవాలంట
మనోవ్యాకులమెల్ల పారిపోవునంట- యొండికొండలనెక్కాలోయ్ అన్నా రంగన్నా
గాలిగోపురము చూడాలంట- కాలదేవుని ప్రార్థించవలనంట
ఇహపరసుఖములు మనకు కలుగునంట- గోవింద గోవిందా యనుచు
ఏడు కొండాలెక్కాలోయ్ అన్నా రంగన్నా
కల్యాణకట్టకు పోవాలంట తలనీలాలు తియ్యవలవంట
దేవుని యేమొచూడాలంట గోవిందా గోవిందా యనుచు
ఏడు కొండాలెక్కాలోయ్ అన్నా రంగన్నా
మంగళమూర్తికి హారతులెత్తి మంగళాత్మని మనసున తలచి
శృంగార పురుషుని సేవయొనర్చి ముదముతో అందరుపాటలు పాడుచూ
ఏడుకొండాలెక్కాలోయ్ అన్నా రంగన్నా."

పై పాటలో దేహవిముక్తి (మోక్షం) కోసం, ఇహపర సౌఖ్యం కోసం తలనీలాలర్పించి, వడ్డికాసులు వేసి వైకుంఠవాసుని దర్శించుకోవాలని చెప్పడం జానపదుల పారలౌకిక తత్వాన్ని తెలుపుతుంది

మరో కోలాట పాటలో గోవింద అంటే పలికే చోద్యాల దేవుడిగా వెంకన్న కీర్తింపబడడం చూడవచ్చు.

"ఎన్ని పొద్ద్యాల యెంగటన్న ఓరామ
ఎగువ తిరుపతి పైని యెంగటన్న ఓరామ
గోవింద అంటే పలుకుతాడు ఓరామ
గోవులను గాసిన్న గోవిందుడే ఓరామ
నల్లనల్లనివాడు యెంగటన్న ఓరామ
నామాలు పెట్టుకున్న నల్లనయ్య ఓరామ
తిరుపతి పోతానే పలుకుతాడు ఓరామ
కుప్పయావలన్ని[1] కూలగొట్టు ఓరామ
దాగల్లవడ పప్పు దండి బెల్లాలు ఓరామ
గుర్తుగాను గుమ్మడిపండ్లు ఓరామ
దీపాలు ముంచెనెయ్యి ఓరామ
తిరుపతిబోయెటి చిట్టిదాసరికి ఓరామ
తిరువెంగళప్పనికి పణుతు(వనిత)లెందరో ఓరామ
పెద్దామె[2] నాంచారు లోకమాత ఓరామ
అయ్యవారికి సక్కనిది అలమేలుమంగ ఓరామ.

(1. కుప్పయావలు = దండిబాధలు; 2. పెద్దామె = పెద్దదయిన స్త్రీ)

పై పాటలో రెండంశాలున్నాయి. మొదటిది 'యుల్తీర్థం' వెళ్ళిన వారు వడపప్పు, పానకాలు, గుమ్మడిపండ్లు దేవునికి నైవేద్యంగా అర్పించే ఆచారం. రెండోది 'బీబీనాంచారి' ఈమె వెంకన్న భార్యల్లో 'పెద్దామె' గా పేర్కొనడం విశేషం.

ఆంధ్రుల పెళ్ళివైభోగాలు ఈ ఆధునిక కాలంలో నశించి పోతున్నాయి గానీ, పూర్వం పెళ్ళిళ్ల మూడునుంచీ అయిదు రోజులవరకు జరిగేవి. నలుగులు, హారతులు, హాస్యాలు ఒకటేమిటి ఆ మూడు రోజులూ సందడే సందడి. పెళ్లి పందిట్లో వధూవరులు జానపదులకు ఏ సీతారాములుగానో, ఏ శివపార్వతులుగానో, ఏ రుక్మిణీకృష్ణులుగానో కనిపిస్తారు. కొందరికైతే అలమేలుమంగావెంకన్నలుగాను అనిపిస్తారు. అందుకే వారు పాడే నలుగు పాటల్లోను, హారతి పాటల్లోను ఆయా దేవతలు కనిపిస్తారు.

ఓ నలుగుపాటలో నవవధూవరులైన మంగాశ్రీనివాసులు కూడా దర్శనమిస్తారు.

**" నలుగు పెట్టరే నాతి మంగకును**

**నలుగిడరారే అలిమేలిమంగకును**

**పచ్చ కరుపూరము తలియేరు[1] వసాది[2]**

**పూసి నలుగిడరారే శ్రీవేంకటేసునకు**

**అత్తరి పన్నీరు అమర్చిన గంధము**

**సన్నటిగాజులు సంపెంగపూలు**

**నలుగుపెట్టగరారె అలిమేలు మంగకును**

**అల వైకుంఠవాసునికినూ"**

**(1. తలియేరు = పన్నీరు; 2. వసాది = ఒకరకం సుగంధ ద్రవ్యం)**

సంసారమన్నాక ఆలుమగల మధ్య అలకలు, అపార్థాలు, అనుమానాలు సర్వసాధారణ విషయాలు ఆ వెంకన్నయినా, అలిమేలు మంగయినాసరే.

ఓ రోజు మామకొడుకయిన వెంకన్నను చూడాలని "కీలుగంటాలేసుకొని, కిన్నీరీలు మీటుకుంటా, సామివద్దకు బయలుదేరింది మంగమ్మ. అప్పుడు వెంకన్న బండపైన చెక్క కొడుతున్నాడు. పొరబాటున ఓ చెక్కపేడు వచ్చి మంగ చెంపను తాకి చెప్పరాని దుఃఖమొస్తుంది మంగకు. అలిగి కూర్చుంటుంది. అతనిపైన ముందే ఆమెకు అనుమానం. అందుకే అనునయించడానికి వచ్చినప్పుడు నువ్వుఎవతితోనో కులుకుతున్నావని అడుగుతుంది. అప్పుడాతను 'కర్పూరభరణిలో తేలు కుట్టిందనీ, మంతరించేదానికి జాణదొరికిందని' ఆమె యింటికి వెళ్ళానని బొంకుతాడు వెంకన్న. మగువలకు భౌతిక గాయాలకంటే మానసిక గాయాల్ని చేసే అనుమానం కలిగించే బాధ యింకా ఎక్కువ కదా! దాంతో యింకా మొండికేస్తుంది మంగ. అప్పుడు వెంకన్న చెంపలేసుకుని ఇలా అంటాడు.

**"ఎందుకలిగీవావే మంగా**

**ఏమీనేరం జేసివావే.....**

**దానికి ఆమె ప్రశ్నించిన తీరు ఇలా వుంటుంది.**

' పైనవుండే పట్టుమకుటం
పసుపూకర్రా లెక్కడివి సామి
పరస్త్రీల పసుపూ లేడీవీ
ఓ వెంకటేశా పరస్త్రీల పసుపూలెడీవీ?'

దానికి వెంకన్న యిచ్చిన సమాధానం ఆయన్ను నిజమైన దక్షణ నాయకుణ్ణి చేస్తుంది.

' వేలాగిరీ కొండలోనే
వేటాలాడ నేనేబోతే
పచ్చి మోదుగ పసువులాయెనే
అలిమేలు మంగా పచ్చిమోదుగ పసుపులాయెనే'

మరో గేయంలో అలమేలుమంగ, లక్ష్మీదేవి 'కోగిరి' (కోవెల) లో కలసి కాపురం చేస్తుంటారట, కానీ యిద్దరికీ ఓ చిన్నవిషయంలో కొట్లాట వచ్చి అది సవతులపోరుగా మారిపోతుంది.

**2. కథాత్మక గేయాలలో వెంకన్న:**

ఈ గేయాలలో కాస్తా కథలాంటి అంశం వుండడం గమనించవచ్చు. ఈ కథాత్మక గేయాలలో బయ్యన్న ఎద్దును కొన్న వెంకటేశ్వరుడి కథ, మంగమారువేషంవేసే కథ, వెంకన్న నాతికండ్ల చిన్నబూబును పెండ్లాడిన కథ ప్రధానంగా ప్రచారంలో వున్నాయి.

### 1) బయ్యన్న ఎద్దును కొన్న వెంకన్న

వెంకన్న తన భక్తులను మారువేషాల్లో వచ్చి పరీక్షించడమేగాక, ఏదో విధంగా ఆదుకుంటాడని, తన కొండకు తానే రప్పించుకుంటాడని జానపదుల నమ్మకం.

ఆ నమ్మకాన్ని ఆధారం చేసుకొని అల్లిన గేయం 'బయ్యన్న' గేయం. పల్లెల్లో పశుసంపద కలిగిన కుటుంబాలలో ఏదోఒక పశువును దేవుడి పేరుతో వదలి కొండన విడిచిపెట్టి వెళ్ళడం ఒక ఆచారంగావుండేది. ఆ ఆచారాన్ని పాటించి బాలుడైన బయ్యన్న ఒక కోడెను దేవుడి పేరుతో వదిలి తన భక్తిని చాటుకుంటాడు. ఆ బాలున్ని ఎలాగయినా ఆర్థికంగా ఆదుకొని కొండకు రప్పించుకోవాలని బేరగాడివేషంలో వెంకన్న ఆ బాలుడి ఎద్దుని కొనడానికి వస్తాడు. అప్పుడు వారి మధ్య బేరసారాలు ఎంతో రమ్యంగా సాగుతాయి.

"బాలుడా బయ్యన్న ఉయ్యాలో నీ ఎద్దుబేరం చెప్పు ఉయ్యాలో
నావెద్దు బేరమోసామి ఉయ్యాలో నీవు కొనలేవు నాసామి ఉయ్యాలో
కొంటారా బాలుడా ఉయ్యాలో నీ ఎద్దు బేరం జెప్పు ఉయ్యాలో
మూతి ముప్పయివేలు సామి ఉయ్యాలో నువ్వుకొనలేవు నాసామి ఉయ్యాలో
కొంటారా బాలుడా ఉయ్యాలో నీ ఎద్దు బేరం జెప్పు ఉయ్యాలో
కొమ్ముకోటేలు సామి ఉయ్యాలో నీవు కొనలేవు నాసామి ఉయ్యాలో
తోక తొంభైవేలు సామి ఉయ్యాలో నీవు కొనలేవు నాసామి ఉయ్యాలో

ఇలా ఆ ఎద్దుల బేరంలో బయ్యన్నడిగిన అంత రొక్కము చెల్లించి ఆ ఎద్దును కొండకు తీసుకెళతాడు వెంకన్న

అంతరొక్కంబోసి ఉయ్యాలో సామిపట్నాడు ఎద్దునూ ఉయ్యాలో
బాలుడే బయ్యన్న ఉయ్యాలో అందనే రొక్కములు ఉయ్యాలో
బంగారిబెత్తమే ఉయ్యాలో ఎండితే చెలకోడి ఉయ్యాలో
బంగారు పగ్గమేసి ఉయ్యాలో ఎద్దునేఎలదీసె ఉయ్యాలో
ఏడేడు కొండలకు ఉయ్యాలో ఎద్దునే ఎలవెక్కే ఉయ్యాలో
వచ్చేటి కాపులే ఉయ్యాలో ఎద్దునే పూజచేయుదురు ఉయ్యాలో

ఇలా ఎద్దుల బేరగాడిగా వెంకన్న ఆ భక్తుణ్ణి ఆదుకుని ఆపద్బాంధవుడనిపించుకున్నాడు.

**(2) మంగమారువేషం కథ :** శ్రీకృష్ణుడు, నరసింహుడు, శ్రీవేంకటేశ్వరుడు జానపదుల దృష్టిలో శృంగారదేవుళ్ళు. సత్య, రుక్మిణి, చెంచులక్ష్మి, (చెంచిత) అలిమేలు మంగమ్మలు శృంగార స్త్రీ దేవతలు. జానపదులకు విష్ణువు ఈ అవతారాలలో దక్షిణ నాయకుడే. వెంకన్నను కూడా దక్షణ నాయకుణ్ణి చేసింది 'మంగమారువేషం' వేసే ఈ గేయం. ఈ అంశం మీద రాయలసీమలో అనేకచోట్ల అనేకరకాలైన పాటలున్నాయి.

అలిమేలు మంగమ్మకు, కానకుండా ఓ చెంచును మరిగివుంటాడు స్వామి. ఇక్కడ చెంచు అంటే లక్ష్మి అవతారమని పల్లీయుల భావన. ఆ విషయాన్ని రహస్యంగా గమనిస్తుంది మంగ. ఒకనాటి రాత్రి మంగ నిద్రపోయాక గుట్టుచప్పుడు కాకుండా బయలుదేరుతాడు స్వామి. అది గమనించింది మంగ.

**"సుట్టుపట్టుజూసే సుట్టెవరు లేరు**

**దిగ్గుదిగ్గుస లేచీ దీవెలిగించె**

**అత్తా రా ఓ యత్తా నాయారంజిబోతే**

**నీ కొడుకు యెందు బోయె కానరాలేదు"**

అంటూ వకుళమ్మను అడుగుతుంది.

విషయం తెలుసుకున్న మంగ ఆతణ్ణి వెంబడిస్తుంది. అతను పూలవీధికిపోయి సన్నజాజులు ఆకువీధికి బోయి తంబేరి ఆకులు, వక్కలీధిలో సిగనాపి వక్కలు కొని మాదిగవాడలు దాటి చెంచు వీధిలో అడుగుపెడతాడు. విషయాన్ని అర్థంచేసుకున్న మంగ తాను మరో చెంచువేషం ధరించి దారిలో కూచుంటుంది. ఆమెను చూసి మోహించిన స్వామి ఆమెతో 'జారాట్లాడు' తాడు. అందుకు మంగ ఆతని 'చేతిముద్రీలు, కంఠంలో కడియాలు, యిస్తే నీ మాటవింటానని వాటిని బహుమానంగా పొంది, తిరిగి కోవెలకొస్తుంది. ఆ రాత్రి ఎప్పుడో యింటికొచ్చిన స్వామిని వేలిముద్రలు, కడియాలు అడిగి చీవాట్లు పెడుతుంది. ఇదొక అందమైన జానపదగేయంలోని అంశం.

అదే అంశం అర్జునుడేసింది ఆ ఒక్కవనమూ 'ఓ బనం మొగిలేది గొబ్బియాలో' అని ఆరంభమయ్యే గొబ్బిపాటలో ఇంకా రమ్యంగా చిత్రింపబడింది.

శ్రీనివాసుడు మంగతో కలిసి వేటకు బయలుదేరుతాడు. అక్కడి వనంలోకి వచ్చిన 'వనకోగిల' లను పట్టి మంగకిచ్చి పెంచమంటాడు. దానికి ప్రతిగా మంగ కూడా ఒక కోరిక కోరుతుంది.

**"సూరే చంద్రరాజులు చూసినాపట్టే ఓబనం మొగిలేరిగోబ్బియ్యాలో**

**నీ పట్టు పదివేళ్ళతో కట్టినాబొట్టే "**

**నీ బొట్టు సాచ్చిలేబ్బాసిలియ్యి "**

స్వామి పరస్త్రీని ముట్టనని, కలలో కూడా కోరుకోనని బాస చేస్తాడు. అయినా ఆ మరునాడే వెంకన్న 'జాలారి బండెక్కి జలకాలాడి, తిరుమణి నామం తీసి, భోంచేసి, యెర్రియేపులు (యెర్రియాపలు = వేటకుక్కలు) రెండు ఎంటేసుకోని వేటకని బయలుదేరి మరోస్త్రీ యింటికి పోతుంటాడు. ఆ విషయం గమనించిన మంగ కోమటి వీధులకొచ్చి వారి వస్త్రాలు, నగలు ధరించి, స్వామి వేటకు వెళ్లిన వనంలోనే పూల అంగళ్ళు పెడుతుంది.

ఆమెను పరాయిస్త్రీగానే భావించిన స్వామి ఆమె అందానికి ముగ్ధుడై "మామంగ బెట్టే సొమ్ము నీ కిత్తుభామా, నాతోన కొంచేపు జాదమాడావే" అని ప్రాధేయపడతాడు. అందుకామె, చెవ్వుల్లో పోగులు నీ చేతిముద్రీలు, ఇవ్వమని అడిగి తీసుకుంటుంది.

ఆ తరువాత వారిరువురు ఇలా సరసాలాడుతారు.

**"ఆకూనాకొంచేపు హాటలాడీరీ ఓబనం మొగిలేలి గొబ్బియాలో**

**సున్నానా కొంచేపు జూజమాడీరీ ఓబనం మొగిలేలి గొబ్బియాలో**

**యేటలాడీ సామి నిద్దరబోయా ఓబనం మొగిలేలి గొబ్బియాలో**

**సామి శిరస్సునెత్తి తొడమీద బెట్టీ ఓబనం మొగిలేలి గొబ్బియాలో**

**అలసి నిద్దర బోయ ఆ సామి నేడు ఓబనం మొగిలేలి గొబ్బియాలో**

అలా నిద్రించిన స్వామి శిరస్సును ధరణిపైన బెట్టి ఆతనికి తెలీకుండా తిరిగి నగరు కొచ్చింది మంగ. వేట నుండీ తిరిగి వచ్చిన స్వామిని చేతిముద్రలు చెవిపోగులు ఏవని నిలదీస్తుంది.

**"మంగరో ఓమంగ అలివేలుమంగా ఓబనం మొగిలేలి గొబ్బియ్యాలో**

**నేనొచ్చే దోవల్లో భోగమాటలే ఓబనం మొగిలేలి గొబ్బియాలో**

**భోగాము కన్నికు యినాములిస్తీ ఓబనం మొగిలేలి గొబ్బియాలో**

అంటూ బొంకుతాడు స్వామి. వెంటనే మంగ తనవద్దనున్న ఆతని ఆభరణాలు చూపించి నిందిస్తుంది. ఇక గత్యంతరం లేక కాళ్ళ బేరానికొస్తాడు స్వామి.

**"రట్టుచేయకే మంగ గుట్టుగావుండే ఓబనం మొగిలేలి గొబ్బియ్యాలో**

**ఇట్లా మాయన్న వింటేను కొట్టబోవునే "**

**ఇట్లా మాయమ్మ వింటేను తిట్టబోవునే "**

**రట్టు చెయ్యకు మంగ గుట్టుగా వుండూ "**

ఈ గేయంలో సంసారపుగుట్టును కాపాడుకోవాలని ఆరాటపడే వెంకన్న మనకు దర్శనమిస్తాడు.

ఇలా వెంకన్నను దక్షిణ నాయకునిగా నిరూపించే గేయాలు చాలానేవున్నాయి.

**(3) నాతికన్నుల చిన్నబూబుకథ :-** ఇది బీబీ నాంచారిని స్వామి పెండ్లియాడిన కథ. వెంకన్నకు లక్ష్మిగాక అలిమేలుమంగతో బాటుగా బీబీనాంచారికూడా భార్యగా వుందని జానపదసాహిత్యం ద్వారా తెలుస్తుంది.

ముస్లీముల ఆడపడచును స్వామికి భార్యను చేసి హిందువులకు తురకల్ని మామల్ని చేశారు జానపదులు. ఈ కథ హిందూముస్లిం ఐక్యతకు చక్కటి నిదర్శనం.

"అలికి పూసినింటిలో కలికికుచ్చుల కమ్మిడి' పరచి దానిపైన దీనాపురిదిండువేసి, సన్నజాజుల పరష పరచి పవ్వళించిన వెంకన్నకు కలలో 'ఢిల్లీ పచ్చాల్ కూతురు నాతికన్నుల చిన్నబూబును' కొండకు తెచ్చినట్లు ఆమెను వివాహమాడినట్లు, ఆమెతో ముద్దులాడినట్లు కలలు కంటాడు. ఆ విషయం తల్లికి చెప్పగానే ఆమె యిలా చెబుతుంది.

**"తక్కువ జాతి ఈనపుకులము మురగయ మురుగా**

**పచ్చి చేపల తినేటి వారే మురగయ మురుగా**

**తురకలతో సవాస మొద్దు మురగయ మురుగా**

**మనకొండకు చేటు గలుగు మురగయ మురుగా**

**నీకు తగినది అలిమేలు మంగ మురగయ మురుగా**

అలాగే అన్న గోవిందురాజులు కూడా బుద్ధి మాటలు చెబుతాడు. అయినా వెంకన్న వినడు. ఈ విషయమై మంగ అలిగి అమ్మగారిల్లు చేరిపోతుంది. శ్రీనివాసుడు పట్టువదలని విక్రమార్కుడే అవుతాడు. అన్న గోవిందరాజును వెంటబెట్టుకొని తంగపార, గడ్డపార, వడ్డితట్ట ఎత్తి భుజాన వేసుకుని వడ్డిబోయలుగా వేషాలు మార్చుకుంటారు. ఢిల్లీ కోటకు చేరుకుంటారు. "పాతగోడలు మొక్కులేసి, కొత్త గోడలు పెట్టేటి వారము మాది మచ్చల బందారి, మాపక్కవానలు లేక వచ్చాము" అంటారు. ఢిల్లీ నవాబు వారికి గోడలు పెట్టడం వప్పిస్తాడు. పగలంతా గోడలు పెట్టి రేయంతా గాలివానలు రప్పించి పడదోస్తూ వచ్చారిద్దరూ. చివరికి శ్రీనివాసుడు రెండు స్త్రీపురుషుల బొమ్మల్ని గోడపైన నిలిపి నాతికన్నుల చిన్నబూబు దృష్టిని ఆకర్షిస్తాడు. ఆ బొమ్మల్ని చూడడానికి కోటమేడ దిగివచ్చిన బూబును ఎత్తి చంకన బెట్టుకొని చక్కగా వచ్చి 'అడ్డకొండన నిలుస్తాడు. వెనువెంట వస్తున్న నవాబులు సైన్యాన్ని, వారికి నిషేధమైన "ముద్దార్'ను వండి పెడతానురండి అంటూ వెనక్కి పంపించేస్తాడు.

**"మురదారును వండి నేను మురగయ మురుగా**

**ఇందులైన చేస్తాను  మురగయ మురుగా**

**మీకు నైన పెడతాను  మురగయ మురుగా**

ఆ తర్వాత ఆ బూబును ' మూలకోగిలి' లో వుంచి అలివేలువద్దకు వచ్చి నవ్వి ఇలా అంటాడు.

"మంగ యినవే అలివేలుమంగా మురగయ మురుగా
నీకు మించిన సవతిని దెచ్చినా మురగయ మురుగా
మూలకోగిరిలోంచినాను మురగయ మురుగా
సూతూరావే అలివేలుమంగా మురగయ మురుగా

అందుకాయమ 'బంగారి పైటలెత్తి, వారముసుగులేసి, సిత్తానూరి బాట పడుతుంది. ఆ విధంగ తిరిగి పుట్టినిల్లు చేరిన మంగను తల్లి ఎందుకు తిరిగొచ్చావని ప్రశ్నించగా ఏడుస్తూ యిలా చెబుతుంది మంగ.

"ఢిల్లీ పచ్చాల్ కూతురంట మురగయ మురుగా
నాతికన్నుల చిన్నబూబు మురగయ మురుగా
మనకొండాకు దెచ్చినాడే మురగయ మురుగా
కోగిరి[1] లోన వుంచినాడే మురగయ మురుగా
నీకు మించిన సవతినైన మురగయ మురుగా
దెచ్చినావని సెప్పెనమ్మా మురగయ మురుగా
వేను వలిగి వస్తినమ్మ మురగయ మురుగా

(1. కోగిరి = కోవెల)

ఇలా మంగ తిరుచానూరులో నెలకొనడానికి కారణాన్ని చెప్పడంతో కథాగేయం ముగుస్తుంది.

ఈ విధంగా జానపదగేయాలలో వెంకన్న భక్త వత్సలుడిగానే గాక కష్టాలు తీర్చే కొండంత వేల్పుగా, దక్షిణ నాయకుడిగా, బీబీనాంచారిని కోరి పెండ్లాడిన ప్రేమికుడిగా జానపదులచేత కీర్తింపబడ్డాడు.

# జానపదగేయాల్లో వెంకన్న భక్త వైభవం

డా॥ ఎర్ల బాలకృష్ణారెడ్డి

జానపదుల భక్తి సంఘ జీవనంలో భజనలుగా, సమారాధనలుగా వ్రతాలు, ఉత్సవాలుగా, భగవత్కథా గాన, శ్రవణ రూపకంగా అభివ్యక్తమౌతుంది. వ్యక్తి జీవితంలో తమ ఇష్టదైవాన్ని భక్తితో స్తుతించి, పూజించడం ద్వారా వెల్లడవుతుంది. పదిలమైన భక్తి, చిత్తశుద్ధిలేకుండా ఎన్నిపూజలు చేసినా వృధాయే. అవి ఏ విధంగా నిరర్థకాలో ఉపమానాలతో చెప్పేగేయాన్ని చూడండి :

**"భక్తి లేని పూజలేమిటికి, ఓ మనసా!**

**భక్తి లేని పూజేమిటి? ఓ మనసా!**

**ఆశలేని మొగుడేమిటికి?**

**ముసలిదానికి కులు కేమిటి?**

**భక్తి లేని పూజలేమిటికి!"**

అంటూ, తమ భావాలను వెల్లడిస్తారు. జానపదుల భక్తి అవగాహన కీ గేయం చక్కటి దృష్టాంతం.

దేవుడున్నాడా! లేడా! అని తర్కించుకొనే నాగరికులకు, జానపదులు దేవుడున్నాడని ఘంటా పథంగా చెప్పడమే గాక, ఆతని అద్భుత చర్యలను కూడా వర్ణించే గేయాన్ని తిలకించండి.

**"వున్నాడయా దేవుడున్నాడయా!**

**కన్నులకు కనిపించ కున్నాడయా!**

**కనిపించకేమి చేస్తున్నాడయా**

**లోకాల చీకట్లు పోకార్ప రవిచంద్ర**

**దీపాలు గగనాన త్రిప్పేదయా!**

**లక్షలాదిగనున్న నక్షత్రముల నెల్ల**

**నేల రాలక మింట నిలిపేదయా**

**ఈ ధారుణి చక్రమిరుసు లేకుండగా**

**ఎల్ల వేళల ద్రిప్పుచున్నాడయా!**

**జీత బత్తెములేక ప్రీతిలో మనకెప్పుడు**

గాలికై సురటీలు కదిపేడయా!

ఆధారమే లేక యలరారుచున్నట్టి

ఆకాశమును ఆపుచున్నాడయా!

పొంగి పొరలుచు వచ్చి పృథివిపై పడకుండ

కడలి రాయుని కాళ్ళు ముడిచేడయా

జగతిలో జన్మించె జీవరాసులకెల్ల

ఆహారమిడి ఆదరించేడయా!

తెరవెనుక తానుండి, తెరముందు ప్రజలుంచి

తైతక్కలాడించు చున్నాడయా

ఇన్నిపనులున్న వాడెన్నటికొ కనిపించు

అన్నమాటలు నమ్మకున్నారయా!

తిన్ననగుభక్తితో దివ్యజ్యోతిని

చూడకున్న మన జన్మాలు సున్నాలయా

భక్తితోనే భగవంతుని పొందవచ్చని, భగవంతుని తత్వాన్ని, దేవుని కార్యాలను, పై గేయం చక్కగా వివరించి జానపదుల ఆలోచనలకు దర్పణం పట్టింది.

భక్త సులభుడైన భగవంతుడు భక్తులకు కూత దూరంలోనే ఉంటాడు. ఎలుగెత్తి భక్తితో పిలిస్తే పలుకుతాడనే గేయాన్ని పరికించండి.

"కూతదూరమయ్య, శ్రీహరియుండేటిచోటు

మనకొక కూతదూరమయ్యా!

కరిమకరి వలన మిగుల గాసిజెంది

దీనతతో కరుణింపుమొ మురారి యనవే

మకరి, దునిమి గాచెనుగా

అల దుశ్శాసనుడా ద్రౌపది చేలమును

బలిమిహొలువ, జాలిచెంది కృష్ణా! గోపాలయన కరుణించెగ "

కల్మషంలేని భక్తితో, శరణాగతి భావంతో ఎలుగెత్తి ప్రార్థిస్తే గజేంద్రుని, ద్రౌపదిని ప్రాణ, మానాలు కాపాడినట్లు భక్తులను రక్షిస్తాడని పై గేయం చెపుతుంది. భగవంతుని నమ్మినవారు తప్పక రక్షింపబడతారని పలికే పెక్కు కథా గేయాలు కూడా జానపద సాహిత్యంలో కనిపిస్తాయి.

## విష్ణుభక్తితత్త్వం

విష్ణువును ఇలవేల్పుగా ఆరాధించే మతం వైష్ణవమతం, త్రిమూర్తులలో శ్రీమహావిష్ణువు స్థితికారకుడు. దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంరక్షణ ఆయన కర్తవ్యం. అందుకే మహావిష్ణువు దశావతారాలెత్తినాడు. కలియుగం ప్రారంభం కాకముందే పరమాత్ముడు జీవకోటిని ఉద్ధరించడానికి తిరుమల గిరులపై వెలసినాడని పురాణాలు పలుకుచున్నాయి. జానపదులకు మక్కువైన వెంకన్న సాక్షాత్ మహావిష్ణు రూపమే.

**"మలసి వేదము బ్రహ్మకిచ్చిన మత్స్యరూప నమో నమో!**

**కలయవారుధి దరువజేసిన కమఠరూప నమో నమో**

**కలియుగాంతము నందు గా గల కల్కి రూప నమో నమో!**

**వెలయ తిరుమలకొండ వెలిసిన వెంకటేశ నమో నమో!"**

అనే దశావతార కీర్తనలో తిరుమల వేంకటేశుని విష్ణు అవతారంగా జానపదులు కీర్తించారు. 'సర్వం విష్ణుమయంజగత్' అని శిష్ట కవులంటే,

జానపదులు -

"అంతావిష్ణుమయం ఈ జగమంతా విష్ణుమయం" అని కీర్తిస్తారు.

నిత్య కల్యాణం పచ్చతోరణంగా వెలుగొందే తిరుమల కొండవైభవాన్ని జానపదులు కన్నులారా దర్శించి వర్ణించిన తీరు చూడండి.

**"ఏడు కొండలా వేంకటేశ్వర**

**వేడు కొంటి నన్నుబ్రోవగరారా**

**లక్ష్మి పద్మావతులతోడ, నిత్యాకళ్యాణములాడ,**

**ఎటుచూడ కొమ్మల మేడలహో- అదే**

**ఎత్తుకమలకు మూతలు పడెముల్లోకములకు**

రాళ్ళకు ప్రాణం పోసితివేమొ

గుళ్ళో పొమ్ములు లక్షల వేమొ

మునుపు చేసిన పుణ్యమేమొసామి

నీ మందిరములపై రవవిలాసము

నిత్య మాడు సామి" అని స్వామి మందిర వైభవాన్ని చాటినారు.

" వేరే గతిలేదు వేరే గతిలేదు

వేరే గతిలేదురా వెంకటేశా!

మాయవలలో జిక్కిమందభాగ్యుడనయితి

బాయక నన్నేలరా వెంకటేశా!

దేవాదిదేవ శ్రీదేవి మనోహర సేవజేసెటి

నీ దాసుని గావరా, వేంకటేశా! అని శరణాగతి భావంతో ప్రార్థిస్తారు.

"ప్రసన్న వేంకటేశ- ప్రసన్నమైరావ, గావ

పాపిని ద్రోహిని నన్ను పాలించుమెపుడు" అని వెంకన్నను వేడుకొని ప్రసన్నం చేసుకుంటారు.

"ఇతడే వెంక్కట జోగి

తిరుపతి పై వెలసిన యోగి

సతతంబ్బతనికి సాష్టాంగం"- అంటూ వందన చందనాలర్పిస్తారు. ఆపదలు తీరగానే ఆపదమ్రొక్కుల వానికి మ్రొక్కుబడులు చెల్లిస్తారు.

"ధరణిలో శ్రీవేంకటేశ్వర్లు దలచివదే

సిరిసంపదలిచ్చు అలవేలుమంగమ్మ" అంటూ వెంకన్న దేవేరి, అలమేలు మంగమమ్మపై కూడ భక్తిభావాన్ని ప్రకటిస్తారు. తిరుచానూరు కూడా దర్శించి భక్తులు తరిస్తారు.

**హరిహరాద్వైతం**

"యేయథామాం ప్రపద్యంతే తాంస్తథైవ భజామ్యహం"- (బ్రహ్మవైవర్తపురాణం) భగవంతుడు

సర్వాంతర్యామి. దేవుడు ఒక్కడే, అయినా ఆ సర్వేశ్వరుని ఎవరు ఏ రూపంలో ఆరాధిస్తే ఆ రూపంలో దర్శనమిస్తారు. ఈ ప్రక్రియ వల్లనే వివిధ మతాలు, నామరూపాలు ఏర్పడ్డాయి. ఈ సత్యం తెలియక వీరశైవ, వీరవైష్ణవ మతాల మధ్య పూర్వం కల్లోలం చెలరేగి, మాది గొప్ప మాది గొప్ప, అని వాదులాడే సమయంలో తిక్కన సోమయాజి హరిహరాద్వైతాన్ని ప్రబోధించాడు. అద్వైత దృష్టిగల జానపదులు కూడా శివకేశవులకు భేదము లేదని ప్రచారం చేశారు.

"హరియనగ హరుడనగ

నరయ భేదము లేదు

పరమతేజంబిటుల

ప్రసరించె మనసా" అంటూ హరిహరులకు అభేదాన్ని చాటినారు. శివకేశవులు చిత్స్థితి ఒక్కటేనని తెల్పినారు.

" శివుడంటే నేమి కేశవుడంటేనేమి

శివ కేశవుల చిత్స్థితి భేదమేమి

రతిరాజు భ్రమలచే రట్టయ్యేదేమి

మతిమంతుడైతే యీ మత భేదమేమి?

ఆ మహా దేవుడే అచ్యుతుడాయె

శ్రీ మహా విష్ణువే శివరూపుడాయె

ఈ మహతత్త్వార్థమిది సత్యమాయె" లోక కల్యాణార్థం పరమాత్మ ఒక్కడే శివకేశవుల రూపం ధరించాడు, బుద్ధిమంతులు ఈ మతభేదం పాటించరు.

"శివ కేశవులకు భేదము- వాదు చేసినందుకు మరి భేదమూ

ఇద్దారు వక్కాటి సత్యము జనులారా!

భూతిపూసిన వాడు లింగడూ, పట్టినామ మెట్టినవాడు రంగడూ

భూతి పూసిన వాడు పట్టెనామమెట్టిన వాడు

ఇద్దరు ఒక్కటే సత్యముజనులారా"

జానపదులు కూడా హరిహరాద్వైత తత్త్వాన్ని పలుగేయాలలో చాటినారు.

## సంవాద గేయాలు

సంవాదం అంటే ఇద్దరిమధ్యచర్చ. జానపదగేయాలలో గురుశిష్య సంవాదాలు, గంగాగౌరి సంవాదాలు, స్త్రీ పురుష సంవాదాలు కనిపిస్తాయి. భగవంతునికి కూడా మానవత్వాన్ని ఆపాదించి మన వేంకటేశ్వరునకు అలవేలుమంగమ్మకు జానపదులు కూర్చిన ఒక సంవాద గేయాన్ని చూడండి-

వెంక :- శ్రీ యలమేలు మంగారో శ్రీ వేంకటేశుణ్ణే నేను
ధీరత్వముగ తలుపు తీయవే, ఓ అలమేలుమంగా!

అల :- తలుపులు దీయమనుచు నాతో టక్కులేల జేసేవు
నలిన నేత్రి యింటికే పోరా! ఓ వేంకటరమణ!

వెంక :- ఏల యలిగినావే నీవు - యేమినేరములు జేస్తినే
భామా! నాపై పంతమేలనే ఓ అలమేలుమంగా!

అల :- పంతగించి యిందాకను యే చెంతకు బోయివస్తివో
కంతుజనక నాతొ దెల్పరా ఓ వెంకటరమణ!

వెంక :- కాంతరొవిను బృందావనాంతరము నాయె గనుక
వింతగా విహరించి వస్తినే ఓ అలమేలుమంగా!

అల :- వింతగా మీశాలువపై వేదుక మీరగను వ
సంతమేమొ బాగా దెలుపరా ఓ వెంకటరమణ!

వెంక :- చిలుకల కొలికి పోయి చెట్టెక్కిపూవును గోయబోతే
చెలగి పూలరసమే చిల్కెనే ఓ అలమేలు మంగా!

అల :- పూజితుడనగను వినినే పొందుగ తలుపులు దీస్తి
రాజలోచనుడ రారా! ఓ వెంకటరమణ

ఇటువంటి గేయాలు జానపదసాహిత్యంలో కోకొల్లలు. ఇందు శ్రీకృష్ణునికి, వేంకటేశ్వరస్వామికి అభేదం చెప్పబడింది.

**అంగరంగ వైభవాలు**

మేలు కొలుపులు - దేవాలయాలలో అనుదినం జరిగే అంగరంగ భోగాలలో సుప్రభాత సేవ ఒకటి. దీన్నే జానపదులు మేలుకొలుపులంటారు. తెల్లవారక ముందే ఇష్ట దైవాన్ని మృదుమధురంగా కీర్తించి మేలుకొలపడం అనాది ఆచారం. భక్త సంరక్షణకోసం మేలుకోమని కీర్తించే కీర్తనలు జానపదగేయాలలో కనిపిస్తాయి. రాజులను మేల్కొలిపే వ్యవస్థనుండి ఈ ఆచారం ఏర్పడింది.

**"కేశవాయని నిన్ను వాసిగ భక్తులు వర్ణించుచున్నారు లేరా!**

**వాసవవందిత వసుదేవనంద, వైకుంఠపురవాసా లేరా!**

**తెల్లవార వచ్చెను లేరా!"**

అనే గేయం సుప్రసిద్ధమైంది.

**వెంకన్నను -**

**"ఏడుకొండలవాడ - వెంకటారమణా**

**మేలుకో, తెల్లారవచ్చెను మేలుకో !**

**దీనులరక్షింపదీక్ష వహించిన దేవ దేవ నిద్రమేలుకో**

**పూనికతో నిను బూజించువారల పోషింపవలెవేగ మేలుకో.**

**చింతాలు దీర నీ చెంత చేరినాము.............**

**శ్రీ వేంకటేశ మేలుకో!"** అని మేల్కొలుపుతారు.

ఇదేవిధంగా వెంకన్న దేవేరులైన, శ్రీదేవి, భూదేవి, అలువేలుమంగమ్మపై కూడా మేలుకొలుపు పాటలున్నాయి.

**ఆరగింపు పాటలు**

భగవంతునికి శిష్టులు షోడశోపచారపూజ చేస్తే, జానపదులు దేవుని పూజించి, నైవేద్యం పెట్టి ఆరగింపమని అర్థిస్తారు.

"ఆరగించరా వేంకటేశా ఆరగించరా!

ఆరగించునీవు దద్ధ్యోన్నము పూళిహోగారా

పానకమును వడపప్పు నరటిపండ్లు

పనసపండ్లు, కొబ్బెర పాలూ, జుంటితేనె

సారపప్పుముద్దా, ఖర్జూరము, కిసుమీసు పండులూ

తోరమైన జామపళ్ళుతోనూ వేడుక మీరా! అని స్వామికి పలురకాల నైవేద్యాలు ఆరగింపు చేస్తారు.

సీతారాములకైతే

"చెలగి భుజింపు రాఘవ సీతాదేవితో

తెలియ నులివెచ్చనన్నము - తిమ్మనంబులు పాయసంబులు

పలుతెరంగుల పిండివంటలూ - తలుకు బంగారు గిన్నెల నుంచిన

బూరెలు బొబ్బట్లు పోళీలు లాడూలు

గారెలు ఖజ్జము లతిరసాలు, సారెకు

కక్కెర లుక్కెర లెక్కువ చక్కెర

చిక్కని మక్కువ నుంచితి" అని ఆరగింపజేస్తారు.

"మా వేంకటేశునకు మంగళం

మదభీష్టదాయికి మంగళం" అని మంగళ హారతిస్తారు.

**పవళింపుసేవ**

ఇష్టదైవానికి భక్తితో పాన్పువేసి పవళింపుసేవచేస్తారు. ఆ సమయంలో పాడే జానపదగీతం.

"పాన్పు వెయ్యారే పడతులార, పసిడి చేమంతితో పడక శృంగారించి

జవ్వాది పునుగుమ మువ్వగోపాలునకును

నవ్వుచుండెడి నవమోహనాంగునకు

**జాజివిరులతోను రోజ పువ్వులతోను**

**వాసనల్ మెరయు వనిత లారగూడి**

**పంకజనేత్రునకు పరమదయాళునకు**

**పరిపరివిధముల పడక శృంగారించి**

**అలివేణివాసునకు అభయదాయకునకు**

**వెలయు సర్వేశ్వరునకు మూలాధారునకు"** అని పాటలు పాడుతూ పవ్వళింపు సేవ చేస్తారు.

**"జోఅచ్చుతానంద జోజోముకుంద**

**లాలిపరమానంద లాలి గోవింద"** అంటూ జోలపాట పాడి నిద్రపుచ్చుతారు.

పై విధంగా జానపదులు తమ ఇష్టదైవమైన వెంకన్నపై గల భక్తివైభవాన్ని చాటుతారు. ఈ గేయాలు మన సంస్కృతికి , జనజీవనానికి దర్పణం వంటివి.

# జానపదసాహిత్యంలో శ్రీవేంకటేశ్వరుని ఆరాధన

*అమళ్ళదిన్నె గోపీనాథ్*

ఏ సాహిత్యంలోనైనా రెండు శాఖలుండటం పరిపాటి. అవి మార్గ, దేశికవితలు. తెలుగులో ఈ రెండు విధములైన కవితలు ఒకదాన్నొకటి పెనవేసికొన్న కవితాలతలుగా మనకు కనిపిస్తాయి. పండితకవులు చేపట్టి ఆదరించిన సాహిత్యం మార్గ సాహిత్యం కాగా, కేవలం పామర జనులచే ఆదరింపబడిన సాహిత్యం దేశి అయింది. మార్గ సాహిత్యమును నేడు ప్రౌఢ, లేదా శిష్ట సాహిత్యమనీ, దేశిసాహిత్యాన్ని జానపదసాహిత్యమనీ వ్యవహరిస్తున్నాం.

జానపద, శిష్ట సాహిత్యాలు తెనుగు సాహిత్యపు విభిన్న రూపాలు, శారదాదేవి నేత్ర ద్వయాలు. ఇందులో ఒకటి నాగరికత ప్రగతిని దర్శింపజేసే జ్ఞాన చక్షువైతే, రెండవది అనాగరిక సంస్కార వికాసాన్ని సూచించే విజ్ఞాన నేత్రమనవచ్చును

జానపద సాహిత్యాన్ని 1. గద్యాఖ్యానాలు 2. జానపదకవితం ( జానపదగేయాలు, గేయకథలు), 3. సామెతలు, 4. పొడుపుకథలుగా వర్గీకరింపపచ్చును.

ఇందులో జానపదగేయాలను ఒక సమగ్ర వాఙ్మయంగా భావింపవచ్చును. ఇందులో జానపదుల చారిత్రిక, భౌగోళిక, సామాజిక, ఆర్థిక, ఆధ్యాత్మిక, ఆచార, వ్యవహారాలు, వారి ఆట పాటలు, దేవతారాధనలు వేడుకలు, వారి జీవనవిధానమంతటిని కాననగును.

జానపదగేయాలను 1. పౌరాణిక గేయాలు, 2. చారిత్రక గేయాలు, 3. మతసంబంధ గేయాలు, 4. పారమార్థిక గేయాలు, 5. స్త్రీల పాటలు, 6. శ్రామిక గేయాలు, 7. పిల్లల పాటలు, 8. శృంగార గేయాలు, 9. అద్భుతరస గేయాలు, 10. కరుణరస గేయాలు, 11. హాస్య పాటలుగా డా॥ బిరుదు రామరాజు గారు విభజించారు. మన ప్రస్తుత చర్చనీయాంశము "జానపదగేయసాహిత్యంలో శ్రీవేంకటేశ్వరుని ఆరాధన" గనుక ఈ అంశమును గురించి కొంత విపులంగా చర్చించుకుందాం. జానపదులు ఆటవిక జీవితం నుండి, జానపద (పల్లెజీవనం) జీవనానికి- ఆ తర్వాత నాగరిక జీవనానికి మార్పు చెందుతుండడం మనం గమనిస్తున్న విషయమే. ఆటవిక జీవనానుసారము అచటి వాతావరణ పరిసర ప్రభావాలను బట్టి ప్రకృతి భీభత్సాల నుండి తమ్ముతాము రక్షించుకోడానికి జానపదుల భగవంతుని సృష్టించుకున్నారు. భగవంతుడు జానపదుల జన జీవనంలో లీనమయ్యాడు. భగవంతుడు ప్రకృతి దేవతగా, ఆటవిక దేవతగా జన దేవతగా, జానపదదేవతగా, నేడు నాగరిక దేవతగా విశ్వవ్యాప్తమయ్యాడు (సాకారరూపంలో). జానపదులకు భగవంతునకున్న అవినాభావ సంబంధాలను విడదీయలేము. జానపదులు లేకుండా భగవంతుడు, భగవంతుడు లేకుండా జానపదుల ఉనికిని ఊహించలేము. అందుకే భగవంతుడు జానపదులతో కలసిమెలసి తిరిగాడు. జానపదులకు ఒక సఖుడుగా, చెలిగా, ఒక బంధువుగా, ప్రాణ నాధుడుగ, సర్వము తానయైన వాడుగా వారితో కూడి ఆడి పాడి వారితో బంధుత్వము కూడ నెరపినాడు.

జానపదులతో కలసి మెలసి ఆడుకొని, పాడుకోవడమేకాదు. పోట్లాడినాడు, ఒక్కొక్క సారి దెబ్బలు తిన్నాడు. వేషాలు వేశాడు. నాటకాలు ఆడాడు. మారు వేషాలు వేశాడు. మాయాజాలము చేశాడు మోహించాడు, మోహింపజేశాడు. వారందరిని పరవశులను చేశాడు. ఒక్కొక్క మారు అలిగి వారికి దూరమైన కారణంగా వారిని ఉన్మత్తులను చేసి తనకై, తన దర్శనానికై వారిని దేశదిమ్మరులను చేసి, తన్ను చేరుకోవడానికి పలు ప్రయాసలు కలిగించి, పరీక్షించి, తనలో విలీనం చేసుకున్నాడు.

జానపదుల భావనలు, వర్ణనలు, కల్పనలు సుమనోహరంగా వుంటాయి. ప్రాచీన జానపదుల పుట్టుపూర్వోత్తరాలు, వారి జీవనవిధానాన్ని తెలుసుకోవాలంటే జానపదగేయాలే శరణ్యం. పనీ పాట అనే పదము జానపదులనుండే సంక్రమించింది. వారి పనిలోనే పాట, వారిపాటతోనే పని ముడిపడి ఉంటుంది.

## జానపదగేయాలలో శ్రీవేంకటేశ్వరుడు

వేంకటేశ్వరుడు ప్రాచీన కావ్యాల్లోనూ, పురాణాల్లోనూ, ప్రబంధాల్లోనూ, సంకీర్తనల్లోనూ, మాహాత్మ్య గ్రంథాల్లోనూ, శతకాలలోను, ద్విపదల్లోనూ, దండకాల్లోనూ, యక్షగానాల్లోనూ, నాటకాల్లోనూ, ఇలా సాహిత్య ప్రక్రియలన్నింటిలో బాగా ప్రస్తావితమై ఉన్నాడు.

జానపదగేయాల్లో శ్రీవేంకటేశ్వరస్వామి ఎలా ప్రస్తాపింపబడినాడో కొంతతెలుసుకుందాం.

జానపదగేయాల్లో వేంకటేశ్వరస్వామి పుట్టుక ఓ ప్రత్యేకతను సంతరించుకొని ఉంది. వేంకటేశ్వరస్వామి తండ్రి పేరు శేషాచలం అనీ తల్లిపేరు పేరూరమ్మ అని వీళ్ళకు ఏడుమంది బిడ్డలని వీళ్లలో చిన్నవాడు వేంకటేశ్వరుడని జానపదులు పాడుకొనే గేయాల్లో వ్యక్తమవుతుంది.

'రామరామ ఓ రామారామా ఓ రామా రామా!' అనే జానపదగేయంలో పడమటి దేశాల్లో మచ్చల బందారి అనే దేశం ఉందని, ఆ దేశాన్ని శేషాచలం ఏలుతున్నాడని అతని భార్య పేరు పేరూరమ్మ, అని ప్రస్తావించారు. ఆ గేయంలో

(నా) పేరూరమ్మ కొడుకూ లంటా వోళ్ళేడూమందీ
(నా) పేరుకాడికీ పెద్దవోడు పెద వోబీలన్నా
(నా) అతని కాడికీ సిన్నవోడు సినవోబీలన్నా
(నా) ఆతని కాడికీ సిన్నవోడు పెంచలనరసిమ్మా
(నా) అతని కాడికీ సిన్నవోడు కదిరీ నరిసిమ్మా
(నా) అతని కాడికీ సిన్నవోడు గోయిందా రాజు
(నా) అతని కాడికీ సిన్నవోడు శ్రీఎంకాటేశు
(నా) కందినమంత వరనంతోన కడబుట్టీనాడు

ఈ గేయంవల్లా వేంకటేశ్వరుని తలిదండ్రులు, అన్నదమ్ముల వివరాలు వ్యక్తమవుతున్నవి. తిరుపతికి

5 కిలోమీటర్ల దూరంలో గల పేరూరు గ్రామంలో వుండే పేరూరమ్మ గ్రామదేవత శ్రీ వేంకటేశుని తల్లిగాను. ఏడుకొండలలోని శేషాచలాన్నే తండ్రిగాను చెప్పుకుంటారు.

ఇక వేంకటేశుని స్వరూప స్వభావాలపై జానపదుల విశ్వాసము చూడండి.

**(నా) నల్ల నల్లగా బుట్టీనాడు నామాల దాసు**

**(నా) నాలిక మీద నచ్చిత్రాము అమరిన దేమూడూ**

**(నా) బూజాన భూపేక్రాము కలిగిన దేమూడూ**

**(నా) పాదానికి పావుకోళ్ళు తొడిగిన దేమూడూ**

**(నా) యీపాన వింజామరులు అమరిన దేమూడూ**

**(నా) దరిసేతిలో దామిరపత్తెము కలిగిన దేమూడూ**

**నా ఎర్రి ఎర్రి నామాలు ఏసే శ్రీ వెంకాటేశు**

**నా కలికి కుచ్చులు కమ్మిడి దెచ్చే శ్రీ వెంకాటేశు**

**నా ఊత కర్రయో సేత బూనీ శ్రీ వెంకాటేశు**

జానపదులు ప్రయాణం చేసేటప్పుడు ఎలా సిద్ధమవుతారో అదే రీతిలో స్వామిని వర్ణించారు.

**(నా) యక్కడలేని వాన, వరసము ఆ కొండామీద**

**(నా) వానవరసము కురిపించేనూ ఎయ్యంకాటేసూ**

**(నా) గడగడ గడంటా వనకతావచ్చా**

**(నా) గుడివద్దనా నిలిచీనాడూ వెయ్యంకాటేసూ**

**నాకు జానెడుతావు యియ్యకుంటేమా నేజచ్చిపోతా**

**ఇది ఎక్కడ పీడ ఏడ పీడ ఈగొల్లాపీడా**

**నాగుడి పక్క నామామువుండది మామకిందికి**

**నీ పోరాగొల్లాడా ..............................**

అంటూ పాడే పాటలో వేంకటేశ్వరుడు తనకు కావలసిన స్థలాన్ని పొందడంకోసం వరాహస్వామిని ఇబ్బందిపెట్టి చివరకు తొక్కేసి ఆ ప్రాంతాన్ని ఆక్రమించుకున్నట్లు వర్ణించబడింది.

జానపదులు పాడుకొనే వివిధ పాటలలో వేంకటేశ్వరునికి కోపం వచ్చినప్పుడు ఎలా వ్యవహరిస్తాడని, అతనికి వేటాడే నైపుణ్యముందని, వొడ్డికాసుల వాడని కాసుకు రెండు కాసులు లాగేవాడని, అలువేలు మంగ దగ్గర అపద్దాలు చెప్పి, చిక్కిపోవడం, ఇలా ఆయన స్వభావాన్ని వివరించే పాటలనేకం వున్నాయి.

**తిరుపతి క్షేత్ర ప్రశస్తి, తీర్థప్రశస్తిని గూర్చి**

"వెంకాటి వెంకాటి రమణా- ఓ సామి వెంకటి రమణా

ఎట్లావుండవుసామి గుట్టల నడుమా"

అంటూ పాడే పాటలో జానపదులు మనోహరంగా వర్ణించారు. మరోపాటలో వేంకటేశ్వరుని చేరుకునే మార్గాన్ని వివరించారు. జానపదులు ఇలా తాము పాడుకునే పాటలలో స్వామి మహిమలు, జానపదుల భక్తి, వేడికోలు పూజా విశేషాలు, మేలు కొలుపులు పాటలు ఎంతోభక్తి పారవశ్యముతో వర్ణించబడ్డాయి.

**మేలుకొలుపు పాట**

" మేలుకో శ్రీరంగా రారా దయానిదే

మేఘశ్యామల వర్ణ మేలుకో .............

వడ్డికాసులవాడా మేలుకో "

మేలుకొలుపులో మరోపాట -

'నిగనిగామని యేటి నిగనిగామని యేటి

నీలకుచ్చుల జడా నీపక్క బడినాది లెయ్‌వోయీ

..............................................................

నీమెడ నాగందోడి తుడిసెన్నపోయేను లెయ్‌వోయ్"

వేంకటేశ్వరుని అన్నగారైన పెన్నోబళస్వామిపై మేలుకొలుపు

జానపదులు పాడుకునే పాటలలో వేంకటేశ్వరునికి ఇతర దేవతలకు గల సంబంధ బాంధవ్యాలను గూర్చి ఆసక్తికరమైన విషయాలు తెలుసుకోవచ్చును.

**"కంచీకామాక్షమ్మా - ఎవురాడబిడ్డా ఓ ఎవరాడబిడ్డా**

**ఏడుకొండలేలేటి - వెంకటేసుని చెల్లెలా**

**మరుబూములేలేటి మంగా మరదాలు ఓమంగా మరదాలు**

**కంచికామాక్షమ్మా ఎవురాడబిడ్డా**

**శివబూములేలేటి శివుని బారియా"**

బీబీనాంచారమ్మను పెళ్లి చేసుకునే తతంగమంతా వివరించే పాట ఎంతో ఆసక్తిగా, మనోహరంగా వుంది. ఇందులో హిందూ, ముస్లింల ఆహార విహారాలు, ఆచార వ్యవహారాలు వివరింపబడ్డాయి.

ఇక శృంగార వర్ణనకొస్తే అన్నమయ్య మధుర భక్తితో పాడిన పాటలు కోకొల్లలుగా వున్నాయి. అలువేలు మంగకు శ్రీవేంకటేశ్వరుల మధ్య జరిగే విరహవేదన, ఎడబాటు, అలుకలు, మున్నగు విషయాలు వివరించారు.

ఇలా శ్రీవేంకటేశ్వరుని వైభవాన్ని గూర్చి జానపదులు వందలు, వేల సంఖ్యలో తమ పనిపాటలలో, వివిధ కళారూపాలలో అంటే కోలాట, చెక్కభజన, భజన గేయాలలో పాడుకుంటూ, ఆడుకుంటూ తరించారు, తరింపజేశారు.

అన్నమాచార్యులే కాకుండా ఆధునికులు కూడా శ్రీవేంకటేశ్వరుని జానపద శైలిలో కీర్తనలను రచించిన వారున్నారు. ఎంకిపాటలు వ్రాసిన నండూరువారు శ్రీవేంకటేశ్వరుని గూర్చి కొనియాడారు.

**ఎంకీనా తోటీరాయే - మన**

**యెంకటేశురుణ్ణి యెల్లీసూసొద్దాము!**

........................................................

**రేతిరి పగటేల - రెప్పేయకెంకీని**

**సల్లంగ సూడమని - సామితో జెప్పాల**

జానపదులు పాడిన వేలాదిపాటలను పరిమితమైన వ్యాసములో పేర్కొనలేము. కేవలము కొన్ని మాత్రమే వివరించడమైనది.

# జానపద సాహిత్యంలో వెంకన్న వైభవం

డా॥ పేట శ్రీనివాసులు రెడ్డి

శిష్ట సాహిత్యాని కన్నా జానపద సాహిత్యం అత్యంత ప్రాచీనమైంది. శిష్ట సాహిత్యంలో అనేకమంది కవులు వేంకటేశ్వరస్వామిని అనేక విధాలుగా కొనియాడారు. శిష్టకవులు మాత్రం వెంకన్నను భయభక్తులతో ఆరాధించి కీర్తించారు. అయితే జానపదులు ఇందుకు భిన్నంగా వేంకటేశ్వరుని దేవుడిగానే కాకుండా తమలో ఒకడిగా భావించి తమకు నచ్చిన విధంగా పరిపరివిధాల శ్రీవారిపై పాటలనుపాడి, కథలను చెప్పుకుని సంతోషించారు. జానపద సాహిత్యంలో మాత్రం శ్రీవేంకటేశ్వరుడు ఒక జానపదుడిగా మారిపోయి ఆడిపాడి ఆనందించడాన్ని మనం చూడొచ్చు. జానపద సాహిత్యంలోని వేంకటేశ్వర వైభవాన్ని చూసి తరించాలంటే వేయి జన్మలు చాలవు.

జానపద సాహిత్యాన్ని నాలుగు విధాలుగా విభజించడం జరిగింది. అది 1. జానపద కవిత్వం, 2. గద్యకథనాలు, 3. సామెతలు, 4. పొడుపు కథలు.

**జానపద కవిత్వంలో వెంకన్న :-** ఆంధ్రదేశంలో వేంకటేశ్వరుని సన్నిధి వుండే జిల్లా చిత్తూరు జిల్లా. ఈ జిల్లాలోని జానపద కవిత్వంలో వేంకటేశ్వరుడు అడుగడుగునా చోటు చేసుకొని వున్నాడు. జానపద కవిత్వాన్ని కూడా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి 1. జానపదగేయాలు, 2. జానపద కథా గేయాలు.

**జానపద గేయాల్లో వెంకన్న :-** జానపదులు అనేక గేయాలలో వెంకన్నను అత్యున్నతంగా ప్రస్తావించారు. భక్తి, శృంగారాల ద్వారా వేంకటేశ్వరుని వైభవాన్ని కళ్ళకు కట్టినట్లు హృదయోల్లాసంతో చిత్రీకరించారు. జానపదులు వేకువజామున వేంకటేశ్వరస్వామిని స్మరిస్తూనే నిద్రలేస్తారు. తాము నిద్రలేయడమే కాదు శ్రీవారిని సైతం నిద్ర లేపుతూ మేలుకొలుపు పాటలను పాడ్తారు. కింది మేలు కొలుపు పాటను గమనించండి.

**"మేలుకో శ్రీరంగా రారా దయానిధే**
**మేఘ శ్యామల వర్ణ మేలుకో**
**తూరుపుదిక్కున సూర్యుడు ఉదయించే**
**స్వామీ వెంకట రమణా మేలుకో**
**కస్తూరి కల్లాపు చల్లేటి వేళాయా**
**కస్తూరి రంగయ్యా మేలుకో**
**తెల్ల తెల్లావారా వెలబోయే దీపాలు**
**ఏడుకొండల వాడా మేలుకో**
**కార్వేటి నగరాన రణభేరి వాయించే**

## శ్రీవేంకటేశ్వర వైభవం

అయ్యా వెంకట రమణా మేలుకో
గాలీ గోపురము కాడ ఘోషాయే గుంపులు
వడ్డీ తెస్తున్నారు మేలుకో
అత్తారు పన్నీరు పునుగు జవాదీ తోడ
ముడుపు తెస్తున్నారు మేలుకో
తుంబూర నారదులు తంబూర మీటేరు
వొడ్డీ కాసుల వాడా మేలుకో"

అదే విధంగా జానపదులు వేంకటేశ్వరుని మీద భక్తిని ప్రదర్శిస్తూ వెంకన్న మహిమలను ప్రస్తుతిస్తారు.

ముక్తి దాయక నీకు మ్రొక్కు చుండెడి వారు
మోహ సాగరంబున మునగరయ్యా
శ్రీలక్ష్మి రమణ నీసేవ చేసెడివారు
కారుణిచే బాధ కాంచరయ్య
పుండరీకాక్ష నీదు పూజ సేసెడివారు

పై గేయంలో ముక్తినిచ్చే వేంకటేశ్వరుడిని మొక్కేవారు మోహ సాగరంలో మునగరని, సేవ చేసేవారు బాధలు పడరని, పూజచేసేవారు నరకానికి పోరని, పరమ సాత్వికులైన భక్త జనులకు వెంకన్న ముక్తిని ప్రసాదించే పాపహరుడని నిర్మలమైన చరిత్రగలవాడని వర్ణించబడి ఉంది.

జానపద గేయాల్లో వేంకటేశ్వర స్వామికి జరిగే ఉత్సవాల వైభవాన్ని గూర్చి కూడా జానపదులు పాడుకున్నారు. 'వెంకటేశ్వరుని జూడారే ఇంక సద్గతిని చేకొనరే' అనే గేయంలో -

"బారులుగాను దివిటీలు
ఒక్క బారు భజనలు జేయువారు
కోరి చెత్రము యొక్క - బారూ బట్టెడివారు
దీరులై సురటీనొక - బారూ వేసెటివారు
సురులు కరి తురగము తేరులు
దొరలు బ్రామ్మణ వరులు కిన్నెర
వరులు వరులిడు గడలు గొలువగ
గరుడ వాహవమెక్కి కదలిన

**పాటింప దేవా వేశ్యాలు**
**పాట పాటలచే సాక్కి సోలు రామా**
**నీటుగానూ వన్నె వాటందరముగా వేసి**
**నేటి దీనము సూత్రనాటికాధారుడూ**
**కోటి సూర్యుడు సాటి వెలగు**
**కిరీటము శిరమందు మెరయగ**
**నేటి మణులకు సరియగు**
**శ్రీకోటియై వెడలి వచ్చెడి**

అని వెంకన్నకు జరిగే వేడుకలను జానపదులు ప్రస్తావించారు. బారులు తీరి దివిటీలు పట్టేవారు, భజనలు చేసేవారు, గొడుగులు మోసేవారు, సురటీలు వేసేధీరులు, ఏనుగులు, గుఱ్ఱాలు, తేరులు పక్కన రావడమే గాకుండా దేవతలు, దొరలు, బ్రాహ్మణ శ్రేష్ఠులు, కిన్నెరలు, నరులు వంటివారు కొలుస్తుండగా వేంకటేశ్వరుడు గరుడ వాహనమెక్కి ఊరేగడం, అలాగే దేవవేశ్యలు పాటలు పాడుతూ, నాట్యాలు చేస్తుంటే జగన్నాటక సూత్రధారుడైన వెంకటరమణుడు కోటి సూర్యుల సాటి వెలిగే కిరీటాన్ని శిరస్సుపై పెట్టుకొని, మేటి మణులకు సరిపోయే లక్ష్మీ సమేతుడై వెడలి వస్తున్నాడని, అలాగే దారి పొడవునా భక్తులు మల్లె మొల్లల్ని దోసిళ్ళతో స్వామిపై పూల వర్షం కురిపిస్తున్నారని, ఆకాశంలో మందుగుండు సామగ్రి పొగలు దట్టంగా వ్యాపించి ఉన్నాయని, భేరీ మృదంగ వాద్యాలు మ్రోగుతుండగా ఇందిరేశుడైన వెంకన్న పరమానందుడై ఎంతో వేడుకతో ఊరేగినట్లు గేయంలో వర్ణించబడి వుంది.

**జానపద కథాగేయాల్లో వెంకన్న :-** జానపద గేయాల్లో కేవలం భావాంశాలు మాత్రమే ఉంటాయి. కథాగేయాల్లో కథ ప్రధానంగా ఉంటుంది. జానపదులు వేంకటేశ్వర స్వామికి సంబంధించిన ఎన్నో కథలను తమ కథాగేయాల్లో పాడుకొని ఆనందించారు. శిష్టసాహిత్యంలో ఎక్కడా కనిపించని ఎంతో విలువైన కథలను గేయరూపంలో అందించారు మన తెలుగు జానపదులు. వేంకటేశ్వరుని అవతరణ గూర్చి శిష్టసాహిత్యంలోని కథకు , జానపదులు పాడుకునే కథకు ఎంతో తేడా కనిపిస్తుంది. చివరికి జానపదులు పాడుకున్న కథే సరైందేమో ననిపిస్తుంది. కింది జానపద కథాగేయంలో వేంకటేశ్వర స్వామి పుట్టుక ఓ ప్రత్యేకతను సంతరించుకొని వుంది. వేంకటేశ్వరస్వామి తండ్రి పేరు 'శేషాచలం' అనీ, తల్లి పేరు 'పేరూరమ్మ' అని వీళ్ళకు ఏడుమంది బిడ్డలని, వీళ్ళలో చిన్నవాడు వేంకటేశ్వరుడని జానపదులు తమగేయాల్లో పాడుకున్నారు.

'రామ రామ ఓ రామా రామా ఓ రామా రామా' అనే కథాగేయంలో పడమటి దేశాల్లో 'మచ్చలబందారి' అనే దేశం ఉందని, ఆదేశాన్ని శేషాచలం ఏలుతున్నాడని, అతని భార్య పేరు 'పేరూరమ్మ' అని ప్రస్తావించబడి వుంది. అలాగే ఈ కథా గేయంలో -

(నా) పేరూరమ్మ కొడుకూలంటా వోళ్లేడు మందీ
(నా) పేరు కాడికీ పెద్దవోడు పెదవోబీలన్నా
(నా) అతని కాడికీ సిన్నవోడు సినవోబీలన్నా
(నా) అతని కాడికీ సిన్నవోడు మద్దిలేటన్నా
(నా) అతని కాడికీ సిన్నవోడు పెంచల నరిసిమ్మా
(నా) అతని కాడికీ సిన్నవోడు కదిరీ నరసిమ్మా
(నా) అతని కాడికీ సిన్నవోడు గోయిందారాజు
(నా) అతని కాడికీ సిన్నవోడు శ్రీ ఎంకాటేశు
(నా) కందిన మంత వరసంతోన కడబుట్టీనాడు

అని పేర్కొనబడింది. వేంకటేశ్వర స్వామికి చుట్టు పక్కలుండే ఇతర దేవుళ్ళను జానపదులు అతనికి తోడబుట్టిన వాళ్ళుగా చేశారు. అలాగే వీరి తల్లిదండ్రుల విషయం కూడా ఆసక్తికరంగా ఉంది. తిరుపతికి ఐదు కిలోమీటర్ల దూరంలోని పేరూరు అనే గ్రామంలో చిన్నకొండ వుంది. ఆ కొండకు 'పేరూరుబండ' అని పేరు. ఈ బండమీద దేవాలయం వుంది. ఈ దేవాలయంలో మూల విరాట్టులేదు. ఈ దేవాలయాన్ని స్థానికులు 'పేరూరమ్మగుడి' అని అంటారు గానీ, పేరూరు గ్రామదేవతే ఈ పేరూరమ్మ. ఈమెను వేంకటేశ్వరుని తల్లిగానే వ్యవహరిస్తుంటారు. ఇక తండ్రి 'శేషాచలం' అని ప్రస్తావించడం వల్ల శేషాచలం ఏడుకొండల్లో ఒకటిగా భావించవలసి వస్తోంది. వేంకటేశ్వరస్వామి తానుండడానికి గట్టిచోటు కావాలని వెదుక్కొంటూ తిరుపతి కొస్తాడు. అక్కడ గంగమ్మ కనిపించే సరికి తనకు గట్టిచోటు చూపిస్తే నీకు సంవత్సరాని కొకసారి జాతర జరిపిస్తానని, 'ఏటా పొంగళ్ళు పెట్టి 'గావులు' ఇస్తానంటాడు వెంకన్న. అందుకు గంగమ్మ తిరుమల కొండను చూపిస్తుంది. అక్కడ వరాహస్వామిని స్థలం ఇవ్వమని తాను గొర్రెలను మేపుకోవాలని ప్రాధేయపడ్తాడు. వరాహస్వామి ఇదెక్కడి గొడవరా బాబూ! అనుకుంటూ తన పక్కన చోటిస్తాడు. ముందు పూజలు నీకే తండ్రి అని చెప్తాడు. తర్వాత రెండో పూజ తనకని చెప్తాడు.

ఇలా వెంకన్న ఆవిర్భావానికి సంబంధించిన కథను ఈ కథాగేయం వివరిస్తుంది.

వేంకటేశ్వరుని పెళ్ళికి సంబంధించి కూడా అనేక కథాగేయాలను జానపదులు పాడుకుంటుంటారు. జానపద కథాగేయాల్లో వర్ణించబడిన వెంకన్న పెళ్ళికి, పురాణాల్లో వర్ణించబడిన వెంకన్న పెళ్ళికి కొంత వైవిధ్యం వుంది. అష్టాదశ పురాణాల్లోని, భవిష్యోత్తర, స్కంద, వేంకటాచల మాహాత్మ్యం ప్రకారం శ్రీనివాసుడు చోళరాజైన ఆకాశరాజు కుమార్తె పద్మావతి, ఉద్యానవనంలో విహరిస్తున్నప్పుడు చూసి ఎలాగైనా పద్మావతిని వివాహం చేసుకోవడానికి నిశ్చయించుకుంటాడు. తన తల్లి వకుళాదేవిని ఆకాశరాజు దగ్గరకు పెళ్ళి నిమిత్తం పంపుతాడు. ఈ లోపల శ్రీనివాసుడు ఎరుకలసాని రూపందాల్చుకుని అంతఃపురానికెళ్ళి పద్మావతికి శ్రీనివాసుడే సరైన

వరుడని, అతను దైవాంశసంభూతుడని పద్మావతికి, ఆమె తల్లికి సోది చెప్పివస్తాడు. వకుళాదేవికి ఆకాశరాజు దంపతులు తమ సమ్మతిని తెలియచేస్తారు. ముక్కోటి దేవతలు శ్రీనివాసుని పెళ్ళికి విచ్చేసి ఘనంగా వివాహం జరుపుతారు.

జానపద కథాగేయాల్లోని వెంకన్న పెళ్ళిని, వాటి విశేషాలను తిలకించండి -

'నా పెద్దలంతా కూడి పెత్తానం బోయె రో గుమస్తీల గుమ్మడిలో ' అని సాగే గేయంలో వెంకన్నకు పెళ్ళి సంబంధం చూడడానికని అతనికి సంబంధించిన పెద్దలు మంగమ్మ వుండే నగరానికి వెళ్తారు. అక్కడ మంగమ్మకు అమ్మ 'కమిసల్య'ను చూసి మీ ఇంట్లోని చినపాపను చూసి పోవడానికి వచ్చామని చెప్తారు. అప్పుడా పెద్దలు ఎలాంటి మంగను చూశారో చూడండి.-

(నా) చెరుకు తుంటాల చేతులు గల్లాదో గుమస్తీల గుమ్మడిలో
(నా) హ(అ)రటి స్తంబాలాల కాళ్ళే గల్లాదో " "
(నా) పెసులూ కాయలాల పెదములు గల్లాదో " "
(నా) పచ్చీ బీమూలాల పండ్లే గల్లాదో " "

అంత అందగత్తైన మంగమ్మ వేంకటేశ్వరుని పెళ్ళాడడానికి ఒప్పుకోదు. ఆ విషయాన్నే మంగమ్మ తల్లి వచ్చిన పెద్దలకు చెబుతుంది. అప్పుడు సంబంధానికి వచ్చిన పెద్దలు వెనుదిరిగి తాముండే నగరాని కొచ్చేస్తారు. అక్కడే వున్న వెంకన్న పెద్దల్ని కలిసి పోయినపని ఏమైందని కాయ అయిందా? లేక పండు అయిందా? అని అడుగుతాడు. అప్పుడు పెద్దలు మంగమ్మ నిన్ను పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకోలేదని చెప్తారు. దాంతో వేంకటరమణునికి కోపం వచ్చి కుడి మీసం వడదిప్పి, గుడ్లెర్రగా చేస్తాడు. వెంటనే ఎరుకలసాని కావడానికి స్త్రీ రూపం దాల్చుతాడు తర్వాత -

(నా) బంగారి గాజులతో పన్నీరు బెట్టో గుమస్తీల గుమ్మడిలో
(నా) ఎండీ గాజులతో వేడ్నీలు బెట్టో " "
(నా) సీకాయ ముద్దాలు సెంబులకు దీసో " "
(నా) పసుపు కొమ్ములు దంచి బుర్రలకు బోసో " "
(నా) వేడ్నీళ్ళు సల్నీళ్ళు చలిదలం చేసో " "
(నా) జాలారి బండెక్కి జలకంబులాడో " "
(నా) వాలారి బండెక్కి వొళ్లార్చినాదో " "
(నా) ఎండీ దువ్వెనతోనే పాపిట్లు బంజో " "
(నా) పిద్దిల్లో నూనెత్తి శిరసూ తలలంటో " "

(నా) నున్నంగ తలదువ్వి నునుపూజడ్లేసో గుమస్తీల గుమ్మడిలో
(నా) జారూ బక్కల జూసి జారూ ముడ్లేసో " "
(నా) హోడవారి సీరాలు సామీ గట్టానో " "
(నా) హోడవారి రైకాలు సామీ గట్టానో " "
(నా) హోడవారి నగాలు సామీ బెట్టానో " "
(నా) కూలూరి కుంకామూ గురుతుగా బెట్టో " "
(నా) నిలువూటద్దామెత్తీ నీడార జూసో " "
(నా) నాయట్టి హోడాది జగతందు లేదో " "

అంత అందంగా వెంకన్న ఎరుకలసానిగా ముస్తాబు చేసుకొని ఏలూరి సీమ వెదురు ఎత్తుకొని, చిత్తూరు సీమ వెదురు తీసుకొని బుట్టను తయారు చేసుకొని, మల్లెపూలతో బుట్టను నింపి, సింగారించి, బుట్టకు ముత్యాలను కుట్టించి, ఒక చంకలో బిడ్డను ఎత్తుకొని, బిత్తర చూపులు చూస్తూ మంగమ్మ ఉండే నగరానికి వెళ్లి 'గద్దే గద్దే' అంటూ తిరగనారంభిస్తాడు.

జానపదగేయంలో ఎరుకల సాని మాటలను మంగమ్మ తల్లి 'కమిసల్య' విని ఎరుకలసానిని పిలిపించి ఏవూరు నుండి ఇక్కడికొచ్చావు? అని అడుగుతుంది. ఎరుకలసాని తంగెడుపల్లె నుంచి వచ్చానని, పెళ్లికాని బాలలకు గద్దె చెప్తానని చెప్తుంది. అట్లైతే మా మంగకు పెండ్లి కాలేదని కమిసల్య అంటుంది. గద్దె చెప్పడానికి ఎరుకలసాని తెల్లని గుడ్డల్ని తెచ్చి తెరకట్టమని, పచ్చి బియ్యం తెమ్మని, రెండు పసువు కొమ్ములు తెమ్మని, నూలు కండీని దారంకోసం తెమ్మని చెప్తుంది. తర్వాత ఎరుకలసాని రూపంలో వుండే వేంకటేశ్వరస్వామి ఏమి చేశాడో చూడండి -

"(నా) ముత్యాల పీటైనా సామికేశారో గుమస్తీల గుమ్మడిలో
(నా) రతనాల పీటైనా మంగమ్మా కేసో " "
(నా) మంగమ్మ తోడమీద సామి తొడపెట్టో "
(నా) మంగమ్మ కయితేనో మత్తూలెక్కిందో "
(నా) మరుగూ మాటలతోనే బొట్టు కట్టినాడో "
(నా) బొట్టుగట్టి యాసామి మాయామయ్యాడు "
(నా) పొదుబుట్టె తెల్లారే ఏడూగడులాయో " "

ఇలా వేంకటేశ్వరుడు ఎరుకలసాని వేషం వేసుకొని మంగమ్మకు గద్దె చెప్పడానికి పోయి, మాయ మాటలతో మంగమ్మకు తాళిబొట్టు కట్టేసి మాయమై పోతాడు. ఇలా జానపద కథాగేయాల్లో వెంకన్న అవతరణ, పెళ్ళి, శృంగారం పంటి అంశాలు ఎంతో వైవిధ్య భరితంగా ప్రస్తావించబడి వున్నాయి.

**గద్య కథనాల్లో వెంకన్న** :- జానపద సాహిత్యంలో వచనరూపంలో వుండే కథనాలకు గద్యకథనాలనే పేరుంది. ఈ ప్రక్రియలో పురాణాలు, ఇతిహాసాలు, కథలు చోటు చేసుకొని వున్నాయి.

**జానపద పురాణాల్లో వెంకన్న** :- శిష్టులకు అష్టాదశపురాణాలున్నట్లే జానపదులకు కూడా పురాణాలున్నాయి. తమకు నచ్చిన పౌరాణికాంశాలను జానపదులు పురాణ కథలుగా చెప్పుకుంటుంటారు. వీటినే పురాణగాథలని కూడా అంటారు. జానపద పురాగాథల్లో వెంకన్న బహు విధాలుగా ప్రస్తావించబడి వున్నాడు. కింది పురాగాథల్ని పరిశీలించండి.

శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహమైన మలయప్పస్వామి విగ్రహం ఎవరూ చేసింది కాదట. ఆ విగ్రహంతో పాటు దేవేరుల విగ్రహాలు కూడా దొరికినవేనని చెప్తారు. తిరుమల ఆలయం బాగా ప్రాచుర్యం పొందుతున్న కాలంలో బహుశా 13 వ శతాబ్దంలో బ్రహ్మోత్సవాలు జరిగేటప్పుడు ఉగ్ర శ్రీనివాస మూర్తిని, దేవేరులను ఊరేగిస్తున్నారట. అప్పుడు అక్కడి ఇళ్ళన్నీ వున్నట్టుండి అగ్నికి ఆహుతై పోయాయట. భయంకరమైన ఈ ప్రమాదానికి భయపడిన తిరుమలవాసులు, యాత్రికులు, అర్చకులు తమను రక్షించవలసిందిగా శ్రీనివాసుని వేడుకున్నారట. అప్పుడు స్వామి ఒక భక్తుడిపై వాలి తన విగ్రహమూర్తులను ఉత్సవాల్లో, ఊరేగింపుల్లో ఉపయోగించ కూడదని అలా చేస్తే ఉగ్రత్వం (కోపం) వస్తుందని చెప్పాడట. ఇలా మరోసారి జరగకుండా వుండాలంటే శేషాచలం కొండలపైనే వున్న మలయప్పకోనలో తన విగ్రహాలు లభిస్తాయని వాటినే ఉత్సవ మూర్తులుగా ఉపయోగించమని చెప్పాడట. అప్పుడు బ్రహ్మోత్సవాలను మధ్యలో ఆపి మలయప్పకోనలో వెతకడం ప్రారంభించారట. వెతగ్గా వెతగ్గా కొన్ని రోజులకు ఆ విగ్రహాలు దొరికాయట. వాటిని తీసుకొచ్చి ప్రాణ ప్రతిష్ఠ చేసి మధ్యలో ఆపిన బ్రహ్మోత్సవాలను జరిపించారట. అప్పటి నుంచి ఉత్సవమూర్తులుగా ఆ విగ్రహాలనే ఉపయోగిస్తున్నారు. మలయప్పకోనలో లభించిన విగ్రహాలు కాబట్టి 'మలయప్ప' అనే పేరుతో స్వామిని పిలవడం జరుగుతోందని చెప్తారు. అలాగే మరో పురాగాథను పరిశీలించండి.

కలియుగ ప్రారంభంలో తొండమాన్ చక్రవర్తి దక్షిణ దేశమైన తొండమండలాన్ని పాలించేవాడు. ఒక సారి ఉన్నట్టుండి యుద్ధం వస్తుంది. అప్పుడు తొండమాన్ చక్రవర్తి గుహల ద్వారా తిరుమలకొచ్చి త్వరత్వరగా శ్రీవారి ఆలయంలోకి ప్రవేశిస్తాడు. ఒక్క తొండమాన్ చక్రవర్తికి మాత్రమే శ్రీవారి ఆలయంలోకి అన్నివేళలా ప్రవేశం వుంటుంది. తెలిసి అక్కడికి వెళ్తాడు. అక్కడ తిరుమలేశుడు శ్రీదేవి, భూదేవిలతో సరససల్లాపాలాడుతుంటాడు. తాము శృంగారం అనుభవిస్తున్నప్పుడు తొండమాన్ చక్రవర్తి అక్కడికి రావడంతో శ్రీదేవి, భూదేవి సిగ్గు పడ్డారు. వెంటనే శ్రీదేవి శ్రీవారి వక్షస్థలంలో దాక్కొని తోమాలను కప్పేసుకుంటుంది.

భూదేవి ఏం చేయాలో తోచక గబుక్కున పూలబావిలో దాక్కుంటుంది. తర్వాత శ్రీనివాసుడు తొండమాన్ చక్రవర్తికి యుద్ధంలో గెలవడానికి శంఖు, చక్రాలను ఇస్తాడు. తొండమాన్ చక్రవర్తి తర్వాత యుద్ధంలో గెలుస్తాడు. ఈ కధనంతా రామానుజాచార్యులు విని, పూలబావిలో భూదేవి ఒక్కటే వున్నదని తెలుసుకొని 'అలగపిరినార్' అనే పేరుతో వెంకన్న విగ్రహాన్ని చేయించి, ఆమెతోపాటు పూలబావిలో ప్రతిష్ఠిస్తాడు. అందుకని తోమాలసేవలోని మాలలను (వాడిపోయాక) ఈ భూదేవి, అలగపిరినార్ కిచ్చేస్తారు. అంటే పూలబావిలో పడేస్తారు. ఈ మాలలను ఇతరులెవ్వరికీ ఇవ్వరు.

ఇలా పురాగాధల్లో వెంకన్నను జానపదులు పరిపరి విధాలుగా ప్రస్తావించారు.

**జానపద ఐతిహ్యాల్లో వెంకన్న :-** ఐతిహ్యాలలో చారిత్రకాంశాలుంటాయి. ఇవి పురాగాధల కంటే, కధలకంటే చిన్నవిగా వుంటాయి. ఐతిహ్యాలు జరిగాయని మనల్ని నమ్మించడానికి ప్రయత్నిస్తాయి. ఇలాంటి ఐతిహ్యాలనెన్నింటినో జానపదులు వెంకన్న మీద చెప్పుకున్నారు. కింది ఐతిహ్యాలను గమనించండి.

శ్రీకృష్ణదేవరాయలు శ్రీవేంకటేశ్వరస్వామి భక్తుడు. తిరుమలలో వేంకటేశ్వరస్వామికి నైవేద్యం అయితే తప్ప తాను భోజనం చేసేవాడు కాదు. శ్రీవారి ఆలయంలో నైవేద్య సమయంలో గంటకొడితే ఆ గంట తిరుమల కొండ కొమ్మున వుండే ఘంటామండపం వరకు వినబడేది. ఆ శబ్దం విని అక్కడి కాపలాదార్లు గంటామండపంలోని గంటను కొడ్తే ఆ శబ్దం చంద్రగిరి కోటకు వినబడుతుంది. అప్పుడు శ్రీకృష్ణదేవరాయలు స్వామికి నైవేద్యమైందని తెలుసుకొని తాను భోజనం చేసేవాడట. ఈ మండపం దగ్గర నిలబడితే సుమారు 40 కి.మీ. విస్తీర్ణం వరకు కనబడుతుంది.

అలాగే మరో ఐతిహ్యాన్ని గమనించండి-

హైదారాలీ చంద్రగిరి కోటను ముట్టడించాక తొండవాడ సమీపాన వుండే తిమ్మప్ప దేవాలయాన్ని ధ్వంసం చేసి, శ్రీనివాసమంగాపురం పైకి దండెత్తి ఆలయాన్ని కూడా దోచుకొని అలిపిరి వరకు వచ్చి అలిపిరిలోని గుడిని నాశనం చేసి తిరుమలలో వరాహస్వామి గుడి వుండడం వల్ల తిరుమల కెళ్లకుండా వెనుదిరిగి పోయాడు. అంతకుముందు యుద్ధంలో తగిలిన గాయంవల్ల హైదరాలీ చిత్తూరు దగ్గరుండే నరసింగరాయని పేట దగ్గర చనిపోయాడు. అక్కడే అతనికి గోరీని కూడా కట్టారు. తిమ్మప్ప (తిరుమలప్ప) గుడిని, శ్రీనివాస మంగాపురం ఆలయాలను దోచుకున్నందుకు తిరుమలేశుడు హైదరాలీని అలా శిక్షించాడని అంటారు. అందుకే హైదరాలీ చిత్తూరు మండలం దాటి వెళ్ళలేకపోయాడని అంటారు. అలాగే అతని కొడుకు టిప్పుసుల్తాన్ మైసూర్‌లో ఓడిపోయి కంపెనీ సేనలకు బందీగా చిక్కడం కూడా స్వామి వారి మహిమేనని అంటారు.

అలాగే మరో ఐతిహ్యాన్ని చూడండి -

కొండపైన దక్షిణ మాడ వీధిలోని గుర్రాలపాక దగ్గర పూర్వం ఒక అవ్వ గుగ్గిళ్ళు అమ్ముతుండేదట.

వేంకటేశ్వరస్వామి ఆ అవ్వ దగ్గర 4 దమ్మిళ్లకు గుగ్గిళ్ళు అప్పుగా తింటాడు. అవ్వ ఆ డబ్బులు అడుగుతుందని చడీచప్పుడు కాకుండా అక్కడినుండి భాజాభజంత్రాలు ఆపేసి కొంతదూరం స్వామిని నిశ్శబ్దంగా తీసుకొని పోతారు. (ఇప్పటికీ గుర్రాల పాక దగ్గర ఒక పందిరి వేసి ఆ పందిరిలో స్వామిని కాసేపు నిలపి తర్వాత నిశ్శబ్దంగా తీసుకొని వెళ్ళిపోతారు.)

ఇలా జానపదులు అనేక ఐతిహ్యాలలో వెంకన్నను ప్రస్తావించారు.

**జానపద కథల్లో వెంకన్న** :- జానపదులు తమభక్తి, వినోదాల కోసం అనేక కథలను అల్లుకొని ఆనందించారు. బంగారు తిమ్మరాజు వేంకటేశ్వరుని అంశంలో పుట్టి తర్వాత వెంకన్నలో ఐక్యమౌతాడు. అలాగే తిరుపతమ్మ కథలో కూడా వెంకన్న మాహాత్మ్యం మనకు అడుగడుగునా కనిపిస్తుంది. ఇవే కాకుండా జానపదులు వెంకన్న మాహాత్మ్యాలను అనేక కథల్లో చెప్పుకొని తమ భక్తి విశ్వాసాలను ప్రకటించు కున్నారు. కింది జానపద కథలను గమనించండి.

శ్రీనివాసుడు తిరుపతిలో ప్రతివారం జరిగే సంతకు వచ్చేవాడట. ఆ సంతలో పూసలు, తమలపాకులు అమ్మేస్త్రీలతో ఎకచక్కాలు (పరాచకాలు) ఆడుతూ వారిని ఏడిపించేవాడట. సయోధ్య కుదిరితే వారితో రాత్రి గడిపేవాడట. ఈ విషయం ఇరుగు పొరుగు వెళ్ళి అమ్మవారికి చెప్పారట. ఇందులో నిజమెంత వుందో తెలుసుకోవాలని పద్మావతి తమలపాకులమ్మే స్త్రీలాగా వచ్చి సంతలో కూర్చునిందట. యధావిధిగా శ్రీనివాసుడు సంతకు వచ్చాడట. ఆడవారితో పరాచకాలాడుతూ కనబడ్డాడు. అందంగా మారువేషంలో వుండే పద్మావతి కనబడగానే ఆమె దగ్గరకు వెళ్ళి ఆమెతో మాట కలిపాడట. తర్వాత రాత్రికి రమ్మని అడిగాడట. ఆమె సరేనని చెప్పి అంతవరకు గుర్తుగా చూసుకునేందుకు ఆయన చేతి మురుగులను (కడియాలను) ఇవ్వమని కోరిందట. శ్రీవారు అలాగే ఇచ్చేశాడు. రాత్రికి కలుసుకోవాలని మాట్లాడుకొన్న స్థలానికి వెళ్ళి ఎంత ఎదురుచూసినా తమలపాకులు అమ్మే ఆ అమ్మాయి రాలేదట. నిరాశగా శ్రీనివాసుడు తిరిగి వెళ్ళిపోయారట. ఇంటికి వెళ్ళిన శ్రీనివాసుడి చేతిలో మురుగులు ఏమైనాయని అమ్మవారు ప్రశ్నించిందట. విషయం చెప్పక తడబడుతూవున్న శ్రీనివాసుడికి తన దగ్గరున్న ఆయన మురుగులను చూపించి అలిగివెళ్లిపోయిందట.

మరోకథను గమనించండి -

ఒకరోజు ఉదయాన్నే వేంకటేశ్వరుడు నిద్రలేచి పొగడ పుల్లతో పళ్ళు తోముకొని, కాళ్ళుచేతులు కడుక్కొని, నామాలు పెట్టుకొని, కాస్తంత ఎంగిలిపడి, తాంబూలం వేసుకొని అలా అలసి, ఆదమరచి నిద్రపోయాడు. ఉన్నట్టుండి నిద్రలోంచి ఉలిక్కిపడి లేచి దిక్కులు చూశాడు. వెంటనే తన తల్లి అయిన పేరూరమ్మను పిలిచి తానొక కలకన్నానంటాడు. అందుకు పేరూరమ్మ తనకొడుకైన వెంకన్నను ఏమి కలకన్నావో చెప్పమంటుంది. ఢిల్లీ పట్నం నవాబు కూతురైన బీబీని కలిసినట్లు కలగన్నానని చెప్తాడు. అది విని పేరూరమ్మ తన కొడుకును

నిరుత్సాహ పరచడానికని తురకలు బుద్ధి తురిమే బుద్ధి అని, పచ్చిమాంసం కండలను తినేవారని, పచ్చిపాలు తాగేవారని చెబుతుంది. కానీ వెంకన్న తన తల్లి చెప్పినా, చెప్పకపోయినా పోతానని చెప్తాడు. అక్కడ నుండి వెంకన్న తన అన్నను కలుసుకొంటాడు. గోవిందరాజులు కూడా తన తమ్ముడైన వెంకన్నను నిరుత్సాహ పరచి వద్దంటాడు. అయినా వేంకటేశుడు తన పట్టును వదలడు. తానొక్కడే ఢిల్లీకి బయలుదేరుతాడు. కూడా గోవిందరాజస్వామి కూడా వెళ్తాడు. ఢిల్లీ నవాబు దగ్గర కోట గోడలు కట్టే కూలీలుగా పనిచేస్తూ బీబీని ప్రేమిస్తాడు బీబీ కూడా వెంకన్నను గాఢంగా ప్రేమిస్తుంది. అదను చూసి బీబీని వెంకన్న లేవదీసుకొని వచ్చేస్తాడు అడ్డొచ్చిన తురకసైన్యాన్ని అన్నదమ్ములు ఓడిస్తారు. బీబీని వెంకన్న ఎగువ తిరుపతి తీసుకొస్తాడు. తన తల్లిని పిలిచి చూపిస్తాడు అక్కడ్నుంచి పేరూరమ్మ దిగువ తిరుపతికి వచ్చి అలమేలు మంగ దగ్గరకెళ్తుంది అత్తను చూసి అలమేలు కోపంతో తలుపేసుకుంటుంది పేరూరమ్మ వాకిట ముందు నిలబడి అన్నదమ్ముని మా తురని, అయిన దానివని తెచ్చుకున్నానని ఇలా జరుగుతుందని అనుకోలేదని అలమేలును ఓదారుస్తుంది. దీనిని బట్టి అలమేలు మంగ వేంకటేశ్వరుని సొంత మేనమామ కూతురని తెలుస్తోంది. శిష్టపురాణాల్లోని వేంకటేశ్వరుని కధకు, జానపదుల్లో వ్యవహారంలో వున్న కధకు ఎంత భిన్నంగా వుందో అర్థమౌతుంది. అక్కడ పద్మావతి ఆకాశరాజు కూతురైతే, ఇక్కడ మేనమామ కూతురని జానపదులు కధల్లో చెప్పుకున్నారు.

ఇలా గద్యకధనాల్లో జానపదులు వెంకన్నకు సంబంధించిన ఎన్నో విషయాలను ప్రస్తావించారు.

**సామెతల్లో వెంకన్న :-** సామెత లేని మాట ఆమెతలేని ఇల్లు ఒకటేనన్నారు అంటే సామెత లేకుండా మాట్లాడే మాట, విందు లేకుండా ఉండే యిల్లు లాంటిదని అర్థం సంభాషణలో సామెతల పుట్టుకకు అనుభవమే ప్రధాన కారణం. ప్రతీరోజు జీవితంలో మనం కన్నవీ, విన్నవీ, అనుభవించినవీ సామెతల రూపంలో వెలువడుతాయి ఇలాంటి సామెతల్లో కూడా వేంకటేశ్వరస్వామి చోటు చేసుకొని వుండడం ఎంతో గమనించ దగిన విషయం. వేంకటేశ్వరస్వామి నేటికీ, ఎన్నటికీ తిరుగులేని దైవం. ఏడుకొండల మీద వేంకటేశ్వరుడు, దిగువ తిరుపతిలో గోవిందరాజస్వామి నెలకొని వున్నారు. కొండెక్కేటప్పుడు, గుళ్లోకెళ్ళేటప్పుడు 'గోవిందా గోవింద' అని నామస్మరణం చేస్తుంటారు భక్తులు -

**'ముడుపులు వేంకటేశ్వరుడికి, కేకలు గోవిందునికి'**
**'గోల గోవిందుడిది అనుభవం వేంకటేశ్వరునిది'**
**'వేడుక వేంకటేశ్వరుడిది గోల గోవిందుడిది'**

అనే సామెతలు వేంకటేశ్వరుని వైభవాన్ని చాటుతున్నాయి.

**'వండాడి కొండ వణికింది**
**సాకి బండ సాగింది**

**పాలకొండ పదిరింది**

**మొట్టికొండ మోటుకొనింది'**

అనే సామెత అంతరార్థం కడపజిల్లా రాయచోటి మండలంలో చెప్పుకుంటారు. వేంకటేశ్వరస్వామి వెలసేందుకు వండాడి కొండమీద అడుగుపెట్టగా వణికిందని, సాకిబండమీద కాలుపెట్టగా సాగిందని పాలకొండ మీద పాదం మోపగా పదిరిందని, మొట్టికొండ (శేషాచలం) మోటుకొని నిలబడినందువల్ల అక్కడ శ్రీవారు వెలశాడని జానపదులు సామెత రూపంలో చెప్పుకున్నారు.

వేంకటేశ్వరస్వామిని అనేకమంది అనేక రకాలుగా అభివర్ణించారు- కొందరు జైనుడని, కొందరు బుద్ధుడని, శాక్తేయులు శక్తి అని, శైవులు శివుడని, వైష్ణవులు శ్రీనివాసుడని రకరకాలుగా వెంకన్నను దర్శిస్తున్నారు. ఈ విషయమే కింది సామెతలో మనం చూడొచ్చు.

**'దర్శనంబులారు దైవంబు ఒక్కటే'**

అలాగే జానపదులు వెంకన్నను గోవిందుని గానే భావిస్తుంటారు. గోవును సేవిస్తే గోవిందుని సేవించినట్లుగానే తలపోస్తారు.

**'గోసేవయే గోవిందసేవ'**

**'పచ్చికంకులే దాసరీ అంటే రాలిన కాడికే గోవిందా అన్నట్లు'**

ఇలా జానపదులు అనేక సామెతల్లో వెంకన్నను ప్రస్తావించారు.

**పొడుపు కథల్లో వెంకన్న :-** జానపదులు వినోదం కోసం, విజ్ఞానం కోసం పొడుపు కథల్ని అల్లుకొని ఆనందించేవారు. పొడుపు కథను ఒకరు పొడుస్తారు. దాన్ని ఇంకొకరు విడుస్తారు. పూర్వం రాజులను పొడుపుకథల ద్వారా ఎన్నుకొనే వారని జాతకకథల ద్వారా తెలుస్తోంది. పందాలు ఒడ్డి పల్లెల్లో నేటికీ పొడుపుకథలను ఆడుతారు. కాబట్టి కోలారు ప్రాంతంలో వీటికి ఒడ్డు కథలనే పేరు కూడా వుంది. జానపద సాహిత్యంలో ప్రజ్ఞాపాటవాలకు పొడుపు కథలు నిదర్శనగా నిలుస్తాయి. ఇలాంటి పొడుపు కథల్లో కూడా వేంకటేశ్వరస్వామి చోటు చేసుకొని ఉండడం ఎంతో గమనార్హం. వేంకటేశ్వరస్వామి ప్రస్తావనలు కలిగిన కొన్ని పొడుపు కథలను పరిశీలించండి.

"వెంకటేశ్వరునికి బీగాలు వేసేవారే గాని తీసేవారు లేరు"
(ముగ్గులు)
"వేంకటేశ్వరుని భోగాలు, వేసేవారే గాని తీసేవారు లేరు"
(సున్నం, ఎర్రమట్టి పట్టీలు)

"వెంకప్ప ఇంకా రాలేదు" (కప్ప దాగినపదం)

"శ్రీ విష్ణు మోయుచు జలగేడు పక్షి" (గరుడపక్షి)

జానపద సాహిత్యం ఛందోబద్ధమైన కవితకంటే ప్రాచీనమైంది. నన్నయకు పూర్వమే శాసనాలలో మాత్ర గణాలతో కూడిన దేశీయ పద్యాలు కనిపిస్తున్నాయి. క్రమంగా మార్గ వృత్తాలు రంగప్రవేశం చేశాయి. అలా పొడుపు కథల్లో కూడా వైవిధ్యం ఉండేటట్లు చందోబద్ధమైన పద్యాలు కొన్ని ప్రచారంలోకి వచ్చాయి. కొన్ని పొడుపు పద్యాలలో 'దీని భావమేమి తిరుమలేశ' అని ఏడుకొండల వాణ్ణి ప్రశ్నించినట్లు ప్రశ్నిస్తారు, గమనించండి.

**"వేయి కన్నులు గలిగి వెలయనింద్రుడు గాడు**
**కాళ్ళు నాల్గు గలిగి కాదు పశువు**
**నరుడు పట్టుకున్న నడువగా జాలదు**
**దీని భావమేమి తిరుమలేశ? (మంచం)**

**"కాళ్ళు రెండు గలవు గాని మానిసిగాడు**
**నోమగల్గి యెదుటి వారి నఱచు**
**గాలిమేసి లెస్సగా నరుమోయును**
**దీని భావమేమి తిరుమలేశ" (సైకిలు)**

**నడిమి మాత్రలు జూచిన నలరునట్టి**
**తిరుమలేశుండు నెప్పుడు స్థిరముతోడ**
**మనల కరుణా విధేయుడై మనుచు చుండు"**
**(తిర్మల వేంకట్రమణ)**

పై విధంగా పొడుపు కథల్లో తిరుమలేశుడు చోటు చేసుకొని ఉన్నాడు.

ఇలా జానపద సాహిత్యంలో వేంకటేశ్వరుడు ఎంతో వైభవంతో అలరారుతూ జానపదుల హృదయాలనే కాకుండా అందరి మనసుల్ని రంజింపచేస్తూ ఏడేడు కొండల్నే కాకుండా ఏడేడు లోకాల్ని ఏలుతున్నాడు

# శ్రీవేంకటేశ్వర వైభవం - జానపదుల దృష్టి

*తమటం రామచంద్రారెడ్డి*

తిరుమల జగద్విఖ్యాత పుణ్యక్షేత్రం. ప్రపంచం నలుమూలల నుంచి భక్తులు ఇక్కడికి వచ్చి మొక్కుబడులు చెల్లించి తాము తరించినట్లు భావిస్తారు. ప్రాంతీయ భేదంకానీ భాషాభేదం కానీ వీరిలో కన్పించదు. ఇలా వీరందరినీ ఒకటిగా కలిపే మహాశక్తిమంతుడు క్షేత్రాధీశ్వరుడు శ్రీవేంకటేశ్వరుడు.

శ్రీవేంకటేశ్వరుడు వైకుంఠాన్నుంచి ఈ కొండ మీదకు వచ్చి నివాసం ఏర్పరచుకున్నాడని ప్రజల విశ్వాసం. ఈ క్షేత్రానికి సంబంధించిన వృత్తాంతాలు, వరహ, భవిష్య పురాణాలలో చోటు చేసుకున్నాయి ఇది ఈ క్షేత్ర ప్రశస్తికి నిదర్శనం.

ఈ క్షేత్రం మీద పలు భారతీయ భాషల్లోను విస్తృత సాహిత్యం వచ్చింది. ఎన్నో ప్రమాణాలతో శిష్టులు సాహిత్యాన్ని వెలయిస్తే, హృదయ ప్రమాణంతోనే జానపదులు తమగేయ సాహిత్యానికి ఊపిరులూదుతారు. శ్రీవేంకటేశ్వరునికి సంబంధించిన తమ ఆలోచనలను గేయ రూపంగా జానపదులు ఆవిష్కరించిన తీరు ఎంతో రమ్యం. వేంకటేశ్వరవైభవం పట్ల జానపదులు ఏర్పరచుకున్న దృష్టిని రేఖామాత్రంగా ఆవిష్కరించడమే ఈవ్యాస పరమావధి.

శిష్టులు భయభక్తులతో స్వామిని సేవించాలనుకుని దూరంగా ఉంచేస్తారు. జానపదులు ఆ దేవదేవుణ్ణి కూడా మానవీకరించి తమ గుండెల్లో ప్రతిష్ఠించుకుంటారు. ఈ ప్రాతిపదిక మీదనే వేంకటేశ్వరుని పుట్టుకను గురించి కూడా జానపదులు ఆలోచించారు.

పడమటి దేశాల్లో 'మచ్చుల బందారీ' దేశం వుంది. దీన్ని శేషాచలం పాలించేవాడు. అతని భార్య పేరూరమ్మ. వారికి ఏడుగురు పిల్లలు. వారు వరుసగా పెద ఓబిలన్న, చిన ఓబిలన్న, మద్దిలేటన్న, పెంచల నరసిమ్మా, కదిరి నరిసమ్మా, గోయిందరాజు, శ్రీ ఎంకటేశు. వేంకటేశుడు కందినమంత నల్లగా పుట్టాడని జానపదులు భావించారు.

చివరి సంతానానికి తెలివితేటలు ఎక్కువని జానపదుల విశ్వాసం. వేంకటేశుని మేధావిలాసాన్ని విశ్వానికి విదితం చేసేందుకే ఆయన్ను కడగొట్టు బిడ్డగా పుట్టించారేమో.

వేంకటేశ్వరుడి ఆకారాన్ని ఆయన కట్టూ బొట్టూ వగైరాలను జానపదులు ఎంతో అపురూపంగా తమ గేయాల్లో పేర్కొన్నారు.

వేంకటేశ్వరునిది ఇంతకు ముందే చెప్పుకున్నట్టు నల్లని ఆకారం. నాలిక మీద నక్షత్రం, భుజాన భూచక్రం వీపున వింజామరలు, అరచేతిలో తామర పత్రం కలిగిన దేవుడీయన. కలికి కుచ్చుల కంబడి ధరిస్తాడు తిరుమణి బొట్టు పెడతాడు. ఊతకర్ర చేతబడతాడు. పట్టు సవకం భుజాన వేస్తాడు. కెంపులు [illegible]

పోగులు, వేళ్ళకు ముద్రాంగుళీయకాలు ధరిస్తాడు. పాదాలకు పావుకోళ్ళు తొడుగుతాడు. మొల్లో దట్టీ ఉంటుంది. పచ్చలు తాపిన పతకాలు, వజ్రాలు తాపిన వస్త్రాలు ధరిస్తాడు.

ఈ వర్ణన జానపద కథల్లో వచ్చే మేల్తరానికి చెందిన వ్యక్తిని తలపింపజేస్తుంది. ఇలాంటి వ్యక్తి ఇలాంటివే ధరించాలని జానపదుల ఉద్దేశం కాబోలు. అందుకే శ్రీమన్నారాయణుణ్ణి మానవ మాత్రుడుగా చేసి ఇంత వైభవాన్ని ఆయనకు సమకూర్చి పెట్టారు.

ఈ క్రింది గేయంలో కోటిసూర్యప్రకాశంతో కూడిన కిరీటాన్ని వేంకటేశ్వరుడు తన తలమీద ధరించినట్టు చెప్పబడింది.

కోటి సూర్యప్రకాస మిచ్చిన కిరీట మొక్కటి శిరీసుపైన ..

అన్నమయ్య వేంకటేశ్వరుని చేత ఇడ్డెనలు, సుగెనప్పాలు వంటి ఆహార పదార్థాలను ఆరగింపజేస్తే జానపద గేయకారుడు తాను స్వీకరించే ఆహారాన్ని స్వామికి కూడా నివేదించాడు. శ్రీవారికి అలివేలు మంగ దొగ్గలాకు, ఉలవ పప్పులు కూర చేసి, ఆరెక బియ్యంతో అన్నంచేసి వడ్డిస్తుంది.

తిన్నని ముగ్ధ భక్తే ఈ జానపదుల్లోనూ కన్పిస్తుంది. స్వామిపట్లవారు ప్రదర్శించిన ఆత్మీయత అవగతం అవుతుంది.

వేంకటేశుని మహిమ అనంతం. వైవిధ్య భరితం. వర్ణనాతీతం. తను ఆశ్రయించిన వారి తాపాలను బాపి ఆపదలను అంతం చేసి కాపాడే కరుణామయుడాయన. వికలాంగుల అంగవైకల్యాన్ని పోగొట్టి ఆదుకునే ధర్మయుడాయన. ఈ విషయాన్నే శ్రీశ్రీనివాసులురెడ్డిగారు సేకరించిన గేయం ఆవిష్కరిస్తుంది.

**"గుడ్డివారిని కుంటి వారినీ కొండకు నడిపితివా**
**ఆ కొండకు నడిపి వరముల నొసగీ ఇంటికి నడిపితివా**
**మాస్వామీ దిగిరారా పై దేవా వినరావా**
**కాళ్ళు చేతులు లేని వారికి కరున చూపితివా**
**ఆ కరుణ చూపి వరముల నొసగి ఇంటికి నడిపితివా .....**

స్వామి గొప్పతనం ఇక్కడ ఆవిష్కరించబడింది. శ్రీవారి శరణాగత రక్షణాదీక్ష ఈ గేయంలో వెల్లడైంది. వేంకటరమణుడు సంకట హరణుడు పిలిస్తే పలికేదైవం. అతన్ని స్మరించినంత మాత్రంలోనే అన్ని బాధలు పటాపంచలు అయిపోతాయి. ఈ జానపద విశ్వాసాన్ని ఆవిష్కరించే గేయం గమనించండి.

**"తిరుపతి పోతానె పలుకుతాడు ఓ రామ**
**కుప్పల యాతనలన్నీ కూలగొట్టు ఓ రామ ...."**

తిరుపతి వెళ్లగానే కష్టాలన్నీ తీరిపోతాయని ప్రజల విశ్వాసం. అంతటి మహానుభావుడాయనని అభిప్రాయం.

వేంకటేశ్వరుడు సహృదయుడై బ్రోచే వాడనీ యుద్ధంలో రాక్షసులను గెలిచిన వాడనీ, చిగురుల వంటి పాదాలు, తామర పువ్వువంటి ముఖం గలవాడనీ, ఇరువైపుల స్త్రీలు అలరించగా వారిచ్చే తాంబూలాన్ని సేవిస్తూ హేమాద్రీశ్వరుడు సాటిలేని వాడిగా వెలుగొందుతున్నాడని జానపదులు వెంకన్నను భక్తితో కీర్తించారు.

"సదయుడై బ్రోచె మనలను
వీడు కదనమునను గెల్చే ఘనరాక్షసులను
పదములు చిగురుల తీరు
వీని వదనము విరించి వనజము గేరు
తరణు లిరుగెడలయందు తనరు
నిల్వగోరుపతిగేల. నడిమి మేఘమె తనరు
నిరుపమంబగు శుభ్రవీటి
సామిసురుచిర హేమాద్రీశ్వరునితో సాటి"

ఈ గేయంలో కూడా వేంకటేశ్వర వైభవం వెల్లడవుతుంది. దుష్ట శిక్షణకు శిష్టరక్షణకు ఆయన పెట్టింది పేరు. ఇరువైపుల ఇల్లాండ్రు విడెమందిస్తుంటే వేసుకుంటూ పరవశించే ఆయన వయ్యారం కూడా వైభవ చిహ్నమే.

వేంకటేశ్వర వైభవాన్ని వేయి శిరసులున్న ఆదిశేషుడు కూడా విపులంగా వర్ణించలేడు. అలాంటప్పుడది సామాన్యులకు సాధ్యమా! జానపదులకు వీలుపడుతుందా! వారి భక్తి శక్తి అపారం కాబట్టి వారు ఈ విధంగా వర్ణించగలిగారు.

ఈ చిన్న వ్యాసంలో వేంకటేశ్వరుడు జానపదుల దృష్టిలో ఎలా ఉన్నాడో వివరించే ఒక ప్రయత్నం జరిగింది.

# శ్రీవేంకటేశ్వర నామ వైభవం

ఎన్. నాగేంద్రసాయి

## వేంకటేశ్వర అవతార పరమార్థము

కలికాలంలో దైవభక్తి, పాపభీతి నశిస్తాయి. అధర్మము ధర్మములాగా ధర్మము అధర్మములాగా చెలామణి అవుతుంటాయని, క్షణికమైన ఇంద్రియ సుఖాలు ధ్యేయంగా జీవిస్తారని, మానవ జీవిత పరమార్థము, అంతిమ లక్ష్యం అయిన నిత్యానందం, సచ్చిదానందం విస్మరిస్తారని ఈ విధంగా అధోగతి పాలవుతారని సప్తమహర్షులు గ్రహించినారు.

ఈ సమయసందర్భంలో, దుష్టశిక్షణ, శిష్టరక్షణ, ధర్మసంస్థాపనలకు, సమర్థుడు ఎవరు అని తర్కించుకొని, సమర్థుడు శ్రీమహావిష్ణువేనని సప్తమహర్షులు నిర్ధారించినారు.

నైమిశారణ్యంలో, గంగానది తీరంలో ఒక మహాయజ్ఞాన్ని నిర్వహించినారు. యజ్ఞఫలాన్ని స్వీకరించటానికి ఎవరు అర్హులన్న ప్రశ్న తలెత్తగాశ్రీమహావిష్ణువే అని భృగు మహర్షి తేల్చిచెప్పినారు. అందరు ఆమోదించగా, ఆహ్వానించగా ఈ యజ్ఞ ఫలాన్ని స్వీకరించి శ్రీమహావిష్ణువు వైఖానస మహర్షి శిష్యుడు, అత్రిమహర్షి ప్రధాన అర్చకుడిగా, బ్రహ్మ ఋత్విజుడుగా, తిరుమల క్షేత్రం మీద వరాహస్వామి వారి అనుమతితో, పుష్కరిణి సమీపంలో ఆనందనిలయం విమానంలో, అర్చావతారమూర్తియై, శిలా విగ్రహ రూపంలో సాక్షాత్కరించినారు. ఒక సాలగ్రామ శిల ద్వారా స్వయంభువుగా వెలసిన శ్రీవేంకటేశ్వరుణ్ణి భక్తులు శ్రీనివాసుడని, సప్తగిరీశుడని, బాలాజీ అని ప్రీతిగా పిలుస్తున్నారు.

కలియుగారంభంలో- అనగా ఇంచుమించు అయిదువేల సంవత్సరాల క్రిందట వెలసిన శ్రీవేంకటేశ్వరునికి, తొండమాన్ చక్రవర్తి ఆలయం నిర్మించినాడు. అప్పటినుండి నిత్యోత్సవ, వారోత్సవ, పక్షోత్సవ, మాసోత్సవ, సంవత్సరోత్సవాది ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఆకాశరాజు, తొండమాన్, సాళువ నరసింహ రాయలు, శ్రీకృష్ణదేవరాయలు, అచ్యుతరాయలు తిరుమలరాయలు, అనువారి నేతృత్వంలో శ్రీవేంకటేశ్వరుడు శోభాయమానంగా వర్ధిల్లినాడు, విరాజిల్లుతున్నాడు.

**"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తికించన**
**వేంకటేశ సమోదేవో నభూతో నభవిష్యతి".**

## వేంకటేశ్వర నామవైభవము

| | | |
|---|---|---|
| వేం | = | పాపములను |
| కట | = | హరించు |

ఈశ్వరుడు = జగత్ప్రభువు

వేంకటేశ్వరుడు = పాపములను హరించు జగత్ప్రభువు

కాబట్టి 'ఓం నమో వేంకటేశాయ' నామస్మరణ చేస్తే, సన్మార్గంలో నడిపిస్తాడు సద్బుద్ధిని ప్రసాదిస్తాడు. సద్గతులను అనుగ్రహిస్తాడు.

**శ్రీనివాస నామము - వైశిష్ట్యము**

వేంకటేశ్వరుని హృదయవాసిని శ్రీలక్ష్మి. అందువల్లనే ఆయనకు 'శ్రీనివాసుడ'నే పేరు. శ్రీవారి దివ్య మంగళ విగ్రహంలో విశాలమైన వక్షఃస్థలం మీద 'శ్రీవత్స'మనే ముద్ర ఉన్నది. దానిపై చందనం, మిశ్రమాన్ని అద్ది లక్ష్మీముద్రగా భక్తులు పూజలో ఉంచుకుంటారు. లక్ష్మీదేవికి రెండు రూపాలు. ఒకటి పరారూపం. అది పట్టమహిషీ రూపం. మరొకటి అపరారూపం. అది భూసంపద. ఆమే భూదేవి. స్వామి ఎంత భోగమూర్తియో, అంతయోగమూర్తి.

జగన్మాత, జగన్నాధునిలో వాత్సల్యమును ప్రేరేపించి, పాపులమైన మనల్ని ఆగ్రహమునకు గురికాకుండా, అనుగ్రహానికి పాత్రులను చేస్తున్నది. అందువలన 'శ్రీనివాస' నామస్మరణ శ్రేయస్కరమైనది.

**విష్ణు సహస్రనామ స్తోత్ర వైభవం**

వేంకటేశ్వరునికి వెయ్యి నామాలు ఉన్నాయి. వీటిని 'విష్ణుసహస్రనామములు' అందుము. విష్ణు సహస్రనామము వైభవోపేతము కావటానికి ఈక్రింది మూడు లక్షణములు ఉండటమే కారణము.

1. వస్తు వైభవం (Greatness of the subject-matter)
2. శ్రోతృ వైభవం (Greatness of the listener)
3. వక్తృ వైభవం (Greatness of the speaker)

**1. వస్తు వైభవం**

ధర్మ, అర్థ, కామ, మోక్షములు అనే నాలుగు పురుషార్థములను సాధించటానికి అత్యుత్తమ పారాయణ యోగ్యమైనది. వర్ణ వివక్ష లేదు. బ్రాహ్మణులు దీనిని పారాయణం చేసి జ్ఞానమును, వైశ్యులు వ్యాపార వృద్ధి, క్షత్రియులు విజయాలు, శూద్రులు సుఖాలను బడయవచ్చును. పిరికివాడు ధైర్యాన్ని, స్థైర్యాన్ని, రోగి ఆరోగ్యాన్ని, బలాన్ని, తేజాన్ని పొందవచ్చును. నిద్రలేమి ఉన్నవారు నిశ్చింతగా, ప్రశాంతంగా, నిర్భయంగా నిద్రపోవచ్చును.

**"సంకీర్త్య నారాయణ శబ్దమాత్రం**
**విముక్త దుఃఖాః సుఖినోభవన్తి"**

**౨. వక్తృ వైభవం**

చెప్పినది, 'ధర్మాచరణ'లో నిష్ఠాగరిష్ఠుడైన భీష్ముడు.

**౩. శ్రోతృ వైభవం**

విన్నది. ధర్మస్వరూపుడు, ధర్మస్వభావుడైన ధర్మరాజు. విన్నది మరొకరు కూడ. విని, అమోదించినది ధర్మసంస్థాపకుడైన శ్రీకృష్ణుడు.

**మరొక వస్తు వైభవం**

'విష్ణు సహస్రనామం' మహాభారతంలో భాగం. మహాభారతం కధ వలె నడుస్తుంది. కాని అది కథగాదు. దానినిండా ధర్మము, సత్యము గురించి మీమాంసయే. అందువల్లనే 'మహాభారతాన్ని' పంచమవేదం అందుము. ఈ వేదాన్ని భీష్మునికి బోధించినది, వ్యాసరూపంలో విష్ణువే. వ్యాసాయ విష్ణురూపాయ.

**శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర వైభవం**

**మహాభారత సారత్వాత్ ఋషిభి: పరిగానత:**
**వేదాచార్య సమాహారాత్ భీష్మోత్కృమతత్త్వత:**
**పరిగ్రహోతిశయతో గీతాద్యైకార్థ్యతశ్చ వ:**
**సహస్రనామ్నామధ్యాయ: ఉపాదేయతమో మకత:**

మహాభారత సారమగుటవలనను, ఋషి పుంగవులచే ప్రీతితో వాడబడిన నామములగుట వలనను, వాటినుండి తీసి వ్యాసమహర్షిచే స్తోత్రరూపముగా కూర్చబడుటవలనను, భీష్మపితామహునిచే దీని పఠనము తన కత్యంతభిమత ధర్మముగా పరిగణింపబడుటవల్లను; సమస్త ప్రామాణికులచేతను సకల గ్రంథముల చేతను శ్రద్ధాభక్తి పురస్సరముగా పరిగ్రహింపబడుట వలననూ; భగవద్గీతాది బహు గ్రంథార్థములతో నేకీభవించు నర్థముల బోధించుటవలనను; మనకీ సహస్రనామస్తోత్ర పఠనమత్యావశ్యకమని నిర్ణయింపబడెను.

**" గౌణాని విఖ్యాతాని ఋషిభి: పరిగీతాని"**

ఈ వేయి మంత్రాలు ఎక్కడివో తెలుసా? నేను కల్పించలేదు. "గౌణాని విఖ్యాతాని ఋషిభి: పరిగీతాని" ఋషులచే గానము చేయబడినవి. శ్రీమన్నారాయణుని గుణముల ననుభవించిన ఋషులు, ఆ అనుభవసారంగ ఒక్కొక్కరు ఒక్కొక్క నామాన్ని కీర్తించి ఆనందించారు. అక్కడక్కడగల ఆ ఋషుల వాగమృతం కలిసి పరీవాహమై లోకములో మనం కూడా పాడగలిగేటట్లు శ్రీవ్యాసభగవానుడు సేకరించి కృప

చేయగా నేను దర్శించాను. నీవడిగావు గనుక సర్వజీవులు ఉజ్జీవించడానికని చెప్పుచున్నాను. విను అని భీష్ముడు ఉపదేశిస్తాడు.

**సహస్రనామాలు - సులభమార్గాలు**

ధర్మం, అధర్మం తెలుసుకొనుటకు ప్రామాణికాలు వేదాలు. కాని అవి నేర్చుకొనుట కష్టం. భగవద్గీతలో 700 శ్లోకాలు ఆచరణలో పెట్టడం కష్టం. భారతంలోని లక్ష శ్లోకాలు నేర్చుకొనటం కష్టం. వీటన్నింటి సారభూత మైన విష్ణుసహస్రనామస్తోత్ర పారాయణము సులభము.

**విష్ణుసహస్రనామం - మృత్యుంజయ మంత్రం**

భీష్ముడు నిత్యం విష్ణుసహస్రనామ స్తోత్ర పారాయణముతో రెండు శక్తులను గడించాడు. ఒకటి- మరణం తాను కోరుకున్నపుడు లభిస్తుంది. మృత్యుంజయత్వం.

**విష్ణువు విధేయుడు**

భీష్ముడు గడించిన మరొకశక్తి, తాను తలచుకున్నప్పుడు భగవానుడు సేవకునివలె తనముందు ప్రత్యక్షం కావాలి.

**శ్రీవిష్ణు సహస్రనామం - మహామంత్రం**

శ్రీవిష్ణు సహస్రనామస్తోత్రం మన స్తోత్రసాహిత్యానికి మణికిరీటం వంటిది. ఇందులోని ఒక్కొక్కమాట ఒక మంత్రం! స్మరించినంత మాత్రాన సకల జీవులను తరింపజేసే మహామహిమతో విలసిల్లుతూ వుంది. ఇందువల్లనే ఈ స్తోత్రం పవిత్రాలకు పవిత్రమైనదిగా, మంగళములకు మంగళమైనదిగా, ధర్మాలన్నిటికీ ఉత్తమ ధర్మంగా జపాలన్నింటిలోకి ఉత్కృష్టమైన జపంగా ప్రశంసించబడింది.

# దాసరి కథ - వైష్ణవతత్త్వం

డా॥ ఓ. దామోదరనాయుడు

(భగవంతుని వైభవాన్ని, గానం చేసి దానిని సర్వోన్నత కైంకర్యంగా భావించినవాడు దాసరి. గాన కైంకర్యం తరువాత యీ శరీరం వున్నా, పోయినా బాధలేదు. విష్ణువుకు సమానదైవం ఇలలో లేడు. శ్రీవేంకటేశ్వరుడు కూడా విష్ణుడే. అందుకే ఆయన వైభవానికి యిది సమన్వయంగా భావించవచ్చు.)

శ్రీవరాహస్వామి భూదేవికి దాసరి కథలో కైశికీగాన మాహాత్మ్యాన్ని వినిపించాడు. ఆ గాన మాహాత్మ్యంతో తాను తరించాలని భూదేవి గోదాదేవిగా అవతరించింది. అలా అవతరించిన గోదాదేవి శ్రీకృష్ణునిపై అనురాగంతో మన్మథావస్థకు లోనవుతుంది. తన కూతురు ఉన్మాదావస్థలో ఉందని విష్ణుచిత్తుడు వటపత్రశాయికి విన్నవిస్తాడు. అపుడు విష్ణుచిత్తునికి భూదేవి గోదాదేవిగా అవతరించడానికి కారణమైన దాసరి కథను వినిపిస్తాడు. ఈ కథ వరాహపురాణోత్తర ఖండంలో 66వ సర్గలో కైశికీ మాహాత్మ్యం పేరుతో వుంది. దీనిని గ్రహించి శ్రీకృష్ణదేవరాయలు ఆముక్తమాల్యదలో ఉపాఖ్యానంగా వివరించారు. ఈ ఉపాఖ్యానానికీ ప్రధానకథకు చక్కని సంబంధాన్ని కల్పించారు.

'తిరుకుఱుంగుడి' 108 దివ్య తిరుపతులలో ఒకటి. దీనికే సిద్ధాశ్రమము, వైష్ణవవామనమనే పేర్లున్నాయి. ఇది నేటి తమిళదేశంలోని తిరునల్వేలికి దగ్గరలో వుంది. అక్కడికి మూడు యోజనాల దూరంలోని ఒక కుగ్రామంలో పంచముడొకడు పరమభక్తుడుండేవాడు. అతడు అనునిత్యం వేకువనే భగవత్సాన్నిధ్యాన్నికేగి భగవత్కళ్యాణగుణ ప్రతిపాదితమైన దివ్యప్రబంధాల్ని గానంచేసేవాడు ఇలా పది సంవత్సరాలు జరిగింది. ఒకనాడు ఒకపిల్లి భయానికి అరచిన కోడిశబ్దాన్ని విని తెల్లవారు జామున కోడికూత అని భ్రమించి చీకటిలోనే గుడికి ప్రయాణమౌతాడు. చీకటిలో దారితప్పి అరణ్యప్రదేశాన్ని చేరుతాడు. అక్కడ ఒక వటవృక్షం వద్ద బ్రహ్మ రాక్షసుడు కంటపడతాడు. ఆ బ్రహ్మరాక్షసుడు ఈ దాసరిని ఆహారంగా గ్రహించాలనుకుంటే తనమేన శక్తి యున్నంతవరకు పోరాడుతాడు. చివరకు రాక్షసుని జయించడం సాధ్యంకాదని తెలిసి రాక్షసునితో- భగవత్సాన్నిధ్యానికి పోయి మంగళకైశికి గానం చేసి తిరిగివచ్చి నీకు ఆహారంగా ఉపయోగపడుతానని చెపుతాడు. రాక్షసుడు దాసరి మాటలు విశ్వసించడు. అపుడు దాసరి "నేను పోయి తిరిగిరానిచో శ్రీమహావిష్ణువును అన్యదేవతలతో సమానంగా చూసేవాడుపొందే దుర్గతిని పొందుతానని" బాసాడతాడు. అంత రాక్షసుడు ఆతని మాటలు విశ్వసిస్తాడు. వెళ్ళిన దాసరి మంగళకైశికి గానంతో స్వామిని సేవించి తిరిగి వస్తాడు. దాసరి సత్యనిష్ఠకు ఆశ్చర్యపడిన రాక్షసుడు దాసరిని ఆహారంగా గ్రహించక చివరిరోజు అతడు గానం చేసిన మంగళకైశికి గాన ఫలితాన్ని ఆశిస్తాడు. దానితో శాపగ్రస్తుడై రాక్షసుడుగా మారిన సోమశర్మ తన పూర్వరూపాన్ని పొందుతాడు. ఇది స్థూలంగా ఆముక్తమాల్యదలో దాసరి కథ.

శ్రీకృష్ణదేవరాయలు దాసరికథ ప్రారంభంలో దాసరిని ప్రవేశపెడుతూ ఆతనిని "కలడొకరుండు పేరుకొనఁ

గానికులంబు మదీయ భక్తుడిల" అని పరిచయం చేసినాడు. 'పేరుకొనగానికులం' అంటే నోటితో పలుకరాని జాతి అనగా పంచమకులం వాడు అని లౌకికార్థం. అంతమాత్రం కాదు. ఈ ప్రయోగంలో అంతరార్థాన్ని గ్రహించాలి. వ్యాసమహర్షి భారతములో శ్రీకృష్ణుడు కౌరవుల వద్దకు రాయబారం వెళ్ళి, వారు ఆహ్వానించినా వారి గృహాలకు విందుకు వెళ్ళక విదురుని యింటికి వెళతాడు. కోపగించుకొనిన దుర్యోధనుడు శ్రీకృష్ణుని శూద్రుని యింట ఎలా విందారగించినావని నిందిస్తాడు. అపుడు శ్రీకృష్ణుడు

"నశూద్రాః భగవద్భాక్తాః విప్రాః భాగవతాస్స్మృతాః,
సర్వవర్ణేషు తే శూద్రాః ఏహి అభక్తాః జనార్దనే"

అని వివరిస్తాడు. అంటే భగవద్భక్తులు శూద్రులుకారు. వారిని విప్రులని, భాగవతులనియే గ్రహించాలి. ఏ కులంలో జన్మించినా విష్ణుభక్తి లేనివారు శూద్రులే అని భావం. అట్లే నమ్మాళ్వారుల పాశురం గూడ ఇక్కడ గుర్తింపదగివుంది.

"కులన్తాజ్గశాదిగళ్ నాళిలుమ్ కీళిళెన్దు ఎత్తనై
నలన్దానిలాద శణ్డాళ చణ్డాశర్ గళాగిలుమ్
వలన్దాజ్గ శక్కరత్తణ్ణళ్‌మిణి వణ్ణాళ్కాళెన్దు ఉళ్
కలన్దార్ అడియార్ తమ్ అడియా రెమ్మడిగళే"

అనగా భగవత్ స్వరూప యథార్థజ్ఞానం కలవారికి జన్మతః వచ్చిన కులం నశించిపోయి భక్తులకులం సంభవిస్తుంది. శ్రీమహావిష్ణువు భక్తుడైతే చండాలుడైనా పూజ్యుడవుతాడని భావం.

పై రెండు అంశాలు పరిశీలనలో ఉంచుకొని రాయలవారి మాటను విశ్లేషించ వలసివుంది. ఈ దృష్టితో ఆలోచిస్తే భగవద్భక్తుడు, తత్త్వజ్ఞాని అయిన దాసరిని కులం పేరుతో పిలవడం భగవదప చారమౌతుంది. జన్మ నిరూపణ పాపహేతువైన భాగవతాపచారం. నిజమైన భగవద్భక్తునికి జననకులం నశించి భక్తుల కులంవస్తుంది. కాబట్టి అతనిని భాగవతుడనియె పిలవాలి. అయితే ఇక్కడ మరోప్రశ్న ఉదయిస్తుంది. తరువాత కథలో దాసరిని గూర్చి ప్రస్తావించు సందర్భంలో కులప్రసక్తి రాయలు చెప్పినాడు గదా! అనేది ప్రశ్న. కథ పరమార్థం భక్తికి కులంతో సంబంధం లేదని నిరూపణ చేయడమయినపుడు లౌకికంగా అతని కులాన్ని గూర్చి చెప్పక తప్పదు. పాత్ర ప్రవేశ సందర్భంలో లౌకికార్థంగా పంచముడని, అంతరార్థంగా భాగవతుడని పాఠకులకు స్ఫురింప జేయడానికే రాయలు "పేరుకొనగాని కులం" అని ప్రయోగించినాడని భావించవచ్చు.

దాసరి పాత్ర ప్రవేశానంతరం అతని ప్రవృత్తిని గూర్చి

"జాత్యుచిత చరిత్ర మ
త్ప్రీ త్యర్థం బూఁది తనదు హృదయము శుచితా
నిత్యంబుగఁ దత్తను సాం
గత్యము మసిపాత మానికంబై యొదుఁగన్"

అని శ్రీకృష్ణదేవరాయలు ప్రస్తావించాడు- కులోచిత జీవితం భగవంతుని ప్రీతికోసం పాటిస్తూ, తన హృదయాన్ని నిష్కలుషితంగా చేసికొని ఆ శరీరంలో 'మసిగుడ్డలో మాణిక్యమున్నట్లు' ఒదిగి వున్నాడని భావం. భక్తుడైన వానికి జాత్యనుగుణ కర్మఉండాలా? వద్దా అనే విషయం మీద కర్మసన్యాసాన్ని అద్వైతం ఉపదేశిస్తుంది. కర్మ సహితమత జీవితాన్ని తెలియజేస్తుంది విశిష్టాద్వైతం. శ్రీకృష్ణదేవరాయలు విశిష్టాద్వైతి అందుకే "కులోచిత జీవితం భగవంతుని ప్రీతికోసం ఆచరిస్తూ" అనే మాటను అన్నాడు.

స్వధర్మాచరణ శ్రేష్టమైనది. పరధర్మాన్ని చక్కగా ఆచరించడానికన్న స్వధర్మంలో మరణించడం శ్రేష్టం ఈ ధర్మాన్ని తెలిసిన దాసరి తన స్వధర్మాన్ని భగవత్ప్రీతి కోసం ఆచరిస్తూనే తన భక్తి గాన మాధుర్యంతో భగవంతుని ధ్యానిస్తున్నాడు. రాయలు దాసరి దేహాన్ని మసిగుడ్డతోను ఆతని హృదయాన్ని మాణిక్యంతోను పోల్చాడు. భక్తికి కులంతో సంబంధం లేనట్లుగానే దేహ స్వభావంతోగూడ సంబంధంలేదని భావం. మసిగుడ్డలో వున్నంత మాత్రాన మాణిక్యానికి విలువ తగ్గదు. అట్లే భక్తుడైనవాడు ఏ శరీరాన్ని ధరించినా అతనికి విలువ తగ్గదని అంతరార్థం.

దాసరి రాక్షసునితో అన్నమాట ఒకటి పరిశీలింపదగివుంది. అది - "రాత్రిచర, వేగిర మేటికి? నిన్ జయింతురే యనిమిషులైన". రాత్రులలో సంచరించు వాడా నిన్ను దేవతలు కూడ జయింపలేరు. నేనెంతవాడను అని సామాన్యార్థం. ఇందులో అంతరార్థం ఒకటుంది. రాత్రి అనగా చీకటి. చీకటి అజ్ఞానానికి ప్రతీక. అనగా అజ్ఞానంతో సంచరించు జీవితం గలవాడా! అని భావం. రాక్షసుల్ని జయించేవారు అనిమిషులు. అనిమిషులు అంటే సామాన్యార్థం దేవతలు. అంతేగాక రెప్పపాటులేనివారు దేవతలు అనే అర్థంతోపాటు, రెప్పపాటు కాలం కూడ భగవద్భక్తిని విడనాడని వారని భావాన్ని గ్రహిస్తే అజ్ఞాన వంతుడైన వానిని జయించి జ్ఞానవంతునిగా మార్చేవాళ్ళు భగవద్భక్తులని అంతరార్థం. ఈ కథలో అజ్ఞాని యైన రాక్షసుణ్ణి జ్ఞానవంతుడుగా మార్చిందికూడ భగవద్భక్తుడైన దాసరి. ఈ విధంగా పరిశీలిస్తే దాసరి కథలోని అనేక పదప్రయోగాలు ఎన్నో అంతరార్థాల్ని కలిగి వుండడం గమనింపవచ్చు.

## దాసరి కథ - హితోపదేశం

బ్రహ్మరాక్షసునితో పోరాడి అలసిపోయినపుడు, తిరిగి తనమాట నిలబెట్టు కోవడానికి బ్రహ్మరాక్షసునికి ఆహారం కావడానికి వచ్చినపుడు దాసరి బ్రహ్మరాక్షసునితో జరిపిన సంభాషణలలో ఎంతో హితోపదేశం

గుర్తింప దగివుంది. బ్రహ్మరాక్షసునితో పెనగి అలసిపోయిన దాసరి ఆ రాక్షసునితో ఇలా అంటాడు.- "పెనగక ప్రాణ రక్షణ ముపేక్ష యొనర్చుట పాప, మిందుకై కనలకు, నాకు మేనియెడఁ గాంక్షయులే, దిదివోవుటే యురున్" ప్రాణ రక్షణ విషయంలో ఉపేక్ష వహించడం పాపం. కాబట్టి పోరాడినానే తప్ప నిన్నుజయించలేనని నాకు తెలుసు. అంతేగాక నాకు శరీరం మీద కోరిక లేదు. ఈ మాటల్లో దాసరియొక్క పరిపక్వత చెందిన మానసికస్థాయి కనబడుతుంది. శరీరం ఏదో ఒక కారణంతో నశించి పోతుంది. అట్టి శరీరం ఒక ప్రాణిసంతోషానికి కారణమైతే ఆ శరీరం గల జీవికి ముక్తి లభిస్తుంది. అంటే జీవునికి దేహం నుండి విముక్తి పరలోకముక్తి సంభవిస్తుంది.

దాసరి బ్రహ్మరాక్షసునికి యింకా ఈ విధంగా చెప్పాడు. మనం జీవులం- ఆహార, నిద్ర, భయ, మైథునం మొదలైనవి జీవధర్మాలు. వ్యాఘ్ర, సింహ, వరాహాదిక్రూర జంతువులు యుక్తాయుక్త జ్ఞానంలేని తిర్యక్కులు. కాని ఓ రాక్షసా! నీవు విజ్ఞానవంతుడవు. అట్టి నీకు జగుప్సను కలిగించేది నిందాకరమైన ఈ నరమాంస భక్షణాపేక్షఎందుకు? వధ్యావధ్యం, పథ్యాపథ్యం, భక్ష్యాభక్ష్యం, పేయాపేయమను విచక్షణ లేని జన్మఎందుకు? ఈ దాసరి ఉపదేశం గమనింపదగివుంది. ధర్మహాని కలిగించేవారు, భగవద్భాగవతాచార్య విషయంలో అవరోధం చేసేవారు వధార్హులు. బ్రాహ్మణాదులు, భగవద్భాగవత సంబంధులు వధార్హులు కారు. అట్లే పరిశుద్ధ ఆహార స్వీకరణ వలన మనస్సు పరిశుద్ధమవుతుంది. పరిశుద్ధ మనస్సు వలన జ్ఞానం కలుగుతుంది. అట్టి జ్ఞానం వలన మోక్షం లభిస్తుంది. కాబట్టి మనిషి మోక్షసాధనకు ఆహారం చాలాముఖ్యమైనది. ఎవడు ఆహార నియతిని పాటించడో వాడు వివేకాన్ని కోల్పోతాడు. దుష్టపదార్థాలను స్వీకరించక పోవడమే ఆహారనియతి. ఆహారనియతి లేనివాడు మహాపాపమగు హింసను చేస్తాడు. హింసకు ఫలితం పరలోకమందు అనుభవించక తప్పదు. పరలోకం మరణా నంతరం ప్రాప్తిస్తుంది. చిరకాల జీవులకు పరలోకభయమెందుకని భావించరాదు. ఎందుకంటె కలకాలం జీవించు వారు లేరు. ముందు వెనుకలుగ ప్రతిఒక్కరు ఏదో ఒకనాడు పరలోకాన్ని చేరక తప్పదు. పాప పుణ్యాల ఫలితాన్ని అనుభవించక తప్పదు. ఇంతటి సుదీర్ఘ ఉపన్యాసం రాక్షసుణ్ణి మార్చలేకపోయింది. కాని తాను చెప్పిన మాటకు కట్టుబడి తిరిగి తనకు ఆహారంగా తన శరీరాన్ని సమర్పింప వచ్చిన దాసరి సత్యనిష్ఠ రాక్షసునిలో మార్పును తెచ్చింది. అందుకే రాక్షసుడు దాసరి అనుగ్రహాన్ని పొందాలని ఆరాటపడుతాడు. "నీవంటి భాగవతులు మమ్మల్ని పవిత్రులను చేయకపోతే మాకు వేరుగతిలేదని" దాసరిని ప్రార్థిస్తాడు. అపుడు దాసరి నీకు కావలసినది ఏమి? అని ప్రశ్నిస్తాడు. అందుకు రాక్షసుడు నీ దేహం నాకు వద్దు గాన ఫలితాన్ని యిమ్మని ప్రార్థిస్తాడు. అపుడు దాసరి ఎన్ని జన్మలైన లభించవచ్చు. అందు భాగవత జన్మలభించడం చాల కష్టం. అట్టి భాగవతుడు శరీరాన్ని త్యాగం చేయడానికి వెనుకాడడు, కాని భక్తి ఫలితాన్ని మాత్రం యివ్వలేడు. కాబట్టి నేను గానఫలాన్ని యివ్వనని తేల్చి చెపుతాడు. చిట్టచివరికి చివరిరోజు గానఫలాన్ని యివ్వడానికి అంగీకరిస్తాడు. అంత మాత్రంతోనే రాక్షసుడు పునీతుడు కాగలిగినాడు.

**దాసరి కథ శ్రీవైష్ణవం**

స్వామి విష్ణుచిత్తునితో దాసరిని గూర్చి చెపుతూ "జాత్యుచిత చరిత్రను మత్ప్రీత్యర్థంబూది" అని అంటారు. అంటే స్వామి సంతోషం కోసం తన జాతి ధర్మాన్ని ఆచరిస్తున్నాడని భావం. ప్రాణిచేయు ఏ కర్మమైనా భగవత్ప్రీతికై భగవదాజ్ఞా పూర్వకంగా- చేస్తున్నామనే భావించాలి అనేది శ్రీవైష్ణవ సంప్రదాయం. అందుకే శ్రీవైష్ణవులు సంకల్పమందు"శ్రీభగవదాజ్ఞాయా భగవత్ప్రీత్యర్థం, భగవదాజ్ఞాకైంకర్యం" అని ప్రతీది భగవదాజ్ఞ గానే భావిస్తారు. దాసరి శ్రీవైష్ణవుడు. అందుకే అతను లౌకిక, వ్యవహారాలు గూడ ఆ దేవుని ప్రీత్యర్థమే నిర్వహిస్తాడు. బ్రహ్మరాక్షసుడు దాసరిని పట్టి బంధించి మాంసాదులను భక్షిస్తానని చెప్పినపుడు రాక్షసునితో "దైన్యవిరహితముగ, ధర్మమెఱిగించు సూక్తి నాతండు పలికె". భగవదనుగ్రహప్రాప్తికి విరోధియైన ఈ పాంచభౌతిక శరీరం నశిస్తుందని తెలిసిన దాసరి దైన్యాన్ని పొందలేదు. అందుకే తనను చంప తలపెట్టిన రాక్షసునికి ధర్మం తెలియజేయ పూనుకొనినాడే గాని శరీర నాశనానికి చింతించలేదు. రాక్షసుడు తాను చేయు అకృత్యాన్ని సమర్థించుకుంటూ గరుత్మంతుని విష్ణుసఖునిగ పేర్కొని అతడు పాములను ఆహారంగా కోరినపుడు, నేను నిన్ను భక్షించుటలో దోషం లేదని దాసరితో వాదిస్తాడు.

స్వామికి గురుత్మంతుడు దాసుడు, సఖుడు, వాహనం, ఆసనం, ధ్వజం, చాందిని, వ్యజనంగా ఉపయోగపడతాడని భావం. వైష్ణవ సంప్రదాయం ప్రకారం స్వామి నిత్యవిభూతిలో ఎపుడూ గరుత్మంతుడు స్వామిని అంటిపెట్టుకునే వుంటాడు. శాపవశాత్తు రాక్షసుడైన యితడు స్వామి నిత్యవిభూతిలోని గరుత్మంతుని గూర్చి అనుకోకుండా ప్రస్తావించాడు. ఇది ఒకరకంగా వైరి భక్తి. దాసరి రాక్షసునితో తనను మిత్రుడగ భావించి, కురుంగుడి నంబి సేవకై విడిచిపెట్టమని, తాను తిరిగి వచ్చి ఆహారంగా ఉపయోగపడతానని చెపుతాడు. రాక్షసుడు నమ్మడు. అతనిని నమ్మించడానికి దాసరి ఈ విధంగా ప్రమాణం చేస్తాడు.

> **"ఎవ్వని చూడ్కిఁజేసి జనియించు జగంబు వసించు నిజ్జగం**
> **బెవ్వని యందు డిందు మఱి యెవ్వని యందిది, యట్టి విష్ణుతో**
> **నివ్వల నొక్క వేల్పు గణియించిన పాతకి నొందు నేడవే**
> **నెవ్విధినైన నిగ్గదియవేని యనన్విని బంధ మూడ్చవన్"**

నేను మాటతప్పి తిరిగి రానిచో ఇతర దేవతలను విష్ణువుతో సమానంగా భావించేవారు పొందే రౌరవాది నరకాలను పొందుతానని దాసరి అంటారు. వైష్ణవంలో ద్వైవిధ్యం లేదు. ఉన్నది శ్రీవైష్ణవం ఒక్కటే. అది బాగా తెలిసినవారు దాసరి. ఆ దాసరి వద్ద అలాపలికించిన శ్రీకృష్ణదేవరాయలు, దాసరిని రాక్షసుడు చివరిరోజు పాడిన గాన ఫలాన్ని అర్థిస్తాడు. ఆ దాన ఫలంతో తనకు పూర్వరూపాన్ని ప్రసాదించమని ప్రార్థిస్తాడు. అపుడు దాసరి "ఏను ఫలం బెఱుంగ, ఫలంబు పరమేశ ముఖోల్లాసంబు, యాజ్ఞాకైంకర్యంబులకు ననుమతి

కైంకర్యంబులకు ఫలపరిమాణ గణన ప్రపన్నుల కెక్కడియది కాన బంధకంబగుట ఫలం బింతంత యందు గొంతగొమ్మన వెఱతు భగవంతుండ రక్షించు నూఱడిల్లుము" అని అంటాడు. ఇది శ్రీవైష్ణవమున అత్యంత ఆదరణీయమైన అంశం. ఫలంనొసంగు వాడు శ్రీమన్నారాయణుడు మాత్రమే. భక్తుడాచరించు ప్రతి పనికి ఫలం పరమేశ్వరుని ముఖోల్లాసం. కాబట్టి పరమేశ్వర ముఖోల్లాసానికై జేయు కైంకర్యమే నిజమైన కైంకర్యం.

## దాసరికథ - ప్రయోజనం

దాసరి కథ ద్వారా రాయలు భగవద్భక్తి వైశిష్ట్యాన్ని లోకానికి చాటినాడు. భగవన్నామ సంకీర్తన ఫలమహిమ ఎంతగొప్పదో సవివరంగా వివరించాడు. భగవద్భక్తులకు అసాధ్యమైనది ఏది లేదని నిరూపించాడు. ఇంకను దాసరికథలో అంతర్భాగమైన సోమశర్మ (బ్రహ్మరాక్షసి) వృత్తాంతం ద్వారా ఎవరైన దుష్కృత్యాలాచరిస్తే తగిన ఫలితాన్ని అనుభవించక తప్పదని తెలియజేసాడు. ఈలాంటి విషయాలతోపాటు వైష్ణవ సంప్రదాయంలోని వైశిష్ట్యాలను విశదీకరించాడు. విశిష్టాద్వైత సంప్రదాయాన్ని ఉపదేశించాడు. శ్రీమన్నారాయణుడే పరదైవమని ప్రతిపాదించాడు. జీవుని స్వరూపం దాసత్వమే అని శరీరం ఆత్మకంటే భిన్నమైందని తెలియజేసాడు. భగవత్ప్రాప్తికి శరణాగతియే ఉత్తమమార్గమని విశదీకరించాడు. శ్రీకృష్ణదేవరాయలు యిన్ని ప్రయోజనాలతో ఆముక్తమాల్యదలో దాసరి కథను వినిర్మించి ధన్యుడైనాడు. గాన కైంకర్యంతో దాసరి, దాసరి భిక్షతో బ్రహ్మరాక్షసుడు, వారికథ చెప్పుటచే శ్రీకృష్ణదేవరాయలు తరించినారు. కాబట్టి ఆ కథను చదివిన పాఠకులు వినిన శ్రోతలు తప్పక తరిస్తారనడంలో సందేహమేమీలేదు.

# శ్రీవేంకటేశ్వర వైభవము

*దూబగుంట రామకృష్ణ*

**అడుగడుగు దండాలవాడు, ఆపదే మొక్కులవాడు**
**ఆశ్రితాభీష్టవరప్రదుడు కలియుగప్రత్యక్షదేవుడు**
**తిరుమలక్షేత్రంలో కొలువుదీరిన శ్రీవేంకటేశ్వరుడు**
**పద్మావతీప్రాణనాథుడైన సప్తగిరీశుడు**

ఈనాడు ప్రపంచ వ్యాప్తముగా వేంకటాద్రియనియు తిరుమల అనియు సుప్రసిద్ధమై వేదములయందు, ఉపనిషత్తులందు, పురాణములలోను, అనేకవిధముల పేరెన్నికగలదైనది శేషాచలము. ఆ ప్రభువుయొక్క కరుణాకటాక్షమున జగత్తులన్నీ నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్నాయి. ఆయన వైభవం కమనీయం, కవనీయం. అభిషేక అర్చన, తోమాలాది సేవలతో, నిరంతరం కర్పూర నీరాజనాలతో, వజ్రమణి మాణిక్య నవరత్నఖచిత ఆభరణాలతో రోజుకొక్క ఆలంకారంతో భాసిల్లే ఆ రమారమణునికి కైమోడ్పులు.

ఆ స్వామి దివ్యావతార వైభవములను గురించి శ్రుతులు, స్మృతులు, పురాణాలు ఎన్నోవిధాలుగా అభివర్ణిస్తున్నాయి. వేంకటాద్రితో సమానమైన స్థానము, ఆ వైభోగము బ్రహ్మాండములోనే లేదని, వేంకటేశునితో సమానమైన దైవము ఇంతరకు లేదని ఇకముందు ఉండబోదని అర్థం తెలుపు లోకప్రసిద్ధశ్లోకం.

**వేంకటాద్రి సమంస్థానం బ్రహ్మాండే నాస్తి కించన ।**
**వేంకటేశ సమోదేవో నభూతో న భవిష్యతి ॥**

ఒకప్పుడు శ్రీనివాసుని దర్శించుటకు వేంకటాచలమునకు బ్రహ్మదేవుడు సపరివారముగా విచ్చేసెను. ఆయన వేంకటేశ్వరుని సేవచేస్తూ కొంతకాలము అక్కడనే ఉండిపోయెను. తదుపరి శ్రీనివాసుని అనుమతిపొంది బ్రహ్మ వేంకటాచలమున వైభోత్సవములు తలపెట్టెను.

కన్యా మాసమున ధ్వజారోహణమొనర్చి, దిగంతముల నుండి దేవతలను, సముద్రవాసులను, అంగ, వంగ, కళింగ కాశ్మీర దేశాధీశులను ఆహ్వానించి, మహోత్సవముగా చాలా విశిష్టముగా నిర్వహించెను. శ్రీవేంకటేశ్వరుని సన్నిధికిపోవు మార్గమంతయు అలంకరింపబడినది. గోవిందనామ స్మరణలతో భక్తులు విచ్చేయు చుండిరి. మార్గమధ్యమున పానీయశాలలు, అన్నగృహములు ఏర్పాటుచేయబడినవి. శ్రీవేంకటేశ్వరుని దర్శనార్థము విచ్చేయు భక్తులెల్లరు భక్తిపరవశులై భగవన్నామ స్మరణమొనర్చుచు నృత్యము చేయుచు, గానము సల్పుచూ మైమరచి పోయిరి.

బ్రహ్మశాసనము అనుసరించి శ్రీవేంకటాచలమున అన్న శాలలను, నివాసభవనములను, వేంకటాచలము నకు చుట్టుప్రక్కల మనోహరములైన పురములును, పురములందు అనేకపుణ్యవీథులను, ఆ వీథులలో ముక్తా

విద్రుమరాశులను ఏర్పాటుచేసెను. భగవత్సేవకొరకు అరుదెంచు భక్తులందరుకును అన్న, వస్త్ర, పానీయాదులను, ఎందరో ధార్మికులు ఒసంగిరి. గంధర్వ అప్సర గణములు, భేరిమృదంగాది వాద్యములు మ్రోగగా సంగీతము నిర్వహించిరి.

ఆ ఉత్సవ దినములందు గుడాన్న, పాయసాన్న, ముద్గాన్న, తిలాన్న, శాల్యన్న, కలపురాన్న, మరీచ్యన్న మధురాన్నములను వివిధ ఫలములను మనోహరములగు వ్యంజనములను భగవంతునకు నివేదించిరి.

ఉత్సవ సమయమున శ్రీదేవి, భూదేవి వెంటరాగా వేంకటేశ్వరుడు సమస్త వాద్యఘోషలతో చిత్రధ్వజపతాకములు, చామరములు నృత్యగీత వాద్యములు నారీగణములు, కవులు, గాయకులు, వేదపండితులు వెంటరాగా అశ్వ, గజ, అనంత, గరుడులపై అధిష్టించి రాచవీథులందు ఊరేగింపుగా వెడలెను. ప్రతిదినము వైఖానసాగమునననుసరించి యాగశాలలో హోమము, బలిహరణము, మొదలగు వైదిక క్రియలన్నియు సక్రమముగా జరిగెను. అనేకదేశములనుండి విచ్చేసిన మహారాజులు హర్మ్యములను నిర్మించి శ్రీవేంకటేశ్వరుని సేవ కొరకు విప్రులను వైశ్యులను నియమించిరి.

శ్రీవేంకటేశ్వరునకు నానారత్న విరాజితము, స్వర్ణమయము, ఉచ్చధ్వజశోభితము ముక్తామాల్యవిరాజితము హైమవస్త్రాకలితము సిద్ధగంధర్వసేవితము అగు దివ్యరథము సిద్ధము చేయబడినది. వివిధ దేవతలు కీర్తింప వేంకటేశ్వరుడు తన భార్యలైన శ్రీదేవి, భూదేవులతో మాడావీధులలో విహరించెను.

బ్రహ్మ దీప ద్వయమును వెలిగించి కలియుగమున్నంతవరకు ఈ దీపములు వృద్ధిచెందుగాక! అని గోవిందుని ప్రార్థించెను. అందుకు శ్రీనివాసుడు ఎప్పుడు ఈ విమానము పడిపోవునో, ఎప్పుడు దీపము ఆరిపోవునో నా అవతారము అపుడు ముగిసిపోవునని బదులుచెప్పెను. ఈ విధముగా భవిష్యోత్తర పురాణము శ్రీనివాసుని అవతారమునకు ఉత్తరావధిని పేర్కొనుచున్నది. స్వామిచే అనుగ్రహింపబడి బ్రహ్మ ఉత్సవములు చేసెను గనక ఇవి బ్రహ్మోత్సవములని ప్రసిద్ధిపొందినవి.

ధ్వజారోహణము మొదలు రథోత్సవములువరకు రోజుకొక వాహనము చొప్పున ఊరేగింపులతో వేదశాస్త్ర పండితులతో, అనేక నైవేద్యములతో ఉత్సవములు జరిపింపమని శ్రీనివాసుడాన తిచ్చెను. అంతట బ్రహ్మ తొండమానుని చూచి చిత్ర విచిత్ర వాహనములు విశ్వకర్మతో చేయించమని ఆజ్ఞాపించెను. విశ్వకర్మ శ్రీనివాసునకు తృప్తికలుగునట్లు వాటినన్నింటిని క్షణకాలములో నిర్మించి ఇచ్చెను.

ధ్వజారోహణము జరిగిన మొదటి దినమున చలువ ఛత్రము, రాత్రికి శేషవాహనము, రెండవ దినమున పగలు చిన్నశేషవాహనము, రాత్రి హంసవాహనము, మూడవ దినమున పగలు సింహవాహనము, రాత్రి ముత్యపుపందిరి వాహనము నాలుగవదినమున పగలు కల్పవృక్షవాహనము, రాత్రికి సర్వభూపాలవాహనము, ఐదవ దినము పగలు పల్లకి అందుస్వామికి మోహినీ అవతారము, రాత్రికి గరుడవాహనము, ఆరవ దినము

పగలు హనుమంతవాహనము, రాత్రి గజవాహనము, ఏడవదినము పగలు సూర్యప్రభవాహనము, రాత్రి చంద్రప్రభ వాహనము. ఎనిమిదివ దినము, పగలు, రథము రాత్రికి ఉచ్చైఃశ్రవము అను అశ్వవాహనము తొమ్మిదివ దినమున మొదటిది పల్లకి రెండవది మంగళగిరి వాహనముగా స్వామికి ఏర్పాటుచేయబడెను.

దీక్షాన్త స్నానమాచరించు సమయమున మంగళగిరి వాహనముపై స్వామిమందిర ప్రదక్షణమొనర్చి పుష్కరిణీతీర్థమున, తన జన్మ నక్షత్రమగు శ్రవణా నక్షత్రమున అవభృథస్నానమాచరించెను. ఆ రాత్రికి ధ్వజావరోహణము, మరురోజు పుష్పయాగమహోత్సవము జరిగెను. దేవతలు, బ్రహ్మ శ్రీనివాసునిసేవించి తమ నివాసములకు పోయిరి. తొండమానుడు శ్రీనివాసుని నుండి సెలవు తీసుకొని తన నగరమునకు వెళ్ళెను.

శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవము 'నభూతో న భవిష్యతి'గా బ్రహ్మదేవుడు నిర్వహించినాడు.

ఇదంతా మనకళ్ళకు కన్పించే ఇహలోకవైభవం. పామరులైన తన భక్తులను ఆనందింపచేయు పరమ లౌకిక వైభవం. ఒక పిలుపుతో పిలిస్తే పలికే వైభవం. ఏడుకొండలూ ఏనుగు ఎక్కినంత ఆనందంగా ఎక్కించే వైభవం. అభయహస్తంతో ఆపన్నులను ఆదుకునే వైభవం. కోటిపాపాలను చేసినా పశ్చాత్తాపంతో పరితపించే వారికి పరబ్రహ్మప్రసాదించే వైభవం. పాషాణులను అమృతమయులుగా మార్చే వైభవం. ఇది ఆయన వైభవం.

# శ్రీవేంకటేశ్వర సంస్కృత కవితా వైభవము -
# శ్రీవేంకటేశ్వర కావ్యకలాపము

డా॥ గుళ్ళపల్లి శ్రీరామకృష్ణమూర్తి

విశ్వసాహిత్యంలో సంస్కృత సాహిత్యం అతి ప్రాచీనమయినది. సంస్కృతం దేవతల భాష అనీ, అది అనాది సిద్ధంగా ఉందనీ భారతీయుల విశ్వాసం. ఋగ్వేదం దేవతాస్తోత్రాత్మకం అని అంటారు. ఋక్ అంటే స్తోత్రం అని అర్థం. ఋగ్వేదం నుంచీ నేటివరకూ దేవతాస్తోత్రాలన్నీ సంస్కృతంలోనే వ్రాశారు. లౌకిక వాఙ్మయంలో మొదటి స్తోత్రకావ్యం 'శివమహిమ్నస్తోత్రం' అని అంటారు. అప్పటి నుంచి సంస్కృత కవులు సంస్కృత భాషలో వారివారి ప్రియ మయిన దేవతలను స్తుతిస్తూ స్తోత్రాలను వ్రాశారు. వాటిల్లో కృష్ణకర్ణామృతం, జయదేవ అష్టపదులూ, నారాయణ తీర్థులతరంగాలు, యమునాచార్యుల ఆళ్వందార్‌స్తోత్రం, ఆనందవర్ధనుని దేవీశతకం, రామానుజాచార్యులగద్యత్రయమ్, శ్రీవత్సాంకుని పంచస్తవమ్, శ్రీపారాశరభట్టు శ్రీరంగరాజస్తవమ్, శ్రీగుణ రత్నకోశమ్, వేంకటాధ్వరి లక్ష్మీసహస్రం, వేదాంత దేశికుల దయా శతకమ్, పాదుకాసహస్రమ్, శ్రీశివరామానంద తీర్థుల హరిభక్తి సుధార్ణవమ్, జగన్నాథపండితుని సుధాలహరి, గంగాలహరీ, కరుణాలహరీ, లక్ష్మీలహరీ, అమృతలహరీ, చాలాప్రచారంలోకి వచ్చాయి. ఈ స్తోత్రసాహిత్యంలో సంప్రదాయం ప్రసిద్ధక్షేత్రాలూ ఇష్టదైవ ప్రార్థనలూ, ఇష్టదేవతా పూజావిధానం, దైవకథలూ చోటుచేసుకున్నాయి. ఈ స్తోత్రాలువ్రాయడం, చదవడం వలన అమంగళ నాశనం కలిగి మంగళాలు సిద్ధిస్తాయి అని సంస్కృత సాహితీకుల అభిప్రాయం. కావ్యం వల్ల భగవంతుని స్తవాదుల వలనా, ధర్మాచరణం సంభవిస్తుందని విశ్వనాథుడు అంటాడు. ఈ స్తవాదులనే నిష్కామంగా పఠిస్తే రాగద్వేషాలు నశించి మోక్షప్రాప్తి కలుగుతుందని అభిజ్ఞులు అంటారు. మమ్మటుడు ఆదిత్యుని స్తవం వలన మయూరాదులకు అమంగళం తొలగిందని ఉట్టంకిస్తాడు.

వేంకటేశునితో సమానమైన దైవం నభూతో న భవిష్యతి అనికదా నానుడి. కలియుగ దైవమయిన వేంకటేశుని స్తోత్రసాహిత్యం కూడా అనాదిగా వస్తూందని మనస్తోత్రసాహిత్యం పరికిస్తే తేటతెల్లమవుతుంది. వైదిక సాహిత్యంలో

-సప్తప్రాణాః భవన్తి తస్మాత్ సప్తార్చిషః సమిధః సప్తహోమాః ।

-యేలోకాః చరన్తి ప్రాణాః గుహాశయా నిహితాః సప్తసప్త ॥

-అరాయికాణే వికటేగిరిం గచ్ఛ సదాన్వే

-శిరిం భిఠస్య సత్వభిః తే భిష్వా చాలయామసి ॥

-రయిః కకుద్మాన్ విదధద్విసష్టమ్‌రయి మద్విధానమ్ ।

తస్మైకకుద్రేవికటాయ పిత్రే స్వాహా- ఇవన్నీ వేంకటేశుని వైదిక స్తోత్రసాహిత్యానికి నిదర్శనాలు.

పౌరాణికసాహిత్యంలో శ్రీనివాసస్తోత్రాలు ఎన్నో కనిపిస్తాయి. వరాహపురాణం, వామన పురాణం,పద్మ పురాణం, ఆదిత్యపురాణం, మార్కండేయ పురాణం, బ్రహ్మవైవర్త పురాణం, స్కాందపురాణాలలో వేంకటేశ స్తోత్రాలు అనేకం కనిపిస్తాయి. ఈ పురాణాలలో వేంకటేశ్వర సహస్రనామావళి ప్రసిద్ధమయినది. వీటిల్లో కొన్ని నామాలు ఆ యా పురాణాలలో ఉన్నాయి. ఆగ్నేయ పురాణంలో వేంకటాచలం మాహాత్మ్యంలో వేంకటేశ దివ్యకవచస్తోత్రం మనకు ఉపలబ్ధమవుతుంది.

సంస్కృత కవులు కూడ వేంకటేశ్వర స్తోత్రకావ్యాలు ఎన్నో రచించారు. ఆస్తోత్రకావ్యాలలో సుప్రభాతం, స్తోత్రం, ప్రపత్తి, మంగళాశాసనమ్, గద్యకావ్యాలు, చంపూకావ్యాలు, తూణకమ్, ధ్యానమ్, నామావళి ప్రధాన మయినవి. ఈ స్తోత్రాలన్నింటినీ ఒక సంగ్రహరూపంగా గ్రథితమయిన గ్రంథమే శ్రీవేంకటేశ్వర కావ్యకలాపమ్. ఈ గ్రంథం డి.టి తాతాచార్యులవారు శ్రీవేంకటేశ్వర ప్రాచ్యశోధ సంస్థానమ్ నుంచి ప్రప్రథమంగా ముద్రించారు. శ్రీవేంకటేశ్వర ఓరియంటల్ సిరీస్‌లో ఇది ప్రప్రథమ కుసుమం. తి.తి.దే. ముద్రణాలయంలో ఇది ముద్రింప బడింది. ఈగ్రంథంలో మూడు ప్రధానాంశాలు ఉన్నాయి. మొదటి భాగంలో-

శ్రీవేంకటేశ్వర సుప్రభాతమ్, శ్రీవేంకటేశ్వరస్తోత్రమ్, శ్రీవేంకటేశ్వరప్రపత్తి, శ్రీవేంకటేశ మంగళాశాసనమ్ అనే నాలుగు స్తోత్రాలు సంగ్రహింపబడ్డాయి. రెండవభాగంలో 34 స్తోత్రాలు ఉన్నాయి. మూడవభాగంలో శ్రీశఠకోపగాథాదశకద్వయమ్, శ్రీరంగరామానుజముని కృత సంస్కృతవ్యాఖ్యానంతో సహా ముద్రితమయినది.

ఈ పరిశోధనా నిబంధం (వ్యాసం) వేంకటేశ సంస్కృత సాహితీవైభవాన్ని పురస్కరించుకొని వ్రాయబడింది. కాబట్టి వేంకటేశ్వర కావ్యకలాపాన్ని సంగ్రహంగా తెలుసుకోవడం కోసం క్రిందపట్టిక పొందుపరచబడింది. ఈ పట్టికలో మొదటి నాలుగూ శ్రీవాది భయంకరాచార్యులవారు, ఘనగురువూ వ్రాశారు. ఇవి ప్రాతఃకాల పఠనీయాలు.

ప్రథమభాగం

| స్తోత్రకావ్యంపేరు | కవి | శ్లోకసంఖ్య | ఛందోవిశేషాలు |
|---|---|---|---|
| 1. సుప్రభాతమ్ | శ్రీవాది భయంకర మహాగురువు | 29 | 2. అనుష్టుప్‌లు<br>27. వసంతతిలకలు |
| 2. శ్రీ వేంకటేశ్వరస్తోత్రం | శ్రీవాది భయంకర మహాగురువు | 11 | అనుష్టుప్, తోటకం |
| 3. శ్రీవేంకటేశ ప్రపత్తి | శ్రీవాది భయంకర మహాగురువు | 16 | శార్దూలం<br>వసంతతిలక |
| 4. మంగళాశాసనం | శ్రీవాది భయంకర మహాగురువు | 14 | అనుష్టుప్. |

| | | | |
|---|---|---|---|
| 5. శ్లోకత్రయీ (ప్రాతస్మరణ శ్లోకాలు) | ఘనగురువు | 4 | అనుష్టుప్ వసంతతిలకమ్ |

ఈ స్తోత్రాలు ప్రతిరోజు శ్రీవారి సుప్రభాత కైంకర్యంలో పఠింపబడుతున్నాయి.

"కౌసల్యా సుప్రజా రామా" అనే మేలుకొలుపులేని గ్రామం గాని, గృహంగాని కనిపించదు అంటే అతిశయోక్తికాదు. ఈ సాహిత్యానికి మంచి ప్రచారం వచ్చింది. ఈ స్తోత్రాన్ని అనుకరిస్తూ ఎన్నోస్తోత్రాలు వెలువడ్డాయి. మల్లిఖార్జున సుప్రభాతమ్, సత్యనారాయణ సుప్రభాతమ్ లాంటివి ఉల్లేఖనీయాలు. ప్రసాద గుణంతో సుగమంగా ఈ సుప్రభాత రచన సాగుతుంది. ప్రకృతి వర్ణనం సుప్రభాతసేవాభోగాలు, స్వామి అద్వితీయ గుణగానం ఈ స్తోత్రంలో కనిపిస్తాయి.

శ్రీవేంకటేశునిస్తోత్రంలో కమలాక్షుని శృంగార విలాసాలు మనోహరంగా వర్ణిస్తాడు కవి. చిన్నకావ్యాలయి నప్పటికీ భక్తి భావం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సంప్రదాయ బద్ధంగా ప్రపత్తి మంగళాశాసనం కవితావైభవంతో కూడ విలసిల్లుతుంది.

ఈ స్తోత్రానికినాంది, స్ఫూర్తి శ్రీమద్రామాయణం. అందుకే రామాయణస్థ శ్లోకాలు 2 మొదటిగా తీసుకున్నాడు కవి. వసంత తిలకంలో వ్రాసిన ఈ సాహిత్యానికి మూలం, కాళిదాసు అజుని వందిమాగధుల మేలుకొలుపు. (రఘు వంశం. 5వ సర్గ)

ద్వితీయ భాగంలో ఉన్నస్తోత్రాలు యిలా విభజించవచ్చు.

1. నామావళిస్తోత్రాలు. 2. స్తోత్రాలు, 3. అర్చాస్తోత్రాలు, 4. శతకసాహిత్యం-ప్రకీర్ణసాహిత్యం.

| నామావళీ స్తోత్రాలు | కవి | శ్లోకసంఖ్య | ఛందో విశేషాలు |
|---|---|---|---|
| 1. లక్ష్మీస్తోత్రం | వాదిభయకర గురువు | 79 | విభిన్నఛందస్సులు |
| 2. పద్మావతీనవరత్న మాలికాస్తుతి | శ్రీ శేషశర్మకవి | 10 | స్రగ్ధర, ఉపజాతి, |
| 3. పద్మావతీస్తోత్రం | ఉత్తుమూరి వీరరాఘవాచార్యులు | 31 | అనుష్టుప్ |
| 4. పద్మావతీపరిణయతారావళి | శ్రీశేషశర్మ | 33 | ఆర్యా, మందాక్రాంత శార్దూలవిక్రీడితాలు |

**శ్రీవేంకటేశస్తోత్రాలు**

| స్తోత్రకావ్యంపేరు | కవి | శ్లోకసంఖ్య | ఛందో విశేషాలు |
|---|---|---|---|
| 1. శ్రీవేంకటేశస్తోత్రం | వరదదేశికులు | 22 | శార్దూలవిక్రీడితం |
| 2. శ్రీవేంకటేశస్తోత్రం | వాదిభీకరాచార్య వేంకటేశకవి | 8 | మాత్రా ఛందస్సు |

| | | | |
|---|---|---|---|
| 3. శ్రీ వెంకటేశస్తోత్రం | ఉత్తుమూరి వీరరాఘవాచార్యులు | 271 | విభిన్నఛందస్సు |
| 4. శ్రీనివాసస్తోత్రం | అజ్ఞాతకవి | 25 | ఉపజాతి |
| 5. శ్రీవేంకటేశ నవమాలికాస్తుతి | శ్రీ శేషశర్మ | 10 | స్రగ్ధర, ఉపజాతి |
| 6. అంజనాశైలనాథస్తోత్రం | శ్రీవాది భీతికరాచార్యులు | 13 | మాలిని |
| 7. వృషాద్రినాథ స్తోత్రం | తిరువందాళ్వారవంశ రఘునాథాచార్యులు | 66 | శార్దూలం, శాలిని |
| 8. ఉజ్జ్వల వేంకటనాథస్తోత్రం | శ్రీరంగాచార్యులు | 11 | స్రగ్ధర |
| | | | శరభవృత్తం ఇది అపూర్వ వృత్తం |
| 9. శ్రీవేంకటేశ విజయార్యాస్తోత్రం | వాదిభీకరాచార్యులు | 9 | ఆర్యా |
| 10. శ్రీ వేంకటేశ పంచకస్తోత్రం | అజ్ఞాతకవి | 5 | పంచచామరం |
| 11. బుద్ధిస్తవమ్ | అజ్ఞాతకవి | 16 | అనుష్టుప్ |
| 12. శ్రీ వేంకటేశ విజయీస్తోత్రం | వాదిసాధ్వసకవి | 14 | మాత్రాఛందస్సు |
| 13. శ్రీ వేంకటేశ కవచస్తోత్రం | ఆగ్నేయపురాణం | 13 | అనుష్టుప్ |
| 14. శ్రీవేంకటేశ తూణకము | అజ్ఞాతకవి | 5 | తూణక ఛందస్సు |

## అర్చాధ్యానసేవాక్రమసాహిత్యం

| స్తోత్రకావ్యంపేరు | కవి | శ్లోకసంఖ్య | ఛందో విశేషాలు |
|---|---|---|---|
| 1. శ్రీవేంకటేశ సేవాక్రమము | శఠారి | 122 | అనుష్టుప్ |
| 2. శ్రీనివాసార్చాదశకమ్ | నావల్పాక్కం శ్రీరాజగోపాల తాతాచార్యులు | 12 | ఆర్యా |
| 3. వేదవ్యాస ధ్యానం | వేదవ్యాసుడు | 3 | వసంత తిలకం-శార్దూలం |
| 4. వేంకటేశ నిధ్యానం | అజ్ఞాతకవి | 8 | శార్దూలం, అనుష్టుప్ |

## గద్యసాహితి

| స్తోత్రకావ్యంపేరు | కవి | శ్లోకసంఖ్య | విశేషాలు |
|---|---|---|---|
| 1. శ్రీనివాసగద్యం | అజ్ఞాతకవి | 1 | |
| 2. పద్మావతీ గద్యం | శ్రీరంగసూరి | 1 | |
| 3. శ్రీనివాస గద్యం | శ్రీరంగసూరి | 1 | |

ప్రకీర్ణసాహిత్యం

| | స్తోత్రకావ్యంపేరు | కవి | శ్లోకసంఖ్య | విశేషాలు |
|---|---|---|---|---|
| 1. | ఫణీంద్రక్ష్మా భృత్స్తోత్రం | వాది ప్రవర భయకృత దేశికులు | 10 | మందాక్రాంత |
| 2. | దయాశతకము | శ్రీమద్వేదాంతదేశికులు | 108 | విభిన్నఛందస్సులు |
| 3. | శ్రవణానందము | ఆత్రేయ శ్రీవేంకటాధ్వరి | 184 | విభిన్న ఛందస్సులు |
| 4. | శ్రీనివాసగుణాకరం | శ్రీవాది భీకర శ్రీవరదులు | 190 | వ్యాఖ్యానం వి.ఛందస్సులు |

ఈ గ్రంథాలు నితాంతప్రౌఢాలు వ్యాఖ్యానసాపేక్షాలు. దయాశతకానికి ఎన్నో వ్యాఖ్యానాలు అనువాదాలు వచ్చాయి. శ్రవణానందానికి శ్రీశైల తాతాచార్యులవారు వ్యాఖ్యానం చేశారు. శ్రవణానందం 2శతకాలుగా విభజింప బడింది. మొదటి శతకంలో 100 శ్లోకాలు, రెండవ శతకంలో 84 శ్లోకాలు ఉన్నాయి. ఈ శ్రవణానందం. ఆత్రేయ వేంకటాధ్వరి రచించారు. వీరు విశ్వగుణాదర్శచంపూకర్త కంటె భిన్నులు. శ్రీనివాసగుణాకరం వాది భీకర శ్రీవరదాచార్యులు రచించారు. దీనికి శ్రీశైల తాతాచార్యులు విస్తృతమైన వ్యాఖ్యానం చేశారు.

ఇక కావ్యసౌందర్యం పరిశీలిద్దాం.

ఈ కావ్యాలలో వేంకటేశ సుప్రభాతం, ప్రపత్తుల విషయంలో ఉన్న సౌందర్యం, గాన మాధుర్యం అందరికీ తెలిసిందే. ఘనగురువు రచించిన శ్లోకత్రయీ- భగవత్స్మరణం, భజన, నమస్కారాలు, మూడు శ్లోకాలలో పొందుపరుస్తూ శ్రీ స్వామి సర్వాదిగసౌందర్యాన్ని సహజంగా వర్ణిస్తాడు కవి.

**ప్రాతర్భజామి కరరమ్య సశంఖచక్రం**
**భక్తాభయప్రద కటిస్థలదత్తపాణిమ్ ।**
**శ్రీవత్సకౌస్తుభ లసన్మణిభూషణోద్యత్-**
**పీతాంబరం మదనకోటి సుమోహనాంగమ్** **(శ్లో.త్ర.2)**

(నాలుగు చేతులతో శంఖుచక్ర అభయ ముద్రలనుచూపిస్తూ ఒకచేయి కటి యందుంచినట్టు శ్రీవత్సం (పుట్టుమచ్చ) కౌస్తుభమణి భూషణాలు, చీని చీనాంబరాలు ధరించిన ఆ సర్వాంగ మనోహరుని ప్రాతఃకాలంలో సేవిస్తున్నాను.)

ఈ శ్లోకం స్వామి అలంకార భూషితమయిన మూర్తిని మనకళ్ళకు కట్టినట్టు చూపుతుంది.

నామావళిస్తోత్రాలలో కావ్యసౌందర్యం కన్నా భక్తితత్పరత కనిపిస్తుంది. ఫలశ్రుతులు (ఇష్టావాప్తి మొదల యినవి) ఇందులో కనిపిస్తాయి.

శ్రీ వేంకటేశ కావ్యకలాపంలో 14 స్తోత్రాలు వేంకటేశునికి సంబంధించినవి. శ్రీవాది భీకరాచార్యులు వేంకటేశ కవి రాసిన స్తోత్రాలు 4 ఉన్నాయి. ఇవన్నీ ఒకరే వ్రాశారని తెలుస్తోంది. వీరికే శ్రీవాది భీతికరాచార్యులు, వాదీంద్ర భీకరాచార్యులు అనే బిరుదులుకూడ ఉన్నాయి. వీరు రచించిన నాలుగు స్తోత్రాల్లో శ్రీ వేంకటేశ విజయాస్తోత్రం విలక్షణంగా ఉంది. ఇక్కడ ప్రయోగించబడిన ఛందస్సు మాత్రాఛందస్సు. రాజోపచారాలలో వందిమాగధుల జయోదాహరణ కావ్యానికి సంబంధించినదీ కావ్యం.

**రాక్షససోదర భీతినివారక శారదశీతమయూఖ ముఖాంబుజ**
**రావణ దారుణ వారణదారణ కేసరిపుంగవదేవ జయీ భవ ॥** **శ్లో.సం.12**

(దేవతల భయాన్ని పోగొట్టే స్వామీ। శరత్కాల చంద్రునితో సమానమైన ముఖపద్మముకలవాడా। రావణాసురుడనే మదపుటేనుగును సంహరించే పురుషసింహమా। ఓ దేవా। నీకు జయమగుగాక!)

ఈ శ్లోకంలో అనుప్రాసశబ్దాలంకారం; ఉపమా, రూపకం, అర్థాలంకారాలు సహజ సుందరంగా ఉన్నాయి. కవి భక్తి భావం ఇక్కడ గోచరిస్తోంది.

వీరు రచించిన సప్త విభక్తి స్తోత్రంలోకూడ జయోదాహరణకావ్య లక్షణాలు ఉన్నాయి. వీటిని అష్టపదులు అంటారు. అన్ని విభక్తులలోను స్వామిని స్తుతించడం ఈ కావ్యం లక్షణం.

**లక్ష్మీలలితపదాంబుజ లాక్షారసరంజితాయతోరస్కే ।**
**శ్రీవేంకటాద్రినాథేనాథే నిత్యమర్పితో భారః ॥**

(స్వామి వక్షస్థలంలో లక్ష్మీదేవి పారాణి రాసుకోవడం చేత ఆయన వక్షస్థలం ఎఱ్ఱగా చేయబడింది. అటువంటి శ్రీవేంకటనాథునిమీద నా భారమంతా ఉంచాను)

ఈ శ్లోకంలో ఆత్మనివేదనంతో బాటు అనురాగాన్ని ప్రకాశింపజేసే రంజితమనే పదం కావ్య శోభను చేకూరుస్తోంది. ఇది ధ్వని కావ్యం. ఉత్తమూరి వీరరాఘవాచార్యులు వ్రాసిన శ్రీవేంకటేశస్తోత్రం విస్తృతంగా ఉంది. వీటిలో 271 శ్లోకాలు ఉన్నాయి. ఈకావ్యంలో ఆయా భావాలు భిన్న భిన్న సమయాలలో రాసినట్లు తెలుస్తోంది. 31శ్లోకాల్లో వేంకటేశుని, 40 శ్లోకాల్లో శ్రీనివాసుని 16 శ్లోకాల్లో సప్తశైలస్వామిని స్తుతిస్తూ వేంకటేశుని విభిన్న రూపాలు వర్ణింపబడ్డాయి. అకారాది హకారపర్యంతశ్లోకాలు ఇచట వర్ణమాలాస్తోత్రంగా పొందుపరచ బడ్డాయి. ఈవర్ణమాలా స్తోత్రం స్తోత్రసాహిత్యంలో అవిరళం, విరక్త గృహస్థ ప్రార్థన, అధమర్ణ ప్రార్థన, పాణి ముద్రాస్తవం ఈ కావ్యాలలో తలమానికలు. విరక్త గృహస్థ ప్రార్థనలో ఈ శ్లోకంలో నిర్వేదం స్థాయీభావంగా ఉంది.

**యన్మృప్రాథమికాశ్రమస్ప్రభగవన్ క్షిప్రం వ్యతీయాయ మే**
**వానప్రస్థఇతీదమద్యజగతిప్రాప్తం భృశాదర్శనమ్**

**సన్యాసస్తు గృహస్థధర్మవహనవ్యాక్షిప్త నైజస్థితిః**
**తద్గార్హ స్థ్యమిదం విధత్స్వనియతం ధర్మ్యం ప్రియంతేమమ ॥**

(స్వామీ! అన్ని ఆశ్రమాలలో గృహస్థాశ్రమమే మంచిది. బ్రహ్మచర్యం గృహస్థం మీదే ఆధార పడిఉంది. ఇంద్రియశైథిల్యం చేత వానప్రస్థం స్వయంగానే వస్తుంది. గృహస్థధర్మం నిగ్రహించడంలో ఉన్న కష్టాలతో మనస్సు వికలంకావడంతో సన్యాసం సులభమేకదా! అందుచేత ఆ గృహస్థధర్మం నీకునాకు కూడ ప్రియమైందే. అది నాకు చేకూర్చు.)

వేంకటేశ తూణకం స్తోత్ర సాహిత్యంలో నూతన ప్రక్రియ. అజ్ఞాతకవి విరచితం. ఇక్కడ ఛందస్సు విలక్షణం. తూణకం అనే పదానికి అమ్ములపొది అని అర్థం.

**కంబుకంఠమంబుజాతడంబరాంబిక ద్వయం**
**శంబరారి తాతమేన మంబురాశితల్పగమ్**
**బంభరార్భకాలిభవ్యలంబమాన మౌలినమ్**
**శంఖకుందదంతవంతముత్తమంభజామహే ॥**

(శంఖము వంటి కంఠము, పద్మముల వంటి నేత్రములు కల మన్మథుని జనకుడైన తుమ్మెదవలె నల్లనైన ముంగురులు గల, శంఖము మల్లెలవలె దంతములు గల ఆ స్వామిని సేవింతుము.)

ఇక్కడ పదవిన్యాసం అద్భుత సన్నివేశం అన్నీ సంతరించుకున్నాయి. ప్రసాద గుణభరితమయిన ఈశ్లోకం విన్న వెంటనే అర్థస్ఫూర్తిని కలిగిస్తుంది.

**నాగరాజపాలనం భోగినాథశాయినం**
**నాగవైరిగామినం నగాదిశత్రుసూదనం**
**నాగభూషణార్చితం సుదర్శనాద్యుదాయుధం**
**నాగరాడ్గిరీశ్వరం నమామి వేంకటేశ్వరమ్ ॥** శ్రీవేంకటేశ పంచకస్తోత్రం-4

ఆదియమకం పునరుక్త పదాభాసం అలంకారాలు సౌందర్యాధాయకాలు.

వేంకటేశ్వర గద్యంలో ఓజో గుణం గద్యాన్ని జీవింపజేస్తుంది.

**"రవికోటి పరిపాటీ ధరకోటీరవరాటీకితవాటీరసధాటీ**
**ధరమణి గణకిరవిసరణ సతతవిధూత తిమిరమోహగర్భగేహః ॥**

పద జాలం వింటూనే ఆశ్చర్యముద్రలో తేలుతాము.

'కాదంబరీ రసాస్వాదే ఆహారోకపినరోచతే' అన్నట్లుగా సంస్కృత స్తోత్ర సాహిత్యాస్వాదంలో ఇక ఏమీ రుచించదు.

ఈ స్తోత్రసాహిత్యంలో చిత్ర విన్యాసాలు మార్మికమైనవి. పరోక్షప్రియులైన దేవతల అనుగ్రహంకోసం ఈ చిత్రవిన్యాసాలు చేసారుకవులు. ఇందులో బీజాక్షర సంపుటియుంటాయి. ఇవన్నీ అన్వేషించదగినవి.

శ్రవణానందం, దయాశతకం, శ్రీనివాస గుణాకరంలాంటి బృహత్కావ్యాలు స్తోత్రకావ్యాలు వ్యాఖ్యాన సాపేక్షాలు. వీటిమీద ఎన్నో పరిశోధనా వ్యాసాలు వచ్చాయి. వాటిలో శ్రీఆకెళ్ళ విభీషణ శర్మగారి శ్రీవేంకటేశ్వర స్తోత్రసాహిత్యం సమగ్రపరిశోధనా వ్యాసం.

ప్రాచీన సంస్కృతకవులే గాక ఆధునిక సంస్కృత కవులు కూడ వేంకటేశ్వరస్తోత్రాలు వ్రాశారు. వాటిలో స్ఫూర్తిశ్రీ వ్రాసిన వేంకటేశ్వరస్తోత్రం. శ్రీవంగీపురం శేషాచార్యులు వ్రాసిన శ్రీవేంకటేశ్వర ప్రాతఃస్మరణం, శ్రీవేమూరి ఆంజనేయ శర్మగారు రచించిన శ్రీవేంకటేశ్వర విభోతవ సుప్రభాతమ్, శ్రీ కె.సి. జయచంద్రశాస్త్రి, శ్రీయన్.సి.వి.నరసింహాచార్యులు వ్రాసిన స్తోత్రాలు శ్రీనివాసస్తుతి మహాముకుటనవరత్నోపహారం, బ్రహ్మోత్సవ తారావళి మొదలయిన కావ్యాలు ఉల్లేఖనీయాలు. ఈస్తోత్రకావ్యాలన్నింటికీ సమగ్ర వ్యాఖ్య, అనువాదాలు, సమీక్ష తెలుగులో వస్తే సామాన్యజనానికి కూడ అందుబాటులో ఉంటాయి. ఈ కార్యం అచిరకాలంలో జరుగుతుందని ఆశిద్దాం.

**వైదర్భీజానిరసకృత్ పాంచాలీ జానిపూజితః ।**<br>
**గౌడీంరీతిం సుమధురాం దోద్యాద్వేంకట నాయకః ॥**

ఓం శాంతిః

శ్రీవేంకటేశ్వరాయ నమః

# శ్రీ వేంకటేశ్వర వైభవం

*ఉదయగిరి శ్రీనివాసాచార్యులు*

వైభవ-విభవ-మహిమ-మహత్తు-మహత్త్వము-మాహాత్మ్యము అనే పదాలన్నీ సమానార్థకాలుగా శబ్దరత్నాకర- సూర్యరాయాంధ్ర-అమరకోశ-బృహత్‌హిందీకోశ-మోనియర్ విలియమ్స్-కిట్టెల్ వగైరా నిఘంటువులలో చూపబడ్డాయి.

వైభవ పదానికి ఐశ్వర్యము, ప్రభుత్వము, మహిమ, గొప్పతనము అనే అర్థాలు ముఖ్యంగా తీసుకోవచ్చు.

విగ్రహరూపంలో దేవుడు ఉంటేకదా అతని మహిమనో మహత్తునో చూడడానికీ - తెలుపడానికి. వేద కాలంలో విగ్రహరూపం లేదు. మంత్రాలతోనే భగవంతుని పూజించేవారు.

భగవంతుడు తన అస్తిత్వాన్ని ప్రపంచానికి తెలుపడానికై క్రీ.పూ.6వ శతాబ్దంలో కాబోలు విఖనస మునీంద్రుని జన్మింపజేసినాడు. ఇతడు కల్పసూత్రాన్ని రచించినాడు. దానిని స్మార్త-ప్రవర్త-ధర్మ-శ్రౌత భాగాలుగా విభజించినాడు. అష్టాదశ సూత్రకర్తలలోకి ఇతడు మొట్టమొదటివాడు. క్రీ.పూ.600-400 మధ్య ఉన్న గౌతమమహర్షి, క్రీ.పూ. 500-300 మధ్య ఉన్న బోధాయనుడు, క్రీ.పూ. 300-100 మధ్య ఉన్న వసిష్ఠమహర్షి, క్రీ.పూ. 200- క్రీ.శ.200 మధ్య వున్న మనుస్మృతిలో విఖనసమహర్షిని పేర్కొన్నారు. కాబట్టి విఖనసమహర్షి, వీరికి పూర్వుడు. (ప్రొఫెసర్ పి.వి.కాణె- హిస్టరీ ఆఫ్ ధర్మసూత్రాస్ అండ్ ధర్మశాస్త్రాస్)

కొన్ని వేల సంవత్సరాలకు పూర్వం ప్రజలు జపంచేస్తూ భగవంతుని పూజించి భగవంతుడు సాక్షాత్కరించి నాడని సంతోషించేవారు. వేదకాలం వచ్చేటప్పటికి హోమముల ద్వారా బ్రహ్మ, విష్ణు-శివులను-దేవతలను తృప్తి పరచడానికి హోమములు చేయసాగినారు. ఆనాడు ఒక నిర్దిష్టమైన రూపంలేని నిరాకారుని పూజిస్తూ వచ్చినారు. బౌద్ధమతం వ్యాపించింది. కొంతకాలం జరిగిన తరువాత భగవంతుడు ఉన్నాడా? లేడా? ఉంటే ఏ విధంగా ఉంటాడు? అతని ఆకారమేమి? అనే ప్రశ్నలు బయలుదేరినాయి. దానితో క్రమంగా నాస్తికమతము వ్యాపింప సాగింది.

అష్టాదశ సూత్రకర్తలలోకి మొట్టమొదటివాడైన విఖనసమహర్షి 'ఏ పరిస్థితులలోనూ నాస్తికులు కావద్దండి' అని ప్రజలకు హితబోధ చేసినాడు.

ఈయన ఆరు అంగుళాలకుతక్కువకాని విగ్రహరూప భగవంతుడిని ఇంటిలోగాని,దేవాలయంలో గానీ ప్రతిష్ఠించి పూజించమన్నాడు. ఇతనికి నలుగురు శిష్యులు, భృగు, అత్రి, కశ్యప, మరీచి మహర్షులు. వీరంతా విగ్రహరూప భగవంతుని ప్రతిష్ఠనుగూర్చి పేర్కొన్నారు. మరీచిమహర్షి విమానార్చనకల్పం అనే గ్రంథంలో విమానసహిత దేవాలయ నిర్మాణము అత్యుత్తమమైనది అని పేర్కొన్నాడు.

శిల్పులు ఎన్నోరకాలుగా ఎన్నో విగ్రహాలు చెక్కుతున్నారు. వాటికి మాహాత్మ్యమూ లేదు. వైభవమూ జరగడం లేదు. ఎందుచేత? ఆ విగ్రహములలో శక్తిలేదు కాబట్టి మరి శక్తి ఎట్లా వస్తుంది? అంటే-

**భగవంతుని ఆది స్వరూపము**

ఎవనికంటే భిన్నమైనది ఏదిలేదో- ఎవనికంటే సూక్ష్మమైనది లేదో- ఎవనికంటే పెద్దదైనది లేదో- ఎవడు అంతరిక్షమున నిశ్చలమైన మహావృక్షమువలె నిలిచి ఉన్నాడో- ఆ పురుషునిచేత ఈ విశ్వమంతయూ నిండియున్నది- అతడేపరబ్రహ్మ-అతడేజ్యోతి-అతడేఆపోజ్యోతిగా ఉన్నాడు. విమానార్చన కల్పం.పుట 2. అతన్ని చూడడం ఎట్లా? అంటే-

విమాన సహితమైన దేవాలయాన్ని గ్రామంలోగాని, అగ్రహారంలోగాని నిర్మించి అందులో ఆపోజ్యోతి రూపుడైన విష్ణువును ప్రతిష్ఠించి పూజిస్తే ఆ గ్రామంలో నివసించే ప్రజలందరికీ హోమము చేసినంత పుణ్యము కలుగుతుంది. నిత్యాగ్నిహోత్రులకు అన్ని పాపాలు తొలగిపోతాయి. అందరికీ సకల సంపదలూ కలుగుతాయి. విమానార్చనకల్పం. పు.3.

దేవాలయాన్ని కట్టినారు-బాగుంది-అందులో శిలారూపమైన విగ్రహాన్ని పెట్టినారు- ఇంకా బాగుంది. మరి అందులో భగవంతుడు ఉన్నాడా? అంటే లేడు- మరి ఎట్లా వస్తాడు?

**విగ్రహరూప భగవదావిర్భావము**

ఋత్విక్కు స్వస్తికాసనమున కూర్చుండి ప్రాణాయామము చేసి హృదయముపై "ఓం" అనే బీజాక్షరమును, అదే ప్రకారము తనచేతితో తన శరీరము చుట్టూ చుట్టుకోవలయును- అప్పుడు-

పాలలో నెయ్యి- నువ్వులలో నూనె- పూలలో వాసన- పండ్లలో రసము- కట్టెలలో అగ్ని-ఎట్లా దాగి ఉన్నాయో అట్లాదాగిన సర్వాధారుడు- సనాతనుడు-అప్రమేయుడు-అచింత్యుడు-నిర్గుణుడు-నిర్మలుడు-సర్వవ్యాపి అయిన భగవంతుని, ఋత్విక్కు మనసులో ధ్యానించి- సంకల్పించి-తనలోనికి ఆవాహన చేసుకోవలెను-అప్పుడు-

అరణిలో దాగిఉన్న అగ్ని మథించడముచేత ఎట్లా పుట్టి మనకు ఉపయోగానికి వస్తుందో అట్లాగే ఋత్విక్కు ధ్యానమనే అరణిచేత అతని హృదయాన్ని మథిస్తే ఋత్విక్కుయొక్క హృదయంలో విష్ణువు ఆవిర్భవిస్తాడు. ఆ విష్ణువు ఎట్లా ఉంటాడంటే-

బంగారు శరీరచ్ఛాయ కలవాడు- కన్నులూ-కాళ్ళూ-చేతులూ ఎర్రగా కలవాడూ- మందహాసం చేయువాడూ- నెమలి పింఛము ధరించినవాడూ- ప్రణవస్వరూపుడూ-కిరీటమూ, కేయూరమూ, యజ్ఞో పవీతమూ, శ్రీవత్సాంకమూ కలవాడూ, నాలుగు చేతులు కలవాడు- పరమాత్ముడూ-పరాత్పరుడూ- శ్రీభూ

సమేతుడూ- గరుడాది శిష్య సేవితుడూ అయిన భగవంతుడు ఋత్విక్కుకు ప్రత్యక్షమౌతాడు. మనసులో ప్రత్యక్షమైన ఆ భగవంతునిలో లీనమై ప్రతిష్ఠకై ఏర్పాటు చేసిన కుంభములోని తీర్థములోనికి మంత్రపూర్వకముగా ఆవాహన చేయ వలయును. మంత్రములతో ఉక్త హోమములు 5 రోజులు చేయవలయును. వి.క పు.3,194.

5వ రోజు ఉదయము ప్రతిష్ఠాకాలములో అంటే నిర్ణయించిన ముహూర్తములో మంత్రపూర్వకముగా కుంభతీర్థములోనికి ఆవాహనచేసిన భగవంతుని అర్చావతార రూప విగ్రహములోనికి ఆవాహనము చేసి అర్ఘ్య, పాద్య, ఆచమనాదులచే పూజించి హవిర్నివేదనము చేయవలెను. ఆ రోజు ఆ ఘడియ నుండే ఆ విగ్రహానికి మాహాత్మ్యము కలుగుతుంది. వైభవమూ ప్రారంభమౌతుంది. నిత్యపూజకు అర్హమౌతుంది. అట్లా శ్రీవైఖానస భగవచ్ఛాస్త్రం ప్రకారం అంటే శ్రీవైఖానస ఆగమము ప్రకారము ఏర్పడినవాడే శ్రీవేంకటేశ్వర స్వామివారు. విమానార్చన కల్పం. పు. 210-211.

## కల్యాణోత్సవము

ప్రతిష్ఠ కాగానే మరురోజు కల్యాణోత్సవమును చేయాలి. ఈ కల్యాణోత్సవముతో విగ్రహరూప భగవంతునికి వైభవము ప్రారంభము అవుతుంది. అట్లాగే శ్రీవేంకటేశ్వరస్వామివారికీ వైభవము ప్రారంభ మయ్యింది. కల్యాణోత్సవము చేయించినా, దర్శించినా స్త్రీలు సుమంగళులుగా ఉంటారు. సంపద సమృద్ధిగా కలుగుతుంది. పుత్ర, పౌత్ర సమృద్ధికలుగుతుంది, కోరికలు తీరుతాయి, విష్ణుసాయుజ్యాన్ని పొందుతారు. వి.క. పు. 248.

## వైభవ ప్రారంభం

భగవంతుని ఉనికిని, వైభవాన్నీ, మాహాత్మ్యాన్నీ ప్రజలకు తెలియజేయడానికై విగ్రహరూప పూజావిధానాన్ని విఖనస మునీంద్రులు క్రీ.పూ. 6వ శతాబ్దంలో కాబోలు ఏర్పాటు చేసినారు. ప్రపంచంలోని అన్ని జాతుల మానవుల దోషాలన్నీ తొలగి పోవడానికీ- అన్ని లోకాలలోని దేవతలంతా చూచి సంతోషించడానికి నిత్యోత్సవ-వారోత్సవ-పక్షోత్సవ- నక్షత్రోత్సవ-మాసోత్సవ-బ్రహ్మోత్సవ-పుష్పయాగ- పవిత్రోత్సవాలు వగైరాలు చేయడానికి ఏర్పాటు చేసినారు. చూ॥ వి.క. పు.336.

విత్తము కొద్దీ విభవమన్నారు. నిత్యోత్సవ మాహాత్మ్యము-బలిబేరాన్ని నృత్య, గేయ, వాద్యాలతో ఊరేగిస్తూ వచ్చేటప్పుడు ఎవరు ఆ ఉత్సవరూప విగ్రహాన్నీ దర్శిస్తారో వారికి అన్ని ఉత్సవములు దర్శించినంత ఫలము కలుగుతుంది. యజ్ఞములు చేసినంత ఫలము కలుగుతుంది. భగవంతుడు సంతోషిస్తాడు. రాజు, రాష్ట్రము అభివృద్ధి పొందుతాయి. వి.క.పు. 263. వారోత్సవ, పక్షోత్సవాలలో కూడా భగవంతుని దర్శిస్తే ఈ ఫలమే కలుగుతుంది.

మాసోత్సవ మాహాత్మ్యము-ఎవరు మాసోత్సవాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా అంటే గొప్పగా చేయిస్తాడో అతడు, ఎవరు దర్శిస్తారో వాళ్ళూ కీర్తిని-ధనాన్నీ-విజయాన్నీ-ఇష్టమైన కోరికలనూ పొందుతారు. కట్టకడపట విష్ణులోకాన్ని పొందుతారు. వి.క. పు. 293.

ఇవి కాకుండా 3 రకాల ఉత్సవాలు చెప్పినారు. ఒకటి నిత్యోత్సవం, రెండు శాంత్యుత్సవం, మూడు శ్రద్ధోత్సవము అని. ఇవన్నీ ఎందుకంటే దేవునికి వైభవమూ- మాహాత్మ్యమూ కల్పించడానికీ, ప్రజలను సన్మార్గంలో నడపడానికీ, వారికి సకల సౌభాగ్యాలు కల్పించడానికీ ఏర్పాటు చేసినారు.

నిత్యోత్సవము- 12 నెలలలో ఒక నెలను ఎన్నుకొని ఆ నెలలో నిర్ణయించుకొన్న రోజులో ప్రతి సంవత్సరమూ ఉత్సవము చేస్తాను అని సంకల్పము చేసుకొని అదే ప్రకారము ప్రతి సంవత్సరము ఆ నెలలో ఆ రోజులో చేసే ఉత్సవాన్ని నిత్యోత్సవము అన్నారు. నేడు ఆ నిత్యోత్సవమే బ్రహ్మోత్సవము పేర జరుగుతూ ఉంది. ఈ ఉత్సవాన్ని చేస్తే భగవంతుని వైభవం ప్రజలకు తెలుస్తుంది. నేడు తిరుమలలో జరిగే శ్రీవేంకటేశ్వర స్వామివారి బ్రహ్మోత్సవము ద్వారా వైభవము ప్రపంచానికి తెలియవస్తూంది. ఇంకా శాంతుత్సువ, శ్రద్ధోత్సవ, పుష్పయాగ, పవిత్రోత్సవాల వల్ల కూడా ఇంకా గొప్పగా శ్రీవేంకటేశ్వరుని వైభవము ప్రపంచానికి తెలుస్తూంది. వి.క. పు. 318.

## శ్రీవేంకటేశ్వర వైభవము

తెలుగులో పాతకమూరి అన్నారెడ్డి అనేరాజు క్రీ.శ. 13వ శతాబ్దంలో కాబోలు లాలిపాట పాడగా శ్రీవేంకటేశ్వర స్వామి పసిపాప రూపంలో తొట్లలో నిద్రించి తన మహిమను చూపినాడట. 13వ శతాబ్దములోనే కృష్ణమాచార్యులు ఆధ్యాత్మ సంగీతరూపక వచనం రచించి పాడగా శ్రీవేంకటేశ్వరస్వామివారు విని విరక్తులై ముసలివాని వేషాన్నిధరించి, తన వైభవాన్ని చాటినాడట. నేడు అన్నమాచార్యుల సంకీర్తనలు సుమారు 14000 లభిస్తున్నాయి. ఇవన్నీ శ్రీవేంకటేశ్వరవైభవాన్నీ-మాహాత్మ్యాన్నీ చాటే సంకీర్తనలే. ఈ సంకీర్తనల ద్వారా శ్రీవేంకటేశ్వర వైభవం క్రీ.శ.17-5-1535వ సం॥ నాటికి 4 సముద్రాల మధ్య ఉన్న దేశమంతా వ్యాపించింది అని తి.తి.దే. శాసన సం. 4వ. శా.నం. 40, టి.టి.లో చెప్పబడి ఉంది. అంటే వేంకటేశ్వరస్వామి వైభవంతో పాటు అన్నమయ్య సంకీర్తనలు కూడా వ్యాపించినాయి. అన్నమయ్య-

నేనొక్కడ లేకుండితే నీకృపకు పాత్రమేది?- పూని నా వల్లనే కీర్తి పొందేవు నీవు- నావల్ల నీకు పుణ్యము- నీవల్ల నే బ్రదుకుదు అన్నాడు. అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు 8వసంపుటం. 40.వ సంకీర్తన.

వేంకటేశ్వర మహిమనూ, వైభవాన్నీ తెలుసుకొని 9వ శతాబ్ది నుండి మహారాజుల మొదలు సామాన్యుల వరకు ఎన్నో ఉత్సవాదులు ఏర్పాటు చేసి శ్రీవేంకటేశ్వరస్వామివారికి వైభవాన్ని కల్గించి, దర్శించి తాము తరించి ప్రజలనూ తరింపజేసినారని తి.తి.దే. సంపుటాలలోనూ, సౌత్ ఇండియన్ ఇన్‌స్క్రిప్షన్స్ వాల్యూములలోనూ కొల్లలుగా పేర్కొనబడి ఉన్నాయి.

క్రీ.శ. 1450కి పూర్వమే ప్రపంచంలోని బౌద్ధులు, భక్తులు, సాంఖ్యశాస్త్రజ్ఞులు, పదవాక్య ప్రమాణజ్ఞులు, వేదాంతులు, మీమాంసకులు, న్యాయ శాస్త్రజ్ఞులు, మునులు మిగతా అందరూ వారి వారికి తోచినట్లు వేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని దర్శించినట్లు అన్నమయ్య ఒక కీర్తనలో రచించినాడు. చూ. తాళ్ళపాక శేషాచార్యుల ప్రతి.

అన్నమయ్య అధ్యాత్మ సంకీర్తనలు 179 వ రేకులో- వైష్ణవులు శ్రీవేంకటేశ్వరస్వామిని విష్ణువనీ, వేదాంతులు పరబ్రహ్మమనీ-శైవులు శివుడనీ-కాపాలికులు ఆదిభైరవుడనీ- శాక్తేయులు శక్తిరూపుడనీ- ఎవరికి తోచినట్లు వారు కొలుస్తున్నారు అన్నాడు.

## శ్రీవేంకటేశ్వర వైభవము-2

శాంత్యుత్సవము-భయము, ప్రమాదము, దుర్భిక్షము, వ్యాధులు, గ్రహపీడవగైరాలైన అశుభాలు మానవులకు కాని, దేశానికి కాని కలిగినప్పుడు ప్రత్యేక హోమముల ద్వారా చేసేది శాంత్యుత్సవము. శ్రీ వేంకటేశ్వరస్వామి వారికి ఈ శాంత్యుత్సవాలు చేయడంచేత ఆయన వైభవాన్నీ, మాహాత్మ్యాన్నీ ప్రజలు తెలుసుకొంటున్నారు. వి.క. 319 పుట.

శ్రద్ధోత్సవము- సంపద, శ్రద్ధ ఉండి ఎవరైనా ఉత్సవము చేయిస్తే అది శ్రద్ధోత్సవము అవుతుంది. శ్రీవేంకటేశ్వరస్వామివారి మాహాత్మ్యాన్ని తెలుసుకొని భక్తాదులంతా నేడు వైభవముగా జరిపే ఉత్సవాలన్నీ శ్రద్ధోత్సవము క్రిందికి వస్తాయి. దీనివల్ల భక్తుల కుటుంబాలు, దేశము సుభిక్షంగా ఉంటుంది. 319 పుట.

## శ్రీ వేంకటేశ్వరస్వామివారి వైభవాన్ని తెలిపే బ్రహ్మోత్సవాలు

బ్రహ్మోత్సవము అనే పేరు ఎట్లావచ్చింది అంటే అంకురార్పణము రోజు ఆవాహన చేసేటప్పుడు మొదట "బ్రహ్మాణమావాహయామి" అని బ్రహ్మను ఆవాహనము చేస్తారు. కాబట్టి బ్రహ్మోత్సవము అనే పేరు వచ్చింది. దీనిని 5 రోజులు గానీ, 7 రోజులుగానీ, 9 రోజులుగానీ బ్రహ్మోత్సవము చేస్తాము అని నిర్ణయించుకొని చేసే ఉత్సవమే బ్రహ్మోత్సవము. రాజు, రాష్ట్రము, గ్రామము యజమానుడు వీళ్ళ జన్మ నక్షత్రంలోగానీ, పూర్ణిమ, అమావాస్య శుక్ల, కృష్ణ పక్ష ఏకాదశీ, బహుళపక్ష ఏకాదశీ శ్రవణా నక్షత్రం రోజున గానీ మాస నక్షత్రంలో గానీ, విషువు అనే తులామాసంలో గానీ, అయనమనే కటక, మకర మాసాలలో గానీ చక్రస్నానం వచ్చేటట్లు చేయాలి. మొదటిరోజు సాయంకాలం ధ్వజారోహణం చేయాలి. వి.క.పుట 319.

## ధ్వజారోహణ వైభవము-ఫలము

ధ్వజ పటానికి నివేదన చేసిన పొంగలిని సంతానములేని దంపతులు స్వీకరిస్తే వారికి సంతానప్రాప్తి కలుగుతుంది. ఆ పుత్రుడు బల-ఆరోగ్య-ఆయుష్మంతుడుగా ఉంటాడు. వి.క.325.

**వాహనాలు**

పల్లకీ-రథము-రంగురంగుల తొట్లు- ఓంకార స్వరూపము కలది- మంటపము లాంటిది- ఏనుగు-గుఱ్రము-గరుడుడు-సింహము-వ్యాళి-హంసవాహనాలలో గ్రామోత్సవము చేయాలి. వి.క. పు. 326.

వైభవాన్ని తెలుపడానికి మాలాదీపము-యంత్రదీపము-హస్తదీపము-శూలదీపము వగైరాలతో వైభవాన్ని తెలుపుతూ ఉత్సవాలను చేయాలి. వి.క. 327.

భేరి-పటహ-మర్దల-గోముఖ-తాల-కాహళ-మురజ-వేణువు-ఝర్జర-దుర్దుర-శంఖ-శృంగ-ధారా-వీణా-పిల్లనగ్రోవి మొదలైన వాయిద్యాలు దేవుని ముందు వాయిస్తూ వైభవాన్ని చాటుతూ వెళ్ళాలి. వి.క. పు.327.

ఇంత వైభవంగా జరిగే ఉత్సవాన్ని బాలురు, యువ్వనులు, వృద్ధులు, కన్నులారా ఆ వైభవాన్ని సేవించాలి.ఆ సేవించినవాళ్ళు ఒక్కొక్క వాహనాన్ని దర్శించినప్పుడు ఒక యజ్ఞము చేసినంత ఫలాన్ని వాళ్ళు పొందుతారు. వి.క. పు. 346.

ఈ ఉత్సవాన్ని అంటరాని వాళ్ళూ, అన్యమతస్థులు ఎవరైనాదర్శించవచ్చు. ఒకరినొకరు తాకవచ్చు. దోషములేదు. అన్నిమతాలవారికీ, అన్ని జాతులవారికీ భగవద్దర్శనము వలన యజ్ఞము చేసినంత ఫలము లభిస్తుంది. వి.క. పు. 336.

**ధ్వజావరోహణము**

ధ్వజావరోహణము ఉదయము స్వామివారికి పసుపు పచ్చని చూర్ణముతోచూర్ణాభిషేకమును చేయాలి. ఆ పసుపు పచ్చని చూర్ణమును ఎవడు తలపై ధరిస్తాడో వారిపాపాలు అన్నీ వెంటనే తొలగిపోతాయి. ఈ అవభృథోత్సవములో వీడిని తాకవచ్చు. వీడిని తాకకూడదు అన్న నియమము లేదు. అందరూ చక్రముతో కూడ ఏక కాలంలో స్నానం చేయాలి. ఎవరు స్నానం చేస్తారో వారి పాపాలు తొలగి వారంతా విష్ణులోకాన్ని పొందుతారు. వి.క. పు.341. ఆ రాత్రి ధ్వజావరోహణము అయిన తర్వాత పుష్పము తులసి వగైరాలతో కూడిన బలి ప్రసాదాన్ని ఒక గంగాళంలో వేసి చక్రం లేకుండా దేవాలయములోని దేవతలకు, ఊరిబయట ఉన్న బ్రహ్మాది దేవతలకు బలి యన్నమును వేయవలయును. మొదటిరోజు నవసంధిలో ఆవాహన చేసిన దిక్పాలకులకు అంపకాలు చెప్పి ఆ తరువాత ఆ గ్రామంలో ఉండే దేవాలయంలోనూ, పాడుబడ్డ దేవాలయముల్లోనూ, ముదిరిన చెట్ల మొదళ్ళ లోనూ, మాతృ దుర్గ, స్కంద, విఘ్నేశ, శక్తి మొదలైన దేవాలయాలలోనూ శ్మశాన సమీపంలోని బావులూ, కుంటలూ చెరువులూ, కోటలలోనూ, గ్రామానికి నాలుగు గ్రామ హద్దులలోనూ, భూత, క్రూర దేవతల దేవాలయాల లోనూ బలిని వేయాలి. ఆ తరువాత ధ్వజావరోహణము చేయాలి. వి.క. పు. 342.

## వైభవాన్ని చాటేది పుష్పయాగము

ఇందులో ప్రజలు వారి, వారి తోటలలో పుష్పించే రంగు రంగు సువాసన కలిగిన పూలను భగవంతునికి సమర్పించి పుణ్యాన్ని పొందే అవకాశం కల్పించినారు. ఎన్నో రంగుల పూలు, తులసి, మారేడు వగైరా పత్రాలు సమర్పిస్తారు. ఇది ఎంతో వైభవాన్ని కల్గిస్తుంది. ఈ పుష్పయాగంలో పాల్గొనే వాళ్ళకు పుత్రులు కావాలంటే పుత్రులు, ధనం కావాలంటే ధనము, కీర్తి ప్రతిష్ఠలు కావాలంటే కీర్తి ప్రతిష్ఠలు, జయం కావాలంటే జయాన్నీ, అన్నీ కోరికలను తీర్చుకోవడానికి అన్ని దోషాలు పోవడానికి, ప్రాయశ్చిత్తాలకూ ఈ పుష్పయాగము చేయాలి. ఈ పుష్పయాగ వైభవాన్ని దర్శించిన వారికి కూడా పైవన్నీ కలుగును. వి.క.పు.344. ఈ పుష్పయాగం శ్రీ వేంకటేశ్వరస్వామివారికి జరుగుతూంది. ఈ వైభవాన్ని చూచి ఎందరో తరిస్తున్నారు. ఈ పుష్పయాగాన్ని ఎవరు చేయిస్తారో వారిపాపాలు వెంటనే నశిస్తాయి. చేయించేవాడూ, వాడికి ముందు పది తరాలవాళ్ళూ, తరువాత పది తరాల వాళ్ళూమొత్తం 21 తరాలవాళ్ళు దేవతల చేత కన్నెత్తి చూడ వీలులేని విష్ణువు యొక్కపరమ పూజ్యమైన లోకాన్ని పొందుతారు. ఆగ్రామంలోని వారంతా వ్యాధులు లేకుండా సుఖశాంతులతో జీవిస్తారు. ప్రజాభివృద్ధి కలుగుతుంది. వి.క.పు. 345.

## అవతారాల వైభవము

భగవంతుని వైభవాలను దర్శించడానికి మత్స్య-కూర్మ-త్రివిధ వరాహ (ఆది, ప్రళయ, యజ్ఞ)- ద్వివిధ నారసింహ (గిరిజ, స్థూణజ, ఈ స్థూణజ నారసింహునికి యానక అని కూడా పేరు)- వామన- త్రివిక్రమ- పరశురామ-రామ (అభంగ, సమభంగ, అతి భంగ)- కృష్ణ (పార్థసారధి కృష్ణుని రూపాలు చెప్పలేవన్నీ, కాబట్టి ఇష్టం వచ్చిన రీతిలో చేయవచ్చు)- కల్కి-ఆదిమూర్తి-అనంత శయనం- మానుష వాసుదేవ-దైవిక వాసుదేవ- ఇన్ని రకాల ఆకారాలలో వెలసిన ఆ భగవంతుని అలంకరించి ఆ వైభవాన్ని దర్శించి ప్రజలు తరించాలని ఇన్ని రకాల దేవతామూర్తులను ఏర్పాటు చేసినారు. వి.క. పు. 372.

## పవిత్రోత్సవ వైభవము

ఈ పవిత్రోత్సవ వైభవాన్ని అన్ని యజ్ఞాలూ చేసిన ఫలానికి, సర్వదోష శాంతికీ, అన్ని కోరికలు తీరడానికీ, సర్వలోక శాంతికీ, మంత్ర క్రియా ద్రవ్య హీనాన్ని తగ్గించడానికీ చేయాలి. వి.క. పు. 462. దర్శించిన వారందరూ విష్ణులోకాన్ని పొందుతారు.వి.క. పు. 468. తిరుమలలో శ్రీవేంకటేశ్వర స్వామివారికి జరిగే పవిత్రోత్సవ వైభవాన్ని దర్శించి ప్రజలు ధన్యులౌతున్నారు.

## ముఖ్యవిషయాలు

1. రామానుజుల జీవితకాలం క్రీ.శ. 1017 నుండి 1137 చూ. వేం.ఇ.మా. ముందుమాట. పే.1.

2. యాదవరాయల రాజ్యపాలన క్రీ.శ. 1191 నుండి 1246 టి.టి.డి. ఎ.రి. పే.116.
3. కో విజయదంతి విక్రమరాజు క్రీ.శ.898 లో ఉత్సవమూర్తులను ప్రతిష్ఠ చేసెను. తి.తి.దే వా.1 పు.9. జి.టి 219)
4. విమానానికి సుందరపాండ్యుడు 1 బంగారు కలశము (తి.తి.దే. వా.1. పే. 69. టి.టి.నెం. 172.) పెట్టించెను.
5.రాజరాజ- 3 కాలంలో వీరనరసింహ దేవరాయలు విమానానికి బంగారు పూత వేయించెను. తి.తి.దే. ఎ.రి. 105
6. సాళువ మంగిదేవ మహారాయలు బంగారు మలాం. టి.టి.నెం. 237-238. ఎ.రి 165.
7. అమాత్య శేఖర మల్లన టి.టి. నెం. 235, ఎ.రి. 165, తే. 2-1[illegible] 144, ఎ.రి. పే. నెం. 135.(బంగారు మలాం)
8. కోటి కన్యాదానం తాతాచార్య కంచి నెం. 345 ఆఫ్ 1919 ఎ.రి. 165, 1630 ఎ.డి. (బంగారు మలాం) (వెంటక-1వ కాలంలో) (ఆరవీడు)
9. మహంత్ ప్రయాగదాసు (తమ్ముడు) సోదరశిష్యుడు రామలక్ష్మణ బావాజి 1909 ఎ.డి. టి.టి.నెం. 242, ఎ.రి. 165. (బంగారు మలా[illegible] ఇన్ని పేర్కొన్నపుడు రామానుజాచార్యులను ఎందుకు పేర్కొనలేదు?
10. 1209 ఎ.డి.లోని వీర నరసింహ రాయల బంధువు ఆండాళ్ అనే ఆయన ట్రెజరర్‌గా పనిచేసినాడు. ఇతనికి "పర సమయ కోళరి" అంటే ఇతరమతాలను నాశనము చేయువాడు అని అర్థము. తి.తి.దే. ఎ.రి.119
11. తి.తి. శాసన సం. 6 ఇండెక్సులో 'నరసగణె' అనే జైనుడు శ్రీ వేంకటేశ్వరస్వామికి దానము చేసినట్లు కలదు. పే. 265; కాని శాసన సం. 126 టి.టి. 36 గా. పే. 217లో ప్రకటించిన దానిలో జైనుడని వ్రాయలేదు. బహుశ జైన శాసనాల ఆధారంగా ఈ పేరు అందులో ఉండడము చేత ఇన్‌డెక్సులో వ్రాసిఉంటారనుకుంటాను.

శ్రీవేంకటేశ్వర వైభవాన్ని గూర్చి మాహాత్మ్యాన్ని గూర్చి సంస్కృతం, తెలుగు, కన్నడ, తమిళ భాషలలో ఎన్నో గ్రంధాలు రచింపబడ్డాయి. అయితే తెలుగులో ప్రాచీనకవులు రచించిన గ్రంథాలను కొన్నింటిని తెలుపుతాను.

1. 17వ శతాబ్దివాడైన గణపవరపు వెంకటకవి రచించిన ప్రబంధరాజ విజయ వేంకటేశ్వరవిలాసము 79 పద్యము.
2. 19వ శతాబ్దివాడైన చెళ్ళపిళ్ల నరసకవి రచించిన వెంకటేశ్వర విలాసమున 3 ఆ 134 ప.
3. 19వ శతాబ్దివాడైన అల్లమరాజు రామకృష్ణకవి రచించిన కవిజనచకోరచంద్రోదయము 2ఆ 88,89.
4. 16వ శతాబ్దివాడైన పింగళిసూరన్న రచించిన కళాపూర్ణోదయము 2ఆ. 125 పద్యము.
5. 16వ శతాబ్దివాడైన తెనాలి రామకృష్ణకవి రచించిన ఘటికాచలమాహాత్మ్యము 2ఆ 40-44ప.
6. 16వ శతాబ్దివాడైన తరిగొప్పుల మల్లన రచించిన చంద్రభానుచరిత్ర 5ఆ.57పద్య.
7. 18వ శతాబ్దివాడైన శ్రీగురుభాస్కరాచార్యులు వైశ్యపురాణము 6 ఆ.
8. 19వ శతాబ్దివాడైన చెళ్లపిళ్ల నరసకవి రచించిన వెంకటేశ్వర విలాసము 1 ఆ. 24 పద్య.
9. 19వ శతాబ్దివాడైన గోపీనాథ వెంకట కవి రచించిన శిశుపాలవధ. 1ఆ పేజి 3.
10. ..................వీపూరి వెంకటాచార్యులు రచించిన విశ్వకర్మపురాణము 1 ఆ 31 పే.

11. 19వ శతాబ్దివాడైన చెల్లపిల్ల నరసకవి రచించిన.... వేంకటేశ్వరవిలాసము 1 ఆ 1 ప.
12. 18వ శతాబ్దికి చెందిన తరిగొండ వెంకమాంబ వేంకటాచలమాహాత్మ్యము పే 45 ప 71.
13. 18వ శతాబ్దివాడైన కొండూరి వేంకటదాసకవి రచించిన భార్గవపురాణము 2 ఆ.
14. 18వ శతాబ్దివాడైన దామెర చిన వేంకటరాయకవి రచించిన వేంకటాచలమాహాత్మము
15. 16వ శతాబ్దివాడైన రేవణూరి వెంకటకవి రచించిన శ్రీపాదరేణుమాహాత్మ్యము
(పెద తిరుమలయ్య కుమార్తె తిరుమలాంబ కుమారుడు)

**సామంతం. 5-106**

బ్రువంతి బౌద్ధా బుద్ధ ఇతి
స్తువంతి భక్తా సులభ ఇతి ॥పల్లవి॥

గదంతి కిల సాంఖ్యా స్త్వాం పురుషం
పదవాక్యజ్ఞాః పదమితి చ
విదంతి త్వా వేదాంతి న
సదా బ్రహ్మలసత్పద మితి చ ॥బ్రువంతి॥

జపంతి మీమాంసకా స్త్వాం చ
విపుల కర్మణో విభవ ఇతి
లపంతి నయ సకలా స్సతతం
కృపాళు కర్తా కేవల మితి చ ॥బ్రువంతి॥

భణంతి వేంకటపతే మునయో
హ్యణిమాది ప్రద మతుల మితి
గుణవంతం నిర్గుణం పున రితి
గృణంతి సర్వే కేవల మితి చ ॥బ్రువంతి॥

తాళ్ళపాక శేషాచార్యులవారి ప్రతి నుండి

# ఏడుకొండలవానికి తెనుగుకవుల సాహిత్యకైంకర్యము

*ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ*

ఈ దేశమందుద్భవించిన సాహిత్యము నూటికి తొంబదిపాళ్ళు ఆస్తికసాహిత్యము. తెనుగు సాహిత్యము దీనికపవాదముగాదు. తెనుగుసాహిత్యమునకు ఆవిర్భావదశయందు అవలంబితమైన సంస్కృతసాహిత్యము యొక్క స్వరూపమట్టిది. అంతమాత్రమున తెనుగు సాహిత్యమునకు మరియొక పార్శ్వము లేదనికాదు. బండ్ల కెత్తదగినంతగా కాలక్రమమున తెనుగు నందును ఆస్తికేతరసాహిత్యము పండినది. ఆదికవి నుండి అధునాతన కవివఱకు కల తెనుగు సాహిత్యము బహుముఖములుగా నున్నది. ప్రసిద్ధక్షేత్రములు, దైవములు, తీర్థములు తెనుగు సాహిత్యమున ఇబ్బడిముబ్బడిగా చోటు చేసుకున్నవి. తాదృశవర్ణనములచే కవులు తమ సాహిత్యమును, కృతార్థమైన దానినిగాను, బహుజనసేవిత మైనదిగాను తలంచుచుండిరి. ఆస్తికులు అట్టిసాహిత్యమునకు బ్రహ్మరథము పట్టిరి. తమ జిహ్వాగ్రములపై ఆ సాహిత్యమునకు ఆస్తికులు అగ్రహారముల నిర్మించిరి. వారు తమ కవితల యందు దైవమునే నాయకునిగా చేయుదురు. తన్మాహాత్మ్య ప్రటకనము కొఱకే కావ్యములను నిర్మింతురు. ఆ సాహిత్యసేవయే వారికి తపస్సు.

అట్టి స్వామిని ఏ సాహిత్యమైనను వదులు కొనునా? స్మరింపదా! స్తుతింపదా? కీర్తింపదా? తెనుగు సాహిత్యము స్వామిని స్తుతించెనన్నచో అబ్బురమేమియుండును. ఒక రకముగా చెప్పినచో స్వామి కొండల రాయుడు కదా! తెనుగుసాహిత్యమునందు స్వామిప్రసక్తి లేదన్నచోమాత్రము గంపెడాశ్చర్యము కలుగకమానదు. ఈ సాహిత్యసృష్టిలో ఎవరెవరు ఎంతెంతగా స్వామిని ఆరాధించిరో తెలియవలయును. కొందరు స్వామిని యెరుగరేమో? ఏమో? కాని కొందరి సాహిత్యము మాత్రము ఎరుగదని చెప్పవచ్చును. నేడుమాత్రము కవులైన వారందరను స్వామిని స్పృశించిరని చెప్పలేముకదా; ప్రాచీనకాలమునందును అట్టివారుకలరన్నమాట. ఆ అస్మృతియు స్వామికొకకైంకర్యమే! నిద్రా సమాధి స్థితి: అనినట్లు స్మరించుటయు కైంకర్యమే స్మరింపకుండుటయు కైంకర్యమే అనుకొన్నచో అట్టి సాహిత్య కైంకర్యమును అయిదారు విధములుగా వింగడింపవచ్చును. 1. అస్మృతి కైంకర్యము 2. స్మృతికైంకర్యము 3. స్తుతి కైంకర్యము 4. కృతికైంకర్యము 5. కధాపతి కైంకర్యము. 6. సర్వాత్మ కైంకర్యము. తెనుగుసాహిత్యస్రష్టలను స్వామిని దృష్టి యందిడుకొని ఈ షట్కైంకర్యములందేదో ఒక తరగతికి చేర్చుదము.

## అస్మృతి కైంకర్యము

స్వామి అందరకుతెలిసి యుండును. అంతమాత్రముచే స్వామిని వారు తమసాహిత్య మందు స్మరించియే తీరవలెను, స్తుతించియే తీఱవలెనని నియమేమియులేదు. ఆస్తికులేయై యుండవచ్చును. భక్తులే యయియుండ వచ్చును. సాహిత్యస్రష్టలే అయియుండవచ్చును. స్వామిని తమసాహిత్యమందు స్మరింపని వారెవ్వరైననూ ఈ తరగతికి చెందుదురు. స్మరింపకపోవుటకు కారణమేమయిననూ కావచ్చును. అట్టివారెవరు?

ఆదికవి నన్నయభట్టారకుడు, ఇందగ్రతాంబూలమునందుకొనును, వారి భారతమునందు చింతామణి వారిదేయన్నచో దానియందును స్వామి స్మరింపబడలేదు. పదిహేను పర్వములేకబిగిని తెనిగించిన నెల్లూరు వాసియగు తిక్కనసోమయాజి స్వామిని స్మరింపలేదు. శివకవులు స్మరింపలేదు. నాటి నుండి నేటి వఱకు కల కవులలో తమ తమ సాహిత్యములందు స్వామినికాని తిరుమలనుకాని, అలమేలు మంగమ్మనుకాని స్మరింపని వారిని ఒకచోట చేర్చినచో అదియొక పెద్దశ్రేణియేకావచ్చునేమొ?

## స్మృతి కైంకర్యము

స్వామిని కాని స్వామివసించు గిరినికాని కేవలము తమసాహిత్యమునందు స్మరించివారందఱు ఈ తరగతికి వత్తురు. వారిలో మొదటివారెవ్వరైననూ వారిని స్వామి భక్తులందఱును చిరకాలము మదిలో నిల్పుకొన వలెను. అట్టివారు కవిత్రయమునందు మూడవవారైన ఎఱ్ఱాప్రెగ్గడ. ఈ మహాకవి తెనుగు సాహిత్యమందు స్వామిని స్మరించినవారిలో మొట్టమొదటివారు. భాగవతమును కవిత్రయము ఆంధ్రీకరింపకవదలినది పోతనకొరకట. నన్నయ్యకాని తిక్కన కాని శివకవులుకాని స్వామిని స్మరింపక వదలినది ఎఱ్ఱనకొరకేమో? ఆయన కీర్తిని తన ఖాతాలో జమపరచుకొను అవకాశమును శంభుదాసుడు వినియోగించుకొనెను. నృసింహపురాణమున గాలవమహర్షి యాత్రాక్రమమును వర్ణించుచు "శ్రీవేంకటాచలస్థాయి గొలిచె" అని చెప్పెను. కవిసార్వభౌముడగు శ్రీనాథుడు కాశీఖండమున "శ్రీశైలవేంకటాహోబలశోణాద్రిసాలగ్రామాది పర్వతంబులు మహానుభావంబున మీయిద్దఱకంటె నధికంబులు" అని వచించెను.

వాణి నారాణి అన్న పిల్లలమఱ్ఱి పినవీరభద్రుడు జైమిని భారతమున తన కృతిపతిని "శ్రీవేంకటాద్రి నాథ దయావర్ధితరాజ్య" అని సంబోధించెను.

నందిమల్లయ ఘంటసింగనలు వరాహపురాణమున తమకృతిపతియైన తుళువనరసింహుని

**శ్రీవేంకటాద్రి పతి సం**
**సేవాహేవాక నిపుణ! శేషాహిఫణా**
**శీవివమనకర కరిసే**
**నావిభ్రమ! యీశ్వరేంద్రునరసింహనృపా!** అని సంబోధించిరి.

ధూర్జటికవీంద్రుడు శ్రీకాళహస్తి మాహాత్మ్యమున సువర్ణముఖరి నదిని వర్ణించుచు "వేంకటాచలాలంకారంబై కాళహస్తి పుర లక్ష్మీబాలికామణికి మణి మాలికయై" అనెను.

ఇట్లీ కవులు తమ సాహిత్యములందు వేంకటాచలమునుకాని వేంకటాచలాధిపుని కాని స్మరించి స్వామి యెడల తమ భక్తిని చాటుకొనిరి. ఈ స్మృతి కైంకర్యగంగాస్రవంతికి ఎఱ్ఱాప్రెగ్గడయే గంగోత్రి. ఇక ఆ గంగ రంగత్తుంగతరంగయై సాగుటను వీక్షింపగలము.

## స్తుతి కైంకర్యము

కేవలము స్మరించుట మాత్రముగాక స్వామిని తమ ప్రబంధములలో ఒండురెండు పద్యములలో స్తుతించిన ప్రబంధ నిర్మాతలగు కవులందఱు ఈ తరగతికి చెందుదురు.

ముక్కుతిమ్మన పారిజాతాపహరణ కావ్యాదిని స్వామిని స్తుతించెను. పింగళిసూరన కళాపూర్ణోదయమున స్వామివారి జగన్మోహన దివ్యమంగళ విగ్రహమును వర్ణించెను.

తెనాలిరామకృష్ణుడు ఘటికాచలమాహాత్మ్యమున సప్తర్షులు ఘటికాచలమునకు ఏగు సందర్భమున మధ్యలో తిరుపతిని దర్శించినట్లు స్వామిని స్తుతించినట్లు వర్ణించెను. స్వామికైంకర్యములను రామకృష్ణుడు వివరించెను. సిద్ధిరాజు తిమ్మరాజు (16 శతాబ్ది) పరమయోగి విలాసమున స్వామిని స్తుతించెను. తరిగొప్పు మల్లన (16 శతాబ్ది) చంద్రభాను చరిత్రమున తిరుపతి యాత్రను వర్ణించెను. గురుభాస్కరాచార్యులు 16 శతాబ్దికాలం వాడు, వైశ్యపురాణమున స్వామిని వర్ణించెను. కాండూరి వెంకటదాసు 18శతాబ్దివాడు భార్గవపురాణమున, తక్కెళ్ళపాటె లింగన 19 శతాబ్దికాలం మదన మోహినీవిలాసమునందు, నారపరాజు కాంతకవి 19 శతాబ్దివాడు కవిజన చకోరచంద్రోదయమున స్వామిని స్తుతించిరి.

వీరందఱు తమ తమ ప్రబంధములందు పద్యములతో స్వామిని కీర్తించి స్మృతికైంకర్య పరులగు కవులకంటె మరియొక ఉన్నత సోపానమునధిరోహించిరి. దీనితో స్వామి స్వరూపమునకు సాహిత్యపు సౌందర్యములు సాహిత్య సౌధములు వెలసినవి.

## కృతి కైంకర్యము

చాలామంది కవులు తమకృతులను రాజులకుగాని, ఐశ్వర్యవంతులకు గాని కృతి యిచ్చుట క్షుణ్ణమైన మార్గమే. స్వామి భక్తులైన కవులు కొందఱు తమ కృతుల ను స్వామికే అంకితమిచ్చిరి. అట్టివారందరు ఈ తరగతికి వత్తురు.

ఇందు అగ్రపీఠము సాహితీసమరాంగణ సార్వభౌముడైన శ్రీకృష్ణదేవరాయలది. ఆముక్తమాల్యదను రాయలు స్వామికి అంకితమిచ్చెను. కవులైనచో రాజునకిత్తురు. రాజు, అందున కృష్ణదేవరాయలవంటి రాజు అంకితమీయవలెనన్న ఎవరికిచ్చుట? స్వామికెవరంకితమిచ్చినను ఉచితమే కాని రాయలిచ్చెనన్న మరింత వన్నె వచ్చినది.

16 శతాబ్దపు కవులైన మారేపల్లి వేంకటయోగి తత్త్వదీపికయను ద్విపదకృతిని, కూచిరాజు ఎఱ్ఱన సకల కథానిధానమును, వెలగపూడి వెంకనార్యుడు లీలాశుకుని శ్రీకృష్ణకర్ణామృతమును తెనుగు చేసి దానిని, రాయసము వెంకటపతి లక్ష్మీవిలాసమును, గుళ్ళికల్లు వేంకటరమణ కవి కనకరంజిత శిఖామణి పరిణయమును

కాకమాని మూర్తికవి రాజవాహన విజయమును, 17వ శతాబ్దపు కవులైన టేకుమళ్ళ రంగశాయి వాణీ విలాసవనమాలికను, ఎఱ్ఱగుడిపాటి వెంకటకవి విష్ణుమాయా విలాసమును, గణపవరపు వేంకటకవి ప్రబంధరాజవిజయ వేంకటేశ్వరవిలాసమును, చిత్రకవి రమణకవి సాంబవిలాసమును 18వ శతాబ్దపు కవులైన చల్లపల్లి వేంకనార్యుడు శ్రీకృష్ణవిలాసమును. సిరిప్రెగ్గడ ధర్మనామాత్యుడు నలచరిత్రమును చింతలపల్లి వీరరాఘవకవి మధురవాణీ విలాసమును, కృష్ణకవి శకుంతలా పరిణయమును స్వామి కంకితము చేసి యున్నారు. ఇట్లు కృతుల నంకితముగావించిన ఈ కవుల నామధేయములలో అధికములు స్వామినామాంకితములై యుండుట గమనింపదగినది.

## కథాపతి కైంకర్యము

కొందరుకవులు తమ కృతులకు స్వామినే నాయకునిగా చేసిరి. కథ స్వామి చుట్టును తిరుగును. ఇది కృతిపతిని చేయుటకంటె వరిష్ఠమైన తపము. నిరంతరము మానసబంభరము స్వామి పాదాబ్జములచుట్టును ముఖాబ్జము చుట్టును తిరుగును. తచ్చరితామృత స్వర్ధునియందు ఓలలాడును. అట్టి కృతులు క్షేత్రమాహాత్మ్యములో స్వామి విలాసములో కానవచ్చును.

16వ శతాబ్దికాలమువాడైన లింగమగుంట రామకవి వేంకటమాహాత్మ్యమును;

18వ శతాబ్దికాలమువారైన శ్రేష్ఠలూరి వేంకటార్యుడు శ్రీనివాస విలాససేవధిని;

వద్దిపర్తి కోనమరాజకవి వేంకటేశ్వరోపాఖ్యానము;

దామెర చిన వెంకటరాయకవి వేంకటాచల మాహాత్మ్యమును

19వ శతాబ్ది కాలంవారైన తరిగొండ వెంకమాంబ వేంకటాచలమాహాత్మ్యమును

చెళ్ళపిళ్ళ నరసకవి వేంకటేశ్వర విలాసమును రచించిరి.

ఇందు ప్రాయముగా 19 వశతాబ్దము వరకు ఉన్న ప్రబంధ నిర్మాతలగు కవులు స్వామిని సాహిత్యముతో ఎంతెంత సేవించిరో స్థూలముగా చెప్పుట జరిగినది. మరెందరో శతకకవులు మున్నగువారు కలరు. వారిచట ఉటంకింపబడలేదు.

## సర్వాత్మకైంకర్యము

తెనుగుసాహిత్యమునందు స్వామియను అంశమును చర్చింపబూనినపుడు పదకవితాపితామహుడు, సంకీర్తనాచార్యుడునగు అన్నమయ్యను స్మరింపకున్నచో అది మహాపరాధమగును. వారుకారణజన్ములు. వారిజీవితము సాహిత్యమయము. ఆ సాహిత్యము స్వామిమయము. ఆవంశమున కావంశమేసాటి. స్వామిపైగల

భక్తిసాహిత్యమంతయు ఒక యెత్తు. అన్నమయ్య సాహిత్యమొక యెత్తు. అయినను మిగిలిన సాహిత్యము తేలిపోవును. ఆ సాహిత్యమిపుడు స్వామినామము వలె జగమంతా ప్రసరించి జాజ్జ్వల్యమాన మగుచున్నది. కీర్తనసాహిత్యము ఒక మేలుకొలుపులా, ఉయ్యాలపాటలా, జోలపాటలా, లాలిపదములా, తుమ్మెద పదములా? చిలుకపదములా? ఒకటేమి? అది సమస్తమునైనది. ముప్పది రెండు వేల కీర్తనములు వ్రాయుట అన్న ఆ భాషాసంపద, భావసంపద, భక్తిసంపద అమేయములేకదా! సమస్త వాఙ్మయసారము అందిమిడి యుండును గదా. కావుననే అన్నమయ్య పౌత్రుడు చినతిరుమలాచార్యుడు ఇటు చెప్పెను.

**శ్రుతులై, శాస్త్రములై, పురాణకతలై, సుజ్ఞానసారంబులై**
**యతిలోకాగమవీథులై వివిధమంత్రార్థంబులై, నీతులై,**
**కృతులై వేంకటశైలవల్లభ రతిక్రీడారహస్యంబులై**
**నుతులై తాళ్ళపాక యన్నయ వచో నూత్నక్రియల్ జెన్నగున్**

నన్నయ తిక్కనాదులు స్వామిని స్తుతించని లోటు కనిపింపనీయనంతగ మేరలేని సాహిత్యమును అన్నమయ్య సృష్టించెను. క్రీ.శ. 1408 న జనియించి తొంబది యైదేండ్లు జీవించి, తెనుగుతోటను స్వామిసంకీర్తనలతో పండించిన అన్నమయ్య ధన్యుడు. జీవితమంతయు స్వామికి కైంకర్యమే. ప్రబంధ నిర్మాతల స్వామి కైంకర్యమును చర్చించు సందర్భమే యైనను ఆ సంకీర్తనలు పుట్టెడు ప్రబంధము సాటియగుటయు, స్వామికి సాహిత్య కైంకర్యము చేసినవారిలోనే కాక సర్వాత్మకైంకర్యము చేసినవారిలో తలమానికమగుటచే అన్నమయ్య నిరంతర స్మరణీయుడు, అభినంద్యుడు, అభివంద్యుడు.

పందొమ్మిదవ శతాబ్దివఱకును గల తెనుగుకవులు సాహిత్యస్రష్టలై ఏడుకొండల వాని కైంకర్యము చేసిన తీరునందు గల అంతరములు స్థూలముగా నిందు వివరింపబడినవి. స్వామికి సాహిత్య నీరాజన మందించిన కవులింకను ఎందరో ఉండి యుందురు. వారి నందఱను స్మరించుట కింకను పరిశ్రమింప వలసియున్నది. కాలాంతరమున ఆ పరిశ్రమ జరిగితీరును. ఇచట స్మరింపబడనియా మహనీయులందఱు నన్ను క్షమింతురు గాక. ఈ వ్యాసమునందలి బహువిషయములు శ్రీరాంపల్లి నాగభూషణంగారి తిరుపతి క్షేత్రసాహిత్యసమీక్ష నుండి స్వీకరించితిని. కావున వారికి కృతజ్ఞతలర్పించుకొనుచున్నాను.

# స్వామివారి న్యాయ ధర్మసమాచరణం

*కనములూరు వెంకట శివయ్య, ఐ.ఎ.యస్. (రిటైర్డ్)*

**కలౌవేంకట నాయక:**

కలియుగంలో, ఈ చతుర్దశ భువనాలకు నాయకుడు శ్రీవేంకటేశ్వరస్వామి.

ఆయన, ఎలా న్యాయ ధర్మపథాలలో నడుస్తాడో, దాన్ని చూచి ఆయన పాలనలోని వారు, న్యాయ ధర్మాలను ఆచరిస్తారు.

భగవద్గీతలో, శ్రీకృష్ణభగవానుడు, జగద్గురువుగా ఏమన్నాడు

**"యద్యదాచరతి శ్రేష్ఠః**
**తత్తదేవేతరో జనః**
**స యత్ప్రమాణం కురుతే**
**లోకస్తదనువర్తతే"**

ఇచట లోకం అంటే, చతుర్దశ భువనాలలో ఒక లోకం అని కాదు. జిల్లా అనేది ఒకలోకం. కళాశాల అనేది ఒకలోకం; కర్మాగారం అనేది ఒక లోకం.

అలా, ఒకశాఖకు ఒక విభాగానికి, ఒక సంస్థకు ఉండే పెద్దను, శ్రేష్ఠుడు అంటారు. అతడు, ఏం చేస్తాడో, ఎలా చేస్తాడో, దానిని అనుసరిస్తారు అతని క్రిందివాళ్ళు.

శ్రీవేంకటేశ్వరస్వామి లోకనాయకుడు. ఆయన అర్చారూపం ధరించేముందు, శ్రీనివాసుడుగా భూలోకంలోని పవిత్రమైన, తిరుమలపై చరించినపుడు, తాను తన లౌకిక జీవనపథంలో న్యాయధర్మసమాచరణ ఎలా చేశాడో, ముఖ్యఘట్టాలద్వారా చూద్దాం.

క్రీడాద్రి, శేషాద్రి, గరుడాద్రి అని, వివిధ నామాలతో పిలువబడే తిరుమలపై, శ్రీనివాసునికంటె ముందుగా, నెలకొని ఉన్నాడు వరాహస్వామి.

శ్రీనివాసుడు వల్మీకమునుండి, క్షతగాత్రుడై బయటికి వచ్చిన తర్వాత, తిరుమలపై నివాసం ఏర్పాటు చేసుకొనడానికి స్థలం (ఇంటిజాగా, ఈనాటి భాషలో House-site) కావలసివచ్చింది. కాని, తిరుమలపై ఉన్న నివాసస్థలం మొత్తం, వరాహస్వామి అధీనంలో ఉంది. శ్రీనివాసుడు, తనకు కావలసిన స్థలాన్ని ఆక్రమణ చేసుకోవచ్చు. (ఈనాటి భాషలో Encroachment or Illegal occupation). తనకు, అలా న్యాయవిరుద్ధంగా చేసేది ఇష్టం లేదు. రెండవ పద్ధతి, దానంగా కొంతస్థలాన్ని వరాహస్వామి నుండి పొందవచ్చు. ఇది ఎవరో 'బీదా బిక్కి' చేసుకొనే పద్ధతి.

శ్రీనివాసుడు న్యాయబద్ధంగా, ఆత్మగౌరవానికి భంగం లేకుండా, వరాహస్వామి కోరిన "మౌల్యం" (మూల్యము) ఇచ్చే పద్ధతిలో తీసుకొన్నాడు, తనకు కావలసిన నివాసస్థలం.

ఈనాటి న్యాయపరిభాషలో Lease (కౌలు) క్రింద తీసుకున్నాడు. Lease period ఎంతవరకంటే "యావత్ కలియుగం భవేత్" వరకు.

ఈ Lease (కౌలునకు), ఇవ్వవలసిన అనగా Lease Amount "మౌల్యం" ఎంతోచూద్దాం.

**"ప్రథమం దర్శనం చ స్యాత్- నైవేద్యం క్షీరసేచనం;**
**.... ఇదమేన పరం ద్రవ్యం"**

తన భక్తులు (అనగా శ్రీనివాసస్వామి భక్తులు), ముందుగా వరాహస్వామి దర్శనం చేసుకొని, ఆపై తన దర్శనం చేసుకుంటారు. తనకంటే ముందుగా, వరాహస్వామికి క్షీరాభిషేకం, నైవేద్యం సమర్పణ జరుగుతుంది.

**ఇత్యుక్తో హరిణా పోత్రీ హరయే స్థానకాంక్షిణే**
**తదా దదౌ స్థలం పాదశతమాత్రం రమాపతే:**

మరో సంఘటన చూద్దాం.

పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం నిశ్చయమయింది. పెళ్ళికి డబ్బులు కావాలికదూ; ముందుకాలాల్లో, పెళ్ళికుమార్తెకు పెళ్లికొడుకు, శుల్కం ఇచ్చే ఆచారం ఉండేది. దాన్నేకన్యాశుల్కం అంటారు. ఈ రోజులలో, పెళ్లికుమార్తె, పెళ్లికుమారునికి కట్నం ఇవ్వాలి; దీన్నే వరకట్నం అంటారు.

శ్రీనివాసుడు ఆచరించిన పద్ధతి (సంప్రదాయం) చూడండి. తాను శుల్కం ఇవ్వలేదు; కట్నం పుచ్చుకోలేదు.

శుల్కంగాని, కట్నంగాని లేకుండా, పెళ్ళి చేసుకోవడం ద్వారా భావితరాల వారికి, తాను ఒక సదాచారాన్ని ఆచరించి ప్రవేశపెట్టదలచుకొన్నాడు.

పాపం, తనవద్ద పెళ్లిఖర్చులకు డబ్బులులేవు. ధనపతిఅయిన కుబేరుణ్ణి పిలిచి, డబ్బు అప్పుగా ఇమ్మనాడు. కుబేరుడు అన్నాడు "ఈ సమస్త విశ్వం నీదే. ఇందున్న సంపద నీదే. నేను కేవలం ధనశాఖాధికారిణి, "లెక్కాపక్కా" చూచేవాణ్ణి. నేను నీకు అప్పు ఇవ్వడం ఏమిటి స్వామీ!" శ్రీనివాసుడు అన్నాడు "విశ్వంలోని సంపదను, నా స్వంత కార్యానికి ఉపయోగించుకోగూడదు. అది న్యాయ విరుద్ధం-ధర్మవిరుద్ధం యుగానుసారిణే దేహి **దేశకాలనుసారత: దేశకాలాలనుబట్టి, అమలులో ఉన్న న్యాయనిబంధనలను పాటిస్తూ నాకు ఋణం ఇమ్ము."**

నిర్ధనుడు, సధనునినుండి అప్పుతీసుకొనునప్పుడు, ఋణపత్రం వ్రాయాలి; అప్పుతీసుకునేనాడు సంతకం పెట్టాలి. సాక్షులు సంతకాలు చెయ్యాలి.

పత్రం ఇలా వ్రాయబడింది.

**"ఋణగ్రాహీ శ్రీనివాసో ధనదాయీ ధనేశ్వరః**
**ఆత్మకార్యనిమిత్తంతు కల్యాణార్థం కలౌ యుగే**
**వైశాఖే శుక్లసప్తమ్యాం విలంబే చైవ వత్సరే**
**నిష్కాణాం రామముద్రాణాం లక్షాణి చ చతుర్దశ**
**ద్రవ్యం దత్తం ధనేశేన వృద్ధిగ్రహణకారణాత్**
**సవృద్ధి దిత్సతా మూలం స్వీకృతం చక్రపాణినా**
**వివాహవర్షమారభ్య సహస్రాంతే ధనం పునః**
**దాతవ్యం యక్షరాజాయ శ్రీనివాసేన శార్జిణా**
**ఏకః సాక్షి చతుర్వక్త్రా ద్వితీయస్తు త్రిలోచనః**
**తృతీయోఽశ్వత్థరాజస్తు వేత్తి సర్వమిదం దృఢం"**

ఇది అప్పు పత్రం.

చూడండి ఎన్నివిషయాలు అవగతమౌతున్నాయో;

ఎవరుగాని, (పాలకులు, అధికారులు), ప్రభుత్వ ధనాన్ని తమ స్వంతకార్యాలకు ఉపయోగించుకోకూడదు. అప్పు, వడ్డీ ఇచ్చే పద్ధతిలో తీసుకోవాలి.

ఎన్ని ఏండ్లలో, అప్పుతీర్చబడునో చెప్పాలి. అప్పు తీసుకొనే వాడు ఋణపత్రంపై సంతకాలు చెయ్యాలి. ఋణం, ఎంత తీసుకోబడుతుందో, సూటిగా తెలియబడాలి. సాక్షులు సంతకాలు చెయ్యాలి. సంతకాలు చెయ్యడం, అప్పు, ఋణదాత, గ్రహీతకు ఇవ్వడం ఏకకాలంలో జరగాలి.

ఇలా న్యాయబద్ధమైన, సక్రమమైన పద్ధతిని పాటిస్తే దౌర్జన్యాలకు, మోసాలకు తావు ఉండదు.

ప్రజాజీవనం హాయిగా శాంతియుతంగా నడుస్తుంది.

శ్రీనివాసుడు, చక్కని న్యాయసమ్మతమైన పథంలో నడిచి, భావితరాలవారికి, మార్గదర్శి అయ్యాడు.

**నేరం - హింస**

వీటికి సంబంధించిన మరోఘట్టం చూద్దాం. నారాయణపుర ప్రభువుయొక్క ఆలకాపరి, వల్మీకంలో

ఉన్న శ్రీనివాసునికి, ఒక ఆవు, పొదుగు ద్వారా పాలుకార్చుచున్నదని, దానిని చంపడానికి గొడ్డలి విసరినాడు. దీనికి కారణం రాణి అంతఃపురంలో ఆవు పాలుసరిగా ఇవ్వడంలేదని, గోపాలుని కశాఘాతాలలో శిక్షించింది. గోపాలుడు, ఆవును శిక్షింపదలచి, కురారప్రయోగం చేశాడు.

శ్రీనివాసుడు, తనకు పాలు ఇచ్చిన, ఆవును రక్షించడానికి, కృతజ్ఞతా భావంతో, తన తలను అడ్డుపెట్టాడు. శ్రీనివాసుని శిరం నుండి, రక్తం ప్రవహించి, ఒక మడుగుగా ఏర్పడింది. రక్తపుమడుగును చూచి ఆలకాపరి అక్కడికక్కడే మరణించాడు. ఈ వార్త తెలుసుకొని, నారాయణవరప్రభువు అక్కడికి వచ్చాడు శ్రీనివాసుడు కుపితుడై ఇలా అన్నాడు.

"పాపాత్ముడా! దురాచార రాజ్యగర్వమదోన్నత! ఈ ఆలకాపరి, గోవును చంపదలచి కురారప్రయోగం చేశాడు. వాడు చేసిన పాపానికి ఫలితం, శిక్షరూపంలో నీవు స్వీకరించవలసి యున్నది.

నీ భార్య, నీ ఆలకాపరిని శిక్షించింది. వాడు గోహత్యకు పూనుకొన్నాడు.

**"యజమానః గృహే యస్తు**
**న విచారపరః భవేత్**
**స్త్రీపుత్రాద్యైః కృతం కర్మ**
**తస్యానిష్టకరః విదుః"**

ఒక గృహం యజమానియొక్క భార్య పుత్రులు సేవకులు ఇత్యాదులు చేయు పాపము, యజమానికి అశుభములచేకూర్చును. ఆ పాపకార్యానికి యజమాని శిక్షను అనుభవించాలి. అందుకని నిన్ను "పిశాచివి కమ్ము" అని శపిస్తున్నాను. శపిస్తున్నాను అనగా శాసిస్తున్నాను అని భావం.

ఇది ఆనాటి న్యాయ విధానం. ఈనాడు Master-servant Relationship లో సేవకుడు యజమాని కారణంగా, నేరం చేస్తే యజమాని కూడ నేరస్థుడు అవుతాడు.

చివరగా, ధర్మానికి సంబంధించిన మరోఘట్టం చూద్దాం.

ధర్మం వేరు, న్యాయం వేరు.

న్యాయం అన్నది చట్టాలపైన, శాసనాలపైన, శాసనాధారిత నియమావళిపైన, న్యాయసమ్మత పురాసంఘటనల పైన (Precedents) ఆధారపడి ఉంటుంది.

ధర్మానికి శాసనాలు లేవు. ధర్మం నైతిక హృదయసంబంధి. పెద్దలను గౌరవించడము- అన్నది ధర్మసూక్తి. ఎవడైన ఈ సూక్తిని పాటించకపోతే, ఏ న్యాయ స్థానంలోగాని, ఆ ఉల్లంఘనకు అభియోగార్హత లేదు.

శ్రీనివాసుడు, పద్మావతీ దేవిని వివాహం చేసుకొనే సమయంలో పాటించిన ధర్మం చూద్దాం.

ఆ రోజులలో ఎవరుగాని, ఒక భార్యకంటే, ఎక్కువమంది భార్యలను కలిగి ఉండడం న్యాయవిరుద్ధం కాదు.

శ్రీనివాసుడు, ఇదివరకే, లక్ష్మిని భార్యగా కలిగి ఉన్నాడు. ఇపుడు పద్మావతిని పెళ్ళిచేసుకోవడంలో, న్యాయోల్లంఘన లేదు. పద్మావతిని పెళ్ళిచేసుకొనడానికి, లక్ష్మీదేవి అనుమతి పొందనవసరం లేదు.

కానీ, శ్రీనివాసునిది ధార్మికహృదయం. లక్ష్మికి చెప్పకుండా ఆమె అనుమతి లేకుండా, పద్మావతిని పెళ్ళిచేసుకోవడానికి, తన మనస్సు ఒప్పుకోలేదు. న్యాయనిబంధనలు అడ్డురాలేదు. తన ధార్మికచింతన అడ్డు వచ్చింది.

అందుకని, కొల్హాపూరులో, కొన్ని కారణాంతరాలవల్ల శ్రీనివాసుని నుండి దూరముగా నున్న లక్ష్మీదేవి వద్దకు సూర్యుని పంపాడు. ఆమెనుపిలుచుకొని రమ్మనాడు.

ఆమె వచ్చాక, శ్రీనివాసుడు పద్మావతి గురించి పూర్తి వివరాలు తెలిపాడు.

ఆమె ఎవరోకాదు, పూర్వజన్మలో వేదవతి యని, ఆ వేదవతే, లక్ష్మీదేవి సీతగా అవతరించినపుడు, సీతాదేవి బదులుగా తాను మాయాసీతయై, రావణాసురునిచే అపహరింపబడినదనీ, అతని కాముక దృక్ కీలీ కీలా తప్త అయినదనీ, చివరకు తన పాతివ్రత్యాన్ని నిరూపించడానికి అగ్ని ప్రవేశం చేసిందనీ చెప్పాడు.

ఆ సందర్భంగా, ఆ వేదవతిని పెళ్ళిచేసుకొమ్మని, సీతావతారంలో ఉన్న లక్ష్మి, రామావతారంలో ఉన్న విష్ణువుని కోరిన విషయం చెప్పాడు. అపుడు, రామావతారంలో ఉన్న విష్ణువు,సీతావతారంలో ఉన్న లక్ష్మికి ఇపుడుకాదు, మరో అవతారంలో వేదవతిని పెళ్ళి చేసుకొంటాను. అని చెప్పిన విషయం గుర్తుచేశాడు.

లక్ష్మీదేవి చాలా సంతోషించింది. తాను స్వయంగా నిలబడి పద్మావతీ శ్రీనివాసుల కల్యాణం జరిపించింది.

ఇలా న్యాయం విధించకపోయినా, ధార్మిక దృష్టితో, లక్ష్మీదేవికి చెప్పి, ఆమె అనుమతితో పద్మావతిని పెళ్లిచేసుకొన్నాడు, శ్రీనివాసుడు.

ఇలా, మనకు కలియుగ నాయకుడైన శ్రీనివాసుడు- అనగా వేంకటేశ్వరస్వామి, చక్కగా న్యాయ ధర్మ సమాచరణం చేసి, మనకు మార్గదర్శి అయ్యాడు. తాను ధర్మాన్ని న్యాయాన్ని గౌరవించి, పాటించి తాను పూజ్య కర్త అయ్యాడు. పూజనీయ కారయితా అయ్యాడు.

**శ్రీనివాసాయ, ధర్మస్య**
**న్యాయస్య రక్షకాయచ,**
**కర్త్రే చ, కారయిత్రేచ,**
**దశకోటి నమాంసి మే.**

# శ్రీవేంకటాచల ఇతిహాసమాల-తిరుమలైఒళుగు గ్రంథాలలోని శ్రీవేంకటేశ్వర వైభవము

డా॥ సముద్రాల వేంకటరంగరామానుజాచార్యులు

తిరుమల తిరుపతి దివ్యక్షేత్రానికి సంబంధించినంత వరకు నిత్యం జరుగుతున్న జరుగవలసిన ఆరాధనా విధానాలు, చరిత్రగురించి ఆధునికులు వ్రాసిన గ్రంథాలేగాక దాదాపు వేయి సంవత్సరాలకు ముందునుండి అది శ్రీవైష్ణవాలయంగా ప్రసిద్ధిచెందిన వైనాన్ని ఉట్టంకించే గ్రంథాలు కొన్ని ఉన్నాయి. భగవద్రామానుజుల కాలంలోనే శ్రీమదనన్తాచార్యులవారిచే ప్రణీతమైన **శ్రీవేంకటాచలేతిహాసమాల** ఉన్నది. దీని తరువాత 16వ శతాబ్దంలో కూర్చబడిన **తిరుమలై ఒళుగు** అని ద్రావిడభాషా నిబద్ధమైన ఆలయసంప్రదాయ చరిత్ర ప్రముఖంగా పేర్కొనదగినవి. మొదటిది తిరుమలలో వేంచేసియున్న దైవం విషయంలో శైవులకు వైష్ణవులకు ఏర్పడిన వివాదాన్ని పోద్రోలడానికి భగవద్రామానుజుల కాలంలో జరిగిన విశేషప్రయత్నాన్ని తత్పర్యవసానంగా ఏర్పడిన స్థితిగతులను నిరూపించే గ్రంథం.

రెండవ గ్రంథానికికూడా ఆధారం చాలావరకు మొదటి గ్రంథమే. కనుకనే ఆ గ్రంథంలోని చాలా విశేషాలను తిరుమలైఒళుగుకూడా పునరుద్ఘాటిస్తున్నది. శ్రీవేంకటాచలేతిహాసమాలగా ప్రసిద్ధిచెందిన ఈ గ్రంథం భగవద్రామానుజుల కాలాన్ని చాలా విస్పష్టంగా కల్యబ్దాలలోను శాలివాహన శకాబ్దాలలోను నిర్దేశిస్తున్నది. అష్టోత్తర శతాధిక చతుస్సాహస్రే (4118)అని కల్యబ్దాలలోను, ఏకోన చత్వారింశ దధిక నవశతీ (939) అని శాలివాహన శకాబ్దాలలోను కాలనిర్దేశం చేసింది.

ఇలా నిర్దేశింపబడిన ఈ సమయమే ప్రస్తుత గ్రంథ నిర్మాణానికి చెందిన కాలాన్నికూడా సూచిస్తున్నది. వేంకటాచల ఇతిహాసమాలను సంగ్రథనంచేసిన అనంతార్యులు రామానుజుల శిష్యకోటిలో చేరినవారు. కనుక భగవద్రామానుజుల ప్రేరణచే వారి ఆదేశాన్ని అనుసరించి తిరుమలలో శ్రీనివాసునికైంకర్యం నిర్వహించడానికి వేంచేసినవారు. వీరు సంగ్రథనంచేసిన ఈ ఇతిహాసమాల రామానుజుల కాలానికి చెందినదే అవడంచేత శ్రీనివాసుని యథార్థస్వభావాన్ని భగవద్రామానుజానుభవ పురస్సరంగా ఆవిష్కరించడంలో పరమప్రమాణం అవుతున్నది.

ముఖ్యంగా ఈ వేంకటాచల ఇతిహాసమాల పురాణప్రసిద్ధాలైన సందర్భాలను ఎన్నింటినో వివిధ విషయాల్లో ప్రమాణంగా చూపిస్తున్నది. వేంకటాచలమాహాత్మ్యమనే పేరుతో లభిస్తున్న పురాణవిషయ సంకలనానికి ఈ గ్రంథమే ప్రేరకం కావచ్చు. ఇందులో వివిధపురాణాలు ఉట్టంకింపబడటంచూచి తరువాతి కాలంవారు ఆ పురాణమూలాలు పరిశీలించి మాహాత్మ్యనిరూపకాలైన భాగాలన్నింటినీ ఒకచోట క్రోడీకరించి ఉండవచ్చు. దీన్నిబట్టి పురాణాల్లోనివిగా చెప్పబడే భాగాలన్నీ ఎవ్వరో ఆధునికులు వ్రాసారని కొందరు నవ్యచరిత్రకారు వ్రాసిన వ్రాతలు శ్రద్ధేయాలు కావని గమనించాలి.

శ్రీవేంకటాచల ఇతిహాసమాల అనే గ్రంథమే మొట్టమొదటిగా ప్రమాణబద్ధంగా తిరుమలలో శ్రీవైష్ణవసంప్రదాయపు ఉనికిని లోకానికి అందిస్తున్నది. ఏడు స్తబకాల్లో కూర్చబడిన ఈ గ్రంథములోని 1,2, 3 స్తబకాల్లో యాదవరాజు సమక్షంలో శ్రీవేంకటాచలపతి సాక్షాన్నారాయణుడేనని బహువిధ పురాణప్రామాణ్యాన్ని ఉట్టంకిస్తూ శ్రీమద్రామానుజులుచేసిన నిర్ణయాలను విశేషంగా నిరూపిస్తూన్నది. ఆధునిక చరిత్రకారుల్లో ఇంచుమించుగా అందరూ ఈ గ్రంథంలో నిరూపింపబడిన రీతినే ఆశ్రయించి తిరుమలేశుడు నారాయణుడేనని నిరూపించారు.

## వేంకటాచల ఇతిహాసమాలనుబట్టి తెలిసే కొన్ని విశేషాలు

1. తిరుమలలో ఉన్న సన్నిధి నారాయణునిది కాదని శివునిదని లేదా స్కందునిదని లేదా శక్తిదని వాదించినవారి ముఖపిధానం చేయడంకోసం ఆనాడు ముఖ్యంగా ప్రతిపక్షులచే కారణంగా చూపబడే శంఖచక్రవిరహితత్వమనే ఆక్షేపాన్ని పారద్రోలేలా శంఖచక్రాలు ఇతరాయుధాలు స్వామిసన్నిధిని ఉంచి స్వామి తన వాస్తవస్వరూపాన్ని ఆవిష్కరించడానికి ఏ శంఖచక్రాలు అవసరమో వాటిని స్వామిస్వయంగా ఎంచుకొని ధరించేలాచేసి దుర్వాదులైవ ప్రతిపక్షులమ ఆనాటి ప్రభువుచే శిక్షించేలా చేయడం చాలా ప్రధానమైన విశేషం. ఈ విశేషం ఈ గ్రంథంలోను తిరుమలై ఒళుగులోను సమానంగా ఉన్నా వేంకటాచల ఇతిహాసమాలలో దాదాపు మూడు స్తబకాలలో చాలా విస్తారంగా వర్ణింపబడింది. ఒక విధంగా వేంకటాచల ఇతిహాసమాల అనే గ్రంథం తిరుమలలో వేంచేసిఉన్న స్వామి సాక్షాన్నారాయణుడే అని నిరూపించడం ప్రధాన లక్ష్యంగా కలిగినది. అంతేకాదు భగవద్రామానుజులకు తిరుమల తిరుపతులతోగల సంబంధాన్ని ఆయన రెండు స్థానాలను ఒకటిగానే భావించి అక్కడ ఆచరింపదగిన వివిధ నియమాలను ఏర్పరచిన వైనాన్ని నిరూపించడమే దీని రెండవ లక్ష్యం.

తిరుమలైఒళుగు గ్రంథం భగవద్రామానుజులతోపాటు **మణవాళమామునులకు** తిరుమలతోగల సంబంధాన్నికూడా విశేషంగా ఉట్టంకించే దవడంచేత ముఖ్యంగా ఈ నాటికీ అనువర్తిస్తున్న అనేక ఆచారవిచారాల వ్యవస్థకు దర్పణంలాంటిది. ఈనాడు ఈ సాంప్రదాయికార్చనా విధానాన్ని అనుసరిస్తున్నారా లేదా అనే విషయం చాలామందికి అనుభవదూరమే. అయినా ఇలా ఉండేది అనే చారిత్రిక వాస్తవాలను అందరూ గుర్తించేందుకు ఈ రెండు గ్రంధాలు ఎంతో ఉపకరిస్తాయి.

## తిరుమలలో వేంచేసి ఉన్న స్వామి సాక్షాత్తు నారాయణుడే.

ఇది వరకెన్నడూ లేనంతగా ఇటీవలకాలంలో తిరుమలలో వేంచేసి ఉన్న స్వామివిషయంలో అనేకానేక దుర్వాదాలు అశాస్త్రీయంగా ఆవిర్భవిస్తున్నాయి. ఇవేవీ క్రొత్తకాకపోయినా ఎంతో ప్రమాణబలంతో ఈ దుర్వాదాలను ఖండించినా ఇంకా ఆ కాలంచెల్లిన వాదాలనే కొందరు పట్టుకొని వ్రేలాడుతూ ఆత్మవంచన

పరవంచన చేస్తున్నారు. స్వామికి చెందిన మూలవిరాట్టుకు గల శిల్పనిర్మాణంలోని కొన్ని లక్షణాలనుబట్టి శివుడని స్కందుడని శక్తి అని హరిహరాత్మకమూర్తి అని ఇలా రకరకాలుగా భావించే వారికి వారనుకుంటున్న దేవతామూర్తులలోని కొన్ని విశేషలక్షణాలు వైష్ణమూర్తికికూడా ఉండడంలో అభ్యంతరం ఎంతమాత్రం లేదని పురాణాగమాదులు స్పష్టంగా పేర్కొంటున్నా, పురాణాలన్నీ ఏకకంఠంగా తిరుమలలో కొలువున్నస్వామి శ్రీనివాసుడేనని ఉద్ఘోషిస్తున్నా, ఆళ్వారులు ప్రాచీనద్రవిడమహాకవులు మహావిష్ణువేనని పాడినా నేటికీ కుశంకలు చేస్తూ ప్రజలను ప్రక్కత్రోవను పట్టించే వారికి అలాగే నిర్మత్సరబుద్ధితో తత్వాన్ని విచారించేవారికి శ్రీమదనంతార్యభాషితమైన శ్రీవేంకటాచల ఇతిహాసమాల, అలాగే తిరుమలైఒళుగు అనే రెండుగ్రంధాలు తత్త్వదర్శనాన్ని చేయిస్తాయి. ప్రస్తుత వ్యాసంలో ఈ విషయాన్నే మరింత విశదంగా భావన చేద్దాం.

## యాదవరాజుముందు భగవద్రామానుజులు చేసిన వాదన-తత్త్వనిర్ణయం

వాస్తవానికి తిరుమలేశుడు శ్రీనివాసుడేనని ఈ నాడు నిరూపించవలసిన అగత్యంగాని ఆవశ్యకతగాని లేకపోయినా వాస్తవాలను పెద్దల నిర్ణయాలను సదస్యుల ముందుంచవలసిన అవసరం ఉంది కనుక తత్త్వజిజ్ఞాసువుల జిజ్ఞాసను తీర్చడానికి పై గ్రంధాలలో ప్రమాణ పురస్సరంగా నిరూపితాలైన విషయాలను ఇక్కడ ఉట్టంకించడం జరుగుతున్నది.

## తిరుమలేశుడు శ్రీనివాసుడే శివుడుకాదు

ప్రతిపక్షులవాదం:- స్వామికి శివప్రీతికరాలైన బిల్వపత్రాలతో అర్చనం జరగడంచేత ఈయన విష్ణువు కాదు. అంతేకాదు దీర్ఘలంబమాన జటలు శివునకేతప్ప విష్ణువునకు ఉండవు. పైగా శంఖచక్రాలు మధ్యలో వచ్చినవే తప్ప ముందునుంచీ లేవు. అంతేకాదు చాలా ఎత్తైన మకుటం కలిగి ఉండడం నాగాభరణం ధరించడం ఇవన్నీ శివత్వ నిదర్శకాలే. ప్రత్యక్షంగా దివ్యాయుధాలు ధరించకపోవడంకూడా గమనించాలి.

ఈ వాదాన్ని అనేకానేక పురాణప్రమాణాలతో శ్రీరామానుజులు నిరాకరించారు. విష్ణువుకుకూడా హారీతస్మృత్యాది ప్రామాణ్యాన్నిబట్టి బిల్వార్చన చేయవచ్చు.

**పౌరుషేణ విధానేన మూలమంత్రేణ వా యజేత్ ।**
**శతపత్రైశ్చ జాతీభిః తులసీ బిల్వ పుష్కరైః ॥** ఇదే గ్రంథంలో

**లక్ష్మీనారాయణం దేవం భార్గవే వాసరే నిశి ।**
**అఖండ బిల్వపత్రైశ్చ కోమలైః తులసీదళైః ।**
**అర్చయేత్ మంత్రరత్నేన వామాంకస్థ శ్రియాసహ ।**
**అఖండ బిల్వపత్రైర్వా పద్మపత్రైర్చ్వతేవవా ।**

**శ్రీసూక్త పురుషసూక్తాభ్యాం ప్రత్యర్చం జుహుయా త్తత: ॥**

ఇలాగే వరాహపురాణ ప్రథమభాగంలోని 13వ అధ్యాయంలో శ్రీనివాసుని బిల్వపత్రాలతో అర్చించినట్లు చెప్పబడి ఉంది.--

**అర్చయంతిజగన్నాథం తథా బిల్వదళైరపి ।**
**తులస్యాప్పదళైశ్చాపి కృష్ణై: శ్వేతైశ్చ యోగిన: ॥**

ఇలాగే 9వ అధ్యాయంలోని లక్ష్మీస్తుతిలో --

**నమో బిల్వ వనస్థాయై విష్ణుపత్న్యై నమోనమ: ।** అని
అక్కడే లక్ష్మీ వచనాల్లో **అఖండై: బిల్వపత్రైర్మా మర్చయన్తి నరా భువి**

అని స్పష్టంగా విష్ణువుకు లక్ష్మికి బిల్వపత్రార్చనం విధింపబడి ఉంది.

2. దీర్ఘజటలు కలిగి ఉండడం అనేదికూడా చాలాపురాణాల్లో చెప్పబడింది. ఆళ్వారులుకూడా అలాగే పాడారు.

పాంచరాత్ర సాత్త్వత సంహితలో చతుర్విధ వర్ణాలతోకూడిన స్వామిని వర్ణిస్తూ కృష్ణవర్ణనరూప సందర్భంలో -
**కృష్ణ మిందీవరశ్యామం ఊర్ధ్వబాహుం జటాధరమ్** -- అని చెప్పబడింది.

వరాహపురాణములోని ద్వితీయభాగములోని చతుర్థాశ్వాసములో పద్మావతీ వివాహప్రస్తావమున --
**సితోష్ణీష-లలాటాంకనతి దీర్ఘ జటాధరమ్** -- అని చెప్పబడింది.

ఇలాగే భవిష్యోత్తరంలో --

**కబరీకృత కేశేషు రక్తవస్త్రం సువేష్ట్య చ**

**లంబితై: పుష్పజాలైశ్చ స్కంధగై: పరిభూషిత:** -- అని దీర్ఘకేశవర్ణనం కనుపిస్తుంది.

వామనపురాణంలోని 15వ అధ్యాయంలో --

**మూర్ధజై: కుంచితైశ్చాపి నీలైర్మృదుతరై స్తథా ।**

**లంబమానై: వినిస్స్రానై: కిరీటాత్ శుభదర్శనాత్ ॥**

అని విస్పష్టంగా కిరీటందాటి భుజాలపై వ్రేలాడుతూ కేశాలున్నాయని వర్ణింపబడింది. ఉదరబంధంగా నాగాభరణం ఉండడం కూడా. దీన్నే ఆళ్వారులు (మహాయోగి) తమ మూన్ఱాంతిరువన్దాదిలో --

**తాళ్ శడైయుమ్ నీణ్ముడియుమ్ ఒణ్ మళవుమ్ శక్కరముమ్,**

**శూళరవుమ్ పొన్నాణుమ్తోన్రుమాల్ - శూళుమ్**

**తిరుణ్డరవిపాయుమ్ తిరుమలైమేలెన్దక్కు**

**ఇఱణ్డురువు మొన్రా ఇశైన్దు.**

చుట్టూ సమృద్ధములైన కొండకాలువలు ప్రవహిస్తున్న తిరుమలలో వ్రేలాడుతున్న జడలు, పొడవైన కిరీటం, సుందరమైన గొడ్డలి, చక్రమును, నడుముకు చుట్టుకొన్న నాగము, స్వర్ణమయమైన మొలత్రాడు కలిగి రెండు ఆకృతులు ఒకచోటచేరినవా అన్నట్టున్న వైనం ఆశ్చర్యం గొలుపుతుంది.

**లంబజటాద్రాఘీయః కోటీరే లోహపిండచక్రేచ ।**

**శ్లాఘ్యే, వేష్టిత ఫణధర-కాంచన సూత్రే, అహో విరాజతే ॥**

అని స్వామికిగల దీర్ఘలంబమాన జటల గురించి ప్రస్తావించారు. కనుక లంబమాన జటాధరత్వం ఎవ్వరికీ అసాధారణ లక్షణం కాదు. స్వామికి ఉండని లక్షణం అసలేకాదు. అలాగే నాగాభరణంకూడా ఇక్కడ స్పష్టం.

3. ఇక నాగాభరణత్వం

ఇదికూడా పురాణాది సమ్మతమే. పద్మపురాణంలోని శ్రీనివాసావిర్భావఘట్టంలో--

**నాగైరభినవాకాల్పై తపనీయమయూరాంశుకైః ।**

**సుమనోభి ర్దివ్యగంధైః దివ్యలేపనచందనైః ॥**

ఈ నాగాభరణత్వాన్ని భవిష్యోత్తరపురాణంకూడా విస్పష్టపరుస్తున్నది--

**ఇంద్రనీలమణిశ్యామ రమణీయాహి భూషణైః ।**

**శంచక్రాభయావామ భూషితైశ్చ భుజోత్తమైః**

ఇంద్రనీలమణుల్లా శ్యామవర్ణంకలిగి అందంగా ఉన్న నాగభూషణాలతో శంఖచక్రాయుధభూషణాలైన భుజాలతో ఒప్పుతున్నాడని అభిప్రాయము.

ఇలా నాగాభరణత్వంకూడా నారాయణునికి అపూర్వం కాదు. అయితే ఇది సార్వత్రికం ఎందుకు కాదు అని ప్రశ్న. దీనికి ఒక ఐతిహ్యాన్ని తిరుమలై ఒళుగు నిర్దేశిస్తున్నది. ఒకప్పుడు వీరనరసింహనామధేయుడైన

ఒక ప్రభువు గోపుర నిర్మాణంచేయ నుద్యమించగా ఆ ప్రభువు కలలో ఒక సర్పం అగుపించి నీవు నాశరీరాన్ని బాధిస్తున్నావు అని పేర్కొంటూ వేంకటేశ్వరుని శ్రీహస్తానికి చుట్టుకొన్నదట. కలనుంచి మేల్కొనిన ప్రభువు ఇది సాక్షాత్తు అనంతుడే తనకు అగుపించి పల్కినమాటగా గుర్తించి ఆ సన్నివేశానికి గుర్తుగా స్వామిహస్తానికి ఒక నాగాభరణం చేయింపగా దాన్ని విన్న భగవద్రామానుజుల వారు రెండవ హస్తానికికూడా నాగాభరణం చేయించినారట. ఈ విధంగా స్వామి నాగాభరణుడవటంలో ఔచిత్యంకూడా స్పష్టమవుతున్నది.

4. శంఖచక్రాలు ధరించకపోవడానికికూడా కారణాన్ని పురాణాలు ఉట్టంకించిన వైనాన్ని వేంకటాచలేతిహాసమాల స్పష్టపరుస్తోంది. తొండమాన్ చక్రవర్తికి శత్రుజయం కలగాలనే భావనతో స్వామియే స్వయంగా తన ఆయుధాలను ఇచ్చినాడని కనుకనే శంఖచక్రాలు లేవని గుర్తించి భగవద్రామానుజులు శంఖచక్రాలను ధరింపచేసారట స్వామిచేత.

5. స్వామి స్కందుడు కాదు-- స్వామి పుష్కరిణి అనే వ్యవహారాన్నిబట్టి స్వామి అనే పదం కుమారస్వామికే అన్వయిస్తుంది కనుక ఇక్కడ సాక్షాత్కరిస్తున్నదైవం స్కందుడనేనని మరొక వాదం. దీన్నికూడా భగవద్రామానుజులు ఖండించారు. కుమారస్వామి తపస్సు చేసినంతమాత్రంచేత పుష్కరిణి తీరంలో వేంచేసి ఉన్నది స్కందుడే కానక్కరలేదని సర్వ పుష్కరాలకు స్వామివలే ప్రధానమైంది కనుక ఈ పుష్కరిణిని స్వామిపుష్కరిణి అన్నారు తప్ప మరొకటి కాదు. అంతేకాక స్వామిని దర్శించడానికి వచ్చిన బ్రహ్మరుద్రులలో ఒక్కడుమాత్రమే స్కందుడు కనుక ఆయనగాని మరియే ఇతరదేవతగాని ప్రతిష్ఠితమైనట్లు పురాణం చెప్పడంలేదు కనుక, పైగా నారాయణుడే స్వామిపుష్కరిణీతీరంలో అర్చామూర్తిగా ఆవిర్భవించాడని పురాణాలన్నీ ఐకకంఠ్యంగా ఉద్ఘోషిస్తున్నాయి గనుక ఈయన నారాయణుడే నన్న తమ నిర్ణయాన్ని ప్రమాణబద్ధం చేయడానికి భగవద్రామానుజులు ఎన్నో పురాణవచనాలను ఉట్టంకించారు.

6. శ్రీనివాసుడు హరిహరావతారమనే వాదాన్నికూడా భగవద్రామానుజులు నిరాకరించారు. ఆయా పురాణాల్లో కనుపించిన వచనాలకు పైకి కనుపించే అర్థాలనుబట్టి కొందరు చేసిన వివిధాక్షేపాలకు సమాధానాలు ఇచ్చారు.

**అష్టమీందుకలాధార లలాట స్ఫూర్వపుండ్రకః**:- పద్మపురాణ వచనాన్నిబట్టి స్వామికి హరిహరావతారత్వం ఉన్నదన్నమాట సరైనదికాదని - ఇక్కడ అష్టమీందు కలాధారం అన్నపదానికి **అష్టమీందుకలా ఇవ ఆధారః మూలం యస్య** అనే అర్థం చెప్పాలని అష్టమినాటి చంద్రకళవలె ఉన్న ఆధారం కల రేఖాద్వయవిశిష్టమై మధ్య ఛిద్రంకల ఊర్ధ్వపుండ్రమని అర్థాన్ని వివరించారు. ఇదే సందర్భంలో స్వామికి ఉంచవలసిన ఊర్ధ్వపుండ్రాన్ని గురించి విశేష వివరణాన్ని ఈ గ్రంథం ఆవిష్కరిస్తున్నది.

ఇలా మూడవ స్తబకం చివరివరకు శ్రీనివాస తత్త్వనిరూపకంగా భగవద్రామానుజుల వాదనగా సాగిన ఈ భాగం చాలా ప్రధానమైంది.

## ఈ గ్రంథంలో నిరూపించబడిన ఇతర విశేషాలు - శుక్రవారాభిషేకం

వేంకటాచలపతికి అనునిత్యం అభిషేకం జరిగేదని భగవద్రామానుజుల కాలంనుండి భగవద్దివ్య మంగళవిగ్రహానికి జరుగవలసిన ఉపచారాలన్నీ సక్రమంగా జరిగే అవకాశం కొరతవడుతున్న కారణంగా శ్రీవైఖానసాగమప్రోక్త విధానంగా

**సహలక్ష్మ్యా అభిషేకస్తు వాసవే భార్గవే హరేః ।**

**సాన్నిధ్యకారీ సతతం సర్వసంపత్ప్రదాయకః** (ఆనంద సంహిత) -- అన్నట్లు శుక్రవారం జరపడం ఆరంభమైంది.

వేంకటాచలమాహాత్మ్యంలోకూడా ఇలానే చేయడం అనేది సంప్రదాయంగా నిర్దేశింపబడడంచేత (190) శుక్రవారమే అభిషేకంచేసి.... వెనుక చెప్పిన విధంగా ఊర్ధ్వపుండ్రం ఏర్పరచడం జరిగింది.

ఇలా ప్రతీశుక్రవారం భగవదభిషేకం తరువాత భగవంతుని వక్షస్థలంపై అలంకరింపబడిన కనకమణికంఠికలోగల అమ్మవారిని అభిషేకించడానికి కనకకంఠిక కంఠంనుండి తీయడం ఈ కారణంగా నిత్యానపాయిని అయిన అమ్మతో స్వామికి ఏర్పడిన విరహాన్ని ఉపశమింపచేయడానికి శ్రీగోదాదేవి అనుగ్రహించిన **నాచ్చియార్ తిరుమొళి**ని అనుసంధానం చేసేలా కట్టడిచేయడం భగవద్రామానుజులే చేసారు. ఈ విషయం తిరుమలైఒళుగులోకూడా విశదంగా వివరించబడింది.

## భగవద్రామానుజులు నిర్వహించిన విశేషకృత్యాలు

భగవద్రామానుజులు ఎన్నో విశేషకృత్యాలను తిరుమలలో నిర్వహించినట్లు ఇతిహాసమాల స్పష్టపరుస్తున్నది (నాల్గవస్తబకంలోని విశేషాలు).

1. అప్పటివరకు తిరుచానూరులో జరుగుతూఉన్న బ్రహ్మోత్సవ ప్రక్రియ సాకల్యంగా కొండపైననే జరిగేలా వీథినిర్మాణాదులు చేయించి ఉత్సవాన్ని కొండపై జరిపించారు భగవద్రామానుజులు.

2. ఉత్సవబేర కౌతుకబేరాలుగా ఉన్నవాటికి అప్పటివరకు జరుగుతున్న ఉపచారాలను పరస్పరం వినిమయంచేసి జరపడానికి తగినట్లు పునః ప్రాణధారణ ప్రతిష్ఠాదులు చేయించి వాటి ఆరాధనాక్రమాన్ని నియతం చేశారు భగవద్రామానుజులు. భగవద్దివ్యనగరాభివృద్ధికొరకు ఈ మార్పు ప్రాచీన ఐతిహ్యాన్ని పురస్కరించుకొని చేయవలసి వచ్చిందని ఇతిహాసమాల చెబుతున్నది.

3. భగవత్సన్నిధిలో పంచసంస్కారపరులైన బింబాధరులనే వైఖానస భాగవతోత్తముని వంశానికి చెందినవారే శ్రీవేంకటేశ నిత్యారాధనచేయాలని భగవద్రామానుజులు నియమించారు.

4. తిరుమలగిరి సాక్షాత్తు స్వామియేనన్న భావనతో తమ పాదస్పర్శ దానికి తగులరాదనీ భావించిన దివ్యసూరులైన ఆళ్వారుల సన్నిధిని తిరుపతిలో ఏర్పరిచారు భగవద్రామానుజులు.

5. భగవద్రామానుజులు నారాయణపురవాసియైన యాదవరాజును ప్రోత్సహించి గోవిందరాజసన్నిధిని నగరాన్ని నిర్మింపజేసిన వైనాన్ని ఉట్టంకించే ఒక ఐతిహ్యాన్ని ఇతిహాసమాల స్పష్టపరుస్తున్నది. క్రిమికంఠునిగా ప్రసిద్ధిచెందిన ఒక చోళప్రభువు చిదంబరంలో వేంచేసియున్న శ్రీగోవిందరాజ పెరుమాళ్ళకు ద్రోహంచేసి స్వామిమూర్తులను సముద్రంలో పడవేసిన శేషశాయియైన స్వామిని గురించి విన్న భగవద్రామానుజులు ఆ విగ్రహాన్ని వెలికితీయించి తిరుమలకొండకు దిగువున ప్రతిష్ఠ చేయించి నిత్యారాధనా వ్యవస్థ నేర్పరచి ఆ ఆలయానికి చుట్టూ వీథులతో ఒక నగరాన్ని నిర్మింపచేశారు. అది అప్పుడు రామానుజపురంగా ప్రసిద్ధిచెంది ఇపుడు తిరుపతిగా వ్యవహరింప బడుతున్నదని ఇతిహాసమాల చరిత్రకారులకు తెలియని చరిత్రను ఆవిష్కరిస్తున్నది. శ్రీగోవిందరాజస్వామికి తిరుమలలో వేంచేసియున్న శ్రీనివాసునికి భేదం లేదని భగవద్రామానుజుల భావన.

ఈ సన్నివేశాన్నిబట్టి భగవద్రామానుజులకు తిరుపతిక్షేత్రంతోను అక్కడవేంచేసియున్న గోవిందరాజస్వామితోను అవిభజనీయ సంబంధం ఉన్నదని అవగత మవుతున్నది. ఇంతవరకు నాల్గవ స్తబకంలో ఈ అంశాలన్నీ వివరింపబడ్డాయి. 5వ స్తబకంలో తిరుమలలో దివ్యాలయంలో వేంచేసియున్న బంగారుబావి, పూలబావి ఈ రెండింటికి సంబంధించిన వృత్తాంతాన్ని పురాణ ప్రశస్తి నిరూపణ పురస్సరంగా వివరించింది ఇతిహాసమాల. ఈ సందర్భంలో ఆళ్వందారుల విశేషప్రస్తావన ఉన్నది. ఒకప్పుడు వేంకటాచల యాత్రకు విచ్చేసిన ఆళ్వందారులు అప్పటికి శ్రీనివాసుని కైంకర్యంలో ఉన్న తిరుమలనంబి పాపనాశన తీర్థంనుండి భోగశ్రీనివాసాభిషేకానికై తీర్థాన్ని తీసికొనిరాగల పరిస్థితి లేనపుడు ఆళ్వందారులు ఈ పరిస్థితిని గమనించి అమ్మను ప్రార్థించి పూర్వమే రంగదాసునిచే నిర్మింపబడిన బంగారుబావిలోని తీర్థాన్నే అభిషేకానికి వినియోగింపుమని ఆదేశించారు. అప్పటినుండి పాపవినాశనాది తీర్థాలు రాకపోయినా ఆరాధనాభిషేకాదులలో విలంబం జరుగరాదని వ్యవస్థచేశారు. ఈ విధంగా పాపనాశన తీర్థము దానికి ప్రతినిధిగా శ్రీనివాసుడే నియమించిన ఆకాశతీర్థము ఈ రెంటితోపాటు పరమాచార్యులైన ఆళ్వందారులు ఆదేశించిన ప్రకారం బంగారు బావిలోని తీర్థము అభిషేకానికి వినియోగపడుతూ ఉన్నాయి. ఈ బావిలోనే పూర్వం భూదేవి వేంచేసియుండటమేకాక స్వయంగా మరొక బావినికూడ నిర్మింపచేసింది. దానినే ఈనాడు పూలబావి అంటున్నారు. ఈ రెండు బావులకుగల ప్రాశస్త్యాని ఇతిహాసమాల పురాణప్రమాణ పురస్సరంగా నిరూపించింది. ఇక్కడే నిర్నిద్ర తింత్రిణీవృక్షం, చంపకవృక్షం అనే రెంటిని గురించిన ప్రస్తావన ఇతిహాసమాల చేస్తున్నది. బ్రహ్మాండపురాణాది ప్రామాణ్యాన్నిబట్టి మొట్టమొదటగా వేంకటాచలానికి వచ్చిన రంగదాసు ఆరాధకుడగు వైఖానసాచార్యుడు మరొక బ్రాహ్మణోత్తముడు అనే ముగ్గురు స్వామిపుష్కరిణీతీరంలో ఈ చింతచెట్టు క్రిందనే ఒక పుట్టలో శ్రీనివాసుని సాక్షాత్కరించి శ్రీమూర్తిని వెలికితీసి పశ్చిమభాగాన స్థాపించారని తెలుస్తున్నది. ఈ

చింతచెట్టు ఒక్కొక్క కొమ్మకు ఒక్కొక్క వైచిత్రిని దర్శింపచేస్తున్నదని పురాణాలు ఉద్ఘోషించిన వైనాన్ని ఇతిహాసమాల ఉట్టంకించింది. ఈ ఐదవస్తబకంలోనే ఇదివరలో పేర్కొన్న స్వర్ణమయ నాగాభరణ వృత్తాంతంకూడా చెప్పబడింది. ఈ స్తబకంలో చెప్పబడిన వృత్తాంతాల్లో భగవద్దివ్యాలయంలో వేంచేసియున్న నృసింహస్వామి వృత్తాంతంకూడా గమనింపదగి ఉన్నది. ఈ స్వామి సాక్షాత్తు పరమేశ్వరునికి సాక్షాత్కరించినవాడు. స్వామిపుష్కరిణి పశ్చిమతీరంలోనే ఒక మందిరంలో ప్రతిష్ఠితుడై ఆరాధింపబడుతున్న స్వామియొక్క ఉగ్రదృష్టిని నివారించడానికై భగవద్రామానుజులు ఈయనకు నిర్వర్తింపవలసిన ఆరాధనాదులు సంక్షిప్తంచేసి ఈయన శ్రీనివాసునితో ఐక్యాన్ని పొంది క్షేత్రాధిపతిగా వేంచేసియున్న వైనాన్ని దృష్టిలో ఉంచుకొని శ్రీనివాసుని దివ్యాలయంలోనే ఈశాన్యభాగంలో ఆనందనిలయ దివ్యవిమానాభిముఖంగా పునప్రతిష్ఠించడం ఉచితమని భావించి ఆ విధంగానే వ్యవస్థను చేశారు. ఇదే స్తబకంలో వేంకటనాథుని చిబుకంపై సమర్పింపబడే పచ్చకర్పూరము దివ్యాలయ గోపురద్వారానికి కట్టి ఉంచిన ఇనుపగునపము అనేవాటి వృత్తాంతం కూడా వర్ణింపబడింది.

## భగవద్రామానుజులు చేసిన ఆరాధనలోని మార్పులు

వెనుక నాల్గవ స్తబకంలో ఉత్సవబేర కౌతుకబేరాలకు జరిగే ఆరాధనలోను అభిషేకాదులలోను భగవద్రామానుజులు పరివర్తన చేసినట్టు చెప్పడం జరిగింది. ఇక్కడ విశేషించి ధనుర్మాసంలో స్నానబేరంగా ఉన్న భోగశ్రీనివాసుని శయనబేరంగా చేసి ఆ స్వామికే ప్రతిదినము దివ్యపర్యంక శయనభోగలీలారసానుభవము శ్రీవైఖానసాగమోక్తప్రకారంగా జరుగుతుండగా వైఖానసశాస్త్రంలోనే ఒక చోట ధనుర్మాస సమయంలో శ్రీకృష్ణునకు శయ్యాభోగలీలానిర్వర్తనం జరిపేవిధానం ఉండటాన్ని గమనించి ఇలాంటి భోగాన్ని ఆశించిన గోదాదేవి హృదయాభిప్రాయానికి తగ్గట్టుగా ఆమె తిరుప్పావైలోను నాచ్చియార్ తిరుమొళిలోను వ్యక్తపరచిన ప్రీత్యతిశయానికి తగినట్టు ఈ వ్యవస్థను భగవద్రామానుజులు ఏర్పరచారు.

ఇలాగే స్వామి పుష్కరిణీతీరాన వేంచేసియున్న వరాహస్వామి వృత్తాంతంకూడా ఈ స్తబకంలో విశేషంగా ప్రస్తావింపబడింది. ఇక్కడ వరాహస్వామికి వేరుగా బలిపీఠార్చన నిత్యహోమము మహోత్సవము మున్నగునవి లేకపోవటానికిగల కారణాన్ని వైఖానసశాస్త్ర ప్రామాణ్యాన్ని పురాణప్రామాణ్యాన్ని అనుసరించి ముందుగా వరాహస్వామి విమానతీర్థాదుల సేవయే యాత్రాపరులకు ప్రథమకర్తవ్యంగా భగవద్రామానుజులు వ్యవస్థచేశారు. తులామాసంలో శ్రవణానక్షత్రాన వరాహజయంతినాడు విశేషోత్సవం జరపాలని అలాగు ఉత్సవమూర్తిని ఏర్పరచి ఒక రోజు అధ్యయనోత్సవంకూడ జరపాలని భగవద్రామానుజులు కట్టడిచేశారు.

ఇక ఆరవ స్తబకంలో మేనమామగారైన భగవద్యామునుల ఆదేశంపై స్వామికైంకర్యం నిర్వర్తించిన తిరుమలనంబి అనే శ్రీశైలపూర్ణుల వృత్తాంతం విశేషంగా వర్ణింపబడింది. ఇదే సందర్భంగా ప్రస్తుత వేంకటాచల

ఇతిహాసమాలను సంస్కృతభాషలో సంగ్రథనం చేసిన శ్రీశైల అనంతార్యుల వృత్తాంతంకూడ విశేషంగా ప్రస్తావించబడింది. ఈ మహానుభావుడైన అనంతార్యుడు భగవద్రామానుజుల ఆదేశంపై తిరుమల వేంచేసి పత్నీసమేతుడై విశాలనందనవనాన్ని పెద్ద తటాకాన్ని వన మధ్యంలో ఒక బావిని నిర్మించి శ్రీరామానుజ నామాన్ని ఉంచినట్లు ఈ వృత్తాంతం చెబుతున్నది. ఈ ఉద్యానవనంలోనే రాజదంపతీ వేషధారులైన పద్మాపతీ శ్రీనివాసులు విహరించేవారని చెప్పబడింది. ఇక్కడ అనంతార్యులకు భగవద్రామానుజులకుగల సంబంధాన్ని తెలియజేసే కథలు ఎన్నో విస్తారంగా నిరూపింపబడ్డాయి.

ఇక చిట్టచివరదైన ఏడవస్తబకంలో వేంకటాచలమాహాత్మ్య పరిశీలనవలన తెలియదగిన అనేక విశేష ధర్మాలను ఆయా పురాణాలనుండి సంగ్రథనంచేసి నిరూపించడం జరిగింది. వాటిలో ఒకటి వేంకటాద్రిపై పుష్పమాలాది స్వీకరణ నిషేధ వృత్తాంతం, భగవద్రామానుజులే స్వయంగా తిరుమలలోని ఆరాధనా విధానాన్ని పర్యవేక్షించేందుకు విష్వక్సేన నామకుడైన ఏకాంగిని నియమించడం, శ్రీశైలపూర్ణులు తమకు అనుగ్రహించిన శ్రీరామచంద్రఅర్చామూర్తిని ఆ యేకాంగి ఆరాధించేలా కట్టడిచేయడం జరిగింది. అంతేకాక చిత్రకూటం (చిదంబరం)నుండి ఉద్ధరించి తెచ్చి తిరుపతిలో ప్రతిష్ఠించిన గోవిందరాజస్వామికి వైభవం నిర్విఘ్నంగా సాగేలా కట్టడిచేయడం. ఇవి అన్నీ జాగరూకతతో సాగేలా యాదవరాజు ఆజ్ఞాపించడం మొదలైనవి చెప్పబడ్డాయి. ఈ నాటికి కొనసాగుతున్న తిరుమల జీయర్ వ్యవస్థకు, ఏకాంగి వ్యవస్థకు, ఆచార్యపురుషుల మర్యాదకు సంబంధించిన ఎన్నో విశేషాలు ఈ వేంకటాచల ఇతిహాసమాల ఈ స్తబకంలో ఉట్టంకించింది. దీని తరువాత ఆవిర్భవించిన తిరుమలైఒళుగు అనే గ్రంధానికి ఇదే ఆధారమని గుర్తింపవలసి ఉంది.

ఇక తిరుమలైఒళుగు అనే గ్రంథం ఇతిహాసమాలలోని విశేషాలనే సంగ్రహంగాను విస్తారంగానూ నిరూపిస్తూ భగవద్రామానుజులు ఆ నాడు ఏర్పరచిన దివ్యప్రబంధ అధ్యయన వ్యవస్థ మర్యాద ఆరాధనాక్రమం మున్నగు ఎన్నో సూక్ష్మ విషయాలను, ఆలయ ఆచారాలను ఉట్టంకించింది. చారిత్రకంగా ఇతిహాసమాలలాగానే తిరుమలైఒళుగు కూడా పర్యాలోచింపదగిన గ్రంధం. ఇదే కోవకు చెందిన కైంకర్యరత్నావళి మున్నగు గ్రంథాలు ఎన్నో ఉన్నాయి.

**తిరుమలై ఒళుగులోని కొన్ని విశేషాలు :-**

ఈ గ్రంథం ద్రవిడ భాషలో వ్రాయబడింది. పన్నెండవ శతాబ్దం నుండి 16వ శతాబ్దం వరకూ ఏర్పడిన సంఘటనల గురించి ప్రస్తావించడంచేత, ఇది 16 శతాబ్దం తర్వాతనే కూర్చబడినదని చెప్పాలి. ఇది భగవద్రామానుజుల కాలానికి చెందిన చాలావిశేషాలను వేంకటాచలేతిహాసమాల నుండి సంగ్రథనం చేసింది. ముఖ్యంగా చారిత్రక విశేషాలకంటే ఆలయంలో సాగుతున్న చాలా సంప్రదాయాలను, మర్యాదలనూ ఈ గ్రంథం ఉట్టంకించి, అక్కడ సాగుతున్న, సాగవలసిన ఆరాధనా విశేషాలను చదువరులకు ఎరుకపరుస్తున్నది.

ముఖ్యంగా భగవద్రామానుజుల కాలంనుండి లేదా ఆయనకు ముందునుండి ఆచారంలో ఉన్న, దివ్య ప్రబంధానుసంధాన ప్రకారాలు ఇందులో చాల విశేషంగా చెప్పబడ్డాయి. ఆయా విశేష సమయాలలో అనుసంధానం చేయవలసిన దివ్యప్రబంధ పాశురాలు, అవి అనుసంధానం చేయడానికి గల కారణాలు, ఇవన్నీ చాలా విస్పష్టంగా నిర్దేశించి ఈ విధానం ముందుముందు మార్పు జరుగకుండా ఒక నియమనం చేస్తున్నది. ఈ పద్ధతినే ఆచార్యులు బహుమాన పురస్సరంగా స్వీకరించినందు వలన ఈ దివ్యప్రబంధాధ్యయన విధానాన్ని అందరికీ అవగాహనకు వచ్చేలా ఐతిహ్యరూపంలో ఈ గ్రంథం ఉపకరిస్తున్నది. శ్రీవేంకటాచలపతి అధ్యయనోత్సవంలో దివ్యప్రబంధాన్ని ఆకర్ణించే రీతిని కూడా ఈ గ్రంథం వివరించింది.

ఇతరత్ర దివ్య దేశాల్లోలాకాక ఇక్కడ తిరువాయ్‌మొళి మొదలుగాగల ఇతర ప్రబంధాలకు బదులుగా ఇయర్పా అనే ముదలాళ్వారుల తిరువన్దాదులతో అనుసంధానం ఆరంభంచేసే విధానాన్ని ఈ ప్రబన్ధం సూచిస్తున్నది. అధ్యయనోత్సవం తిరుమలలో 25 రోజులు జరుగుతుంది. మొదటి 11 రోజులు పగల్పత్తు అని చెప్పబడే చిన్న అధ్యయనోత్సవం ధనుర్మాసంలోని శుక్లపక్ష ఏకాదశి ముందుగా ముగుస్తుంది. ఈ సందర్భంగా ఒక్కొక్క దినమున అనుసంధానం చేయవలసిన పాశురాల క్రమాన్ని, విశేషంగా రెండుసార్లు అనుసంధానం చేయదగిన పాశురాలను విస్పష్టంగా క్రమబద్ధం చేసి నిరూపించింది ఈ గ్రంథం. మొదటిరోజు రాత్రి ముదలాళ్వారుల 3 తిరువన్దాదులు, నాన్ముగం తిరువన్దాది, తిరువిరుత్తములోని ఆద్యన్త పాశురాలు అనుసంధానం చెయ్యడంతో ప్రారంభమై, 11వ దినంరాత్రి తిరిక్కురుందాండకం, తిరునెడుందాండకం, తిరుమొళి ముగింపు - ఇలా 11 దినములు సాగే ఈ పగల్పత్తు చిన్న అధ్యయనోత్సవంలో రాత్రిసమయాల్లో ప్రబంధ గాయకులు కోయిల్ తిరువాయిమొళిని సంగీత పురస్సరంగా అనుసంధానం చేస్తారు. ఇక శుక్లైకాదశి మొదలు 10 రోజులు పెద్ద అధ్యయనోత్సవమనే రాపత్తు జరుగుతుంది. ఈ సందర్భంగా ప్రాతః కాలంలో నైవేద్యానంతరం చతుర్వేదాలు ఇతిహాస పురాణములు అనుసంధింప బడతాయి. ఇక రాత్రి సమయాలలో తిరువాయిమొళిలోని ఒక్కొక్క శతకము 10 రోజులు అనుసంధింప బడుతుంది. ఇలా 21 రోజులపాటు సాగి అధ్యయనోత్సవానికి తీర్థాభిగమనోత్సవం వరకూ 22,23,24,25వ దినములలో, అంటే రాపత్తు ముగిసిన తర్వాత 11,12,13,14వ దినములలో క్రమంగా రాత్రి సమయంలో కణ్ణినున్ శిరుత్తాంబు, రామానుజనూత్తందాది, చివరి రోజున జ్ఞాన వరాహస్వామి సన్నిధిలో తిరువాయిమొళి అనుసంధానం, ఆ తరువాతరోజున తీర్థాభిగమనోత్సవం జరుగునట్లు ఈ గ్రంథం చెబుతున్నది. ఇయర్పా అనే పాశురాలు తిరువేంకటనాథుని ప్రతిపాదించేవని ఆచార్యుల అనుభవం. తిరుమంత్రమున నారాయణాయ అనే పదంలో వ్యక్తచతుర్థీ విభక్త్యర్థమైన కైంకర్యంద్వారా ఈ తిరువందాదులకు కూడా శ్రీ వేంకటపతియే ప్రతిపాద్యుడని నిర్ణయించి, ఈ ఇయర్పా ప్రబంధాన్నే తొట్టతొలుత శ్రీవేంకటేశ్వరస్వామి ఆకర్ణించాలని ఆచార్యులు నియమించారు. ఇలాగే ఇతరత్ర దివ్యప్రబంధాలలో శ్రీవేంకటేశ్వర ప్రతిపాదకాలుగా ఉన్న పాశురాల నన్నింటినీ రెండు మారులు

అనుసంధానం చేసే విధానం ఆచార్యులచే నిర్దేశింపబడినది. తిరుపతిలోని గోవిందరాజస్వామి, తిరుమలలోని వేంకటేశ్వరుడు ఒకే తత్త్వమని ఆచార్యుల అనుభవం కనుక, భగవద్రామానుజులు నిర్దేశించిన విధానాన్ని బట్టి, రెండుచోట్ల రెండుమార్లు అనుసంధానం చేయవలసిన పాశురముల అనుక్రమణికలు పెరియ వాచ్చాన్‌పిళ్ళై అనుగ్రహించిన కలియన్ అరుళ్‌పాడు అనే గ్రంథాన్ని అనుసరించి, ఈ ఒళుగు గ్రంథం నిర్దేశిస్తున్నది. ఈ సందర్భంగా తిరుమలలో ఇలా అనుసంధానం చేయుటకుగల కారణాలను చాలా విశదంగా ఈ గ్రంథం నిరూపించింది. ఇక రామానుజుల తర్వాత శ్రీవైష్ణవ సంప్రదాయంలో, ముఖ్యంగా తెంగలైశాఖలో రామానుజావతారంగా సంభావింపబడే శ్రీమనవాళమామునులు, తిరుమలలో చేసిన కైంకర్యాలను, ఏర్పరచిన కట్టుబాట్లను ఈగ్రంథం వివరిస్తున్నది. వేంకటాచల ఇతిహాసమాలలో లేని ఈ ఐతిహ్యం ఇక్కడనే ఉన్నది. దీనికి కారణం వేంకటాచల ఇతిహసమాల కాలానికి మనవాళమామునులు లేకపోవటం, వీరి తరువాతనే ఒళుగు గ్రంథం ఆవిర్భవించడమే. అంతేకాదు జీయరుల నియమాలు వారి విధులు, ఏకాంగుల విధులు అధికారాలు, వేంకటాచలపతి నిత్యారాధనలో వీరికి గల సంబంధం, భగవద్రామానుజులకు మనవాళ మామునులకు వీరి నియమనంలో ఉన్నప్రమేయం, ఈ ఒళుగు గ్రంథం చాల విస్పష్టంగా ఆవిష్కరిస్తున్నది,

# ఆలయ దర్శనం

**-ఓటమాకుం గురవయ్య**

మొట్టమొదటగా శిలారూపములో ఉన్న శ్రీస్వామిని ఆ కీకారణ్యములో దర్శించిన వాడు వసువు అనే కిరాతకుడు. ఆ తరువాత రంగదాసు అని పిలువబడే పండ్రెండు సంవత్సరముల శూద్ర బాలుడు, ఆ తరువాత గోపీనాథ దీక్షితులు అనే వైఖానస కులస్థుడు. ఈయన పూజలు చేయడం ప్రారంభించాడు.

రంగదాసు స్వామి పుష్పకైంకర్యానికి పూలు, నైవేద్యానికి శ్యామాక బియ్యం తెచ్చి పక్వము చేసి నైవేద్యమునకు అందించుచుండెను. తన యత్తు గోడను స్వామికి చుట్టూ కట్టెను. అదే ఈనాటి గర్భగుడి. ఈ రంగదాసే మరో జన్మలో తొండమాన్ చక్రవర్తిగా జన్మించి స్వామికి దేవాలయమును గట్టించెను.

ఇక శాసనాలలో చూచినపుడు మొట్టమొదట శ్రీవారిని దర్శించినది"సమవాయి" అనే పల్లవుల రాణి. శక్తి విటంకన్ భార్య. తిరుచానూరులో తిరువిలన్ కోయిల్ అని పిలువబడే గుడిని కట్టించి. వేంకటేశ్వరుని ప్రతిరూపమును ఒక రజిత విగ్రహాన్ని 18 అంగులముల ఎత్తు గలది ప్రతిష్ఠించింది. ఆ విగ్రహం పేరు మాణవాళ పెరుమాళ్.

ఆ విగ్రహాన్ని 10వ శతాబ్దములో తిరుమల గుడిలోకి మార్చిరి. ఆ విగ్రహమే భోగ శ్రీనివాసమూర్తిగా ప్రసిద్ధి చెందినది. ఆ విగ్రహము తిరుమల కొండకు తరలిన తరువాత తిరుమల కొండ వైభోగమే మారిపోయింది. భక్తులు గుంపులుగట్టి కొండకు ఎక్కడం ప్రారంభించిరి. అప్పుడు ఆ గుంపులను నేరుగా దర్శనానికి పంపేవారు. అలా ఆ వేంకటేశ్వర దర్శనార్థమై పల్లవులు, చోళులు, పాండ్యులు, యాదవరాజులు, కొండకు వచ్చేవారు.

యాదవ రాజులలో వీర నర్సింగ దేవ యాదవ రాయలు గర్భగుడిని, ముఖమండపమును (నేడు శయన మండపము) ప్రాకారమును కట్టించెను. గర్భగుడిపైన ఆనంద నిలయము అని పిలువబడే విమానమును కట్టించెను. ఆ విమానమునకు తన ఎత్తు బంగారమును తులాభారము వేసి ఆబంగారముతో విమానమునకు బంగారు పూతవేయించెను. తులాభారమును మొట్టమొదట ప్రారంభించినది ఆ రాజే.

విమానమునకు బంగారు పూత వేయించిన తరువాత గొప్ప ఆకర్షణ శక్తి ఆ దేవాలయమునకు కల్గినది. వేంకటేశ్వరుని దర్శనార్థమై భక్తుల సంఖ్య పెరిగినది. తండోపతండములుగా గుంపులు పెరిగినవి.

ఆనంద నిలయం విమానమునకు సాళువ మంగిదేవ మహరాజా 14వ శతాబ్దములో రెండవ పర్యాయము బంగారు పూత వేయించెను. ఇతను పవిత్రోత్సవమునుగూడా ప్రారంభించెను.

దినదినాభివృద్ధిచెందుతున్న ఈ దేవాలయమును మరింతగా పెంచాడు మల్లన మంత్రి. విజయనగర రాజులకు సామంతుడుగా చంద్రగిరి కోట గవర్నరుగా పరిపాలన సాగించుచూ దేవాలయమునకు రెండు మంటపములను కట్టించెను. ఒకటి మహామణి మంటపము. రెండుబంగారువాకిలికి తూర్పుదిక్కున ఉన్న

ప్రాకారమును తీసివేసి జయవిజయులు ఉండే బంగారు వాకిలిని కట్టించెను. ఈ మల్లన మంత్రి 15వ శతాబ్దము పూర్వార్థములో ఆనందనిలయ విమానమునకు 3వ పర్యాయము బంగారు పూత వేయించెను. ఆ తరువాత సాళువ నరసింగరాయలు అనేక కార్యక్రమములు చేపట్టెను. ఈ వేంకటేశ్వరస్వామి దేవాలయమునకు విమాన ప్రాకారమును, నడిమి పడికావలి గోపురముతో సహా కట్టించెను. ఈ రాజు అనేక ఉత్సవములను ప్రవేశపెట్టెను. అనేక మంటపములను కూడా కట్టించెను. ఊంజల మంటపమును కట్టించెను. స్వామి పుష్కరిణిలో నీరాట మంటపమును కట్టించెను. పుష్కరమునకు గ్రానైటు స్టోనులతో మెట్లు కట్టించెను. ఊంజల సేవ డోలోత్సవము. తెప్పోత్సవము, వసంతోత్సవము ప్రవేశపెట్టెను. ఇవిగాక వచ్చిన భక్తులకు బ్రాహ్మణులకు రామానుజకూటములలో షడ్రసోపేత ఉచితభోజనములను పెట్టించెను. బ్రాహ్మణేతరులకు సత్రం అనే పేరిట భోజనములు పెట్టెను. ఇతను ఏడు బ్రహ్మోత్సవములు నెల నెలా నడిపించెను. ఈ విధముగా ఉత్సవములు అన్నదానములు నైవేద్యములు అధికముగా కల్పించుటచే భక్తుల రాక కూడా దినదినము అభివృద్ధి అయినది. ఆ తరువాత శ్రీకృష్ణదేవరాయలు ఈ దేవాలయమునకు ఏడు పర్యాయములు వచ్చి ఈ స్వామిని దర్శించెను. ఆయన ఇలవేల్పు శ్రీవేంకటేశ్వరస్వామి. ఈ రాజు బంగారు నగలు, వజ్రములు, వైడూర్యములు, మణులు, మాణిక్యములు ఎన్నో ఎన్నో లెక్కకట్టలేనంత బహుమతిగా సమర్పించెను. ఇన్ని కానుకలు మరే రాజు గూడ ఇవ్వలేదు. 30వేల సవరములు బంగారమును ఇచ్చి ఆనందనిలయమునకు 4వ పర్యాయము పదహారో శతాబ్దము పూర్వార్ధమున బంగారు పూత వేయించెను. ప్రతిమా మంటపమును కట్టించెను, ధ్వజస్తంభము మంటపమును కట్టించెను. ఈ రాజు కాలములో బ్రహ్మోత్సవములు ఎనిమిదికి పెరిగెను. ఆ తరువాత అచ్యుతరాయలు విజయనగరమునకు రాజయ్యెను. ఇతను తిరుమల కొండలో క్రొత్తగా ఒక పుష్కరిణిని తవ్వించెను. "లక్ష్మీ పరిణయము" అను ఉత్సవమును ప్రారంభించెను. ఎనిమిది బ్రహ్మోత్సవములతో పాటు మరో బ్రహ్మోత్సవము చేయించెను. తనతోపాటు తన రాజ్యములో ఉన్న రాజ ప్రతినిధులను అధికారులను స్వామి దర్శనార్థమై తీసుకొచ్చెను. నాట్యకత్తెలను విజయనగరము నుండి తిరుపతికి రప్పించి వారిని తిరుమల దేవాలయములో, తిరుపతి శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో నాట్యకత్తెలుగా నియమించెను. ఈ ఆకర్షణతో భక్తుల రద్దీ మరింత పెరిగినది. ఆ తరువాత ఆరవీడు రాజుల కాలములో అళియ రామరాజు సోదరుడు తిరుమలరాయడు గుడికి మూడవ ప్రాకారమును కట్టించెను. ఆరవీటి రాజుల కాలములో కోటికన్యాదానం తాతాచార్యులు, 17వ శతాబ్దము పూర్వార్ధంలో 5వ పర్యాయం ఆనందనిలయము నకు బంగారు పూత వేయించెను.

విజయనగర సామ్రాజ్యం అంతమైన తరువాత భహ్మనీ సుల్తానులు, గోల్కొండ నవాబులు, కర్ణాటక నవాబులు, ఆర్కాడు నవాబులు శ్రీవేంకటేశ్వర దేవాలయమును పరిరక్షించుచూ వచ్చిరి. ఇందుకు సాలీన రెండు లక్షల రూపాయలు వారికి కట్నముగా ఇచ్చుచుండిరి.

వేంకటేశ్వరస్వామి గుడికి సంబంధించిన స్థానత్తారులు ఈ ఆదాయమును పెంచుటకై సేవలకు, ఉత్సవములకు టికెట్టు సిస్టములో డబ్బులు వసూలు చేసిరి. తోమాల సేవ, అర్చన, ఏకాంత సేవ, ఆర్జిత సేవలుగా నిర్ణయించిరి. ఆమంత్రణఉత్సవమును ప్రత్యేక ఆర్జిత సేవగా ప్రవేశపెట్టిరి. తీర్థములలో పాపవినాశనము, ఆకాశగంగ, గోగర్భం, స్వామి పుష్కరిణిలో యాత్రికులు వైదిక కర్మచేయవలయునన్న టికెట్టు కొని పూజలు చేయించుకోవలయును. గోగర్భం తీర్థము దగ్గర క్షేత్రపాలకుల గుండు (రాయి)వుంది. ఇచట సాక్ష్యము చెప్పవలయునన్న టికెట్టు కొనవలయును. ఏదైనా విలువైన వస్తువులు స్వామికి సమర్పించవలయునన్న అందుకు సమానమైన సొమ్మును కట్నముగా చెల్లించవలయును. దీనినే వర్తన అందురు. వస్తు రూపమునగాని, విలువైన నాణ్యముల రూపమునగాని, జంతువుల రూపమునగాని స్వామికి సమర్పించవలయునన్న వాటికి సరిసమానమైన విలువగట్టి ఆ డబ్బును వర్తన రూపమున వసూలు చేసిరి. ఈ విధముగా దేవాలయ ఆదాయము, స్థానత్తారులు పెంపొందించిరి.

క్రీ. శ. 1801, జూలై 31న ఈస్టిండియా కంపెనీ వారి స్వాధీనములోకి ఈ దేవాలయము వచ్చినది. వీరుకూడా సాలీన 2లక్షల రూపాయిలను దేవాలయ అధికారుల నుండి వసూలు చేసిరి. ఈస్టిండియా కంపెనీ నుండి ఈ దేవాలయము మద్రాసులోని "బోర్డ్ ఆఫ్ రెవిన్యూ" వారి ఆధీనములోకి 1817న వచ్చినది.

వీరు దేవస్థానమును చేపట్టగానే "సవాల్ ఇ జవాబ్ పట్టి", కైంకర్యపట్టి, దిట్టం, బ్రూస్ కోడ్ అనే పుస్తకములను తయారుచేసి దేవాలయ పరిపాలనను పటిష్టముచేసిరి. బ్రూస్‌కోడ్ లో కోడ్ ఆఫ్ కాండక్ట్ ను నిర్దేశించిరి. ఇది ఉద్యోగస్తులకు, స్థానికులకు, యాత్రీకులకు అన్వయించిరి. ఆర్జిత పూజలకు, ఉత్సవములకు, నైవేద్యములకు ఈ బ్రూస్‌కోడ్ ను అన్వయించిరి. దేవాలయ భద్రతకు, దొంగతనములు జరుగకుండా ఉండుటకు తీసుకోవలసిన చర్యలను ఈ చట్టములో పొందుపరచిరి.

శ్రీవారి దేవాలయమునకు పారుపత్తెందారు అధికారి. వీరి పై శిరస్థదారు, ఆపై తాహసిల్‌దారు, ఆపై నార్త్ ఆర్కాట్ డిస్ట్రిక్టుకలెక్టరు అధికారులుగా వుండిరి.

దర్శనార్థమై వచ్చు యాత్రీకులు, సేవలు చేసుకోవలయునన్న ఆ సేవలను 25 డివిజన్లుగా విభజించిరి. ఆయా డివిజన్లకు నిర్ణయించిన సొమ్మును కానుకగా చెల్లించిన వారికి చెందవలసిన మర్యాదలు దైవ దర్శనము చేయించుచుండిరి. చెల్లించు సొమ్ము 10వేల రూపాయలనుండి 3రూ. వరకు 25 డివిజన్లుగా విభజించిరి. 3 రూ. లోపల కానుకలు చెల్లించు యాత్రీకులకు అందరికి కనబడు స్థలములో దేవాలయములోపల గుడ్డలో బిగించిన గంగాళమును దారములతో కట్టి సీలువేసి ఒక గార్డును కాపలాగా ఉంచి ఆ గంగాళములో 3 రూ. లోపు వచ్చు కానుకలను వేయించుచుండిరి. ఒకవేల విలువైన వస్తువులు తెచ్చిన వర్తన కట్ట లేనిచో ఆ విలువైన వస్తువులను హుండీ గంగాళములో వేయించుచుండిరి. ఈ విషయము బ్రూస్‌కోడ్ లో 19వ అధికరణలో చెప్పబడివున్నది. ఈ బ్రూస్ కోడ్ 25-7-1821 తేదీన అమలులోకి వచ్చినది. గంగాళమునే

కొప్పర అని, హుండి అని పిలిచిరి. 3రూ. లోపల నాణ్యములు, 1 రూపాయ, అర్ధరూపాయ. పావల, పరక నాణ్యము, లేదా బేడ, అణ, అర్ధణ, కాలనా దమ్మిడి. ఇత్యాది నాణ్యములలో ఈ గంగాళ హుండీలో పరక నాణ్యములు ఎక్కువగా పడుచుండినవి. ఈ పరక నాణ్యముల లెక్కింపు కాలక్రమేణా పరకామణి అయినది. పైన చెప్పిన 25 డివిజన్ల కానుకలను బ్రిటీషు వారు విభజించటంలో ఆనాడు యాత్రీకుల సంఖ్య వేలల్లో వచ్చుచుండిరని తప్పని సరిగా మనము ఊహించవచ్చును. 1821కి యాత్రీకుల రద్దీ పెరిగినదనవచ్చును. ఉత్సవ దినములలో ఈ రద్దీ అధికముగా ఉండినది. 1841లో కోర్ట్ ఆఫ్ డైరెక్టర్స్ లండన్ లో ఉన్న పార్లమెంటుకు ఒక సందేశము పంపిరి. ఆ సందేశములో "భారతదేశములో ఉన్న మతపరమైన సంస్థలలో గాని, దేవాలయములలో గాని, బ్రిటిష్ ఉద్యోగులు అధికారులుగా జోక్యము చేసుకొనరాదు. ఆ సంస్థలను హిందువులే నడిపించు కొనవలయును. ఆయా సంస్థలు ఉన్న స్థల స్థానీకులుగాని, జమీందారులుగాని, సంస్థా నాధీశులుగాని, రాజులు గాని, మరే ఇతర పెద్దమనుషులుగాని వారికి ఈమతసంస్థలను, గుళ్ళను ఒప్పచెప్పవలయును". ఈ నిర్దేశము ప్రకారము 1843 నుండి 1933 వరకు హాథీరాంజీ మఠం వారి స్వాధీనములోకి టి.టి.డి వచ్చినది. 90 సంవత్సరములువ వారు పరిపాలించిరి. ఆ కాలములో ఉదయం 8 గంటలకు సుప్రభాతం వుండేది. సుప్రభాతం తరువాత విశ్వరూప దర్శనం ఉండేది. ఆ తరువాత తోమాల అర్చన గంట సాయించి శాత్తుమురా జరిపేవారు. ఈ శాత్తుమురాలో పెద్దజియ్యంగారు, తనతో వచ్చిన శ్రీవైష్ణవులను అందరిని దర్శనమునకు తీసుకొనిపోయేవారు. ఎంతమంది వచ్చినా అంతమందికి దర్శనము చేయించేవారు. ఆ వచ్చిన బ్రాహ్మణులలో కట్టు, జుట్టు, బొట్టు తప్పనిసరిగా చూచేవారు. ఇందులో ఏదైనా కొరత ఉండినచో అట్టివారిని శాత్తుమురాకు పంపేవారు కాదు. శాత్తుమురా తరువాత ధర్మదర్శనము ఉండేది. ఇది మధ్యాహ్నం 1గంటవరకు ఉండి ఆ తరువాత 2వ గంట సాయించి నైవేద్యము పెట్టి తిరిగి దర్శనమునకు వదిలేవారు. రాత్రి 7 గంటలకు రాత్రి గంట సాయించి నైవేద్యములు పెట్టి గుంపు ఉన్నచో దర్శనమునకు వదిలేవారు. ఆ తరువాత ఏకాంత సేవ (పవళింపు సేవ) జరిపేవారు.

మొదట క్యూ పద్ధతి బంగారు వాకిలి నుండి ఉండేది. గుడిలోపల దారములు కట్టి జనమును దర్శనమునకు వదిలేవారు. ఒకరివెనుక ఒకరు పద్ధతిగా నెమ్మదిగా దేవుని దర్శనముకు పోయేవారు. తోపుడులు త్రొక్కిసలు ఆ రోజులలో ఉండేవి కాదు. క్యూ లైన్ లో జనములేకుండిన మరలా మరలా దర్శనమునకు పోయెడివారు. ఉద్యోగులు వారిని ఇబ్బంది పెట్టేవారు కాదు. 1821కి ముందు హుండీ బంగారువాకిలియందు పెట్టకు ముందు లోపల కులశేఖరపడి వద్ద పెద్ద గంగాళమును ఉంచి అందులో కానుకలను ముల్లెలు గ వసూలు చేయుచుండిరి. ఆ తరువాత ఆ కానుకలను "ముల్లె" లను లెక్కగట్టి కచేరికి పంపేవారు.

యాత్రికుల జనం పెరిగేకొద్ది క్యూ లైను బంగారు వాకిలి నుండి కాక నడిమి పడికావలి ధ్వజ స్థంభము నుండి ప్రారంభించిరి. మహంతుల కాలంలో జనం పెరిగే కొద్ది వారికి వెయ్యికాళ్ళ మంటపమును వసతి సౌకర్యమునకై రూములు కట్టి యాత్రికులకు ఇచ్చుచుండిరి. వెయ్యికాళ్ళ మంటపముపైన కూడా రూములు కట్టి యాత్రికులకు ఇచ్చుచుండిరి. ఆ రోజులలో 2వేల నుండి 3వేల మంది యాత్రికులు దర్శనమునకు వచ్చేవారు. వారు కాలినడకన వచ్చేవారు. కొండ ఎక్కలేని వారిని డోలీలు కట్టి అందులో పైకి తీసుకొనిపోయేవారు. ఇలా 1945వరకు సాగింది. ఆ తరువాత కాలములో కొండకు తిరుపతి నుండి బస్సు దారి వేసిన తరువాత జనరద్దీ పెరుగసాగినది. ఈ జన రద్దీ పెరిగేకొద్దీ నడిమి పడికావలి వరకు ఉన్న క్యూ సంపంగి ప్రాకారం వరకు పెరిగినది. సంపంగి ప్రాకారములో కంపార్టుమెంటులు కట్టి ఆ కంపార్టుమెంటులలో కూర్చోబెట్టి ఒక్కొక్క కంపార్టుమెంటులోని యాత్రికులను దర్శనానికి వదిలేవారు.

మహంతుల పరిపాలన 1933సం॥ ముగిసినది. ఆ తరువాత కమిటి పాలన వచ్చినది.

# శ్రీవేంకటాచల క్షేత్ర విశేషములు

*పాకాల రామారావు*

శ్రీమదఖిలాండ కోటి బ్రహ్మాండ నాయకుడగు శ్రీహరి ధర్మాన్ని రక్షించుట కొఱకు ప్రతి యుగములోనూ విభిన్న యవతారముల నెత్తి భక్తుల బ్రోచినాడు. ఒక్కొక్క అవతారంలో ఒక్కొక్క స్థలములో వెలసినాడు. ఆయా స్థలములు వివిధ నామాలతో క్షేత్రాలుగా వర్ధిల్లినాయి. శ్రీస్వామి ఒక్కడే యైనా ఒక్కొక్క అవతారానికీ ఆయా క్షేత్రానికీ మహాత్మ్యసంపద ఒక్కో విధంగా నిరూపించి కటాక్షించినాడు. శ్రీవేంకటాచలమహాక్షేత్రము యెంతో ప్రశస్తమై ముఖ్యంగా కలియుగంలో సామాన్య భక్తులకు కూడా పుణ్యసాధనమై యలరారుచున్నది. వేంకటాచల పుణ్యక్షేత్రమే నేడు తిరుపతి దివ్యక్షేత్రముగా వర్ధిల్లుతూన్నది.

శ్రీవేంకటేశ్వరుని మహిమలతోకూడిన వైభవము, శ్రీవేంకటాచలమాహాత్మ్యము గూర్చి యెంత చర్చించినా ఊట బావిలో నీరు నిరంతరం ఉబికి వచ్చినట్లు యెంతకూ తరగదు. తనివి తీరదు. ఈ క్షేత్రము గూర్చి వరాహ పద్మమార్కండేయాది పురాణాలలో చెప్పబడియున్నది.

తిరుపతి దివ్యక్షేత్రము ఏడు కొండల సమాహారము. ఏడు నామాలతో వర్ధిల్లునట్టిది. కనుకనే ఏడు కొండలని శ్రీవేంకటేశ్వరుని ఏడు కొండలవాడని పిలుస్తారు. వేంకటాచల క్షేత్రానికి ఒక్కోయుగంలో ఒక్కో పేరు కలిగినది.

కృతయుగంలో వృషభాసురుడను రాక్షసుడు శ్రీమన్నారాయణుని భక్తుడు. కాని నారాయణుని తో యుద్ధము కోరుకొనినాడు. శ్రీమన్నారాయణుడు వృషభాసురుని తో యుద్ధము చేశాడు. చివరగా సుదర్శన ప్రయోగము చేసినాడు. సుదర్శన మహిమను తెలిసిన యా వృషభాసురుడు యీ శైలము తన పేరుతో ప్రసిద్ధమగునట్లు వరముకోరినాడు. శ్రీమన్నారాయణుడతనికి కోరిన వరము నిచ్చి పరమపదమున కంపినాడు. అందువలన దీనికి వృషభాచలమను పేరు కల్గెను.

త్రేతాయుగమున అంజనాదేవి పుత్ర సంతానముకోరి మతంగమహర్షి యొక్క సలహామేరకు ఆకాశగంగ సమీపమున పండ్రెండు సంవత్సరములు తపమాచరించి వాయుదేవుని దయను పొంది వాయు సమాన బలవంతుడగు హనుమంతుడను కుమారుని పొందెను. అంజనాదేవి తపమాచరించిన పర్వతమగుటచే అంజనాద్రి యను పేరుతో ప్రకాశించెను.

ద్వాపరయుగమున ఒకనాడు లక్ష్మీపతి శ్రీసతితో యంతఃపురంలో నుండగా వాయుదేవుడు శ్రీమన్నారాయణుని దర్శించుటకై వెళ్ళినాడు. అపుడు ఆదిశేషుడు ద్వారపాలనము చేయుచుండినాడు. వచ్చిన వాయుదేవుని లోపలకు పోనీయకుండా అడ్డుపడినాడు. వాయుదేవునికి కోపం వచ్చింది. ఇద్దరికి వాదోపవాదములు జరిగాయి. లక్ష్మీదేవి వారి గొడవేమిటో చూడమని శ్రీపతిని కోరినది. జగన్నాటక సూత్రధారి

యైన శ్రీపతి యావివాదమును సాకుగాగొని ఆనందాద్రిని సువర్ణముఖీతీర ఉత్తరభాగమునకు చేర్పించదలచాడు. యుక్తిగా ఆదిశేషునకు వాయుదేవునికి బలాబలములు తేల్చుకోమని పురికొల్పినాడు. ప్రేరేపింపబడిన ఆదిశేషుడు మేరు పర్వతపుత్రుడగు ఆనందాద్రిని గట్టిగా చుట్టుకొని తన తలలతోగట్టిగా నొక్కిపట్టుకొన్నాడు. వాయుదేవుడు ఆనందాద్రిని కదిలించే ప్రయత్నం జేసినాడు. లోకాలన్నీ అల్లకల్లోలమైపోతున్నా ఆనందాద్రి యిసుమంత కదలలేదు. ఆదిశేషుడు తన పట్టును వదలలేదు. ఇంద్రాది దేవతలు వాయుదేవుని తన ప్రయత్నమును మానుకొమ్మన్నారు. కాని వాయుదేవుడు ససేమిరాయన్నాడు. ఆదిశేషుని వేడుకోగా తన తలలలో యొకదాని పట్టును సడలించినాడు. వాయు బలముచే ఆనందుడు దక్షిణదిశగా అత్యంత వేగముగా ఎగిరి పోవుచుండెను. మేరు పర్వతము తన సుతునికి వచ్చిన కష్టమును చూచి భయపడి వాయుదేవుని వేడుకొనెను. వాయుదేవుడు శేషునితో కూడిన ఆ యానందాద్రిని సువర్ణముఖీ నది కుత్తరమువైపున దిగబెట్టెను. అపుడు దేవతలు "ఈయానందాద్రి శేషాంశసంభూతము. శ్రీహరి దీనిని తన నివాసము కొరకు స్వర్ణముఖీ నదీ తీరమునకు నీ ద్వారా చేర్పించినాడు. హరి మాయా విశేషముచే నీవు తెలియకుండా శ్రీపతికి యత్యంత యిష్టసేవకుడగు శేషునితో గొడవపడి తప్పు చేశావు. అతనిని వేడుకో" యని వాయుదేవునికి సలహాఇచ్చారు. వాయుదేవుడట్లే అని శేషుని వేడుకొన్నాడు. శేషునిచే చుట్టబడిన, శేషాంశమైన యీ పర్వత రాజమునకు శేషాచలమని పేరు కల్గినది.

ఇక కలియుగమున వేంకటాచలమను పేరు ఎలా కల్గినదో తెలిసికొందాం. పూర్వం శ్రీకాళహస్తిలో పురందరుడనే శుద్ధ శ్రోత్రియబ్రాహ్మణుడుండేవాడు. పుత్రసంతానములేక బాధపడి అనేక వ్రతములాచరించాడు. తుదకు ముసలితనంలో పూర్వ పుణ్యావిశేషముచే మాధవుడను పుత్రుని పొందినాడు. మాధవుడు వేదవేదాంగాది సకల విద్యలను నేర్చుకొని మహా పండితుడైనాడు. యుక్తవయసు వచ్చినది. చంద్ర లేఖయను కన్నెతో వివాహం జరిగినది. వివాహం జరిగిన వేళావిశేషమేమోకాని మాధవుడు విషయవాంఛాలోలుడైనాడు. బ్రాహ్మణ విధులను విడచి సతతము రతి క్రీడయందాసక్తుడై మెలగుచుండెను. అంతటితో ఆగకుండా కుంతలయను వేశ్యను మోహించి చండాలత్వమును స్వీకరించి యజ్ఞోపవీతమును వదలి పెట్టి మధుమాంసములను, భుజిస్తూ ఆమెతో రమించుచుండినాడు. కొంత కాలమునకామె కాలధర్మమునొందినది. ఆమె వియోగముచే నాతడు పిచ్చివానివలె దేశాలు పట్టి తిరుగసాగాడు. పూర్వజన్మ పుణ్యవిశేషమున వేంకటాద్రి యాత్రకుపోవు భక్తులను చూచాడు. వారితో వేంకటాచలమునకు పయనమైనాడు. మొదట చక్రతీర్థమునకు చేరి యందు గ్రుంకిడినాడు. దానితో యతని కల్మషములు తొలగిపోయినవి. పితృదేవతలకు మట్టి పిండప్రదానము చేయగా పితరులు ముక్తులైనారు. ఆ రాత్రి చక్రతీర్థమందే నిదురించి మరునాడు యాత్రికులతో కలసి వేంకటాచలమును ఎక్కసాగెను. వేంకటాచల మాహాత్మ్యము వలన అతని పాపములన్నియు దహించుకుపోయినవి. ఆ విశేషమును గాంచుటకు దేవతలందరు వచ్చి వేంకటాద్రి

మాహాత్మ్యమును కొనియాడిరి-బ్రహ్మదేవుడు మాధవునిగని యిట్లనెను. "ఓ విప్రుడా, నీవు వేంకటాచల క్షేత్రమాహాత్మ్యమువలన పాపపంకిలమునుండి విడుదలైనావు. వెంటనే నీవు శ్రీస్వామి పుష్కరిణిలో స్నానముచేసి శ్రీవరాహస్వామిని దర్శించుకొనుము. మరుజన్మలో పాండవవంశములో ఆకాశరాజుగా పుట్టెదవు. జగన్మాత నీకు పుత్రిక యగును. శ్రీనివాసుడు నీకల్లుడగును. సర్వాభీష్టముల నెరవేర్చుకొని తుదకు వైకుంఠమును పొందెదవు. ఈ పర్వతము వేంకటాద్రియను పేరుతో వర్ధిల్లును". ఆ విధముగా పల్కి యధాస్థానమునకేగెను. వేంకటాద్రియనగ సర్వపాపములను దహించునది యని అర్థము.

**సర్వపాపానివేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే**

**తస్మాద్వేంకటశైలోయం లోకేవిఖ్యాతకీర్తిమాన్**

ప్రభాత సమయములో ఎవరు వేంకటాద్రిని స్మరిస్తారో వారు వేయి గంగాయాత్రలు చేసిన ఫలమును పొందగలరు.

లక్ష్మీదేవికి ఆవాసమైనందువలన శ్రీశైలమని పేరు కల్గినది. వరాహస్వామి ఆనతిపై గరుత్మంతుడు వైకుంఠము నుండి తెచ్చినందువలన గరుడాద్రియని, నారాయణుడనే బ్రాహ్మణుని కోరికమేరకు స్వామివారు వరము నిచ్చినందువలన నారాయణాద్రిగా కొనియాడబడుచున్నది. ధర్మదేవత యీపర్వతము పై తనయభివృద్ధి కొరకు తపసు చేసినందువలన వృషాద్రియను పేరుకల్గినది. గడచిన యుగాలలో చింతామణి, జ్ఞానాద్రి, వరాహాద్రి, వైకుంఠాద్రి మున్నగు అనేక దివ్యనామాలతో యీక్షేత్రం ప్రసిద్ధిగాంచినది.

శ్రీనివాసునికోరిక మేరకు స్వామి యాజ్ఞానుసారంగా తొండమానుడను రాజు స్వామివారికి దేవాలయమును కట్టించి యిచ్చెను. అదియే ఆనందనిలయము. శ్రీనివాసుడు పద్మావతిదేవితోకూడి సకలదేవతలూ, ఋషులూ, వేదపారకులూ వెంటరాగా ఆనందనిలయ ప్రవేశముచేసి ఆనంద నిలయవిమానమున ఆవాసమేర్పరచుకొనెను. ఆనందజనకమగుటచే ఆవిమానమునకు ఆనందనిలయమని పేరు వచ్చెను.

పెరుందేవియను నామాంతరము కల్గిన సామవై అనే పల్లవ రాణిచే క్రీ.శ.614లో భోగశ్రీనివాసమూర్తి విగ్రహము కావింపబడినది. తర్వాత పల్లవరాజగు శ్రీ విజయ గండగోపాల దేవుడు, శ్రీత్రిభువన చక్రవర్తి తిరువేంకటనాథ యాదవరాయలు, హరిహరరాయలు మాసి తిరునాళ్ళుగా పిలువబడే బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. విజయనగర చక్రవర్తులలో సాళువ నరసింహరాయలు, శ్రీకృష్ణదేవరాయలు, వెంకటపతి రాయలు శ్రీవేంకటేశ్వరస్వామిని కొలచి తరించారు; ఎన్నో కైంకర్యములు చేశారు.

శ్రీవేంకటేశ్వరస్వామి పాదాల క్రింద విరజానది ప్రవహిస్తున్నదని చెప్పబడుచున్నది. ఈ విరజానదే

వైకుంఠములోని దేవనది. ఇది శ్రీవారి ఆలయం సంపంగిప్రదక్షిణలో కొద్దిగా పైకి తేలి యిప్పటికీ కన్పించుచున్నది. దీనిని చూచి తరించినవారిదే భాగ్యము.

శ్రీభగవద్రామానుజాచార్యులు తిరుమల ఆలయకార్యక్రమాలను వైఖానస ఆగమోక్తముగా తీర్చిదిద్దినాడు. ఇప్పటికినీ శ్రీరామానుజాచార్యుల వారు ఏర్పరచిన విధానముననే తిరుమల క్షేత్రంలో ఆలయ కార్యక్రమాలు నిర్వహింపబడుచున్నవి.

విజయనగర సామ్రాజ్య పతనానంతరము తిరుమల శ్రీవారి ఆలయం మహమ్మదీయ ప్రభువుల వశమైనది. కొంతకాలం మరాఠీ ప్రభువుల ఆధీనంలో ఉండి తర్వాత ఈస్టిండియా కంపెనీ పాలనలోకి వచ్చింది. తర్వాత మహంతుల పాలనలోకి వచ్చింది. 1933 సంవత్సరం నుండి ప్రత్యేక కమిటీ పర్యవేక్షణలోకి వచ్చింది. కమీషనర్లు పరిపాలనను పర్యవేక్షించారు.

1951 నుండి హిందూ మత చట్టం ప్రకారం ధర్మకర్తల మండలి ఏర్పాటు చేశారు. దీని పర్యవేక్షణలో కమీషనరు స్థానే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పరిపాలనను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికి 18 మంది ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్లు పాలనను సాగించి బదిలీ అయ్యారు. ఇప్పుడు 19వ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ శ్రీఎ.పి.నారాయణ శర్మగారు, నారాయణాద్రీశుని కొలువులోనున్నారు.

ఈ విధముగా శ్రీ వేంకటాచల క్షేత్ర వైభవము యెంతో పునీతమైనది. మోక్షసిద్ధిని కలిగించునది. ఈ క్షేత్రములో వెలసిన శ్రీవేంకటేశ్వరస్వామి కలియుగమందలి సకలచరాచరజగత్తును కాపాడుచూ భక్తులకు కొంగు బంగారమైయున్నాడు. అందరు శ్రీవేంకటాద్రీశుడగు శ్రీవేంకటేశ్వరుని భక్తితో పూజించి తరింతురుగాక.

**"హరిః ఓమ్"**

# శ్రీనివాసుని వైశిష్ట్యం

*భూమన గిరిజాపతిరెడ్డి*

వేదములే శిలలై వెలసిన దీకొండ
యే దెస బుణ్యరాసులే యేరులైన దీకొండ
గాదిలి బ్రహ్మాది లోకముల కొనల కొండ
శ్రీదేవు డుండేటి శేషాద్రి యీకొండ

అంటూ ఈ క్షేత్రంయొక్క నిజమైన ఆధ్యాత్మిక తేజోవైభవాన్ని అన్నమాచార్యులు ఆవిష్కరించాడు.

"స్మరణా త్స ర్వపాపఘ్నం స్తవనా దిష్టవర్షిణమ్,
దర్శనా న్ముక్తిదం చేశం శ్రీనివాసం భజేఽనిశమ్

ఈ స్వామివారిని స్మరిస్తే చాలట! మన పాపాలన్నీ పోతాయి ఆ దేవుణ్ణి కీర్తిస్తేచాలట! మన కోరికలన్నీ నెరవేరుతాయట. ఆ దేవదేవుణ్ణి కనులారా దర్శిస్తే చాలట! ముక్తి కలుగుతుంది. అటువంటి శ్రీనివాసమూర్తిని నిత్యమూ భజిస్తాను.

భక్తప్రియుడు వరాలరాయుడు అయిన శ్రీవేంకటేశ్వరస్వామి స్వయంభువుగా వెలసిన పవిత్రస్థలమే తిరుమల పుణ్యక్షేత్రం. ఆ ఆనందుని ఆలయప్రాంగణంలో అనేక దివ్యస్థలాలు, మంటపాలు అద్భుతశైలీ విన్యాసాలతో విరాజిల్లడంతోపాటు, తిరుమలేశునితో పెనవేసుకొన్న ఎంతోమంది భక్తుల మధుర జీవితఘట్టాల్నీ, తద్వారా శ్రీనివాసుని భక్తవాత్సల్యాన్నీ, లీలలనూ నిక్షేప్తంచేసుకొని వున్నాయి.

స్వామివారి పేరుకుకూడా ఒక వైశిష్ట్యం వుంది. తిరుమలేశుడు తాను నిలిచివున్న దివ్యస్థలాన్ని బట్టి, తన వక్షః స్థలంమీద వెలసిన శ్రీమహాలక్ష్మి పేరు ననుసరించి పిలువబడుతున్న సాక్షాత్తు పరబ్రహ్మమూర్తి అంతేకాక ఆ శ్రీనివాసుడు నిలిచివున్న తీరుకూడా అద్భుతమే. "సంసార సాగర సముత్తరణైక సేతో" అన్నట్లుగా కటి వరదహస్తాలతో ఒక సొంపైన భంగిమలో నిలిచివుంటూ అందరినీ అనుగ్రహించి అలరిస్తువున్న ఆస్వామి ఆనందనిలయుడు. అలాగే ఆ శ్రీనివాసునికి అలంకరింపబడే అనేక దివ్యాభరణాలూ, వివిధ రకాలైన నవరత్న మణిహారాలు చూపరులను ఆశ్చర్య పరవశులను గావిస్తూ ఆ వేంకటరమణుని అనంత వైభవాన్ని వేనోళ్ళ చాటుతూవున్నాయి.

'నిత్యకళ్యాణం పచ్చతోరణం' గా ప్రశస్తి చెందిన ఈ శేషాచలంలో ఘనవేంకటేశ్వరునకు ప్రతిరోజూ 'కళ్యాణోత్సవం' ఒకటేకాక, సుప్రభాతం, తోమాలసేవ, సహస్రనామార్చన, ఏకాంతసేవవంటి నిత్యోత్సవాలు; విశేషపూజ, అష్టదళపద్మపాదపూజ, సహస్ర కలశాభిషేకం, తిరుప్పావడసేవ, పూలంగిసేవ, శుక్రవారాభిషేకం

వంటి వారోత్సవాలు, కోయిల్ ఆళ్వారు తిరుమంజనం, ఉగాది ఆస్థానం పద్మావతీ పరిణయం, జ్యేష్ఠాభిషేకం, ఆణివార ఆస్థానం, పవిత్రోత్సవం, బ్రహ్మోత్సవం ఇత్యాది సంవత్సరోత్సవాలు జరుపబడుతూ, ప్రతిరోజూ ఒక పండుగగా, ప్రతిపూట పాయసాల పరమాన్ననివేదనలతో భాసిస్తూ, ఏడుకొండలవానికి ఏడాది పొడవునా సుమారు 450 కి పైగా ఉత్సవాలు నిర్వహింపబడుతూవున్నాయి.

శ్రీవారి ఆలయంలోని మహాద్వారగోపురం-కృష్ణరాయమండపం అద్దాలమండపం-రంగనాయకమండపం-బంగారు ధ్వజస్తంభం-బలిపీఠం-క్షేత్రపాలకశిల-విమాన ప్రదక్షిణంలోని 'చుట్టుగుళ్ళు'-ఘంటామండపం-బంగారువాకిళ్ళు-స్నపనమండపం-రాములవారిమేడ-శయనమండపం-గర్భాలయంలోని శ్రీవారి మూలవిరాణ్మూర్తి-ఇతర ఉత్సవమూర్తులు- ఈవిధముగ ఆయా ముఖ్యప్రదేశాలను, మూర్తులను, అనేకానేక అద్భుతవిషయాలను పాఠకులు ప్రత్యక్షంగా దర్శిస్తూ, ఆనందిస్తూ అనుభూతిని పొందుతారు.

ప్రతి సంవత్సరం రెండు మార్లు, శ్రీవేంకటేశ్వరస్వామివారు ఒక్కడే ఒకమారు, బ్రహ్మోత్సవాలు ముగిసిన మరురోజు బాగ్‌సవారి రోజున అప్రదక్షిణంగాను, మరొకమారు దేవేరులతో కలిసి ప్రదక్షిణంగా వచ్చి ఆనందాళ్వారు తోటలోని శిలామండపంలో వేంచేసి పూజలందుకొని సముచిత రీతిని అనంతార్యులను సంభావిస్తూవున్నాడు.

హైమోర్ధ్వపుండ్ర మజహన్మకుటం సునాసం
మందస్మితం మకరకుండలచారు గండమ్
బింబాధరం బహుళ దీర్ఘకృపాకటాక్షం
శ్రీవేంకటేశ ముఖమాత్మని సన్నిధత్తామ్

తెల్లని నామం, పాయని కిరీటం, సొగసైన నాసిక, తొలుకాడే చిరునగవు, మకర కుండలాల కాంతితో నిగనిగలాడే చెక్కిళ్ళు, దొండపండులాగ కళకళలాడే పెదవులు, మిగుల నిడుదలై దయతో కూడివుంటూ కాంతులీనే కడగంటి చూపులు కలిగి ప్రకాశిస్తూవున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి ముఖారవిందం నిరంతరం నా మనస్సులో నిలిచివుండుగాక.

ఇలా భూలోక వైకుంఠమైన వేంకటాచలక్షేత్రంలో భువన మోహన సుందరుడై పిలిస్తే పలికే ప్రత్యక్షదైవంగా భాసిస్తూవున్న శ్రీవేంకటేశ్వరస్వామివారి మూలవిరాణ్మూర్తుల ముఖారవిందాన్నీ, మన మనస్సుల్లో గాఢంగా నిలిచివుండేట్లుగా వర్ణించిన ఈ శ్లోకం అనంతాళ్వారుల వారి భక్తికీ, పాండితీపటిమకూ పరాకాష్ఠ! తిరుమల శ్రీనివాసుని ఆలయచరిత్రను, ఉత్సవ విశేషాలను, కైంకర్యవివరాలను గూర్చి సంస్కృతభాషలో తెలియజేసే "శ్రీవేంకటాచల ఇతిహాసమాల" అనే వచన గ్రంథాన్ని వెలయించిన రచయిత ఈ అనంతాచార్యులు.

పదకవితా పితామహుడూ శ్రీవేంకటేశ్వరుని అంతరంగభక్తుడైన తాళ్ళపాక అన్నమాచార్యులు శ్రీనివాసుని మహిమలను గూర్చి ఇలా గానం చేసినాడు.

**ఎటువంటి వాడవో నీ మహిమ**
**లెట్టు దెలియ వచ్చును**
**నిటల లోచనుడు, అజుడు తెలియలేరు**
**నిన్నెట్లు దెలిసేరు మానవులు,**
**తిరుమలనంబి తా తాతయన్న నాడె**
**తెలిసెబో మీ పెద్దతనములు**
**కురువనంబిగారి చేతి బంకమట్టి పువ్వులు**
**కొన్నవాడె తెలిసె మీ భోగము**
**మఱియు నవంతాళువారి చెరువుగట్ట**
**మన్ను మోయగా తెలిసె మీనటనలు**
**గరుడ గంభముకాడ కాసు కొక్కవగమిచ్చి**
**గడయించ దెలిసె మీ సంపద**
**తొండమాంజక్రవర్తికి సంపద**
**తొలుత నియ్యగా దెలిసె మీ యీవులు.**

అంటూ తిరుమలేశుని భక్త ప్రియత్వం, పక్షపాతం, వరప్రదానగుణం ఈ రీతిగా, ఈ తీరుగా వుంటాయని గిరగీసి చెప్పడం సాధ్యమయ్యే పనికాదనీ, అట్టి శ్రీనివాసుని లీలల్నీ, మహిమల్నీ నిటలలోచనుడయిన పరమ శివుడూ, నాలుగువేదాలను అలవోకగా వల్లెవేసే బ్రహ్మదేవుడూ సయితం తెలియలేనపుడు ఇక మానవులు ఏపాటి అర్థంచేసుకోగలరని తాళ్ళపాక అన్నమయ్య అంటాడు.

ఈ ఏడుకొండలవాణ్ణి ఏ పేరుతో పిలిచినా పలుకుతాడు కాని, ఈ స్వామివారికి "గోవిందా!" అని పిలిస్తేనే ఎనలేని ఆనందం! గోవిందా! అనే పిలుపుతో ద్వాపరయుగంలో తన నేస్తులతోటి గడిపిన రోజులు స్మరణకు వచ్చి ఈ స్వామి మైమరపునకు లోనవుతాడు! గోవిందా! అనే పిలుపే భలే ఇష్టమని తెలుస్తుంది. ఎందుకంటే గోవిందా! అనే భక్తుల సంబోధన చెవుల బడగానే ఆనందనిలయుడు అనంతయుగాల్లో తాను పొందిన అన్ని పట్టాలకంటే ద్వాపరయుగంనాటి "ఆలకాపరి" "పసులకాపరి" ఉద్యోగం చాలగొప్పది అని భావిస్తూ ఉబ్బి తబ్బిబ్బు అవుతాడంట! గ్రోవిందా! అన్న పిలుపులో ఆ వెర్రి గోపాలునికి వేదనాదాలకంటె

కూడా ద్వాపరంనాటి పిల్లనగ్రోవిరవళి రమణీయంగా వినబడి పరమానందాన్ని పొందుతాడు! అందుచేతనే పరమభక్తుడైన అన్నమయ్య కూడా-

**"భావములోనా బాహ్యము నందును**
**గోవింద! గోవింద!! అని కొలువవో మనసా!"**

అని అడుగడుగునా ప్రబోధించినాడు తిరువెంకటనామము వెల సులభము ఫలమధికము, అని కొనియాడి ప్రచారం చేసినాడు. ఈ తిరుమల హరిని కొలువని కొలువులు అడవిగాచిన వెన్నెలలనీ, ఈ అచ్యుతుని గూర్చి వినని కథలు భువిలో గజస్నానాలనీ, కలియుగ వైకుంఠుని గూర్చి పొగడని పొగడ్తలు బూడిదలోపోసిన పన్నీరులనీ, కొండలరాయని కోరని కోరికలు అందనిమాని పండ్లని, తిరుమలేశుని తెలియని తెలివి ఏదైతే వుందో అది నట్టనడి ఏటిలోని పైరులనీ, కేశవుని ఒల్లని బదుకులు ప్రవాహంలో కలిపిన చింతపండు వంటివనీ, గోవిందునికి మొక్కని మొక్కులు గోడలేని గాలిచిత్రాల వంటివనీ హెచ్చరిస్తూ, తిరుమల స్వామిని గూర్చి అడుగడుగునా భక్తులకు అన్నమయ్య తెలియజేసినాడు.

ఆపద వచ్చినవేళ, ఆరణిబడినవేళ, పాపపువేళ, భయపడినవేళ వోపినంత హరినామం చెయ్యడమే గతి దప్ప, ఇతరత్రా ఎంతపొరలినా ఏమాత్రం లాభం లేనే లేదు.

సంకెళ్ల బెట్టిన వేళ, చంపబిలిచిన వేళ, అప్పులవారు ఆరడిపెట్టిన వేళ వేంకటేశుని నామమొక్కటే నిన్ను విడిపించగలదుగాని, మంకుబుద్ధితో మాపుదాకా ఇతరత్రా ప్రయాస పడినా మరి దారి దొరకనే దొరకదు అంటూ అన్నమయ్య "ఓ కలియుగ మానవులారా! భక్తులారా! అదిగో అటు చూడండి, మీకన్నులెదుటే కనిపిస్తూ వున్న వైకుంఠం".

**కట్టెదుర వైకుంఠము కాణా చయనకొండ**
**తట్టెలాయ మహిమలే తిరుమలకొండ**

అంటూ వేంకటాచల శిఖరాలకు దారి చూపించినాడు. అంతేకాదు అది కేవలం రాళ్ల రప్పల మయం కాదు. గుండ్లూ గుట్టల మయం కానేకాదు. సాక్షాత్తు శ్రీవైకుంఠమే ఈ తిరుమల అంటూ స్పష్టం చేసినాడు.

ఎంతటి భక్తులకయినా, ఎంతటి విరామమున్న యాత్రికుల కయినా, అత్యంత వేగవంతమైన ఈ యాంత్రిక జీవితంలో ఆనందనిలయుని ఆలయ విశేషాలను, ప్రత్యక్షంగా చూస్తూ తెలుసుకోవడం, ఆ స్వామి వారికి జరిగే అన్ని ఉత్సవాల్లోనూ పాల్గొని తిలకించడం సాధ్యమయ్యేపనికాదు. అందుకని స్థూలంగా శ్రీవేంకటేశుని వైశిష్ట్యాన్ని వివరించడం జరిగినది.

# శ్రీకృష్ణదేవరాయలు - గొప్ప దేవునికి గొప్ప భక్తుడు

-డా॥ సుబ్రమణ్యం రెడ్డి

## ఉపోద్ఘాతము

ఎందరో మహానుభావులు, ఆచార్యులు, కవులు, గాయకులు, విద్వాంసులు, రాజులు, చక్రవర్తులు, తత్వవేత్తలు, తపోనిధులు, భక్తులు తిరుమల చేరి శ్రీవేంగళనాథుని దర్శించి వారి జన్మలను పండించు కొన్నారు. అట్టివారిలో తొండమాను చక్రవర్తి, తిరుమలనంబి, అనంతాళ్వారు, రామానుజాచార్యులు, తాళ్ళపాక అన్నమాచార్యులు, హాథీరాంబావాజీ, వ్యాసరాయలు, తరిగొండ వెంగమాంబ, మలయాళస్వామి వంటి వారెందరో ఉన్నారు. ఆ దేవదేవుని చేరుటకు జ్ఞాన, భక్తి, కర్మ, మొదలగు మార్గములలో ఒక దానినిగాని, కొన్నింటిని గాని, లేక అన్నింటినిగాని అనుసరించి తరించినారు. వీరిందరిలో శ్రీకృష్ణదేవరాయలు విలక్షణమైన స్థానము నలంకరించియున్నాడు. ముఖ్యముగా కలియుగములో అధర్మము పాలు ఎక్కువగుటవలన మానవులు శారీరకముగా, మానసికముగా బలహీనులౌతారు, అటువంటి వారికి శరణాగతి మార్గమే సుఖప్రదము. స్వామి వారి వరద హస్తము దీనినే సూచించుచున్నది. తన్ను త్రికరణ శుద్ధిగా శరణు వేడిన వారికి స్వామి ఎప్పుడైనా, ఎక్కడైనా, ఏమైనాయిచ్చును. ఈ విషయమును పదకవితా పితామహుడు తాళ్ళపాక అన్నమయ్య ఇట్లు వివరించెను. "ఏమి వలసిన నిచ్చు ఎప్పుడైనను ఏమరక కొలిచిన నీతడే దైవము" ఈ సత్యమును గ్రహించిన రాయలవారు దేశకాలపరిస్థితులననుసరించి తన జీవితములో వచ్చిన కష్టాలను, నష్టాలను, సుఖసంతోషాలను స్వామికి సమర్పించి తన జీవితమును ధన్యతగావించుకొన్నాడు.

## గొప్పదేవుడు

తిరుమల దేవుడు నిత్యకల్యాణమూర్తి. సత్యపాలన చక్రవర్తి. కలియుగములో మానవుల కష్టాలు తీర్చడానికి దివి నుండి భువికి దిగి వచ్చిన వైకుంఠవాసుడు. దీనులను, హీనులను, పాపులను, ప్రభువులను, పండితులను పామరులను సమదృష్టితో ఆదరించు కరుణామయుడు. తొలి చూపులోనే భక్త జన హృదయాలను దోచుకొను అర్చావతార దివ్య సుందరమూర్తి. ఆపదలలో ఉన్న వారి పాలిటి కల్పతరువు. దుష్టుల పాలిట అశని పాతము. నమ్మినవారికి కొండంత, నమ్మనివారికి గగన కుసుమము. ఆనంద నిలయములో కొలువున్న కొండలరాయుడు. అలంకార ప్రియుడు. ఆ స్వామి స్వయంవ్యక్తమూర్తి. కలియుగ ప్రత్యక్షదైవము. తిరుమల దివ్యక్షేత్రము అతని రాకతో కలియుగ వైకుంఠముగా మారినది. అటువంటి స్వామికి సేవ చేయుట ఎన్నో జన్మల పుణ్యాఫలము.

భారతదేశము నందు అతి ప్రాచీనమైన పుణ్యక్షేత్రములలో తిరుమల మందిరమునకు ఒక ప్రత్యేకత కలదు. సుమారు రెండు వేల సంవత్సరముల చరిత్రగల ఈ దేవాలయము అనేక రాజవంశముల సేవలందు కొన్న మహోన్నతమైన ఆధ్యాత్మిక సంస్థ. ఇంత గొప్పక్షేత్రముగాని, దేవుడు గాని త్రికాలాలలో ఉండరని

అనేక మంది భక్తులు వేనోళ్ళ కొనియాడినారు. శ్రీనివాసుడు కేవలము రాతి బొమ్మకాదు. మాట్లాడే దేవుడు. కళ్ళుంటే చూచి, చెవులుంటే విని విశ్వసించువారి భాగ్యమే భాగ్యము. అహంకారము విడిచి విశ్వశక్తికి మారు పేరై యున్న తిరుమల స్వామిని శరణు వేడినప్పుడే అది లభించును.

**గొప్ప భక్తుడు**

శ్రీకృష్ణదేవరాయలు గొప్ప యోధుడు, విజేత, సామ్రాజ్య నిర్మాత, సాహసి, అపజయమనునది ఎరగని మహాసేనాని, మరియు పరిపాలనాదక్షుడు, శత్రువులకు సింహస్వప్నము. వ్యూహాత్మక రాజకీయ చతురుడు, డామింగోపేస్ అను పోర్చుగీసు యాత్రికుడు రాయలను గూర్చి ఇట్లు చెప్పెను.

"రాయలు పొట్టికాదు పొడగరికాదు. మధ్యరకం. అందమైన శరీరఛాయగలవాడు. చక్కని మూర్తి. బొద్దుగా ఉంటాడు. ముఖము మీద స్ఫోటకపు మచ్చలుకలవు. అతడంటే అందరికి హడల్. సంపూర్ణుడైన పాలకుడు. ఉల్లాసవంతుడు. విదేశీయులపట్ల దయతో మర్యాదతో ప్రవర్తించును. అతని పేరు కృష్ణరాయ మహారాయలు. రాజులకు రాజు. గొప్ప న్యాయమూర్తి. భారతదేశములోని ప్రభువులందరిలో గొప్ప ప్రభువు. మూడు సముద్రముల మధ్యవున్న భూమికి అధిపతి".

ఉత్తర దిగ్విజయ యాత్ర సాగించి (క్రీ.శ. 1510-11), బహమనీ రాజ్యములపై అనేక విజయములు సాధించి, "యవ రాజ్యస్థాపనా చార్య" యను బిరుదు పొందెను. దక్షిణ దిగ్విజయ యాత్ర జరిపి (క్రీ.శ. 1512-13) సామ్రాజ్యములో శాంతి భద్రతలు నెలకొల్పెను. తూర్పు దిగ్విజయ యాత్రలు నడిపి (క్రీ.శ.1513-19) అనేక పట్టణములను జయించెను. ఈ సందర్భములోనే కొండవీడు కోట గోడలు బద్దలు కొట్టి శత్రురాజులైన వీరభద్రరాయలు (ప్రతాపరుద్ర గజపతి కుమారుడు) నరహరిదేవ, రాచూరి మల్లుఖాన్, ఉద్దండఖాన్ మొదలగు వారికి ప్రాణభిక్షపెట్టెను. తరువాత కొండపల్లికోటను జయించి ప్రహరరాజశరచ్చంద్ర మహాపాత్ర, బిజ్జలిఖాన్ మొదలగు వారిని ప్రాణములతో విడిచిపెట్టెను. తిరుగుబాట్లను అణచినప్పుడు, కోటలను జయించినప్పుడు శత్రువులపట్ల, స్థానికులైన ప్రజలపట్ల అతడు ప్రదర్శించిన మత సహనము, జీవకారుణ్యము శ్లాఘనీయమైనది.

ఒకవైపు యుద్ధము చేయుచూ మరొకవైపు తీర్థయాత్రలు సాగించినాడు. సింహాచలము, అమరావతి అహోబిళము, తిరుపతి, శ్రీకాళహస్తి, రామేశ్వరము మొదలగు పుణ్యక్షేత్రములను దర్శించి వాటి అభివృద్ధికి పాటు పడినాడు. రక్తసిక్తమైన తన ఖడ్గమును రామేశ్వరమునందలి సముద్రజలాలలో కడిగించి పాప పరిహారము గావించుకొన్నాడు. అన్నిటి కన్నా మిన్నగా ఏడుమార్లు తిరుమలయాత్ర సాగించి తన ఇష్టదైవమైన తిరువేంగళ నాథుని అనేకరీతుల సేవించినాడు. రాయలు సమరాంగణ సార్వభౌముడే కాదు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు కూడా! తాను రచించిన తెలుగు ప్రబంధము" ఆముక్తమాల్యదను" స్వామికి అంకితమిచ్చినాడు.

**ఏడు సార్లు సాగిన తిరుమల యాత్ర**

శ్రీకృష్ణదేవరాయలను గూర్చి వ్రాయుచు సూవెల్ పండితుడు(The author of "A Forgotten Empire"), అతడు వేకువ జామువనే లేచి వ్యాయామము, కత్తిసాము, చేయును. గుఱ్ఱపు స్వారీ చేయుటలో అందెవేసిన చేయి, ఉన్నతమైన వ్యక్తిత్వము కలవాడు. అతనిని కలసిన వారెవరైనా అతనిని మెచ్చుకొనక మానరు". అని చెప్పెను. ఇట్లు దిన చర్యకు తన శరీరమును సిద్ధము చేసికొనుటయేగాక తన రాణులు, రాజ బంధువులు, మంత్రులు, కవులు, గాయకులు, కళాకారులు, 60 మైళ్ల చుట్టుకొలత కలిగిన రాజధాని రక్షణకు 100000 కాల్బలము, 120000 అశ్వదళము, 500 ఏనుగులున్న సైన్యము యొక్క పోషణ, అమర నాయకులు సామంతులు, ప్రజల యొక్క సంక్షేమము తాను పర్యవేక్షణ చేయవలసియుండును. ఇన్నిబాధ్యతలు బరువులు ఉన్నప్పటికి తిరుమల దేవుని తన మనసులో స్థిరముగా నిలుపుకొన్నాడు. తన జీవిత కాలములో ఏడు మార్లు తిరుమల యాత్ర చేసినాడు. మొదటి యాత్ర క్రీ.శ. 10.02.1513లో జరిగినది. స్వామిని తన ఇద్దరు రాణుల సమేతముగా దర్శించుకొన్నాడు. బంగారు కిరీటము, కంఠాభరణము, పాదుకము, వెండితో చేసిన 26 హారతి పళ్ళెములు తిరుమలేశునికి సమర్పించినాడు. చిన్నమదేవి ఒక బంగారు పాలగిన్నెను, తిరుమలదేవి ఒక బంగారు పాలగిన్నెను మరియు పరిమళ ద్రవ్యములకు ఒక బంగారు పళ్ళెమును స్వామికి అర్పించిరి. అతి దగ్గరలోనే అనగా క్రీ.శ. 02.05.1513లో రెండవ యాత్ర సాగినది. ఈమారు స్వామివారికి అభరణములు, ఉత్సవమూర్తులకు చిన్న కిరీటములు చేయించినాడు. ఈ యాత్రలో రాణులు పాల్గొనలేదు. మూడవ యాత్ర క్రీ.శ. 13.06.1513లో జరిగినది. ఈ మారు కూడా రాణులు రాలేదు. రాయల తండ్రి నరసనాయకుడు, తల్లి నాగాజమ్మ వారి పేర్ల మీదుగా నవరత్న ఖచిత అభరణము మరియు సఫరాన్ కప్పు స్వామివారికి సమర్పింప బడినవి. తన పేర రాయలు త్రైమాసములో బ్రహ్మోత్సవము జరుగులాగున ఏర్పాట్లు చేసినాడు. అందులకు కరకంబాడి, తురూరు, చత్రవాడయను గ్రామములను దానముగా ఇచ్చెను. నాలుగవ యాత్ర క్రీ.శ. 09.06.1514లో సంభవించినది. ఈ మారు రాయలు 30000 వరహాలతో స్వామికి కనకాభిషేకము జరిపించెను. బంగారు అభరణములు మరియు ఒక జత కడియములు బహూకరించెను. నైవేద్యమునకు తాళ్ళపాక గ్రామమును ఇనాముగా ఇచ్చెను. చిన్నమదేవి కంఠమాలను, తొండమండలములోని ముదియూర్ గ్రామమును దానముగా వొసంగెను. తిరుమల దేవి సారపాదుకమును చోళింగరంపట్టులో ఉన్న పిరట్టి కుళత్తూర్ గ్రామమును దానముగా ఇచ్చెను. ఐదవయాత్ర క్రీ.శ. 02.01.1517లో సాగినది. ఈ మారు రాయలు తిరువేంగళనాథునికి కంఠమాల, పాదుకము సమర్పించి, 30000 వరహాలతో ఆనందనిలయమునకు బంగారు మలాము వేయించెను. స్వామికి పూజాది కార్యక్రమములు సక్రమముగా జరుగుటకు తిరుపతి, దాని పరిసరగ్రామములను దానముగా నిచ్చెను. ఇందులో రాణులు పాల్గొనలేదు. ఆరవయాత్ర క్రీ.శ. 16.10.1518లో జరిగినది. రాయలు తనపట్టపురాణి తిరుమల దేవి, రాకుమారుడు తిరుమలరాయ మహారాయలతో కలసి

స్వామిని దర్శించినాడు. రాకుమారుని క్షేమము కొరకు కొన్ని భూములు దానముగా ఇవ్వబడెను. కాని దురదృష్టవశాత్తు ఈ పిల్లవాడు 6 సం॥లు నిండకనే మరణించెను. ఏడవది మరియు చివరి యాత్ర క్రీ.శ. 17.02.1921లో సంభవించినది. ఈమారు కూడా తనపట్టపు రాణి తిరుమల దేవమ్మతో కలసి స్వామిని దర్శించెను. స్వామివారికి పీతాంబరము, కుళ్ళాయి, రెండు చామరములు, పాదుకము, 10000 వరహాల ధనము, రాణి ద్వారా మరొక పాదుకము సమర్పించెను.

స్వామికి రాయలవారు నాడు సమర్పించిన ఆభరణములు లక్షల వరహాల విలువకలిగియున్నవి. ఈ కాలములో అనేక కోట్ల రూపాయల విలువ కలిగియుండును. వానిలో యేఒక్కటైన స్వామి అలంకరణలో మనము చూడలేము. అరుగుదల, కరిగించి వేయుట మొదలగు చర్యలు ఇందులకు కారణములైయుండ వచ్చును.

**ఉపసంహారము**

ప్రపంచ చరిత్రలో ఎందరో రాజులు, రారాజులు, చక్రవర్తులు ఉన్నారు. తమ యొక్క గొప్పతనమును, అహంకారమును, అనేక రీతుల ప్రదర్శించినారు. ఫ్రాన్స్ చక్రవర్తియైన లూయీ XIV "నేనే రాజ్యాన్ని" అనిప్రకటించుకొన్నాడు. ఆ దేశమునకే చెందిన నెపోలియన్ బోనాపార్టీ తన యుద్ధ విజయాలను గూర్చి తెలియ జేయుచూ "నేను యుద్ధ భూమిలో ఎదిగాను, మనుషుల ప్రాణాలంటే నాకు లెక్కలేదు" అని గర్వముగా చెప్పుకొన్నాడు. రష్యాను పాలించిన జార్ అలెగ్జాండర్. ఒక సందర్భములో నెపోలియన్‌తో ఇలా అన్నాడు. "ఐరోపా అంటే ఏమిటి? అదెక్కడుంది? ఐరోపా నువ్వునేను కాదా!" అని చెప్పెను. కానీరాయలు మాత్రము తిరుమల చేరి స్వామిమ్రోలచేతులు జోడించి నిలబడి తాను సాధించిన విజయాలు, చేసినతప్పులు, ఒప్పులు కుప్పవోసి శరణువేడినాడు. ఇది ప్రపత్తి మార్గానికి పరాకాష్ట. జగద్గురువు శ్రీకృష్ణభగవానుడు గీతలో ఇలా ప్రవచించెను.

**సర్వధర్మాన్ పరిత్యజ్యమామేకం శరణం వ్రజ!**
**అహంత్వాం సర్వపాపేభ్యోమోక్ష యిష్యామి మాశుచః !!**

"సర్వ విధములైన ధర్మములను త్యజించి కేవలము నన్నే శరణుపొందుము. నిన్ను సర్వపాపఫలముల నుండి నేను విముక్తునిగావింతును. విచారింపకుము". అనిపై శ్లోకమునకు అర్థము. ఈ పారమార్థిక సత్యము శ్రీకృష్ణదేవరాయల దినచర్యలో భాగమైనట్లు తోచుచున్నది. అందువలననే అతడు గొప్ప దేవునికి గొప్ప భక్తుడు.

# శ్రీ వేంకటేశ్వర లీలావైభవమ్

ఐ. రమాదేవి

**కృతేతు నరసింహోఽభూత్రేతాయాంరఘునందన:**

**ద్వాపరే వాసుదేవశ్చ కలౌ వేంకట నాయక:**

కృతయుగంలో నరసింహరూపం త్రే.తాయుగంలో దశరథాత్మజుడైన శ్రీరామచంద్రమూర్తి, ద్వాపరంలో వసుదేవ సుతుడైన వాసుదేవ కృష్ణమూర్తి కలిలో తిరుమల గిరివాసుడైన శ్రీవేంకటేశ్వరుడు ప్రత్యక్షదైవాలని శాస్త్రపురాణ ప్రమాణం.

వైకుంఠవాసుడైన శ్రీమన్నారాయణుడు వైకుంఠాన్ని విడిచి భక్తజన రక్షణార్థము తిరుమలగిరి మీద ఆనందవిమాన నిలయుడై వేంకటేశుడై కలియుగదైవం అయినాడు. అందుచేతనే తిరుమలకు కలియుగ వైకుంఠమనిపేరు.

సందర్శన మాత్రం చేతనే సకలార్థసిద్ధులనూ కలిగించేదీ, జ్ఞానదాయకమైనదీ కనుక "జ్ఞానాద్రి" అనీ, గరుడుని చేత వైకుంఠమునుండి తీసుకొని రాబడుటచేత "గరుడాద్రి" అనీ, కనకవర్ణము కలిగి వుండుటచేత "కనకాద్రి" అనీ శ్వేతవరాహస్వామి ఇక్కడ నివసించుట చేత "వరాహాద్రి" అనీ, శ్రీవేంకటేశ్వరుడు ఇక్కడ కొలువైవుండుట చేత "వేంకటాద్రి" అనీ పిలువబడింది. ఆదిశేషుడు సప్తగిరుల రూపాన నిలువెత్తి వుండుటచేత "శేషాద్రి" అని విశ్రుతమైనది.

శుద్ధతత్త్వమైన పరబ్రహ్మతత్వాన్ని ప్రతిపాదించే పరమపావన క్షేత్రమే తిరుమల క్షేత్రం. యుగ యుగాలుగా వేద, ఉపనిషద్, పురాణ ప్రతిపాదితాలైన సృష్టి వైచిత్ర్యాలు పరమాత్మ లీలా నాటకాలు, మహర్షుల తపో-యజ్ఞ-దాన ఫలాలు, ఎందరెందరో పరమ భక్తుల ఆత్మానుభవాలు, ధర్మాలు భక్తులచేత ప్రమాణాలుగా చెప్పబడినవి, చెప్పబడుతూనే వున్నాయి.

వేం = పాపములను కటతీతి దహతీతి వేంకటపతి అని,

"వేం" అమృతబీజము

"కటము" బంగారము. అమృతైశ్వర్యాలను దర్శనమాత్రం చేతనే ప్రసాదించేదీ, ఇహపరానంద సంధాయినీ వేంకటాచలమని మనకు మన పూర్వీకులకే కాదు సమస్త ప్రపంచవాసులకూ నమ్మకము కలదీ తిరుమలగిరి శ్రీనివాస సన్నిధానం.

నారము అంటే జ్ఞానము - జలము అని కదా చెప్పబడినది. దానిని అనుసరించి ఈ వేంకటాచలమున అనేక దివ్యతీర్థాలున్నవి. ఇక్కడి ప్రతి తీర్థమూ దేవతా సంచార మైనదే. అటువంటి పదిహేడు తీర్థాల ప్రసక్తి కడు పవిత్రమై తీర్థస్నాతులైన వారి మనస్సులు పరమాత్మానుభవంతో జ్ఞానడోలికలలో ఓలలాడుతాయని, సాక్షాత్మోక్షదాయకాలనీ ఋషుల, అనుభవైక వేద్యుల ఉవాచ. వాటిలో మొదటగా చెప్పవలసినది కపిలతీర్థము.

పూర్వము కపిలమహర్షి శేషాచలమునకు దిగువ భాగమున 17 తీర్థములతో సమ్మిళితమైన కపిల తీర్థము వద్ద ఆశ్రమము నిర్మించుకొని తపమాచరించు చున్నాడట. పూర్వము కపిలమహర్షి పాతాళమున పూజించిన శివలింగమే భూమిని చీల్చుకొని ఇక్కడ కపిలాశ్రమమున పైకి వచ్చినది. పద్మావతీ శ్రీనివాసుల కళ్యాణానికి దేవతలు అందరూ వచ్చినారు. వివాహవేడుక కాగానే అందరూ గృహోన్ముఖులు అయినారు. పార్వతీ పరమేశ్వరులు కపిలాశ్రమమునకు వచ్చినారు. కపిల మహర్షిని పరమేశ్వరుడు అనుగ్రహించినందున ఆ కపిలతీర్థము కపిలేశ్వర తీర్థముగా ఇహపర సాధనం అయింది.

కపిలతీర్థం ఉపరి తలాన శక్రతీర్థం వున్నది. ఆ శక్రతీర్థస్నానం చేత ఇంద్రునకు గౌతమశాప విమోచన కలిగింది. ఆపైన విష్వక్సేన తీర్థమున్నది. వరుణ సుతుడైన విష్వక్సేనుడు అక్కడ స్నానమాచరించి తపస్సు చేసి శ్రీహరికి సేనాని అయినాడు. ఎగువనున్న పంచాయుధ, బ్రహ్మ, అగ్ని సప్తర్షి తీర్థాలన్నీ దిగువనున్న కపిలతీర్థంలో సంలీనం అయి, అధికాధిక ఫలప్రదాతలవుతూ వున్నవి. కనుక కపిలతీర్థ స్నానము, ఒకరాత్రి అక్కడ నిద్రచేయుట సనాతన పద్ధతి.

ఆనందనిలయమునకు ఈశాన్యమున స్వామిపుష్కరిణి, వాయవ్యమున వరాహస్వామి నిలయము వున్నవి. వైకుంఠ వాసుడైన శ్రీమన్నారాయణుని క్రీడాద్రిని భూలోకమున గరుడుడు నిలిపినప్పుడే స్వామీ పుష్కరిణిని కూడా భూతలానికి తెచ్చినట్లు పురాణ నిర్వచనమున్నది. ఆకాశగంగ పుష్కరిణిలో అంతర్వాహినిగా వున్నది.

స్వామి పుష్కరిణీ స్నానం సద్గురోః పాపాసనమ్
ఏకాదశీ వ్రతం చాపి త్రయమత్యంత దుర్లభమ్

స్వామీ పుష్కరిణీ స్నానము, ఏకాదశీ వ్రతము, సద్గురుచరణ సేవనము అసామాన్యములని ఆర్యోక్తి. మహిమాన్వితమైన ఈ స్వామి పుష్కరిణి సకల తీర్థరాజము. ఈ పుష్కరిణి గురించి అనేక దివ్యగాధలున్నవి.

పూర్వము శంఖణుడు అనే చంద్రవంశపురాజు సాంకాస్యరాజ్యానికి అధిపతి. ఒకప్పుడు అతని సామంతులు అంతా ఏకమై ఆయనను రాజ్యభ్రష్టుని చేశారు. శంఖణుడు తీర్థయాత్రలు చేస్తూ దక్షిణకాశిగా పేరొందిన కాళహస్తి చేరి సువర్ణముఖరీనదిలో స్నానం చేస్తూ జ్ఞానప్రసూనాంబను సేవిస్తూ వుండగా ఒక ఆకాశవాణి వినిపించింది.

రాజా! ధైర్యము కూడదీసుకుని వెంటనే వేంకటాద్రికి వెళ్ళి శ్రీస్వామిపుష్కరిణిలో స్నాతుడవైన వెంటనే నీ రాజ్యమును నీవు పొందగలవు అని. వెంటనే వేంకటాద్రి చేరి ఆరునెలలు పుష్కరిణీ స్నానవ్రతమాచరించాడు. ఒకనాడు పుష్కరిణీ తటమున శ్రియః పతినే ధ్యానిస్తున్న శంఖణునకు పుష్కరిణి మధ్య శ్రీభూదేవులతో శ్రీమహావిష్ణువు ప్రత్యక్షమైనాడు. వత్సా! శంఖణుడా! భక్తిప్రపత్తులతో నీవుచేసిన స్నానవ్రతమువల్ల నీ సమస్త పాపము నశించింది. ఇంక నీరాజ్యానికి వెళ్ళి సుఖించుమని అదృశ్యుడైనాడు. తిరిగి రాజ్యానికి చేరిన శంఖణుడు చిరకాలం ప్రజలను కన్నబిడ్డల్లా పాలిస్తూ, వేంకటేశ్వరుని సేవిస్తూ పరమపదంచేరాడు.

తరవాత ఎన్నదగిన పుణ్యతీర్థము ఆకాశగంగ. ఈ తీర్థము స్వామి పుష్కరిణికి ఉత్తర భాగముననున్నది. కీకారణ్యంలోని ఒక గిరి సారంగంలో నుండి నిరంతర జలధార ప్రవహిస్తూ వుంటుంది. ఆ జలధార యుగ యుగాలుగా భూమిని పునీతం చేస్తున్నదనటానికి ఈ వృత్తాంతం ప్రమాణం. పూర్వము త్రేతాయుగాన కేసరి అనే వానరోత్తముని భార్య అంజనాదేవి తనకు సంతానము కలుగలేదని మంతంగ మహర్షిని దర్శించినది. తనకు సంతానము కలుగుటకు తగిన మంత్రమును ఉపదేశించమని వేడుకున్నది. మతంగముని ఆమె భక్తి నివేదనను మన్నించి అమ్మా! భూలోకమున వేంకటాచలమునకు ఉత్తరదిశనున్న ఆకాశగంగ తీర్థాలలో స్నానమాడి నిశ్చల మనస్సుతో వాయుదేవుని గురించి తపస్సు చేయుము. మహాబల పరాక్రమాలలో వాయు సమాన పుత్రుని పొందగలవని చెప్పి తగిన మంత్ర ముపదేశించగా, దృఢదీక్షతో తపించి ఆంజనేయుని పుత్రుడుగా పొందినట్లు అందుచేతనే ఆ పర్వతమునకు అంజనాద్రి అని పేరున్నట్లు త్రేతాయుగ వృత్తాంతము.

ప్రతి సంవత్సరము చైత్ర మాసమున చిత్రానక్షత్రయుక్తపూర్ణిమనాడు ఆకాశగంగా స్నానము చేసిన వారికి సంతానప్రాప్తి ఐశ్వర్యలబ్ది కలుగుతాయని అనూచానవిశ్వాసం.

అటుతరువాత పేరులోనే పాపనాశనాన్ని తెలియచెప్పేది "పాపనాశన" తీర్థము. పుష్కరిణికి ఉత్తరదిశలో వున్న పర్వత లోయలోని పుణ్యతీర్థము. స్నానం చేసినవారి పాపాలను తొలగించుకొని పోతున్నదా! అన్నట్లు జలంమీద ఒక కల్మషపు నీడ తేలిపోవటం మనకు దృశ్యమానం అవుతూ వుంటుంది. ఈ తీర్థమహిమను తెలిపే పురాణగాథ ఒకటి చెప్పుకుందాం.

సకల వేదవేదాంగవేత్త, సమస్త శాస్త్ర పురాణసంవేది అయిన భద్రమతి అనే వినయ సంపన్న పండితోత్తముడు వుండేవాడు. అధిక సంతానము కలవాడు. మహాదారిద్ర్యం చేత పీడించబడుతూ వుండేవాడు. ఆలుబిడ్డల పోషణకూడా బహుభారం అయింది. ఆత్మగౌరవాన్ని విడిచి ఇతరులను యాచించలేక, చింతతో కృశించి పోతున్నాడు. భర్త బాధ గ్రహించిన ఆయన ధర్మపత్ని ఒకనాడు అనునయంగా ఇలా చెప్పింది. స్వామీ నా చిన్ననాట ఒక యతి మా తండ్రిగారితో చెప్పినమాట నేనువిన్నాను. శ్రీవేంకటాచలముననున్న పాపనాశన తీర్థమున స్నానము చేసి భూదానం చేసినవారికి సమస్తపాపం నశించి సకలైశ్వర్యవంతులు అవుతారని తీర్థమాహాత్మ్యం చెప్పినాడు. కనుక మనం కూడా పాపనాశన తీర్థస్నానంతో వేంకటపతి కరుణతో విముక్తులం అవుదాం అని హెచ్చరించింది.

వెంటనే సకుటుంబంగా వేంకటాచల యాత్రకు బయలుదేరారు. దారిలో సుశాలి అనే పట్టణంలో సుఘోషుడు అనే ధర్మాత్ముని కొంత భూమిని తనకు దానమిమ్మనికోరాడు. అంతటి పండితునికి భూదానం యివ్వటం తన అదృష్టం అని భావించి సుఘోషుడు వెంటనే భూమిని సమర్పించాడు. ఆ పండితుడు పాప నాశనంలో స్నానమాడి చిత్తశుద్ధితో శ్రీహరిని, మహాలక్ష్మినీ ధ్యానించి సత్పాత్రుడు, సంతానవంతుడు అయిన బీదబ్రాహ్మణునకు భూమిని దానమీయగా, భద్రమతికి లక్ష్మినారాయణులు సకలైశ్వర్యాలు ప్రసాదించారు. ఇలలో ఆ పండితుడు సకలభోగాలూ అనుభవించి కడకు హరిసాయుజ్యం పొందాడు.

తరువాత ఇహపరసాధకంగా చెప్పబడేది "కుమారతీర్థం". ఎన్నడో కుమారస్వామి తపస్సు చేయటం చేత, కౌండిన్యుడనే శతాధిక వృద్ధుడు ఈ తీర్థంలో స్నానంచేసి కౌమార వయస్కుడు అయినాడనీ స్వయంగా శ్రీవేంకటపతే ఆ వృద్ధుని కుమార తీర్థానికి తీసుకువెళ్ళాడనీ చెప్పబడిన ప్రమాణమే ఆ తీర్థానికి కుమార తీర్థమని యుగ యుగాలుగా సార్థకనామం అని మహర్షుల ఉవాచ. ద్వాపరంలో కురుపాండవ సంగ్రామం తరువాత పాపపరిహారార్థం శ్రీకృష్ణపరమాత్మ పాండవులను కొంతకాలం శేషాద్రిమీద నివశించమని పంపాడు. వైశాఖ శుద్ధ ద్వాదశీ భానువారం నాడు పాండవులు శేషాద్రికి చేరి ఒక జలాశయం వద్ద నివశించారనీ, అందు చేతనే అది పాండవతీర్థం అని ప్రసిద్ధి చెందినదనీ ప్రత్యక్షసాక్ష్యంగా ఎందరో మహనీయులున్నారు.

అలా వేంకటాచలంలోని అణువణువూతానే అయి పరమాత్మ ప్రాణికోటిని తరింప చేస్తున్నాడనే అనేక ప్రామాణిక ఇతిహాసాలు ఉన్నాయి. ఇవన్నీ ఏదో యుగంలో మాటలు అని అనుకోరాదు. ఈ నాటికీ స్వామి కరుణాపాత్రులైన భక్తులకు కొంగుబంగారమే. చిత్తశుద్ధితో వెంకటరమణా నీవేదిక్కని వేడుకుంటే తక్షణమే రక్షించే కలియుగదైవం వేంకటపతి.

భగవంతుని దయాపాత్రులమై పొందే ఫలితాలు కొన్ని అంతర్ముఖమైనవి. (మానసిక) అంటే అలౌకికా లన్నమాట. కొన్ని లౌకికమైనవి. ఈ చర్మ చక్షువులతో మనం చూచి అందరికీ చూపించగలవి. అందుకే వేంకటతి అందరికీ అపద మ్రొక్కులవాడు. సర్వభూతాత్ముడు. పిలిస్తే పలికే శ్రీవేంకటేశుని లీలావైభవాలు భక్తులందరికీ ఎప్పుడో ఒకప్పుడు అనుభవాలవుతాయి. మాకుటుంబం అనుభవాన్ని ఒకదానిని మీతో పంచుకుంటాను.

2002 ఆగష్టు 19వ తేదీన మా కొడుకు కోడలు, 11 ఏళ్ళ మామనవడు ముగ్గురు మనవరాళ్ళు (13 ఏళ్లు) తిరుమల చేరాం. మా కోడలు మనవడు, ఇద్దరు ఆడపిల్లలు కాలిబాటమీదుగా సప్తగిరులెక్కాలని మ్రొక్కుబడి. మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరితే సాయంకాలం 6,7 గంటలు మధ్య పైకి రాగలరనీ ఈ లోపల మేము కారులో పైకి వెళ్ళాలనీ నిర్ణయించాం. మా అబ్బాయి తాను అంతదూరం నడవననీ పైగా నేను సహాయం లేకుండా మెట్లు ఎక్కలేననీ ఉండిపోయాడు. మెట్లెక్కే భక్తులు చాలామందే వుంటారులే అని భావించాం. అయినా ఆడపిల్లలతో కోడలు ఒక్కతే వెళ్తున్నదే అని చిన్న చింతా యోచన పొడసూపింది. అయినా స్వామి సన్నిధిలో నీకా ఆలోచన ఎందుకే మూర్ఖునిలా అని మనస్సును మందలించుకున్నాను. కొండకు బయలుదేరే ముందు అందరూ నాకు నమస్కరించారు పెద్దదానినని.

**జలే రక్షతు వారాహః**
**స్థలే రక్షతు వామనః**
**అటవ్యాం నారసింహశ్చ**
**సర్వతః పాతు కేశవః**

అనే శ్లోకాన్ని పఠిస్తూ, గోవిందా, గోవిందా అని పిలుస్తూ కొండ ఎక్కమని ఆ శ్లోకాన్ని ఒక కాగితం మీదవ్రాసి ఇచ్చి, జాగ్రత్తగా దగ్గర వుంచుకోండి అదేమీకు రక్ష అని చెప్పాను. వాళ్లు బయలుదేరారు. కారుమబ్బులు క్షణాల్లో క్రమ్ముకొచ్చాయి. ఉరుములు, మెరుపులు, నింగీనేల ఏకమైనదా అన్నంత వర్షం. కొండలు కనుపించనంత వానధారలు. టాటా సుమో కారు కదలిపోయేంత వాన. కారులో కూర్చున్న మేమే తట్టుకోలేక పోతున్నాం పిల్లల పరిస్థితి ఎలావుందో? అసలే జనం తక్కువగా వున్నారు ఆ రోజు తిరుమలలో . మగవాళ్లూ తోడులేరు అనుకుని వెంటనే హేచరాచరజగన్నాథా! వేంకటరమణా! ఎవరికెవరు తోడు? అందరికీ సర్వాంతరాత్మవైన నీవేతోడు. వాసుదేవమంత్రం (ఓం నమో భగవతే వాసుదేవాయ) నారాయణమంత్రం (ఓం నమోభగవతే నారాయణాయ) స్థిరచిత్తంతో పఠించటం మొదలు పెట్టాను. అంతకన్న ఆ తిరువెంకటపతి లీలానాటక రంగస్థలం మీద పాత్రలం మనం ఏం చెయ్యగలం? కాని చిత్రాతి చిత్రమైన ఒక అనుభవం.

కాలిబాటమీద చుక్క వానలేదు. ఆ సమయంలో ఆ బాటమీద నడుస్తున్న వాళ్లు ఒక వృద్ధ జంట. నలుగురైదుగురు బెంగుళూరు ఇంజనీరింగు కాలేజి విద్యార్థులు. నలుగురైదుగురు పల్లెవాసులు. వాళ్ళుకూడా వేగంగా నడుస్తూ ముందుకెళ్ళి పోయారట. వెనుక దూరంగా విద్యార్థులు ముందువీళ్ళు మాత్రమే మిగిలారట. మా కోడలు శ్రీయఃపతీ నీవేదిక్కని నమస్కరించిందట. అంతా శ్లోకాన్ని పఠిస్తూ గోవిందా అని గొంతెత్తి అరుస్తూ నడుస్తున్నారట. ఆరుగజాల దూరంలో హఠాత్తుగా ముద్దులు మూటకట్టినట్లున్న ఎనిమిదేళ్ళ పిల్లవాడు కనుపించాడు. కనుచూపు మేరలో ఎవరూ లేరుకదా! ఈ పిల్లవాడెక్కడినుండి వచ్చాడని అంతా ఆశ్చర్యపోయారు.

తెల్లని వాడుకాదు. చామనచాయ. కనుమాసిన తెల్లచొక్కా. చామంతిరంగు నిక్కరు. పాలుగారే బుగ్గలు. అందమైన తలకట్టు. గాలికి ఎగురుతూన్న ముంగురులు. చురుకైన పెద్దకళ్ళు. చేతిలో పచ్చిచువ్వబెత్తం. ఒక్కసారి వెనక్కి తిరిగి రండి అని తల ఊపాడట. అంతే! మంత్ర ముగ్ధుల్లా ఆ పసివాడి వెంటపడి నడవటం మొదలు పెట్టారుట. అంతలో వెనుకనున్న వాళ్ళుకూడా వచ్చి చేరారట. అందరికీ నడక వేగం హెచ్చింది. ఆ పాదాలకు చెప్పులు లేవు. ముగ్ధమోహనంగా వున్నాయా చిన్నిపాదాలు. అలతి అలతి అడుగులతో కదులుతుంటే చూడబుద్ధి వేస్తోంది. కళ్ళుపాదాలమీద నుండి తిరిగి రావటంలేదు. ఎంతదూరం నడిచినా నాలుగు గజాలదూరంలోనే వున్నాడట. ఒక్కసారి మాత్రం క్షణం ఆగి జింకలకు జేబులో నుండి తీసి రెండు కారెట్ దుంపలు పెట్టాడు. అంతే ఒక్కసారి కూడా ఆగలేదు. వెను తిరుగలేదు.

ఒక్క వానచినుకులేదు. భయంలేదు. అలసట లేదు. మాట్లాడుకోలేదు ఎవరుకూడా. గోవిందా గోవిందా అని మనస్సులో అనుకుంటూ, ఆ ముగ్ధమోహనరూపమే ధ్యానం గమ్యం అన్నట్లు చూస్తూ అనాయాసంగా నడక పూర్తి అయింది. నాయనా! నీవే మాదైవం. నీవే మా ముందు నడిచిన బాలపరమాత్మవు శ్రీవేంకటపతివి అని నమస్కరించిందట మా కోడలు.

మేము బయలుదేరే ముందు కారు కాలిబాట మంటపం దగ్గరకు పంపుతాం అని చెప్పాము. కాని ఈ వాన ఆందోళనలో డ్రైవరుకి ఆమాట స్పష్టంగా చెప్పలేదు. డ్రైవరు బస్‌స్టాండ్ దగ్గర కారు పెట్టుకుని వున్నాడు. ఆ సంగతి వాళ్ళకు తెలియదు. కాని ఆ సర్వాంతర్యామికి తెలుసు. ఆ పిల్లవాడి వెంట వెళ్ళటమే వాళ్ళకు తెలుసు. అయ్యో మంటపం వైపు కాదా! వెళ్ళాలి! బస్‌స్టాండ్ వైపొచ్చామే, ఇప్పుడెలా కారు అక్కడుంటుంది కదా అని అనుకుంటున్నారు. అప్పుడే క్షణంపాటు కళ్ళు ఆ పిల్లవాడి మీద నుండి మరలినాయి. అంతే ఆ బంగారు తండ్రి హటాత్తుగా కనుపించలేదు.

అయ్యో! ఏదో పసివాడు! ఇంతదూరం మనని తీసుకువచ్చాడే! తినటానికైనా ఏమీ పెట్టలేదే! క్షణంలో ఎటువెళ్ళాడూ? జనం కూడా లేరే ఎక్కువమంది. చూడండి ఇక్కడే ఎక్కడో వుంటాడు అని అందరూ అన్ని వైపులా వెదికారు. కాని క్షణాలమీద 10 మంది కళ్ల కప్పి అదృశ్యం అయినాడు. ఇంజనీరింగ్ విద్యార్థులు, పిల్లలు, మా కోడలు అందరి మనస్సులు దిగులు, బాధతో మూగపోయాయి. ఆపసివాడెవరో? మళ్ళీ ఎలా కనిపిస్తాడూ! అతని ఋణం ఎలా తీర్చుకుంటాం? అని. అంతలో అక్కడకారుకనుపించింది. ఇదంతా ఆ తిరువేంకటేశుని లీలానాటక హేలా తరంగమేనని అందరికీ అవగతం అయింది. నీవు కన్పించినా గుర్తించలేని అల్పమానవులం. మళ్ళీ నిన్నెలా చూస్తాం! హే విభూ! మామీద నీకెంతదయ! కరుణాంతరంగా! తిరు వేంకట రమణా! అని అందరం చేతులు జోడించాం పదే పదే. నెలరోజులు ప్రతిరోజూ ఆ విషయమే చెప్పుకున్నాం.

అందరూ చెపుతుంటే ఆరూపం నామనసులో ముద్రవేసుకున్నది. నా మనోఫలకం మీద ఆ రూపాన్ని ఆ సంఘటనని అనేకసార్లు చర్వితచర్వణం చేసుకున్నాను. నేను వెంటనే ఆ మహదనుభవాన్ని సప్తగిరి (తి.తి.దే వారి) పత్రికకు మా కోడలు రమణి పేరుతో వ్రాశాను. ప్రచురించబడింది. ఆ లీలా నాటకం కంటిముందు సదాకదులాడుతూనే వుంటుంది. ముల్లోకాలనూ తమితో కొలచిన త్రివిక్రముడవు ప్రభూ! కాపాడు! అన్న మొర వినగానే పాదరక్షలు కూడా లేని చిన్ని చిన్ని పాదాలతో, బుడి బుడి అడుగులతో తోడుగా నడిచావా! పుండరీకాక్షా! పురుషోత్తమా! తిరువేంకటాధీశా! కలియుగదైవమా! విశ్వాత్మా! అని భావోద్వేగంతో స్రవించే అశ్రువులతో ఆ చిన్నారి పాదాలు కడిగి 'తవచరణం మమశరణం' అని శిరసు వంచుతూనే వుంటాను. నాటికీ-నేటికీ-ఏనాటికీ మనసున్నంతవరకూ ఆ దివ్యచరణాలను భావన చేస్తూనే వుండాలనీ, ఆ భాగ్యాన్ని ప్రసాదించమనీ ఆ సప్తగిరివాసునికి శ్రీనివాసునికి మ్రొక్కులిడి వేడుకుందాం.

# మొక్కుబళ్ల దేవుడు తిరుమల వెంకన్న

*జొంకంటి బాలసుబ్రహ్మణ్యం*

**'శేషాచలే యన్మాహాత్మ్య మన్యక్షేత్రే నతత్ క్వచిత్,**
**తద్గత శ్రీనివాసస్య మహిమా నాన్యగః శుభ':**

కలియుగంలో భూలోకవైకుంఠమని ప్రసిద్ధనామంతో పిలువబడుతున్న వేంకటాచల క్షేత్రంపైన కొలువున్న శ్రీనివాస ప్రభువు సాటిలేని దేవుడు, మేటి అయిన దేవుడు.

'పుర్రెకో బుద్ధి, జిహ్వకోరుచి'- అన్నట్లు ఎన్నెన్ని పుర్రెలున్నా వాటి ఆలోచనలు మరెన్నివున్నా, ఆ ఆలోచనలకు తగ్గట్లు ఎన్నెన్నో అభిరుచులున్నా ఆ అన్నింటి ఆలోచనలకూ అభిరుచులకు అనువైన దేవుడు తిరుమల వెంకన్న. కనుకనే తాళ్ళపాక అన్నమాచార్యులు స్వామిని గూర్చి

**'ఎంతమాత్రమున నెవ్వరు దలచిన అంతమాత్రమే నీవు**
**అంతరాంతరము లెంచి చూడ బిండంతె నిప్పటి యన్నట్లు'**

అని కీర్తించాడు. శ్రీవేంకటేశ్వరుని అసలు తత్త్వం ఏమిటో, ఆయన అసలు పేరు ఏమిటో తెలియకపోయినా భక్తకోటి, ఆ దేవుడు నిలిచిన దివ్యస్థలాన్ని బట్టి 'ఏడుకొండలవాడ'నీ పాపాల్ని పోగొట్టే కార్యాన్నిబట్టి 'వేంకటపతి' అనీ, తనవక్షఃస్థలంమీద కొలువై ఉన్న శ్రీమహాలక్ష్మి పేరును బట్టి 'శ్రీనివాసు' డనీ.... ఇలా తనకు నచ్చిన పేర్లతో పిలుస్తున్నాడు. అంతేగాదు స్వామివారి అనుగ్రహం చేత తమకు కలిగిన సంతానానికి కూడా ఆ పేర్లను పెట్టుకొని భక్తిగా మొక్కులు చెల్లించుకుంటున్నాడు. తిరుమలస్వామివారు కూడ తన భక్తులు ఆచార వ్యవహారాలు వేర్వేరు అయినా, వారి భాష ఒక్కటి కాకపోయినా, వారు మొక్కులను వింత వింతలుగా చెల్లించినా, వాటి నన్నింటిని స్వీకరించి వారు కోరిన కోరికలను తీరుస్తున్నాడు. అసలు మొక్కుబళ్ల మిషతోనే భక్తులను తన దగ్గరకు రప్పించుకుంటాడట స్వామి. అందువల్లే తిరుమలేశుడు 'మొక్కుబళ్ల దేవుడి'గా 'ఆపదమొక్కులవాడి'గా ప్రసిద్ధికెక్కినాడు.

## తలనీలాల మొక్కు

తిరుమల క్షేత్రానికి చేరుకున్న భక్తులు, యాత్రికులు శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించటానికి ముందుగా, తొలిగా సమర్పించే అత్యంత ప్రధానమైన మొక్కు తలనీలాలు సమర్పణ.

ఈ పుణ్యక్షేత్రంలో తలవెంట్రుకలను స్త్రీ పురుషులు అనే తేడా లేకుండా మొక్కులుగా సమర్పించటమనే సంప్రదాయం ఎప్పటినుంచి వస్తున్నదో, ఏనాటి నుంచి కొనసాగుతున్నదో ఇదమిత్థంగా తెలియకపోయినా, 19వ శతాబ్దం నాటికే ఈ మొక్కు విస్తృతప్రచారంలో వుందని స్పష్టమవుతున్నది.

అహరహం ఆర్తిగా ఆర్ద్రంగా ఆనందంగా తనను చేరుతున్న భక్తుల తల నీలాలను స్వీకరిస్తూ ఆ భక్తుల యొక్క చిక్కులన్నింటిని తీరుస్తూవున్న శ్రీనివాసుడు నిజంగా భక్తులపాలిటి ఆపద్బాంధవుడేకదా!

**సేవలు - ఉత్సవాలు**

తిరుమల క్షేత్రంలో ప్రతిరోజూ పండుగే. ప్రతిపూటా పరమాన్నాలే. పాయసాలే. ఉత్సవప్రియుడైన స్వామివారు తనకు ఉత్సవాలు-సేవలు చేయించినా, లేదా వాటిలో పాల్గొని దర్శించినా వారికి కల్యాణ పరంపరలు గుప్పించడమే ఆ స్వామివారి లక్ష్యం. తమ ఇంట్లో శుభకార్యం జరిగితేనో, ఇల్లు కట్టుకుంటేనో, సంతానం కలిగితేనో స్వామివారికి కల్యాణోత్సవం చేయిస్తామని మొక్కుకోవడం భక్తులకు సర్వసాధరాణం.

వేంకటాచలక్షేత్రంలో శ్రీనివాసుడు వెలసిన తొలినాళ్లలోనే బ్రహ్మదేవుడు, లోకకల్యాణకారకంగా తన సృష్టి కార్యం సక్రమంగా కొనసాగేటట్లు అనుగ్రహించినందువల్ల తిరుమలప్పకు తిరునాళ్లు జరుపుతానని మొక్కుకొని ఉత్సవాలు చేయించాడట. బ్రహ్మదేవుడు చేసిన ఉత్సవాలు కాబట్టి బ్రహ్మోత్సవాలుగా ప్రసిద్ధి కెక్కి, అవి నేటికీ నిర్విఘ్నంగా జరుగుతున్నాయి.

ఆ తర్వాత కాలాంతరంలో ఎందరో చక్రవర్తులు, రాజులు శ్రీనివాసుడనుగ్రహించిన తమ విజయ పరంపరలకు కృతజ్ఞతా పూర్వకమైన భక్తితో తిరుమల వెంకన్నకు బ్రహ్మోత్సవాలు చేశారు.

పల్లవరాణి సామవై 'మనవాళ పెరుమాళ్' అనే వెండి శ్రీనివాసుని విగ్రహాన్ని తిరుమల ఆలయానికి మొక్కుగా సమర్పించింది. ఈ విగ్రహమే ప్రతిరోజు రాత్రి, ఏకాంతసేవలో పవ్వళింపు సేవను పొందుతూ 'భోగశ్రీనివాసమూర్తి'గా ప్రసిద్ధికెక్కింది.

క్రీ.శ. 1254లో తెలుగు పల్లవరాజు విజయగండగోపాలదేవుడు, 1328లో త్రిభువనచక్రవర్తి తిరువేంకట నాథయాదవరాయలు, 1446 హరిహరరాయలు, 1530లో అచ్యుతరాయలు..... ఇలా ఎందరో రాజులు ఆయా కాలాల్లో బ్రహ్మోత్సవాలను చేయించారు. పిదప పుష్పయాగోత్సవం, పవిత్రోత్సవాలు... వంటి అనేక ఉత్సవాలు కూడ తిరుమలలో నిర్వహింపబడినాయి.

**పుష్పాల సమర్పణ**

శ్రీవేంకటేశ్వరస్వామి పుష్పాలంకార ప్రియుడు. శ్రీనివాసుని పుష్పప్రియత్వాన్ని దృష్టిలో ఉంచుకొని ఇటీవలి కాలంలో బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి, ఉగాది వంటి విశేష పర్వదినాల్లో భక్తులు మొక్కుకొని భక్తిగా పుష్పసమర్పణ చేసుకొంటున్నారు. చాల పూర్వం నుంచీ కూడ తిరుమలలో ఆయా భక్తుల చేత వెలసిన అనగా, అనందాళ్వారుతోట, తాళ్లపాకం, తరిగొండవారి తోటలు, పెరుందేవి తోట.... ఇలా తిరుమలేశుని పుష్పకైంకర్యసేవకుగాను సమర్పింపబడి పాలుపంచుకొంటున్నాయి.

తొండమాను చక్రవర్తి కేవలం బంగారు పువ్వులతో మాత్రమే ప్రతిరోజు శ్రీనివాసుని అర్చించేవాడట. ఈ బంగారు పూలనుకాదని, సామాన్యపామర భక్తుడైన కుమ్మరనంబి సమర్పించిన మట్టిపూలకోసం అర్రులు చాచేవాడట ఆనందనిలయుడు. ఇదెంత విచిత్రం! 1984లో హైదరాబాద్ నివాసి అయిన ఒక మహమ్మదీయ భక్తుడు మొక్కుగా సమర్పించిన 108 బంగారు కమలాలతో శ్రీస్వామివారు ప్రతిమంగళవారం 'అష్టదళపాద పద్మారాధన' సేవను ఘనంగా నిర్వహింపజేసుకుంటున్నాడు. ఇక ప్రతి గురువారం రాత్రి కేవలం పూలంగి సేవలో దర్శనమిస్తూ, తన పుష్పప్రియత్వాన్ని చాటుకొంటూ భక్తులను పులకింపజేయడం అనిర్వచనీయం!

**ఆభరణాల సమర్పణ**

ఆనంద నిలయునకు వున్న ఆభరణాలు, అలంకారాలు ఒక ప్రత్యేక ఆకర్షణతో ఆనందాన్ని కలిగిస్తాయి. ఆ స్వామివారికి పాదాదిగా శిరసాంతం వరకు గల దివ్యాభరణాలు, మణిహారాలు చూపరులకు ఆశ్చర్యపర వశులను గావిస్తూ అద్భుత లోకంలో విహరింపజేస్తాయి. ఆ స్వామి ధరించిన వజ్రాలు వైడూర్యాలు జిగేలు మంటూ మిరుమిట్లు గొలుపుతాయి.

**చూడ జూడ మాణిక్యాలు చుక్కలవలె నున్నవి.**
**యీడులేని కన్నులవె యిన చంద్రులు**
**కంటి గంటి వాడె వాడె ఘన ముత్యాల**
**కంటమాల లవె పదకములు నవె**
**మింటి పొడవైనట్టి మించు కిరీటం బదె**
**జంటల వెలుగు శంఖ చక్రాలవె....**

ఇలా నిలువెత్తుగా స్వామి అలంకరించుకొన్న ఆభరణాలను నగలను వర్ణిస్తాడు అన్నమాచార్యులు.

ఎందరో రాజ్యాధినేతలు, రాజులు, రాణులు, సామంతులు, సామాన్యభక్తులు, తమస్థాయిలకు తగినట్లుగా శ్రీస్వామివారికి నగలూ, ఆభరణాలను మొక్కులుగా సమర్పించుకున్నారు.

శ్రీకృష్ణదేవరాయలు 1513 నుంచి 1521 వరకు ఏడుమార్లు తిరుమలయాత్ర చెయ్యడమేగాక, స్వామి అనుగ్రహించిన విజయపరంపరలకు గుర్తుగా ఒక నవరత్నఖచిత కిరీటాన్ని, 25 వెండి పళ్లాలను, అమూల్యమైన వజ్రాభరణాలను, ఉత్సవమూర్తులకు మణిమయ కిరీటాలను రత్నాలు పొందిగిన బంగారు మకరతోరణాన్ని కానుకలుగా సమర్పించాడు. అంతమాత్రమేగాక 1518 సెప్టెంబరు 9వ తేదీన 30 వేల వరహాలతో ఆనందనిలయ విమానానికి బంగారు మలాము చేయించాడు. ఆ తర్వాత అచ్యుతరాయలు, వెంకటపతిరాయలు.. తిరుమలేశునికి ఎన్నోనగలను కానుకలను సమర్పించారు. నేటికీ, ఇప్పటికీ ఎందరో భక్తవరేణ్యులు ప్రతినిత్యం కిరీటాలను మణిమయహారాలను శ్రీవారికి మొక్కులుగా సమర్పించుకుంటూనే వున్నారు.

## నివేదనలు

శ్రీనివాసుడు ఎంతటి అలంకార ప్రియుడో అంతటి నైవేద్యప్రియుడు. ఎంతటి నైవేద్యప్రియుడో అంతటి భక్తప్రియుడు. అందుకే తాను ఏరి కోరి ఆరగించే రుచికరములైన వంటకాలన్నింటిని భక్తులు తింటేనే ఆయనకి ఆనందం! తాను తిన్నవన్నీ భక్తులు రుచిచూస్తేనే ఆ స్వామికి ఒక తృప్తి! అసలు భక్తులకు తినిపించడానికి శ్రీవేంకటేశ్వరుడు మంచి మంచి కమ్మనైన ప్రసాదాలను ఆరగిస్తాడట! ప్రపంచంలో ఈ స్వామిని మించిన నైవేద్యప్రియుడు, భోజనప్రియుడు మరొకడు కన్పించడు.

"పాలు వెన్న బకాలబాతు దధ్యోదనం
బువుళి యోరెము వెన్నబూరియలును
సరడాలపాశముల్ చక్కెరపులగముల్
నువ్వుమండిగలు, మనోహరములు
అప్పము లిడ్డెన లతిరసముల్ హోళిగల్
వడలు, దోసెలు గల వంటకములు
శాకముల్ సూపముల్ చారు లంబళ్లు
శుద్ధోదనములును సద్యోఘృతమ్ము
పండ్లు తేనెలు హొబ్బట్లు పచ్చడులును"

అని ఇలాగ ఆనందనిలయుడు ఆరగించే వంటకాలను ఒక అజ్ఞాతకవి ఏకరువు పెట్టారు. కాని ఇవి కొన్ని మాత్రమే. తెనాలిరామకృష్ణకవి తిరుమలేశుడు ఆరగించేవాటిని ఏకరువుపెట్టలేక ఆస్వామికి 'తిండిమెండయ్య గారు' అని ఒక పెద్ద బిరుదునే తగిలించాడు. చాల పూర్వం నుంచీ శ్రీనివాసుని నైవేద్యప్రియత్వాన్ని దృష్టిలో పెట్టుకొని ఎందరో రాజులు మొదలుకొని సామాన్యులవరకు దానాలు, భూరివిరాళాలను మొక్కులుగా సమర్పించారు. 1515లో శ్రీకృష్ణదేవరాయలు, 1545లో పెదతిరుమలాచార్యులు.... బ్రిటీషుపాలనలో సర్‌థామస్ మన్రో కూడా శ్రీస్వామివారికి నివేదనలు సమర్పించినారు. ఈనాటికీ ఎందరోభక్తులు తిరుమలేశునికి నైవేద్యాలుగా లడ్డు, వడలు, చక్కెర పొంగలి, సీరా, పులిహోరా, పొంగలి మున్నగు ప్రసాదాలను సమర్పించడం అందరికీ తెలిసిన విషయం.

## వాహనాల సమర్పణ

తిరుమలేశునికి ఏడాది పొడవునా ప్రతిరోజూ జరుపబడే ఉత్సవాల్లో ఊరేగింపుల్లో ముందుభాగాన బారులుగా నడిచే గజ, తురగ, వృషభాలను కూడా కానుకలుగా సమర్పించడం కూడా కద్దు. నాడు మైసూరు

మహారాజులు, నేడు కర్నాటక ప్రభుత్వం ఏనుగులను శ్రీవారికి కానుకలుగా సమర్పిస్తున్నది. ఇవేగాక ఆయా కంపెనీలు తమ మొదట ఉత్పత్తులైన లారీలు, కార్లు, స్కూటర్లు మున్నగు ఆధునిక వాహనాలను ఏడుకొండలవాడికి మొక్కులుగా సమర్పిస్తున్నాయి.

ఇలాగ తిరుమలేశునికి ఏ కానుక పెట్టినా, ఏ సేవచేసినా, ఏ విరాళమిచ్చినా దాని వెనుక ప్రధానధ్యేయం "మొక్కు" చెల్లించడమే. అందులకే ప్రతినిత్యం భక్తులు నేలనాలుగు చెరగులనుండి తిరుమల యాత్రను చేసి తమ తమ మొక్కులు చెల్లిస్తారు. పిల్లలు, పెద్దలు, స్త్రీలు పురుషులు, కుంటి, గుడ్డి.... ఇలా వారు వీరు అనకుండా కుల, మత, భాష వర్గ వర్ణ భేదరహితంగా దేవతా సార్వభౌముడైన వేంకటేశ్వరస్వామివారిని దర్శించడానికి తిరుమలకు పరుగులు పెడ్తారు. మొక్కుబళ్లలో భాగంగా పాదయాత్రల్ని చేస్తారు. జోగి ఎత్తు కొంటూ వస్తారు. నిలువుదోపిళ్లిస్తారు. ముడుపులు సమర్పిస్తారు. తులాభారాలిస్తారు. తలనీలాలిస్తారు. మూడు కత్తెర లిస్తారు. ఆలయప్రదక్షిణల్ని, అంగప్రదక్షిణల్ని చేస్తారు. అఖండ దీపారాధనలను వెలిగిస్తారు. కొబ్బరికాయలను కొడ్తారు. చలిపిండ్ల నైవేద్యమిస్తారు. ఉత్సవాలు ఊరేగింపులు చేయిస్తారు. పులిహోరలు, పొంగళ్లు నివేదిస్తారు. సంతానం కలిగినవారు వెండి ఊయల్లను సమర్పించుకొంటారు. ఇంకా ఉంగరాలు, గాజులు, కడియాలు, హారాలు...... ఇలా ఎన్నో ఎన్నెన్నో వస్తువులను అత్యంత భక్తిప్రపత్తులతో భక్తులు మొక్కులుగా సమర్పించుకొంటారు.

**"వైకుంఠం వా పరిత్యక్ష్యే న భక్తాంస్త్యక్తు ముత్సహే**
**మేతి ప్రియాహి మద్భక్తా ఇతి సంకల్పవానసి"**

"నేను వైకుంఠాన్నయినా విడిచి వుంటానుగాని నా భక్తులను ఒక క్షణమయినా విడిచి వుండలే"నన్న దృఢదీక్షతో భూలోకానికి దిగివచ్చిన ఈ మొక్కుబళ్లదేవుడు తిరుమలక్షేత్రంలో వేంచేసి భక్తులకోసం ఎదురు చూస్తున్నంతవరకూ

**"వేడుకొందామా వేంకటగిరి వేంకటేశ్వరుని**
**ఆమటి మొక్కులవాడే ఆది దేవుడే వాడు"**

అని వేడుకొంటూ, నిరంతరం నిరంతరాయంగా భక్తులు తిరుమలకు వస్తూనే వుంటారు. ఆ మొక్కుబళ్ళ దేవుడికి తమ మొక్కుబళ్లను చెల్లిస్తూనే వుంటారు.

# కొండలలో నెలకొన్న శ్రీవేంకటేశ్వరుడు

డా॥ ఆకెళ్ల విభీషణశర్మ

శ్రీవేంకటేశ మత్స్వామిన్! జ్ఞానానంద దయానిధే!
శరణాగత సంత్రాణ! కరుణాభీష్ట వార్షుక!!

అఖండ భరతభూమిపై ఆంధ్రదేశంలో సమున్నత వేంకటాచలంపై కలియుగనాధుడు శోభిల్లుతున్నాడు. సాక్షాత్తూ పరబ్రహ్మమూర్తి విశ్వాంతర్యామియై, శేషశైలంపైన కటివరద హస్తంతో నిలిచియున్నాడు. నిత్యకళ్యాణచక్రవర్తి శ్రీవైకుంఠవిరక్తుడై, కలిదోషపీడితులైన మానవాళిని పరిరక్షిస్తున్నాడు. ఐరమ్మదీయము, అశ్వత్థము, హిరణ్మయభవనము,అపరాజితపురము మొదలైన పరమానంద స్థానాలను కలిగినది శ్రీవైకుంఠము, భక్తప్రీతిచేత దివ్యవైకుంఠాన్ని వీడి ఈ వేంకటాచలంపై వైఖానసఆగమవిహితంగా పూజాదికాలను అందుకొంటున్నాడు. ఆశ్రయించినవారందరినీ కరుణాభరణుడై దరిచేర్చి ఉద్ధరిస్తున్నాడు.

"ప్రవః పాన్త మన్దసో ధియాయతే!
మహే శూరాయ విష్ణవే చార్చత!" (ఋ.10 మండలం. 155వ సూ. 1 వ మంత్రం)

అన్న మంత్రం చేత ప్రతిపాదించబడుతున్న విష్ణ్వర్చావతారమూర్తిగా అవతరించిన లక్ష్మీవల్లభుడు, సర్వజగన్నియామకుడు. ఈ స్వామి వెలసిన కొండను బంగారు కొండగా, పాపాలను తొలగించి రక్షించే కరుణాస్థానంగా ఎందరో కీర్తిస్తున్నారు.

తొలి తెలుగు వాగ్గేయకారుడు అన్నమయ్య-

వేదములే శిలలై వెలసినదీ కొండ! యేదెస పుణ్యరాసులే యేరులైనదీ కొండ!
గాదిలి బ్రహ్మాదిలోకముల కొనల కొండ! శ్రీదేవుడుండేటి శేషాద్రి ఈ కొండ!

అని ఈ కలియుగ వైకుంఠం నిజ విలాసాన్ని ఆవిష్కరించాడు. పురాణాలు ఈ కొండను వరహాద్రి గరుడాద్రి, వైకుంఠాద్రి, కనకాద్రి, వేంకటాద్రి, పుష్కరాద్రి, సింహాచలము, నీలాద్రి, చింతామణిగిరి, అంజనాద్రి, నారాయణాద్రి, వృషాద్రి, వృషభాద్రి, వేదాద్రి, శ్రీనివాసాద్రి, ఆనందాద్రి, శ్రీగిరి, జ్ఞానాద్రి, శేషాద్రి, తీర్థాద్రి, సుమేరుశిఖరాచలం. వంటి సార్థకనామాలచే శ్లాఘిస్తున్నాయి. 28 వ ద్వాపర యుగాన్తమందలి ఈ కలియుగంలో శ్రీనివాసుని నేడు అసంఖ్యాక భక్తబృందాలు ఆశ్రయించి తరిస్తున్నారు. అనునిత్యం తిరుమల వేదోక్తమైన పూజాదికాలచే భాసిల్లుతున్నది. వేదవేద్యుడైన శ్రియఃపతి నిరంతరవేదపఠనాసక్తుడైన బ్రహ్మదేవుని సేవలకు ప్రసన్నుడవుతున్నాడు. అందువల్ల వేదాద్రిగా ఈ తిరుమలను భాగవతోత్తములు కీర్తిస్తున్నారు.

"వృష" శబ్దానికి "ధర్మ" మని అర్థం, తనవృద్ధికై ధర్మం ఈ తిరుమల క్షేత్రంలో తపస్సు చేసింది. అందువల్ల ధర్మదేవత లబ్ధిపొందిన ఈ దివ్యప్రదేశం వృషాద్రిగా ప్రసిద్ధి చెందింది.

"గిరావస్మిన్ తపస్తేపే, ధర్మోపిస్వాభివృద్ధయే!
తస్మాదాహు ర్వృషాద్రిం తం మునయో వేదపారగః ॥" (1వ భాగం-అధ్యాయం 36 శ్లో 28 వరాహ పురాణము)

భవిష్యోత్తరపురాణం ఈ వృత్తాంతం కృతయుగంలో జరిగినది కనుక దీనిని వృషాద్రియని ఆ యుగంలో పేర్కొనేవారని తెలియజేస్తున్నది.

"కృతే వృషాద్రిం వక్ష్యంతి, త్రేతాయా మంజనాచలమ్!
ద్వాపరే శేషశైలేతి, కలౌ శ్రీవేంకటాచలమ్!!"

శ్రీవారు పూర్వం ఈ లోకాన్ని పీడిస్తున్న హిరణ్యాక్షుని సంహరించాడు. తెల్లని తన కోరతో భూదేవిని అగాధమైన జలరాశి నుండి ఉద్ధరించాడు. భూదేవి అంశరూపాన్ని తన ఒడిలో ఉంచుకొని, ధర్మదేవత తపమాచరించిన ఈ ఉన్నతస్థలంపై నివాసముండ డానికి నిర్ణయించాడు. గరుత్మంతుని పిలిపించి లోకానుగ్రహకాంక్షతో క్రీడాద్రిని భూమికి తెప్పించాడు. లోకారాధ్యుడై యజ్ఞవరాహమూర్తి భూమాతను ఒడిలో ఉంచుకొని అప్రాకృతమైన ఈ క్రీడాద్రిపై కొలువైనాడు.

"వరాహాద్రి వరాహక్షేత్ర లక్ష్మతః" (వ.పు.36 అ. 28 శ్లో)

నాటినుండి ఆదివరాహక్షేత్రమవడంవల్ల ఈ క్రీడాద్రి వరాహాద్రిగా కొనియాడబడుతున్నది.

"ఆగతం గరుడం వీక్ష్య, స్థాపయేహ ఖగేశ్వర!
ఇత్యువాచ హరిస్సోపి స్థాపయామాస తం తధా!!" (వ.పు.34వ అధ్యా. 22 శ్లో)

శ్రీవైకుంఠం నుండి గరుడుడు ఈ పర్వతాన్ని తీసుకురావడం వల్ల ఈ గిరికి "గరుడాద్రి" అని ప్రసిద్ధి వచ్చింది.

గరుడాళ్వార్లు ఈ క్రీడాద్రిని శ్రీవైకుంఠం నుండి తీసుకువచ్చాడు.

"వైకుంఠాదాగతత్త్వేన వైకుంఠాద్రిరితి స్మృతః (వ.పు.1-36-26శ్లో)

అందువల్ల "వైకుంఠాద్రి" అని పేరు వచ్చింది. ఈ గిరి శ్రీవైకుంఠమందు బంగారు వర్ణంతో విరాజిల్లేది.

"అప్రాకృత మమేయం చ! సర్వరత్నమయం గిరిమ్!
హిరణ్మయం మహాశృంగం! పంచోపనిషదాత్మకమ్!!"
"శాంత కుంభ స్వరూపత్వాత్! కనకాద్రిం చ తుం విదుః!! (వ.పు.1-34 శ్లో 24)

అప్రాకృతమైన ఈ క్రీడాపర్వతం సాటిలేనిది సర్వరత్నశోభితమైనది. బంగారు శిఖరాలతో, పంచోపనిషత్స్వరూపమైనదిగా దీనిని దర్శించే దేవతాదులు "కనకాద్రి"గా కీర్తిస్తున్నారు.

మూడు యోజనములు విస్తారము, ముప్పై యోజనములు పొడుగు కలిగి శేషాకృతితో ఈ గిరి విరాజిల్లుతున్నది. కనుక ఇది "శేషాద్రి"గా ప్రసిద్ధికెక్కింది.

"యోజనత్రయ విస్తారం, త్రింశద్యోజన మాయతమ్।
శేషాకారం హరేశ్శేషం శేషికాం సర్వదేహినామ్॥" (వ.పు.34-17-18)

బ్రహ్మాండపురాణం శేషుడు తపస్సు చేసి, శ్రీహరి నివాసమున్న చోట తాను కొండగా ఉండుటకు కటాక్షించమని వరాన్ని పొందాడని తెలియజేస్తున్నది.

"అనంతోహం మహాదేవ! స్థాస్యామి గిరి రూపధృక్।
భవతా రమయా సార్థం! మమ సానుషు రమ్యతామ్॥" (2. అధ్యా. 37 శ్లో)

శేషాద్రిగా ఈ గిరిని భవిష్యోత్తర పురాణం, బ్రహ్మపురాణం తెలియజేస్తున్నాయి. అయితే శేషుడికి వాయువుకు కలిగిన స్పర్థతో శేషుడు మేరుపర్వత పుత్రుని ఆవరించాడు. వాయువు మహావేగంతో వీచి, పర్వత శిఖర శోభితమైన పవిత్రభూమిని సువర్ణముఖరీ తీరానికి తెచ్చాడు. శేషునితో ఆచ్ఛాదింపబడిన పర్వతం కనుక శేషాద్రిగా వ్యవహరిస్తున్నారు.

ఈ కొండకున్న మరో పేరు "సుమేరు-శిఖరాచలం" మేరు పర్వత శిఖరాలు ఎలా బంగారు కాంతితో ప్రకాశిస్తాయో అలా ఈ కొండ సత్త్వగుణసంపన్నులకు గోచరిస్తున్నది. అంతేకాక బ్రహ్మాండపురాణం ఈ కొండను మేరు పుత్రుడిగా వివరిస్తున్నది.

"మేరుపుత్రం మహాపుణ్యం, వేంకటాచలం సంజ్ఞకమ్॥" (3 అధ్యా. 37 శ్లో)

మేరుపర్వత పుత్రుడైన గిరికి వేంకటాచలమని పేరు ఉన్నది. అంతేకాక ధర్మదేవత తపమాచరించిన ఈ పవిత్ర దివ్యదేశం భక్తుల పాపాలను తొలగించేది, దీని వ్యుత్పత్తిని వరాహ పురాణం ఇలా తెలియజేస్తున్నది.

"వేంకారో మృతబీజం తు, కటమైశ్వర్యముచ్యతే।
అమృతైశ్వర్య సంఘత్వాత్, వేంకటాద్రిరితి స్మృతః॥" (వ.పు.1-36 అ, 34 శ్లో)

'వేం' కారం అమృతమని "కట" శబ్దం ఐశ్వర్యమని చెబుతున్నాయి ఈ కొండ ఆశ్రితులకు అమృతము, ఐశ్వర్యం అనుగ్రహిస్తున్నది. కనుక వేంకటాద్రిగా ప్రసిద్ధి చెందింట. కొందరు అక్షయమైన సిరులను కటాక్షించే కొండగా అభివర్ణిస్తున్నారు. భవిష్యోత్తర పురాణం 'వేంకటాద్రి' వ్యుత్పత్తిని సమీక్షిస్తూ-

సర్వపాపాని వేం ప్రాహుః కటస్తద్దాహ ఉచ్యతే।
తస్మాద్వేంకటశైలోయం! లోకే విఖ్యాతకీర్తిమాన్॥ (1-220-21)

'వేం' అంటే అన్ని పాపాలు 'కట' ధాతువు- దాహః అనే అర్థాన్ని కలిగివున్నది. వేంకటతీతి వ్యుత్పత్తి లోకంలోని సర్వపాపాలను దహింపజేసే పర్వతంగా 'వేంకటశైలా'న్ని విశ్లేషిస్తున్నది.

**పుష్కరాణాంచ బహుళ్యాత్, గిరావస్మిన్ సరస్సువై।**
**పుష్కరాద్రిం ప్రశంసన్తి మునయస్తత్వ దర్శినః॥** (వ.పు.1-36, 22 శ్లో)

ఈ కొండపైన అనేక తీర్థాలు ఉన్నాయి. భక్తిప్రద, జ్ఞానప్రద, ముక్తిప్రదతీర్థాలు, అసంఖ్యాకంగా ఉన్న ఈ తీర్థ దేశానికి తీర్థాద్రి అని పేరు వచ్చింది. 'ర' 'ల' లకు అభేదం వల్ల పుష్కర శబ్దం 'పుష్కల' మనే మేఘాలను సూచిస్తున్నది. మేఘాలకు ఆకరమైన ఈ గిరిని 'పుష్కరాద్రి' అని మునులు, తత్త్వజ్ఞులు, సన్నుతిస్తున్నారు.

**"హిరణ్యాక్ష్య వినాశాయ। ప్రహ్లాదానుగ్రహాయ చ।**
**నారసింహాకృతిర్యక్షే। యస్మాదస్మాత్స్వయం హరిః॥**
**సింహాచల ఇతిప్రాహు। స్తస్మాదేనం మునీశ్వరాః।** (వ.పు.34,26,27 శ్లో)

హిరణ్యకశివుని శిక్షించుటకు- ప్రహ్లాదుని రక్షించుటకు నారసింహాకృతితో ఈ పర్వతం నుండే బయలుదేరాడు. కనుక మునీశ్వరులు ఈ కొండను 'సింహాచలం'గా అభివర్ణిస్తున్నారు.

త్రేతాయుగంలో ఈ కొండకు నీలాద్రి, చింతామణి గిరి, అంజనాద్రి అనే పేర్లు ప్రసిద్ధిలోకి వచ్చాయి. రఘువంశరాజులలో ప్రసిద్ధుడైన ధశరథుడు పుత్రులు లేరని దుఃఖించినవేళ వశిష్ఠాది మహర్షులు వేంకటాచల యాత్ర చేయమని ప్రబోధించారు. దశరధుడు స్వామి పుష్కరిణిలో స్నానమాచరించి శ్రీహరిని ప్రార్థించాడు. నాలుగు శ్లోకాలతో ప్రార్థించిన రాజును, శ్రీవారు కరుణించి నలుగురు కుమారులు కలిగేటట్లు వరాన్ని అనుగ్రహించారు.

**"రాజన్। ప్రీతో భవద్భాక్త్యా, చతుశ్లోక్యా త్వదీయయా।**
**స్తుత్యా చ పరమప్రీతః తవ దాస్యే వరోత్తమమ్॥** (వ.పు.48 అధ్యా. 36శ్లో)

ఓ రాజా! నీకు జన్మించే పుత్రులు నలుగురు ఉత్తములని స్తుతిప్రీతుడైన స్వామి తెలియజేశారు. నాటి నుండి ఈ కొండ మానవాళికిసైతం "చింతామణి" గిరిగా ప్రపంచీకరింపబడింది.

**"చిన్తితస్య చ సిద్ధ్యాతు। చింతామణిమిమం విదుః।** (వ.పు.36, 20 శ్లో)

త్రేతాయుగంలో నీలుడనే వానరుడు ఈ కొండపైన నివసిస్తూ తపమాచరించాడు, ధన్యుడయ్యాడు.

**"నీలస్య వానరేంద్రస్య। యస్మాన్నిత్య మనస్థితిః**
**తస్మాన్నీలగిరిం నామ్నా। వదన్త్యేవం మహర్షయః।"**

నీలుడు చరితార్థుడైన ఈ గిరి ప్రదేశం "నీలగిరిగా" ప్రసిద్ధి పొందింది. ఈ తపోభూమిపై తపమాచరించిన అంజన హనుమంతుని పుత్రఫలంగా పొందింది.

"అంజనా చ తపఃకృత్వా హనుమన్త మజీజనత్।
తదాదేవస్సమాగత్య, దేవ సాహాయ్య కారకమ్।"

మతంగమహర్షి ఆదేశానుసారం 'అంజన' ఆకాశగంగతీరంలో ఉపవాసంతో తపమాచరించింది. వాయుదేవుని కటాక్షంతో గర్భవతియై మారుతికి జన్మనిచ్చింది.

"అంజనావ్రత మాస్థాయ, పుత్రం ప్రాపగిరీశ్వరే।
తస్మాదంజన శైలోయం లోకే విఖ్యాత కీర్తిమాన్॥"

అంజనాదేవి వ్రతాన్ని ఆచరించి పుత్రుడిని పొందినకొండ కనుక అంజనాద్రిగా లోకంలో విఖ్యాతి పొందింది.

"యస్మాత్పుత్రమసూతోసౌ, జగస్తస్మాదిమం గిరిమ్।
అంజనాద్రిం......................................................" (వ.పు.36 అధ్యా. 29 శ్లో)

శ్రీకృష్ణ పరమాత్మ ప్రబోధం వల్ల పాండవులు ఈ వేంకటాచలం పైన తీర్థస్నానం చేసి, 'గోగర్భతీర్థం' ప్రభావం వల్ల భాతృవధాజనిత పాపపంకిలాన్ని తొలగించుకొన్నారని, విజయసిద్ధిని పొందారని, వేంకటాచలమాహాత్మ్యం తెలియజేస్తున్నది. బలరాముని తీర్థయాత్రలలో వేంకటాచలక్షేత్రం ఒక భాగమయ్యింది.

శ్రీమన్నారాయణుడు అర్చాస్వరూపియై స్వయంవ్యక్తమూర్తిగా శిలాంతర్యామియై వేంకటాచలంపై కలియుగంలో ఆవిర్భవించాడు. కలియుగ ప్రత్యక్ష దైవంగా శ్రీమన్నారాయణుడు ఈ కొండపై అవతరించాడు కనుక ఈ గిరికి "నారాయణగిరి" గా ప్రసిద్ధి వచ్చింది. అంతేకాక నారాయణుడనే విప్రుడు శ్రీవారిని ప్రసన్నం చేసుకొని వరదానాన్ని పొందాడు.

"అనంత విహగేశాన, సేనాపతి ముఖైః స్సదా।
సేవ్యమానః శ్రియా సార్థం, విహరన్వస మాధవ।
గిరిశ్చాయం హి మన్నామ్నా, ప్రసిద్ధి మధి గచ్ఛతి॥" (బ్రహ్మాండ 3-48,47)

వరాహ పురాణం కూడా నారాయణ విప్రుని అభీష్టాన్ని తెలుపుతుంది.

"ద్విజో నారాయణః కశ్చిత్తపః కృత్వా మహత్పురా।
ఐచ్ఛదస్య స్వనామ్నా చ వ్యపదేశం మురారితః।
తస్మాన్నారాయణాద్రిం తం విదురుత్తమపూరుషః॥" (వ.పు.36 అధ్యా శ్లో 24,25)

ఈ కొండపైన వృషభుడనే రాక్షసుడు తపమాచరించి యుద్ధ ప్రీతుడై స్వామి చక్రంచే మరణాన్ని పొందుతూ- తన పేరుతో ఈ గిరి ప్రసిద్ధి చెందాలని వరాన్ని కోరాడు.

అద్యప్రభృతి చాయంవై, గిరిరుచ్ఛ్రిత శేఖరః !
మదాఖ్యాయాప్రథాం తం, "వృషభాచల" ఇత్యపి!! (బ్రహ్మాండ 4-43)

స్వామి అనుగ్రహంతో ఈ కొండ వృషభాచలంగా కీర్తింపబడుతున్నది.

సనకసనందనాదులనే జ్ఞానయోగులకు, వశిష్ఠాది-సప్తఋషులకు, దిక్పాలకులకు, బ్రహ్మాది సకలదేవతలకూ, జ్ఞానమయ ఉపాసనకు నిర్దేశిత క్షేత్రం వేంకటాచలం.

"పంచోపనిష దాత్మకమ్" (వ.పు.11 శ్లో 34 అధ్యా)

బ్రహ్మపురాణంలో మాధ్యందిన శాఖోపనిషత్తు ఈ గిరిని జ్ఞానాద్రిగా "జ్ఞానప్రదాయిని"గా పేర్కొంటున్నదని వివరించబడింది.

"ఉక్తం మాధ్యందినేమన్త్రే మాహాత్మ్యం భూధరస్య చ!
వదస్వ మన్తేవాసిభ్యో, గిరేః కురుప్రదక్షిణమ్!!" (3 అధ్యా 18 శ్లో)

వక్షఃస్థల లక్ష్మితో శ్రీనివాసుడు అలరారుతున్న ఈ వేంకటాచలం శ్రీనివాసాద్రిగా కీర్తించబడుతున్నది.

శ్రీనివాసుడు "ఆనందనిలయ" విమానంచే శోభిల్లుతున్న బ్రహ్మాండ నాయకుడు.

"ఆనందాద్రి మిమంప్రాహుః, వైకుంఠపురవాసినః
ప్రాహుః భగవతః క్రీడా, ప్రాచుర్యాత్తు తథాసురాః" (వ.పు. 36 శ్లో 33)

బ్రహ్మానందమయుని కొండపై ఋషులు తపమాచరించి, ఆనందమే బ్రహ్మస్వరూపంగా తెలుసుకొంటున్నారు. అందువల్ల ఈ కొండ ఆనందాద్రి గా కొలువబడుతున్నది.

లక్ష్మీ సహితుడైన శ్రీవారు ఆశ్రిత భక్తులకు అక్షయసిరులను ప్రసాదిస్తున్నారు, కనుక ఈ కొండ "శ్రీశైలం"గా పిలువబడుతున్నది.

"శ్రీప్రదత్వాత్ శ్రియోవాసాత్, శబ్దశక్త్యా చ యోగతః
రూఢ్యా శ్రీశైల ఇత్యేవం, నామచాస్య గిరేరభూత్" (వ.పు.1-36 అధ్యా 34 శ్లో)

ఇలా యుగ ప్రత్యక్షదైవమైన శ్రీవేంకటేశ్వరస్వామి వెలసిన తిరుమలకు అనేక పేర్లు వచ్చాయి. ఇవి యుగయుగాలలో ఈ క్షేత్ర కటాక్షాన్ని, స్వామి వైభవాన్ని తెలియజేస్తూ ప్రఖ్యాతి చెందాయి. సకల దురితాలను

తొలగించే ఈ తిరుమల దివ్యనామాలు ప్రాతఃస్మరణీయమైనవి. అందువల్ల స్కాందపురాణం ఈ దివ్య తిరుమలను ఎక్కునపుడు ప్రతిభక్తుడు ప్రార్థనచే గిరికి నమస్కరించాలని వివరిస్తున్నది

**"వేంకటాద్రి గిరిం తన్తు ప్రార్థయే త్పుణ్యవర్ధనమ్!**
**స్వర్ణాచల మహాపుణ్య! సర్వదేవ నిషేవిత!!"**

వేంకటాచలాన్ని అధిరోహించువేళ బంగారు పర్వతమా! మహాపవిత్రమైనదానా! నీవు నిత్యం సకల దేవతలచేత ఆరాధించ బడుతున్నావు.

**"బ్రహ్మాదయోపి యం దేవా! సేవన్తే శ్రద్ధయాసహ!**
**తం భవన్తం మహం పద్భ్యాం! ఆక్రమేయం నగోత్తమ!!"**

బ్రహ్మాదిదేవతలు సైతం నిన్ను శ్రద్ధతో పూజిస్తున్నారు. నేను నా పాదములు నీపై మోపుతున్నాను.

**"క్షమస్వ తదఘం మే ద్య! దయయా పాపచేతసః!**
**త్వన్మూర్ధని కృతావాసం! మాధవం దర్శయస్వమే!!"**

కొండలలో శ్రేష్ఠమైనదానా! పాపాత్ముడనైన నా సాహసాన్ని దయతో మన్నించుము. నీ శిఖరమున నివసిస్తున్న శ్రీనివాసుని దర్శనాన్ని కటాక్షించు.

**"ప్రార్థయిత్వా నరస్త్వేవం! వేంకటాద్రి నగోత్తమమ్!**
**తతో మృదుపదం గచ్ఛేత్! పావనం వేంకటాచలం!!"**

ఇలా ప్రార్థించినవారై, మెల్లగా అడుగులిడుతూ (అంటే విస్సాంటంగాకాకుండా) పవిత్రమైన కొండనెక్కాలి. మహాపవిత్రము, సర్వపాపహరమైన స్వామి పుష్కరిణిలో స్నానమాచరించి నియమంతో పిండాదులను పితృదేవతలకు సమర్పించాలి. పితరులకు మోక్షాన్ని స్వర్గసౌఖ్యాన్నిచ్చే ఈ కొండ నిత్యముక్తులకు, దేవతలకు నివాసభూమి, కలియుగవైకుంఠం. పుణ్యతీర్థాలకునిలయమై, కలియుగ ప్రత్యక్షదైవమైన శ్రీనివాసస్వామికి నిజనివాసస్థానమై అనేకమహిమలుగల ప్రదేశంగా కొనియాడబడుతున్నది. అందువల్లనే పురాణాలు ఈ క్షేత్రాన్ని, శ్రీవారిని అలా ఉద్ఘోషించాయి.

# అన్నమయ్య - ఆనందనిలయ శోభ

-డా॥ ఎన్. సత్యబాలాజీరావు

అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడు, ఆదిమధ్యాంత రహిత పురుషుడు, ఆపదమొక్కులవాడు, భక్తులపాలిట కొంగు బంగారం, పిలిచితే పలికే కలియుగదైవం సప్తగిరుల అధినాయకుడు, ఆనంద నిలయాధీశుడు, సర్వాంతర్యామి, సకలజగాలకు వెలుగునిచ్చే కాంతిపుంజం కొలువుతీరిన సుందర సుమనోహర, రసరమ్య ఆధ్యాత్మికానంద నిలయమే అతి పవిత్రమైన ఆనందనిలయం. శ్రీనివాసుని వరంచేత కారణజన్ముడిగా, భూలోకంలో అవతరించిన శ్రీతాళ్ళపాక అన్నమాచార్యులు మహాపురుషులు, యోగీశ్వరులు, తత్వజ్ఞులు, వేదవేదాంతవేత్తలు, లోకాతీత, లోకానుభవ బహుముఖ ప్రజ్ఞాశాలి. ఆధ్యాత్మిక, కారణ జన్ముడు. అన్నమయ్య కలం నుంచి ఎన్నోవేల సంకీర్తనలు ఆ అనంతరూపుని వైభవాన్ని సమస్తలోకాలకు విస్తరింపచేసాయి. తిరుమలనాథుడు స్వయంవ్యక్తుడై, భక్తుల పాలిట కల్పవృక్షమై, పేదల పాలిట పెన్నిధిగా, నిత్యకల్యాణం పచ్చతోరణములతో భక్తుల హృదయముల నలరింపచేసి శ్రీఅన్నమాచార్యుల సంకీర్తనలకు నాయకుడు కాగా ఆ ఆలయము దేవాలయ సంస్కృతికీ శిరోమానికముకాగా స్వామి కలియుగ ప్రత్యక్షదైవమై పూజలందుకొనుచున్నాడు.

"ఎంత పుణ్యమో యిటు మాఁకుగలిగె
చెంతనే నీకృప సిద్ధంచబోలు

"శ్రీపతి మీకథ చెవులను వింటిమి
పాపములణగెను భయముడిగె
తీపుగ దులసి తీర్థము గొంటిమి
శాపము దీరెను సఫలంబాయ
గోవింద మిము గనుగొంటి మిప్పుడే
పావనమైతిమి బ్రతికితిమి
తావుల మీపాదములకు మొక్కిలి
వేవేలుగలిగెను వేడుకలాయ
శ్రీవేంకటేశ్వర సేవించితి మిము
ధావతి దీరెను తనిసితిమి
వావిరి ముమ్మారు వలగొనివచ్చితి
నీవారమైతిమి నిలిచితిమిపుడు"

ఇలా అన్నమయ్య తన మదిలోని శ్రీనివాసుని వైభవాన్ని లోకానికి చాటాడు. తిరుమల శ్రీవారి ఆలయము

యొక్క ప్రధాన ప్రవేశద్వారాన్ని "పడికావలి" అని ముఖద్వారమని, సింహద్వారమని, ముక్తికి సోపానమార్గమని పలురకాలుగా వర్ణిస్తారు. ఈ మహా ద్వారానికి అనుసంధానంగా వుండే నిర్మాణకృతే మహాపాలకారమని పిలుస్తారు. ఈ మహాద్వారానికి ఇరువైపులా నిధి దేవతలయిన శంఖనిధి, పద్మనిధి అనే రెండు విగ్రహాలు స్థాపించబడ్డాయి. ఆగమశాస్త్రరీత్యా మూడో ప్రాకారంలో ఈ నిధిదేవతలు వుండడం సంప్రదాయం. దీనినిబట్టి శ్రీవారి ఆలయం మూడుప్రాకారాలు కలిగి వున్నదని చెప్పవచ్చు. ఆలయంలోకి ప్రవేశించగానే మొదటి ప్రదక్షిణ మార్గాన్నే సంపంగి ప్రదక్షిణ అంటారు. గతంలో స్వామివారి నిత్యశోభ నిమిత్తమై సంపంగివనాన్ని అక్కడ పెంచడంచేత ఆ స్థలానికి సంపంగి ప్రదక్షిణ అని పేరు సార్థకమైంది. సంపెంగ ఆవరణలో ఒక బలమైన చింతచెట్టు వుండేదని, దానికొమ్మలు, రెమ్మలు శాఖోపశాఖలుగా అతి విశాలంగా పెరిగి అన్ని వైపులా విస్తరించి ఎటువైపునా నీడ కనిపించనందువల్ల నీడ తిరుగని చింతచెట్టయి సాక్షాత్తూ వాసుదేవుడని పురాణాలలో పేర్కొనబడినది. ఈ చెట్టుక్రింద పుట్టలో శ్రీనివాసుడు కొంతకాలం దాగి వున్నాడట. గతంలో పొయిగైఆళ్వారు "ముదల్ తిరువందాది ఊరుమ్ వరి అవరన్' పాటలో 'పుత్తడయమ్ వేంగడమే' అని వర్ణించాడు. ఇక ఆ మహాప్రాకారంలో వున్న చింతచెట్టును "అన్నమాచార్య చరిత్రలో" తరగని ఫలపుష్పతతితోడ నీడ తిరుగని చింతవర్తిల నమ్రుడగుచు అని చిన్నప్ప అభివర్ణించాడు. తాళ్ళపాక అన్నమాచార్యులు తన తాళపత్రాలలో సన్నివేశాన్ని అంటే ఆ మహాద్వారంలోపల నున్న చింతచెట్టును ఇలా అభివర్ణించాడు.

"వడి వేంకటపతి వరముల రాయుడు
నుడు గంగాళ్లగనులు సుతులు
బడి బడి నొసగుచు బలణాచారులకు
కడిమినీడ తిరుగని చింతాడ

ఈ సంపంగి ప్రదక్షిణ మార్గమునందు దక్షిణ భాగమున నిత్యకల్యాణాలు జరుపబడే కల్యాణమండపము కలదు. ఈ మార్గంలో వాయువ్య భాగంలో ఉగ్రాణము, ఉత్తర దిశలో పడిపోటు నిర్మాణాలు అమర్చబడ్డాయి. పడిపోటుకు తూర్పుభాగంలో "యమునాత్తురై' అనే పూల అర నిర్మాణం వుంది. 'విరజానది' అనే పవిత్ర తీర్థము ఉగ్రాణానికి ముందు ప్రవహిస్తున్నది. ఈ పూల అరకు తూర్పు దిక్కున 'వగపడి' అనే అర కలదు.

ముఖద్వారమున ప్రవేశించినంతనే ఎడమప్రక్క రంగనాయక మంటపము నిర్మింపబడినది. క్రీ.శ.1320-60 సంవత్సరముల మధ్య మహమ్మదీయ దండయాత్రలచే "శ్రీరంగము"లోని రంగనాయకుల ఉత్సవ విగ్రహము తిరుమలకు చేర్చి పూజాదికములు జరిపించడంచేత ఈ మంటపాన్ని రంగనాయకమంటపంగా పిలుస్తున్నారు. ఈ రంగనాయకుల మంటపము మధ్యలో ఏడుతలల బంగారు శేషవాహనము కొలువై వుండటం చేత దీనిని పెద్దశేషవాహనంగా పేర్కొంటారు.

"పట్టపు వాహనమైన బంగారు శేషుడు
చుట్టు చుట్టు కొనిన మించుల శేషులంబాగది
నట్టుకొన్న రెండువేల నాలుకల శేషుండు
నెట్టిన హరిఁబాగడనేరు పరిశేషుఁడు

ఈ రంగనాయక మంటపాన్ని అనుకొని వున్న నిర్మాణమే తిరుమల రాయమంటపము. "అన్న ఊయల తిరునాళ్ళు" అనే ఉత్సవాన్ని జరిపించుటకై సాళువ నరసింహరాయలు ఈ మంటపాన్ని క్రీ.శ. 1473వ నిర్మించినట్లు చరిత్ర ఆధారాలు తెలియ చేస్తున్నాయి. తమిళమున 'అన్నం' అనగా 'హంస' అని అర్థము. ఊయలగా కట్టబడిన హంస తూలికలతో శ్రీవేంకటేశ్వరస్వామి వారు ఉభయనాంచారులతో ఊయల ఊగెడివారట.

"జనులు నమరులను జయలిడఁగా
ఘనుఁడదె వుయ్యాల గంభముకాడ

అళియ రామరాయల సోదరుడు ఆరవీటి వంశ చక్రవర్తి అయిన తిరుమల రాయలు క్రీ.శ. 16వ శతాబ్దంలో ఈ మంటపాన్ని మరింత విస్తరింపచేయడంతో ఇది తిరుమలరాయ మంటపంగా ప్రసిద్ధికెక్కింది. ప్రతిరోజూ ఉభయ సంధ్య వేళల్లో "కొలువుమేళం" అనే మంగళవాయిద్యాలు వాయిస్తారు. ఈ కొలువుమేళాన్ని "హరికొలువుగా" వ్యవహరిస్తారు. ఈ తిరుమలరాయ మంటపానికి వాయువ్యమూలలో లాలాఖమరాం, మాతా మోహనదీది, పితాబీబీ అను ముగ్గురి భక్తుల నిలువెత్తురాగి విగ్రహాలు కలవు. ఇతనిని రాజా తోడరమల్ అని పిలుస్తారు. క్రీ.శ. 17వ శతాబ్దంలో తురకలదాడి నుండి ఇటు ఆంగ్లేయుల దాడి నుండి తిరుమల క్షేత్రాన్ని కాపాడిన పరాక్రమశాలి. భక్తాగ్రణి ఇతడు.

అన్నమయ్య ఆనాడు వేంచేపు చేసిన శ్రీకృష్ణుని, ఉట్ల పండుగను నయనోత్సవముగా క్రింది సంకీర్తనలలో వర్ణించెను.

"ఇన్నేసి వాపులతో నిందరి పాలఁగలిగె

పిన్న పెద్దమేలుసేసపీ పెంచరోయీ బాలుని అని 'నరకాసురుని తండ్రి నడురేయి జనియించె' అని వర్ణించెను. ఇంకను ఆ బాలుడు నేరని దుష్టుల కెల్లా నిండు చిచ్చరపిడుగ నేరిచిన శిష్టులకు నిధానము అని కూడా వర్ణించినాడు. శ్రీకృష్ణజన్మోత్సవ కారణమున ఆలయములో జరిపెడు ఉట్లపండుగనుగాంచి అనందభరితుడై

పెట్టిరి గొల్లెతలెల్ల పెరుగు నెయ్యివుట్ల
కొట్టరో కొట్టరో మీరు కోలలవారు

తిట్టేరు వారల్లదివో తెగి దగ్గరక తొల్లె
పట్టరో వారలు మీరు పైఁగారేపాలు
తక్కకయదుకులెల్లాదాచిరి తమసొమ్మంటా
చిక్కెజిక్కె దీసుకోరోసేన వున్నవి
యెక్కెను శ్రీవేంకటాద్రి ఇదివో మనకృష్ణుడు
చక్కనాయఁబనులెల్లా జాలించిరారో అని పాడినాడు.

ప్రవేశ ద్వారానికి ఆనుకొని లోపలివైపు ఎత్తైన మండపాన్ని క్రీ.శ. 1517 సం॥ జనవరి 2 వ తేదీన శ్రీకృష్ణదేవరాయల వారు స్వయంగా నిర్మించి, తన విగ్రహాలను ప్రతిష్ఠించుకొన్నందున నాటి నుండి అది కృష్ణరాయ (ప్రతిమా) మంటపంగా ప్రసిద్ధికెక్కింది. ద్వారానికి ఎడమ ప్రక్క క్రీ.శ. 1570 లో చంద్రగిరి రాజైన వేంకటపతిరాయలవారి ప్రతిమ నమస్కార భంగిమతో ప్రతిష్ఠించబడింది. ఈ విగ్రహానికి దక్షిణమువైపున అచ్యుతరాయలు, వరదాజి అమ్మ, రాజదంపతుల నిలువెత్తు నల్లరాతి ప్రతిమలు ప్రతిష్ఠించబడ్డాయి. శ్రీస్వామివారి శంఖముతో పోయబడిన పవిత్ర జలముతో విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా ఈయన పట్టాభిషేకము చేసికొనెనని చరిత్ర చాటుచున్నది.

ప్రతిమా మంటపము దక్షిణమువైపు ఒక తులాదండము కలదు. ఈ తులాదండము 1987 వ సంవత్సరమున ఏర్పాటు చేయబడింది. 'తాసువలెఁదులఁదూగిదయలు వారేవు' అని అన్నమయ్య తులాభారమును తలచనేమో? ప్రతిమా మండపానికి, అద్దాల మండపానికి, రంగనాయక మండపానికి మధ్యన చతురస్రముగా నున్న ఖాళీ స్థలము మధ్యలో శ్రీవారి ధ్వజస్తంభము ప్రతిష్ఠించబడింది.

"వదలక వలసిన వారికి వరములు యెదురెదురై తానిచ్చునను
నిదురలేక పెను నిధానమై కదలఁడదె గరుడగంభము కాడ" 62వ రేకు

ఈ ధ్వజస్తంభానికి ఎదురుగానున్న ప్రవేశద్వారమే వెండి వాకిలి. దీనినే నడిమిపడికావలి అని వ్యవహరిస్తారు.

"కోరిన వారికిఁగోరిన వరములు
ఓరంత ప్రొద్దు నొసంగుచును
చేరువయై కీపపేపీ విదివో
కూరిముల నడిమి గోపురమాడ

వెండివాకిలి ముందు తూర్పుభాగములో "బంగారు ధ్వజస్తంభము" దానిని అనుకొని తూర్పున

'బలిపీఠము' ఈశాన్యమున క్షేత్రపాలకశిల ప్రతిష్ఠించబడింది. బలిపీఠానికి ఈశాన్యమువైపు సుమారు ఒకటన్నర అడుగుల ఎత్తుగల చిన్న శిలాపీఠమే "క్షేత్రపాలకశిలగా" పిలుస్తారు.

"తారకబ్రహ్మమని తగంగాశిలో శివుండు
యేరుపరచి ప్రాణుల కిప్పుడు జెప్పుచున్నాడు
యీ రేతి శ్రీ వేంకటేశ యిందుకు సాక్షులువీవారలు
ఆరూఢి గరుడ గంభమండనేడున్నవి

వెండి వాకిలి దాటి లోనికి ప్రవేశించినంతనే కనిపించుమార్గమే విమాన ప్రదక్షిణపథం. ఇది విమాన ప్రదక్షిణగా పేరొందింది. ఈ మార్గంలోనే భక్తులు భక్తిప్రపత్తులతో పొర్లు దండాలు చేస్తారు.

"తమితో బ్రదక్షిణాలు దండములు నివిగో" తడి వస్త్రములతో చేసే ప్రదక్షిణమే పొర్లుదండాలు, అంగప్రదక్షిణమని పేరొందింది. పరుండి చేయుటచే పొర్లు దండాలని వాడుకలోకి వచ్చింది.

ఈ మార్గమున కెదురుగా శేషశాయియైన రంగనాధుడు, పై భాగమున శ్రీవరదరాజస్వామి క్రింది భాగమున శ్రీవేంకటేశ్వర మూర్తులు కలిగి ప్రధాన వైష్ణవ క్షేత్రముల ప్రాధాన్యతను తెలియచేస్తున్నాయి. అన్నమయ్య 'కావేట రంగమున కాంతపై పాదాలు చాచిరావుపో నెక్కడికిని రంగనాథ శ్రీవేంకటాద్రి మీదదేకాని నిల్చితివి' అని కీర్తించెను.

వెండివాకిలికి దక్షిణముగా శ్రీ వరదరాజస్వామి వారి ఆలయముకలదు

"ధృవవరదా సంస్తుత వరదానవమైన యార్తుని నన్నుఁగావవే
కరిరాజ వరదా కాకాసురవరదా
శరణాగత విభీషణ వరదా
సర్వ శాస్త్రములలో సనకాదులలో
సర్వదా మెలఁగుచు జనవరదుడవై
వుర్వి శ్రీవేంకటాద్రి నున్న దేవుడవు

అని అన్నమయ్య శ్రీరంగనాథుడు, వరదుడు, శ్రీవేంకటేశ్వరులను కీర్తించెను.

విమాన ప్రదక్షిణ మార్గంలో పోటు, బంగారుబావి, అంకురార్పణ మంటపము, యాగశాల, నాణాల పరకామణి మంటపము, చందనపు అర, వేదపారాయణసభ, తాళ్ళపాకవారి అరలు కలవు.

విమాన ప్రదక్షిణానికి ఉత్తర దిశలో సన్నిధి భాష్యకారులు, శ్రీయోగనరసింహస్వామి, పరిమళపు అర,

శ్రీవారి హుండీ, శ్రీవిష్వక్సేనుల వారి సన్నిధి కలవు. శ్రీరామానుజులవారి విగ్రహము క్రీ.శ. 12వ శతాబ్దమున ప్రతిష్ఠించబడిందని, శ్రీయోగనరసింహస్వామివారు క్రీ.శ. 14వ శతాబ్దమునకు పూర్వము ప్రతిష్ఠించబడి వుండవచ్చునని చరిత్రకారుల అభిప్రాయము.

"యిదిగో శ్రీ వేంకటేశ్వరుఁడు యీడై
పొందలుచునున్నాడు భవినుడయవరు

"పంకజపుఁజేయిచాచి పాదపుంబరమిచ్చిన
వేంకటేశు కృపతోడ వెలయఁదానే
తెంకినే వాడయవరై తిరుమంత్ర ద్వయాన
పంకమెల్లఁబొగడిగె భాష్యకారులు

అని అన్నమాచార్యులవారు సన్నిధి భాష్యకారులను కీర్తించెను.

క్రీ.శ. 13వ శతాబ్దమున ఆలయ నిర్మాణము జరిగి వుండవచ్చునని చరిత్రకారుల అభిప్రాయము. ఆనందనిలయ దివ్య విమానమునకు కభిముఖముగా శ్రీనృసింహదేవుని శ్రీరామానుజులవారు ప్రతిష్ఠించారని అనంతాళ్వారులు వివరించారు. యోగ నరసింహుని ప్రదక్షిణ మండపంలోనే దక్షిణ దిక్కునగల మార్గములో "పరిమళం బండ" వున్నది. కలియుగ వైకుంఠనాధుని తిరునామం కోసం వినియోగించే పచ్చకర్పూరం, శుక్రవారం నాడు అభిషేక సేవలో వినియోగించు సుగంధ ద్రవ్యములను ఈ "పరిమళ బండమీద" తయారుచేసుకుంటారు. స్వామివారి "ఊర్ధ్వపుండ్ర సమర్పణలోను, అభిషేక సేవలోనూ ఈ అర అత్యంత ప్రాముఖ్యతను కలిగియున్నది.

చటుల చక్రకరణంబును శార్ఙ్యకరంబును
అటు వరదాభయ హస్తములు
పటుతర యోగ పట్టపు బంధమును
కటతటజెలగంగ గడఁగీ వాడే
పరపగు శేషుని పడగలనీడల
అరుదగు రవిచంద్రాకముల
సిరుల గద్దెపై శ్రీ వేంకటేశుఁడు
పరిపూర్ణుడై పరంగివాడే

శ్రీవారి హుండీలో భక్తులు వేసే కానుకలు భద్రంగా సరాసరి గంగాళంలో పడే విధంగా ఏర్పాటు

చేయబడినది. ఈ బుర్కా గంగాళమును 'కొప్పెర' అని వ్యవహరిస్తారు. శ్రీవారి వక్ష స్థలమున నెలకొనివున్న శ్రీదేవిని స్థిరలక్ష్మిగాను, హుండీ యందున్న సంపద సమూహమును చరరూపిణిగా భక్తులు భావించేవారట. మరి అన్నమయ్య మదిలోనూ ఇదే భావన జనించినది.

"రూకలై మాడలై రువ్వలై తిరిగేనా
దాకొని వున్నచోటఁదానుండదడివో"
"ఒకరి రాజుఁజేసునొకరి బంటుగఁ జేసు
ప్రకటించికనకమే బ్రమయించే జగము
పందెమాడినటువలెఁ బచరించు పసిఁడి

అని చరరూపిణిగా వర్ణించి

"నిగ నిగమనుచుండు నిక్షేపమైయుండు
తగిలి శ్రీ వేంకటేశు తరుణియై తానుండు
తెగని మాయై యుండు దిక్కుదెసమైయుండు"

అని వేంకటేశు భార్యగ నిక్షేపమై నుండునని స్థిరరూప లక్ష్మిగాను అన్నమయ్య వర్ణించెను.

విమాన ప్రదక్షిణమార్గంలో "కటహతీర్థం" నేటి అన్నమాచార్య భాండాగారమునకు ఎదురుగా వున్నది. ఈ తీర్థము శ్రీస్వామి వారి పాదముల నుండి వచ్చు అభిషేక తీర్థము. శ్రీస్వామి వారి పుష్కరిణి స్నానం, శ్రీనివాసుని దర్శనం, కటహతీర్థపానం ఈ మూడు త్రైలోక్య దుర్లభములని ప్రసిద్ధి. ఈ తీర్థాన్ని స్వీకరించేటపుడు అష్టాక్షరిని పఠించితే మంచిదని వివరించబడినది.

శ్రీహరి పాద తీర్థంబే చెడనిమందు
మోహపాశాలు గోసి మోక్షమిచ్చేమందు
కారమై కంటగించదని కడుచల్లని మందు
నూరని కాచని యట్టి నున్నని మందు
కోరికతో నెల వెట్టికానితే వల్లనిమందు
వేరు వల్లంకులు కూర్చనట్టి వెందువోనిమందు
గరుతైన రోగములు గుణము చేసేమందు
దురితములు పెడఁబాపే దొడ్డమందు
నిరతము బ్రహ్మాదులు నేరుపుతో సేవించేమందు
నరకము సారనట్టి నయమయిన మందు

అని ఇంతవైభవోపేతంగా శ్రీపాద తీర్థమహిమ కీర్తించబడినది.

ముక్కోటి లేదా వైకుంఠ ప్రదక్షిణ మార్గమున చిన్నమందిరము కలదు. అ మందిరములో దక్షిణ ముఖముగా రెండడుగులు ఎత్తుగల శ్రీ విష్వక్సేనుల వారి శిలామూర్తి ప్రతిష్ఠించబడింది. కూర్చొనివున్న భంగిమలో అభయముద్రతో శంఖచక్రములను ధరించి ఊర్ధ్వపుండ్రములతోనున్న వీరు స్వామివారి ప్రధాన సేనాధిపతి. "సేనైముదలియార్" అని నామాంతరము కలదు. ప్రస్తుతము ఈయన పంచలోహ ఉత్సవ విగ్రహము స్వామివారి తీర్థాన్ని ఇచ్చే మందిరంలో చూడవచ్చు. ఈయన ఆణివార ఆస్థానము, దీపావళి, బ్రహ్మోత్సవంలో ప్రధాన పాత్రను పోషిస్తారు.

"నీవెకా చెప్పఁజూప నీవె నీవెకా
శ్రీవిభు ప్రతినిధివి అనియు
పటుశిష్ట ప్రతిపాలకుండవనగ
ఘటన నఖిలమునుగాతువుగా
తళతళ మెరయుచు సుదర్శనాయుధం
బలరుచు నొకచే నమరంగను
దిట్టపు సూత్రవతీపతి వసురులం
జట్టలు చీరంగఁజతురుండవు
రట్టడి వేంకట రమణుని వాకిట పట్టపుసేనాపతివటకా

బ్రహ్మాది దేవతలు సనకసనందనాది మహర్షులు స్వామివారి దర్శనమునకై కనకమయకవాటముల వద్ద వేచి వుండెదరట. అసన్నివేశాన్ని అన్నమాచార్యులు ఈ విధంగా స్తుతించారు.

"కనకరత్న కవాట కాంతు లిరుగడగఁట
ఘనమైన దీప సంఘములు గంటి"

"అదివో శ్రీతిరువేంకటాద్రిశుండితండని
చదికి వెండికి వచ్చె సనకాదులు"

ఈ మహామణి మండపంలో నాలుగువరుసలుగా మొత్తం పదహారు స్తంభాలున్నాయి. ఆ స్తంభములపైన భూవరాహస్వామి, నృసింహస్వామి మున్నగు శిల్పాకృతులు చెక్కబడివున్నాయి. క్రీ.శ. 1417న ఆగష్టు 25 నాటికి చంద్రగిరి వాస్తవ్యుడైన 'అమాత్యశేఖర మల్లన' మంత్రివర్యుడు నిర్మించి పూర్తిచేసినట్లు చారిత్రక ఆధారాలున్నాయి.

బంగారువాకిలికి ఎదురుగానున్న మందిరములో శ్రీస్వామి వారికి అభిముఖముగా గరుత్మంత

శిలామూర్తి ప్రతిష్ఠించబడింది. క్రీ.శ. 1512 నాటి శాసనములో ఈ మందిర ప్రస్తావన కలదు. ఈ బంగారు వాకిలికి ఉభయ పార్శ్వములలో శంఖచక్రగదాధరులై జయవిజయ ద్వారపాలకులు నిలిచియున్నారు. బంగారువాకిలి ద్వార బంధమునకు క్రింది, పై భాగాలలో తీగలు, లతలు, చెక్కబడి వున్నాయి. అనేక దైవస్వరూపాలు వాటిపై చెక్కబడివున్నాయి. వాటిని దర్శించి అన్నమయ్య ఆనందోత్సాహాలతో ప్రేరణ పొంది ఈ విధంగా కీర్తించాడు.

"వ్యూహ రూపములను కొనియాడిన సంకీర్తన
"కంటిమి దామోదర సంకర్షణ వాసుదేవ

అంటే జాలు ప్రద్యుమ్నుండా అని అనిరుద్ధుండా" మరియు కేశవాది నామములను గురించి

"నన్నుగావుకేశవా నారాయణమాధవ
మన్నించు గోవింద విష్ణుమధుసూదన
సన్నెల త్రివిక్రమా వామనా శ్రీధరా
సన్నుతించె హృషీకేశ సారెకు పద్మనాభ"

"తోట పురుషోత్తమ అధోక్షజ నారసింహమా

'జంటవాయకు మచ్యుత జనార్ధన' అనియు మత్స్యకూర్మ వరాహ మనుష్యసింహ వామనా యిచ్చ రామరామరామ హితబుద్ధి కలికి అని దశావతారములను ఘనంగా కీర్తించాడు.

భక్తులకు ఈ బంగారు వాకిలి నుండే స్వామివారి దర్శన ప్రాప్తి కలుగుతుంది. అందరిలాగే కవిసార్వభౌముడు శ్రీతాళ్ళపాక అన్నమాచార్యుల వారు బంగారువాకిలినుండి కలియుగవైకుంఠవాసుని వీక్షించినంతనే అన్నమయ్య మదిలోని భావప్రేరణను ఇలా కీర్తించారు.

"కంటినఖిలాండ కర్త నధికుని గంటి
కంటినఘములు వీడుకొంటి, నిజమూర్తిగంటి
మహనీయ ఘన ఫణామణులు శైలముగంటి
బహు విభవముల మంటపములగంటి
సహజ నవరత్న కాంచన వేదికలు గంటి
రహివహించిన గోపరంబులవె గంటి
పావనంబైన పాపవినాశము గంటి
కైవసంబగు గగన గంగ గంటి

దైవిక పుణ్యతీర్థము లెల్ల బొడగంటి
కోవిదులు గొనియాడు కోనేరిఁగంటి
పరమ యోగీంద్రులకు భావగోచరమైన
సరిలేని పాదాంబుజములు గంటి
తిరమైన గిరిచూపు దివ్య హస్తములు గంటి
తిరు వేంకటాచలాధిపుఁజూడగంటి

కొండను, తీర్థములను స్వామిని 'కంటి'నని కీర్తించి పిమ్మట

"చేరి కొల్వరో యీతఁడు శ్రీదేవుడు
యీ రీతిశ్రీ వేంకటాద్రి నిరవైన దేవుఁడు
అలిమేలుమంగనుర మందిడుకొన్న దేవుడు
చెలగి శంఖ చక్రాల చేతి దేవుఁడు
కల వరద హస్తముఁగటి హస్తపు దేవుఁడు
మలసీ శ్రీవత్స వనమాలికల దేవుఁడు
ఘనమకర కుండల కర్ణముల దేవుఁడు
కనక పీతాంబర శృంగార దేవుఁడు
ననిచి బ్రహ్మాదుల నాభిఁగన్నదేవుఁడు
జనించెఁ బాతాల గంగా సంగతైన దేవుండు

అని ఆ దివ్యమంగళకర రూపాన్ని మనసారా కీర్తించాడు.

ఇంకను

"శ్రీవేంకటేశ్వరుని సింగారము వర్ణించితే
యేవిధానఁ దలంచినా యిన్నిటికిందగును
కరిరాజుగాచిన చక్రము పట్టినహస్తము
కరితుండమని చెప్పఁగా నమరును
వరము లిచ్చేయట్టి వరదహస్తము కల్ప
తరుశాఖయని పోల్పదగు నీకును
జలధిఁబుట్టిన పాంచ జన్యహస్తమునీకు

జలధి తరంగ యని చాట వచ్చును
బలు కాళింగునితోఁకపట్టిన కటిహస్తము
పొలుపై ఫణీంద్రుఁడని పొగడంగదగును.
నలిన హస్తంబుల నడుమనున్న నీయుర
మలమేలు మంగ కిరవనందగును
బలు శ్రీవేంకట గిరిపై నెలకొన్న నిన్ను
నలరి శ్రీవేంకటేశుండనఁ దగును

ఈ విధంగా స్వామి వాసమునకు తగినటుల శ్రీవేంకటేశుడనదగునని నామకరణము కూడ చేసాడు.

అలాగే దేవేరిని కీర్తిస్తూ

"ఏమమ్మా నీకెవ్వరీడు ఇందిరాదేవి
నీమగనికి నీవు నాడు నిధానమవు
చూపులనే కురిసేవు సొరిది బంగారవుపొంది
రూపునకే కులికేవు రుచుల రాజసమెల్ల

మోముననే మిరాచేవు మోహనపుమెరుగులు
తామెర చేతుల నెత్తి దైవారేవు మహిమలు"

పలుకులఁజిలికేవు పైపైనే అమృతాలు అని అన్నమయ్య మనసారా కీర్తించాడు. ఈ విధంగా తిరుమల ఆలయంలో ప్రపంచానికే తలమానికంగా వెలుగొందుతున్న ఆనందనిలయ శోభను తాళ్ళపాక అన్నమాచార్యులవారు అభివర్ణించారు.

# భగవద్రామానుజులు - శ్రీవేంకటాచలము

డా॥ టి. విజయ రాఘవాచార్యులు

'అశేష చిదచిద్వస్తుశేషిణే శేషశాయినే ।
నిర్మలానంత కల్యాణ నిధయే విష్ణవే నమః ॥

శ్రీమహావిష్ణువు ఆజ్ఞచే ప్రవర్తితమగుచున్న ప్రపంచమున వారి ఆజ్ఞచే ఆదిశేషులు రామానుజాచార్యులుగా అవతరించి సకల జగత్కల్యాణమునకు, సమస్తమానవులకు భగవదారాధనమే తరుణోపాయమని, ఆరాధనారాధ్య తత్త్వబోధామృతమును అందించినారు. భారతదేశమంతయు సంచరించి, అష్టోత్తరశతదివ్య తిరుపతి క్షేత్రములను సముద్ధరించి, భగవదారాధనా విధానములు ఆయాక్షేత్రములందు ఆ యా ఆగమోక్తరీతిగా జరుగునట్లు కట్టడి చేసినారు. శ్రీమహావిష్ణువే పరతత్త్వమని ప్రతిష్ఠాపన చేసినారు. భగవద్రామానుజులు శ్రీవేంకటాచలమున ఏర్పరచిన కట్టుదిట్టములను వారి సాక్షాత్ శిష్యులయిన అనంత చార్యులవారి "శ్రీవేంకటాచల ఇతిహాసమాల"ను సంస్కృత గ్రంథమునందుయు స్పష్టముచేసినారు. భగవద్రామానుజులు శ్రీవేంకటాచలమున ఏర్పరచిన కట్టుదిట్టముల వివరములను పరిశీలిద్దాం.

వేంకటేశ్వరస్వామివారు తనను ఆశ్రయించిన తొండమాన్ చక్రవర్తికి రక్షణగా శంఖ చక్రములను యిచ్చుటచేత కొంతకాలము శ్రీవారిహస్తములందు శంఖ, చక్రములు లేకుండెను. ఆ సమయమున దేవాలయ మందలి అర్చకస్వాములు ఉచితోపచారములు చేయకపోవుటవలన, వారిని ఆ దేశాధిపతి తీవ్రదండనకు గురిచేసెను. ఆ సమయమున కొందరు శైవులు రాజువద్దకుచేరి కొన్ని అస్పష్టమైన, అసందర్భమైన కారణము లను చూపి స్వామి పుష్కరిణి తీరమున వేంచేసియున్నది కుమారస్వామియని కొందరు, శివుడని మరికొందరు, శక్తియని యింకొందరు వినిపించారు. చాలాకాలముగా విష్ణుక్షేత్రమని ప్రసిద్ధమైన ఈ క్షేత్రమును శైవులు యీ విధముగా వ్యాఖ్యానించుటకు కారణమేమని రాజు ఆలోచించసాగాడు. పురాణార్థములను స్పష్టముగా వివరించి చెప్పేవారు లేకపోవటంవలన, రాజు శ్రీరంగమునందున్న శ్రీరామానుజాచార్యులవారికి కబురు పంపగా వారు వేంకటాచలమునకు వేంచేసి, వేంకటాచలమాహాత్మ్యబోధక వచనములను సమగ్రముగ వివరించి, ఆళ్వారుల శ్రీసూక్తులను తెలియజేసి వేంకటాచలాధిపతి శ్రీమహావిష్ణువేయని నిరూపించారు. అయినను రాజు నిర్ణయంచేయకపోవుటచేత అందరూ కలసి ఒక నిర్ణయానికివచ్చారు. స్వామిసన్నిధిలో విష్ణు చిహ్నములైన శంఖ చక్రములను, కుమారస్వామికి చిహ్నములైన పాశాంకుశాదులను, శివునికి చిహ్నములైన త్రిశూలఢ మరుకాదులనుంచి ద్వారము బంధించి, రాజముద్ర వేయించి మరునాడు దర్శించగా స్వామిశంఖ చక్రములను ధరించియుండెను. ఆ విధముగా వేంకటాచలాధిపతి శ్రీమహావిష్ణువేయని నిరూపించి, శ్రీవైఖానసాగమ ప్రకారముగా విష్ణుపరివారదేవతలనుకూడా ప్రతిష్ఠింపచేసినారు.

ద్విభుజా వ్యూహలక్ష్మీః స్యాత్ బద్ధ పద్మాసనప్రియా ।
శ్రీనివాసాంగమధ్యస్థాసుతరాంకేశవప్రియా ॥

అని వరాహపురాణములో చెప్పబడినట్లుగా స్వామివారి దివ్యవక్షస్థలమున లక్ష్మీదేవిని సమర్పింపజేసినారు. ఆనందసంహితలో చెప్పబడినట్లుగా శుక్రవారము అమ్మవారు అభిషేకము స్వీకరించుటకు ముందుగా స్వామి వారుకూడా అభిషేకము స్వీకరించునట్లు కట్టడి చేసినారు. స్వామివారికి ఊర్ధ్వపుండ్రమును ధరింపజేసినారు. శ్రీశంఖచక్రములకు మాలిక సమర్పించిన తరువాత శ్రీవక్షఃస్థలలక్ష్మి దివ్యకిరీటము మొదలగు దివ్యావయవములకు శ్రీమాలికలు సమర్పించవలెనని నిర్ణయించినారు. నిత్యానపాయియయిన శ్రీదేవి అభిషేకము స్వీకరించునపుడు గోదాదేవి యనుగ్రహించిన "నాచ్చియర్ తిరుమొళి"ని అనుసంధానం చేయాలని కట్టడిచేసినారు.

తిరుమలలో దేవోత్సవములు నిర్వహించుటకు చుట్టపక్కల విశాలవీధులు లేకపోవుటవలన ధ్వజా రోహణము మాత్రము తిరుమలలో జరిపి వాహనసేవలను తిరుచానూరులో నిర్వహించెడివారు. అది మార్చి భగవద్రామానుజులు తిరుమలలోనే నాలుగు వీధులు ఏర్పరచి అక్కడే బ్రహ్మోత్సవములు జరుగునట్లు కట్టడిచేసినారు.

తిరుమలలో దివ్యైశ్వర్యము ఉత్తరోత్తరాభివృద్ధి చెందుటకుగాను అప్పుడు ఉత్సవమూర్తిగానున్న "వేంగడత్తురైవాను" కౌతుకమూర్తిగాను, "మలైకునియనిన్ర పెరుమాళ్"ను ఉత్సవమూర్తిగను ఆరాధన పొందునట్లు యంత్రోద్ధరణ పూర్వకముగా ఆవాహనముచేసి ఆరాధనలందుకొనునట్లు సంకల్పించినారు.

శ్రీవేంకటాచలపతికంటే ముందుగా త్రిసంధ్యాకాలములందును వరాహస్వామికి ఆరాధనము, నివేదనము జరుగునట్లు అక్కడకూడా ఉత్సవమూర్తిని ప్రతిష్ఠింపజేసి ఆరాధన జరుపునట్లు కట్టడిచేసెను. అక్కడ అధ్యయనోత్సవము మాత్రము ఒక్కరోజుననే జరిపింపవలెను.

"శ్రీ వేంకటవరాహాయస్వామిపుష్కరణీతటే ।
శ్రవణర్షేతులామాసే ప్రాదుర్భూతాత్మన్ నమః ॥

అనుటవలన వరాహస్వామివారి జన్మనక్షత్రమైన తులామాసమునందలి శ్రవణ నక్షత్రమునందు శ్రీవరాహస్వామి వారి జయంతి జరుగునట్లు కట్టడిచేసినారు.

రంగదాసుచే నిర్మితమైన బావిని 'సుందరస్వామి'యని పిలువవలెనని కట్టడిచేసినారు. పూర్వకాలమున వీరనరసింహదేవుడను గజపతిరాజు స్వామివారి శ్రీపాదములు చూపుచేతికి నాగాభరణమును సమర్పించినారని తెలుసుకుని భగవద్రామానుజులు మరియొక తిరుహస్తమునకు మరియొక నాగాభరణమును చేయించి, సేవా పరులగు ఆశ్రితజనులకు మనోనయనములకు భోగ్యమగు రీతిగా అలంకరింపజేసినారు.

శ్రీవేంకటేశ్వరస్వామివారి సన్నిధియందు స్వామికి ఈశాన్యదిగ్భాగముగ ఉగ్రవేషముపశమించునట్లు విమానాభిముఖముగ ఆళగసింగర్‌స్వామివారిని ప్రతిష్ఠచేయించి నిత్యారాధనము జరుగునట్లు కట్టడి చేసినారు.

తిరుమలలో మార్గమధ్యమున మార్కండేయునకు శ్రీనృసింహస్వామి ప్రత్యక్షమైనట్లు మార్కండేయ పురాణమునందున్నందున శ్రీనృసింహస్వామివారు ఆవిర్భవించిన గుహాప్రాంతమునందే ఒక దేవాలయమును నిర్మింపజేసి, ఆ నృసింహస్వామిని శ్రీవైఖానసాగమప్రకారముగ ప్రతిష్ఠను చేసి వారికి నిత్యారాధనము జరుగు నట్లు ఏర్పాటుచేసినారు.

బ్రహ్మోత్సవము ఏడోరోజున ఉద్యాన విహారార్థముస్వామి వారు ఆనందాళ్వానుల నందనవనమునకు వేంచేయునపుడు అప్రదక్షిణముగా వేంచేయవలెనని కట్టడిచేసినారు.

క్రిమికంఠుడనువాడు చిత్రకూటమున శ్రీగోవిందరాజస్వామివారి సన్నిధిని ధ్వంసముచేయగా, తిరుమంగై ఆళ్వారులు, కులశేఖరాళ్వారులు స్తుతించిన ఆ స్వామిని తిరుపతిలో ప్రతిష్ఠించి ఉత్సవాదులను కాలభేదము జరుపునట్లు ఏర్పాటుచేసెను.

మార్గళిమాసమున ముప్పదిరోజులును శ్రీకృష్ణస్వామినే శయ్యాబేరముగ చేయునట్లు కట్టుదిట్టముల నేర్పరచెను.

యమునాచార్యులవారి నియమన ప్రకారము తిరుమలలో తీర్థకైంకర్యముచేయుచున్న తిరుమలనంబి వద్ద ఒక గుండురాతి వద్ద శ్రీమద్రామాయణ కాలక్షేపముచేసినారు. అక్కడ శ్రీవేంకటాచలపతి పాదపద్మములు సాక్షాత్కరించగా శ్రీవైఖానసాగమప్రకారము ఆలయ నిర్మాణ ప్రతిష్ఠాదులను చేయించి తీర్థప్రసాద పరిగ్రహము చేయించినారు.

**"ఘుష్యతే సంఘశశ్చోచ్చైర్గోవిందేతిపునః పునః'**

తిరువేంగడయాత్ర చేయునపుడు ఇతరములగు భగవన్నామములను విడిచి, సదా గోవిందకీర్తనమ్ చేయవలెను అను ప్రమాణముననుసరించి, గోవిందనామమునే ఉచ్చైస్స్వరముతో అనేక పర్యాయములు కీర్తించుచు మహర్షులు శ్రీవేంకటాచలయాత్రను చేసినారు అని శ్రీవరాహపురాణమునందు చెప్పబడినందువలన ఆ అర్థవిశేషమును మనస్సునందుంచుకొని శ్రీవేంకటాచలయాత్ర చేయునపుడు 'గోవింద, గోవింద' యని నామోచ్చారణము చేయవలెనని కట్టడిచేసినారు.

**సప్తసాలములను భేదించిన శ్రీరామచంద్రుని, ధనుర్ధారియైన లక్ష్మణస్వామిని, సుగ్రీవుని అంజలి హస్తులైనట్లుగా, శ్రీహనుమానులు విజ్ఞాపనము చేయుచున్నట్లు, ఆకాశమున నిల్చియున్న విభీషణుని అంగుళినిర్దేశముతో చూపుతున్న అంగదుని అర్చారూపమున యేర్పరచి ఒక భక్తుడు తిరుపతిలో యున్న**

భగవద్రామానుజులు తిరుమలనంబిగారి వద్ద విభీషణాభయ ప్రదానఘట్టమును కాలక్షేపము చేయుచుండగా సమర్పించిరి. ఆ దేవవిగ్రహములను భగవద్రామానుజులు తిరుమలలో తిరువేంగడముడైయాన్ల సన్నిధిలో వేంచేపు చేయించి నిత్యారాధనములు పరిపాలించునట్లు కట్టుదిట్టముల నేర్పాటు చేసినాడు.

'తిరుక్కురులై' అను గ్రామమున శ్రీవేంకటేశ్వరుని కిరీటము మొదలగు దివ్యాభరణములు లేని శిరముతో స్వామిసన్నిధిలో తట్టబుట్టలతో ఆ భక్తునికూడా విగ్రహరూపమున నిర్మింపజేసి గుడికట్టించి, అందులో ప్రతిష్ఠించి, నిత్యారాధన జరుగునట్లు కట్టడి చేసినారు.

శ్రీవేంకటేశ్వరస్వామివారు తిరుమలనంబిగారిని మార్గమధ్యమున అనుగ్రహించిన దినము అధ్యయనోత్సవమునకు మరుసటి దినమగుటచేత ఆ తిరుమంజనకైంకర్యోతిహ్యోత్సవమును ప్రతిసంవత్సరము అధ్యయనోత్సవము ముగిసిన తరువాత జరుగునట్లు కట్టడి చేసినారు.

తిరుమలలో అనుష్ఠింపవలసిన ఆచారవ్యవహారములను తెలియజేసే కట్టడి చేసినారు. వానిలోకొన్ని-

1. తిరుమలలో స్వామి కైంకర్యపరులైన వారు మాత్రమే నిత్యవాసము చేయవలెను.

2. స్థలవాసులు తమ తమ గృహములలో పాకము చేయక స్వామివారి మహాప్రసాదమును తీసుకుని, గృహారాధనములలో నివేదన చేసి దేహధారణము చేయవలెను.

3. తమ గృహారాధనలకు కూడా దివ్యోద్యానవనములలోని పుష్పములను సంగ్రహించకుండా, శ్రీ వేంకటాచలపతికి సమర్పింపబడిన వానినే తిరువారాధనకుపయోగించుకొనవలెను.

4. ఆశేషమును స్వీకరించియే తాను ఉజ్జీవించవలెను.

5. అందరికిని అన్నము అవసరమైనందువలన అన్నమును మాత్రము వారు చేసుకొని భుజించవచ్చును.

6. తిరుమలలోని మృగములు, పక్షులు కూడా భగవత్స్వరూపములగుటచేత వానిని హింసించకూడదు.

7. పాదుకావాహనాద్యారోహణము పూర్తిగా నిషిద్ధము.

8. భగవంతుని యందు విశ్వాసము లేని వారు తిరుమల నెక్కకూడదు.

9. స్వామి పుష్కరిణి చుట్టును ఒక యోజనదూరము ఈ ఆచార మర్యాదలు తప్పక పాటించ వలెనని కట్టడిచేసినారు.

ఈ మర్యాదలను స్వామికి నివేదింపగా స్వామివారు ఒక అర్చకునిముఖాన- మేము రామావతారమున వసిష్ఠాదులను ఆదరించినట్లే, మా యొక్క సర్వస్మాత్పరత్యమును శ్రీభాష్యాదుల ద్వారా స్థాపించిన శ్రీ భాష్యకారుల నియమనమును కూడా ఆదరింతుము. మాకు చెందిన వారందరును రామానుజాచార్య నియమావళిని పాలింపవలెను అని సెలవిచ్చినారు.

10. తిరుపతి శ్రీగోవిందరాజస్వామివారి సన్నిధిలో శ్రీగోదాదేవిని ప్రతిష్ఠించి, తమ హస్తమునకల్హార పుష్పమును ధరింజేసి, తిరువారాధనము పరిపాలించునట్లు కట్టడిచేసినారు.

11. గోవిందరాజస్వామి వారి నైమిత్తికోత్సవములైన తెప్పోత్సవము, వనభోజనోత్సవము, పార్వేట ఉత్సవము, డోలోత్సవములందు గోదాదేవి కూడా వేంచేసి, ఉపచారములను స్వీకరించునట్లు కట్టడి చేసినారు.

12. కనుమ పండుగరోజు శ్రీగోదాదేవిని, శ్రీకృష్ణస్వామికిని మాలికలు సమర్పించి విశ్వకల్యాణము జరుగునట్లు కట్టడిచేసినారు.

13. గోవిందరాజస్వామి గుడికి ఉత్తరపుదిక్కున శ్రీ వీధి నిర్మింపజేసి శ్రీరామానుజపురం అని నామకరణం చేసి స్వామివారి మంగళాశాసన పరులైన భాగవతులు వాసము చేయుటకు అవకాశము కల్పించినారు.

14. శ్రీవేంకటాచలపతి దివ్యప్రబంధములను ఆలకించు విధానమును నిర్ణయించి జరుపునట్లు కట్టడి చేసినారు.

15. తిరుమలలో వలెనే తిరుపతిలో గూడ అధ్యయనోత్సవము మొదలగు శ్రీరామానుజదర్శన, ధర్మము లనన్నింటిని జరుపునట్లు కట్టడి చేసినారు.

16. సేనాపతి జీయరులను ఏకాంగిని హనుమదాదికాదులతో శ్రీవారి కైంకర్యములను పరిపాలించుటకు నియమించినారు.

శ్రీరంగరాజ చరణాంబుజ రాజహంసః
శ్రీవేంకటేశ కరుణాకలశార్ణవేందుః ।
శ్రీదేవరాజ జయడిండిమ వాఙ్మయశ్రీః
రామానుజో విజయతే యతిరాజ రాజః ॥

"జయతి సకల విద్యావాహినీ జన్మశైలః"
"సర్వదేశ దశాకాలేష్వవ్యాహత పరాక్రమా
రామానుజార్య దివ్యాజ్ఞావర్ధతామభి వర్ధతామ్ ॥

# తిరుమల గిరుల్లోని పవిత్ర తీర్థాలు - వాటి ప్రాముఖ్యత

ఎస్. భీమన్న

"వేంకటాద్రి సమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన
వేంకటేశ సమోదేవో నభూతో న భవిష్యతి"

బ్రహ్మాండము నందు వేంకటాద్రితో సమానమైన స్థానము లేదు. వేంకటేశ్వరునితో సమానమైన దేవుడు పూర్వకాలమందు లేడు, భవిష్యత్తునందు ఉండబోడని బ్రహ్మాండ పురాణము, స్కాందపురాణము చెప్పు చున్నవి.

తిరుమల చాలా విశిష్టమైనది. నిత్యకళ్యాణం పచ్చతోరణంగా వెలుగొందుతున్న ఈ దివ్యక్షేత్రానికి ప్రతిదినం వేలకొలది యాత్రికులు దేశ, విదేశాల నుంచి వస్తుంటారు. అడుగడుగు దండాలవాడా! ఆపద మ్రొక్కులవాడా! ఏడుకొండలవాడా! వేంకటరమణా! గోవిందా గోవిందా అనే నామ సంకీర్తనతో తిరుమల నిత్యం మారుమ్రోగుతుంటుంది.

వేంకటాచలం వేదకాలం నుంచి పరమ పవిత్ర క్షేత్రంగా ప్రఖ్యాతి గాంచిన పుణ్యస్థలం, తిరుమలలో స్వామి పుష్కరిణితో పాటు గోగర్భం, ఆకాశగంగ, పాపవినాశనం, జాబాలి తీర్థం, కుమారధార, రామకృష్ణ తీర్థం, తుంబురు తీర్థం మొదలైన అనేక తీర్థాలకు ఇది నిలయం, ఎందరో మహర్షులు ఈ కొండమీద తపస్సు చేసి ముక్తిని పొందారు. అటువంటి పవిత్ర తీర్థాలను గురించి సంక్షిప్తంగా వివరించడమే ఈ వ్యాసం ఉద్దేశ్యం.

**1.శ్రీ స్వామి పుష్కరిణి :** శ్రీవేంకటేశ్వర స్వామి వారి సన్నిధికి ఈశాన్య భాగమున స్వామి పుష్కరిణి ఉంది. ముల్లోకములందున్న సమస్త తీర్థములకు స్వామి అగుట వలన స్వామి పుష్కరిణి అని ప్రసిద్ధి గాంచినది. ఈ పుష్కరిణి స్నానం వలన పాపాలు తొలుగుతాయి. రోగాలు నశిస్తాయని నమ్మకం. ప్రతి సంవత్సరం ఫాల్గుణ పూర్ణిమకు ఐదు రోజులు పాటు శ్రీస్వామి వారికి ఈ పుష్కరిణిలో తెప్పోత్సవాలు జరుగుతాయి.

"స్వామి పుష్కరిణీ స్నానం, వేంకటేశ్వర దర్శనం
మహా ప్రసాద స్వీకారః త్రయం త్రైలోక్య దుర్లభమ్"

అనగా శ్రీస్వామి పుష్కరిణి స్నానం, శ్రీవేంకటేశ్వర స్వామి వారి దర్శనం, మహాప్రసాద లాభం ఈ మూడును మానవులకు పూర్వజన్మ సుకృతం వలనే లభించవలసియున్నదని భవిష్యోత్తర పురాణము నందు చెప్పబడినది.

**2. గోగర్భం :** శ్రీవారి ఆలయానికి ఒకమైలు దూరంలో గోగర్భం తీర్థం ఉంది. పాండవులు అరణ్యవాసం చేసిన సమయంలో ఇక్కడ కొంతకాలం ఉన్నారట. అందుకు గుర్తుగా ఇక్కడి గుహల్లో పాండవుల

శిల్పాలున్నాయి. పాండవ తీర్థంలోని గుహ గోవుగర్భం మాదిరిగా వుండటం వల్ల గోగర్భమని పిలువబడు చున్నది.

ఈ గోగర్భం తీర్థంలో శ్రీసద్గురు మలయాళస్వామి వారు తపస్సు చేశారు. ప్రస్తుతం అక్కడ శ్రీమలయాళస్వామి ఆశ్రమం నిర్మించబడింది.

**3. ఆకాశగంగ :** శ్రీస్వామి ఆలయానికి ఉత్తర దిక్కున రెండు మైళ్ల దూరంలో ఆకాశగంగ తీర్థం ఉంది. ఆకాశగంగ తీర్థంలో రామానుజుడనే విప్రుడు తపస్సు చేసి శ్రీవేంకటేశ్వరస్వామిని ప్రత్యక్షం చేసికొన్నాడు. మాఘమాసంలో చిత్తానక్షత్రంలో కూడిన పున్నమినాడు ఈ తీర్థంలో స్నానం చేసిన ముక్తి కలుగుతుంది.

పూర్వం గోదావరీ తీరమున సద్గుణ సంపన్నుడైన పుణ్యశీలుడను బ్రాహ్మణుడు తాను చేసిన అపచారమునకు గాడిదముఖము కలిగినవాడయ్యెను. దాన్ని పోగొట్టుకొనుటకు స్వర్ణముఖి తీరమునందు వెలసిన శ్రీఅగస్త్యేశ్వరున్ని వేడుకొనగా, అందుకు ఆ మహర్షి నీవు వేంకటాద్రి వెళ్లి స్వామి పుష్కరిణి తీర్థము నందు స్నానము చేసి అచ్చటికి సమీపమున గల ఆకాశగంగ తీర్థమునందు నియమానుసారంగా స్నానము చేస్తే నీ ముఖవికారము తొలగిపోవునని చెప్పుట వలన పుణ్యశీలుడు ఆకాశగంగ యందు త్రికరణ శుద్ధిగా స్నానమాచరించుట చేత ముఖ వికారము తొలగి సుందరమైన ముఖము కలవాడయ్యెనని "స్కాందపురాణము" వలన తెలియుచున్నది

**4. పాపవినాశనం :** శ్రీవారి ఆలయానికి ఉత్తర దిక్కున 3 మైళ్ళ దూరంలో నెలకొన్న తీర్థం పాపవినాశనం. ఈ తీర్థం స్నానం వల్ల సకల పాపాలు పరిహారమవుతాయని నమ్మకం.

పూర్వం ధృడమతి అనువాడు అనేక పాపాలు చేసి గ్రద్దగా జన్మించాడట. ఆ గ్రద్ద ఈ తీర్థంలో స్నానం చేసినందువల్ల ముక్తి కలిగినట్లు స్కాందపురాణం ద్వారా తెలియుచున్నది.

పాపవినాశ తీర్థంలో ఆశ్వయుజ శుద్ధ సప్తమి ఉత్తరాషాఢా నక్షత్రంతో కూడిన ఆదివారం నాడు లేదా ఉత్తరాభాద్ర నక్షత్రంతో కూడిన ద్వాదశినాడు కాని స్నానం చేయటం ఉత్తమం.

**5. జాబాలి తీర్థం :** తిరుమల శ్రీవారి ఆలయానికి ఉత్తరాన 2 మైళ్ళ దూరంలో అత్యంత రమణీయమైన ప్రకృతిలోయలో ఈ తీర్థం వుంది. జాబాలి మహర్షి ఇచ్చట తపస్సు చేసినందువల్ల ఆయన పేరుతో ఈ తీర్థం ప్రసిద్ధి చెందినది. ఈ తీర్థంనందు స్నానం చేసిన వారికి పంచమహాపాతకములు నశించి పోతాయని నమ్మకం వుంది.

పూర్వం కావేరి తీరం నందు నివసిస్తున్న దూరాచారుడనే విప్రుడు ఈ తీర్థంలో స్నానం చేసి బ్రహ్మారక్కసి నుండి విముక్తి పొందాడని స్కాందపురాణంలో వివరించబడింది. ఈ తీర్థంలో ఆంజనేయస్వామివారి ప్రాచీనమైన ఆలయంవుంది. ఇచ్చట హనుమజ్జయంతి ఉత్సవాలు ప్రతి సంవత్సరం ఘనంగా జరుగుతాయి.

**6. కుమారధార :** శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి వాయువ్య దిశలో 5 మైళ్ళ దూరంలో మహా పవిత్రమగు 'కుమారధార' అను పుణ్యతీర్థం కలదు.

సర్వ విధాల రోగ పీడుతుడైన ఒక వృద్ధుడు ఈ తీర్థంలో స్నానం చేసి కుమారుడైనాడట అందువల్ల ఇది 'కుమారధార' తీర్థంగా పిలువబడుచున్నది. అంతేకాక కుమారస్వామి తారకాసుర సంహారం వల్ల కలిగిన బ్రహ్మహత్యాపాపాన్ని ఈ తీర్థంలో తపస్సు చేసి పోగొట్టుకున్నట్లు మార్కండేయ పురాణంలో ఆధారం వుంది.

**7. తుంబురు తీర్థం :** శ్రీవారి ఆలయానికి ఉత్తరదిక్కున పదిమైళ్ళ దూరంలో తుంబురు తీర్థం వుంది. తుంబురుడనే మహర్షి తపస్సు చేసినందున ఇది తుంబుర తీర్థంగా ప్రసిద్ధి చెందింది. ఈ తీర్థంలో సర్వాబద్ధుడనే నాస్తికుడు స్నానం చేసి 'సర్వసిద్ధుడు'గా మారి మోక్షం పొందాడు.

ఈ తీర్థం సమీపగుహలో 300 సంవత్సరాల క్రితం తరిగొండ వెంగమాంబ అనే భక్తురాలు, తరువాత ఇటీవల కాలంలో శ్రీమలయాళస్వామి వారు తపస్సు చేశారు.

ఫాల్గుణ మాసమున ఉత్తర ఫల్గునీ నక్షత్రంతో కూడిన పూర్ణిమా దినమున మధ్యాహ్నకాలం ఈ తీర్థమునకు పర్వకాలము. ఆ పర్వకాలమున ఇచ్చట స్నానం చేయుటవల్ల సర్వదోషాలు, పాపాలు పోవుటయే కాక సర్వవాంఛితములు కూడ సమకూరతాయనే నమ్మకం ఉంది.

**8. రామకృష్ణ తీర్థం :** శ్రీవేంకటేశ్వరస్వామి వారి సన్నిధానమునకు 6 మైళ్ళ దూరంలో శ్రీవేంకటాచలము నందు పరమ పవిత్రమగు రామకృష్ణ పుణ్యతీర్థం కలదు.

పూర్వం కృష్ణుడనే ముని ఆ తరువాత రామకృష్ణుడనే ముని తపస్సు చేసి స్వామి వారిని ప్రత్యక్షం చేసికొన్నందువల్ల దీనికి రామకృష్ణ తీర్థమని పేరు.

మకరమాస పుష్య నక్షత్రంతో కూడిన పున్నమినాడు అర్చకులు, యాత్రికులు అందరు శ్రీవారి ఆలయం నుండి రామకృష్ణతీర్థమునకు వెళ్లుదురు. అచ్చట కృష్ణస్వామి వారికి కైంకర్యములు చేసి స్వామిని సేవిస్తారు.

ఈ తీర్థం నందు నిరుక్త పుణ్యకాలం నందు స్నానం చేసి శ్రీవారిని దర్శించినవారు అనంత పుణ్యఫలములు పొందుదురు.

**9. చక్రతీర్థం :** శ్రీవారి ఆలయానికి వాయువ్యదిక్కున 2 మైళ్ళ దూరంలో చక్రతీర్థం ఉంది. 250 కోట్ల సంవత్సరాలు నాటిదిగా ఇటీవల కనుగొనబడిన 'శిలాతోరణం'నకు అతి సమీపంలోనే చక్రతీర్థం వుంది.

ఈ తీర్థంలో తపస్సు చేస్తున్న పద్మనాభుడనే భక్తుడ్ని రక్షింపవలసిందని శ్రీనివాసుడు సుదర్శనభగవానుని ఆదేశించాడట, అప్పటి నుంచి ఇది చక్రతీర్థంగా పిలువబడుతున్నది.

శ్రీరంగం నుండి సుందరుడనే విప్రుడు తనకు కలిగిన రాక్షసత్వాన్ని ఈ తీర్థానికి వచ్చి పోగొట్టు కున్నాడు.

ప్రతి సంవత్సరం కార్తీక బహుళ ద్వాదశినాడు చక్రతీర్థ ముక్కోటి ఉత్సవం జరుగుతుంది. ఈ చక్ర తీర్థమున స్నానం చేసిన వారికి భూత రాక్షస బాధలు తొలగిపోతాయి.

ఇంతమాత్రమే కాక తిరుమల పుణ్యక్షేత్రంలోని పర్వత సానువులలో 66 కోట్ల తీర్థములు ప్రకాశించు చున్నవని బ్రహ్మపురాణం, స్కాందపురాణం చెప్పుచున్నవి అందువలనే ఈ వేంకటాచలం "పుష్కరాద్రి" అని కూడా పిలువబడుచున్నది.

# శ్రీనివాస చక్రవర్తి - వైభోగం - వితరణలు

*గుళ్ళపల్లి శివకుమార్*

సకల చరాచర వస్తు - జీవజాలాల కన్నింటికీ చక్రవర్తి - దీనజనోద్ధారకుడు - కలియుగ ప్రత్యక్షదైవం- శ్రీవేంకటేశ్వరస్వామి నిత్యకల్యాణ చక్రవర్తి- ఆయన భోగమే భోగము- దానికి మాటలే చాలవు. దర్శించేందుకు చూపులే చాలవు. వేదకాలం నుంచి ఆయ. శోభ శోభిస్తూనే వుంది. ఆయన కొలువు ఆడంబరం. వితరణ నిత్యనూతనం. సకల జంతుజీవాలన్నీ ఉయన సామ్రాజ్యంలోని వారే! వారి బాగోగులు నిత్యం పరిరక్షిస్తూనే వుంటాడు, ఆ పరమ చక్రవర్తి. పుణ్యప్రదానం చేయమని, కోరికలు తీర్చమని పాపాలు నశింపచేయమని తమను ఉద్ధరించమనీ, సౌభాగ్యాలు ప్రసాదించమనీ, కోరే తన పాలితులకు కోరినదంతా అందించి, చల్లని చూపులతో వారిని లాలిస్తూ వుంటాడు. ఆద్యంతరహితుడయిన ఆ చక్రవర్తి కొలువుతీరింది- ఆనందనిలయంలో! ఆ ఆనందనిలయం, సకల ఆనందాలకు నిలయం. ఆర్తితో, ఆవేదనతో, ఆశలతో తనను చూడవచ్చే లక్షలాది భక్తులకు ఆనందనిలయం విశ్వచక్రవర్తి పేరోలగం. ధర్మాధర్మ నిర్ణయం, న్యాయాన్యాయ విచారణలు ఒక క్షణంలో లక్షోవంతు కాలంలో నిర్ణయిస్తాడు. ఆయన నిర్ణయాన్ని అంతే సమయంలో అమలు చేసేస్తాడు. అంతటి మహనీయ మూర్తి. తన దేవేరులతో సకలాభరణ భూషితుడై సకల దేవదేవతా మూర్తులు దివ్యానుభూతులతో ఆవరించివున్న ఆనందనిలయంలో తన రాజసాన్ని ఒలక బోస్తూనే తన ప్రజలను పాలిస్తూ, వెన్నెలలాంటి తన కరుణను ప్రసరిస్తూ, సమయ పాలనతో పరిపాలన సాగిస్తూనే వున్నాడు యుగయుగాలుగా. సాక్షాత్తూ విష్ణుమూర్తి, కలియుగాంతం వరకు శేషాచలం పై నిలిచి వుంటానని, తన సేవక, భక్త, దేవ బృందాలతో తిరుమల గిరులపై స్థిరమైనాడు. ఆ సర్వలోకాల నాధునికి లేని వైభవాలా!

తన సామ్రాజ్యానికి, తిరుమల గిరులు రాచనగరుగ చేసుకొని సర్వలోకాలను పాలించే చక్రవర్తి ఆయన. జగజ్జిగీయ మానంగా వెలిగిపోయే నవరత్న ఖచిత కిరీటాలు, బంగారు హారాలు, వజ్రఖచితమైన ఆకాశ రాజు ఖడ్గం, రత్నఖచితమైన శంఖ, చక్రాలు, కటి-వరదహస్తాలు, భుజకీర్తులు ఒకటేమిటి ఆ శ్రీనాథుని సిరి వైభవాలను వర్ణించతరమా! మానవ మాత్రులకు అది వీలవుతుందా!

పంచబేర రూపుడై వెలుగొందే ఆస్వామి కొలువులోభక్త, సేవక జనాలు, నిరంతరం నీరాజనాలు పలుకుతూ ఆ జగత్పతిని కొలుస్తూ ఇహపర సాధన నిరంతరాయంగా చేస్తూనే ఉన్నారు. ఆనాటి నుంచి నేటిదాకా, కలియుగాంతం వరకూ కూడా అలానే చేస్తారు కూడా!

సకల పరివార సమేతుడై ఈ ఆనందరూపుడు ఆనంద నిలయంలో ఇహలోక వాసులకు ఆనందాన్ని పంచేదానికే సప్తగిరులపై కొలువు తీరినాడు. సాక్షాత్తు రుద్రుడే ఈ సామ్రాజ్య రాచనగరుకు క్షేత్రపాలకుడైనాడని సాహిత్యపు రుజువులే ఈ సార్వభౌముని వైభవానికి గీటురాయి.

ప్రాపంచిక పరంగా సామ్రాట్టుకు సామంతరాజులు కప్పాలు గట్టుతారు. కానీ పురాణపురుషుని సార్వ భౌమత్వానికి తలవంచి లక్షలు-కోట్లు కానుకలిస్తూ 'స్వామి- నీ సేవకులమైన మా సమర్పింపులు' అంటూ కోటీశ్వరులు మొదలు కూటికి చెమటోడ్చేవారు సహితం ఈ అనంతశయన మహాత్మునికి అర్పణాలు చేస్తారు. విలువైన నవరత్న ఆభరణాలు, వాహనాలు ఇలా ఒకటేమిటి ఆయన సేవలో పాలుపంచుకొనే ప్రతి జీవికి అనుబంధమయ్యేలా విలువైన వస్తు సముదాయాన్ని ఈ కలియుగనాథునికి అంకితం చేస్తారు. ఈ మహా చక్రవర్తిని కుల-మత భేదాలు లేకుండా, ఆర్తితో ఆజ్ఞాపాలన చేసేందుకు సకల జీవ-వస్తు సముదాయాలు, స్వామివారి కనుసన్నల కడచూపులకై, జీవితాలు- జీవితకాలాలు ఎదురు చూస్తుంటారు.

శేషశయనుని రాజదర్పం - ప్రేమార్థమయిన ఆతని దీవెనలు కోరి జీవజాలం యావత్తు మానసిక అర్పణాలు చేసుకొంటాయి. లక్షలాదిగా ఈ విశ్వసామ్రాట్ దివ్యదర్శనానికి శారీరక, ప్రాపంచిక, శ్రమలను మరచి ఈ దివ్యపట్టణానికి నిరంతరాయంగా వస్తూనే వుంటారు. ఇలావిచ్చేసే వారంతా, స్వామివారికి అతిథులే.

దాదాపు 750 కోట్ల రూపాయలు వార్షిక ఆదాయం ఈ ప్రభువుకు. తన కోసం ఒక రాగి కాణీ కూడా వ్యయం చేయకుండా, కుబేరునికి తానుచేసిన అప్పుపై నేటికీ వడ్డీనే జమచేస్తూ, తన దివ్య సామ్రాజ్యంలోని జీవజాలాలన్నింటికీ అనేక రకాలుగా తన ఆదాయాన్ని వితరణలు చేస్తూ వుంటాడు, ఈ లీలాస్వరూపుడు.

ఆర్తితో తనను దర్శించ వచ్చే భక్త సముదాయాలకు సకల సౌకర్యాలతో, సత్రాలు, చావళ్ళు, అన్నపానాదులూ నిరంతరాయంగా అందచేసే యంత్రాంగ నిర్వహణ, వారి మానసోల్లాసానికై రమణీయ ఉద్యానవనాలు, పూదోటలు, రవాణాసదుపాయాలు, వైద్యసాయాలు, విద్యావతరణకై విద్యాలయాల నిర్వహణలు, ఉన్నత విద్యాసక్తులకుగాను కళాశాలలు, సంస్కృతీ పరిరక్షణకై ప్రాశ్చ్య విద్యాబోధనాలయాలు, కైంకర్య పరులకై శిక్షణాకార్యక్రమాలు, ప్రాకృత వేదవిద్యాప్రాచుర్యాలకై వేదవిశ్వవిద్యాలయం, గో రక్షణకై ప్రత్యేక సంస్థలు, అనాధలకు, వికలాంగులకు, వృద్ధులకు శరణాలయాలు, భక్తుల సేవలకై పరితపించే శ్రీవారి సేవాదళాల నిర్వహణ, ధర్మ ప్రాచుర్యానికై ధర్మ రక్షణ సంస్థలు, ప్రకృతి సమతుల్యాల పరిరక్షణకై వన రక్షణాభివృద్ధి కార్యక్రమాలు, ప్రత్యేకంగా అనేక దిశానిర్దేశిత కార్యక్రమ నిర్వహణలకై ప్రత్యేక నిధులు, సాహిత్య పరంగా గ్రంథాలయ నిర్వహణలు, తత్సంబంధమైన విద్వత్‌సభలు - సమావేశాల నిర్వహణలు, యువతనుత్తేజపరచే వ్యాయామావకాశాలు, సంగీత, నాటక కళారంగాల నిర్వహణా కార్యక్రమాలు, కళాకారులకు సన్మానాలు, పండిత పురస్కారాలు, నాటకాల ప్రదర్శనలు, పౌరాణికేతిహాస ప్రచార నిర్వహణలు, భావితరాలకై సాహిత్య నిక్షిప్తాలు- ఇలా ఒకటేమిటి- ఈ విశ్వసార్వభౌముని వైభవం ఉట్టిపడేలా అనేక వితరణలు - పురస్కారాలు, నిర్వహణలు, నిత్యకృత్యాలే! అందులోనే ఉంది వైభవమంతా!

ప్రతి సేవ వెనుక ఒక పరమార్థం- భక్తజనులు కైంకర్య సమర్పణలు అంటిపెట్టు కొంటాయి. నిత్యసేవలు, వారసేవలు, పక్షసేవలు, నక్షత్రసేవలు, మాససేవలు, విశిష్ట సేవలు, సంవత్సర సేవలు ఇలా ఒకటేమిటి

వైభవాలకే వైభవనాథుడు, జరిపించుకొంటూ భక్తజనులను మురిపిస్తూ వుంటాడు. అనంత భోగలాలస చక్రవర్తి, ఈ ఆనందనిలయుడు కట్టిన పీతాంబరం కట్టడు- తాను ధరించిన వస్త్రాలు వేలాది దేవ దేవేరులకు "శేష వస్త్రాలు"గా బహూకరిస్తాడు. ఇష్టదైవ ప్రసాదాలుగా వివిధాలయాలమూర్తుల ఈ శేషవస్త్రాలంకృతులై మురిసిపోతూ - మెరిసిపోతుంటారు. విశ్వసార్వభౌముని సేవలకు - ఈ బహుమానాలా! అనుపించే విధంగా వుంటాయి. స్వామివారి వితరణాదరాలు.

కొలువు తీరిన స్వామికి ఆటవిడుపులు- ఊరేగింపులు - ఇవి జన్మ జన్మలకు తరింపచేసే దివ్య దర్శనాలు. ఇంతేసి భోగభాగ్యాలు కలిగిన ఆ స్వామి వైభోగమే జగత్ కల్యాణ కారణంగా పెద్దలు - పిన్నలు అందరూ తలుస్తూంటారు.

ఈ రాజు పన్నులు వేయడు, జరిమానాలు విధించడు, బలవంతపు వసూళ్ళు చేయడు. ఈ సహస్రాక్షుడు - సహస్రబాహుడు చేసేదంతా ఒక్కటే. ఆర్తితో తనను తలచి, చేరే వారిని ఆదుకోవడం - మానసిక బలాన్ని- ఇహపర సుఖాలను అందివ్వడం అంతే, "నాదికానిదేదీలేదు- నేను లేనిదేదీ లేద'నే తత్త్వాన్ని తెలియపరచడం- ఆద్యంతం వంటపట్టించుకున్న వారు ఐచ్ఛికంగా కట్నాలు, కానుకలు తలనీలాలు, తులాభారాలు, ఇలా ఒకటేమిటి ప్రతి ఒకటి ఆయన పాదాల వద్ద వుంచేస్తారు. ఈ వితరణలో ధనిక-పేద భేదభావాలుండవు. సమదృష్టి తప్ప వేరే చూపే లేదు. కరుణ, దయ, ప్రేమ, వాత్సల్యాలు రంగలించి ఆయన వారికందించేదంతా ప్రసాదాలే! అపవిత్రభావనే ఈ విశ్వసామ్రాట్టుకు నీరాజనాలు. ఆయన దివ్య తేజస్సును మరింతగా ప్రజ్వరిల్లచేసే ఇంధనాలు.

ఆ దేవ దేవుని శాసనాల అమలుకు జీవులపాపపుణ్యాలే కొలబద్దలు. నీతి నియమము కలిగించి అవినీతి నిప్పు నయినా కడగ గల శక్తివంతమైనవి. ప్రజా ప్రభుత్వాలు చట్టం చేసినా, మార్చినా వాటి నిర్వహణలు నియంత్రాలున్నాయి. కానీ ఈ చక్రవర్తి శాసనానికి మార్పులేదు. చేర్పు లేదు. విపరీత బుద్ధులతో మానవులే వాటికి మార్పు-చేర్పులు చేసినా కాల గమనంలో స్థిరంగా నిలిచేవి ఆయన దైవ శాసనాలు మాత్రమే. నిర్ణయించిన శాసనాన్ని నిలబెట్టుకోవడంలోనే ఆయన విశిష్టవైభోగం దాగివుంది!

"కోటికి పడగెత్తిన ధనవంతుడు, కూటికోసం శ్రమపడే నిర్భాగ్యుడూ" ఈయన కొలువులో సమానులే- ఈ తేడాలు మనం కల్పించుకున్నవే- ఆయన గజరాజునయినా- అతి సూక్ష్మ క్రిమినయినా భేదభావంతో చూడడు. అది సమన్యాయం. అదే ఈ కల్యాణ చక్రవర్తి భోగం-వైభోగంలోని అంతర్గత సూత్రం.

ఇక ఆమహామహేశ్వరుడు తన వైభవాన్ని గురించి ఆలోచన చేయడు. తన దివ్యసామ్రాజ్యంలోని ప్రతిదీ భక్తులకే అందిస్తాడు. అందుకే ఆయన వితరణ వైభవోపేతుడయినాడు.

ఆయన దివ్యమంగళ స్వరూపాన్నీ, తత్వాన్ని చాటిచెప్పేందుకు తాళ్ళపాక అన్నమయ్య దాదాపు

